# మనసు పొరల్లో.....

మ్యూజింగ్స్

- భువనచంద్ర



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 168

కౌముది మాసపత్రికలో

జనవరి 2014 సంచిక నుంచి డిసెంబర్ 2016 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# మనసు పిడికెడంత.. ఆలోచనలు ఆకాశమంత..!
# మనసు ముంగిట్లోని దృశ్యాదృశ్యాలకు అక్షరరూపం..!

## 1



'దూ...దూ...' అని పిలిచా.. అది రాలేదు. తమిళనాడు కదా..భాష ప్రోబ్లమేమో అనుకుని 'వా..వా..' అని తమిళంలో పిలిచా. 'అదోలా' ఓ చూపు చూసింది గానీ, వచ్చే ప్రయత్నం చెయ్యలేదు. ఎంతసేపు నుల్చోనూ? బిస్కెట్టు పేకెట్టు చింపుతూ దాని వంక చూశా. ఓ మోస్తరు కుతూహలం కనిపించింది దాని కళ్ళల్లో. బిస్కెట్లు అన్నీ నేలమీద గుమ్మరించా. బద్ధకంగా లేచి రోడ్డుని క్రాస్ చేసి ఇవతలికి వచ్చింది. ఓ బిస్కెట్టుని చేత్తో ఎత్తి దానికి అందించా. ఫరవాలా. పోజు కొట్టకుండా తిన్నది.

ఇప్పుడు నేను రోడ్డు అవతలి వైపుకి వెళ్ళాలి. ఎందుకంటే, దాని పిల్లలు చక్కగా ఇసుక గుట్ట దగ్గర పడుకుని ఉన్నాయి. కళ్ళు పూర్తిగా తెరుచుకోని పిల్లలు.. ఒకదానిమీద ఒకటి పడి



నిద్రపోతున్నాయి. వాటిని చూస్తూ కాసేపు ఉండాలని నా కోరిక. ఆ కోరిక తీరాలంటే 'తల్లి'ని మచ్చిక చెయ్యాలి. లేకపోతే పిల్లల దగ్గరికి రానివ్వదుగా.

"ఏం చేస్తున్నారు సార్?" మోటర్ సైకిలు ఆపి మరీ అడిగాడు నరసింహన్. వలసతవాకం వాడే.. టివీ సీరియల్స్ లోనూ, అప్పుడప్పుడు సినిమాల్లోనూ 'ఏక్ట్' చేస్తూవుంటాడు. (ఏక్ట్ అని వ్రాయకూడదుట. 'యాక్ట్' అని రాయాలిట..పత్నీ ఉవాచ)

"కుక్కపిల్లల్ని చూస్తున్నా" అన్నాను.

"అదేమిటి సార్..ఎవరన్నా చూస్తే ఏం బాగుంటుంది?" అన్నాడు.

"ఎందుకు బాగోదూ? అయినా చూడటం చూడకపోవటం నా ఇష్టం!" మనసులోని మాట చెప్పేశా. ఏమనుకున్నాడొ గానీ..వెళ్ళిపోయాడు.

కుక్కపిల్లలు మాత్రం హాయిగా నిద్ర పోతున్నై. అప్పుడప్పుడూ వొళ్ళు విరుచుకుంటున్నై. తల్లి కుక్కబిస్కెట్లు తినడం పూర్తి చేసి పిల్లల దగ్గరకి వచ్చింది. ఓ నిమిషం నావంక తీక్షణంగా చూసి, 'ఫరవా లేదు..చూసుకో' అన్నట్లు తోకాడించి రోడ్డు అవతలివైపుకి పోయింది. నాకెందుకో 'ఉమ' గుర్తుకొచ్చింది.

నాకు అయిదేళ్ళయితే ఉమకి ఆరేళ్ళు. చెరువు వొడ్డున కూచుని కుక్కపిల్ల లాగా నావంకే చూస్తూ ఉండేది. నేను చెరువులో దిగి తామరపూలు తెంపి, వాటి తూడుల్ని మాలగా చేసి ఉమ మెడలో వేసేవాడ్ని. ఆ కార్యక్రమం తరవాత మామిడితోటకి పోయేవాళ్ళం. కాసేపు 'చీమరాణుల' నడకని గమనించేవాళ్ళం. కాసేపు నా పొట్టమీద ఉమ తల పెట్టుకుని పడుకుంటే, మరి కాసేపు దాని పొట్టమీద నేను తల పెట్టుకుని మబ్బుల్ని గమనించే వాళ్ళం. మామిడిచెట్టు కింద పరుచుకున్న పచ్చని నీడల్లో దొర్లే వాళ్ళం. అది తూనీగల్ని పట్టుకుని నాకు చూపిస్తే, నేను.. ఆరుద్ర పురుగు వెల్వెట్ వీపుని ఎలా నిమరాలో తనకి నేర్పే వాడ్ని. ఎన్ని ఆటలో!

ఓ రోజు మాకు ఓ బుల్లి కుక్కపిల్ల దొరికింది హైస్కూలు దారిలో. దానికి ‘మోతీ’ అని పేరు పెట్టాం. ఇంటికి తీసికెళ్తే తంతారుగనక దాన్ని పొలం దగ్గరి మోటారు షెడ్డు పక్కన దాచాం. అన్నం పాలూ బిస్కెట్లూ దొంగతనంగా పట్టికెళ్ళి దానికి పెట్టేవాళ్ళం. రెండేళ్ళలో ఆ మోతీ ఎంత ఎత్తు ఎదిగిందీ! మేమూ ఎదిగాం...

నాకు తొమ్మిదేళ్ళప్పుడు. ఉమ నన్ను వెనక్కి పడదోసి నా పెదాలకి తన పెదాలు ఆనించి ముద్దు పెట్టింది. “ఛీ..” అని పెదాలు తుడుచుకున్నా. చికాకు పుట్టింది. “ఛీ..కాదురా, ..అది ముద్దు!” నవ్వింది ఉమ.

“ఇంకోటి పెట్టనా?”

“ఉహూ.. నాకు బాగోలేదు!” చేత్తో నా పెదాలు మూసుకున్నా.

“బాగుంటుంది. ఇంకోసారి పెడతా చూడు.” బలవంతంగా నా చేయి తప్పించి నోట్లో నోరు పెట్టి మళ్ళీ ముద్దిచ్చింది.

“ఎన్నా సార్!” పళ్ళికిలిస్తూ నా జ్ఞాపకాల రథాన్ని ఆపాడు రంగరాజన్. రంగరాజన్ మా వీధి వాడే. లాయరు. మార్నింగ్ వాక్ లో ఎదురు పడుతూ ఉంటాడు.

“ఒణ్ణుమిల్లె!” చిన్నగా నవ్వానని అనుకున్నాను. ఎందుకంటే నా మనసునిండా ఉమే.

“జాగ్రత్తగా ఉండండి. తల్లి వస్తే కరుస్తుంది.” జాగ్రత్తలు చెప్పాడు.

నాకు పదేళ్ళు దాటాక అనుకుంటా, పొద్దున్నే మా యింటికొచ్చి, “తొందరగా లేచి మొహం కడుక్కుని అడివి ఆంజనేయస్వామి గుడికొచ్చెయ్ రా... మంచి కానుక ఓటిస్తా!” అని నిద్ర లేపి బుగ్గ గిల్లి పోయింది ఉమ.

గంటసేపు అలాగే పడుకుని నిద్రపోయి పదిన్నరకో పదకొండింటికో ఆ గుడి దగ్గరికి పోయాను. గుడికి ఫర్లాంగు దూరంలో ఊడల మర్రి. అక్కడ్నించి అరిచింది, “ఇటు రారా!” అని.

వెళ్ళాను. “ఇప్పుడా వొచ్చేదీ?” అలిగి మొహం అటువేపు తిప్పుకుంది. నేను మెల్లగా దాని మొహం నా వేపు తిప్పుకుని “మళ్ళీ నిద్దరొచ్చిందే..పడుకున్నా.” అన్నాను.

“సర్లే..ఎవరికీ చెప్పకేం!” అంటూ ముద్దు పెట్టుకుని కౌగిలించుకోవటం నేర్పింది. నా తలని తన గుండెకి ఆన్చుకుంది. ఆ క్షణంలో తన వొంటినిండా ఆవిర్లే. మర్రిచెట్టు మొదట్లో కూర్చుని నా తలని తన గుండెకి అదుముకుంది. అప్రయత్నంగా రెండు చేతుల్తో ఉమని కావలించుకున్నా.

“”పెద్దయ్యాక నిన్నే పెళ్ళి చేసుకుంటా..సరేనా?”” గుసగుసగా నా చెవిలో అన్నది. వెచ్చని ఆవిరి నా చెవిని అలుముకుంది.

“”ఊ”” నా కళ్ళు మూతలు పడుతుండగా అన్నాను.

“”ఏంటీ ఇక్కడ కూర్చున్నారూ? కళ్ళు తిరుగుతున్నయ్యా?”” తలెత్తి చూస్తే లతా అమ్మాళ్. ఆవిడ లెక్చరర్. మా వెనక వీధిలో ఉంటోంది.

“”లేదే! సరదాగా కుక్కపిల్లల్ని చూస్తూ కూర్చున్నాను! ”” నవ్వాను.

“”నాకూ మీలాగా ఎవర్నీ లెక్క చెయ్యకుండా ఉండాలని ఉంటుంది. కానీ, మనసుని బిగదీసుకుని ఉండక తప్పదు. లెక్చరర్ని గదా! పోన్లెండి” అంటూ నడవడం మొదలెట్టింది. లతది నవ్వు ముఖం. వాళ్ళాయన అన్నుదురై ది ‘సుదు మూంజి.’ అంటే చికాకుమొహం. పేలాలు వేగుతున్నట్టు ఉంటుంది. అందరితోటీ గొడవే. ఆయనా లెక్చరరే.

కుక్కపిల్లల మీదకి ఎండ పడుతోంది. చిన్నప్పుడు 'మోతీ' మొహం మీద ఎండ పడుతుంటే నేను 'పెనకత్తి' తో ఓ తాటాకు నరికి దానికి నీడగా ఓ పుల్లకి గుచ్చాను. ఉమ నా చేతిలోని కత్తి తీసుకుని ఇంకో నాలుగు తాటాకులు నరికి ఏకంగా ఓ బుల్లి సైజు గుడిసెనే మోతీ కోసం తయారు చేసింది.

ఇప్పుడు ఇక్కడ తాటిచెట్లూ లేవు. తాటాకులూ లేవు. ఏం చెయ్యాలి?

వాటిని ఎత్తుకుని అవతలివైపునున్న చెట్టు కిందకి తీసుకెళ్తే? తల్లి కుక్కపిల్లలకి అపకారం జరుగుతుందేమోనన్న భయంతో నన్ను కరవొచ్చు. మనిషి భావాల్ని గనక అది చదవగలిగితే కరవదేమో!

నవ్వొచ్చింది. మనిషి భావాల్ని మనిషే చదవలేకపోతున్న ఈ రోజుల్లో కుక్కలు ఎలా చదవగలవు? మనుషులు 'కుక్కల్లా పోట్లాడుకుంటున్నా, కుక్కలు మనుషుల్లాగా 'చీట్' చేసుకోవట్లేదుగా!

ఫోటొ తీశాను వాటిని. ముచ్చటగా మూడు పిల్లలు, అమాయకంగా.

“”ఏం స్వామీ, ఫోటో తియ్యడానికి అవే దొరికాయా?”” ఆగి అన్నాడు వీరాస్వామి. వీరాస్వామి పక్కా తెలుగువాడు. చాలా వ్యాపారాలు ఉన్నాయి. లోకల్ గా పలుకుబడీ ఎక్కువే.

“”ఏమో! ఫోటో తియ్యాలనిపించింది”” అన్నా.

“”తెలీక అడుగుతాను గానీ, అసలు మీరు ఇలా రోడ్డు పక్కన కూర్చోవడం ఏమిటీ? కుక్కల్ని ఫోటో తియ్యడం ఏమిటీ? అసలు చుట్టుపక్కల ఎవరు వస్తున్నారో పోతున్నారో కూడా పట్టించుకోకుండా మీ లోకంలో మీరు ఉండటం ఏమిటీ? ఒక్కసారి చెప్పండి!”” ప్రశ్నలు సంధించాడు వీరాస్వామి.

“”సరే. ఇవీ మనలాగే యీ లోకంలోకి వచ్చాయి. మనలాగా వ్యాపారాలు చేసో నానా గడ్డీ కరిచో ఇవి ఆస్తుల్ని కూడబెట్టవు. వీటికి ఇళ్ళు అక్కర్లేదు. డాక్టర్లు అక్కర్లేదు. హోటళ్ళూ, సినిమా హాళ్ళూ, ఇంటర్నెట్లూ, బస్సులూ, రైళ్ళూ, విమానాలూ ఏమీ అక్కర్లా. ఆకలేసినప్పుడు తినడానికి ఏమన్నా దొరికితే తింటై...లేకపోతే పస్తులుంటై. అంతేగానీ సమ్మెలు చెయ్యవు..రాస్తా రోకోలూ, హర్తాళ్ళూ చెయ్యవు. అన్నట్టు రాష్ట్రరాజధానికీ దేశరాజధానికీ పైరవీలు చెయ్యవు. ఇంతకంటే ఇంకేం కావాలీ? అందుకే సగౌరవంగా వీటిని ఫోటో తీశా!”” సవివరంగా నేనూ సమాధానం చెప్పాను.

'గుర్రు'గా నా వంక చూశాడు వీరాస్వామి. ఎందుకూ? నేనన్న మాటల్లో కొన్నిట్ని తనకి తానే ఆపాదించుకుని ఉండొచ్చు.



“”మంచిపని చేస్తున్నారు. కానివ్వండి.”” ముక్తసరిగా అని బయల్దేరాడు.

టైం ఎనిమిదిన్నర...లేవాలి. కుక్కపిల్లల్ని ముట్టుకున్నాను. 'గుర్రు'మంటూ తల్లి వచ్చింది. నేను లేచి నడక ప్రారంభించా. ఓ పది గజాలు నడిచి వెనక్కి చూశా. పిల్లలు పాలు తాగుతున్నాయి.

మళ్ళీ వెనక్కి వచ్చి తల్లి మొహంలోకి చూశా. ఆ కళ్ళల్లో 'శాంతి'...అనిర్వచనీయమైన 'ప్రేమ.' సృష్టిలో అన్ని జీవులూ 'కళ్ళతో మాట్లాడగలవు. వినే మనసు ఉంటే చాలు. కాదూ!

హాయిగా అడుగులు వేశా. చల్ల గాలి...కొంచెం సువాసనతో. అదిగో..అక్కడుంది 'రాధామనోహరాల' తీగ...చెట్టుని అల్లుకుని. ఆ చెట్టుకి పువ్వులు పూయవు. కానీ రాధామనోహరాల తీగ ఎంతగ చెట్టుని అల్లుకుందంటే, ఆ పువ్వులన్నీ చెట్టువే అన్నంతగా!

ఓ క్షణం ఆగాను. ఎప్పటి సువాసనో మనసులో మెదిలింది. అవును...అది ఉమ వొంటి

పరిమళం. దాని మెడ మీద నా తల పెట్టి కళ్ళు మూసుకుని మెల్లగా పాటలు పాడే వాడ్ని. సరిగ్గా అప్పుడు యీ మైల్డ్ గా ఉండే రాధామనోహరాల వాసనే వచ్చేది.

అది తలంటి పోసుకున్నప్పుడల్లా నా దగ్గరికి వచ్చి, “”ఒరేయ్..నా తల వాసన చూడరా..భలే వాసనొస్తోంది...’శీకాయ’ (సీకాయ) తో రుద్దుకున్నాను”” అనేది. మా ఇంట్లో కుంకుడుకాయలే గానీ శీకాయ వాడేవాళ్ళం కాదు. నిజంగా ఉమ జుట్టు భలే వాసనొచ్చేది.

నా మెడమీద దాని గడ్డం ఆనించి వీపు మీదుగా వాలి కూర్చునేది. అప్పుడప్పుడు చెవులు కొరకడమో, నాలుకతో చెవికి కితకితలు పెట్టడమో చేసేది.

నాకు తెలీకుండానే ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు. దాని మెత్తని బుగ్గలు నా బుగ్గలకి వొత్తుకునేవి. ముందుకి నడిచాను. సూర్యుడు బాగా పైకొచ్చాడు. ఇంకో పదిహేను నిమిషాలు..తరవాత మళ్ళీ రొటీన్.

ఓ గోమాత ఎదురొచ్చింది. నిండు గర్భిణి. మొహం మీద తెల్లని మచ్చ. మెల్లగా నాలుగడుగులు వేసి ఆగుతోంది. గబగబా నడిచి దానిదగ్గరికెళ్ళాను. మెల్లగా గంగడోలుని నిమురుతుంటే మోర ఎత్తింది. సుఖంగా ఉందేమో!



“”త్వరలో బిడ్డని కంటావు. అప్పుడీ కష్టాన్నంతా మరిచిపోతావు. అవునా?”” ఆవుతో అన్నాను. కొద్దిగా చెవుల్ని కదిలించింది. నడిరోడ్డుమీద అయితేనేం...దాని గంగడోలు నిమరడం నాకూ హాయిగానూ సంతోషంగానూ అనిపించింది. అరమోడ్చిన దాని కన్నుల్లో మనిషికి అందని స్వప్నాలు.

గుడిగంట వినిపించింది. తొమ్మిదింటికి ఖచ్చితంగా ‘గుడి’ మూసేస్తారు. దేవుడు కూడా మనుషుల ఇష్టప్రకారమే మసులుకోవాలి. దేవుడికి ఎన్నింటికి అభిషేకం చెయ్యాలో, ఎన్నింటికి నైవేద్యం పెట్టాలో ఎన్నింటికి ఏ పూజ చెయ్యాలో, ఎన్నింటికి పవళింపు సేవ చెయ్యాలో, ఎన్నింటికి నిద్ర లేపాలో అన్నీ నిర్ణయించేది మనిషేగా! ఇక దేముడికంటూ ఇష్టాయిష్టాలు ఎక్కడుంటై?

అవును...మనుషులు దేముళ్ళని, అంటే దేవుడి రూపాల్ని తమ ఇష్టప్రకారం సృష్టించుకుంటారు. మరి మిగతా జీవుల మాట ఏమిటి?

ఈ గోమాత మనసులో సృష్టించుకునే గోదేవుడో గోదేవతో ఎలా ఉంటారు? మనుషుల్లాగానా పశువుల్లాగానా?

ఊహూ! ఇప్పుడా ఊహలు వద్దు. ఇంకో నాలుగు నిముషాలు యీ గోమాత ఒళ్ళు నిమిరి బయల్దేరాలి. ఇంటికెళ్ళి స్నానం చెయ్యాలి. ఆ తరవాత టిఫిను.

స్నానం అనుకోగానే మళ్ళీ ఉమ జ్ఞాపకానికొచ్చింది. “”ఒరేయ్ రాజూ, నా వొళ్ళు వాసన చూసి ఏ సబ్బుతో రుద్దుకున్నానో చెప్పరా”” అన్నది ఓ రోజు.

దాని వీపుని వాసన చూసి ‘’లైఫ్ బాయ్’’ అన్నాను. మా ఇంట్లో వాడే సబ్బు అదే. మిగతా సబ్బుల పరిమళం నాకేం తెలుసూ.

“”కాదు..ఇంకో ఛాన్సు..”” అన్నది. ‘లక్స్’ అనే పేరు గుర్తొచ్చి “”లక్స్ సబ్బు”” అన్నాను.

“”కాదు. ఈ సబ్బు పేరు జన్మలో నువ్వు విని వుండవు. దీని పేరు “పియర్స్”” అన్నది.

గంగడోలు నిమురుతూనే పకపకా నవ్వాను. చుట్టూ చూస్తే జనాలు నావంకే విచిత్రంగా చూస్తూ పోతున్నారు.

నవ్వెందుకొచ్చిందంటే నూటపదిహేనేళ్ళ క్రితం రాసిన 'కన్యాశుల్కం' నాటకంలో "పియర్స్" సబ్బు రిఫరెన్సు ఉన్నది. నిన్ననేగా చదివిందీ! బహుశా వందో సారి చదివుంటా ఆ నాటకం.

గోమాతని మెల్లగా తట్టి లోలోపలే టాటా చెప్పి ముందుకు నడిచా. శరవణా స్టోర్స్. మాంఛి 'కంద' కనిపించింది. కందదుంప శిరోభాగం జటాజూటంలా ఉంది. అప్రయత్నంగా ఫోటో తీశా.

""ఉక్కారుంగో!"" ఏకైక స్టూల్ నాకోసం వేశాడు దుకాణదారు. మంచినీళ్ళు కూడా ప్రేమగా ఓ బుల్లిచెంబు నిండా ఇచ్చాడు.

"జలదాతా సుఖీభవ!"" అన్నాను.

"కొంజనేరం ఉక్కారుంగో" అన్నాడు దుకాణదారు. (అంటే 'ఇంకొంచెం సేపు కూర్చోండీ' అని.)

"పోవాలి..మళ్ళీ వస్తా!"" తమిళంలో చెప్పి లేచాను.

స్నానంచేస్తున్నాను. కావాలని పే...ద్ద బాత్రుం కట్టించుకున్నాను. కథలూ పాటలూ, నీటి చప్పుళ్ళలోనే ప్రాణం పోసుకుంటాయి. తలంటి పోసుకుంటే? షాంపులు 'మేం సిద్ధం' అన్నట్టు కన్నుకొట్టాయి. కానీ తలంటి అంటే నెత్తి మీద కొంచెం షాంపు వొంపుకుని 'బురుజు' తో 'అయింది' అనిపించడం కాదు. ఒంటినిండా నూనెరాసి ఆ తరువాత సున్నిపిండి పూసి కొంచెం ఆరాక నలుగు పెట్టి వొళ్ళంతా కందిపోయేలా రుద్దుకుని వేడివేడి నీళ్ళతో గంటో గంటన్నరో చెయ్యాలి. తల తుడుచుకుని ఇవతలికి రాగానే కంటినిండా నిద్ర ముంచుకు రాదూ! నిద్రవస్తేనే దాని పేరు తలంటి.

అవునూ.. అసలీ పరుగుపందెంలో తీరిగ్గా హాయిగా తనువారా మనసారా 'స్నానించి' ఎన్నేళ్ళు అయ్యుంటుందీ?

పంపుతిప్పడం... నాలుగు ప్లాస్టిక్ చెంబుల నీళ్ళు నెత్తినగుమ్మరించు కోవడం... తల తుడుచుకుని డ్రెస్ చేసుకోవడం... ఇదేనా స్నానం?

"ఎంతసేపూ?" ఆవిడ అరిచింది. అంతకుమించి ఏం చెయ్యగలదు టిఫిన్ చల్లారి పోతుందేమో అన్న ఆరాటం తనది.

"వస్తున్నా" నేను అరిచా. అరవకపోతే మాటలు వినిపించవు. మా ఇంటి ముందు రోడ్డు. మూడువైపులా అంటే కుడి, ఎడమ, వెనుక ఇళ్ళు. మూడు ఇళ్ళలోనూ టీవీలున్నై. పిల్లలున్నారు... అత్తా కోడళ్ళున్నారు. ఎప్పుడు రామరావణ యుద్ధాలే... కిష్కింధకాండలే. అందువల్ల మామూలుగా మాట్లాడుకుంటే వినపడదు. అరుచుకోవాలి... తప్పదు.

రేపు నెల్లూరికి బయలుదేరాలి టిఫిన్లు బాగుంటాయి. అదోకారణం అతి ముఖ్యమైన విశేషం ఘంటసాలగారి వర్ధంతి. పాటల పోటీలూ, ఆరాధనోత్సవాలు జరుగుతున్నై నెల్లూరు టౌన్‌హాల్లో.

"నెల్లూరిసీమలో... చల్లంగ నిదురించు ... శ్రీరంగనాయక... ఆనందదాయకా..." ఘంటసాలగారి "'ముక్కోటి దేవతలు ఒక్కటైనారు" పాట నా గుండెల్లో కదలాడి నరనరానా పాకి నాట్యం చేస్తోంది. ఆహా..! 'భగవంతుడి భాష సంగీతం'... ఆ దేవుడే పాడితే ఎలా ఉంటుందీ? ఘంటసాల పాడినట్లుంటుంది! అమరులై 35 ఏళ్ళుదాటినా ఆయన ప్రజలమనసుల్లో చిరంజీవిగానే ఉన్నారనడానికి నిదర్శనం ఊరూరా నిరంతరంగా జరుగుతున్న జయంతి-వర్ధంతి ఉత్సవాలే. తల్లిదండ్రుల్ని మర్చిపోయన్నారేమోగానీ గానగంధర్వుడ్ని మాత్రం ఎవరూ మరవలా.

నాతో బాటు ఇంటావిడ.. మమ్మల్ని 'సంస్థ' తరపునించి ఆహ్వానించింది తీసి కెళ్ళేదీ చి॥ వెన్నెలకంటే. గొప్ప రచయితలూ, వక్తా.' అమ్మవారి' ఆశీస్సులు నిండుగా ఉన్నవాడు. నేను బుల్లబ్బాయ్ అంటూంటా. అది రేపటి సంగతి. ఇవాళ ధనలక్ష్మి అక్కయ్య కూతుళ్ళిద్దరూ అమెరికా వెళ్తున్నారు. వెళ్ళి చూసిరావాలి. మిగతా అంతా ఓకేగాని 'ఫ్రాంక్‌ఫర్ట్' లో గడబిడ పడకుండా ఉంటే చాలు.

మొదటిసారి గదా వెళ్ళేదీ..!

భూమికి ఇటేపు నేను, వాళ్ళు అటేపుకి వెళ్తున్నారు. అదే నేల.. అదే ఆకాశం అవే నక్షత్రాలూ, చంద్రుడూ, సూర్యుడూ, గాలీ. కానీ చెప్పలేనంత కొత్తదనాన్ని నేను అక్కడికి వెళ్ళినప్పుడు అనుభవించాను. ఆకాశందగ్గరగా ఉన్నట్లు అనిపించింది.. ఆనాలుగు రోజులూ.

ఆకాశం అనుకోగానే మావూరే గుర్తుకొస్తుంది. పెరట్లో మడత మంచాలు వేసుకుని పడుకునే వాళ్ళం.' గూట్లోదీపం– నోట్లో ముద్ద...' ఆ రోజుల్లో చీకటి రోజుల్లో ఎన్ని లక్షల నక్షత్రాలు కనిపించేవి. 'స్వర్గంలో దేవతలు వెలిగించే దీపాలే నక్షత్రాలు' అనుకునేవాడ్ని. తెరలు తెరలుగా కొబ్బరి ఆకుల మీదుగా చిరుసవ్వడి చేస్తూ గాలి వీస్తుండేది... అమ్మ సన్నని గొంతుతో పాడే ఆధ్యాత్మ రామాయణం కీర్తనలు వింటూ, నక్షత్రాల వంక కళ్ళార్పకుండా చూస్తూ ఏదో ఆనందంలో మునిగి పోయేవాణ్ని... మైమరిచి పోయేవాడ్ని.

"ఒరేయ్.. ఆ పెద్ద నక్షత్రం ఉంది చూడూ అదేరా మా అమ్మ, చనిపోయాక నక్షత్రమైపోయింది..!" అమావాస్య రోజుల్లో ఆశ్రమం నించి ఇంటికొచ్చేటప్పుడు ఉమ ఓ నక్షత్రాన్ని చూపించి అనేది.

"నీకెలాతెలుసూ?" అడిగా నొకరోజున.

"కల్లోకొచ్చి చెప్పిందిరా...!" అమాయకంగా అన్నది. అప్పుడుదాని బయసు ఏడున్నరో ఎనిమిదో.

ఓరోజు వాళ్ళింట్లో చెప్పి ఉమని మాయింటికి తీసుకొచ్చా. ఆరోజు అమావాస్యే. చీకట్లో నక్షత్రాల్ని చూస్తూ చాలాసేపు మాట్లాడుకుంటు మడతమంచాల మీద పడుకున్నం. అర్ధరాత్రి పాస్ కని లేస్తే ఏముంది. ఉమ నన్ను కావలించుకుని నా మంచం మీదే ఉంది. ఎప్పుడొచ్చిందో కూడా నాకు తెలీదు. దాన్ని గట్టిగా కావలించుకుని దాని మెడమీద నా మొఖం ఆన్చి నిద్దరపోయా....... ఆకాశం కదూ......

మావూళ్ళోను ఆకాశం దగ్గరగా... నక్షత్రాలు చేతికి అందేట్టు ఉండేవి. తాటి చెట్లని గట్టిగా అల్లుకుని దిట్టంగా పూలుపూసే 'కోరింత' తీగల్ని చూశారా? అబ్బ... కోరింత పూల వాసనకి మత్తెక్కిపోయేది. అవేగాక జూకామల్లి పందిరీ.. రాధామనోహరాల పూలు... అన్ని పరిమళాలూ ఒక దానిలో ఒకటి కలిసిపోయి, ఊపిరితిత్తుల్ని నింపేసేవి. ఇంకా గచ్చ పొదలుకూడా ఉండేవి. పాండవులూ కౌరవుల పువ్వాలూ రేక్కాయలూ...ఓహో.. గుండెనిండా ఎన్నిగుర్తులూ... ఎన్నిగాయాలూ.

"థాంక్యూ మామయ్యా" అన్నారు అక్కయ్య పిల్లలిద్దరు.. నేను జాగ్రతలు చెప్పగానే నాకు తెలుసు.. వీళ్ళు అమేరికా చేరే వరకూ నా మనసు వాళ్ళతో అక్కడే ఉంటుందని వాళ్ళకి ఏ కష్టమూ కలగకూడదని దేవుడ్ని ప్రార్థిస్తూనే ఉంటుందనీ . శుభం.

హిందీ ఛానల్ 'ఆన్' చేసి 'ఫుడ్...ఫుడ్' పెట్టాను. ఏదో వంటకం మార్చేసి 'మస్తీ' పెట్టాను. అబ్బ... ఎప్పటి పాట.. "ఓ దూర్‌కి ముసాఫిర్ హంకోభి సాథ్ లేలేరే... హంకోభీ సాథ్ లేలేరే... హమ్ రెహగయే అకేలే..." అళ్ళు మూసుకున్నాను. 'అకేలే' (వొంటరి)కానివాళ్ళెవరూ? లోకంలో అందరూ ఒంటరి వాళ్ళే...! పాట నా గుండెని పిండేస్తోంది. వెండి గ్లాసులో ఓ లార్జ్ బ్రాందీ పోసి నీళ్ళు కలిపాను. బస్... ఎక్కడి కన్నీళ్ళు అక్కడే బంద్.

లోపల్లోపల ఎన్ని కన్నీటి నదులైనా ప్రవహించనీ బయటకి మాత్రం రాకూడదు. 'నిరాశ' అనే 'వైరస్' ని ఇతర్లకు అంటించరాదు. ఓక్... 'బహరోం ఫూల్‌బర్‌సావో' పాట పిచ్చేకింది. రఫీగారి గొంతుతో గొంతు కలిపి పాడాను. తెలుగులో 'పగలరాణివినీవే' పాటకి బదులుగా హిందీలో 'బహరోం ఫూల్‌బర్‌సావో' వొచ్చింది. సినిమాపేరు 'సూరజ్'. తెలుగులో 'బందిపోటు'.

మనసు గాల్లో తేలిపోతోంచి... ఏం పాట! రఫీ గొంతులో ఎంతటి ఇంద్రజాలం! ఆయన పాదాలని ఏ పరిమళాలతో అభిషేకించాలీ!

అటు రఫీ... ఇటు ఘంటసాల... అటు లతా.. ఇటు సుశీల..! దేముడు నిజంగా సమవర్తీ.

"ఏంటీ ఉత్సాహం... ఏ పిల్ల అయినా గుర్తుకొచ్చిందా?" ఇంటావిడ మాటల్లో చిన్న పరిహాసం. నవ్వుకున్నాను. యా! 'బహారోం' పాట కోసమైనా యీ లోకంలోని సమస్త జీవుల్నీ ప్రేమించాలి....'ప్రేమ' మళ్ళీ జ్ఞాపకం వొచ్చింది.

భార్య ఎదురుగా ఉండగానే మరో స్త్రీ గురించి మనసు ఆలోచిస్తోంది. ఇది తప్పా? ఒప్పా? నేను ఒక్కడ్నే ఇలాగా లేక, మగ వాళ్ళు అందరూ ఇంతేనా? సరే.... ఆడవాళ్ళు భర్త ఎదురుగా ఉండగానే పరపురుషుల గురించి ఆలోచిస్తారా.... ఆలోచించరా? ఎవర్నడిగినా 'హిపోక్రసీ' ముసుగే వేసుకుంటారు గానీ నిజం చెబుతారా? అవునేమో..! అదే మంచిదేమో...! కొన్ని నిజాలు పెదాల వెనకే బందీలైదాగుండాలేమో.! ఏమో....!ఏమో!!!!!

వెన్నెలకంటి 'నేతి బీరకాయ' పచ్చడి ఇప్పటి వరకూ తినలేదు. మొత్తానికి ఓ చోట నేతి బీరకాయని చూశాను గానీ చూపించాలి అనుకునేలోగా కారు ముందరికెళ్ళింది. "'తిరిగి వచ్చేటప్పుడు చూద్దాం అన్నయ్య'" అన్నాడు.. సరే.

కూరగాయలు కొనటం నాకిష్టం. ఏ రోజుకారోజు 'ఫ్రెష్' గా తెస్తాను. నా నాలిక మహా వగలమారిది. ఎన్ని రుచులు కొసరుతుందో! మళ్ళీ తినేది తక్కువే. ఎంత తక్కువంటే ఓ పదేళ్ళ పిల్లాడు తినేదాంట్లో సగం కూడా ఉండదు. అన్నట్టు 'సివంగి పులుసు' గురించి కూడా చెప్పి బుల్లెబ్బాయిని ఊరించా. వంకాయ కొబ్బరీ పచ్చడీ- కొబ్బరీ బచ్చలకూర పచ్చడీ- కందా బచ్చలీ కూరా... వామనచింతకాయ పచ్చడి... చుక్కకూర పప్పూ... మామిడికాయ పులిహోర.... అబ్బ.... ఎన్నివంటకాల్ని 'నెమరు' వేశామో.

అన్నట్టు నెల్లూరు 'నెయ్యి కారం దోశ'కి ప్రసిద్ధి.రండి...! నెల్లూరు వచ్చేయండి! కడుపారా నెయ్యి కారం దోశల్ని ఆరగించండి. అన్నట్టు పులిహోరని నెల్లూరీయులు 'పులుసన్నం' అంటారు. అన్నట్టుగా మరే అట్టుగా... కరివేపాకురైస్ మురళీకృష్ణా 70 హోటల్లో అభించును దాని రుచి చెప్పనలవి కాదని మనవి చేయుచున్నావాడను.

ఎక్కడి కెళదాం? ఓకే... 'జొన్నవాడ'కి పోయి మల్లీఖార్జునుడినీ, కామాక్షితాయి అమ్మవార్నీ ముందుదర్శిద్దాం

"ఎక్కండయ్యా... బాబూ ఎక్కండయ్య బండి... ఎక్కండయ్యా!" కూనిరాగం తీస్తూ నా హుండై 'జింగ్' ఎక్కాము.

కారుకి 'దండం' పెట్టాను. అది 'స్వామి' ఇచ్చిన కారు. అందుకీ ఎప్పుడూ క్షేమంగా గమ్యాన్ని చేరుస్తుంది. అవును... సృష్టిలో ఏదీ 'జడంకాదు. సర్వమూ చైతన్యమే!

'నువ్వో మూర్ఖుడివి' అన్నది నా మనసు. 'యస్' ఒపుకున్నాను.

'పెన్న' మీద వొంతెన వడ్డాణంలాగా ఉన్నది జొన్నవాడ చేరాము చక్కని దర్శనం దొరికింది. స్పష్టంగా, మనసారా, పురోహితులు అమ్మవారి ఎదట 'ఖడ్గమాల' స్తోత్రం.. నేను ఆ తరవాత మనసులో చదువుకున్నాను. శంకరాచార్యుల వారు ఎంత అద్భుతంగా నిర్మించారూ!

"జగదంబ విచిత్ర మంత్రకిం పరిపూర్ణాకరుణాస్తిచేన్మయా
అపరాధ పరంపరావృతం.. నమో మాతా సముపేక్షతేసుతం"

అమ్మవేరు... తల్లివేరు. తల్లి తన బిడ్డల బాగ్గు మాత్రమే చూస్తుంది. అమ్మ వేరు.. అమ్మదనంవేరు. మదర్ థెరిసా పెళ్ళి చేసుకుందా? లేదే కానీ 'మదర్' అని ఎందుకంటాం? లోకమంతా అమెకి బిడ్డలే. అందుకే ఆదిశంకరాచార్యుల వారు 'జగదాంబ' అన్నారు. సృష్టిలోని సర్వజీవులూ ఆ జగదాంబ బిడ్డలే. 'అపరాధ పరంపరా వృతం..' అంటే చేసిన తప్పే మళ్ళీ మళ్ళీ చేసినా ఆ జగన్మాత.. "తప్పురా నాన్న" అని అనునయంగా చెబుతుందే గానీ శిక్షించదు.. అందుకే ఆమె పరిపూర్ణ 'సంపూర్ణమైన కరుణకు' ఆమే నిదర్శనం.

స్వామి అక్కడే "కుపుత్రోజయేతత క్వచిదపి కుమాతానభవతి" అంటారు. దుర్మార్గులైన బిడ్డలు ఎందరో ఉండవచ్చు... దుర్మార్గురాలైన

'తల్లి మాత్రం ఉండదు అని అర్థం.

అవును! ఉమ అమ్మగారిలాగే మా అమ్మ ఇప్పుడు ఆకాశంలో నక్షత్రాల మధ్య నవ్వుతూ ఉంది. గుండెల్లో గుబులు పుట్టినప్పుడల్లా ఆకాశం వంక చూస్తా. ఇరవై ఏళ్ళ క్రితం మా అమ్మ అప్పుడప్పుడైన కనిపించేది. ఇప్పుడు... ఉహ... కనబడటంలా. నక్షత్రాలకీ మనిషికీ మధ్య ధూళి మేఘాలు అడ్డొస్తున్నాయి. కనీసం పదుల సంఖ్యలో కూడా నక్షత్రాలు కనబడటంలా.

వంతెన మీద కారు ఆపేశా. అద్భుతమైన సూర్య ప్రతిబింబం పెన్నానదిలో ... లంకల మధ్యన. అర్జంటుగా ఫోటోలు తీశా. కంట్రాక్టర్ 'యావ'కీ అధికారుల 'ఆశ'కీ బలైన పాత 'వారధి' ని కూడా ఫోటో తీశా.

ఇప్పుడు 'నరసింహులు కొండ'కి బయలుదేరవచ్చు. గాలి మరలు దూరం నించే ఆహ్వానిస్తున్నాయి. గోపురం నిటారుగా 'తలెత్తుకుని' రమ్మంటోంది. జొన్నవాడ దగ్గరా, నరసింహులు కొండ దగ్గరా 'కాశ్యప' మహా మునిని తలుచుకు తీరాలి. తమిళనాడుకి అగస్త్యుడు ఎలానో మనవైపు కశ్యపుడు అలాగ. అక్కడా (జొన్నవాడ) ఇక్కడా కూడా దేవుళ్ళు స్వయంభువులే. కశ్యప మహాముని రెండు చోట్లా తపస్సు చేశారు. పరమాచార్యులవారూ (శ్రీ చంద్రశేఖరేంద సరస్వతి) రెండు క్షేత్రాలనీ దర్శించారుట (స్థలపురాణాలు నెట్‌లో చదివండి ప్లీజ్).



ఆహా చీకటి పడ్డాక... తల్పగిరి రంగనాయకుడ్ని దర్శించాం. శ్రీరంగనాయకా... ఎంతచక్కని చిరునవ్వయ్యా నీదీ...! వహ్... నిద్రలో ఎంత సుఖం ఉందో స్వామిని చూస్తే తెలిసిపోయింది.

టౌన్‌హాల్లో ఘంటసాల గీతాల విందు పూర్తయ్యే సరికి రాత్రి పదిన్నరదాటింది. నిదురా... రావమ్మ రావే.... నిండారా రావే..........!

సూళ్ళూరుపేట "చెంగాళ పరమేశ్వరి" అమ్మవార్ని చూడాలని ఆశ. మద్రాసుకి విజయవాడకీ ఎన్నిసార్లు కారులో తిరిగానో! నెల్లూరు ఎన్ని సార్లు వెళ్ళానో! ఉహూ.., దర్శించుకోవడానికి అవకాశం రాలేదు.

పొద్దున్న నెల్లూరు 'రాజరాజేశ్వరీ' అమ్మవార్ని దర్శించుకుని పదకొండున్నరకల్లా సూళ్ళూరుపేట చెంగాళ పరమేశ్వరి ఆలయాన్ని చేరాలి. ఇక్కడ 'పెన్న' ఇంకోలా ఉంది.



చెంగాళమ్మవారి గుడికి తలుపులు ఉండవు. ఇరవైనాలు గంటలూ తెరిచే ఉంటుంది. తలుపులు పెడదామని చెక్కలు తీసుకొచ్చి ఆలయం పక్కన చిత్రిక' పట్టడం మొదలెట్టారుట. చీకటి పడింది. 'రేపు మిగతా పని కానిద్దాం' అనుకుని వడ్రంగులు వెళ్లి పోయారు. మర్రోజు వచ్చేసరికి ఆ చెక్క ఓ పచ్చని చెట్టుగామారి ఉంది. ఏమిటా' అని విస్తు పోతుంటే అమ్మవారు ఒకరికి 'పూని' "నా గుడికి తలుపులు ఉండకూడదు" అన్నారట. ఆ చెట్టుని 'చెంగాలమ్మ చెట్టు' అంటారు. కణుపులు కణుపులుగా ఉంటూంది. జాగ్రత్తగా



గమనిస్తే ఆ కాండంలో అనేకనేక దేవతల 'రూపు'లు కనిపిస్తాయి.. చిత్తగించండి.

అమ్మయ్య! ఓ పని అయింది. 'బేక్ టూ బేస్'.. దారిలో పచ్చ చేలు... నీటి కుంటలు.... గుంటలు... పంటలు. ఓ చోట చెరుకుతోట.. కారు ఆపి ఓ చెరుగ్గడ 'కొట్టు కొద్దా' మనిపించింది. మళ్ళీ నవ్వొచ్చింది మనసు ఎంత అల్లరిది!

అన్నట్టు తిరిగి వచ్చేటప్పుడు ఆ 'నేతి బీరకాయ' కోసం తెగ వెతికాం. కానీ, దొరకలేదు. నెల్లురు మార్కెట్లో మాత్రం 'చుక్కకూర' కొన్నాం. ఆకుపచ్చని వంకాయలు గీతల్లాంటి తెల్ల మచ్చలతో ఊరించాయి. పెళ్ళిళ్ళల్లో వండే 'వంకాయకూరకి అవి మహా శ్రేష్టం.

"రాజశేఖరా నీపై మోజుతీరలేదురా...." నిన్న రాత్రి విన్నపాట మనసుతో దోబూచులాడుతోంది.... ఉమ మొహం లాగా!

నా వీపు మీద ఉమ వాలినప్పటి వెచ్చదనం.... "ఒరేయ్.... ఆకలిగా ఉంది నీ మెత్తని చెవిని తినేస్తారా?" అంటూ రెండు పెదలతో నాచెవి కింద అంచుని గట్టిగా నొక్కి పెట్టిన అల్లరితనం...

చెరుకుగడ కొలికి రసాన్ని పూర్తిగా పీల్చేసి, "ఇప్పుడు నా పెదాలు ఇంకా తియ్యగా ఉంటాయిరా...., ముద్దుపెట్టు కుంటావా?" అంటూ రెండు పెదాలనీ నా పెదాలకి ఆనించే చిలిపిదనం..... అవును,,,,, ఎదురుదెబ్బతగిలి నేను కింద పడిపోతే, "అయ్యో" అంటు నాతలని తన గుండెలకి వత్తుకున్న 'అమ్మదనం'.... అన్నీ కారు చక్రల్లా మనసులో గిర్రున తిరుగుతుంటే.... నిట్టురుస్తూ ఇంటి ముందర కారు ఆపు చేశా.

మనసు అనేది ఎప్పుడు నిశ్చలంగా వుండదు. దాన్నీ కాస్త కంట్రోల్‌లో ఉంచాలంటే దానికి 'పని' పెట్టాలి. మనసుకి 'పనిపెడితే' దానంత గొప్ప సేవకురాలు మరొకొటి వుండదు. దాన్ని పట్టి ఉంచకపోతే మాత్రం అది ఆడవిగుర్రమే.

విశ్వనాథ వారు కదూ అన్నదీ...'మనసు గుర్రము రోరి మడిసి' అని! సరే... అకాలవర్షం కురుస్తున్నయీ చల్లని వేళ, అదీ అర్థరాత్రివేళ, నామనసుని ఎందుకు బంధించాలీ? కళ్ళాలు పీకి పారేశా...

అవునయ్యా... మనసు గుర్రమే. అయితే అది ఎక్కడకి పరుగు పెడుతుందీ? నీకు తెలిసిన నీగతంలోకో, అసలేమీ తెలీని నీ భవిష్యత్తులోకో.

ఎంతచల్లని వాన! ఎంతచక్కని వాన! 'చిత్తు బుక్కు' ల్లోంచి కాయితాలు చక్కగా చింపి, కత్తి పడవలు, గూడుపడవలు మామూలు పడవలు తయారుచేసి వేగంగా పారుతున్న కాలవలో వేసేవాళ్ళం. ఆ పడవలమీద మేం పేర్లు రాసుకునే వాళ్ళం. నేను 'ఉమ' అనిరాస్తే తను 'రాజు' అని రాసేది. జల్లు బాగా ఎక్కువైతే ఒక్కళ్ళకి ఒకళ్ళం అతుక్కుపోయి కూర్చునే వాళ్ళం. బజార్నించి సరుకులు కొని తెమ్మంటే నేను కొంచెం 'కమిషన్' ఇస్తేగానీ తెచ్చేవాడ్నికాదు. ఆ కమిషన్‌తో వేడి వేడి పచ్చిమిరపకాయ బజ్జీలు ఆ వర్షంలోనే పరిగెత్తుకెళ్ళి కొనుక్కునేవాళ్ళం.. ఎంత ఘాటో...!

తల్చుకుంటే నోరూరుతోంది... అసలు అప్పటి శనగపిండి కుండే వాసన ఇప్పటి పిండికి ఏది? అసలు ఏవస్తువుకైనా అప్పటి 'రుచి' ఏదీ! నాగభుషణంగారు మిర్చిబజ్జీ పొట్టచీల్చి అందులో (ధనియాపొడి-ఉప్పు-కారం కలిసిన గిన్నెలో ముంచి బాగా కలిపిన ఉల్లి ముక్కల్నీ కొద్దిగా దంచిన వాము పొడిని కలిపి) మసాలా ఉల్లి పాయ ముక్కల్ని కూరి, ఆ పైన నిమ్మరసం 'ధాటు' గా పిండి శ్రద్ధగా చేతి కందిస్తే వహ్... రెండు గంటలు నోరంతా బజ్జీల వాసనే.

వర్షం.... చినుకుల్ని 'జ్ఞాపకాల్లా'నూ, జ్ఞాపకాల్ని చినుకుల్లాగానూ కురుస్తోంది. ఓహో... ఏం మెరుపులూ... అప్పుడప్పుడూ ఉరుములు.... ఇప్పుడు నేను ఒంటరిగా మేడమీద వున్నాను. అంటే 'టెర్రస్' మీద.... ఓ ఇరవై గజాల పొడుగున వేసిన రేకుల కింద. అదే వర్షాన్ని 'ఆస్వాదించడానికి' సరైనచోటు. జల్లు ఒంటి మీద పడుతూనే ఉంటుంది. వాన చినుకులు రేకుల మీద పడి 'సవ్వడి' త్రిగుణీ కృతమై

వినసొంపుగా వుంటుంది. ఇటునించి అటూ అటునించి ఇటూ ఒకోసారి గుండ్రంగానూ తిరుగుతూ 'వర్షరాణి' వొయలు పోతూ వుంటుంది. అబ్బ.. ఆ..గాలి? ఎన్ని మరుగు పడ్డ జ్ఞాపకాల్ని మోసుకొస్తుందో!

"నీ బజ్జీ నాకిచ్చి, నా బజ్జీ నువ్వు కొరుకు..!" నాచేతుల్లోంచి బజ్జీ లాక్కుంది ఉమ.

"ఎందుకే?" అడిగాను నేనూ గుసగుసగానే.

"ఇక్కడ ముద్దు పెట్టుకోలేముగా...!" ఇంకా గుసగుసగా అంది.

"అలాగే మహారాణీ!" బజ్జీలు ఎక్స్ఛేంజి అయ్యాయి.

"అబ్బ...... భలేవుందిరా...!" వీపుమీద చరిచి నా బజ్జీ మొత్తం తినేసింది.

ఇప్పుడు ఆలోచిస్తే తెలుస్తోంది.మనిషి ఊహలోని అందమే నిజమైన అందం. ఎందుకూ, ఓ తోటకి వెళ్ళి చూడండి.... బాగుంటుంది. అదే తోటని 'ఫోటో' తీయ్యండి, అద్భుతంగా వుంటుంది.

అంటే మనకళ్ళకి కనపడని సుక్ష్మాతి సూక్ష్మమైన అందాల్ని 'కెమేరా లెన్స్' పట్టుకోగలదన్నమాట.

అలాగే 'ఊహ' అనేది అద్భుతం. లేకపోతే. ఓ మాములు మిర్చి బజ్జీ 'భలే'గా వుంది అని ఎందుకనిపిస్తుందీ!

చినుకులు ఉధృతమైనాయి. అబ్బ... వర్షరాణి నృత్యం చూసి తీరాలి. భగవంతుడు ఎంతగొప్పవాడు.!!

అప్పుడే పుట్టి పెరుగుతున్న ఆకుల్నీ వాటి రంగునీ గమనించండి. కొత్త దుస్తులకోసం పాత దుస్తుల్ని తీసేసినట్టుగా, కొత్త ఆకుల చీర కోసం పాత ఆకుల మాసిన చీరని ప్రతి వృక్షమూ ఎలా వదిలేస్తుందో చూడండి. గుంపులు గుంపులుగా పండుటాకులు రాలిపోతై. ఇహ చలికాలం... చెట్లు మోళ్ళై పోతాయి. మళ్ళీ వాటి దగ్గరికి వెళ్ళి వాటిని 'కౌగలించుకుంటే' మాత్రం భలే వెచ్చదనం. ఎండా కాలపు వెండి మబ్బుల సౌందర్యం ఒకటైతే, వానకాలపు నీలి మబ్బుల సౌందర్యం మరోకటి.

చల్లని ఎండాకాలపు వెన్నెల ఒకలాంటిదైతే, చలికాలంలో ముద్దలు ముద్దలుగా గాఢంగా నెమ్మదిగా నేలకి జారే వెన్నెల సౌందర్యం మరో లాంటిది.

ఏ 'రుతువు' అందం ఆ రుతువుదే. అసలు 'రుతువు'లు అనే అందమైన పక్షులు తమరెక్కలల్లారుస్తూ నేలమీద వాలటం, మళ్ళీ రెక్కలు విప్పుకుని ఎగిరి పోవడం చూడడం కంటే అద్భుత దృశ్యం సృష్టిలో ఇంకేముంటుందీ? మనిషికి 'నాలుగు' అవస్థలు. ప్రకృతికి ఆరు 'రుతువులు'. మరి మనసుకీ?

అది నిత్యనూతనం...!

నా మనసు పొరల్లోంచి 'కిషోర్' గొంతువినిపిస్తోంది......మంద్రంగా... లయబద్ధంగా శృతిపక్వంగా...." కోయి లౌటాదేమెరే బీతే హుయేదిన్" అని (అయ్యా..., ఎవరైనా గడిచిపోయిన అమృతపు గుళికల్లాంటి నా గతపు రోజుల్ని తిరిగి తీసుకొచ్చి నాకు ఇవ్వగలరా?)

మరోకవి అంటారూ- "దిన్‌జో పఖేరూ హోతే పింజ్‌డేమే మైరఖ్‌లేతా...!"(అంటే, రోజులు గనక పక్షులైతే వాటిని హృదయ పంజరంలో దాచి వుంచుతాడట... కన్నీటి ముత్యాల్ని వాటికి తినిపిస్తూ...! వహ్)

ఇద్దరం బజ్జీలు తినేసి శివాలయం వైపుకి పరిగెత్తాము. లంగా జాకెట్‌లో తనూ, నిక్కరు షర్టులో నేను. బుజ్జి లంగా జాకెట్టు తెలుపువే, అంచులు మాత్రం ఎరుపు. ఆ అంచుల మీద బంగారపురంగు జరీ హంసలు.

నా నిక్కర్ కొంచెం చిరిగి ఉంది. షర్టుకి రెండు గుండీలు మిస్సింగు. అయితేనేం_ తేడాలు తెలియని వయసది.

రోడ్డంతా నీరుపారుతోంది. ఇద్దరికీ చెప్పుల్లేవు. ఏ రాయో నా కాలికి గుద్దుకుంది. ఆ ఎదురు దెబ్బకి ఢమాల్న కిందపడ్డాను.

'అమ్మా' అంటూ అరిచింది ఉమ. దెబ్బ నాది. 'అరుపు' తనదీ. రెండు చేతుల్తో నా భుజాలు పట్టుకుని లేవదీస్తూ మళ్ళీ 'అమ్మా' అని అరిచింది. తను చూసే వైపు చూశాను. నా బొటన వేలు చితికిపోయి ధారగా రక్తం కారుతోంది. ఆ రక్తం నీళ్ళలో కలిసి.... ఎర్రగా... ఓహ్....

కుంటుకుంటూ నేను... పరిగెత్తలేక.

పరిగెత్తగలిగినా నా కోసం వర్షంలో తడుస్తూ నాతోనే మెల్లగా అడుగులు వేస్తూ నన్ను నడిపిస్తూ తను....

వీధి దీపాలు లేవు.... చీకట్లు ముసురుకుంటున్నాయి. రోడ్డు మీద మనుషుల అలికిడే లేదు.

పోస్టాఫీసు అరుగు మీద కూర్చున్నాం. ఉన్నట్టుండి నాతలని తన గుండెకి గట్టిగా అదుముకొని, "తగ్గిపోతుందిరా! సరేనా! నెప్పి తగ్గిపోతుందిరా!" అంటు నా తల మీద ముద్దు పెట్టింది.

ఇదేమిటీ ఇన్నేళ్ళయినా ఇప్పుడు నా కంట్లోంచి వెచ్చని కన్నీరు జారుతోంది? గతంలో బతకడం అంటే ఇదేనా?

ఆ మధ్య దివికేగిన P.B.S గారు, అనగా ప్రతివాద భయంకర శ్రీనివాస్‌గారు వారి 81వ పుట్టినరోజున మా ఇంటికి వచ్చారు. వారి 'ఇంటర్వ్యూ' నేను తీసుకోవడం జరిగింది. మ్యూజికాలజిస్ట్ రాజాగారు సూత్రధారి. ఆ సమయంలో ఒక గొప్ప ప్రశ్న వేశారు. P.B.S. "సరస్వతి చేతిలోని 'వీణ' గొప్పదా? శ్రీకృష్ణుని చేతిలోని 'మురళి' గొప్పదా?" అని. సమాధానం 'మీరేమిస్తారో' వ్రాయండి. అన్నట్టు ఆయన 8 భాషల్లో పండితుడు. 'శబాష్ కోకానాడీ' అనే పేరుతో కొన్ని వేల ఉర్దూ కవితలూ, గజల్సు రాశారు.

ఓ విషయంతెలుసా? రెండు లక్షల ఏభైవేలకి పై చిలుకు ఆయన కవితలూ పాటలూ, వచన కవితలూ, ఉపన్యాసాలూ, వ్యక్తులకు అంకితమిచ్చే పంచరత్నాలు లాంటివి రాశారు. అక్షరాలా (ఇప్పుడు సంఖ్యాపరంగా) 2,50,000/- పైగా వ్రాసిన ఏకైక సినీ గాయకుడు/కవి ఆయనొక్కరే.

ఏ దివిలో వెలిసిన పారిజాతమో ఒరిజినల్ కన్నడ పాట పాడింది ఆయనే. తెలుగులో ఆ పాట బాలూ గారికి చాలా గొప్ప పేరుతెచ్చింది.

మరో విచిత్రం ఏమంటే తల్లి పోయిన దుఃఖాన్ని కడుపులో దాచుకుని 'రవివర్మకు అందని ఒకే ఒక అందానివో' లాంటి అద్భుతమైన పాట పాడిన తరువాతే ఆయన తల్లి మృతదేహాన్ని చూడ్డానికి వెళ్ళారు. కమిట్‌మెంట్ అంటే అదీ!

ఇదంతా ఎందుకంటే ఆయనో 'పయనించే' గ్రంధాలయం. కారునిండా పుస్తకాలే. చంకలో బిడ్డ వున్నట్టు 'ఇంత బొత్తు' పుస్తకాలుంటేనేగానే ఆయన సభలోకి అడుగుపెట్టరు.

'కలాలు' అంటే పెన్నులు ఎక్కువ ఎవరిదగ్గరుంటాయీ అన్న ప్రశ్న వెయ్యంగానే గుర్తు కొచ్చేది గాయనీమణి S.జానకిగారు. అబ్బ... ఎన్ని పెన్నులుంటాయో...! అలాగే P.B.S గారు. రకరకాల పెన్నులు, అనేక సైజులు రంగులలో వారి దగ్గరుండేవి.

ఇద్దరూ ఇన్ని 'కలాల్ని' ఎందుకు పెట్టుకున్నారనే ప్రశ్న ఉదయిస్తే.... జవాబు చెప్పడం తేలికే!

ఇద్దరూ 'కాలాన్ని' శాశించారూ, శ్వాసించారూ. ' దివి' ఆయనికి కొత్త కాదుగా!

జానకిగారు హైదరాబాద్ తరలి వెళ్ళాక మద్రాసులో మా గుండెలు బరువెక్కాయి. ఆమె 'గాయని' కాదు... స్వరగాయత్రి.

గాయని చిత్ర 'జానకి' గారి పేరుచెబితేచాలు.... "జానకి అమ్మ అంటే 'మళయాళీ to మళయాళీస్' అంటుంది. అంటే మళయాళీలకి మళయాళీ... అంత చక్కని డిక్షన్ జానకిగారిది. స్వచ్ఛమైన మళయాళం, స్వచ్ఛ తమిళం పలకటంలో ఆమెకి ఆమే సాటి.

లోకానికి తెలియని ఓ విషయంచెప్పనా? 'శ్రీహరి కోట' నించి ఒకేసారి మా ఇద్దరికీ ఇన్విటేషన్స్ వచ్చాయి. అయితే మేము ముఖ్య అతిధులుగా ప్రసంగించే వేదికలు వేరు. అందరం సాయంత్రం టిఫెన్‌కి శ్రీహరికోట రాకెట్‌కేంద్రం 'మెస్'లో కలిశాము. జానకిగారి భర్త

(ఫన్ మాస్టర్ చంద్రశేఖర్‌గారి అబ్బాయి) రాముగారి హడావిడి అంతా ఇంతా కాదు. జానకిగారి ఫేమిలీ మొత్తం 2 కార్లలో వస్తే మేం 'పినాకినీ' ట్రైన్‌లో వెళ్ళాం (Aug-15, 2013 - పండుగకి)

రాముగారు 'వడ్డన' వాళ్ళు వున్నా, అందరికీ కోసం కొసరి ఆయన వడ్డించారు. చాలా లవ్‌లీ పర్సన్.

మళ్ళీ రాత్రి డిన్నర్‌కి కలుద్దామని విడిపోయాం. మా సభలు అయ్యాక రాత్రి డిన్నర్ టైమ్‌లో మెస్‌లో కలిశాం.

"భువనచంద్రగారూ, మనం తింటూన్న మెస్సో, కూర్చున్న కుర్చీయో మనకి వండిపెడుతున్న వంట వాళ్ళో మామూలు వాళ్ళు కాదండీ,.. రాష్ట్రపతి, ప్రధాని లాంటి VVVIPలకి వండి వడ్డించే చోటు ఇది. అఫ్‌కోర్స్ మీరూ జానకీ ఇద్దరు 'దండలు' వేయించుకున్న సెలిబ్రిటీలే కదా! మీకు మామూలేనేమో!" అంటూ సరదాగా చెప్పారు. నా ఛాతీ వినయంతో ఉప్పొంగి పోయింది. ఒక సామాన్య సైనికునికి (నాకు)ఇటువంటి గౌరవం లభించడం పూర్వజన్మ సుకృతంకాదా!

మరుసటిరోజున PSLV లాంచింగ్ పాడ్ చూశాం. అప్పుడు రాముగారు అన్నారు, "భువన్, నీది ఉక్కు గుండెయ్యా!" అని. మళ్ళీ మధ్యాహ్నం లంచ్‌లో(అగస్టు 16 మధ్యహ్నం ) మళ్ళీ సుతి మెత్తగా వేడివేడి గారెల్ని మాకందరికీ రాముగారు కొసరి కొసరి వడ్డించారు. మేం మధ్యాహ్నం అంటే ఆల్మోస్ట్ సాయంత్రం సుళ్ళూరుపేటనించి మద్రాస్ పినాకినీలో బయల్దేరి వచ్చేశాం. జానకిగారు రాముగారు వాళ్ళు ఏవో దేవాలయాలు చూసుకుని వస్తామన్నారు. కార్లుగదా... ఎప్పుడు బయల్దేరినా ఓ.కే. నేగా! రాత్రికి వచ్చేశారట,

మరుసటిరోజు (ఆగస్టు 17) ఉదయం ఆరున్నరకల్లా జానకి రాముగార్ల అబ్బాయి మురళీ ఫోన్‌చేసి "అంకుల్ రాత్రి నాన్న మనల్ని వదిలి వెళ్ళిపోయారు!" అని ఏడుస్తూ అన్నాడు.

ఆగస్టు 17 నా పుట్టినరోజు. ఇంకేం పుట్టినరోజు అయ్యో అంత పెద్ద 'బొట్టు' తో వుండే జానకమ్మని చూసి బతగలమా...? అసలు చూడగలమా...? అభిరాంపురంలోని వారి ఇంటికి వెళ్ళాను. రాముగారు నిశ్చలంగా వున్నారు... అన్నీ దండలే, "చూడు నాయనా,.. మనకి దండలు ఎక్కడి కెళ్ళినా వేస్తారనీ, మిగతా వాళ్ళకి వెయ్యరనీ నిన్ననేగా అన్నదీ ఆయనా-- ఇప్పుడు చూడు ఎన్ని దండలు వేసుకున్నారో" నన్ను చూస్తునే అన్నారు జానకిగారు. ఆవిడ గుండెల్లోనే కాదు, కళ్ళల్లోనూ కన్నీటి సముద్రాలు... జవాబు ఏం చెప్పనూ?

జానకమ్మ నవ్వితే 'పసిబిడ్డ' నవ్వినట్లుంటుంది. నిజంగా చెబితే ఒక పాట పాడినందుకు ఎంత 'రెమ్యునరేషన్' ఇస్తారో కూడా ఆమెకి తెలీదు. అన్నీ రాముగారే చూసుకునేవారు. భగవంతుడా ఆయనే వెళ్ళిపోతే? ఆ తరువాత నేను 'పుట్టిన' రోజుల్ని జరుపుకోలేదు. ఎందుకూ? దానంత 'వ్యర్థం' ఇంకోటి వుందా!

ఇదంతా ఎందుకనిగదూ? ఓ పక్క ఆకాశం వర్షించే వర్షం. మరో పక్క నాకళ్ళల్లోంచి కన్నీటి వర్షం!! నా కన్నీరు ఉమా జ్ఞాపకాలతో.... మరి ఆకాశపు కన్నీరూ?

"పైన వెళ్ళి పోయిన వారు కింద నున్న వారి కోసం కార్చే కన్నీళ్ళా?" ఏమో..!

తెల్లవారు ఝాము నాలుగయింది. బ్రహ్మముహూర్తం. వర్షం కురుస్తూనే వుంది. అప్పటి దాకా లేని కప్పలు వర్షం మొదలు కాగానే ఎక్కడినించి పుట్టుకొస్తాయో!. ఓ రెండుగంటలు వర్షం కురిశాక ఎందుకు గొంతు చించుకుని అరుస్తాయో. ప్రకృతి రహస్యాలు నాకేం తెలుసూ?

"కురూ...కురూ..." అని వర్షాన్ని వేడుకుంటూన్న కప్పల 'ఆలాపన'లు వినిపిస్తున్నాయి. కప్పల్లోనూ 'కులా'లున్నాయనేది ఉమ బ్రాహ్మణ కప్పలు 'ముదపప్.... ముదపప్.' అంటే వైశ్య కప్పలు 'బేరం...బేరం' అని అరుస్తాయట. క్షత్రియ కప్పలు 'రగతం... రగతం.' అని అరిస్తే స్వర్ణకార కప్పలు 'గో...ల్డ్..... గో.......ల్డ్' అని అరుస్తాయట. చిత్రంగా కప్పల అరుపులు వింటే అలాగే అనిపించేవి. తెల్లవార్లూ

మెలుకువలో వుండటం వల్ల శరీరమూ మనస్సు కూడా అలిసిపోయాయి. ఓ బుల్లి సిమెంటు దిమ్మ వుంది.. దానిమీదపడుకుంటే?

కళ్ళు మూతలు పడుతున్నాయి. ఎంత 'విప్పు' కోవటానికే ప్రయత్నించినా.... ఓ పక్క చలి. అప్పుడు తెలిసింది..... నేను చొక్కా తొడుక్కోలేదని.

ఉమ వాళ్ళ నాన్నగారు వూరు వెళ్ళినప్పుడు అయన్ని పంపించి, ఉమ, "ఒరేయ్... నీచొక్కా ఒకటి ఇవ్వరా... ఇవాళ రాత్రికి అది తొడుక్కుని పడుకుంటాను.! నాకు భయం వుండదు!" అన్నది... అప్పుడు...!

కళ్ళు మూసుకుని 'ఉమ' ఓణీని దుప్పటిగా మనసులో ఊహించి, అది నేను కప్పుకున్నట్టుగా భావించి పడుకున్నాను. అబ్బ... ఎంత వెచ్చదనం... ఆ వెచ్చదనంతో పాటు 'తన' పరిమళం...! ఓహ్....

**మా వేపచెట్టుకి 'నిత్యసీమంతిని'** అని పేరు పెట్టాను. దాని దగ్గరికి వెళ్ళి కొమ్మల్ని ప్రేమతో తాకుతూ 'సీమంతీ.. ఎట్లావున్నావే బంగారం!?' అని పలకరిస్తా. ఆ చెట్టు ఆనందిస్తుంది. నాకు తెలుసు. మనం మనుషులం గనక లక్షాతొంభై భాషల్ని కనిపెట్టాం. సృష్టిలో మిగతా వాటికి భాషలేదా? పశువులూ పక్షులూ క్రిమికీటకాలూ అరుస్తాయి. మరి చెట్లు? వాటిది స్వచ్ఛమైన భగవంతుడి భాష. అంటే 'మౌనం' భగవంతుడి మరో భాష సంగీతం.



మా 'నితంబ' వృక్షం మూడొందల అరవై రోజులూ పువ్వుల్తో కాయల్తో పళ్ళతో ఉంటుంది. నమ్మరు కదూ? అందుకే ఫోటో తీసి మరీ పంపుతున్నాను.. ఆ వృక్షమాత ఆకుల్లో 'మొహం' దాచుకుంటే తల్లిగుండెల్లో పసిబిడ్డ మొహం దాచుకున్నట్టుంటుది. నా ఇంకో హై డౌట్ 'మల్లెగూడు'. ఈ మల్లెదండని ఎండాకాలంలో వాడతా. పచ్చని కొబ్బరాకులు పైన వేసి, కింద ఓ చాపవేసి హాయిగా మల్లెపూలవాసన ఆస్వాదిస్తూ కూర్చుంటా. ఒక్కోసారి అక్కడే గోడకి ఆనుకునో పడుకునో నిద్దరపోతా. ఓసారి పచ్చని 'పసరిక' పాము దర్శనమిచ్చింది.... అకస్మాత్తుగా! భలే సరదా వేసింది. అయితే వాటి దారి వాటిదీ.... మన దారి మనదీ.

అసలు ఓ పాము జరజరా పాక్కుంటూ వెళ్తుంటే చూడ్డానికి ఎంతబాగుంటుంది! నేను 'ఎడారుల్లో' ఉద్యోగం చేసినప్పుడు, పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో ఇసుక మీద పాములు పాక్కుంటూ పోవడం ఎన్ని వందలసార్లు చూశానో. అబ్బ ఇంకా ఇంకా చూడాలని వాటి వెనకపడి తిరిగేవాడిని. అయితే అప్పుడు 'కెమేరా' కొనే 'స్తోమత' లేదు. బహుశా ఉండి ఉంటే ఎన్ని చక్కని, తిరిగిరాని దృశ్యాలు మీ ముందుండెవో!

సరే..సరే..

"ఒరేయ్.. కాళ్ళు కాలుతున్నాయిరా!" ఉమ కళ్ళల్లో కన్నీరు. చంకలో చెప్పులు.

"చెప్పులు తొడుక్కోవే.. ఉన్నాయిగా..?" నేను.

"ఉహూఁ.... నీకు చెప్పుల్లేవుగా.. అందుకే నేనూ వేసుకోను!" పట్టుదల.

తార్రోడ్డు మీద 'ఎండమావుల్లాగా' సెగలు.

రోడ్డు పక్కన ఏ పచ్చిక మీదో ఓ 'పేడకడి' ఉంటుంది.

గబగబా పరిగెత్తి.. రెండు కాళ్ళతోటీ దాన్ని తొక్కి "ఇప్పుడు ఫరవాలేదే. ఇక ఎంతసేపు రోడ్డుమీద నడిచినా కాళ్ళు కాలవు. నువ్వు చెప్పులు వేసుకో" అనేవాడ్ని -

ఉమ కూడా గబగబా పేడని తొక్కి "ఇప్పుడు నాకూ కాలవులే.. పద.. పోదాం" అనేది.

**"ఋతువులు మారేనోయ్.. భయ్యా.. రంగులు మారేనోయ్**
**ఎండలు పోయీ వానలు వస్తే, వానలు పోయీ చలిపులివొస్తే**
**చలిలో ఒణికి సర్వం మరిచీ, దుప్పట్లో నిదురిస్తూ ఉంటే**
**కలలే వచ్చేనోయ్ - కన్నుల - తలుపులు తెరిచేనోయ్"**

మర్రిచెట్టుకింద కూర్చుని నాకు తోచిన పదాల్ని 'పాటలా కట్టి' పాడుతున్నా నా వెన్క కూర్చున్న 'ఉమ' నా భుజం మీద గడ్డం ఆనించి, "ఎంత బాగుందిరా..! భలే పాట కట్టావే.. మళ్ళీ పాడు!" అన్నది.

"ఏదో పిచ్చి పాటే!" సిగ్గుపడ్డాను. నాకప్పుడు పదకొండేళ్ళేమో.

"లేదురా నిజంగా బావుంది.. మళ్ళీ పాడు..!" నా చెవి అంచుని పెదాల్తో బిగించింది. ఆమె నోటి వెచ్చదనం నా చెవికి తెలుస్తోంది. ఉన్నట్టుండి నా వీపుమీద వాలి తన రెండు చేతుల్తో నా మెడని వాటేసుకుంది.

ఆమె ఒంట్లోంచి ఓ వెచ్చదనం... నా వీపులోకి ప్రవహిస్తోంది. ఓ చెప్పలేని మైకం. గభాల్న విదిలించుకుని లేచాను.

"ఏం?" అన్నది. బుగ్గల్లో ఎరుపు.. పెదాలపైన ఓ చిన్న చిరునవ్వు.

"ఏమో..!" నిజంగా ఎందుకు లేచానో నాకూ తెలీదు. తను లేచి నా చెయ్యిపట్టుకుని మర్రి చెట్టు మొదట్లోకి తీసుకెళ్ళింది. కూర్చోబెట్టి కూర్చుంది. నేను 'కాండాన్ని' ఆనుకుని వాలుగా కూర్చుంటే, తను నామీదకి పూర్తిగా వాలి, "ఒరేయ్.. ఇప్పటికే మగపిల్లలతో మాట్లాడకూడదని ఇంట్లో తిడుతున్నారా.. మరి.." ఆగింది.

"ఏంటి?" అడిగా.

"ఏమీలేదులే! ఉత్తినే అన్నాను" మాట మార్చింది.

"చెప్పవా?"

"చెప్పినా నీకు తెలీదు!"

"చెబితేగదా తెలుస్తుందో లేదో తెలిసేదీ?"

"ఏం లేదు. నేను 'పెద్దమనిషి'నైతే నిన్ను ఇలా కలవటం కుదరదు. అసలు మాట్లాడనిస్తారో లేదో కూడా!" దాని మొహంలో బాధ.

"పెద్దమనిషి అంటే?" అయోమయంగా అన్నా.

"నీకు తెలియదన్నానా?" బాధలోనే ఓ చిరునవ్వు.

"పోనీ పెద్దమనిషివి కాకు..! ఇలాగే ఉందాం!" తెలిగ్గా అన్నాను. ఫక్కున నవ్వాను. వేపచెట్టుమీద కువకువలాడుతున్న పావురాలూ, అయిదారు చిలకలూ కలగాపులగంగా అరిచాయి.

" 'ఏందోయ్.. ఎందుకూ నవ్వావు?' అని అడుగుతున్నాయా అవి నన్ను" అనిపించింది.

ఆరోజుల్లో ఎంత అమాయకత్వం.. ఏమీ తెలియని తనంలో ఎంత 'దైవత్వం' ఉందీ, ఎంత స్వచ్ఛత ఉందీ.

"నువ్వెట్టా బతుకుతావుతా పిచ్చోడా!" గభాల్న నన్ను కావలించుకుని నా కాళ్ళమీదా తలమీదా నుదుటి మీదా ముద్దుపెట్టింది ఉమ.

అబ్బ..! ఎంత 'దగ్గరితనం ఉందో.. ఆ స్పర్శలో!.. ఆ ముద్దులో!

టెర్రస్ మీద నడుస్తున్నా. రెండు రోజుల వర్షానికే 'పాకుడు' పట్టింది. ఆకుపచ్చగా.. ఎంత అందంగా ఉందో. అసలు సృష్టిలో అందం కానిది ఏదీ? అర్థం కానిదీ అర్థం లేనిదీ ఉండొచ్చేమోగానీ 'అందం' కానిదీ 'అందం' లేనిదీ ఏదీలేదు. స్వామీజీ చిన్నతనంలో చెప్పినట్టు, "దృష్టిలో మార్పేగానీ సృష్టిలో మార్పు ఉండదు" దానికో ఉదాహరణ కూడా ఇచ్చారు.

పదిమంది. ఓ అడవికి వెళ్ళారు. సరదాగా 'వనవిహారం' చేద్దామని. ఓ మూడొందల అడుగుల ఎత్తున్న 'టేకుచెట్టు' వాళ్ళకి కనిపించింది. ఒకడు, "ఆహా.. చదరపు అడుగు వెయ్యిరూపాయలకి అమ్మితే లక్షాధికారినైపోతానుగదా!" అన్నాడు.

ఇంకోడు "ఆకుల్ని కోయించి విస్తళ్ళుగా కుట్టించి అమ్మితే, చెట్టు చెట్టుగానూ ఉంటుంది, బోలెడంత మందికి ఉపాధీ దొరుకుతుందీ, ధనమూ వస్తుంది కదా!" అన్నాడు.

ఇంకోడు, "ఆహా.. మన ఊరి శివాలయానికి ధ్వజస్థంభం లేదుగదా.. దీన్ని గనక ధ్వజస్థంభంగా ప్రతిష్టిస్తే తరతరాలూ ఈ చెట్టు భక్తుల పూజలందుకుంటుందిగదా!" అనుకున్నాడు.

మరొకడు "అబ్బ ఎంత అద్భుతం దేవుడి సృష్టి.. దీనికి ప్రతి సృష్టి చెయ్యాలి" అనుకుని కాన్వాస్ మీద ఆ చెట్టు ప్రతిరూపాన్ని చిత్రించడం మొదలుపెట్టాడు.

వేరొకడు "ఎంత ధన్యురాలీ చెట్టు.. ఎన్ని పక్షులకి ఆశ్రయమిచ్చిందో ఇస్తోందో..! " అన్నాడు.

ఉన్న చెట్టు ఒక్కటే. కానీ చూసిన పదిమందీ పదిరకాల దృక్కులతో చూశారు. ఎవరి దృష్టి వారిది. అందం కూడా 'కొందరికే' కనిపిస్తుందా? "ఎందుకె రాధా ఈసునసూయలు అందము అందరి ఆనందమెలే" అన్నారుగదా కవిగారు. ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ జాయ్ ఫరెవర్ అని పశ్చిమం అంటే, 'అందమె ఆనందం.. ఆనందమె జీవిత మకరందం' అని ప్రాగ్దిశ అన్నది.

'అందం చూడవయా.. ఆనందించవయా' అని ఒకరు నృత్యం చేస్తూ వగలు పోతే "అందమా అందుమా.. అందకుంటె న్యాయమా?" అని మరొకరు చిన్నగా నిలదీశారు.

ఇంతకీ దేనిగురించి? ఆ..! ఏమీ తెలీక పోవడం కూడా ఓ అందమే. మళ్ళీ ఉమ గుర్తుకు రాగానే ఆ స్పర్శలోని, ముద్దుల్లోని 'దగ్గరితనం' మళ్ళీ మనసుని స్పృశించింది. ఒక్కసారి శరీరంలోకి 'బాల్యం' ప్రవేశించింది. ఆ పచ్చని మర్రిచెట్టు కింద ఎన్ని పచ్చపచ్చని జ్ఞాపకాల పొదరిళ్ళున్నాయో..! ఓహ్....

ఇందాకట్నుంచీ నాకు విసుగ్గా ఉంది.

విసుగుకీ, కోపానికీ, నిరాశకీ నేనెప్పుడూ చోటివ్వను. ఎందుకంటే 'మిల్లీమీటర్' చోటిచ్చినా అవి మనసుని మింగేస్తాయి. నా పరిస్థితి ఎలా ఉందంటే, ఓ సింహం నోట్లోనూ, ఓ పాము నోట్లోనూ ఒకేసారి తలపెట్టినట్టుగా ఉంది.

గంటనుంచీ వాదించుకుంటున్నారు. ఎటూ సమస్య తేలదనీ తెగదనీ తెలిసి కూడా. ఎందుకు తెగుతుంది? వాళ్ళ మధ్య నున్నవి 'అభిప్రాయభేదాలు కాదు'.. 'అహంకారభేదాలు', 'ఫలానా మెమోరియల్ అవార్డు ఫలానా వాళ్ళకే ఇవ్వాల'ని వీళ్ళూ, 'కాదు ఫలానా వాళ్ళకే ఇవ్వాల'ని వాళ్ళూ. వీళ్ళ కారణాలు వీళ్ళు చెబితే వాళ్ళ కారణాలు వాళ్ళు చెబుతున్నారు.

"నేను వస్తాను.. ఏమీ అనుకోకండి ప్లీజ్." లేచాను.

"సార్.. అదేంటీ..మీరు..?" అయోమయంగా నా వంక చూస్తూ అన్నారు ఇద్దరు ముగ్గురు.

"మీరు ఎవరికిచ్చినా నాకు ఆనందమే! అందుకే బయలుదేరాను. కొంచెం పని ఉంది.. వెళ్ళితీరాలి.. ఏమీ అనుకోవద్దేం.!" వినయంగా, అనునయంగా చెప్పి బైటపడ్డాను.

అమ్మయ్య. ఆ వేడెక్కిపోయిన ఏ.సి రూముగాలి కంటే, ఈ చెట్టుని తాకి వచ్చే వేడిగాలి ఎంతచల్లగా ఉందో!

"సార్.. కారు ఇక్కడ ఉంది సార్!" రావుగారి డ్రైవర్ అన్నాడు. అతనే నన్ను తీసుకొచ్చింది.. మా ఇంటినించి.

"లేదు భయ్యా.. కొంచెం పని ఉంది. అది చూసుకుని నేను ఆటోలో వెళ్ళిపోతాలే!" అతనికి నచ్చజెప్పి నడవడం మొదలెట్టాను.

ఆ రోడ్డుమీద అంటే 'ఉస్మాన్' రోడ్డుమీద ఎన్నివేలసార్లు నడిచానో. ఉస్మాన్ రోడ్డు, హబీబుల్లా రోడ్డు, బజుల్లా రోడ్డు, ఆనందన్ వీధి ఇవన్నీ తిరిగినవే. ఎన్ని జ్ఞాపకాలు.

రోడ్డుమీద నడుస్తూ నడుస్తూ ఘంటసాలగారి ఇంటిముందు ఆగిపోయేవాడ్ని. చాలా చాలాకాలం క్రితమే అది కాల సముద్రంలో కలిసిపోయింది. జగదాంబాళ్ వీధిలో కృష్ణశాస్త్రిగారు ఉండేవారు. చలనచిత్రమహామహులందరూ తమతమ పాదముద్రల్ని వదిలిన రోడ్లు అవి.

అక్కడే. సి.యస్.ఆర్‌గారు రోజూ సరదాగా కాసేపు నిలబడి 'మన'వాళ్ళని పలకరించేది..... ఇదిగో ఈ గీతా కేఫ్‌లోనే ఘంటసాలగారు కాఫీ తాగేది... ఇలా అప్పటి విషయాలు 'ఇప్పుడు' చెప్పేవాళ్ళులేరు. ఇప్పుడు అటువైపు వెళ్ళినా, సంతలో తప్పిపోయిన పసివాడిలా అయోమయంగా చుట్టూ చూస్తూ 'విస్తు'పోవడం తప్ప ఏమి గుర్తించగలం? కాలపు 'పూదోటల్ని' కాంక్రీటు మింగేసింది.

"నిన్నుచూడాలనుందిరా..!"

మొట్టమొదటిసారి వాళ్ళ మేనమామల ఊరు వెళ్ళినప్పుడు ఉమ కార్డుమీద రాసిన ఒకే ఒక వాక్యం అది. మహా వుంటే పదకొండేళ్ళు తనకి.

అదే నేను జీవితంలో అందుకున్న మొట్టమొదటి 'లేఖ'.

పోస్ట్‌మేన్ నా చేతికే ఇచ్చాడు. దాన్ని చదివి మర్రిచెట్టు కిందకి వెళ్ళి మర్రిమాను మొదట్లో కూర్చున్నా. జవాబు రాయాలన్నా అడ్రస్ లేదు. ఒకవేళ ఉన్నా ఎలా ఉత్తరం వ్రాయాలో తెలీదుగా. అదీగాక 'డబ్బు'? ఉమ అక్షరాలు వెన్నెల పువ్వుల్లా అందంగా ఉంటాయి... దాని పలువరుసలాగే చక్కగా అందంగా ఉంటాయి. ఆ ఉత్తరం చదివాక బెంగగా అనిపించింది. చెట్టుకి వీపు ఆన్చి 'వచ్చెయ్‌వే ...నాకు ఒక్కడికీ ఇక్కడ బాగోలేదు.' అని మనసులోనే వందసార్లు అనుకున్నాను. అనుకున్నా బెంగతీరలా.

ఎంత బెంగగా అనిపించిందంటే, ఆ వృక్షాన్ని ఆనుకునే అమాయకంగా నిద్రపోయాను.

"మీరేమిటీ ఇక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు రమణమూర్తి. పద్మనాభంగారి అల్లుడు. "ఏం లేదు... చాలారోజులయిందిగదా... తిరుగుతున్నాను..!"

నవ్వాను. అతను చాలామంచివాడు. ఓసారి ఎం.ఎస్ మూర్తిగారూ, గొల్లపూడి మారుతీరావుగారూ, వారి శ్రీమతి శివానీ, రమణమూర్తీ, నేనూ అందరం ఒక పేద్ద 'ఇనోవా'లో చెన్నై నుంచి తెనాలీ, అమరావతీ, గుంటూరూ, అంతేగాక 'కపోతేశ్వరాలయం' ఇవన్నీ తిరిగాము. తిరిగి వచ్చేప్పుడు బ్రహ్మాండమైన భోజనాన్ని ఇంటినుంచి తెప్పించి మేదరమెట్ల దగ్గరున్న ఓ గెస్ట్‌హౌస్‌లో మాకు ప్రేమగా వడ్డించింది రమణమూర్తే.

"ఓహో.. అలాగా!" ఆయన వెళ్ళారు. ఎవర్నీ ఎప్పుడూ ఇబ్బంది పెట్టని మనస్తత్వం రమణమూర్తిది.

ఆయన వెళ్ళినా 'పద్మనాభం'గారు మనసులో ఉండిపోయారు. ఎంత మంచిమనిషి. "సార్ మళ్ళీ దేవతలాంటి సినిమా ఎప్పుడు తీస్తారూ?" అని ఎవరడిగినా..., "దేవుడు కరుణించినపుడు నాయనా!" అనేవారు. నటుడూ, నిర్మాతా, దర్శకుడూ, గాయకుడూ అయినా ఏనాడూ 'అహాన్ని' ప్రదర్శించని మహామనిషి పద్మనాభంగారు.

"ఎందుకిలా జరిగింది సార్?" అని ఆయన్ని అడిగితే, ఫక్కున నవ్వి,

"ప్రాప్తం బాబూ.. ప్రాప్తం.. ఏది ఎప్పుడు రావాలో, ఏది ఎప్పుడు పోవాలో అన్నీ పైవాడి చేతుల్లో - చేతల్లో ఉంటాయి గానీ మనదగ్గర కాదుగా!" అనేవారు.

మా ఇంటికి ఒకసారి ఆయన్ని 'తెచ్చు'కోగలిగాను. ఒక తరం కాలగర్భంలోకి తరలిపోయింది. మిగిలిందెవరూ? ఆఖరికి అనార్కలీ సలీమ్ (లేక) సువర్ణసుందరి - జయంతులతో సహా..!

తరలి వెళ్ళే ప్రతిజీవీ చెబుతూనే ఉంది.. "చూడండి!.. మాలాగా మీరూ ఈ సుందరమైన లోకాన్ని విడిచి వెళ్ళిపోవాలి. ఇదిగో, ఇలా ఖాళీచేతుల్తోనే! అందుకే అనవసరంగా 'పోగు' చేసుకోవటం కోసం అమూల్యమైన 'జీవితాన్ని' వెచ్చించకండి. హాయిగా ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రకృతిలో ప్రకృతిగా కలిసిపొండి.." అని. వింటామా? ఉహూఁ....! ఇంకా ఇంకా సంపాయించాలి.. ఇంకా ఏదో మూటగట్టాలి.

ఏమూటా మిగిలేదీ? ఒక్క జ్ఞాపకాల మూట తప్ప!

ఎవరూ నిన్ననుసరించేదీ? నీ జ్ఞాపకాలనీడలు తప్ప!

"ఒరేయ్.. ఇవాళ నీకు పెళ్ళితప్పుడు..! ఎవర్ని చేసుకుంటావూ? 'చింతా' వారి అమ్మాయి నా 'పేకా'వారి అమ్మాయినా? " నవ్వుతూ అడిగారు ఆంజనేయులు మాస్టారు.. మేం ఫస్టుఫాంలో ఉండగా.

"నేను ఉమని పెళ్ళిచేసుకుంటా మాస్టారూ!" ఉత్సాహంగా అన్నాను.

"అడ్డగాడిదా. ఫస్టుఫాంకే పెళ్ళి కావల్సి వచ్చిందంట్రా?" పేకబెత్తం టేబులు కింద నుంచి తీసి నా వీపుమీద చెడబాదుతూ రెట్టించాడాయన. ఆడపిల్లలు చూస్తున్నారన్న 'ధ్యాస' ఏముంటుందీ ఆ వయసులో. గట్టిగా ఏడుస్తూ దెబ్బలుతిన్నాను. ఉమ బెంచీమీద నుంచి లేచి బయటికి వెళ్ళిపోయింది, పుస్తకాలు అక్కడే వదిలేసి, మాస్టారు పిలుస్తున్నా వినిపించుకోకుండా.

మధ్యాహ్నం స్కూలు ఎగ్గొట్టి తిరిగినా ఎక్కడా ఉమ కనిపించలేదు. వాళ్ళింటికి వెళ్ళి అడిగితే, "పొద్దున్న స్కూలు కెళ్ళిందిగా.. స్కూల్లోనే ఉంటుంది ఇంతకీ నువ్వేమిటీ? స్కూలు ఎగ్గొట్టావా?" వెటకారంగా అన్నది వాళ్ళ వంటమనిషి. ఆవిడ ఇంట్లోనే ఉండి వంటచేసి పెడుతూ ఉంది.

ఆవిడ్ని తన్నాలనిపించింది. అయినా ఏం మాట్లాడకుండా ఆంజనేయస్వామి గుడి దగ్గరకెళ్ళి కూర్చున్నా. ఆ గుడిని అడివి ఆంజనేయస్వామి గుడి అంటారు. ఊరి బయట ఊరికి దూరంగా ఉంటుంది. ఓ పాడుబడిన బావి ఉంది. ఓ సగం కూలిన ఇల్లు (ఒంటిగది) లాంటిది ఉంది. బైరాగులెవరన్నా అప్పుడప్పుడు అక్కడ కనిపిస్తారు. అదీ ఎప్పుడో.

వెల్లకిలా పడుకోలేను.... వీపంతా నెప్పి... వాతలేమన్నా పడ్డాయేమో! ఓ పక్క ఆకలి.. ఓ పక్క ఎండ.. ఓ పక్క ఉమ ఏమయిందా అన్న బాధ, మరో పక్క ఏదో తెలీని ఎందుకో తెలీని అలజడి.

(ఇవన్నీ అపుడున్నాయని 'ఇప్పటి మనసు' విశ్లేషిస్తోంది గానీ అప్పుడు ఏమీ తెలీదుగా. ఇప్పుడైనా, మనసుపొరల్లో అవన్నీ సజీవంగా ఉన్నాయిగనకే మనసూ విశ్లేషించగలుగుతోంది)

బోర్లా పడుకున్నా.. ఓ చెయ్యి నామీద వాలగానే 'అబ్బ' అంటూ మూలిగా. కళ్ళు తెరిస్తే చీకటి పడుతోంది.

"దెబ్బలు బాగా తగిలాయా.! అయ్యో" మెల్లగా నా చొక్కాని జాగ్రత్తగా పైకి లాగింది ఉమ.

"అయ్యో.. వీపంతా వాతలేరా!" దాని గొంతులో దుఃఖం, దాని వెచ్చని కన్నీటి చుక్కలు నా వీపుమీద పడ్డాయి.

రెండు చేతుల్తోటీ దాని నడుముని చుట్టేసి మొహాన్ని దాచుకున్నా. నా భుజం మీదుగా జారుతూ గాయాల మీదుగా ప్రవహిస్తున్నాయి దాని వెచ్చని కన్నీళ్ళు..

"ఎన్నడా? చావాలనుందా..!" తమిళంలో అరిచాడు ఆటో డ్రైవర్. ఒక్కసారిగా ఇహలోకంలో పడ్డాను. నడిరోడ్డుమీద ఉన్నాను. వాడు బ్రేకులు వేశాడు గనక ఓ.కే. లేకపోతే!

"సారీ.!" అన్నాను.

"చదువుకున్న వారిలా ఉన్నారు. జాగ్రత్తగా వెళ్ళండి" అతనూ కాస్త సిగ్గుపడి మర్యాదనిస్తూ అన్నాడు.

**అదేచోటు.. ఫుట్ పాత్ మీద..** అవతలి పక్కన స్టాండర్డ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ దానిని ఆనుకునే అప్పటి నాట్యాచార్యులు వెంపటి చిన సత్యంగారి కూచిపూడి అకాడెమీకి ఎందరెందరో వచ్చేవారు. నాట్యంలో నిష్ణాతులు. నాట్యం నేర్చుకోవడానికి వచ్చే ఔత్సాహికులూ.. ఫుట్‌పాత్‌ని నీడలో ముంచే నిద్రగన్నెరు చెట్లూ, వేపచెట్లూ.

ఆ ఫుట్‌పాత్ మీదే నాలుగు కుర్చీలు ముందర వేసుకుని, ఓ యాభై అరవై పుస్తకాలు (అన్నిరకాల సబ్జక్టులవీ) ఓ గోనెమీద పరిచి, మరో కుర్చీమీద కూర్చుని ఉండేవారు డాక్టర్ గోపాలకృష్ణ. ఫుట్‌పాత్‌ని ఆనుకునే ఓ బడ్డీకొట్టు. ఉదయం ఎనిమిదింటికల్లా తన టి.వి.యస్ బండి మీద ఠంచన్‌గా వచ్చేశేవారాయన. స్టాండర్డ్ పక్కనున్న 'నాయుడు టైలర్స్' ఎంట్రెన్స్‌లో ఉంచిన చీపురుతో ఫుట్‌పాత్‌ని ఊడ్చి, అక్కడ ఉంచిన కుర్చీలని సర్ది కూర్చునేవారు.


డాక్టర్ గోపాలకృష్ణ

అప్పట్నించీ మొదలు.. వరసగా సినీ జీవుల రాక. హార్మోనిస్టు నాయుడుగారు ఆల్ మోస్ట్ ప్రతిరోజూ మొదటి వ్యక్తి.

పేపరు వాడు అంతకు ముందే అక్కడ పడేసిన తెలుగు పత్రికలు నాయుడుగారు చదువుతూ ఉంటే, ఇంగ్లీషు పేపర్లు మిగతా వాళ్ళు చదువుతూ కూర్చునేవారు.

ఎవరైనా సరే బడ్డీ కొట్లో 'టీ' తాగొచ్చు. డబ్బివ్వక్కర్లా. ఎందుకంటే ఆ టీలు అన్నీ డాక్టరుగారి ఎక్కవుంటులోనే పడేవి. ఒకవేళ ఎవరన్నా మొహమాటపడ్డా, డాక్టరుగారే వెళ్ళి 'టీ' తెచ్చి మరీ ఇచ్చేవారు.

ఇంతకీ డాక్టర్.గోపాలకృష్ణగారు ఏం చేస్తారనికదూ! ఉచితంగా హోమియో మందులిచ్చేవారు. 35 సంవత్సరాల పాటు సాధారణ బీదా బిక్కీ జనాలతో బాటు హేమాహేమీలైన సినీ ప్రముఖులు కూడా డాక్టరుగారి దగ్గరికి వచ్చేవారు.

చాలాకొద్దిమంది 'గుప్తదానం'గా మందులు కొనడానికి డాక్టరుగారికి డబ్బిస్తే 'ఆ రోజే' మందులు తెప్పించి సదరు దాతలకి బిల్లు చూపించేవారు డాక్టరుగారు. "అదేం?" అనివారంటే, "మీరిచ్చింది సక్రమంగా ఉపయోగపడిందని మీకు తెలియాలిగదా" అని నవ్వేసేవారు.

కొన్ని రోజుల్లో, నెలలో ఇలా మందులు ఉచితంగా ఇవ్వడం చూస్తాం. కానీ 35 సంవత్సరాలపాటు కుదురుతుందా? కుదురుతుందనడానికి నిదర్శనం డాక్టరుగారే.

వర్షం వచ్చినా వరదలొచ్చినా స్ట్రైకులు, హర్తాళ్ళూ సమ్మెలూ 144 సెక్షన్లూ ఏదైనా సరే డాక్టరుగారి ఫుట్‌పాత్ క్లినిక్ తెరిచే ఉంటుంది. తెరవడానికి ఇదేమీ షాపుకాదుగా.. ఆ చల్లని వేపచెట్టుక్రింద 'క్లినిక్' నడుస్తూనే ఉండేది.

"మీకో మాంఛి రూమ్, ఉండటానికి బసా, ఏర్పాటు చేస్తా.. ఆ రూమ్‌ని 'క్లినిక్'గా ఉపయోగించుకోండి గోపాలకృష్ణగారూ" అని డా.కొంగర జగ్గయ్యగారన్నారు ఓనాడు. (సినీనటుడు జగ్గయ్యగారే!)

"అయ్యా.. ఎప్పుడైతే నేను 'రూమ్'లోకి మారతానో, బీదా బిక్కీ నా దగ్గరకి రావడానికి భయపడతారు. 'కన్‌సల్‌టేషన్ ఫీజు ఉంటుందేమోనని. గొప్పవారికి సౌకర్యంగా ఉంటుందనుకోండి. వారు ఏ హాస్పటల్‌కైనా వెళ్ళి వైద్యం చేయించుకోగలరు. మరి ఈ రిక్షావాళ్ళూ, అడుక్కునే వాళ్ళూ, ఆటోవాళ్ళూ వీళ్ళందరూ ఏమవుతారూ? అందుకే ఈ ఫుట్‌పాత్‌ని వదిలిరాను." అన్నారు నవ్వుతూ.

అదీ ఆయన కమిట్‌మెంటు. 1987 నుంచి 97 వరకూ ఆల్ మోస్ట్ ప్రతిరోజూ నేను అక్కడ హాజరయ్యేవాడ్ని. ఒకవిధంగా సినీజీవితం మొదలైంది అక్కడే ఆ సంగతి అలా ఉంచితే, డాక్టరుగారి గురించి చెప్పడం అంటే పరిపూర్ణ మానవత్వం గురించి మాట్లాడటమే.

ఇటీవల 'జలంధర'గారు వ్రాసిన 'పున్నాగపూలు' నవలలోని డాక్టరు పాత్ర గోపాలకృష్ణగారిదే

నేను మద్రాసులో ఆయన్ని కలవడానికి కారణం జలంధరగారు. నేను జలంధరగార్ని కలవడానికి కారణం తెన్నేటి హేమలతగారు. (లత సాహిత్యం.. ఊహాగానం జ్ఞాపకం ఉందా.. ఓ మహారచయిత్రి.) నాకు సోదరిలాంటిది. నన్ను స్వంత తమ్ముడికన్నా ఎక్కువగా చూసేవారావిడ.

నాకు 'బస' చూపింది గోపాలకృష్ణగారే. ప్రతిరోజూ పొద్దునా సాయంకాలం నేను సినీజనాలకి దొరికేది అక్కడే

"మీరు ఖచ్చితంగా మంచి రచయిత అవుతారు. ఉద్యోగంలో చేరకండి. మీకు సినిమా ఫీల్డ్ కరెక్ట్" అని నేను మద్రాసులో ఉండిపోవడానికి ధైర్యమిచ్చిందీ ఆయనే.

ఓ మహా యోగి ఆయన. అవన్నీ మెల్లమెల్లగా చెప్పుకుందాం 'ఆ చోటు' అంటే అప్పుడు డాక్టరుగారు కూర్చునే చెట్టుకిందకి వెళ్ళి నిలబడ్డా.

కాలం 'తుడి'చేసిన మనుషుల పాదముద్రలు ఎన్నో! ఒక తరపు జ్ఞాపకాల గాఢత మరోతరానికి 'సిల్లీగానో సెంటిమెంటల్'గానో అనిపించవొచ్చు.

నా తండ్రి నాటిన కొబ్బరి చెట్టునీడలో నిలబడితే నిజంగా మా నాన్న పక్కన ఉన్నట్టే నాకు అనిపిస్తుది.

మా అమ్మ నాటిన మామిడి చెట్టు కొమ్మలు కదిలి, ఆ గాలి నా మీద నుంచి వీచినపుడు - ఆ గాలి రూపంలో మా అమ్మే అదృశ్యరూపంలో వచ్చి చల్లగా నా తల నిమురుతున్నదని నాకు అనిపిస్తుంది.

ఆ మాట పక్కవాళ్ళతో అంటే నవ్వుకుంటారనీ, నన్ను పిచ్చివాడంటారని కూడా నాకు తెలుసు.

"To be sentimental is to be foolish" అన్నాడో అంగ్రేజీ వేదాంతి. కానీ భారతీయుల విషయంలో అది తప్పే. కంటికి కనిపించని ఆ బంధమే.. నేటికీ కుటుంబాల్ని ఐక్యంగా ఉంచుతోంది.

"పోనాల్ పోగట్టుంపోడా.. ఇంద భూమియల్ నిలయామ్ వాళ్దవర్ యారడా" ఆటోలో నుంచి ఈ పాట వినిపించింది. ప్రతి ఆటోలోనూ, టాక్సీల్లోనూ కారల్లోను ఈ ఎఫ్.ఎమ్ రేడియోలే. ఎన్నిపాతపాటలు మళ్ళీ సర్క్యులేషన్‌లోకి వస్తున్నాయో! ఎంత అద్భుతమైన పాటో! తమిళంలో రచయిత కణ్ణదాసన్. "పోతే.. పోనీ.. పోరా.. ఈ పాపపు జగతిలో శాశ్వతమెవరురా?" అని అనువాదం కూడా అద్భుతంగా తెలుగులో చేశారు.

"రావటం తెలుసూ పోవటం తెలుసూ - కానీ పోయేది ఎక్కడికి? అది మాత్రం తెలీదు. జీవించడం తెలుసు. కానీ 'ఎన్నాళ్ళో' ఎవరికి తెలుసూ? అసలు పుట్టిన వారంతా 'గిట్ట'కుండా ఇక్కడే ఉంటే ఈ భూమిమీద మనిషి 'నిలబడటానికైనా చోటు ఉంటుందా?" అని అంటాడు కణ్ణదాసన్.

ఎవరు చెప్పారూ సినీ సాహిత్యం అంటే సాహిత్యం కాదనీ? సామాన్యుడికి సాహిత్యాన్నీ సంగీతాన్నీ అందుబాటులోకి తెచ్చింది సినిమా కాదా? సినిమా పాటల్లో అద్భుతంగా ఆధ్యాత్మికాన్ని ఆవిష్కరించారు ఎంతోమంది మహాకవులు. నవరసాల్నీ అందరూ పాడుకోగలిగిన పాటలాగా అందిస్తున్నది సినిమానేగా!

'అయ్యయ్యో జేబులోడబ్బులు పోయెనే' అని పేకాట గురించి హాస్యంగా అనర్థాల్ని వల్లించినా, 'సరదా సరదా సిగరెట్టూ - ఇది దొరలే తాగు బలె సిగిరెట్టూ' అని సిగరెట్టుని పొగుడుతూనే అది ఎన్ని అనర్థాలకీ, జబ్బులకీ కారణమౌతోందో గడుసుగా వివరించినా -

అంతెందుకూ, సినీగీత రచయితలు స్పృశించని అంశమేదీ?

నేను నిలబడింది. పాండీబజార్లో పానగల్ పార్కు ఎదురుగా. ఆ పార్కులో ఓ మూల నాగయ్యగారి విగ్రహం ఉంది. "తనకి మాలిన ధర్మం వొద్దు నాయనా.. ముందు మీ బాగోగులు మీరు చూసుకోండి.. తరువాతే దానధర్మాలు " అని ఎలుగెత్తి చాటుతూ.

"ఏం సార్ ఇక్కడున్నారూ? ఆటోకోసం వెయిటింగా. పదండి. మీరు ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడ దింపుతాను." కారాపి, చిరునవ్వుతో ఆహ్వానించారు కాట్రగడ్డ ప్రసాద్ గారు. ఆయన ఎప్పుడూ వైట్ అండ్ వై లోనే ఉంటారు. ఆయన మనసూ 'తెల్లనిదే' కోరా కాగజ్ తా యే మాన్ యేరా.. లాగా! ఓహ్!

"నిన్నూ.. రోడ్డువైపు ఉండే కిటికీ దగ్గరకి రమ్మంది ఉమ. చీకటి పడ్డాక ఎవరికీ తెలీకుండా రమ్మంది." నాతోటి చెప్పింది సుభద్ర. సుభద్ర ఉమ కంటే ఓ రెండు నెలలు పెద్ద. మహా మొండిపిల్ల. ఒక్కోసారి మహాపంతంగా ఉంటుంది. ఒక్కోసారి చెప్పలేనంత మంచితనం.

ఒక పక్కన ఆ రోజే 'లవకుశ' నాటకం మా ఊళ్ళో. నాటకం ఏ రాత్రో మొదలుపెడతారని తెలిసినా, పిల్లలం అంతా మధ్యాహ్నం నుంచే నాటకంలో నటించే నటీనటులకి ఇచ్చే 'విడిది' దగ్గరే చెక్కర్లు కొడుతూ ఉండేవాళ్ళం. వాళ్ళు బయటికి వస్తే చూద్దామనే ఉత్సాహం మమ్మల్ని నిలవనిచ్చేది కాదు.

బట్టతల తోటీ ఇంత 'పొట్ట' తోటీ ఒకాయన 'బీడీ' కాల్చుకుంటూ బయటికి వచ్చాడు. "ఏవండీ.. మీరు నాటకం వేస్తారు కదూ!" నేనే కాస్త ధైర్యంగా అడిగా.

"అవును! ఈ నాటకంలో లక్ష్మణుడిని నేనే!" గొప్పగా గర్వంగా అన్నాడు.

"ఛీ. నువ్వు కాంతారావులా లేవుగా?" లవకుశ సినిమా లక్ష్మణున్ని గుర్తుచేసుకుని అన్నాడు నా ఫ్రెండు. వాడి పేరు పాండురంగ మూర్తి.

"ముందిక్కడ్నించి పోతారా నాలుగు అంటించమన్నారా?" పిచ్చికోపంతో అరిచాడావ్యక్తి. కొట్టడానికి మీదిమీదికొస్తూ.

"ఒరేయ్ బట్టతలోడికి కోపం వచ్చిందిరోయ్" అరిచాడు ఘంటా గంగాధరంగాడు.

"పొట్టవేసుకుని మన వెనకాల పడతాడ్రటా. మనం దొరుకుతామా. ఓయ్ పొట్టాయనా..! పొట్ట జాగర్త.. కిందపడితే పగిలేను.!" అల్లరిగా అన్నాడు దివాకరంగాడు.

ఇంకేం? డ్రామా లక్ష్మణుడు తెగ చిందులు తొక్కుతూ మా వెనకాలపడటం, మేము గోడదూకి పారిపోవటం క్షణాల్లో జరిగింది. అది మధ్యాహ్నం వ్యవహారం. ఇప్పుడు సాయంత్రం అయింది. వాళ్ళందరూ మేకప్ వేసుకుంటూ ఉంటారు. ఎలాగో ఒకలాగ వాళ్ళని చూడకపోతే మన గొప్పతనం ఏముంటుంది?

మధ్యలో ఈ సుభద్ర!

"నేను నాటకానికి వెళ్తున్నా! రేపు కలుస్తా.. అంతే!" అన్నాను గట్టిగా.

"సరే.! రానన్నావని చెప్పేస్తాలే!" చిరుకోపంగా అన్నది సుభద్ర.

"సరే!" అన్నాను.. మళ్ళీ 'విడిది' వైపు అడుగులేస్తూ.

"మరి వాళ్ళని నాకూ చూపిస్తావా?" ఆశగా అడిగింది సుభద్ర.

"ఆ! నాతో వచ్చెయ్" గబగబా నడుస్తూ అన్నాను. వచ్చింది.

మొత్తానికి విడిది ఇంటిపక్కనున్న గోడమీద ఎక్కి కిటికీలోనుంచి చూద్దునుకదా, కళ్ళు చెదిరిపోయినై. సిల్కుచీరా 'చీటీ జాకెట్టూ' పొద్దున వేసుకుని కనబడ్డ ఆవిడ ఇప్పుడు నగలతో (అవి గిల్టువని కొంచెం పెద్దయ్యాక గానీ తెలీలేదు) మెరిసిపోతోంది. ఇక లక్ష్మణుడు అదిరిపోయాడు. బట్టతలమీద విగ్గూ కిరీటం పెట్టేసరికి కాంతారావుకన్నా బాగున్నాడు. రాముడు కనిపించలా. లవకుశులూ కనిపించలేదు. కిటికీలోంచి బాగా కనపడటానికి నేనూ సుభద్రా బాగా అతుక్కుని గోడమీద కూర్చున్నాము. అది నా మీదకి బాగా ఒంగిపోయి చూస్తోంది. దాని ఒళ్ళంతా నాకు తగుల్తోంది. నాకేమో చికాకు.

"ఇట్టా ఉంటే నీకు బాగుందా?" అడిగింది సుభద్ర.

"ఛీ..!" అన్నాను.

"మరి నువ్వూనూ ఆ ఉమా ఆనుకునే కూచుంటారుగా? అప్పుడు బాగుంటుందా?" ఈర్ష్యగా అడిగింది సుభద్ర.

"ఉమ దగ్గర అయితే బావుంటుంది" సుభద్ర వంక తిరిగి సిన్సియర్‌గా అన్నాను.

"అయితే దానిదగ్గరికే పోయి కూచో..!" ఒక్క తోపుతోసింది నన్ను.

గోడమీదనుంచి విడిది ఇంటివైపుకి పడిపోయా. మోకాలికి దెబ్బ.

'అమ్మా' అని అరిచాను. ఇంకేం ఆ అరుపుకి జనాలు పరిగెత్తుకు వచ్చారు. సుభద్ర నేను క్రింద పడగానే గోడదూకి వెళ్ళిపోయిందనుకుంటా. మొత్తానికి నా మోకాలు 'ఇంతలావు'న వాచిపోయిందనుకుంటా. ఆచారిగారికి మా వాళ్ళు చూపిస్తే, "విరగ్గొట్టుకున్నాడో ఏమో, ఇదిగో రాత్రికి పిండికట్టువెయ్యండి. అది వాపో, విరుగో, రేపొద్దుటికి బాగా తెలుస్తుంది!" అన్నాడు.

తెల్లవార్లూ నొప్పితో ఏడుస్తూనే, మూలుగుతూనే ఉన్నాను. చిత్రంగా తెల్లారు ఝామున నిద్రపోయా. నేను నిద్రలేచేసరికి ఉదయం పదకొండయింది. వాపు చాలావరకూ తగ్గిపోయింది. నొప్పి తక్కువగానే ఉంది. అప్పుడు గుర్తుకొచ్చింది, ఉమ నన్ను రమ్మన్న విషయం.

జాగ్రత్తలవన్నీ మర్చిపోయి రోడ్డువైపుండే కిటికీ పైకి పాకి ఊచలు గట్టిగా పట్టుకుని, "ఉమా.. నేను వచ్చేశానే.. నిన్న.." అంటూ చెప్పబోయా.

"మళ్ళీ ఇటొచ్చావంటే కాళ్ళు విరగ్గొడతానబ్బాయ్ జాగ్రత్త!" కర్కశంగా వినిపించింది వంటావిడ గొంతు. కళ్ళు చికిలించుకుని లోపలికి చూస్తే ఉమ ఆ గదిలో లేదు.

"ఉమ ఏదీ?" ఉక్రోషంగా అడిగా.

"నీకు చెప్పాలా? పో.. మీ ఇంటికిపో!" కోపంగా అన్నది ఆవిడ.

"నువ్వెవతివీ అనటానికీ.. నేను పోను" "నేనూ అరిచా.

"మోహం పగలగొడతా..." మంచం మీద నుంచి లేచి కిటికీ వైపుకి పరుగెత్తుకొస్తూ అన్నది ఆవిడ. నేను కంగారుగా చేతులు వదిలేశా. కింద పడటంతో తగిలిన చోటే దెబ్బతగిలి 'అమ్మా' అని అరిచా.

"ఏమయిందిరా?" ఇంటికి కొంచెం దూరంగా ఉన్న బాత్రూం నుంచి పరిగెత్తుకుంటూ వస్తూ అన్నది ఉమ. నేను లేవలేకపోతున్నా.

"నా మొహం పగల గొడతానందే అదీ" ఉక్రోషంగా అన్నా.

"వాడ్ని ముట్టుకుంటే మీ నాన్నకి చెప్పి తన్నిస్తా!" ఎప్పుడూ బయటికొచ్చిందో కోపంగా ఉమవంక చూస్తూ అన్నది వంటామె.

"నువ్వు అవతలికి ఫో" అరిచింది ఉమ, నా చెయ్యి గట్టిగా పట్టుకుని లేపటానికి ప్రయత్నిస్తూ.

"ఏంటీ. అలాగే నిలబడిపోయారూ? ఎక్కడికి వెళ్ళాలీ?" కాట్రగడ్డ ప్రసాద్‌గారు అన్నాక మళ్ళీ నేను ఇహలోకంలోకి వచ్చాను.

"సార్..! ఎక్కడికీ లేదు సార్. .. ఇక్కడే కాసేపు ఉందామనీ!" నసిగాను.


డాక్టర్ గోపాలకృష్ణ

"డాక్టరుగారు జ్ఞాపకం వచ్చారా?"

"గ్రేట్ హ్యూమన్ సర్, పోనీ నేను ఛాంబర్‌లో దిగి కారుపంపనా?" అనునయంగా అన్నారు. ఆయనకి డాక్టరు గోపాలకృష్ణగారు తెలుసు.

అసలు డాక్టరుగారంటే తెలీని సినిమావాళ్ళు ఎవరూ?

"ఒద్దు సార్.. కాసేపు ఉండి ఆ తరవాత, విద్యాసాగర్ గారి స్టూడియోకి వెళ్ళాలి!" నమస్కరించి అన్నాను.

"OK..OK" అంటూ ఆయన నవ్వి వెళ్ళిపోయారు.

సినిమా ఫీల్డులో ఎవరిగురించి ఏది తెలిసినా తెలీకపోయినా, సెంటిమెంట్స్ గురించి మాత్రం తెలుస్తాయి. నేను అక్కడ 'ఎమోషనల్లీ అటాచ్డ్' అని అందరికీ తెలుసు. కాట్రగడ్డ ప్రసాద్ గారికి ఇంకా బాగా తెలుసు. కారణం ఎన్నోసార్లు ఆయన అక్కడినుంచే నన్ను 'పికప్' చేసుకున్నారు గనుక.

ప్రతివ్యక్తి జీవితం ... పుట్టినచోటే మొదలైనా, అనేక మలుపులు ఉంటై. కొన్ని ఆనందం కలిగించేవీ, కొన్ని గుండెను తొలిచేవీ. చిత్రం ఏమంటే – ఆనందం కలిగించినవి పెద్దగా గుర్తుండవుగానీ, బాధపెట్టినవే ఎక్కువ గుర్తుంటై. అందుకే, ఎవరినైనా, ఎంతమందినైనా, మీ చిన్నతనపు జ్ఞాపకాలు వ్రాయమంటే మొదట రాశేవి బాధ కలిగించేవే.. అదీ – నిస్సందేహంగా.

మద్రాసు నగరం ఓ మహావృక్షం లాంటిది. ఎన్ని ఊడలు దింపుకుని విస్తరించిందో! ఎన్ని జీవితాల్ని తనలో కలుపుకుందో. పేదా-గొప్పా అందర్నీ సమానంగానే చూస్తుందీ నగరం.

ఈ గాలిలో ఎందరి 'నిశ్వాసాలు' తారల్లా వేలాడుతున్నాయో.. సారీ.. తారల్లా అంటే 'పగటి తారల్లా'. తారలు ఉన్నా పగటివేళ కనిపించవు. అలాగే ఈ 'నిశ్వాసాలూ' కనిపించవు. కానీ ఆ నిశ్వాసాల్లోని 'కలల' శబ్దం మాత్రం గుండెకి వినిపిస్తూనే ఉంటుంది.

మెల్లగా అక్కడ్నించి బయలుదేరాను. ఎంత ఇష్టమైన చోటునుంచి అయినా కదలక తప్పదు. "బాటనుంచి ఓ బాటకి మజిలీ" అదేగా జీవితమంటే...!

లక్షలమంది నాచుట్టూ ఉన్నారు. కానీ నిజంగా "నా" వాళ్ళు? ప్రతి మనిషి గుండెలోనూ ఓ శూన్యం ఉంటుంది. ఆడైనా మగ అయినా. ఆ శూన్యాన్ని నింపేది సృష్టిలో ఒక్కరే. అదీ ఒకసారే. ఏమో. మనసు పని పరిపరివిధాల ఆలోచించడం మొదలుపెట్టింది.

చుట్టూ చూసి నిట్టూర్చా. నవ్వొచ్చింది. అది 12 బి బస్సు దొరికే టి.నగర్ బస్‌స్టాపు.

**మౌంట్ రోడ్... ఎగ్మూర్.. కోడంబాకం..** ఛట్‌పట్... మాంబళం.. సైదాపేట్ - తాంబరం.. ఇవన్నీ చిన్నప్పుడు డిటెక్టివ్ నవల్సులో చదువుకున్నవే.. కొమ్మూరి - టెంపోరావ్.. విశ్వప్రసాద్ - కృష్ణమోహన్.. భయంకర్.. వీరందరూ ఆరాధ్యదైవాలే. ఏ డిటెక్టివ్ యుగంధరో.. డిటెక్టివ్ వాలీనో నేరస్థుల్ని వెంటాడుతూ ఈ ఈ చోట్లల్లోనే క్రాస్ చెయ్యడమో పట్టుకోవడమో ఆ నవలల్లో చేసేవాళ్ళు. క్రిజ్లర్, పాంటియాక్, బ్యూక్ ఇలా ఎవరి కార్లు వాళ్ళవి. భగవాన్.. మణి.. పార్ధు.. స్మామాట్ ఇలా ఎవరి డిటెక్టివ్‌ల పేర్లు వారివి.

బహుశా అందుకేనేమో నాకు మద్రాస్ అంటే పిచ్చి. ఎంత పిచ్చి అంటే ఇదే నా స్వంత ఊరు అన్నంత పిచ్చి.

నాకు బాగా జ్ఞాపకం. ఏర్‌ఫోర్స్‌లో ట్రైనింగ్ పూర్తిచేసుకున్నాక నాకు 'ఢిల్లీ' పోస్టింగ్ వచ్చింది. నా ఎంట్రీ మేట్స్ మిశ్రా, బెహరా, వాలి సుబ్బారావూ అందరం ఒకేసారి బయల్దేరి బెంగుళూర్ నుంచి ఉదయానికల్లా మద్రాస్ సెంట్రల్ చేరుకున్నాం. G.Tలో మేం వెళ్ళాలి. రోజంతా ఏం చెయ్యడం? బెహరా స్టేషన్‌లోనే మా సామాన్లకి కాపలా ఉంటానన్నాడు. (క్లోక్ రూమ్స్ ఉంటాయని కూడా తెలీని అమాయకత్వం మాది) అప్పుడు నేనూ, మిశ్రా, సుబ్బారావు సెంట్రల్ నుంచి నడుచుకుంటూ బీచ్‌దాకా వెళ్ళాము. దారి వాళ్ళనీ, వీళ్ళనీ అడుగుతూ, హాయిగా నడుస్తూ! అప్పుడప్పుడూ సోడాలూ, టీలూ తాగుతూ, 'ఉద్యోగస్తులమైన' ఆనందంతో స్టైలుగా సిగరెట్లు కాలుస్తూ (అలవాటు లేదు గనక తెగ దగ్గాం) మొత్తానికి మద్రాసు గాలిని పూటపూటంతా పీల్చేశాం.

సముద్రాల్ని చూడటం నాకు కొత్తకాదు.... ఆ విషయం తరువాత చెప్పుకుందాం. కానీ మిశ్రాకీ సుబ్బారావుకీ కొత్తే. అందినన్ని ఆల్చిప్పలు పోగేసుకున్నాం.

జీవితం అనే సముద్రంలోనూ మనం పోగుచేసుకునేవి ఆల్చిప్పలే... జీవితపు లోతుల్లోకి పోయి, ముత్యాలూ పగడాలూ తెచ్చుకోవాలంటే చాలా 'శ్రమ'పడాలి, మానసికంగాను శారీరకంగానూ. కానీ మనం అన్నీ 'ఈజీ'గా వచ్చేవే (లేక) పొందగలిగేవే కోరుకుంటాం ఈజీ మనీ, ఈజీ రిలేషన్స్.. ఇలాగన్నమాట.

'మనసు.... 'మనసు పొరల్లో'కి వెళ్ళింది. బాల్యాన్ని తలచుకుంటే, ఈ ఆల్చిప్పలతోనే మేము మామిడికాయమీద 'తొక్క'ని స్క్రేప్ చేసేవాళ్ళం.. మాగాయి కోసమూ, తొక్కుడు పచ్చడి కోసమూ ఇకా మావిడి వొరుగు కోసమూ..!

సరే ఆ విషయం పక్కన పెడితే - ఆ సాయంత్రం G.Tలో ఎక్కి కూర్చున్నాక ఆల్చిప్పల్ని చాలా జాగ్రత్తగా భద్రపరిచాం. అందులో కొన్ని నేను ఢిల్లీ నుంచి మద్రాసు పోస్టింగ్‌తో వచ్చేవరకూ నాతోనే ఉన్నాయి.

ఈ ఆల్చిప్పల గురించో నత్తగుల్లల గురించో 'అవసరమా?' అని అడగొద్దు. ప్రేయసి 'ముద్దు'పెట్టిన క్షణాలు ఎంత గొప్పవో, మధురమైనవో, ప్రేయసి 'చెంపపగలగొట్టిన' క్షణాలు కూడా అంతే మధురమైనవి. అయితే అప్పటికప్పుడు కాదు - ఊరగాయ ఊరాక రుచి పెరిగేట్టు - ఆ సంఘటనలు మనసు పొరల్లో ఊరి 'జ్ఞాపకాలుగా' మారాక!!!

మిలటరీ కంపార్ట్‌మెంట్ మొత్తం ఫుల్. నేనూ నా మిత్రులూ మా 'కిట్‌బాక్స్'ల మీద కూర్చున్నాం. ఆ మాత్రం చోటు దొరకడం అదృష్టమే. మిగతా వాళ్ళంతా నిద్రపోతున్నారు. నేను మాత్రం మేలుకునే ఉన్నా.

జీవితం ఎటు మళ్ళుతోంది? 'జీవితాన్ని' గురించి ఆలోచించే వయసు కాదది. నవ్వొచ్చింది. అప్పుడూ, ఇప్పుడూ కూడా. నాటికీ నేటికీ మధ్య కోటాను కోట్ల మేఘాలు వర్షించిన నీరు కొంత భూమిలో ఇంకింది. కొంత పంటపొలాల్లోకి పయనించి పంటలు పండిస్తే కొంత వృధాగా మురిక్కాలవలపాలైంది. కొంతనీరు భగవంతుడికి అభిషేకజలం కాగా, మరి కొంతనీరు శవస్నానాలకి పనికొచ్చింది.

తాను వర్షించబోయే నీరు 'ఇలా' అవుతుందని మేఘాలకి తెలుసా? జీవితమూ అంతే. కొన్ని క్షణాలు అమూల్యం.. కొన్ని క్షణాలు అపురూపం. కొన్ని క్షణాలు సుఖమయం. కొన్ని దుఃఖమయం. చాలా చాలా చాలా క్షణాలు వ్యర్థం - అందుకే అవి మళ్ళీ మనసులో పుట్టవు!!!

"నాకు దూరంగా వెళ్ళిపోతున్నావుగదూ!" బేలగా ఉమ. కళ్ళలో కన్నీటి 'పొర'.

"ఎందుకో .. ఎందుకో తెలీదు.. వెళ్ళొద్దురా!" నా వీపుని వెచ్చగా కౌగిలించుకుని అన్నది.

ఎందుకో చాలా ఏళ్ళ తరవాత ఓ పాట గుర్తుకొచ్చింది.. "నీ కోసమె నే జీవించునదీ.. ఈ విరహములో.. ఈ నిరాశలో" అనే పాట! విరహంలో 'నీ కోసమే' అనటం గొప్పేంకాదు. 'ఈ నిరాశలో' అనటమే 'కవి' హృదయం ఏ నిరాశలో?

భగవంతుడా.. ఎంత గొప్పవాడివయ్యానువ్వు' ఎవరెవరో కలుస్తారు. ఎందర్నో 'నావారు' అనుకుంటాం.! ఎవరు నీవారూ? పిచ్చితనంకాదూ! ఎవ్వరూ నీవాళ్ళు ఉండరు ఒకవేళ ఉన్నామని చెప్పినా, దానంత 'అబద్ధం' మరి ఒకటి ఉండదు. 'హిపోక్రసీ' అనేది దీన్నే.

"ఒరే. కన్నతల్లే చనిపోయింది! కానీ, ఆకలికి ఆగలేక బయటికి ఏదో పనున్నట్టు వెళ్ళి సుష్టుగా టిఫిన్ తినొచ్చానురా.. ఇది దైవద్రోహమో, మాతృద్రోహమో, నాకు తెలీదు..! కానీ ఇది నిజంరా" అని ఏడ్చిన నా స్నేహితుడు బాల్‌రాజ్ నాకు జ్ఞాపకం వచ్చాడు.

తల్లి'పోయి'నంత మాత్రాన 'పిల్ల' తన 'పిల్ల'కి పాలు ఇవ్వదా? తండ్రి చనిపోయాక 'బిడ్డ' 'తనబిడ్డ'కి ఆహారం పెట్టడా? ఎందుకు మనం మననే మోసం చేసుకుంటూ, ఇది 'మనవిధి' అంటూ, అనుకుంటూ, జనాల్ని కూడా మోసం చేస్తాం?

సారీ.. నిజం చేదుగానే ఉంటుంది. కానీ జబ్బు (మానసికమైనదైనా సరే) తొలగాలంటే చేదుమాత్ర మింగక తప్పదు.

ఇదంతా ఎందుకంటే,

నీ వాళ్ళు అంటూ నీకు ఎవరో ఒకరు ఉండాలి. .. అది నిజమైనా... అబద్ధమైనా. అయితే ఎవరు నీవారూ? ఎవరికి వారు ఈ ప్రశ్న వేసుకుంటే గుండెల్లోంచి జవాబు వచ్చి తీరుతుంది. మనసు పొరల్లోంచి ఓ రూపం బైటికొచ్చి "నేను.. నేను నీదాన్ని (or) నీవాడ్ని" అని ఎలుగెత్తి చాటుతుంది. వారి మీద మాత్రం నీకు ఏ 'హక్కు' ఉండదని తెలుసుకో నేస్తమా..!

ఊగుతున్న ఊయల మళ్ళీ మా ఊళ్ళో వాలింది. చల్లని తామర తూడుల్ని మాలగా మలిచి ఉమ మెళ్ళో వేశాను. నా మెళ్ళోనూ వేసుకున్నాను. ఎంత చల్లగా హాయిగా ఉందో.... ఆ చెరువుని బాలారిగూడెం చెరువంటారు. నీళ్ళు కాస్త నిర్మలంగానూ చల్లగానూ ఉంటాయి.

"అవునూ.. ఆ వంటదానిమీద మరచెంబు ఎందుకు విసిరావే?" ఉమ భుజం మీద తల ఆనించి అన్నాను.

"నీమీద అరిచిందిగా. అందుకూ!" నవ్వి అన్నది ఉమ.

"మరి నువ్వూ అరుస్తావుగా నామీదా?" అడిగాను.

"నీమీద అరుస్తానూ, కోపం వస్తే కొడతా గూడా, కానీ అదెవత్తీ నిన్ను బెదిరించడానికి నీమీద అరవడానికి?" కోపంగా అన్నది. నేనేమీ మాట్లాడలేదు.

"కాదురా.. నువ్వేమో నావాడివి. అంతే!" నా మెడ మీద చెయ్యి వేసి లాలనగా అన్నది.

'నావాడివి' అనే మాటకి ఎంత అర్థముందో నాకానాడు తెలీదు. ఆ ఒక్క మాటకి ఉండే అర్థం ఎంత విశ్వాన్ని ఆక్రమిస్తుందో బహుశా ఆనాడు ఉమకీ తెలిసి ఉండదు.

నావాడివి/నాదానివి అనటంలో ఎంత స్వార్థముందో, ఎంత పొసెసివ్‌నెస్ ఉందో, ఎంత అభిమానం ఉందో, ఎంత అనురాగం ఉందో, ఎంత ప్రేమ ఉందో - తెలిసేది ఎప్పటికి?

ఒక్కొక్కసారి ఆ 'ఒక్కమాటే' అన్ని హద్దుల్నీ చెరిపేసి 'అహంకారపు' 'మిద్దె' నెక్కిస్తుందనీ.. ఆ మిద్దె ఎక్కాక బతుకు భరించలేనంత ఘోరంగా తయారవుతుందని ఎందరికి తెలుసూ?

'నావాడివి /నాదానివి' ఒక్క మాటతో ఎదుటివారి మనసునీ, ఆత్మనీ ప్రాణాన్నీ, సర్వాన్నీ, సొంతం చేసేసుకోవచ్చు.

ఆ ఒక్కమాటలోని 'గాఢత' గ్రహించుకోలేకపోతే జీవితాన్ని గాజుబొమ్మని పగలగొట్టినట్టు పగలగొట్టావచ్చు.

కానీ -

కొందరు ఆ మాట మనసావాచా కర్మణాః అనటానికే పుడతారు. వారికి ఆలోచనా - ఆచరణా అనేవి 'రెండు' ఉండవు. ఆ రెండూ వారి విషయంలో ఒక్కటే!

రైలు కదులుతోంది. మనసులో ఆలోచనలు కదులుతున్నట్టుగా. 'ఏ బోగీలో జనాలు ఆ బోగీలోనే' అన్నట్టు, మనసు పొరల్లో కూడా ఎవరి పొర వారిదే

"కొవ్వలి" గారి మునిమనవల 'ఒడుగు'. వారి అబ్బాయి కొవ్వలి నాగేశ్వరరావుగారు వచ్చి పిలిచారు. తెలుగుభాషలోనే కాదు మరే భాషలోనూ 1001 కి పైగా నవలలు వ్రాసిన రచయితలు ఉంటారని నేననుకోను.

ఆరు దశాబ్దాల క్రితం, జనంలో పుస్తకాల చదవలనే అభిలాషను పెంపొందించిన రచయిత కొవ్వలి లక్ష్మీ నరసింహారావుగారు. "భయంకర్" పేరుతో కొవ్వలి రాసిన 25 భాగాల జగజ్జాణ, విషకన్య ఈనాడు చదివినా అదే ఉత్సుకతతో, వేగంతో చదివిస్తాయి.

శ్రీపాదవారు ఓనాడు కొవ్వలి నవలన్ని నిరసించారు. కానీ తరువాత ఆయనే 'చదివించే' గుణం కొవ్వలి నవలల్లో ఉందని ప్రశంసించారు. చలంగారైతే 'కొవ్వలి కౌగిలిలోలేని కన్నెపిల్ల లేదన్నారు'. కారణం ప్రతి ఆడపిల్ల చేతిలోనూ ఒకప్పుడు కొవ్వలి నవలే.

రైల్వే స్టేషన్లలో, కిళ్ళీషాపుల్లో, బస్ స్టాండులో ఆఖరికి పడగ్గదుల్లోక్కూడా కొవ్వలి నవలలు సాక్షాత్కరించేవి.

పాతికేళ్ళ వయసుకే 400 నవలలు వ్రాసిన ఘనత ఆయనది. ఆయన నవలలు ఎంత హృద్యంగా ఉండేవంటే, ఒకసారి మొదలెడితే పుస్తకాన్ని క్రిందపెట్టలేము.

వ్యక్తిగా ఆయన మహోన్నతుడు. 'రచన'కి ఒక లక్ష్యం ఉండాలనేవారు. సంఘం 'సాంప్రదయపు సంకెళ్ళలో' మగ్గే ఆ రోజుల్లో, బాల్య, విధవా, ప్రేమ, మతాంతర, కులాంతర వివాహాల్ని గురించి నిర్భయంగా వ్రాసిన రచయిత ఆయన. బాల్య వివాహాల్ని నిషేధించాలని పోరాడారు. విధవా వివాహాల్ని కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాల్ని సమర్థించారు. సాంప్రదాయాలు ఉన్నవి మనిషికోసమేగానీ మనిషి సాంప్రదాయాల కోసం బ్రతకడం తప్పు అని తన రచనలద్వారా చాటి చెప్పారు.

ఆయన సినిమా కథ, సంభాషణల రచయితగా మద్రాసులో ఉన్నా, ఏనాడూ తన వ్యక్తిత్వాన్ని కోల్పోలేదు. ఏనాడూ ఎవరి ముందూ చెయ్యిజాచని ఉన్నత స్వభావం ఆయనది. ప్రజల్లో 'చదవాలి' అనే ఆసక్తిని పెంచి పోషించిన రచయితగా, మహారచయితలే వ్రాయడానికి భయపడే విషయాల్ని నిర్భయంగా వ్రాసిన రచయితగా 'కొవ్వలి' ఏనాటికీ ప్రాతఃస్మరణీయులే. ముఖ్యంగా స్త్రీలలో పఠనాశక్తిని పెంచింది ఆయనే. ఆ విషయం సెంటినరీ సభలో మాలతీ చందూర్‌గారే సభాముఖంగా చెప్పారు. నేనూ కొవ్వలి నవలలు చదివి, పెరిగినవాడ్నే.. వారి కుమారుల ఆతిథ్యాన్ని పొందినవాడినే.

ఎంత గొప్పదీ మద్రాసు నగరం...! ఎందరు కళాకారులు, రచయితలు, గాయకులు ఈ నగరంలో ప్రభవించారూ.. ప్రభావితం చేశారూ.!'

తప్పక ఆ 'ఉపనయన' మహోత్సవానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. 'కొవ్వలి' కుటుంబం మీది గౌరవంవల్ల మాత్రమే కాదు....'నాటి' విషయాల్ని నేటికీ స్పష్టంగా చెప్పగల వయోవృద్ధుల్ని కలుసుకోవడానికి కూడా!

చరిత్రని 'చదవడం' బాగుంటుంది.

చరిత్రని 'వినడం' - అందులోనూ ఆ చరిత్రకారుల సమకాలికుల నోటిద్వారా వినడం ఇంకా అద్భుతంగా ఉండదూ.!!!

మళ్ళీ రైలులోకి చేరితే... ట్రైను బలార్షా దాటుతోంది. ఉదయపు రేకులు విచ్చుకుంటున్నాయి. కూచునీ కూర్చునీ ఒళ్ళు నెప్పెడుతున్నా చేసేదేమీలేదు. ఎలాగొలా సందుచేసుకుని ముఖం కడుక్కున్నాను. నా ఫ్రెండ్స్ నన్ను నిద్దర లేపలేదుగానీ, బలార్షాలో దిగి నాకోసం కూడా టిఫెన్ కొనుక్కొచ్చారు, నాలుగు ఇడ్లీలు, రెండు గారెలు. 'థాంక్స్' చెప్పి ఎంతైందని అడిగాను. నాకు తెచ్చిన టిఫిన్ ఖరీదు 'పావలా' అంటే ఇరవై అయిదు పైసలు. ఊహించగలరా? తినేసి విశ్రాంతిగా కూర్చున్నాను. ఆ రోజుల్లో మద్రాసు నుంచి ఢిల్లీకి 32 గంటలు పట్టేది. అదీ G.T.లో.

"మేం నాగ్‌పూర్‌లో దిగిపోతాం. మీరు కాసేపాగి మీ సామాన్లు మా బెర్తుల మీద పెట్టేస్కోండి' దయగా సమాచారం ఇచ్చాడు ఓ ఏర్‌ఫోర్స్ కార్పొరల్. మిలటరీ కంపార్టుమెంట్ అంటే, ఆర్మీ, నేవీ, ఏర్‌ఫోర్స్ అందరూ ప్రయాణించేది. మేము ఐ.ఏ.ఎఫ్ వాళ్ళం గనక పక్షపాతం కాస్త చూపించారు ఆ కార్పొరల్. లేకపోతే వేరేవాళ్ళు ఆక్రమించేస్తారుగా! అందుకూ.

గబగబా మేం ముగ్గురం మా బెడ్‌షీట్లని దిగిపోబోయే వారి బెర్తుల మీద పడేసి, 'ధర్మ' పరంగా రిజర్వు చేసేసుకున్నాం. అమ్మయ్య.. కిట్‌బాక్సు మీద కూర్చునే బాధ తప్పుతుందిగదా..!

"భయ్యా.. ఏదైనా పాట పాడవూ!" బెర్తు దొరికిన ఆనందంతో అన్నాడు మిశ్రా. అప్పుడప్పుడే నేను హిందీ పాటలు పాడటం నేర్చుకుంటున్నా. హిందీవాళ్ళని అడిగి పాటని తెలుగులో రాసుకుని పాడేవాడ్ని. రేడియోలో ఒకసారి వింటే ట్యూన్ గుర్తుండిపోయేది. (ఇప్పటికీ అంతే).

'ఓదూర్ కే ముసాఫిర్.. హిమ్‌కో భీ సాథ్ లే లే రే.. హమ్‌కో భీ సాథ్ లే లే రే.. హమ్ రెహగయే అకేలే..! ' అంటూ పాటని అందుకున్నాను.

'ఓ బహుదూరపు బాటసారీ.. నన్ను కూడా నీతో తీసికెళ్ళవూ. నేనిక్కడ ఒంటరిగా మిగిలిపోయాను' అని ఆ పాటకి అర్థం. సినిమా పేరు ఉరన్ కటొలా. దిలీప్ కుమార్ హీరో.. పాడింది రఫీ. ఆ సినిమాని నేను మా ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న డిఫెన్స్ థియేటర్లో చూశాను. ఆ థియేటర్లో సివిలియన్స్‌కి ప్రవేశం లేదు. టిక్కెట్టు ఖరీదు పావలా. బెంచీ, కుర్చీ, బాల్కనీలాంటి క్లాసులు ఉండవు. ఫస్టకం.. ఫస్ట్ సర్వ్ సిస్టమ్.

రఫీ కంఠంలోని 'విహ్వలత' ఈ పాటలో నిలువెత్తున సాక్షాత్కరిస్తుంది. గాడ్ అదేమి గారడీ! గొంతు వింటే చాలు. గుండెల్లోంచి కన్నీళ్ళు తన్నుకొస్తాయి.

పాట పూర్తిచేసి కళ్ళు తెరిస్తే నా చుట్టూతా మనుషులే, మా మిలటరీవాళ్ళే. చప్పట్లు చరిచి అభినందించడమేగాక ఓ సర్దార్జీ ఓ దుప్పటి తెచ్చి నా కిట్‌బాక్స్ మీద చక్కగా పరిచి "అబ్, గావో భాయీ సాబ్.. కిత్ నా అచ్చా గాతేహో" అని 'కితాబు' ఇచ్చాడు. మళ్ళీ రఫీదే, "జరా సామ్‌నేతో ఆవో ఛెలియే. ఛుప్ ఛుప్ చల్‌నే మే క్యా రాజ్ హై.. యూఁఛుప్ నా సకేగా పర్‌మాత్‌మా.. మేరీ ఆత్‌మాకీ యే ఆవాజ్ హై.." అనే పాటని అందుకున్నాను.

పాటతో పాటు నా కళ్ళూ చెమ్మగిల్లాయి. మరి చెమ్మగిల్లవూ.. 'ఓ చెలీ.. మౌనంగా ఎందుకూ వెళ్ళిపోతావూ వెళ్ళిపోయినా భగవంతుడు మౌనంగా ఊరుకోడు. ఎందుకంటే ఇది నా పిలుపు కాదు. నా ఆత్మ పిలిచే పిలుపు' అన్నాకా!!!

ఆ తరువాత ప్రయాణం ఎలా సాగిందో చెప్పాల్సిన పనేముందీ..! భగవంతుడి భాషలు రెండు. ఒకటి మౌనం. రెండవది సంగీతం. ఆ రెండో భాషని కొంచమో గొప్పో నాకు నేర్పిన ఆ పరాత్పరుడికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తూ.. (వీలుంటే ఆ పాటల్ని యు ట్యూబ్‌లోనో నెట్ లోనో వినమని ప్రార్థిస్తూ)

**పుస్తకాలు క్రమపద్ధతిలో పేర్చవచ్చు...** ఇటుకల్ని క్రమపద్ధతిలో పేర్చి మహా భవనాలు నిర్మించవచ్చు... ఒక క్రమ పద్ధతిలో చెమటోడుస్తూ ధనాన్నీ పరువు ప్రతిష్టల్ని కూడా సంపాదించవచ్చు. కానీ - జ్ఞాపకాల్ని మాత్రం క్రమ పద్ధతిలో అనుభూతించలేము. ఎందుకంటే అవెప్పుడూ క్రమపద్ధతిలో రావు. "క్రమ పద్ధతిలో జీవితాన్ని 'నిర్మించు'కున్న వారిని కూడా చూడగలమేమోగానీ - అనుభవాల్ని 'నిర్మించిన'వారు మాత్రం సృష్టిలో ఉండరు."



అయినా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. 'మిడత'లాగా ఇక్కడ్నించి అక్కడికీ.... అక్కడ్నించి ఎక్కడికో ఎగరకుండా, స్థిమితంగా చక్కగా ఒకదానివెంట ఒకటిగా మనసుపొరలు విప్పుకుందామని! కుదిరితేగా..!!

'ఢిల్లీ'.. 'హస్తినాపురం'.. రాగానే నా ఒళ్ళు జలదరించింది. చిన్నప్పుడు చదువుకున్న పాఠాలన్నీ గుర్తుకొచ్చాయి. కౌరవపాండవులూ... మొఘల్ పాదుషాలే కాక లార్డ్లూ గవర్నర్ జనరల్సూ, వైస్రాయిలూ అందరూ గుర్తుకొచ్చారు. 'స్వామి' అనే చిత్తూరి వాస్తవ్యుడు (అది IAFలో చేరక పూర్వం) వచ్చాడు, మమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి. 'సామాన్లు జాగ్రత్త' అని అతని యాసలో అతను చెప్పాడు. (అంటే చిత్తూరి అన్నమాట). వాయుసేనకి సంబంధించి ఉండేవాళ్ళ నివాసాల్ని 'బులెట్స్' అంటారు. 'బిలేట్' అనీ అనొచ్చు. రేస్ కోర్స్‌లో మా నివాసం. ఇందిరాగాంధీ గారుండేది మా ఏర్‌ఫోర్స్ స్టేషన్‌కి అతి దగ్గరలోనే.

అసలు కథ ఏమంటే అప్పటికి మా వాళ్ళుగానీ, మా ఊరువాళ్ళుగానీ ఎవరూ ఢిల్లీ ఎలా ఉంటుందో చూడలేదు. మొదటివాడ్ని నేనే. అందుకే ఛాతీ ఉప్పొంగింది.

నాకు 'ఎలాట్' చేసిన కప్‌బోర్డ్‌లో నా సామాన్లు భద్రపరుచుకుని నా 'కాట్'

అనగా మంచం మీద నాకు కొత్తగా ఇవ్వబడిన పరుపు, దిళ్ళు, దుప్పట్లు చక్కగా పరిచి, రెండు రగ్గులూ (ఇవీ కొత్తవే) కప్పుకోవడానికి సిద్ధంగా మడిచి, 'మెస్'కి స్వామిగారితోనూ ఇంకొందరు తెలుగువారితోనూ కలిసి వెళ్ళాను. జనవరి నెల కనక భయంకరమైన చలి. వంటకాలన్నీ 'డాల్డా'తో చేస్తారు గనక చేతులనిండా జిడ్డు. వేడినీళ్ళలో, లిక్విడ్ సోపుతో, నాలుగుసార్లు రుద్దితేగానీ జిడ్డు వదల్లేదు. సాయంత్రం నాలుగున్నరకే చీకటి పడింది. కాసేపు రోడ్లమీద పచార్లు చేసేసరికే చలి 'గుప్పున' కొట్టింది. పుట్టి బుద్దెరిగాక 'అంత చలి' అనుభవించడం అదే మొదటిసారి. 'బుల్లెట్'కి వెళ్ళాక కొంతమంది 'క్యు(Q)' బ్లాక్ తెలుగువాళ్ళు పరిచయమయ్యారు. సరదాగానే గడిచింది.

ఆవాళ బుధవారం గనక 'బార్'డే అంటే హాయిగా 'మందు' వెయ్యొచ్చన్నమాట. కానీ నేను ఏనాడూ అసలు 'తాగాలనే' అనుకోలేదు. కొత్తగా పరిచయమైన వారు కాస్త 'బలవంతం' చేశారుగానీ నేను ఒప్పుకోలేదు. అప్పటికి నా దగ్గర 'వింటర్ యూనీఫాం' తప్ప, చలికాలానికి పనికొచ్చే సివిల్ దుస్తులు లేవు... ఏం చెయ్యాలి!

"మెస్సుకి పోదాం.. సెవెన్ అయింది..!" స్వామి ఓ రెండు పెగ్గులు తగిలించి, స్వెట్టరు బిగించి మాదగ్గరకి వచ్చి అన్నాడు. అప్పటికి నాకు 'సిగరెట్టు' కూడా నిషిద్ధమే. జీవితంలో 'నాన్‌వెజ్' ఏనాడూ ముట్టుకోలేదు. అంతేకాదు ఈ జన్మకి ముట్టుకోను. కారణం, లియోటాల్ స్టాయ్ వ్రాసిన 'భయస్థుడు' అనే నవల.

మెస్సుకి వెళ్ళాం. "వింటర్‌కి బట్టలు ఏమీ కుట్టించుకోలేదా?" అడిగాడు స్వామి.

"లేదు" అన్నాను.

"అయితే రేపు మన స్టేషన్ టైలర్ కిద్దాం... ఏం కుట్టిస్తావు.. సూటా, బ్లేజరా?" చపాతీ తింటూ అన్నాడు స్వామి.

"నాదగ్గర వందరూపాయలున్నై" అన్నాను.

"అయితే ప్రస్థుతానికి బ్లేజర్ కుట్టించుకో... అరవై డెబ్భై రూపాయల్లో పని అయిపోతుంది!" అన్నాడు స్వామి.

"బాబోయ్.. అంత డబ్బే వద్దులెండి.. ఓ పదిహేనూ ఇరవై రూపాయిల్లో ఓ స్వెట్టర్ కొనుక్కుంటా!" అన్నాను.

మీకు నమ్మబుద్ధికావటం లేదు గదూ.!. పన్నెండున్నర రూపాయలకి బ్రహ్మాండమైన స్వెట్టరు దొరికింది. అయ్యా, రోడ్డుపక్కన 'ధాబా'లో 'దాల్‌రోటీ' ఖరీదు పన్నెండు పైసలు అదీ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ దగ్గర.

"నీ ఇష్టం" అన్నాడు స్వామి.

చేతులు వేడినీళ్ళతో కడుక్కుని బయట కొచ్చి కాసేపు అటూ ఇటూ తిరిగి 'బుల్లెట్'కి వచ్చాం. చూస్తే ఏముందీ.. నా యూనిఫామ్స్ తప్ప బట్టలన్నీ (కొత్తవి మరి) ఆఖరికి బట్టల్లో దాచిన డబ్బుతో సహా ఎవడో 'కొట్టు'కుపోయాడు.

నాకు నోటమాట రాలేదు.

"తాళం వేసుకుని రావాల్సింది.. అబ్బాయ్.. ఎందెందు వెదికి చూచిన అందందే ఉండు దొంగ - నిక్కము సుమతీ!" అన్నాడు స్వామి.

'మిలటరీ'లోనూ దొంగలేనా? నాకసలు నమ్మకం కుదరలా.

"గార్డ్‌రూంలో రిపోర్ట్ చెయ్యి." ఒకడు సలహా ఇచ్చాడు.

"ఎవరు మాత్రం ఏం చేస్తారూ? ఈ స్టేషన్‌లో ఇన్నివేల మందిమి ఉన్నాం. వాళ్ళు మాత్రం ఎన్ని 'కిట్‌బాక్స్'ల్ని చెక్ చేస్తారూ?" అనుభవంతో అన్నాడు స్వామి. అతనికి అప్పటికే నాలుగేళ్ళ 'సర్వీస్ సీనియారిటీ' ఉంది.

"ఢిల్లీనే ముఝ్ఝే నంగాకర్ దియా.!." (ఢిల్లీ నన్ను నగ్నంగా నిలబెట్టింది) నాలో నేనే అనుకున్నాను... అప్పుడప్పుడే నేర్చుకుంటున్న హిందీలో. మరుసటి రోజున స్వామి దగ్గర ఇరవై రూపాయలు అప్పు తీసుకుని ఓ నల్లని టెరీకాట్ పేంట్ క్లాత్ - ఐవరీ రంగు టెరీకాట్ షర్ట్‌పీసూ కొని అర్జంటుగా సాయంత్రానికల్లా స్టేషన్ టైలర్‌తో కుట్టించాను. మొత్తం ఖర్చు.. దర్జీగారి ఛార్జ్‌తో కలిపి పదిహేడున్నర రూపాయలు. స్వెట్టర్‌ని జీతాలొచ్చేవరకూ వాయిదావేశాను.

ఆ సాయంత్రం చలిలోనే కొత్తబట్టలేసుకుని రేస్ కోర్స్ IAF స్టేషన్నించి విజయ్‌చౌక్ (ఇప్పుడు ఇండియన్ రిపబ్లిక్ పెరేడ్ జరిగే చోటు) వరకూ నడుచుకుంటూ వెళ్ళాను. అమర సైనికుల స్థూపానికి ఓ శాల్యూట్ కూడా చేశాను మరి. అటువైపు రాష్ట్రపతి భవన్... గుండె ఉప్పొంగిపోయింది. ఓ పక్క ఏర్ హెడ్ క్వార్టర్స్. అద్భుతమైన కట్టడాలు. పొగమంచులో వాటిని చూస్తుంటే ఓ దివ్యానుభూతి.

ఎక్కడి మాఊరు.. ఎక్కడి న్యూఢిల్లీ!! పంధొమ్మిదేళ్ళ యవ్వనం చలిని లెక్కచెయ్యలా...! నడుస్తూ నడుస్తూ క్యూ బ్లాక్ దాటాక చూస్తే ఓ ఎక్స్‌ప్రెస్సో కేఫ్ (expresso) కాఫీ తాగాను. (దానికి బురుజు కాఫీ అని తెలుగులో నామకరణం చెయ్యడమేకాదు... ఆ కేఫే వాడితో రోజూ 'ఏక్ బురుజో కాఫీదేనా" అని తెలుగులోనే ఆర్డర్ చేసేవాడ్ని.)

తాళం కప్ప కొన్నానుగానీ దాన్ని మాత్రం నా కప్‌బోర్డ్‌కి వెయ్యడానికి నాకు మనస్కరించలేదు. ఇంగ్లీషులో "మనం గర్వంగా తలెత్తుకు తిరగాల్సిన సైనికులం... దొంగలం కాదు.." అని ఓ కాయితం మీద అందంగా రాసి దాన్ని కప్‌బోర్డుకి జిగురుతో అతికించాను.

నిజం చెప్తున్నా.. నేను IAFలో ఉన్న 18 సంవత్సరాలూ ఏనాడూ నా కప్‌బోర్డులకి తాళాలు వెయ్యలేదు. ఇప్పటికీ తాళం వెయ్యడం అంటే నాకు ఎలర్జీ.

జనవరి గడిచి ఫిబ్రవరి సగానికి వచ్చేసరికి కనీసం అయిదుసార్లు రోడ్ నంబరు.1లోంచి వెళ్తూ ఇందిరాగాంధీ కారులో వెళ్ళడం చూశా. అబ్బ - ఎంత గ్రేస్..!! ఫిబ్రవరి మొదటి వారంలో స్వామి నన్ను తనతో తీసుకెళ్ళి కరోల్‌బాగ్, కన్నాట్ ప్లేస్ చూపించాడు. స్వెట్టర్ కొన్నది కరోల్‌బాగ్‌లో... జ్ఞానీక్లాత్ సెంటర్‌లో.. అది ఓ సర్దార్జీది.

నా జీతం నెలకి నూట ఇరవైరూపాయలు. (ఫుడ్డూ, ఎకామిడేషన్ అంతా ఏర్‌ఫోర్స్‌దేగా.. ఇంక్లూడింగ్ మెడికల్ ఎక్స్‌పెన్సెస్) ఓ నలభై నా దగ్గర ఉంచుకుని 80రూపాయలు మా అమ్మ పేరున మనియార్డర్ పంపాను. పొద్దున ఏడున్నరనుంచి ఒంటిగంటన్నర వరకూ డ్యూటీ.. మిగతాదంతా ఖాళీ సమయమే. మా కేంపస్‌లోనే డిఫెన్స్ థియేటర్ ఉండేది. టిక్కెట్టు పావలా. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ సిస్టం. 'బైజూబావ్‌రా' సినిమా చూసింది ఆ థియేటర్‌లోనే.

(దయచేసి ఇప్పుడే. ఇవాళే ఆ సినిమా చూడండి. మైమరచి పోతారు... ఏమి పాటలూ.. ఏమి చిత్రీకరణ.. బ్లాక్ అండ్ వైట్‌లో ఉండే డెప్త్ కలర్ ఫిలిమ్స్‌కి చచ్చినా రాదు)

మాట్లాడేటప్పుడు ముక్కుల్లోంచీ నోటిలోంచి 'ఆవిరి' వస్తుండేది. అదో చిత్రమైన అనుభవం. కన్నాట్ సర్కిల్‌లో తెలిసింది 'ఢిల్లీ సమోసాల' రుచి ఏమిటో - గ్యారంటీగా చెప్పగలను. 'సమోసా' తింటే ఢిల్లీలోనే తినాలి.. అలానే 'ఆలూటిక్కీ'. ఆ 'రుచి' లోకంలో మరెక్కడా దొరకదని బల్లగుద్ది మరీ చెప్పగలను. జ్ఞానీ రెస్టారెంట్‌లో 'ఫాలూడా' రుచీ అంతటిదే దక్షిణ భారతదేశపు వంటకాలు కొంచెమే తెలుసని నేను ట్రైనింగ్‌లో ఉండగా తెలిస్తే - ఉత్తర భారతదేశపు వంటకాలు వాటికి అవేసాటి అని ఢిల్లీ వచ్చాక తెలిసింది.

ఆలూ పరోఠా, మెంతీ పరోఠా, మూలీ పరోఠా.. ఇలా ఎన్నిరకాలో..! అలాగే వాటితో 'నంజు'కోవడానికి చేసే అనేకానేక ఊరగాయలూ పదార్థాలూ..!!

చలికాలపు రాత్రులు అద్భుతమైనవి. మంచు బద్ధకంగా.. తెరలు తెరలుగా కురుస్తూ ఉంటుంది. చెట్టు చేమలు మౌనంగా, కనీసం కొంచెమైనా కదలకుండా ఉండి పోతాయి. పొగమంచులో నక్షత్రాలు కనపడవు. చంద్రుడు మబ్బుల 'రజాయి'ని కప్పుకుని జోగుతూ ఉంటాడు. వెన్నెలకి బద్ధకమే. ఆ రోజుల్లో స్వామి దగ్గర ఉన్న రేడియోలో హిందీపాటలు పెట్టుకుని వింటుండేవాడ్ని.

"ఏ రాత్ ఏ చాంద్‌నీ ఫిర్ కహా.. సున్ జా దిల్ కీ దాస్ తా.."

"నయే చాంద్ హోగా.. న తారే రహేంగే.. మగర్ హమ్ తుమ్హారీ.."

"ధీరే ధీరే చల్...చాంద్ గగన్ మే.." ఇవన్నీ రేడియో వింటూ నేర్చుకున్న పాటలే..

ఒంటరిగా... అశోకా హోటల్ ముందున్న రోడ్ మీద వెన్నెల్లో తిరుగుతూ.. ఈ పాటలు పాడుకునేవాడ్ని. ఒక్కోసారి స్నేహితులు కూడా వచ్చేవాళ్ళు. అలాగే తెలుగు 'జాబిలి' పాటలు కూడా పాడుకునేవాడ్ని.

చలికాలపు చల్లదనం శ్వాసతోబాటు గుండె లోతుల్ని స్పృశిస్తుంటే, బద్ధకంగా వీచే శీతాకాలపు గాలులు ఒంటిని తడిమి 'చలిగింతలు' పెడుతుంటే.... మనోహరమైన హిందీ గీతాలు గొంతులో సుడులు తిరుగుతూ.... ఎక్కడో ఉన్న ఉమ కోసం ఆర్తిగా వెతుకుతూ ఉంటే... నాకు సమయం తెలిసేదిగాదు.

ఒక్కోసారి అమ్మ - తోడబుట్టిన వాళ్ళూ జ్ఞాపకం వచ్చేవారు. మా ఊరి 'మామిడిపూల' వాసన మనసులో 'గుప్పు'మనేది. ఆ మర్రిచెట్టు.. ఆ మర్రి చెట్టుకింద నేనూ ఉమా.. మా ఆటలూ....నిశ్వాసాలూ.. చెరువులో తామరపువ్వులూ.... ఆశ్రమంలో అమ్మవారి ముందు హారతి సమయంలో కొట్టే గంటలూ అన్నీ నన్ను ఓ మౌన సముద్రంలో ముంచేసేవి. (ఇప్పటికీ.)

'ఢిల్లీ' ఎందుకో నన్ను అక్కున చేర్చుకుంది. ఏ జన్మసంబంధమో తెలీదుగానీ, ఆ మహా నగరం నాకు 'కొత్త' అనిపించలేదు. ఎక్స్‌ప్రెస్సో వాడి దగ్గరికి వెళ్ళగానే 'బుర్జుకాఫీ' అని నవ్వుతూ కప్పులో నింపి ఇచ్చేవాడు. (Expresso Coffee అప్పట్లోనే కొత్తగా Introduce అయింది.)

"జిస్‌దేష్ మే గంగా బెహతీ హై" సినిమా వచ్చింది.. మా డిఫెన్స్ థియేటర్లోకి. పావలా టిక్కెట్టు కొనుక్కుని వెళ్ళాను. లక్కీగా టిక్కెట్టు ముందు తీసుకోవడం వల్ల ప్రొజెక్టర్ రూం నుంచి మూడవ వరుసలో చోటు దొరికింది. (మొదటి రెండు రోస్ ఆఫీసర్స్‌కి)

"మేరానామ్ రాజూ ఘరానా హై నామ్..

బెహతీ హై గంగా జహా మేరా థామ్"

"ఓ బసంతీ.. పవన్ పాగల్ నా జారే నాజా, రొకొకోయీ"

"బేగానీ షాదీ మే.. అబ్దుల్లా దీవానా"

"ఆ...అబ్ లౌట్ చలే...

ప్యార్ కర్‌లే నైతో ఫాసీ ఛడ్ జాయెగా.."

"హమ్ భీ హై.. తుమ్ భీ హో.. దోనోం హై ఆమ్‌నేసామ్‌నే" నాకు సినిమా పూర్తయ్యేలోగా పిచ్చెక్కింది. మ్యూజిక్ అంటే ఇదా..! స్వరాలంటే ఇవా.. గాడ్..! (ఇప్పుడూ అదే పిచ్చి.. అదే మైమరుపు.. దయచేసి ఆ సినిమా నెట్‌లో చూడరూ...!)

**హిందీ సినిమాలు చూడ్డం వల్ల హిందీ బాగా వచ్చింది.** అంతకుముందు మన 'హిందీ' పరిజ్ఞానం అతి తక్కువ. "తుమ్హారా నామ్ క్యా హై?" అంటే,

"మేరా నామ్ రాజూ" వరకే.

చదవటం అంతంతమాత్రమే. 'పూజ్యపితాజీ' అని ఓ లెటర్ ఎన్ని తప్పుల్తో వ్రాసినా పదిహేను మార్కులు వస్తాయి. పాస్..! మరి ఎవరు చదువుతారూ?

పాటలు వింటూ ఎవడో ఓ హిందీవాడ్ని పిలిచి అర్థం అడిగేవాడ్ని. వాడికి మూడ్ సరిగ్గా ఉంటే చెబుతాడు.. లేకపోతే లేదు.

కొన్ని కొన్ని పాటలు ఒక్కసారి వింటే చాలు.. అవి మళ్ళీ మళ్ళీ హాంట్ చేస్తాయి. వాటికి నేను 'జిడ్డు పాటలు' అని పేరు పెట్టాను. పొద్దున్నే అట్లాంటి పాట మనసులో మెదిలిందంటే చచ్చామే.. రోజంతా అది మనసులోనే బొంగరంలా తిరుగుతూ ఉంటుంది.

అట్లాంటి పాటల 'ట్యూన్స్' వరకూ నేను పెర్ఫెక్టే గానీ 'లిరిక్స్' దొరికేవి కావు. అదిగో .. అప్పుడే నేను ఆ ట్యూన్‌లకి తెలుగులో 'లిరిక్స్' రాసుకుని పాడుకుంటూ ఉండేవాడిని. ట్యూన్‌లో ఏ 'భావం' ఉందో ఆ భావాన్ని నా మాటల్లో పొదిగేవాడ్ని. ఉదా: అల్లరితనం ఉంటే అల్లరిగా రాసేవాడ్ని.. చిన్న విషాదం ఉంటే నా పదాల్లోనూ విషాదం నింపేవాణ్ణి. అప్పుడు అర్థమైంది –

"ప్రతి ట్యూన్ వెనకా పదాలుంటాయి... అలాగే ప్రతి పదం వెనకా ట్యూన్ ఉంటుంది" అని.

అప్పటి ఆ అనుభవం తరవాత్తరవాత నా 'జీవితం' అవుతుందని, నేను పాటల రచయితని అవుతాననీ నాకు తెలీదు.

ప్రతి నగరానికి పట్టణానికేగాదు.. ప్రతిగ్రామానికీ కూడా తనదైన ఓ 'ముద్ర' ఉంటుంది. అయితే మనం దాన్ని అసలు గుర్తించం. గుర్తిస్తే తప్ప 'ఉన్నట్టు' కాదని నా నిశ్చితాభిప్రాయం. ఢిల్లీ ఏ ట్రావెల్స్ వాళ్ళతోనో వెళ్ళొచ్చు. ఓ పదిరోజుల్లో పదిహేనురోజుల్లో అక్కడ తిరుగుతూ ఊరంతా చూడొచ్చు. నా దృష్టిలో అది 'తిండి పదార్థాలని'కళ్ళతో చూడటం లాంటిది. చూస్తే రుచి ఏమి తెలుస్తుంది? తెలియాలంటే, అక్కడి వాళ్ళతో 'మమేకం' కావాలి. నీటిలో నీటిలా కలిసిపోవాలి.

అలాగని 'మనని' మనం 'పోగొట్టు' కోవలసిన అవసరం లేదు.

'నీవు నీలా ఉంటూనే 'దాని'లా మారిపో'.. ఇదీ సూత్రం. ఇలా కలిసిపోవడం తెలుగువాళ్ళకి తెలిసినంతగా మన భారతదేశంలో ఏ భాషవాడికీ తెలీదు.. ఏ రాష్ట్రం వాడికీ తెలీదు. ప్రయత్నించినా వాళ్ళు కలవలేరు. వాళ్ళకి లేనిదీ – తెలుగువాడికి ఉన్నదీ ఈ ప్రత్యేకతే!

మళయాళం వాడు ఎప్పటికీ మళయాళీనే. తమిళవాడ్ని ఏ గ్రహంలో పెట్టినా వాడు అరవ్వాడుగానే ఉంటాడు తప్ప ఛస్తే మారడు. అలాగే బెంగాలీ, గుజరాతీ, పంజాబీ తదితర రాష్ట్రాల వాళ్ళు. అందర్నీ గమనించా. ఒక్క తెలుగువాడు మాత్రమే ఏ చోటనుంటే ఆ పరిస్థితులకి అనుగుణంగా మారిపోయి, అక్కడి వారితో మమేకమైపోతాడు. అందుకే నేను రాజస్తాన్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో ఉన్నప్పుడు వాళ్ళు తెలుగువాళ్ళని బాగా గౌరవించేవాళ్ళు. ఇష్టపడేవాళ్ళు.

ఏం రోజులవి! రామ్‌లీలా మైదానంలో 'అటల్ బిహారీ వాజ్‌పేయి' అనే సింహం లక్షలాది ప్రజల్ని ఉత్తేజపరుస్తూ గర్జించడం విన్నాను. ఎంతమంది సిన్సియర్ రాజకీయవేత్తల ప్రసంగాలు విన్నానో... ఎంతమంది గాయనీకాయకుల స్టార్ నైట్స్‌ని 'రవీంద్ర రంగశాల'లో చూశానో.. ఓ ఉత్సాహం.. ఓ ఉద్వేగం.. ఓ ఉత్తేజం.. నరనరానా పొంగిన రోజులు...–

మీసాలు అప్పుడే వస్తున్న తొలి యవ్వనం కదూ....

<u>"కెన్ యూ లిఫ్ట్‌మీ"</u>

రెడ్ ఫోర్ట్‌లో మీనా బజారు.. దానికి ఎదురుగా చాందినీ చౌక్, ఓ పక్కగా జుమ్మా మసీదు. చాందినీ చౌక్‌నీ, మీనాబజార్‌నీ చూడలేదంటే, మీరు ఢిల్లీ ఎన్నిసార్లు చూసినా, చూడలేదనే చెప్పొచ్చు.

"ఢిల్లీ సెహర్ కా సారా మీనా బజార్ లేకే" అని ఓ పాటలోనే ఉన్నది. (సినిమా.. కిస్మత్.. నటీనటులు: బబిత..బిశ్వజిత్...మకుటం... 'కజ్‌రా ముహబ్బత్‌వాలా.. పాడింది: షంషాద్ బేగం..)

ఇక చాందినీ చౌక్‌లో ఉన్నదో ప్రపంచపు వింత. అక్కడున్న 'పరంతా వాలా గల్లీ'లో గత వెయ్యేళ్ళుగా, వంశపారంపర్యంగా 'పరోటాలు' చేసే, చేస్తున్న కుటుంబాలు ఉన్నాయి. ఆ గల్లీలోని పరోటాలు ఆరగించకపోతే ఢిల్లీ పర్యటన వ్యర్థం. జుమ్మా మసీద్ దగ్గరైతే, అంటే ఫుట్‌పాత్ మార్కెట్‌లో, దొరకనివంటూ ఉండవు. అందుకే ప్రతి ఆదివారం, అద్భుతమైన, నోట్లో పెట్టుకుంటే కరిగిపోయే ఆలూపరోటాలు తిని - జుమ్మా మసీద్ దగ్గరి ఫుట్ పాత్ మార్కెట్‌లో పుస్తకాలు కొనుక్కునేవాడ్ని.

పుస్తకాలు చదవడమంటే నాకు పిచ్చి. ఎంత పిచ్చి అంటే అన్నం తింటున్నా చేతిలో పుస్తకం ఉండాలి. చిన్నప్పుడు లెక్కలేనన్ని తెలుగు+అనువాద నవలలు చదివాను. ఢిల్లీలో చదివిన పుస్తకాల 'ఇంగ్లీషు' వెర్షన్లు కొనుక్కుని చదివేవాడ్ని. ఆర్.కె నారాయణ్ పుస్తకాలన్నీ అలా 'ఇంగ్లీషులో' రుబ్బినవే. ది గైడ్ (మార్గదర్శి) ద.ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్, మెంపీ హిల్స్, ద డేట్ లెస్ డైరీ, గాంధియన్ వే - ద ఇంగ్లీష్ టీచర్ - స్వామీజి ఫ్రెండ్స్, ద పెయింటర్ ఆఫ్ సైన్స్ (signs), ఇవన్నీ అక్కడ కొని చదివినవే.

ఒకరోజున అలా పుస్తకాలు కొంటుండగా ఓ 'పిల్ల' ధమాల్ మని జారి ఫుట్‌పాత్ మీద పడింది. మరీ ఉదయమూ అందునా చలికాలం గనక జనాలు పెద్దగా లేరు. ఆ అందమైన పిల్ల పడిపోవడం చూశానుగానీ చేయూత నిచ్చి పైకి లేపాలన్న ఆలోచన నాకు రాలేదు. అదీగాక అమ్మాయిల్ని ముట్టుకోవడం అంటే ఆ రోజుల్లో ఘోరమైన నేరం. (మీరు నమ్మరుగానీ షేక్ హేండ్ ఇవ్వడానికి కూడా అమ్మాయిలు భయపడేవాళ్ళు) అవన్నీ నాపరాళ్ళు గనక (అప్పుడు) దెబ్బతగిలిందనుకుంటాను.. "హలో.. కెన్ యూ లిఫ్టిమీ.?" అన్నది బాధలో... నా వంక చూసి. విన్నాక కూడా సంకోచమే. "ఐయామ్ ఆస్కింగ్ యూ ఓన్లీ." కాస్త చికాగ్గా అన్నది ఆ పిల్ల.

ఠపాల్న వొంగి చేయి అందించాను. లేవలేకపోతుంటే, మీద చెయ్యివేసి రాజ్ కపూర్ నర్గీస్‌ని పట్టుకున్నట్టు (ఆర్.కె బేనర్) పట్టుకుని లేపాను. లేచి, కొంచెం బాధగా, భారంగా నా భుజం మీద తలవాల్చింది.

అయ్యా.. ఏం చెప్పనూ..

ఓ నులివెచ్చని కెరటం తనలోంచి నా శరీరాన్ని తాకి శీతాకాలపు గాలిలో 'కలిసి' పయినించే ప్రయత్నం చేసింది. ఓ అద్భుతమైన 'పరిమళం' నా శ్వాసలోంచి గుండెలోనికి ప్రవహించి, ఓ ఆనందంతో వ్యాకోచించి, గుండెలోని చోటు చాలక, - నిశ్వాసమై బయటికొచ్చింది. ఓ చిత్రమైన 'జీవరసాయన చర్య' జరిగి నా యావత్తు శరీరమూ గాలికంటే తేలికై - మనసుని గ్రహాంతరాలకి తీసుకుపోయే ప్రయత్నంచేసింది. (ఇదంతా ఇప్పుడు చెప్పే ప్రయత్నం అప్పటి పరిస్థితిని వివరించడానికి లోకంలో ఉన్న ఏ భాషా చాలదు).

"మీరు? ఐ మీన్ మీ పేరు... "

"ఐ మీన్ యువర్ నేమ్"

ఇలాంటి వ్యర్థపదాల్ని 'గొణిగిన' మాట మాత్రం వాస్తవం. అయితే ఏమాటా ఆ పిల్లకి వినిపించలేదని మాత్రం ఘంటాపథంగా చెప్పగలను. క్షణం.. అనేది ఓ యుగమై.. ఆ యుగం మళ్ళీ 'అర'క్షణంగా ఒదిగిపోవడాన్ని మాత్రం ఆనాడు అనుభవరూపంలో గ్రహించాను.

"నన్ను కాస్త నడిపించరూ.. ఎక్కడైనా కూర్చోవాలి. మోకాలుకి దెబ్బ తగిలింది..!" అని ఆమే మళ్ళీ మాట్లాడింది.

ఆ క్షణం ఈ సర్వ చరాచర ప్రపంచానికీ "ఇదిగో వినండి ప్రాణులారా!! ఈ కోకిల హిందీలో పలికే స్వరం వినండి!! దీనిని మించిన సంగీతం ఈ సృష్టిలో ఉన్నదా?" అని డిక్లేర్ చెయ్యాలనిపించింది.

శ్రీ 420 సినిమా "ప్యార్‌హువా ఇన్‌రార్ హువాహై" పాటలో ఒకే గొడుగు కింద 'రాజకపూర్, నర్గీస్' వర్షంలో నడిచినట్టు - ఆమె ఎడం చెయ్యి నా ఎడమ భుజాన్ని నొక్కిపట్టుకొనగా - నా కుడిచేయి లలిత సుందరమైన ఆమె నడుం మీద వేసి, నడిపిస్తూ అక్కడున్న ఓ బుల్లి రెస్టారెంట్ వరకూ తీసికెళ్ళి - ఓ కుర్చీలో ఆ యొక్క సౌందర్యవతిని కూర్చోపెట్టి - ఎదురుగా ఉన్న కుర్చీలో నేను కూర్చున్నాను. ఇదేంటి? అసలిదంతా నిజమా? కేవలం భ్రాంతా? భ్రాంతి అయితే ఈ అమ్మాయి ఎదురుగానే ఉందిగా!

కొన్ని ఆలోచనల రథాలు నిశ్శబ్దంగా కాలసముద్రంలోకి ప్రవహించాక "ఐథింక్.. ఐయామ్ ఓకే నౌ!" అన్నది.

"ఓ.. గ్లాడ్ టు హియర్ దట్.. లైక్ టూ హావ్ ఎ కప్ ఆఫ్ కాఫీ?" పొలైట్‌గా అడిగాను. ఏర్‌ఫోర్స్‌లో ఉండేది ఇంగ్లీషు మీడియం గనకనూ, పి.యు.సిలోనేను చదివింది ఇంగ్లీషే గనకనూ నేను కాస్త బాగానే ఇంగ్లీషులో మాట్లాడగలనని అప్పట్లో నా నమ్మకం. ***లోకంలో 'నమ్మకానికి' మించిన దైవం లేదు గదా..!***

"ష్యూర్.. బట్.." ఆగింది కొంచెం సందేహిస్తూ -

"నా పేరు రాజు.. నేను ఆంధ్రావాడిని. ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్నాను. ఇవిగో ఈ పుస్తకాలు కొనుక్కోవడానికి రెగ్యులర్‌గా వస్తుంటాను. ఇవాళా అలాగే వచ్చాను" అని గబగబా నా పరిచయం చేసుకున్నాను.

"ఓహ్.. సోగ్లాడ్ టూ సీయూ.. నా పేరు నమ్రతా సహానీ.. మా డేడ్ బేంక్ మేనేజర్.. నేను మొన్నే బి.ఏ ఫైనల్ పరీక్షలు పాసయ్యాను. ఇంకా జాబ్ వెతుక్కోలేదు.. పుస్తకాలు కొందామనే నేనూ వచ్చాను..!" తన కాకలిస్వరంతో అన్నది మిస్.నమ్రతా సహానీ బి.ఎ.

ఆ రోజు ఆ గిలిగింతల చలిలో ముచ్చటగా మూడు 'టీ'లు తాగుతూ 'సాహిత్య' అవలోకనం చేశాం. నేను ఆ.ర్.కె నారాయణ్‌గారి ఇంగ్లీషు నవలల గురించి మాట్లాడితే తను హెరాల్డ్ రాబిన్స్, సోమర్‌సెట్ మామ్ - హేమ్స్ గోర్లే ఛేస్ - ఇర్వింగ్ వెలేస్, అయాన్ రాండ్‌ల గురించి అనర్గళంగా మాట్లాడింది. వింటూ వింటూ నేను గ్రహించిందేమంటే ఆమెవి అత్యంత నల్లని కనుపాపలు. ఓ నల్లని రెండు నదులు వేగంగా ప్రవహిస్తూంటే ఎలా ఉంటుందో ఆ కళ్ళల్లోకి చూస్తుంటే అలా అనిపించింది. అంతేగాదు. రెండు అందమైన శ్యామ వర్ణపు అగాథాలా? అనికూడా అనిపించింది.

నిజం చెప్పొద్దూ.. 'ఉమ' తప్ప నాకెవరూ స్నేహితుల్లేరు. 'ఉమ' చల్లగా సాగే ఓ నది అయితే - ఈమె ఇంతెత్తునుంచి జారిపడే జలపాతం. 'ఉమ ' దగ్గరుంటే ఓ నిశ్చింత. ఈమె సమక్షంలో ఓ ఉద్వేగం. ఉమ వెన్నెల అయితే ఈమె విద్యుత్తు.

"రాజ్.. వాట్ ఆర్యూ లుకింగ్ ఎట్?" కళ్ళు చికిలించి సడన్‌గా అన్నది.

"మేబీ.. నిన్ను.. అదే నీలోని నిన్ను చూస్తున్నా" అన్నాను.

"వాట్?" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా అన్నది.

"అవును ప్రతివ్యక్తిలోనూ మరొక రూపం ఉంటుంది. బయటికి కనిపించేది బాహ్యరూపం. బహుశా నీలోని అంతరంగాన్ని చూస్తున్నాను!" అన్నాను. మిస్ నమ్రతా సహాని బి.ఏ పకపక నవ్వింది. పెదాలు మెల్లగా సాగుతూ విచ్చుకోవడం. పలువరస ఓ చిత్రమైన కాంతిని విరజిమ్మడం ఆ రోజే, ఆ క్షణమే - నేను మొదటిసారి చూసింది.!!!

ఒక దోమ కుట్టింది. చూస్తూనే ఉన్నా. ప్రొఫెషనల్ జాగ్రత్తలు తీసుకుని ఎగిరిపోయింది. మళ్ళీ పదిపదిహేను సెకన్లలో మళ్ళీ వచ్చి కుట్టినచోటు మీదే వాలింది. ఇంతకీ ఈదోమ ఆ దోమేనా! మరొకటా? మరొకటి అయితే కరెక్టుగా మొదటి దోమ కుట్టినచోటే ఎలా వాలుతుందీ?

ఇదే మాట నమ్రతా సహానీతో అన్నాను.

"ఆర్యూ మేడ్? అసలా దోమ గురించి ఇంత చర్చించాలా?" కొంత 'అదోలా', కొంత ఆశ్చర్యంగా నా వంక చూసి అన్నది నమ్రత.

చెప్పటానికి జవాబు నాదగ్గర ఉంటేగా! అయినా ఏదో చెప్పాలి గనక "యూసీ మీ ఇంటి పేరు సహానీ. నాకు తెలిసిన 'సహానీ'లు ఏర్‌ఫోర్స్‌లో చాలామంది ఉన్నా ఫేమస్ 'సహానీ' ఒక్కడే 'దోభిగా జమీన్'లో నట విశ్వరూపం చూపించిన బల్‌రాజ్ సహాని. ఇప్పుడు ఆ సహానీకీ - నా ముందున్న నీకూ 'రిలేషన్' ఏదైనా ఉన్నదా. లేక ఇద్దరూ వేరు వేరు సహానీలా అనే ప్రశ్న నాలో ఉదయించడం సహజమా కాదా? అలాగే ఇదీనూ" వీలున్నంతగా నవ్వి (అంటే.. అదే!) అన్నాను.

"అంటే ఆ దోమలూ మేమూ ఒకటేనా?" ఛట్టున లేచి నిలబడింది కోపంతో.

"నో.. నో.. నో నాటెటాల్. ఒక ఉదాహరణ.." చెయ్యిపట్టుకుని ఆపాను. మళ్ళీ ఓ మెరుపు. ఆ చేతిలోంచి నా చేతిలోకి అట్నించి గుండెలోకి పాకింది.

"గాడ్" సున్నితమైన రెండో చేత్తో సున్నితంగా తలమీద కొట్టుకుని అన్నది.

"యూ సీమ్ టూ బీ హారిబ్లీ మేడ్" అని కూడా జోడించింది.

ఆవిడన్న ఏ మాటా నాకే మాత్రం బాధ కలిగించలేదు కదా, కాస్త ఆనందం కూడా కలిగింది. ఎందుకంటే, నోటితో ఏమన్నా, మళ్ళీ కూర్చుందిగదా! అది ముఖ్యం.

అన్నట్టు చెప్పలేదు గదూ. ఈ సంభాషణ జరిగింది 'అప్పటి' చాందినీ చౌక్‌లో కాదు మా 'బురుజు కాఫీ' వాడి దగ్గర అదీ వారం తరవాత.

అవాళ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయేటప్పుడు నేనే కాస్త చనువు తీసుకుని 'బురుజుకాఫీ' వాడి గురించీ, మా అమ్మ నాకు మా ఫ్రెండ్‌తో పంపిన 'ఆవకాయ'రుచి గురించీ తెగ వర్ణించి, బురుజు కాఫీ వాడి దగ్గరికొస్తే కాఫీ తాగి సంతోషిద్దామనీ నేను తెచ్చే ఆవకాయ 'బాటిల్'ని హాయిగా తను వాళ్ళింటికి పట్టుకుపోవచ్చనీ చెప్పాను.

దాని ఫలితమే ఈ మీటింగ్.

ఆ తరువాత సంగతంటారా ... నేను మొట్టమొదటిసారి సినిమా అదీ న్యూఢిల్లీలో చూసింది నమ్రతతోనే. అదీ భారతదేశపు మొట్టమొదట 70ఎం.ఎం థియేటర్ 'షీలా'లో. సినిమా పేరు 'ఫన్నీగర్ల్'. నటులు బార్బారా స్ట్రెయిశాండ్.. మరియూ ద గ్రేట్ బోంబే బార్న్‌డ్ ఈజిప్షియన్ ఏక్టర్ ఒమార్ షెరీఫ్. (వీలుంటే చూడండి. అద్భుతమైన సినిమా. బార్బరా అద్భుతమైన గాయని నటి - బహుశా తెలుగు 'సీతామాలక్ష్మి'కి కొంత 'ఇన్స్పిరేషన్' ఆ సినిమానే అనుకుంటా.)

ఆ తరువాత వారానికో సినిమా చొప్పున చాలా సినిమాలు చూశాం. హిందీవీ, ఇంగ్లీషువీ ఒకటో రెండో పంజాబీవీ.

చలికాలంలో స్వెట్టర్లు వేసుకుని కెనాట్ ప్లేస్ రోడ్లని చాల అరగదీశాం. అలాగే ఎండాకాలంలో పిచ్చి ఎండల్లో చల్లని చిక్కని తియ్యని 'పంజాబీ లస్సీ' గ్లాసుల్ని ఖాళీ చేస్తూ.., అప్పుడప్పుడు అత్యంత రుచిగా తయారయ్యే ఢిల్లీ సమోసాల్నీ...టిక్కీల్నీ.. సర్దార్ జీలు ప్రత్యేకంగా చేసే 'ఆచార్'తో నంజుకు తింటూ కొన్ని వేల మాటల్ని విశ్వాంతరాళాల్లోకి 'విడుదల' చేశాము.

ఎప్పుడైనా అదాటుగా వర్షంపడితే, ఆ వర్షంలో తలుస్తూ, పుల్లని, తియ్యని 'గోల్‌గప్పా'ల్ని ఖాళీచేస్తూ వర్షరాణి విన్యాసాలు చూశాము. కొన్ని తెలుగు, హిందీ పాటల్ని నేను పాడుతూ ఉంటే, నమ్రత నా పక్కనే నడుస్తూ నా భుజం మీద తన 'వేళ్ళ'తో తాళం వేస్తుంటే, ఆ అనుభూతులు అన్నింటినీ ఢిల్లీ రోడ్లమీద 'అడుగుజాడలు'గా మలిచి ఆనందించాం.

"ఏదో ఎదురుచూపు...

ఏదో పలవరింత..

ఏదో ఓ తీవ్రమైన అలజడి

ఏదో ఓ మైమరుపు..

మనసునీ. కళ్ళనీ వెలిగిస్తూ

తనువునీ వయసునీ ఊపేస్తూ

'నేను'లోంచి 'నేను' తప్పుకుని

తనలోని 'నేను' కోసం

'ఉనికి'కోసం వెర్రిగా వెతికేస్తూ..

'కాలం' గడుస్తోంది నేస్తం.

'గాయం' కూడా సుఖాన్నే ఇస్తోంది నేస్తం"

ఇది.. అప్పుడు రాసిన కవిత. అర్థం పర్థం ఉన్నా లేకపోయినా ఇది నాది. 'నా' అనే నా 'క్షణపు' సవ్వడి అది. ఇప్పుడూ నాకు అది మధురంగానే ఉన్నది.

తను వస్తూనే ఓ పరిమళాన్ని వెంట తీసుకొస్తుంది. కొన్ని 'చిరునవ్వు'ల మెరుపులూ.. కొన్ని 'అలకల' సొబగులు కొన్ని 'మమతల' మాలలూ, తన కనురెప్పల మాటున దాచి తీసుకురావడం ఎన్నడూ మరచిపోదు.

మధ్యమధ్యలో వెన్నెల రాత్రిలో చెరువులో చేపలు ఎగిరినట్లు చిరుచిరు స్పర్శలు జాగ్రత్తగా, సున్నితంగా, అందంగా అందిస్తుంది.

"రాజ్.. ఓ గానా.. వహీ.. ఆ.. 'ఏ మేరే దిల్ కహీ ఔర్ చల్' పాడవూ?" అడిగింది. తన ఒంట్లోంచి విరబూసే పరిమళపు మేఘాల్లో చిక్కుబడి, నేను నన్ను మరిచిపోయి ఆకాశాన్ని చూస్తూ పాడేవాడ్ని.

తను నావంకే 'అచ్చు 'ఉమ'లాగే' చూస్తూ ఉండేది.

"ఎందుకలా చూస్తావూ?" అంటే -

"నువ్వు నీ చూపుల్ని ఆకాశంలోకి గుచ్చుతున్నావుకదూ.. నాకు తెలుసు.. నువ్వెరినో 'అక్కడ' చూస్తున్నావు. నీ వంకే చూస్తూవుంటే - బహుశా 'వాళ్ళు' నీ కళ్ళల్లో కనపడతారేమో అని చూస్తున్నా!" అనేది.

వీటినే ననుకుంటా 'స్వీట్ నథింగ్స్' అనేది.

వినడానికి ఎంతో స్వీట్‌గా ఉన్నా పనికొచ్చే 'విషయం' ఉండదుగా మరి. (తరువాత అర్థమైంది. ఈ స్వీట్ నథింగ్సే జీవితానికి ఊపిరిపోసే'ఆశ'లుగానూ, 'జ్ఞాపకాలు' గానూ మారతాయని)

ఆ రోజుల్లోనే పిచ్చిపట్టినట్టు చదివేవాడ్ని. హెరాల్డ్ రాబిన్స్‌నీ, ఇర్వింగ్ వెలాస్‌నీ.. జ్ఞాపకమే.. 69 పార్క్ ఎవెన్యూ, వేర్ లవ్ హాజ్ గాన్, నెవర్ లవ్ ఎ స్ట్రేంజర్, ద కార్పెట్ బెగ్గర్స్, ఆఫ్ హ్యూమన్ బాండేజ్ (మా మ్) ద మౌంటెయిన్ ఈజ్ యంగ్' (హాన్ సుయాన్) మేడమ్ బావరీ.... (గుస్టెవ్ ఫ్లేబర్ట్) ఇలా .. వందల కొద్దీ నవలలు.. నా మనసుని ఆక్రమించేశాయి.

కొత్తకొత్తగా మీసాలొస్తున్న నవయవ్వనంలో (అంటే - విలాసం 'ముదర'లేదని అర్థం అన్నమాట) నన్ను ఏడిపించిన నవల 'మేడమ్ బావరీ'.

ఆ నవల పూర్తయ్యాక ఓ పదిహేనురోజులపాటు పొద్దునే లేచి అద్దం చూసుకుంటే నా బుగ్గల్నిండా కన్నీటి చారికలు ఉండేవి. అత్యధికంగా ప్రేమించిన భార్య (ఎమ్మా) చనిపోతే భర్తకి (ఛార్లెస్)కి కలిగే దుఃఖాన్ని కలల్లో నేను అనుభవించానన్నమాట.

భార్య తిరుగుబోతైె తనని అన్యాయం చేసిందని తెలిసినా ఛార్లెస్ యొక్క ఔన్నత్యం ఎంతదంటే - చెప్పను... చదవండి.

ప్రపంచమంతా రగ్గులు కప్పుకుని గాఢంగా నిద్రపోతుంటే నేను కొత్తగా కొనుక్కున్న నా టేబుల్ లైటు వెలుగులో ఎన్ని నవలల్ని చదివానో.. నా దృష్టిలో నవల చదవడమంటే - 'జీవితాల్ని' చదవడమే!

ఆ సుదీర్ఘ రాత్రుల్లో ఎన్ని లక్షల నిట్టూర్పులు ఆలోచనలలో కలిసి అంతరిక్షానికి ప్రయాణించాయో.

నవలలోని ఏ పాత్ర అయినా అని "నేనే" అనిపించేది. ఇక నాయికల సంగతా. ఓహ్.. నగ్న 'స్వప్నా'ల్లో నాట్యమాడేవారు.

ఒంట్లోంచి వెచ్చని సెగలు రేగుతుంటే - చలిరాత్రులు ఆ వెచ్చదనాన్ని ఆబగా తమలో కలిపేసుకునేవి.

***ఎంత గొప్పది జీవితం. ఏదీ అడగదు. అన్నీ తనే ఇస్తుంది.. విచారాన్నీ, దుఃఖాన్నీ... ఆనందాన్నీ.. తాపాన్నీ కోపాన్నీ సర్వరుచులూ అదే చూపిస్తుంది.***

ఓసారి 'గోల్షా' (Golshaw) మహల్ ఓ తెలుగు సినిమాకి శ్రీమతి వి.వి.గిరిగారు, చుట్టాలు పక్కాలతో వచ్చారు. నిజంగా 'తెలుగుతల్లి'ని చూసిన ఆనందం కలిగింది. ఎంత ఆప్యాయతో, ఎంత ప్రేమో.. నోరారా నవ్వుతూ అందర్నీ పలకరించి మనసారా మాట్లాడారు. కొంగర జగ్గయ్యగారప్పట్లో ఎం.పి. ఏడిద గోపాలరావుగారూ ఢిల్లీలోనే ఉండేవారు. వారినీ కలిశాను.

శ్రీమతి గిరిగారిలో 'అమ్మ'తనం.. 'బోళా'తనం అనంతమైన 'మంచి'తనం మూర్తీభవించి ఉంటాయి. నాకెందుకో ఆవిడతో మాట్లాడుతుండగా మా 'అమ్మ' గుర్తుకొచ్చి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"వై దోజ్ టియర్స్?" నమ్రత అడిగింది. ఆమెకీ ఎక్సైట్‌మెంట్ రాష్ట్రపతిగారి భార్యను కలవడం.

"మా అమ్మగుర్తొచ్చింది" అంతకు మించి మాట్లాడలేకపోయాను. అప్పుడు తనో గొప్ప మాట అన్నది 'To be Sentimental is foolish' అని.

నిజమా? ఏమో ఇప్పటికీ నాకు తెలీదు.

"అయోనిజ పైనే అనుమానమా.. ధర్మమూర్తి రామచంద్రుని ఇల్లాలికా.. ఈ.. ప..రీ..క్షా.." అని నేడు టీ.వీలో వచ్చినా, నాకు వెక్కెక్కి ఏడవాలనిపిస్తుంది. బలవంతంగా అణుచుకుంటూ... దాంతో కళ్ళు ఎర్రబడతై.. గొంతు కాసేపు బిగుసుకుపోతుంది.

అది'లవకుశ' సినిమా అని తెలుసు. అక్కడున్నది అంజలీదేవిగారనీ, రామారావుగారనీ తెలుసు...కానీ అక్కడున్నది 'సీతారాములు..' అది మనసుకి మాత్రమే తెలుసు.

'అమ్మా .. నీ మీద అనుమానమా.. దానికి అగ్నిపరీక్షా' ఇదిగో ఈ మాటలు రాసేటప్పుడు కూడా ఏడుపుతన్నుకొస్తోంది. కళ్ళు చెమర్చి..

థియేటర్‌లోంచి బయటికొచ్చాం. ఓన్లీ సైలెన్స్. ఒకళ్ళవంక ఒకరం చూసుకోవడానికి కూడా బెదిరాము. ఎందుకంటే.. అది మొదటి ఇంటర్వెల్.... 'మేరానామ్ జోకర్' సినిమాకి. రిషికపూర్ టీచర్‌ని (సిమిగరేవాల్‌ని) ప్రేమిస్తే డేవిడ్ (మనోజ్‌కుమార్ - సిమికి కాబోయే భర్త) వచ్చి రిషీకి పసి వయసులో కలిగే మనోచాంచల్యాల గురించి వర్ణిస్తాడు. ట్రైన్ కదిలివెళ్ళిపోతుంటే కన్నీళ్ళతో రిషి.

అసలా సినిమా అంత గొప్ప సినిమా నేటివరకూ వెండితెర మీదకి రాలేదు... ఇక రాదు. షో మాన్ రాజ్‌కపూర్ వెళ్ళి పోయాక ఇంకెలా వస్తుందీ..!

పిచ్చెక్కింది. అప్పటివరకు నమ్రత 'తనువు' గురించి నేనేనాడూ ఆలోచించలా.

'స్పర్శ'లో సుఖం తెలిసేదిగానీ - అది ఇతమిద్ధమని తెలీదు. అసలు నా దృష్టి 'స్నేహా'నికి ఆవలితీరం వైపు పయనించలా.

థియేటర్‌లో ఎందుకో, తను నా చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఆ శరీరంలోంచి నా శరీరంలోకి ఎంత వేడి పాకిందంటే, ఇద్దరం చలికాలంలో అంటించి చలికాచుకునే 'బొగ్గుపొయ్యి'ల్లా ఐపోయాం. అలాగే పట్టుకుని ఉండటంతో అంత చలిలోనూ ఆమె అరచేతికి కొద్దిగా పట్టీపట్టనట్టు చెమటపట్టించి. నా చేతిని బిగించి పట్టుకున్న ఆమె చెయ్యి ఫస్ట్ ఇంటర్వెల్ కొట్టేదాకా విడలేదు.

మౌనం అనేది మంచులాంటిది... విడగొట్టాలి.. తప్పదు... "నమ్రతా... కాఫీ..... యా... చాయ్?" అన్నాను.

తటాల్న కళ్ళెత్తి నా వంక చూసి, 'జో తుఝ్ కో ఓ పసంద్ వహీ ౯" అన్నది. ఆ లైను ముఖేష్ పాడిన పాటలోదని నాకు ఇప్పుడు తెలుసు. 'జో తుఝ్ కో జో పసంద్ వహీ బాత్ కరేంగే తూదిన్ కో అగర్ రాత్ కహే.. రాత్ కహేంగే"

అనేది పల్లవి (అది తరవాత తరవాత అర్థమైంది. 'రాబోయే భవిష్యత్తుని వర్తమానమే ఒక్కోసారి వెల్లడిస్తుంది' - అనడానికి ఇదో తార్కాణం)

కాఫీ తాగుతూ కళ్ళల్లోకి చూస్తుంటే సడన్‌గా అనిపించింది.

'అవి కళ్ళు కావు - కలల సరోవరాలు' అని.

**ఓ అద్భుతం 'తెర'మీద ఆవిష్కరింపబడింది.** 'సింబాలిజమ్' అంటే ఏమిటో ఎలా ఉంటుందో రాజ్‌కపూర్ మేరానామ్ జోకర్ లో చూపించాడు. ఫ్లైట్‌లో వెడుతున్న రాజ్‌కపూర్, పద్మిని, రాజేంద్రకుమార్‌ల మెంటాలిటీని కేవలం మేగజైన్స్‌తో చెప్పాడు - ఏ ఎండకాగొడుగు పట్టే పద్మిని చేతిలో 'టైమ్' మేగజైన్, మనుషుల్ని కేవలం 'బిజినెస్' దృష్టిలో చూసే రాజేంద్ర కుమార్ చేతుల్లో "బిజినెస్" , ఎన్ని గాయాలైనా 'మనిషి'గానే ఉన్న రాజ్ చేతుల్లో 'Life' Mag!! ఆ ఒక్క షాట్ చాలదూ..!!

కన్నతల్లి కళ్ళముందే చనిపోయినప్పుడు 'జోకర్'గా తన కర్తవ్యాన్ని నిర్వహించక తప్పని పరిస్థితుల్లో - గుండె జేబులోంచి పావురాన్ని బయటికి తీసి ఎగరేస్తాడు. 'మనం 'హంస' లేచిపోయింది అంటాంగదా' అలాగ.

జీవితాన్ని పాటగా మలచిదాంతో మూడుగంటల సర్కస్‌ని పోల్చి పెహలా ఘంటా బచ్ పన్ హై (మొదటి గంట బాల్యం) దూస్‌రా జవానీ హై (రెండో గంట యవ్వనం)

తీస్‌రా బుఢా పా హై (మూడవది వార్ధక్యం)

ఉస్ కే బాద్ - (ఆ తరువాత)

"అంతా ఖాళీనే.. ఖాళీ కుర్చీలు.. ఖాళీగుడారం (టెంట్) 'పక్షి'లేని 'పంజరం'.. అవే మిగులుతై.. అవి నీవీ కావూ నావీ కావూ" అంటాడు. ఎంతటి తాత్వికత.

ఒక్కో డైలాగ్. ఒక్కోపాటా అన్నీ ఆణిముత్యాలే.

"జీనా యహా... మర్‌నా యహా.. ఇస్‌కే సివా జానా కహా"

"అగ్ నా లగ్ జాయే.."

"ఏ భాయ్ - జరా దేఖ్ కె చలో..

"కెహతాహై జోకర్ సారాజమానా"

తడిసిన చీరతో పద్మిని పాట "అంగ్ లగ్ జాచాల్ మా' ఓహ్.. నాలుగ్గంటల సినిమా చూసి బయటికొచ్చాం.

'సెబొటేజ్' అంటే అర్థం అప్పుడే తెలిసింది. ఫస్ట్ డేనే, రెండో ఆట అవంగానే కొందరు పదిరూపాయలు టాప్ టిక్కెట్టుని 5 రూపాయలకి అమ్మటం మొదలెట్టారు. అదేం అంటే 'బోర్ పిక్చర్ హైసాబ్' అన్నారు. అప్పుడేగా మేం చూసొచ్చింది!

తరువాత తెలిసింది మరో 'హీరో' తాలూకు ఫేన్స్ ఈ సినిమాని ఫ్లాప్ చెయ్యడం కోసం ముందే బల్క్ టికెట్లు (అన్ని థియేటర్లలోనూ ఇదే కథ) కొని సగానికి సగం రేటుకి అమ్మాలని ప్లాన్ చేశారట.

గుండె మరిగిపోయింది. ఢిల్లీ టాక్ ఫ్లాప్ అని ఎప్పుడొచ్చిందో అది గాలి కంటే వేగంగా దేశం మొత్తాన్నీ ఆక్రమించి 'జోకర్'ని అట్టర్ ఫ్లాప్‌గా నిలిపింది. రాజ్‌కపూర్ ఆస్తులు మొత్తం తాకట్టులోకి వెళ్ళిపోయాయి. మేరానామ్‌జోకర్ -2 ప్రాజెక్టు రాజ్‌కపూర్ గుండెలోనే సమాధి అయిపోయింది.

రష్యా మాత్రం 'మేరానామ్ జోకర్'ని కిరీటంలా నెత్తినపెట్టుకుని లాభాల వర్షం కురిపించింది. నీలికళ్ళ రాజ్‌కపూర్ ప్రాణాల్ని నిలబెట్టిన 'బాబీ' అనే 'సినీచరిత్ర'ని సృష్టించింది.

అలా సెబొటేజ్ ఘట్టానికి సాక్షులమయ్యాం - నేనూ, నమత. చిత్రం ఏమంటే రాజ్‌కపూరే ఆ చిత్రం 'నిడివి' తగ్గించి రిలీజ్ చేస్తే అదే ప్రజలు సినిమాని నెత్తిన పెట్టుకుని "వెండితెర అద్భుతం" అన్నారు. నిబిడాశ్చర్యంతో వారే అన్న శ్రీశ్రీ పలుకులు శిలాక్షరాలుగదూ! ఇదంతా ఎందుకంటారా? నేనో 'సాక్షి'ని గనక.

సినిమా అయ్యాక చాలాదూరం నడుస్తూ వెళ్ళాం. మౌనం ఎంత అద్భుతమైనదో! ఎన్నో ఎన్నో 'చెప్పలేని భావాల్ని' మౌనం చెబుతుంది.

'పాట' మీద ప్రేమపుట్టింది - ఎంతంటే రోజుకో పాట అయినా రాసేవాడిని. నేనే నాకు తోచిన 'ట్యూన్' కట్టి నమత (నమ్మో)కి వినిపించేవాడిని. "మత్‌లబ్ క్యాహై?" అని ఆమె కుతూహలంగా అడిగితే నేను వీలున్నంతవరకూ నా తెలుగు పాట భావాన్ని హిందీలో వివరించడానికి ప్రయత్నించేవాడిని. ఎందుకంటే - హిందీ మీద పట్టుదొరకాలిగా మరీ. సామాన్యంగా మేము కలిసేది వారాంతాల్లోనే.

ఒకసారి రెడ్ ఫోర్ట్‌కి వెళ్ళాం. డిఫెన్స్ 'ఐడెంటిటీ' కార్డు ఉంది కనుక బయటవాళ్ళకి 'చూపని' చాలా విభాగాలు చూసే అవకాశం గలిగింది. "ఏమిటి అలా నిటారుగా ఏదో చక్రవర్తిలా నడుస్తున్నావూ?" అన్నది.

"కాకూడదని ఎక్కడున్నదీ? ఏమో పూర్వజన్మలో ఇక్కడే సంచరించిన పాలించిన చక్రవర్తి నేమో? అసలు ఈ స్థలానికీ మనకీ ఏ సంబంధమూ లేకపోతే ఇక్కడికి ఎందుకువస్తాం? భారతదేశంలో కోటాను కోట్లమంది ఉన్నారు. కొందరు మాత్రమే ఇక్కడికి రాగలుగుతున్నారు. అంటేదాని 'అర్థం' ఏమిటో ఆలోచించు!" అన్నాను.

"సరే.. మరి నేను ఎలా నడవాలీ?" చిన్నగా నవ్వి అన్నది నమత.

"'చక్రవర్తిని' లాగా నడు. కనీసం ఊహలైనా గొప్పగా ఉండాలి కదా!" అన్నాను.

జీనత్ మహల్ (చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా భార్య) కట్టుకున్న దుస్తులూ.. ధరించిన నగలూ వస్తువులూ చూసినచోట ఠక్కున ఆగిపోయా.

...ఈ ఎర్రకోటలోనే నా మొఘల్ చక్రవర్తులు నడయాడిందీ.. ఈ ఫ్లోర్ మీదేగా వారు నడిచిందీ... ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచింది.

'మొఘల్-ఎ-అజామ్' సినిమా గుర్తుకొచ్చింది.(ఇప్పుడుకూడా)

ఎక్కడి కెళ్ళిపోయారూ? ఏమైపోయారు వారంతా?

"కారే రాజులు రాజ్యముల్ కలుగవే గర్వోన్నతింబొందరే -" అందరూ కాలసముద్రంలో కలిసిపోయారు...

ఫలానా వారు గొప్పవారు. గొప్పపదవీ పేరూ ధనమూ అన్నీ ఉన్నవారు.. వారిని అందరూ గౌరవిస్తారు.

వారే చనిపోతే?

"శవాన్ని ఇంటికి తెచ్చారాండీ?" అని ఒకరడిగితే

"బాడీ(body) హాస్పటల్లోనే ఉందా అంకుల్?" అని ఇంకోరడుగుతారు.

అంతేగానీ ఫలానా సూపర్నెంటుగారిని ఇంటికి తెచ్చారా అనో ఫలానా పద్మభూషణ్ వీర వెంకట సుబ్బయ్యగార్ని ఇంటికి తెచ్చారా అనో ఎవరూ అడగరుగా. అంటే -

ప్రాణం పోయిన మరుక్షణమే పేరూ పదవీ బిరుదులు అన్నీ పోతై. బాడి (body) అన్న 'సర్వనామం'తప్ప -

ఒకవైపు మనసులో ఆశ్చర్యం ఉద్వేగం - మరోవైపు వైరాగ్యం.

"క్యా సోచ్ రహేహో" నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని అన్నది నమ్రత. చెప్పాను. చాలాసేపు నా కళ్ళల్లోకే చూస్తూ నిలబడింది. "ఏమిటి చూస్తున్నావు?" అడిగా.

"అప్పుడెప్పుడో ఓసారి నువ్వు అన్నావు చూడు.. నీలోని నిన్ను చూస్తున్నానని.. అప్పుడామాట అర్థంకాలేదు.. ఇప్పుడు తెలుస్తోంది... చాలా స్పష్టంగా.. ఇప్పుడు నేను చూస్తున్నది 'నీలోపల ఉన్న అసలు సిసలైన నిన్ను" నీకు శరీరం ఉంది కానీ నీలోని నీకు ఏ శరీరమూలేదు... అసలు 'పరిధే'లేదు." సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నది నమ్రత.

'జానీ మేరా నామ్', 'జోషీ', 'అనోఖీరాత్' ఇవన్నీ కలిసే చూశాం. నేనో తనో ఎవరో ఒకరం టిక్కెట్లు ముందే బుక్ చేసేవాళ్ళం. ఓసారి ఏర్‌ఫోర్స్ స్టేషన్ థియేటర్లో.. ఓ సినిమా ప్రివ్యూకి దేవానంద్ వచ్చాడు. ఫుల్ ఆఫ్ ఎనర్జీ.

అప్పటికీ ఇప్పటికీ నాకు అత్యంత ఇష్టమైన సినిమా అనోఖీరాత్. బి గ్రేడ్ సంజీవ్ కుమార్ ఆ పిక్చర్ తో 'నటన' సత్తా ఏమిటో చూపించాడు. ఇప్పటి 'రోషన్'ల తండ్రి రోషన్‌గారు నిర్మించిన సినిమా అది. సంగీతం ఆయనదే

"ఒహోరే తాల్ మిలే నదీన్ జల్‌మే
నదీమిలే సాగర్ మే.. సాగర్ మిలే కౌన్ స
జల్‌మే.. కోయీ జానేనా" అనే పాట గుర్తుందా?

(కాలువల్లోని నీళ్ళు నదుల్లో కలుస్తాయి... నది నీరు సముద్రంలో కలుస్తుంది... సముద్రంలో నీరు ఎందులో కలుస్తుందో ఎవరికి తెలుసు?)

మొదటి చరణంలో రెండులైన్లు: పానీ మే సీప్ జైసీ ప్యాసే ప్యాసీ 'హర్' ఆత్మా.. ప్యాసీ 'హర్' ఆత్మా. ఓ మిత్ వారే... పానీ మే సీప్ జైసీ ప్యాసీ 'హర్' ఆత్మా.. బూంద్ చుపే కిస్ బాదల్ మే కోయీ జానేనా" అంటాడు కవి.

"ఉప్పునీటిలో ముత్యపు చిప్పలాగా ప్రతి ఆత్మా దాహంతో ఎదురుచూస్తూ ఉంటుంది.... ఆ ముత్యపు చిప్పలో ఏ మబ్బులోని చినుకుపడి - దాని దాహం తీర్చి ముత్యమై తరిస్తుందో ఎవరికి తెలుసూ?" ఇదీ ఆ పదాలకి అర్థం. అలాగే "తెలియని పెదాల మీద తెలిసిన పాట... నిన్నటివరకూ ఎవరో తెలియని మనిషి నేడు జన్మజన్మల బంధంగా మారింది.. రేపు ఏమి అవుతుందో తెలిసిందెవరికీ?" అని రెండో చరణం అంటుంది.

ఓహ్.. ఎంత సున్నితమైన - ఎంత మధురమైన గీతం పాటలన్నీ అద్భుతంగా అమిరాయి. ఎవర్ గ్రీన్ సాంగ్స్.

"మళ్ళీ అదే ఆ పాట పాడవూ... అదే. ఒహోరే తాల్ మిలే" పాట విజయ్ చౌక్‌లో పచ్చని గడ్డి మీద కూర్చుని ఉండగా అడిగింది న్రమత.

ట్యూన్ నాకు వచ్చు. లిరిక్స్‌ని పదిసార్లు తనే 'విని' నాకోసం రాసుకొచ్చి ఇచ్చింది. వారం క్రితం. మధ్యలో ఒసారి కలిసినప్పుడు పాడి వినిపించా (కొంచెం గర్వంగానే అనుకోండీ) ఇప్పుడు మళ్ళీ 'ఫర్మాయిష్' అన్నమాట.

మరీ'మెల్లగా' పాడటం నాకు రాదు. (ఇప్పటికీ). అందులోనూ ఇలాంటి ఎమోషనల్ సాంగ్స్‌ని 'గొణుగుతూ' పాడితే ఏం బాగుంటుందీ. కళ్ళు మూసుకుని హాయిగా పాడేశాను.

కళ్ళు తెరిస్తే కనీసం ఓ పాతికమంది చుట్టూ ఉన్నారు. చప్పట్లు..!! ఉత్తర భారత దేశంలో ముఖ్యంగా ఢిల్లీ వాళ్ళకి గానమన్నా నృత్యమన్నా ప్రాణం. నేను మరీ ముఖేష్ రేంజి గాయకుడ్ని కాదుగానీ ఆయనలో కనీసం టెన్ పర్సెంట్ గాడ్ని. (సరదాగా అంటున్నా ఆ మహానుభావుడితో పోలికేమిటీ?) ఎందుకంటే నేను ప్రస్తుతం ముక్కుతోటే పాడాను జలుబువల్ల.. ఆయనది గుండెలోంచి వస్తే మనది 'నోస్'లోంచి వచ్చిందన్నమాట.

చిరుచలిలో పచ్చికబయలుమీద చిన్న 'సంగీత కార్యక్రమం' జరిగింది.

'శ్రీ420' లో "రామయ్యా వస్తావయ్యా" నుంచి 'గోపీ'లోని "రామ్ చంద్ర కెహగ యే సియాసే" వరకూ.. జనాలు ఆనందించారని ఘంటాపథంగా చెప్పగలను.

"జీవితమంతా ఇలాగే గడిచిపోతే ఎంతబాగుంటుందీ?" గంట తరువాత 'బురుజుకాఫీ' తాగుతుండగా అన్నది న్రమత.

"ఒరేయ్.. ఈ ఊరు వదిలి వెళ్ళాలని లేదురా.... నిన్ను విడిచి అసలు వెళ్ళాలని లేదు" గట్టిగా కౌగలించుకుని అన్నది ఉమ. ఆమె కళ్ళల్లోంచి కన్నీరు కారుతూ ఓణీ తడిసింది.

"ఉండిపో" నేనన్నాను.

"ఎలా కుదరదుగా!" నిరాశ.

"నిన్ను పెళ్ళి చేసుకుంటా.. ఇప్పుడే!" అన్నాను.

"పిచ్చోడా.. పిచ్చోడా" నా తలని గుండెకు హత్తుకుని అన్నది, "ఎప్పటికి ఎదుగుతావుతావురా నువ్వూ?"

"ఉమా.. మీ నాన్నగారు నీకోసం వెతికిస్తున్నారే.. లారీలో సామాన్లెక్కించేశారు.. తొందరగా రా!" ఉమా వాళ్ళింటి పక్క ఇంట్లో ఉండే పార్వతి అన్నది. మేము ఇక్కడే. అంటే ఈ మర్రిచెట్టు కిందే దొరుకుతామని పార్వతికి తెలుసు. పార్వతికిప్పుడు పదిహేడు... ఉమకి పదహారు. నాకు పదిహేను. కళ్ళుతుడుచుకుని లేచింది. నేనూ లేచాను.

ఉమా వాళ్ళిల్లు చేరేవరకూ మౌనమే. నాకు నోరు పెగల్లేదు. ఉమకి కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

ఆ రోజుల్లో మా ఊరి చుట్టుపక్కలెక్కడా టేక్సీలు ఉండేవికాదు. జట్కాలున్నా కొంతదూరం వరకే. ఆటోల గురించి మాకు తెలీనే తెలీదు. మోటర్ సైకిలు కూడా మా ఊరి మొత్తానికీ ఒకరింట్లోనే ఉంది. వాళ్ళు లక్షాధికారులు.

మొటమొదటిసారి నేను 'టాక్సీ'ని చూసింది ఆనాడే.. 'ఉమ' మావూరి నుంచి వెళ్ళిపోయిననాడే

తలతిప్పి నావంకే చూస్తూ చూస్తూ వెళ్ళిపోయింది. అప్పట్లో 'టాటా' చెప్పడం అనేది మాకు తెలీదు. ఎక్కడెక్కడ 'దాక్కున్న' కన్నీళ్ళు ఒక్కసారి కళ్ళల్లోంచి ప్రవాహమయి బయటపడ్డాయి. టాక్సీ దూరంగా వెళ్ళిపోయాక ఉమ ఇంటి ముందే కూలబడ్డాను. సూర్యకాంతికి ఓ గాజుముక్క మెరుస్తూ చెత్తకుప్పలో కనిపించింది. నాకు ప్రాణం లేచొచ్చింది. ఆ పచ్చని గాజుముక్క ఉమదే. ఒక్క ఉదుట్న లేచి ఆ గాజుముక్కని నుదుటికి హత్తుకున్నా.... అరచేతిలో పెట్టుకున్నా... ఓ కన్నీటిచుక్క ఆ గాజుముక్కమీద పడి సూర్యకాంతికి ప్రతిఫలించింది. ఇప్పుడేం చెప్పనూ? ఆ క్షణాలు నా గుండెలో ఉంటే - ఆ గాజుముక్క ఈ 'క్షణం' నా చేతుల్లో ఉంది. ఓ మట్టిగాజుముక్క -

ఈ 'శరీరమూ' అంతేగా' మట్టిలోంచి పుట్టి, మట్టిలో కలిసిపోయే ఓ 'బొమ్మ' గాజుబొమ్మ.

అయితే ఓ చిన్న తేడావుంది.

గాజుబొమ్మ పగిలితే అతుక్కోదు.. అతుక్కున్నా.. పగిలిన పగుళ్ళని ఎక్కడ అతికించామో తెలుస్తూనే ఉంటుంది.

మనిషి 'మనసు' వేరు.

అది ప్రకృతిలాంటిది.

ఓ.. ఋతువులో ఆకులన్నీ రాల్చేసుకుని మోడైపోయిన చెట్టు మరో ఋతువులో సరికొత్త 'ఆకుల' దుస్తుల్ని తొడుక్కున్నట్టు ఓ ఋతువులో ఎండిపోయిన ఓ నది - మరో ఋతువులో నిండుగా ప్రవహించినట్టూ -

మనసు తనని తాను పరిస్థితులకీ, కాలపు ఆటుపోట్లకి 'సిద్ధం' చేసుకుంటుంది.

వినటానికి 'ఇబ్బందిగా'ఉన్నా ఇది 'నిజం', కాలంతో 'గాయాలు' మానుతై.. 'మచ్చలు' మాత్రం మిగిలి ఉండొచ్చుగాక... అది వేరే విషయం.

"రాజ్..Can you hug me?" అడిగింది నమ్రత.

నేను మౌనంగా ఉండిపోయాను.

"నాకు తెలుసు.. నువ్వు ఇలాగే మౌనంగా ఉంటావని" నవ్వింది.

సడన్‌గా చలికాలంలో వర్షమొచ్చింది... అకాలవర్షం....ఇద్దరం పరిగెత్తాం.. ఓ చెట్టుకింద తలదాచుకున్నాం... వర్షం.. ఇంకా ఉధ్ధృతమైంది... గాలి మెల్లని స్థాయినుంచి విపరీతంగా వీస్తోంది. మా బట్టలు తడిసిపోయాయి. ఒంటికి అతుక్కుపోయిన సల్వార్ కమీజ్‌లోంచి నూత్న యవ్వనపు హంగులు.. రంగులు... పొంగులు...!!

**"అంగ్ లగ్ జాబాల్‌మా ...."** మేరానాం జోకర్ లోని పాట. పద్మిని" మీనా మాస్టర్ నుంచి 'మీనూ'గా మారి తడిసిన ఒంటిమీద తడి చీరలో, అదీ తెల్లని, పలుచని తడి చీరలో, 'నన్ను కౌగిలించవా ప్రియా' అని ప్రియుని వేడుకుంటూ పాడిన పాట....

అసలు 'కౌగిలింత' ఎలా ఉంటుందీ? పొద్దున్నే విరిసిన పద్మాలమీద రాత్రి కురిసిన మంచుబిందువులుంటాయి... మెల్లగా ఆవిరవుతాయి. మెల్లమెల్లగా, కొద్దికొద్దిగా - ఒక మైమరపుతో, ఒక మైకంతో...

ప్రేయసి తడి ఆరని పెదాలు.. కౌగిలింతల వెచ్చదనానికి వేడెక్కి పొడిబారినట్టు -

అప్పటిదాకా సూర్యుణ్ణి చూసి విచ్చుకున్న మందారమొగ్గ.... సూర్యతాపానికి పువ్వై ... సిగ్గు బరువుతో వాలినట్టు -

ప్రేయసి కన్నులు సిగ్గు బరువుతో వాలుతై..!

అణువణువునా ఓ గమ్మత్తైన ఆవిరి..

అప్పటిదాకా ఎక్కడదాక్కుందో తెలీదుగానీ, కౌగిలించిన మరుక్షణం.. కురులు విప్పుకున్న అగరుబత్తిలా.. ఓ అద్భుతమైన వెచ్చని పరిమళం ప్రేయసినుంచి వెలువడి ... శ్వాసలో దూరి గుండెని మబ్బుల కమ్మేస్తుంది.

ఇదంతా ఎందుకూ అనా?

'నమ్రత' నన్ను కౌగిలించింది.. ఓ నులివెచ్చని కెరటం 'ఒడ్డు'ని తాకినట్టు. ఆ ఒడ్డుని కమ్ముకున్నట్టు - తను రెండు చేతులతో నన్ను చుట్టింది.

నా మనసు ఏమయిందీ? తెలీదు... నేనేమయ్యానో కూడా తెలీదు. కొన్ని యుగాల తరువాత, మా పెదవులు విడివడ్డాక, మా చేతులు వీడలేక వీడలేక ఒకరి తనువు నుంచి మరొకరివి విడివడ్డాక.. శ్వాసలు అల్లకల్లోలంగా ఉవ్వెత్తున లేస్తూనే, ఏదో 'అంతర్వాణి' పిలుపులకి తల ఒగ్గినట్టు 'పడగల్ని'దించుకున్నాక -

నేను నేను కాదు -

తను తనూ కాదు..! చాలాసేపు అలాగే నిలబడ్డాక - మెల్లగా నడుస్తున్నాం. నా నడుము చుట్టూ తన చెయ్యి.. తన నడుము చుట్టూ నా చేయి..

మౌనం ఎంత గొప్పదీ.. క్షణానికి ఎన్ని కావ్యాల్ని రాయిస్తుందీ!

చలి కాలపు రాత్రులు సుదీర్ఘంగా ఉంటాయి.

పగళ్ళు 'ఇట్టే' గడిచిపోతాయి.

"రాజ్- నీకోటి తెలుసా? ముందుగా నిన్ను కౌగిలించిందీ ముద్దుపెట్టిందీ కూడా నేనే. ఇక నీ జీవితంలో నా పెదాల ముద్రని నీ పెదాలమీద నుంచి చెరపలేవు.."

మెత్తగా నా చెంపమీద తట్టి వెళ్ళిపోతూ నమ్రత అన్నమాట ఇది.

పొడుగాటి వరండాలో పిచ్చోడిలా తచ్చాడుతున్నాను.

జనాలందరూ రెండు రెండు రగ్గుల్నీ రజాయిల్నీ కప్పుకుని నిద్రపోతున్నారు. నాకు నిద్రపట్టడం లేదు.

నా పెదాలమీద తన ముద్ర.

నా శరీరమంతా 'తన' పరిమళం..

నా చుట్టూ గోడకట్టినట్టుగా తను ఓ వెచ్చని 'ఆవిరిగోడ' కట్టి వెళ్ళింది. నాకళ్ళకి ఆమె అరమోడ్పు కన్నులు తప్ప ఏమీ కనిపించడంలేదు.

నా చేతులు వెర్రిగా ఆమెని వెదుక్కుంటున్నాయి. ఆమె శరీరపు వెచ్చదనాన్ని తడమాలనీ, ఆమెని మళ్ళీ మళ్ళీ హత్తుకోవాలనీ తహ తహలాడుతున్నాయి...

ఆమె 'గుసగుసలు'.. అదీ 'వెచ్చని గుసగుసలు' వినాలనీ, ఆమె నా చెవిదగ్గరగా నోరు పెట్టి మాట్లాడేటప్పుడు ఆమె నోటినుంచి వచ్చే వెచ్చదనం తమని మళ్ళీ మళ్ళీ తాకాలనీ, ఆమె నాశిక తమని స్పృశించాలనీ నా చెవులు ఉవ్విళ్ళూరుతున్నాయి.

అసలేం జరిగింది?

కొన్ని నిముషాలపాటు కౌగిలించుకున్నంత మాత్రాన ఒకరి సర్వస్వం మరొకరిది అయిపోతుందా?

నా మనసుకూడా నా గురించి కాక తన గురించెందుకూ ఒక్క క్షణం కూడా విడవకుండా ఆలోచిస్తోంది?

"దిల్..అప్‌నా.. ప్రీత్ పరాయీ.."

(హృదయం నాదీ.. అది ప్రేమించేది మరొకర్నీ)

అంతేగా మరీ..!

"కన్ను మూయని కాళరాత్రికి 'సాక్షి'గా నే నిలిచివున్నా"

ఆ రేయి ఒక అపురూపమైన రేయి.. కొన్ని లక్షలమంది నిద్రిస్తుంటే.. నేను మాత్రం ఒంటరిగా.. ఏదో తెలియని విరహంలో మరిగిపోయిన రేయి.

నా గతమంతా మాయమై ....కేవలం... ఒక్క 'కౌగిలింత' మాత్రమే నా విశ్వాన్ని ఆక్రమించిన రేయి.

నా పెదవులు ఓ తియ్యని 'నెప్పి'ని మళ్ళీ మళ్ళీ కోరుకుంటూ తపించిన రేయి.

నేనెవరో నాకే తెలీక, నన్ను నేను నాలో వెతుక్కోలేక, నేను - "తానై" రగిలిన రేయి అది. ఆ నిదురలేని రేయికి నేను మాత్రమే సాక్షి.....

"ఏంటీ కళ్ళు ఎర్రబడ్డాయి... జ్వరమా?" కంగారుగా నా చెయ్యిపట్టుకుని అన్నాడు స్వామి.

"అవును." అన్నాను. అది విరహజ్వరమని నాకు తెలుసుగా.

"అయితే 'సిక్ రిపోర్ట్' చేద్దాం పద" అన్నాడు.

"వద్దులే తగ్గిపోతుంది" అన్నాను. వాళ్ళు గనక నన్ను 'సిక్' క్వార్టర్స్‌లో అడ్మిట్ చేస్తే నమ్రతని కలిసేదెలా.

"నో..నో..నెగ్లక్ట్ చెయ్యకూడదు.." బలవంతం చేశాడు. నేనొప్పుకోలేదు. ఆఫీసుకి వెళ్ళినా పనిచేసే మూడ్ లేదు... నిజంగా పనికూడాలేదు. చాలాసేపు అటూ ఇటూ పనిమీద తిరుగుతున్నట్టు యాక్ట్ చేసి, 10.30కి ఆఫ్ తీసుకుని మా బులెట్‌కి వచ్చేశా.

బెడ్ మీద పడుకుని యూనిఫాంతోటే నిద్రపోయా. ఒంటిగంటన్నరకి స్వామి వచ్చి బలవంతం చేస్తేగానీ నిద్రనుంచి లేవలేదు. మెస్ కెళ్ళి ఏదో తిన్నాననిపించుకుని మళ్ళీ బెడ్‌మీద వాలాను.

మేం కలిసేది వారాంతాల్లోనే. మరో ఐదురోజులు గడిస్తేగానీ శనివారం రాదు. కానీ మనసు ఆగనంటోంది. ఓ పిచ్చితనం.. ఓ తీవ్రత... నాకు తెలీని ఓ ఉన్మత్తత.. నన్ను బెడ్ మీద పడుకోనివ్వలా. ఆమె రాకపోతేనేం? ఆ చెట్టు ఉందిగా...

గబగబా బట్టలు మార్చుకుని బయటికొచ్చాను. ఉరుకులు పరుగుల్లాగా అనిపించే నడకలో ఆ చెట్టుని చేరేసరికి ఇరవై అయిదు నిముషాలైంది. సాయంత్రం అయిదున్నరకే పొగమంచు విపరీతంగా అలుముకుంది.

ఆ చెట్టుని గట్టిగా కౌగిలించుకున్నాను. ఎంతసేపో.

"నాకోసమేకదూ నువ్వొచ్చింది" మాటవినిపించడమేకాక నా భుజం మీద 'తన' చెయ్యిపడింది.

తటాల్న వెనక్కి తిరిగాను... నమ్రతే.

రాక్షసిలా నాకింది పెదాన్ని తన పెదాలమధ్య ఇరికించుకుంది. అంతకంటే వెర్రిగా తనపై పెదవిని... నేను లాక్కున్నాను.

వెచ్చని సెగలు... ఆమె తనువులోంచి..

ఆవిరి మబ్బులు పొగమంచులాగా అలుముకుని.

నా తలవెనుక తన చేయి.. బిగించి పట్టుకుని తన వైపుకి లాక్కుంటూ - కనులు మూసుకుని - ఏదో గొణుగుతూ

తన మెడమీద నా చేయి.. వీపుమీద ఒకటి.. దగ్గరకి లాక్కుంటూ..

కాలం స్థంభించిపోయిందా...?

ప్రపంచం సరికొత్తగా అనిపిస్తోంది. భూమీ, ఆకాశం ఏదో కొత్త శోభతో దర్శనమిస్తున్నాయి. ఆఖరికి గాలిలో కూడా ఓ గుసగుసల సంగీతం వినిపిస్తోంది. ప్రతి మబ్బూ.. ఓ కబురు తెచ్చే దూతలా అనిపిస్తోంది. తెల్లవారగానే సాయంత్రం కోసం ఎదురు చూడటం ఏవేవో 'పిచ్చి కవితలు' పేజీలకి పేజీలు రాసేసుకోవడం వాటిని నేనే చదువుకుని నాలో నేనే మురిసిపోవడం.. మైమరచిపోవడం.... ఓ ఉన్మత్తత.. ఓ తీవ్రత.. 'జవానీకీ ఆగ్' -

'యవ్వనజ్వాల...' నిరంతరం మండే కొలిమిలా శరీరం కోరికతో కాలిపోతూ దాహంతో తపించే నదుల్లా పెదాలు (తడారిపోతూ) నా మొహమూ శరీరము నాకే కొత్తగా.. అనిపిస్తూంటే -

ఓ ఊహల ప్రపంచంలో ఉయ్యాలలూగుతూ నేను.

'నమ్రత సహానీ'లోని పంజాబీ రక్తం క్షణం ఆగనివ్వదు. ఆమె తాపం అసలు శమించదు. పెదవులు అల్లుకుపోవాలి.. ముక్కుల్లోంచి అగ్నిజ్వాలల్లా శ్వాసలు వెలుపలికి రావాలి - మదించిన ఏనుగులు ఒకదాని తొండాన్ని ఒకటి పెనవేసి బలాబలాలు చూసుకుంటున్నట్టు.. మా పెదాలు కలిసేదాకా క్షణం ఆగేదికాదు.. పెనవేసుకుపోవాల్సిందే. ఇంకా.. ఇంకా.. ముద్దు మీద ముద్దు. . ముద్దొచ్చే ముద్దు.. ముద్దు రేపు ముద్దు.. ముఖం నిండా ముద్దుల ముద్దర్లే.... చెవుల మీద... మెడమీద.. భుజాలమీద అరిచేతుల్లో... చుబుకం మీద.. కళ్ళమీద.. ఒక చోటంటూ లేదు. ఓ పాటలో విన్నా 'ఆ దాహం తీరనిదీ'...... అని! తీరదు.. ఎన్ని జన్మలెత్తినా తీరదు.

సాగరంలోని కెరటాలూ.. హృదయంలోని తమకాలూ ఆగుతాయా... ఎంత అణచినా అణుగుతాయా -

సినిమాకి వెళ్ళేవాళ్ళం. బయటికొచ్చాక "అవునూ..'నమ్మో'... ఇందాక మనం చూసింది ఏ సినిమా?" అని నేనడిగేవాడిని. సరదాకి కాదు... నిజంగానే.

"ముఝే క్యా పతా?" మత్తుగా నవ్వేది. మా ఇద్దరి పెదాలూ దొండపళ్ళలా ఎర్రగా వాచిపోయి ఉండేవి.

చీకటి ముసిరినప్పుడు ఆమె జుత్తుని నా ముఖం మీద కప్పుకునేవాడిని..... అబ్బా... ఎంత మత్తెక్కేదో.. అదో చిత్రమైన సువాసన.

ఆమె మెడనీ, చెవుల్నీ ముక్కుతో తడిమేవాడ్ని... అదో పిచ్చి.... ఓ వెచ్చదనం... ఓ మత్తెక్కించే పరిమళం... ఓ సన్నటి పెదవి 'వొణుకు'.. మెడని నాలుకతో తడిమితే.. ఓహ్...

యవ్వనమా.. నీవెంత జాణవే....

నీకు మించిన మత్తు సృష్టిలో దేనికుందీ...

పెదాలు ముడివడగానే కనురెప్పలు వాలిపోయేవి.. ఇద్దరికీ... ఇదేం మోహం.. ఇదేం దాహం..

అణువణువునా ఓ తుఫాను..

అణువణువునా... ఓ సుస్వరం..

అణువువణువునా ఓ అగ్నిగుండం..

అణువణువునా ఓ తమకం...

ఒంటరిగా బతకనివ్వదూ..

కలిశాక నిలవనివ్వదు..

జవానీ కా ఆగ్ లగ్‌గయా...

యవ్వనపు జ్వాల రగిలింది.. అణువణువునీ మండిస్తోంది...!

పగలో రాత్రో తెలీదు... అసలెందుకూ తెలీడం!

"రోజూ సాయంత్రాలు మిస్సవుతున్నావు రాజూ.. ఎవరైనా ఆడపిల్ల పరిచయమయిందా?" మెస్‌కి వెళ్తుండగా అన్నాడు స్వామి.

"అవును - బట్.." అన్నాను. ఎవరితోటీ ఏమీ నేను చర్చించదలుచుకోలేదు.

"జస్ట్ ఫ్రెండ్షిప్... అంతేకదూ!" నవ్వాడు. అవునన్నాను.

"ప్రేమ అయితే మాత్రం ఇక్కడే ఆగిపో. ప్రేమకీ, మిలటరీకీ పొసగదు. ఎందుకంటే ఏ క్షణంలో ఎక్కడికి పంపినా మనం తక్షణం వెళ్ళాలి. "(

నేను మాట్లాడలేదు. ఏం మాట్లడనూ.. అది ప్రేమో, మోహమో, ఒక పిచ్చితనమో నాకే తెలీదు. ఒక్కటి మాత్రం నిజం.. నమ్రతని కలవకుండా మాత్రం ఉండలేను.

"నేనెంత చెప్పినా వినవని తెలుసు తమ్ముడూ.. కానీ, నేను చెప్పేది నిజం ప్రేమనేది ఓ అగ్నిగుండం. నిజంగా ప్రేమించిన వాడు దైవ సమానుడే! కాదనను, ప్రేమ అంటే దైవం.. అదీ కాదనను.. కానీ, ఒక్కసారి ఆ ప్రేమని 'దర్శించుకోలేనివాడు' బ్రతికున్న శవం కిందే లెక్క. అదెంత ఘోరమో, అలా చచ్చిన వాడిలా బతకటం ఎంత నరకమో నీకు తెలీదు. నీకింతగా చెప్పాల్సిన పని నాకులేదు. ... కానీ... నువ్వంటే నాకు చాలా ఇష్టం.. నాకు తమ్ముళ్ళు లేరు. అందుకే నిన్ను నా తమ్ముడిగానే భావించి చెబుతున్నా" సిగరెట్టు వెలిగించుకోవడానికన్నట్టు గబగబా నడిచి వెళ్ళిపోయాడు. అతని గొంతులో వినీవినిపించని ఓ విషాదం. మౌనంగానే లంచ్ ముగించాం. బెడ్ మీద పడుకున్నా నిద్రరావడం లేదు.

స్వామి చెప్పిందీ నిజమే. ఎప్పుడు ఎక్కడికి మమ్మల్ని పంపితే అక్కడికి మేము వెళ్ళాలి. ఒకవేళ అలా వెళ్ళాల్సివస్తే -

ఆ ఊహే నన్ను ఒణికించింది... నమ్రత నుంచి దూరంగా ఎలా ఉండగలనూ? గభాల్న లేచి డ్రెస్ మార్చుకున్నాను. స్వామి నన్ను గమనిస్తున్నాడన్న ఊహ కూడా నాకు రాలేదు.

'ఎదురుచూడటం' అనేది ఎంత ఘోరం. అదీ ఒస్తుందో రాదో తెలీకుండా.. ఎప్పుడూ ఆ చెట్టుకిందే కలిసేవాళ్ళం. చెట్టు చుట్టూ తిరుగుతున్నా.. ప్రదక్షణలు చేస్తున్నట్టు. రాత్రి. 7.30 అయింది. వెళ్ళాలి. వెళ్ళితీరాలి.. కారణం ఆ రోజు నైట్ 8.30 కి Mess

Meet ఉంది. వెళ్ళేటప్పటి ఉత్సాహం తిరిగి వచ్చేటప్పుడు ఏమైపోయిందో! ''సాబ్.. కాఫీ న హీ పీయేంగే క్యా?'' బురుజు కాఫీ వాడు అడిగాడు రోజూ, అంటే కలిసినప్పుడల్లా ఇద్దరం అక్కడే కాఫీ తాగుతాం కదా - అందుకు.

''ఆజ్ మూడ్ నహీ హై భాయీ సాబ్'', జవాబు చెప్పి నడకసాగించాను.

నా మనసు మనసులో లేదు. నా ఒళ్ళంతా కాగిపోతోంది. పిచ్చిగా అరవాలనుంది.. ఏడవాలనుంది.. నన్ను నేను ముక్కలుగా చేసుకుని, ఆమె ముందు వాలాలనిపించింది.

క్షణానికోసారి వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూనే ఉన్నా.. ఏమో.. నన్ను వెన్నంటే ఒస్తుందేమో.. జస్ట్... సర్‌ప్రైజ్ చెయ్యడానికి... కానీ, అవన్నీ నా ఊహలే.. నా వెనక నా నీడ కూడా లేదు.

నీడ ఎంత గొప్పదీ..!

నీ ముందరో నే వెనకో నీ పాదాలకిందో నువ్వెక్కడి కెళ్ళినా (వెలుగులో) నీడ నిన్ను అనుసరించే వుంటుంది. చీకట్లో నయితే నీలో ఒదిగిపోయి నీతోనే ఉంటుంది.

అంతేకాదు.. మరణించిన తరవాత 'శవాన్ని' పైకెత్తితే ఆ శవాన్నీ విడకుండా, నీడ తోడుంటుంది. శవాన్ని కాల్చి బూడిద చేసి ఆ బూడిదనంతా ఓ సంచిలో పోస్తే - ఆ సంచికీ నీడ ఉంటుంది.

గుప్పెటలో ఆ బూడిదని తీసుకుని పై కెగరేస్తే కింద రాలే ప్రతి అణువుకీ, పరమాణువుకీ కూడా నీడ వుంటుంది.

ఓ నీడా.. నువ్వేగా నిజమైన తోడువి.

కానీ.. ఈనాడు నా నీడ ఈనాడు నాకు తోడుగా కానీ.. ఈనాడు నా నీడ ఈనాడు నాకు తోడుగా రాలేదు.. నన్ను వదిలేసింది... నన్నొదిలి 'తన' దగ్గరికి వెళ్ళిపోయింది.

ఈ నీడ గురించి ఆనాడు నేను డైరీల్లో రాసుకుందే కొన్ని సినిమా పాటల్లో రాశాను. 1. **ప్రాణస్నేహితులు** సినిమాలోని 'స్నేహానికన్న మిన్న పాటలో! **పల్లవి:** స్నేహానికన్న మిన్నలో నేననలేదురా.. కడదాక నీడ లాగా నిను వీడిపోదురా..etc.

2. ***ప్రేమదేశంలో ప్రేమా..*** పాటలో: **పల్లవి:** నను నేనె మరచినా నీ తోడూ.. విరహాన వేగుతూ ఈనాడూ.. వినిపించదా ప్రియా.. నాగోడూ.. ప్రేమా...''

నా నీడ నన్ను విడిపోయిందే. నీ శ్వాసలోన అది చేరిందే నేనున్న సంగతే మరచిందే.. ప్రేమా...'' అని.

అందరి గుండెల్లోనూ ఉండేవి ఒకలాంటి భావాలే. కొందరు వ్యక్తీకరించగలరు. కొందరు వ్యక్తీకరించలేరు. ఈ అందరూ ఒకలాగేకాదు. ఒక గాయకుడు గళంతో వ్యక్తీకరిస్తే, కవి కవితగా, గీత రచయిత గీతంగా, చిత్రకారుడు చిత్రంగా, శిల్పాచార్యుడు శిల్పంగా.. ఇలా ఎవరి పరిధినీ, గాఢతనీ బట్టి వారు వ్యక్తీకరిస్తారు. ఇది, అంటే ఈ వ్యక్తీకరణ 'కాల సంబంధి' కాదు. ఇప్పటి అనుభవం.. పాతికేళ్ళు గుండెల్లో దాడి ఆ తరువాత సడన్‌గా వ్యక్తీకరింపబడొచ్చు. అసలు జీవితంలోనూ కొందరి గుండెల్లోనూ దాగిపోయేవుండొచ్చు.

అవకాశం దొరకాలిగా మరీ!

(నేనేమన్నా 'ఎక్కువ'గా రాసి, అంటే శృంగారాన్ని రాసి ఇబ్బంది పెడుతున్నానా? యవ్వనాన్ని యవ్వనపు సోయగంతో రాయాలిగానీ దాన్ని సెన్సార్ చేస్తే - ఏమో!)

**మూడురోజులు దుర్భరంగా గడిచాయి.** రోజా పిచ్చిపట్టిన వాడిలాగా పరిగెత్తడం చుట్టూ వెర్రిగా చూస్తూ చూపుల్ని నేలకీ ఆకాశానికీఈ గుచ్చడం.. గుడ్డిగా వెదకటం.. చీకటి పడిపోయాక నిస్సత్తువుగా తిరిగిరావడం. తినబుద్ధికాదు. దాహం వేసినా మంచినీళ్ళ బాటిల్ (మిలటరీవి) అందుకుని తాగబుద్ధికాదు.. తెల్లవార్లూ ఓ కలవరింత... ఒంటరి కారిడార్‌లో వెర్రెత్తినవాడిలా తిరగటం. అసలు స్వామి నన్ను అనుక్షణం అబ్జర్వు చేస్తున్నాడనే విషయాన్ని కూడా మరచిపోయి సాయంత్రం నాలుగింటికే పరుగులు పెట్టడం.. దీన్నేమంటారూ? విరహమా? కోరికా? . ఏమో..!

"వాటెవర్, భోజనం తినకుండా ఎందుకలా తిరుగుతున్నావూ?" సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు స్వామి.

"సరిగ్గా ఆకలి వెయ్యడంలేదు.." బులెట్ గూళ్ళల్లో ఉన్న పావురాల్ని చూస్తూ అన్నాను.

"రాజూ! నువ్వు చెప్పేది అబద్ధమని నీకు తెలుసు. ఆ విషయం నాకు తెలుసని కూడా నీకు తెలుసు. నేను మళ్ళీ చెబుతున్నాను. ఒకవేళ 'ప్రేమ' అయితే, ఇది నీకు వయసూ కాదు. సరయిన సమయమూ కాదు. లేదూ, కేవలం కోరిక అంటావా, అదీ తప్పే. ఎందుకంటే, ఆ అమ్మాయి వచ్చింది గౌరవనీయమైన కుటుంబంనుంచి.." భుజం మీద తట్టి అన్నాడు స్వామి.

"అన్నా.. దీన్ని ఏమంటారో, ఏమని పిలవాలో నాకు తెలీదు. ఒక్కటి మాత్రం చెప్పగలను. నేను తప్పుచేస్తున్నానని నాకు అనిపించడంలేదు. ఇంకా... " మధ్యలో నే నన్ను ఆపాడు స్వామి. "ఆగు! నువ్వేమీ నాకు Explanation ఇచ్చుకోవలసిన పనిలేదు. నేను ఇదివరకే ఓసారి చెప్పాను.. ఇందులోకి దిగడం చాలా తేలికని. ఒకసారి దిగాక బయటికి రావడం మన వల్లకాదు. ఇది ఎంత గాఢంగా ఉంటుందో తెలుసా?.. ఓహ్ ఓకె. నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నానని విసుక్కోకు. నువ్వు విన్నా వినకపోయినా నేను చెబుతూనే ఉంటాను, ఎందుకంటే నీలో నేను నా చనిపోయిన నా తమ్ముడ్ని చూసుకుంటున్నాను. " మళ్ళీ ఓసారి భుజం తట్టి వెళ్ళిపోయాడు స్వామి. నాకు కోపం, బాధా రెండు కలిగాయి.

నేనేమి తప్పు చేస్తున్నానని ఇతను ఇలా అనుక్షణం నన్ను గమనించాలి? ఓ అమ్మాయితో మాట్లాడుతున్నాను. అదేం తప్పుకాదే! 'మరి హగ్ చేసుకోవటం.. మళ్ళీ మళ్ళీ ముద్దులకోసం పరుగుపెట్టడం ఇవన్నీ తప్పుకాదా?" నా మనసులోనే ఓ ప్రశ్నపుట్టి నన్ను నిలదీసింది.

ఆ ప్రశ్న 'నోరు' మూసేశానుగానీ జవాబిచ్చే ప్రయత్నం చెయ్యలేదు. ఇచ్చేందుకు జవాబు ఉంటేగా? అంతేగాక ఆ ప్రశ్నకి సమాధానం ఉన్నా, నా మనసు ఆలోచించదలచుకోలేదు. ('అంతరాత్మ' నోరునొక్కడం అంటే ఇదే అని తరవాత అర్థమైంది) ప్రతి వ్యక్తికీ అంతరాత్మ ఏది తప్పో ఏది ఒప్పో ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటుంది కానీ మనిషి తత్వం ఎటువంటిదంటే, మనసు 'బలహీనత' ఎంత బలీయమైనదంటే - తప్పని తెలిసినా కోర్కెకి లొంగిపోవడం, అంతరాత్మ హెచ్చరికను అసలు లెక్కచేయకపోవడం.

అప్పుడు నేను చేసిందీ అదే. వెళ్ళాలి.. కలవాలి.. కళ్ళారా చూసుకోవాలి. చెవులారా మాటల్ని వినాలి. ఇక ఆ తరవాత....!

మనసులో ఓ మూడు రోజులు మూడు సంవత్సరాలుగా మార్పు చెందాక, నాలుగోరోజున అల్లంత దూరాన తను నడుచుకుంటూ రావడం చూశాను. అంతే..! నేను పరిగెత్తాను..పిచ్చిపట్టినట్టు..!. విజయ్ చౌక్‌లో గుంపులు గుంపులుగా ఉన్నవాళ్ళంతా

నావంక ఆశ్చర్యంగా చూస్తున్నారని నాకు తెలీదు. ఆ క్షణాల్లో ఉన్నది ఓ వెర్రి ఆవేశం. నాలో ఆమెని చూడటంవల్ల ఉప్పొంగిన ఓ వెర్రి ఆనందం. (లవ్ ఈజ్ బ్లైండ్ అంటే ఇదేనా?)

దగ్గరవుతున్న కొద్దీ ఆమెని చుట్టేసి గట్టిగా హత్తుకుందామనే గాఢమైన కోరిక.. కానీ. ఆమె చాలా మెల్లగా నడిచివస్తోంది... సూటిగా నావంకే చూస్తూ, ఏమాత్రం 'ఎడబాటు' తాలూకు చిహ్నాలు ఆమె మొహంలో లేవు. నాకు తెలీకుండానే నా పరుగు నడకగా మారిపోయింది. నడకా ఆగింది. మా మధ్యదూరం మూడు అడుగులు.

"హౌ ఆర్యూ రాజ్?" అన్నది చాలా నిదానంగా.

"ఫైన్ నమ్రతా" నేనూ నెమ్మదిగానే అన్నానుగానీ నా గొంతులోని నివ్వెరపాటు నాకే తెలుస్తోంది.

"టైమ్ ఎలా గడిచింది?" నా కళ్ళల్లోకి చూస్తూ అన్నది.

"అది.. అది.." గత మూడురోజులుగా ఆమెకోసం నేను పడ్డ బాధనీ విరహాన్నీ చెప్పాలనుకున్నానుగానీ, ఎందుకో ఏమీ చెప్పలేకపోయాను.

"ఒహో..!" అన్నది 'కాఫీ షాప్' వైపు నడుస్తూ.. ఆమెని అనుసరించాను.

"ఆయియే.. ఆయియే.." ఆనందంగా ఆహ్వానించాడు బురుజు కాఫీవాడు. తనేమీ మాట్లాడకుండా గంభీరంగా కూర్చుంది. నాకు ఎందుకో నోటమాట రాలేదు.

ఏదో 'కల'నుంచి సడన్‌గా మేల్కొన్న భావన.

జీవనదిలో ఈదుతూ హాయిగా ఉండగా, ఒక్కక్షణంలో 'నది' ఇంకిపోయిన భావన.. ఒకే ఒక్కగాడ్పుకి లక్షలాది చెట్ల ఆకులూ పూవులూ పిందెలూ తక్కున నేలరాలి మాడి మసైపోయిన భావన.

హాయిగా పాడుతున్న కోయిలని తక్కున ఎవరో నొక్కిపట్టి గొంతువిరిచేసిన భావన..

తను కాఫీ కప్పువంకే చుస్తూ కాఫీ తాగుతోంది.

నేను మాట పెకలని మౌనంతో తననే చూస్తున్నా..

కాఫీ తాగటం మరచి.

కాఫీ వాడు మమ్మల్ని గమనిస్తూనే ఉండి ఉండాలి. అందుకే, "సాబ్ పిచ్‌లే తీన్ దిన్ సే.." (అయ్యా గత మూడురోజులుగా) అని ఏదో చెప్పబోయాడు.

"జానా హూ!" సీరియస్‌గా అతనివంక చూసి అన్నది నమ్రత. అతనూ మొహానికి ఇటుక దెబ్బ తగిలినట్టు సైలైంటైపోయాడు. నేను డబ్బు తీసి ఇవ్వబోతుంటే 'వద్ద'ని కళ్ళతోనే సీరియస్‌గా వారించి తనే డబ్బిచ్చింది. లేచి మేము ఎప్పుడూ కూర్చునే చెట్టువైపుకి నడక సాగించింది. మరమనిషిలా నేనూ వెంటనడిచా.

నాకేమీ అసలు అర్థంకాలేదు.

ఏమయింది? నేనేమీ అనలేదే. మరెందుకీ మౌనం?

తల్లిదండ్రులు ఏమైనా అనివుంటారా?

అర్జంటుగా (మా విషయం తెలిసి) ఏదో ఓ పెళ్ళి సంబంధం కుదిర్చారా? లక్షా తొంభై ఆలోచనలు. నీలాకాశంలో హాయిగా ఎగురుతున్న వెయ్యిగాలిపటాలు దారాలు తెగి ఒకేసారి కిందపడ్డట్టు - మనసులో ఊహలూ.. ఆశలూ అన్నీ కూలిపోయాయి. ఇంకా చీకట్లు ముసురుకోలేదు. తను నిశ్శబ్దంగా కూర్చుంది. నేలవంక చూస్తూ. నేనూ ఆమెనే చూస్తూ కూర్చున్నాను.

మంచులాంటి మౌనం..

మబ్బులాంటి మౌనం..

అరవటానికి వీల్లేకుండా నోటిని గుడ్డలతో కుక్కేసి, వళ్ళంతా వాతలు పెడుతుంటే, మనసు ఫెటాలున పగిలి ముక్కలై పోయిన మౌనంలాంటి మౌనం.

నిరాశాకెరటాల్లో మనసుని ముంచేసే తుఫానులాంటి మౌనం. వేళ్ళలోంచి ఇసుకజారినట్టు కాలం జారిపోతోంది.

"ఇవ్వాళ కూడా రావటం కుదరదనుకున్నాను." పెదాలు బిగించి సీరియస్‌గా అన్నది.

'ఊ' అన్నట్టుగా ఏదో శబ్దం నాలోంచి బయటికి వచ్చింది.

"రాకుండా రేపటివరకూ ఆగవచ్చు.!. కానీ.." ఆగింది మళ్ళీ ఏమీ మాట్లాడాలో తెలీక మౌనంగా కూర్చున్నాను.

ఓ క్షణం బాధ.

ఏం? తనకు తెలీదా... నేనెంత పిచ్చిగా వెయిట్ చేస్తూ ఉంటానో?

"నువ్వు ఎదురు చూస్తావని మాత్రమే వొచ్చాను. యూ నో?" అన్నది.

అంటే, ఇప్పుడు ఏమి చెప్పబోతోందీ? "మొన్నమొన్నటివరకూ బాధ్యతలేనట్టుగా ప్రవర్తించాను. నవల్సు చదువుతూ.. ఊహాలోకాల్లో తేలిపోతూ.. ఇష్టం వచ్చినట్టుగా తిరిగాను.. ఇక అలా కుదరదు. ప్రతిదానికీ ఎక్కడో ఓ చోట ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇష్టం ఉన్నా లేకపోయినా.. నా 'ఫ్రీ బర్డ్' లైఫ్‌కి ఇప్పుడు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం వచ్చింది..!" సూటిగా నా కళ్ళలోకే చూస్తూ గంభీరంగా అన్నది మిస్.. నమ్రతా సహానీ బి.ఏ.

పూర్తిపేరు ఎందుకురాశానంటే, ఈ నమ్రత, ఇంత గంభీరంగా ఏ ఎఫెక్షనూ ఎమోషనూ లేని ఈ నమ్రత నాకు కొత్త.

నాకు తెలిసిన నమ్రత వేరు.

తనో జలపాతం.. ఉత్సాహంగా మీదపడి, ప్రతీ 'ముద్దు'నీ తనే 'గెలవా'లనే పట్టుదలతో కయ్యానికి (?) కాలుదువ్వే స్వచ్ఛ పంజాబీ. అల్లరికి అంతులేదు ఆమెలో. తను ఫైర్.

ఈమె ఐస్ కోల్డ్.. ఆమె గలగలా పారే సెలయేరు.. (మాటల సెలయేరు) ఈమె గడ్డ కట్టిన మంచు.

ఇద్దరికీ పోలికే లేదు.

"అంటే?" గొంతు పెగుల్చుకుని అన్నాను.

"చెబుతున్నాగా? చెప్పటానికేగదా వచ్చింది? నీకు కష్టంగా ఉండొచ్చు. ఒక విధంగా నన్ను నిందించనూ వొచ్చు. భరించడం కష్టమే.. కాదనను.. బట్ ప్రతివ్యక్తీ పరిస్థితులకి అనుగుణంగా తనని తాను మల్చుకోవడం నేర్చుకోవాలి. అలా నేర్చుకోలేని నాడు బ్రతుకు నరకంగా మారుతుంది. 'ఇది ఇలాగే ఉండాలీ' అన్నా, అనుకున్నా ఈలోకంలో కుదరదు. బెంచీలూ కుర్చీలూ ఇటుకలూ రాళ్ళు మార్పులేకుండా అలాగే ఉండొచ్చేమో కానీ, రాజ్.. మనుషులు ఎప్పటికీ ఒకేలాగా ఉండలేరు. అలా అనుకోవడమూ తప్పే!" ఆగింది.

ఆకాశం రంగు మారుతోంది. ఉన్నట్టుండి 'ముడి' విప్పి తల విదిలించింది. అలలు అలల్లా జుత్తు ఆమె మెడమీద నుంచి వీపు మీదకి జారింది.

నాకెంత పిచ్చో ఆమె శిరోజాలంటే. ఓ మృదువైన పరిమళం విరబూసి నట్టనిపిస్తుంది. ఆమె జుత్తుతో నా మొహం కప్పుకుని మౌనంగా ఆమె మెడనీ, భుజాల్నీ వీపునీ బుగ్గల్నీ నిమరడం అంటే నాకెంతో ఇష్టం.

నన్ను సడెన్‌గా తలెత్తి చూసింది. ఆమెనే నేను గమనిస్తున్నానని తెలుసుననుకుంటాను.

"నేను చెప్పబోయేది నీకు కష్టం కలిగించవచ్చు. 'ఇదేంటీ? ఇలా?' అనే ఆలోచన నీలో రేకెత్తించి నీకు నిద్రపట్టకుండానూ చెయ్యొచ్చు.. కానీ చెప్పాల్సింది చెప్పక తప్పదు"

ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచి అన్నది నమ్రత. నాలోనాకే ఓ బాధ కలిగింది.

"వాటీజ్‌దిస్ నమ్రతా? నేనేం చేశానూ? నిన్నసలు ఏమీ అనలేదే? లాస్ట్‌గా మనం కలిసినప్పుడు కూడా చాలా సంతోషంగా, హాయిగానే ఉన్నామే. ఇప్పుడీ సీరియస్ ఉపన్యాసం ఎందుకూ? టెల్‌మీ.. నావల్ల ఏమైనా తప్పుందా? What the hell had happened?" అరిచాను.

"కూల్ డౌన్ మిస్టర్ రాజ్. మనం పబ్లిక్ స్థలంలో ఉన్నాం. గుర్తుంచుకో. మనం చిన్నపిల్లలం కాదు. అటుచూడు. .. అక్కడ.. ఆ పశ్చిమాన.. సూర్యాస్తమయం అద్భుతంగా ఉంది. కాదూ!... ఆ మనోహరత్వం అలాగే ఉండాలని మనం కోరుకుంటే అలాగే ఉండిపోతుందా? చీకటి పడితీరుతుంది. అది ప్రకృతి నియమం. అలాగని చీకటి కూడా అలాగే ఉండిపోదుగా. మళ్ళీ పగలు వస్తుంది!" అనునయించే ప్రయత్నం చేసింది.

"స్టాప్ ద నాన్సెన్స్ నమ్మూ.. నిజం చెప్పు.. ఏం జరిగింది?" అసహనంగా అన్నాను. తీక్షణంగానే.

"నేను చెబుతున్నది అదేగా.. మధ్యలో నువ్వే డిస్టర్బ్ చేశావు.!" కోపంతో అన్నది.

"ఓకే... అసలు విషయం చెప్పు!" కోపాన్ని కంట్రోల్ చేసుకుని అడిగాను.

"కూల్ గా తీసుకోగలవా?" అనుమానంగా నావంక చూస్తూ అన్నది.

"యస్. ఐ కెన్ టేక్.." అన్నాను.

"సరే.. అయితే ఇక రోజూ మనం కలవలేము!" తలొంచుకుని సీరియస్‌గా అంది.

"అంటే? ఎలా వాళ్ళేమైనా... ప్లీజ్ నమ్మూ.. చెప్పవా?" ఆమె చేతులు పట్టుకున్నాను. పెద్దవాళ్ళు ఏవిధంగా ప్రవర్తిస్తారో నేను ఊహించగలను. తల అడ్డంగా ఊపి తలని మరింత కిందకి దించుకుంది.

"ప్లీజ్ చెప్పవా.. ప్లీజ్" ఆమె గడ్డాన్ని బలవంతంగా పైకెత్తుతూ అన్నాను.

"యూ స్టుపిడ్. వాటార్యూడూయింగ్?" కచ్చగా నా వంక చూసి అన్నది. క్షణాల్లో చీకటి పడటం చలికాలపు విశిష్టత.

"నువ్వు చెప్పేవరకూ వదల్ను!" నేనూ గట్టిగా ఆమె చేతులు విడదీసి అన్నాను.

"ఏం చేస్తావ్?"

"ఏదైనా చేస్తాను..కానీ వదల్ను...!" పట్టు వదల్లేదు నేను.

"యూ రాస్కెల్.. ఐ గాట్ ఎ జాబ్.. హౌ కెన్ ఐ మీట్ యు ఎవ్విరి డే?" అరిచింది గట్టిగా. గొంతులో అల్లరి.

"యూ ఈడియట్.. ఇదా?" నాకు అర్థమై గట్టిగా ఆమెని కూర్చునే దగ్గరికి లాక్కున్నాను.

"ఓయ్.. వదులు.. ముందు విషయం చెప్పనీ... నాకు బేంక్ జాబ్ వచ్చింది. ఢిల్లీలో కాదు..!" నా చేతుల్ని విడిపించుకుంటూ అన్నది.

"మరి..!" ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది.

"రేయ్. ఆడపిల్లలాగా నీ మొహానికి ఏడుపొక్కటే తక్కువ. అయినా, కాస్త సీరియస్‌గా మొహం పెట్టేసరికి సాలే.. ఆ ఏడుపు మొహం ఏమిట్రా? మిల్ట్రీ వాడంటే ఎలాగుండాలీ.. బుద్దూకే బాప్.. ఎంత రఫ్‌గా టఫ్‌గా ఉండాల్రా? ఎవడ్రా నిన్ను మిల్ట్రీలోకి చేర్చుకుందీ? ఉస్ సాలేకో.." అంటూ గభాల్న నా మొహాన్ని దగ్గరికి లాక్కుంది. ఛటాల్న తన పెదవుల్తో నా నోరు మూసేసింది.

ఇదేనా 'ముద్దంటే'..?

(హితులారా ఈనాటివరకూ 'ఆ' ముద్దుని వర్ణించడానికి నాకు ఏ భాషలోనూ పదాలు దొరకలేదు. ఎలా దొరుకుతాయీ.. అది కేవలం అనుభవానికి సంబంధించిన భాష. ఆ భాషని అక్షరాల్లో ఇమిడ్చి పుస్తకాల్లో బంధించలేము. ఆ అనుభూతి 'మస్తకంలో' ఒదిగిపోతుంది. .. ఓ అమృతఘడియలాగా).

ఏం చెప్పనూ..

పెదాలు పాముల్లా ఒకదాన్నొకటి పెనవేసుకుని -

అమృతాన్ని పిండుకుంటూ అనంతలోకాల్ని అవలోకిస్తుంటే -

నులివెచ్చని ఆవిరి కెరటాలు ఇద్దరి శరీరాల్లోంచీ బయటికొచ్చి చుట్టు ముట్టిన చలిగాలిని 'గాడుపు'గా మారుస్తూ, ఆగాలికి ఓ సున్నితమైన పరిమళాన్ని అద్దుతుంటే -

ఆమె శిరోజాలనే నల్లని ఆకాశంలో నా ముఖం దాగిపోయి, కోటాను కోట్ల సుగంధ మాధుర్యాలని నా గుండెల్లో నింపుతుంటే -

కాలం స్థంభించింది.

ఓహ్.......

(PS: క్షమించాలి... 'సుగంధమాధుర్యాలూ,' ఓ మృదువైన పరిమళం విరబూసినట్టనిపిస్తుంది' లాంటి పదాలు వాడటం తప్పని తెలుసు. కానీ భావాన్ని 'భాషలో ఎలా ఇమడ్చాలో తెలియని సమయంలో పుట్టిన పదాలవి. అందుకని వాటిని అలాగే ఉంచేశాను. వాటి వెనకనున్న 'భావాన్ని' పాఠకులు గుర్తిస్తారని నా ఆశ... నమ్మకం కూడా. )

**ఒకరు ఫోన్ చేసి అడిగారు..** "మీ 'మనసుపొరల్లో' చదువుతున్నాను. రాసేది 'డేట్స్'తో కూడా రాస్తే బాగుంటుంది కదా!" అని. నిజమే కానీ, ఇది డైరీకాదుగా. ఇంతకు ముందు రాసినట్టు గతించిన కాలం ఏనాడూ అదే పద్ధతిలో మనసులోకి రాదు. ఎందుకంటే జ్ఞాపకాలు కూడా 'గాఢత'ని బట్టే మనసులో తమ స్థానాన్ని పదిలపరుచుకుంటాయి.

కిషోర్ పాడిన పాట ఒకటుంది. "జిందగీ కా సఫర్. ఏ హై కైసా సఫర్...కోయీ సమ్‌ఝా నహీ.. కోయి జానా నహీ' అని. అంటే ఈ జీవితమనే పయనం ఎటువంటిదంటే దీన్ని ఎవరు తెలుసుకోలేరు.. ఇది ఎవరికీ అర్థమూ కాదని.

మా 'రేస్‌కోర్స్' మీదనుంచి అలా కాస్త నడిస్తే 'అశోకా' హోటల్ వస్తుంది. అలా అలా ఇంకా ముందుకుకు నడుస్తూ పోతున్నా. ఎన్నో ఆలోచనలు. నా జీవితమే ఓ కలగా అనిపించింది. ఎక్కడో పుట్టినవాడ్ని.. ఢిల్లీకి రావడం ఏమిటీ? కలలో కూడా ఊహించని వైమానిక దళంలో చేరడం ఏమిటీ! ఈ వీధులూ ఈ దారులూ ఏదో గత జన్మలో ఇక్కడే పుట్టి పెరిగినంత పరిచయంగా ఉండటం ఏమిటీ? నమ్రతా నన్ను కలవడం ఏమిటీ? ఒక ఉప్పెనలాగా మేము ఇలా ఒకరినొకరు చుట్టుకు పోవటం ఏమిటీ?

ఇన్ని లక్షల మంది ఢిల్లీలో నివసిస్తున్నారుగా... మేమిద్దరం మాత్రమే ఎందుకు కలవాలి. మా ఇద్దరి మధ్య మాత్రమే ఇంత గాఢమైన బంధం ఎందుకు పెనవేసింది? అసలీ బంధాన్ని ఏమనాలీ, ప్రేమ బంధమా, స్నేహ బంధమా.. గతజన్మల ఆత్మబంధమా? ఏ ప్రశ్నకీ నాకు జవాబు దొరకలేదు.

"ఓయీ. ఏదో ఓ జన్మలో మీకిద్దరికీ ఏదో ఒక బంధం లేకపోతే ఇక్కడసలు ఎలా కలవగలరూ? నీ వారందరూ అక్కడ.., ఆ దక్షిణ దేశాన ఉండగా నువ్వు మాత్రమే ఇక్కడికెలా రాగలిగావూ? సరే, ఉద్యోగనిమిత్తం వచ్చావనుకుందాం. ఆమెని చూసిన క్షణమే అంత స్నేహం ఎలా కుదిరింది? సరే.. అక్కడయినా ఆగిందా? లేదే? ముద్దులూ - కౌగిలింతలూ, నిట్టూర్పులూ, కవితలూ, ఇదంతా ఏమిటీ?

ఒక్కటి తెలుసుకో.. ఏదీ ఈలోకంలో సాధ్యంకాదు, ఏదో ఒక రుణం, ఏదో ఒక బంధం లేనిదే! ఆఖరికి నువ్వో గ్లాసుడు మంచినీళ్ళు తాగాలన్నా - దానికీ రుణం ఉండాలి. ఆ రుణం లేనినాడు వెయ్యిమందిని అడిగినా గుక్కెడు నీరు దొరకదు." ఇదీ.. నా అంతరాత్మ నాలో అన్నది.

పోనీ నా మనసే నాకు బోధించిన బోధ అనుకుందాం. 'నా' మనసు 'నాకు' అంటున్నాను. ఈ నేను, నాది, నా అనేవి దేనికి సంకేతం? శరీరానికి. మనసు పనిచేయకపోతే శరీరం పని చేస్తుందా? ఈ శరీరం నాది. .. ఇట్ బిలాంగ్స్ టు మీ. జస్ట్ 'ఈ ఇల్లు నాది' అంటాడు. ఇల్లు నాకు సంబంధించింది మాత్రమే గానీ నేను 'ఇల్లు'ని కాదుగదా. అలాగే ఈ 'మొహం' నాది అంటాము.

అంటే ఈ ముఖం నాకు సంబంధించింది. నేను ముఖాన్ని కాదు. అది నా శరీరంలో ఒక భాగం. చిత్రం ఏమిటంటే, ఈ పూర్తి శరీరం నాది. అంటే ఇంటి లాగానో 'బైక్'లాగానో నాకు సంబంధించింది మాత్రమే. 'నేను' శరీరాన్ని కాదు. మరి నేను ఎవర్ని?

ఓ పక్కన యవ్వనంలో జ్వలిస్తున్న శరీరం.. మరో పక్క 'ఇదంతా క్షణికమే, కానీ తెలియాల్సిందీ తెలుసుకోవాల్సిందీ వేరేది' అనే జిజ్ఞాస. ఒకే ఒరలో రెండు కత్తుల్లాగా... ఒకే భూమికి రెండు ధ్రువాల్లాగా, ఒకే నాణానికి ఉన్న బొమ్మా బొరుసుల్లాగా.

"ఓ లడ్‌కీ నహీ సాబ్. షేర్‌నీ హై షేర్ నీ" (ఆమె ఆడపిల్ల కాదయ్యా. శివంగి.. పక్కా సివంగి) అన్న బురుజు కాఫీ వాడి మాటలు గుర్తొచ్చి నవ్వొచ్చింది.

"అదేం?" అని అడిగాను.

"అబ్బా జాన్‌తా హూం - అని ఒక్క చూపు చూసిందిగదండీ., ఆ చూపుకి నా గుండెలు భయంతో గుబగుబలాడి ప్రాణాలు అడుగంటిపోయాయనుకోండి!" అన్నాడు వాడు.

నిన్న జరిగిందంతా యధాతథంగా నాకు గుర్తొచ్చింది.

"ఇంతకీ ఎక్కడా నువ్వు జాబ్ చెయ్యాల్సిందీ?" అనడిగాను.

"ఎక్కడైతేనేం? మనం రోజూ ఇలా కలుసుకోలేముగదా." చెట్టువారగా నేను కూర్చుంటే నా భుజానికి తల ఆనించి అన్నది నమ్రత పెదాలింకా భగ్గుమంటూనే ఉన్నాయి.

"ఇంతకీ ఎక్కడో చెప్పకూడదా?" మెడ నిమిరి అన్నాను. ఆమె మెడ నిమిరితే కరిగిపోతుంది. మెడమీద ముద్దు పెట్టినా అంతే. "గుర్గాన్‌లో"అన్నది కళ్ళు మూసుకుని తమకంగా. నాకు చచ్చేంత నవ్వొచ్చింది. గుర్గాన్ ఢిల్లీకి ఆనుకుని ఉన్నదే అయితే అది హర్యానా రాష్ట్రం కిందకి వొస్తుంది.

"పక్కనేగా?" అన్నాను.

"కానీ డైలీ వెళ్ళిరావడం తేలికైనా, అక్కడే వుండి వర్క్ చెయ్యమని డాడీ అన్నారు. మా మమ్మీ నాతో వస్తుందిట. ప్రతి శనివారం బేంక్ వర్క్ పూర్తయ్యాక ఢిల్లీ వచ్చి మళ్ళీ సోమవారం ఉదయం బస్సుకి వెళ్తాం.. మొన్న మూడురోజులూ అక్కడే ఉన్నాను.. అందుకే రాలేదు!" అన్నది.

సైలెంటైపోయాను. శనివారం వాళ్ళు వచ్చేసరికి సాయంత్రం అవుతుంది. ఒకవేళ తను బయటికిరావడం కుదరకపోతే.. ఆదివారం మాత్రమే కలవగలం. అదీ వాళ్ళ వాళ్ళు వేరే ప్రోగ్రాం నిర్ణయించకపోతే.

"అందుకే చెప్పనన్నాను. వినగానే సైలెంటైపోయావు.. సెలక్ట్ అయ్యానని తెలిసిన దగ్గర్నించీ నేనెంత హైరానా పడ్డానో ఊహించగలవా? ఏడుపు ఆపుకుందామనే 'గాంభీర్యాన్ని' నటించాను. అయినా నేను 'సీరియస్'గా మొహం పెడితే అంత అల్లాడిపోయావెందుకూ? ఇంత సున్నితంగా ఉంటే ఎలా బతుకుతావూ?" రెండు చేతుల్తో నా మొహాన్ని దగ్గరగా లాగి నా కళ్ళల్లోకి

'దయ'గా చూస్తూ అన్నది నమ్రత. ఆ కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయా. తటాల్న నా ముఖాన్ని తన గుండెలకి హత్తుకుని "నిన్నెప్పుడూ వదిలిపెట్టను.. ఇది నిజం" అని ఎంత గట్టిగా హత్తుకుందంటే - ఆమె గుండెల నుంచి కొన్ని లక్షల గత జన్మ స్మృతుల సువాసనలు నన్ను 'మగత'లో ముంచేశాయి.

రెండు శరీరాలు. రెండిట్లోనూ ఉన్నది రక్తమూ, మాంసమూ, ఎముకలూ నరాలూ.. ఇవే. ఒకే చర్మం.. గుండెలూ, ఊపిరితిత్తులు ఇంకా మిగతా భాగాలన్నీ కూడా ఒకలాంటివే. కానీ.. ఒకదాన్నొకటి హత్తుకున్నప్పుడూ?

అద్భుతమైన, అనంతమైన అనుభవం.

అది కాలాతీతం.. లోకాతీతం.

నిజంగా చెబితే వర్ణనాతీతం -

"నీకోటి తెలుసా.. సామాన్యంగా ఆడవాళ్ళకి మగవాడి గుండెమీద తలపెట్టి సేద తీరాలని ఉంటుందని అంటారు. కానీ. నాకు మాత్రం ఎప్పుడూ నిన్ను.. అదే నీ తలని నా రొమ్ముల మధ్యకి లాక్కుని లాలించాలనిపిస్తుంది. నిన్ను ఇలా దగ్గరగా పొదుపుకుంటే అనంతమైన శాంతికలుగుతుంది. తెలుసా..!" నా చెవి దగ్గరగా నోరు పెట్టి గుసగుసగా అన్నది.

అబ్బ.. అలా మాట్లాడేటప్పుడు ఆమెవెచ్చని నోటి నుంచి వచ్చిన ఆవిరి నా చెవులకి తగిలి ఎంత అద్భుతమనిపించిందో ఎంత గిలిగింత కలిగించిందో.

"ఇంకా చెప్పనా. నీ పెదాలంటే నాకు పిచ్చి. వదలాలనిపించదు. నా పెదాల్తో నీ పెదాల్ని జన్మంతా పిండుకోవాలనే అనిపిస్తుంది. ఏక్షణంలో కలిశామోగానీ.. ఓహ్...సాలే, నేనిప్పుడు ఉద్యోగం ఎలా చెయ్యనా? నీకు దూరంగా ఎలా వెళ్ళనూ?" సడన్‌గా నా జుట్టుపట్టుకుని పైకి లాగి అన్నది నమ్రత. ఆమె కళ్ళనుంచి బొటబొటా నాలుగు కన్నీటి బొట్లు జారాయి. వేలితో జారుతున్న మరో కన్నీటి బొట్టు స్పృశిస్తే వెచ్చగా ఉంది.

"సరే.. ఉద్యోగం వద్దులే.. మానెయ్!" అన్నాను. మళ్ళీ తలని ఆమె గుండెలమీద పెట్టుకుంటూ.

"ఇంతా కష్టపడి చదివిందీ ఉద్యోగం తెచ్చుకుందీ మానెయ్యడానికా?" చెవిసాగదీసి అన్నది.

"అయితే చెయ్యి!" మొహాన్ని వత్తుకుంటూ అన్నాను.

"తుమ్‌పాగల్ హైరే" అంటూ గిల్లింది. ఎనిమిది దాటింది. ఇద్దరం మళ్ళీ చేతులు పట్టుకుని కాఫీ షాప్‌వాడి దగ్గరికెళ్ళి మరో కాఫీ తాగాము. వాడు భయపడినట్టున్నాడు. (ఆమె ధాటికి) మా స్టేషన్ వైపు నడవడం ప్రారంభించాను. అప్పటిదాకా అసలు ఉన్నదో లేదో కూడా తెలియని చలిపులి ఒక్కసారి పంజావిసిరింది. షర్టు తప్ప నేను స్వెట్టరు కూడా వేసుకోలేదు. అసలు చలికాలమనీ, ఆ కాలానికి తగిన దుస్తులు ధరించి తీరాలనీ ఈ మధ్య నాకు గుర్తుంటేగా..!

ఆమె తాలూకు పరిమళం నన్నూ నా దుస్తుల్నీ వదలకుండా అలాగే ఉన్నది. ఆమె తలపెట్టుకున్న నా చొక్కా భుజం దగ్గర ఆమె జుత్తు పరిమళమే.. ఎందుకూ నా మొహం నిండా.. నా అరిచేతుల్లో కూడా..

ఆ జ్ఞాపకాల 'వెచ్చదనం' ఎంతగా అనుభవించానంటే రూమ్‌కి (బులెట్‌కి) వెళ్ళి మంచం మీద వాలేదాకా నా ఒళ్ళు సెగలు పొగలుగక్కుతోంది.

"ఇదిగో.. నీకు డిన్నర్ తెచ్చాను.. "స్వామి ఓ ప్లేట్లో రెండు చపాతీలూ బంగాళదుంపకూరా ఇచ్చాడు. వేడిగా ఉన్నాయి.

"అదేంటీ", కొంచెం బిడియంగా అన్నాను. నాకంటే చాలా సీనియర్.. ఆయన నాకు తేవడం ఏమిటీ?

"నువ్వు ఆలస్యంగా వస్తావని అనిపించి నేను భోంచేసి వచ్చేటప్పుడు నీకోసం మెస్ నుంచి తెచ్చాను. నువ్వు రావడం చూసి ఎల్క్ట్రికల్ హీటర్ మీద వేడి చేసి తెచ్చాను... తింటూ ఉండు.. గోంగూర పచ్చడి వచ్చింది. సాయంత్రం.. మూడో బిలెట్ రఘురామ్ గౌడ్ తోటి మా అమ్మ పంపింది.." అని ప్లేటు నా చేతికిచ్చి తన కప్‌బోర్డ్‌లో నుంచి గోంగూర బాటిల్ (ఖాళీ హార్లిక్స్ బాటిల్స్‌లోనేగా ఆ రోజుల్లో పేకింగులన్నీ) తెచ్చి స్పూనుతో కొంచెం పచ్చడి నా ప్లేట్లో వేశాడు.

అప్పటిదాకా అసలు 'ఆకలి' ఉన్నదని కూడా నాకు తెలీలా. మహారుచిగా అనిపించింది. గబగబా తినేశాను.

"సారీ తమ్ముడూ మరో నాలుగు తేవాల్సింది.. " నొచ్చుకుంటూ అన్నాడు.

"అసలు తెచ్చినందుకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలీటం లేదన్నా.. చాలా... చాలా థాంక్స్..." హృదయపూర్వకంగా అన్నాను.

"ఇవాళ నువ్వు చాలా సంతోషంగా ఉన్నావని తెలుస్తోంది. మొన్నా అటుమొన్నా నిన్నా ఇవ్వాళ మధ్యాహ్నం కూడా నువ్వేమీ తినలేదు. తింటూ తింటూనే చెయ్యికడిగేసుకుంటున్నావు పరధ్యానంగా.. పడుకోతమ్ముడూ.. పొద్దున్నే డ్యూటీకి పోవాలిగా!" భుజం తట్టి వెళ్ళిపోయాడు స్వామి.

*కొందరు ఎప్పుడు ఎంతవరకూ అవసరమో అంతే మాట్లాడతారు. కొందరు ఎప్పుడైనా ఎంతైనా మాట్లాడతారు.. అవసరం ఉన్నా లేకపోయినా. కొందరు అవసరం ఉన్న చోట మాట్లాడకుండా ముంగిలా కూర్చుని అవసరం లేనప్పుడు మాత్రం అవసరంలేని విషయాలు అనంతంగా మాట్లాడుతూ ఉంటారు.*

*మాట అనేది ఓ గొప్ప వరం. భగవంతుడు మనిషికి మాత్రమే ఇచ్చిన వరం. ఆ వరాన్ని వ్యర్థంగా వాడుకుని బూడిద పాలు చెయ్యకూడదు.*

స్వామికి తెలుసు. అందుకే ఎంతవరకు మాటాడాలో అంతే మాట్లాడి వెళ్ళిపోయాడు. నైట్ డ్రెస్‌లోకి మారి వెచ్చగా రగ్గు కప్పుకుని పడుకున్నా. సడన్‌గా అనిపించింది.. తను నా పక్కనే ఉన్నట్టూ - నన్నుగట్టిగా హత్తుకుని పడుకున్నట్టూ.

"బహుత్ షుక్‌రియా.. బడి మెహర్‌బానీ.. మేరీ జిందగీమే హుజూర్ ఆప్ ఆయే.." (మొహమ్మద్ రఫీ.. ఆశాభోంస్లే.... సంగీతం ఓపి నయ్యర్. సినిమా పేరు ఏక్ ముసాఫిర్. ఏక్ హసీనా) నటీనటులు సాధనా శివ్‌దసానీ - జాయ్ ముఖర్జీ. పాటలన్నీ సూపర్ హిట్స్. సాధన 'నవ్వు'లేక 'స్మైల్'ని చూసి తీరాలి. ఓహ్.. మెస్మరిజం.

"అబ్బ.. ఎంత అందమైన నవ్వో" అన్నాను నమ్రతతో.

"యూ స్టుపిడ్. చంపేస్తా.." చాలా కోపంగా గిచ్చింది.

"నిజంగా.. నువ్వు చంపేసినా సరే!" అన్నాను. నెప్పిని ఓర్చుకుని.

"ఏముంది సాలే?" ఇంకా గిచ్చింది.

"జాగ్రత్తగా చూడు.. నవ్వేటప్పుడు నాక్కనిపించింది నువ్వే. నేను చూసింది నీ పెదాల్నీ నీ పలువరుసనే!" సిన్సియర్‌గా అన్నాను. గభాల్న బుగ్గ మీద గబగబా ముద్దులు పెట్టింది.

"అదేంటిరా.. సినిమా చూస్తూ.. నీ పక్కనే నేనున్నాగానీ ఆవిడ పెదాల్నీ నవ్వునీ చూసి నన్ను గుర్తుకు తెచ్చుకోవడం ఏమిటీ?" ఆశ్చర్యంగా అన్నది.

"నాకు తెలీదు. కానీ నాకు ఆమె కనిపించలేదు.. ఆమెలో నువ్వే కనిపించావు.." నిజాయితీగా అన్నాను.

అప్పుడు తెలీదు. ఇప్పుడు తెలుసు. ఎవర్నో మనం చూస్తాం. ఒకరిని చూడగానే 'మళ్ళీ వాళ్ళని ఛస్తే చూడకూడ'దనే ఆలోచనేగాక వెంటనే అక్కడ్నించి దూరంగా వెళ్ళిపోవాలనిపిస్తుంది. వేరే ఎవర్నో చూస్తే వాళ్ళు మనకి జన్మజన్మలనుంచీ తెలిసినట్టు (చూసింది మొదటిసారైనా) మనకి అత్యంత ఆప్తులు అయినట్టూ అనిపిస్తుంది.

ఒకరి దగ్గర క్షణమైనా నిలవబుద్ధి కాదు.

ఒకరిని క్షణమైనా విడవాలనిపించదు.

ఎందుకంటే వీళ్ళలో మనకి తెలిసిన 'గురుతు' ఏదో ఉన్నది. మనకి ప్రియమైన దాన్ని గుర్తు తెచ్చేదేదో ఉన్నది.

అది ఈ జన్మ తాలూకు 'గుర్తు' కావొచ్చు.. గతజన్మలది కావొచ్చు. అంతెందుకూ.. కొందరికి షేక్‌హేండ్ ఇవ్వగానే అర్జంటుగా చేతుల్ని డెట్టాల్‌తోనో, పెట్రోల్‌తోనో కడుక్కోవాలనిపిస్తుంది. కొందరికి అదే షేక్ హేండ్ ఇస్తే అలాగే పట్టుకోవాలనిపిస్తుంది. ఇదీ అటువంటిదే. ఈ అనుభవం మీకూ కలిగే ఉండొచ్చు.

ఏమైతేనేం.. 'ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా' సినిమాని చూసి బయటికొచ్చి వీడలేక వీడలేక విడిపోయాం.

ఆ మరుసటి రోజు ఉదయమే తను బేంక్‌లో జాయిన్ కావాల్సిన రోజు. ఆమెతోపాటు వాళ్ళ అమ్మగారూ 'గుర్గాన్' వెడతారు. (గుర్‌గాన్ అంటాంగానీ దాని పేరు 'గుడ్‌గాఁవ్'. GURGAON అని రాస్తాం. గుడ్‌గావ్ఁ.. గుడుగావాఁ' అని కూడా స్థానికులు అంటారు.)

నడుస్తున్నాను. నాలోని పంచప్రాణాలూ ఆమెతో వెళ్ళిపోయాయి.

"ఆవాజ్ దే కే హమేయమ్ బులావో.. ముహబ్బత్ మే ఇత్‌నా.. న..హంకో సతావో.." పాట మనసులో సుడి తిరుగుతోంది (సినిమా పేరు ప్రొఫెసర్.. సంగీతం శంకర్ జైకిషన్.. రచన హస్రత్ జై పురీ.. పాడినవారు రఫీ, లతామంగేష్కర్)

మళ్ళీ వారం తరవాత గానీ చూడలేను. ఎలా ఈ ఏడురోజుల్ని గడిపేదీ? కళ్ళవెంట నీరు.

ఒక్కసారిగా 'నా లోకం' నిర్మానుష్యమైపోయింది. ఏదో తెలీని వేదన. ఓ నిస్సత్తువ.

ఓ టీ దుకాణం కనిపిస్తే వెళ్ళి కూర్చున్నా.

'క్యా చాహియే సాబ్' సర్వర్ అడిగాడు.

'చాయ్' అన్నాను. నా మాట నాకే వినిపించలేదు. ఎవరో గట్టిగా నవ్విన శబ్దం విని అటు చూశా... ఓ ఏభై యేళ్ళ సర్దార్జీ ఎదురుగా ఉన్న అమ్మాయితో (కూతురు కావొచ్చు)

"ఫికర్ మత్ కర్నా.. కల్ పే భరోసా రఖో.." అంటున్నాడు.

ఆ మాట వినగానే నాలో ఒక ఉత్సాహం కెరటంలా పైకి లేచింది.

ఆ మాటలకి అర్థం.. "డోంట్ వర్రీ.. రేపటి మీద నమ్మకం ఉంచు" అని.

అవును.. ఈనాడు సుఖంగా.. ఉత్సాహంగా.. హాయిగా... సరికొత్త ఊహలతో జీవించాలంటే ఉండాల్సింది రేపటి మీద నమ్మకం

ఓ అపరిచితుడి నోటనుంచీ వచ్చిన ఓ చిన్న మాట.. ఎన్నో సమస్యల్ని ఎదుర్కొనే ధైర్యాన్నిచ్చింది.. 'ముఖే ముఖే సరస్వతి' అని అందుకే అంటారని అర్థమైంది.

**"నీ కోసం వారం రోజులు ఎదురు** చూడటం ఎంత మధురంగా ఉందో!" 'షీలా' థియేటర్లోకి ఎంటర్ అయ్యాక అన్నది నమ్రత. నాకు నవ్వొచ్చింది. అప్పటికి తను ఉద్యోగంలో చేరి మూడు నెలలైంది. ఈ మూడు నెలల్లో మేం కలిసింది పధ్నాలుగు సార్లు.

కలిసి గడిపింది నలభై రెండు గంటలు... అంటే 2,520 నిమిషాలు.. దాన్ని మళ్ళీ సెకన్లలోకీ మైక్రో సెకన్లలోకీ మార్చి లెక్కించవచ్చు... అదంతా గణితానికి సంబంధించినది. మరి హృదయానికి సంబంధించీ?

"ఎందుకూ నవ్వావూ?" అన్నది సీట్‌లో సెటిల్ అవుతూ. హాల్లో లైట్లు దివ్యంగా వెలుగుతున్నై. జనాలందరూ బయటే హాయిగా 'చాయ్' తాగుతూనో సిగరెట్ పీలుస్తూనో ఎంజాయ్ చేస్తున్నారు.

"ఎదురు చూడటంలోని మధురత్వాన్ని నువ్వు అనుభవిస్తుంటే, విరహంలోని వేదన నన్ను మింగేస్తోంది. ఒకే ప్రేమ ఒకరికి మధురంగా ఒకరికి వేదనగా మారడం చూసి నవ్వొచ్చింది!" అన్నాను.

"సాలే, జీవితాన్ని తేలిగ్గా తీసుకోవాలి.!. ఎదురు చూడటం నాకూ దుర్భరమే. కానీ, బీ ఆల్వేజ్ పాజిటివ్. మనిషికి ఉన్నవి రెండే 'ఛాయిస్'లు. ఒకటి నవ్వుతూ జీవితాన్ని గడపడం.. ఎన్ని విచారాలు ఎదురైనా సరే!!.. రెండు, ఏడుస్తూ గడపడం... చిన్న చిన్న దుఃఖాల్ని గమనించక విస్మరిస్తూ మనం మాత్రం, నవ్వుతూనే గడుపుదాం... విచారం మన దగ్గరికి రాదు.. రాకూడదు. రానివ్వం. అంతే! " ఖచ్చితంగా స్పష్టంగా చెప్పి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది నమత. నేనామె కళ్ళల్లోకి చూశా. ఆ కళ్ళల్లో నాకు 'హిమాలయం' కనిపించింది.

మానసికంగా నేను బలహీనుడ్నికాదు. కానీ తను పక్కన లేని క్షణాలు నిజంగా నన్ను మాడ్చేస్తున్నాయి. ప్రతిక్షణం ఆమె తలపే. నిద్రలో కూడా తనే.

బ్లాక్ స్ట్రెచ్‌లాన్ పేంట్ వేసుకుంది. పైన వైట్ షర్ట్. జుట్టుని ఓ రిబ్బన్‌తో బంధించినా గాలి ఆమె జుత్తుతో మేలమాడుతూ జుత్తు పరిమళాన్ని దొంగిలిస్తూనే ఉంది. చెవులకి పెద్ద రింగులు. అవీ తను మాట్లాడేటప్పుడు ఊగుతున్నాయి.

"నా ఒళ్ళంతా మస్టర్డ్ ఆయిల్ (ఆవనూనె) కంపుకొడుతుందిరా... ఆయిల్ బాత్ చేశా పొద్దున్న!' అన్నది.

తనదైన ఏదైనా, ఏదన్నా నాకు ఇష్టమే. ప్రాణప్రదమే. సినిమా మొదలైంది. మా పెదవులు ఆత్రంగా కలిసిపోయాయి. ఆ ముద్దులో ఏమి ఉన్నదో ఎలా చెప్పేది?

అందులో ఉన్నది యవ్వన పరమైన తీవ్రతో - కాంక్షో కాదు. యుగయుగాల దాహం..., ఏ భాషకీ అందని 'ఆర్తి'.. గుండె చప్పుళ్ళుగా మారుతున్న కలలు... ఏకమవుతున్న ఆత్మలు.. (ఏమో....ఇప్పటికీ - ఈనాటికీ నాకు ఆ భాష దొరకలేదు).

"ఆప్ యూ హిః అగర్ హమ్‌కొ మిల్‌తే రహ్హే.. దేఖియే ఏక్ దిన్ ప్యార్ హో జాయెగా.." సన్నగా పాడుతూ నడుస్తోంది నమత.

ఇంటర్వెల్ లోనే బయటికి వచ్చేశాం నవ్వుకుంటూ.

"వీళ్ళని చూడండి.... అసలు సిగ్గూ ఎగ్గూ ఉందా?" వెనకాల సీటులో కూర్చున్న మధ్య వయసావిడ మమ్మల్ని చూసి పక్కనున్న మొగుడితో (?) చేసిన కామెంటు.

"ఈ కాలం పిల్లలు మరీ బరితెగించిపోతున్నారు!" మాకు వినిపించేట్టే ఓ ముసలాయన విమర్శ.

నిముషానికోసారి మా ముందు సీట్లో కూర్చున్న యువతీయువకులు తల తిప్పి మమ్మల్ని చూడటం.... ఇవన్నీ చికాకు పుట్టించాయి.

బయటికొచ్చాక అదేమాట అంటే "వాళ్ళు చెయ్యలేనిది మనం చేస్తున్నామని పెద్దోళ్ళ గోల..., చెయ్యాలని ఉన్నా చేసే తెగువ లేక కేవలం కుతూహలం మాత్రం ఉన్న కుర్రోళ్ళ ఆబ, అసలు వాళ్ళకి ఫ్రీ ఎంటర్‌టైన్ మెంటు మనమెందుకివ్వాలనిపించి నిన్ను బయటికి లాక్కొచ్చా" అన్నది నమత.

"నువ్వు పాడినట్టు (మీరు గనక ఇలా రోజూ నన్ను కలిస్తే... ఏదో ఒక రోజు ప్రేమ పుట్టేస్తుంది... చూస్తూ ఉండండి - అని అర్థం) పాడకపోయినా ప్రేమ పుట్టిన మాట నిజం." మెల్లగా అన్నాను.

"పిచ్చోడా... ఆ విషయం చెప్పక్కర్లా... కలిసిన మొదటి రోజునే నాకు అలా అనిపించింది. చెపితే బెదిరిపోతావని చెప్పలేదు. అయినా మాటల్తో చెప్పాలా సాలా? ఒక చిన్న స్పర్శ చాలదూ.. అసలు ఇప్పుడు చెప్పడానికి నీ దగ్గర ఏముందనీ? నిన్నే నీ దగ్గర్నించి లాగేసుకున్నాగా..!" నా భుజం మీద తల ఆన్చి అన్నది నమ్రత.

నిజం... నన్ను నా దగ్గర్నించిలాగేసుకున్నది నిజం.

ఓ నిట్టూర్పు వెలువడింది నాలోంచి. ఒక చెప్పలేని రిలీఫ్. ఈ నమ్రత 'నాదీ'.... అలా అనుకుంటేనే ఓ ఆనందం నన్ను కెరటంలా ఊపేసింది.

ఢిల్లీ అంతా వెన్నెల వెదజల్లినట్టు అనిపించింది. ఇద్దరం బస్ ఎక్కాం. ఒకరి నొకరు అతుక్కుని నిలబడి, ఒకరినొకరు కళ్ళార తృప్తిగా చూసుకుంటూ, ఒకరి చేతుల్లో ఒకరి చెయ్యి పెనవేసుకుంటుంటే ఓ వెచ్చదనంతో తనువును 'చలికాచు'కుంటూ తిరిగాం. తిరిగి తిరిగి ఓ బస్సులో రెడ్‌ఫోర్ట్ చేరాం. మళ్ళీ అదే చోటున నిలిచి తను ముద్దుగా అన్నది.. "కెన్ యూ లిఫ్ట్ మీ?" అని.

"నువ్వు చాలా సంతోషంగా ఉన్నావు.." నవ్వి అన్నాడు స్వామి. మా I.A.F స్టేషన్‌లో ఎంతమంది తెలుగు వాళ్ళు ఉన్నా, నాకు స్నేహితుడయింది స్వామి ఒక్కడే నాకంటే వయసులో పెద్దవాడైనా అద్భుతమైన కేరక్టర్.

ముఖ్యంగా ఎక్కడ ఏం మాట్లాడాలో, ఎంతవరకూ మాట్లాడాలో తెలిసినవాడు. అలా అని గంభీరంగా ఉండడు. జోకు చేసినా సున్నితంగా ఉంటుందే తప్ప ముల్లుగుచ్చినట్టు ఉండదు.

"అవును స్వామీ.. నిజంగా సంతోషంగా ఉన్నాను." తృప్తిగా అన్నాను.

"ప్రేమ సక్సెస్సా?" నవ్వి అన్నాడు.

"అవును..!" ఆనందంగా అన్నాను.

"చాలా హేపీ బ్రదర్! లోకంలో ప్రేమించడం ఓ వరం అయితే, ఆ ప్రేమను దక్కించుకోవడం లక్ష వరాలకు సమానం.. అయితే ఇంకోటి బాగా విను.. దక్కించుకున్న ప్రేమని 'నిలబెట్టుకోవడం' కోటి వరాలతోగానీ సమంకాదు. నూటికి నలభై ప్రేమలు పెళ్ళివరకూ వెడతాయని అనుకుంటే, అందులో వివాహబంధంలో నిలబడేవి అయిదు పర్సంటు కూడా ఉండవు. ఒకవేళ ఉన్నా పరస్పర ద్వేషంతో మరోదారి లేక ఉంటాయి.." సూటిగా నావంక చూసి అన్నాడు స్వామి.

"మేం ఖచ్చితంగా పెళ్ళిచేసుకుంటామనీ, ఆ తరువాత కూడా మా సంసారం సుఖంగానే గడుస్తుందనీ నాకు నమ్మకం ఉంది." స్పష్టంగా చెప్పాను పెళ్ళి విషయాలు మా ఇద్దరి మధ్య ఇంకా రాకపోయినా, నాకు మాత్రం పిచ్చి నమ్మకం వచ్చేసింది.

"అంతకంటే కోరుకునేది ఇంకేముంటుందీ. వెరీగుడ్. నీ నమ్మకం నాకు సంతోషాన్నిచ్చింది. కానీ రాజూ, ఇప్పట్నించీ నువ్వు ప్రతిక్షణం పైకి ఎదగటానికి ప్రయత్నించాలి. మొదట మన 'టెస్ట్'లు పాస్ అయితే జీతం కొద్దిగా పెరుగుతుంది; కానీ అక్కడితో ఆగితే జీవితం సుఖంగా గడవదు. గడవాలంటే నువ్వు అర్జంటుగా ఏ యూనివర్సిటీలోనో ప్రయివేట్‌గా చదివి డిగ్రీ పాస్‌కావాలి. ఆ తరువాత ఆఫీసర్‌గా 'కమీషన్'కి అప్లై చేసి నెగ్గాలి.!" భుజం తట్టి అన్నాడు. నిజమే.

అప్పటివరకూ ప్రేమలోనే మునిగి ఉన్నాను. సాయంత్రమేగా నేను ప్రేమని డిక్లేర్ చేసింది! స్వామి ముందర 'పెళ్ళి' విషయం వచ్చిందీ ఇప్పుడే అయితే ఆర్థిక విషయాల గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించలేదనేది ముమ్మాటికీ నిజం.

నమ్రత నాన్నగారు బేంక్ మేనేజర్. మంచి ఆదాయం. మిగతా విషయాలు నాకు తెలీదు. నమ్రత ఇప్పుడు బేంక్ జాబ్ చేస్తోంది. ఓ సైనికుడికి ఇచ్చే జీతం చాలా తక్కువుండేది. కానీ, మిలటరీలో పనిచేస్తున్నందుకు మా మనసుపడే 'గర్వం' ముందు ఏదీ సమానం కాదు. మాకు జీతాలు తక్కువైనా, ఫ్రీ ఫుడ్డు, ఫ్రీ అకామిడేషన్, ఫ్రీ హెల్త్‌కార్డూ+సంవత్సరానికి 2 నెలలు యాన్యువల్ లీవు ఒక నెల కాజువల్ లీవూ... ఇన్ని సౌకర్యాలు ఏ ఉద్యోగాలకి ఉంటాయి?

ట్రైనింగ్ పీరియడ్ సంగతి పక్కన పెడితే, పోస్టింగ్ వచ్చాక పని ఉదయం 7.30 నుంచి 1.30 మధ్యాహ్నం వరకూ. షిఫ్టులు ఉంటే, 1.30 టు 7.30 p.m & నైట్ డ్యూటీ చేసిన మరుసటి రోజు ఆఫ్. ఇంకేం కావాలి?

చదువుకోవడానికి బోలెడంత సమయం ఉంటుంది.

"థాంక్స్ అన్నా. మంచి విషయాలు చెప్పావు. వెంటనే చదువు మొదలు పెడతా..!" అన్నాను.

"ఓ పని చెయ్యి.. మన మాస్టర్ వారంటాఫీసర్ ప్రసాద్ గారు డబుల్ ఎమ్.ఏ చేశారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి. ఆయన్ని అడిగితే అన్ని వివరాలు ఇస్తారు. " షేక్ హాండ్ ఇచ్చి అన్నాడు స్వామి.

"వెరీ గుడ్‌బాయ్.. మంచి నిర్ణయం. ఓ పని చేస్తాను.. నిన్ను 'గుర్గాన్'కి పంపుతాను. అక్కడయితే ప్రశాంతంగా చదువుకోవచ్చు. మా ఇల్లూ అక్కడే ఉంది గనక సాయంత్రాలు నేనే నీకు కోచింగ్ ఇస్తాను. మరి గుర్గాన్‌కి వెళ్తావా?" ఆదరంగా అన్నారు MWO ప్రసాద్. ఆయన తెలుగాయన కాదు హర్యానా జాట్. తెల్లగా ఇంతెత్తున స్మార్ట్‌గా ఉంటారు. మనిషి కూడా చాలా మంచివాడు.

"సార్.. ఈ క్షణంలో నేను రెడీ సార్! " ఆయన చెయ్యిపట్టుకుని ఊపేస్తూ అన్నాను. నా ఆనందం చెప్పనలవికాదు.

"వెల్..! C.O (కమాండింగ్ ఆఫీసర్)తో మాట్లాడి 'సెట్' చేస్తాను" అన్నాడాయన.

నా కాళ్ళు నేలమీద లేవు. గుర్గాన్ వెళ్ళేదాకా ఈ విషయాన్ని నమ్రతకి చెప్పకుండా దాచిపెట్టాలనుకున్నాను. స్వామికి కూడా తెలీదు. నమ్రత గుర్గాన్‌లో పనిచేస్తోందని. నేను చెప్పలేదు.

సి.వో C.O ఒప్పుకోవాలని మనసారా దేవుడ్ని ప్రార్థించా - స్వామి 'బులెట్' కి రాకముందే నా కిట్ బాక్స్‌లో చాలా సామాన్లు సర్దేశాను. స్వామి డల్‌గా వచ్చాడు.

"రాజూ.. ఇప్పటివరకూ నేను నీకు బీర్‌గానీ, మరో డ్రింక్ గానీ ఆఫర్ చెయ్యలేదు. నువ్వూ తీసుకోలేదు. కానీ ఇవ్వాళ నాతో డ్రింక్ తీసుకోమని అడుగుతున్నా. తీసుకుంటావా?" రిక్వెస్టింగ్‌గా అన్నాడు స్వామి.

"అదీ.." కొంచెం నసిగాను. ఎందుకో తాగుడు అన్నా తాగుబోతులన్నా నాకు చికాకు. చిన్నప్పటి నుంచీ పెరిగిన మా ఇంటి పద్ధతులూ సిద్ధాంతాలూ నాలో ఒక స్పష్టమైన అవగాహనని కలుగచేశాయి. ఏనాడూ డ్రింక్స్‌గానీ నాన్ - వెజ్ గానీ మా వాళ్ళు ఎరగరు. నేనూ అంతే.

"సరే..!..సారీ" చిన్నగా నవ్వి బయల్దేరాడు స్వామి.

"ఆగన్నా.. నేను వస్తున్నా.." సడన్‌గా అని డ్రెస్ వేసుకున్నా (సివిల్) ప్రతి బుధవారం, శనివారం మాకు బార్ డేలు.

"వద్దు రాజూ.. ఏదో అన్యమస్కంగా అడిగా అంతే" వారించాడు స్వామి.

"ఉండూ! రేపెప్పుడైనా ఏ 'లే' నగర్ కైనా పోస్టిగ్ వస్తే తప్పదుగా..!" స్వామిని ఫాలో అయ్యాను.

అప్రయత్నంగా నోటిలోంచి వచ్చే చాలా మాటలు నిజం అవుతాయని నాకు అప్పుడు తెలీదు.

బార్ రూంలోకి వెళ్ళాం. చెరో 'పెగ్' రమ్ మా 'మగ్'లలో పోయించి కూర్చున్నాం. నాకు ఎలా తాగాలో కొంచెం తెలుసు. 'పోస్టింగ్' ఇచ్చిన మరుక్షణం మాకు చెబుతారు. డ్రింక్స్ ఎలా ఎప్పుడు తీసుకోవొచ్చో, తీసుకునేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో, అలాగే పరిచయమయ్యే అపరిచిత స్త్రీలతో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో - ఆ జాగ్రత్తలన్నీ చక్కగా స్లైడ్స్‌తో మరీ వివరిస్తారు.

ఒక పెగ్ రమ్‌లో ఆరుపెగ్గులకి పైగా నీళ్ళు కలిపి నాకు ఇచ్చాడు స్వామి. తను మాత్రం మూడు పెగ్గుల నీళ్ళు కలుపుకున్నాడు.

"మెల్లగా.. కొద్దిగా చప్పరించు - అంతే.. గటగటా తాగకు!" అన్నాడు. మరో అరగంటకి మొదటిది పూర్తయ్యాక రెండో పెగ్ పోయించుకుని వచ్చాడు. కొంత రిలీఫ్ ఉంది స్వామి మొహంలో.

"ఏమయిందీ?" అడిగాను.

"అమ్మ చచ్చిపోయింది" చేతులు కట్టుకుని అన్నాడు. కళ్ళల్లో చెమ్మ.

"మైగాడ్ .. " స్టన్నయ్యాను "అయితే లీవు..." చెప్పబోయా.

"ఆ బాస్టర్డ్ అన్నీ అయిపోయాకే తీరిగ్గా నాకు ఉత్తరం రాశాడు... కనీసం టెలిగ్రాం ఇచ్చినా " సైలెంటయ్యాడు స్వామి.

"ఎవరూ?" అయోమయంగా అన్నాను.

"నన్నూ మా తమ్ముడ్నీ బతికించుకోవడం కోసం దిక్కులేక మా అమ్మ పెళ్ళి చేసుకున్న నా సవతి తండ్రి" చేతుల్తో ముఖం కప్పుకుని అన్నాడు. నేను మెల్లగా లేచి అతని భుజం మీద చెయ్యివేశాను.

"రాజా.. మొదట నా తమ్ముడు చచ్చిపోయాడు... ఇప్పుడు అమ్మ... ఈ లోకంలో ఇక నాకంటూ మిగిలింది నేను ఒక్కడ్నే!"

ఘనీభవించిన దుఃఖమే 'మౌనం' అని నాకు అప్పుడు తెలీదు. ఆ తరువాత స్వామి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. నేను రెండో పెగ్గు దగ్గరే ఆగిపోతే అతను మరో మూడు పెగ్గులు తాగాడు. మూడు గంటలు గడిచాయి. రాత్రి పది అయింది. మెస్ కట్టేస్తారు. నేను స్వామిని బులెట్‌లో దింపి మెస్‌కి పరిగెత్తా. లక్కీగా చపాతీలూ, కూరా పెరుగూ దొరికాయి.

'ఎలెక్ట్రిక్ స్టవ్' మీద చపాతీల్ని వేడిచేసి కూరని మళ్ళీ వేడిచేసి, మాగాయితో కలిపి స్వామికి మెల్లగా తినిపించాను. అంత 'తీసుకున్నా' తడబడటం లేదుగానీ కళ్ళు మూసుకునే ఉన్నాడు. చపాతీలు అతనికి తినిపించి నేను తిని పెరుగు తాగి పడుకున్నా. అతనికి జాగ్రత్తగా రగ్గుకప్పి వచ్చాను.

జీవితం ఎన్నిమలుపులు తిరుగుతుందీ..! అదీ క్షణాల్లో -

"రాజ్.. మళ్ళీ మనం విజయ్ చౌక్‌కి పోదాం..!" రెడ్‌ఫోర్ట్ దగ్గర చాందినీ అన్నది నమ్రత, 'చలో' అన్నాను ఉత్సాహంగా.

"ఎందుకో తెలుసా?" నవ్వింది. "నా పెదాల మీద నీ పెదాల ముద్ర ఎంత గాఢంగా పడిందో చూడ్డానికి కదూ..! " వీపు మీద చరిచింది.

టైమ్ ఎలాగడిచిందో తెలీదు గానీ మా 'చెట్టు' దగ్గరికి వచ్చేసరికి నిర్మానుష్యంగా ఉంది. అంటే, మనుషులు అక్కడ లేదు దూరంగా ఉన్నారు.

నన్ను వెల్లకిలా వెనక్కితోసి నా గుండె మీద తలపెట్టుకుని, "నువ్వెవ్వరా? అసలు మనది ఎప్పటి బంధం? నేనేమో ఓ పంజాబీ పిశాచిని. నువ్వేమో మద్రాసీ సాంబార్ గాడివి. ఈ పిచ్చి ఏమిట్రా? ఒక్క క్షణం నిన్ను వదలదేం నా మనసూ?" అంటూ కసిగా నా పెదాల్ని పీల్చేసింది.

ఒళ్ళంతా మెరుపులు.. రెండు విద్యుత్తీగలు కలిసి కరెంట్ షార్ట్ అయితే వచ్చే వెలుగుతో కూడిన నిప్పు రవ్వల్లా అణువణువూ రగులుతోంది. గాలి కూడా చొరనంత గట్టిగా కౌగిలించుకున్నాం. అరగంట తర్వాత లేచాక చూస్తే మా పెదాలు నిజంగా వాచిపోయి

ఉన్నాయి మా ఇద్దరి ఒంట్లోనూ ఒకే పరిమళం... అంతలా అల్లుకుపోయి ఉన్నామన్నమాట. రేపు మళ్ళీ కలవొచ్చు ఆదివారం గనక. ఆ ఉత్సాహంతో ఇంటికొస్తే - అదే బులెట్‌కి వస్తే - 'స్వామి' చెప్పిన వార్త.

మత్తు ఎక్కడం ప్రారంభం అయి చాలా సేపైనా, ఇప్పుడు విశ్వరూపం చూపిస్తోంది. వెల్లకిలా, ఫ్లాట్‌గా పడుకోలేక వాలుగా పడుకున్నాను. కళ్ళు మూతలు పడుతుంటే, నా కళ్ళమీద నమ్రత పెట్టిన ముద్దులు కలవై వాలాయి. నాపైనా, కిందా, కుడి ఎడమలా, నాలో, నా చుట్టూ అంతా ఆమె సుగంధమే. ఆమె గుసగుసల వెచ్చదనం నా చెవులకి తాకుతూ మరోలోకపు 'సంగీతం' వినిపిస్తుంటే తెలీకుండానే నిద్రలోకి జారిపోయాను.. మత్తుమత్తుగా -

**'కోయీ లౌటా దే** మేరే బీతే హు యె దిన్..' అనే పాట ఎప్పుడైనా విన్నారా? వినకపోతే తప్పకుండా వినండి. (గతించిన రోజుల్ని ఎవరన్నా తిరిగి నాకు ఇవ్వరూ) అని అర్థం. ఆర్ద్రతనీ, ఓ విహ్వలత్వాన్నీ గొంతునిండా నింపుకుని పాడాడు కిశోర్ కుమార్. అటువంటి పాట 'ముఖేష్' పాడితే బాగుంటుందని కుమార్, కాదు కిషోర్ వల్లనే ఆ పాటకి అంత డెప్త్ వచ్చిందని ప్రకాషూ వాదించుకుంటున్నారు. ఏదయితేనేం ఎన్నో సంవత్సరాలపాటు పదిమందిలో ఓ గాయకుడిలా ఉన్న కిషోర్, ఒక ఉప్పెనలాగా ఎగిసి శ్రోతల హృదయాన్ని కొల్లగొట్టాడు.

మనిషికి 'తోడు' కావాలంటారు. కానీ నిజమైన 'తోడు' కావాల్సింది 'మనసు'కి. మనసుకి తోడేదీ? అంటే నాకు మూడు విషయాలు స్ఫురిస్తాయి.

1.పాటలు 2. గతించిన జ్ఞాపకాలు 3. పుస్తకాలు. సంగీతమూ, మౌనమూ భగవంతుడి భాషలు. అందుకే ఎందరో భక్తులు సంగీతం ద్వారానే సాక్షాత్కారాన్ని పొందారు. ఇదెందుకంటే, ఆ.. గతించిన రోజులు తిరిగి వస్తే ఎంత బాగుంటాయో.! కానీ ఒక్కోసారి అనిపిస్తుంది. అవి అలా ఉంటేనే బాగుంటాయని.

నిద్రలేచాక, స్నానం చేసి యూనిఫాం వేసుకుని మెస్‌కి వెళ్తుండగా స్వామి అన్నాడు, "రాజా.. ఇక మళ్ళీ మద్యం ముట్టుకోనని ప్రామిస్ చెయ్యి..!" అని. నేను నవ్వి, 'ఒక్కరోజు మాత్రమేగా నేను తీసుకున్నదీ? ఐ యామ్ నాట్ ఎడిక్టెడ్ కంగారొద్దు అన్నా.. నేను తాగను!" అన్నాను.

నిన్నరాత్రి మొదటిసారి నా చేత తాగించినందుకు చాలా బాధపడుతున్నాడని నాకు తెలుసు.

ఆ సాయంత్రం స్వామి నాకు కనిపించలా. నా బెడ్ మీద ఒక 'నోట్' మాత్రం ఉంది "రాజా నేను లీవు తీసుకున్నాను. పదిహేను రోజుల తర్వాత వస్తాను.. బై.. దయచేసి 'బార్'కి వెళ్ళకు" అని రాసి ఉంది.

మూడోరోజునే నేను గుర్గావ్‌కి షిఫ్ట్ అయ్యాను. అవ్వాళ బుధవారం. గురువారం నాడు అఫీషియల్‌గా రిపోర్ట్ చేశాను. ఎరైవల్ రిపోర్ట్‌తో అవ్వాళ బిజీ. మా కమాండింగ్ ఆఫీసర్ పేరు యజువేందర్ సింగ్. నా సెక్షన్ ఇన్ ఛార్జ్ పేరు యాదవ్. పూర్తిపేరు నరేంద్ర యాదవ్. పక్కా 'జాట్'' గుర్గావ్‌కి దగ్గరలోనున్న 'పటౌడీ' వాళ్ళవూరు. నవాబ్ ఆఫ్ పటౌడీది ఆ ఊరే.

శుక్రవారం ఉదయం 'ఆఫ్' కావాలని యాదవ్‌ని అడిగితే హేపీగా ఓకె అన్నాడు. అంటే త్వరలో 'నమ్రత'ని కలవబోతున్నానన్న ఉత్సాహం నన్ను నిలవనివ్వలేదు. ఆమెని బేంక్‌లోనే కలవాలి. సర్‌ప్రైజ్ చెయ్యాలి. ఓ ఉత్సాహం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేంది. అసలు నిద్రపడితేగా నిద్రపోవడానికి.

తెల్లవారు ఝామున వికృతమైన పక్షి అరుపులు. బయటికొచ్చి చూస్తే నెమళ్ళు గుంపులు గుంపులుగా ఉన్నాయి. అంత అందమైన నెమలి, అరిస్తే మాత్రం కర్ణకఠోరంగా ఉంటుంది. కానీ ఎంతసేపు చూసినా వాటిని తనివి తీరదేం!

పదింటికల్లా బేంక్ దగ్గర ఉన్నా. బేంక్ ఎదురుగానే ఓ పీసపు చెట్టుంది. దానికి పక్కగా నుంచున్నాను. దూరంనించే గుర్తుపట్టాను. బ్లూ స్ట్రెచ్‌లాన్ పాంటూ, వైట్ షర్టూ.. ఏదో ఆలోచిస్తూ వస్తోంది. పరిగెత్తుకుంటూ ఎదురుపడదామనిపించింది.

కానీ, మనసు 'ఆగ'మని ఆపేసింది. 'అనోఖీరాత్' (ANOKHEERAAT) సినిమాలో పాట గుర్తొచ్చింది... 'దుల్హన్ సె తుమ్హారా మిలన్ హోగా, తో మన్ థోడీ ధీర్ ధరో...' అన్న పాట. 'వధువుని కలిసే సమయం ఆసన్నమయిందా... అయితే ఓ మనసా.. కాస్త నిదానించు' అని అర్థం. పదిహేను నిముషాల తరవాత బాంక్ లోపలికి వెళ్ళా. తలొంచుకుని కేష్ కౌంటర్లో డబ్బులు లెక్కపెట్టుకుంటోంది.

"కెన్ ఐ డ్రా సమ్ మనీ ప్లీజ్?" అన్నాను. తటాలున తలెత్తింది.

ఒక మొహంలో ఒకేసారి ఆనందమూ, ఆశ్చర్యమూ 'ఇదంతా కలా, నిజమా' అనే అపనమ్మకమూ, 'ఇది కలకాదు నిజమే' అనే నమ్మకమూ సముద్రంలో పోటెత్తినట్టుగా ఒక్కసారి పోటెత్తిన ప్రేమా, క్షణంలో ఒకటైపోవాలనే యుగయుగాల విరహమూ, అయ్యో.. ఇక్కడలా చేయలేనుగదా అనే మూగబాధా అయినా 'నిన్ను చూశానుగా' అన్న ఆత్మ తృప్తీ ఇవన్నీ జస్ట్ కొన్ని సెకన్లలో ప్రతిఫలిస్తే ఎలా ఉంటుందో ఆ క్షణంలోచూశా... అద్దంలాంటి నమ్రత మొహంలో. అదే క్షణంలో లేచి నిలబడింది.... కానీ, మాటలు రావట్లా. నాకు అత్యంత ప్రియమైన ఆ పెదాలు మాత్రం స్వల్పంగా, అయినా స్పష్టంగా అదురుతున్నాయి.

డబ్బు ఇవ్వడానికీ, తీసుకోడానికీ ఏర్పాటు చేసిన బుల్లి కౌంటర్ హోల్ లోంచి నా చేతిని లోపలికి జాపాను. తన రెండు చేతుల్తో నా చేతిని పట్టుకుంది. ఆ చేతులు ఒణకడం తెలుస్తోంది.

"కూల్....కూల్.." అన్నాను. నా గొంతులోంచీ స్పష్టంగా మాటరాలేదని నాకూ అర్థమైంది. ఒక నిముషం తరువాత తన చేతులపట్టు సడలించి గట్టిగా నిట్టూర్చింది. కొన్ని మాటలకంటే మౌనమే గొప్పగా మాట్లాడగలదు. భాషకి అందని భావాల్ని తెలియపరచడానికి, మౌనాన్ని మించిన సాధనం సృష్టిలో లేదు.

ఇప్పటి గుర్గావ్ రూపురేఖలు నాకు తెలీదు. కానీ, అప్పటి గుర్గావ్‌లో 'సోనా అడ్డా' చాలా ప్రాముఖ్యత గల జాయింట్. ఢిల్లీ వైపు నుంచి రివారీ వైపు వెళుతూ సోనా అడ్డా దగ్గర రైట్ తిరిగితే జయపూర్ రోడ్డు, లెఫ్ట్ తిరిగితే హిస్సార్ రోడ్డు. జయపూర్ రోడ్డుకి అటూ ఇటూ యూకలిప్టస్ చెట్లు వనాల్లాగా ఉండేవి. నేను అక్కడికి వెళ్ళేటప్పటికీ అవి బాగా ఎదిగి ఉన్నాయి. ఆ చెట్లని స్పృశించి వీచే గాలికో చిత్రమైన పరిమళం ఉండేది. ఇద్దరం ప్రతిరోజూ సోనా అడ్డాదగ్గర కలిసి జయపూర్ రోడ్‌లో చాలా దూరం, అంటే కనీసం రానూపోనూ నాలుగయిదు మైళ్ళు నడుచుకుంటూ వెళ్ళేవారం.

ఆ రహదారి మీద అప్పుడప్పుడూ పోయే హర్యానా రోడ్ వేస్ బస్సులూ లారీలు తప్ప ట్రాఫిక్ అంత ఎక్కువగా ఉండేది కాదు. ఓ స్కూటీ (అదీ బజాజ్) ఉంటే 'గొప్ప' అనుకునే ఆ రోజుల్లో కార్ల సంగతి చెప్పాలా. ఎన్నో పాటలు..'మేరా ప్యార్ భీ తూ హై యే బహార్ భీ తూ హై (సాథీ సినిమాలోది) ఇంకా లెక్కలేనన్ని హిందీపాటలు. తను లిరిక్స్ చెబితే నేను తెలుగులో రాసుకుని పాడుతూ ఉండేవాడిని. ఆ అద్భుతమైన 'నిధి' ఈనాటికీ ఆనందాన్ని ఇస్తూనే ఉంది. హిందీ పంజాబీ పాటల అర్థాలు చక్కగా వివరించేది. అలా

కొన్ని వేలపాటలు నా మనసుకి హత్తుకుపోయాయి. నవ్వినా పాటే, ఏడ్చినా పాటే, విరహానికి పాటే, వినోదానికి పాటే అలా 'పాట' నా జీవితంతో మమేకమైపోయింది.

ఢిల్లీలో ఎప్పుడో గానీ వర్షం కురవదు. అలా వర్షం వచ్చిన రోజున ఎంత పిచ్చిగా తడిసేవాళ్ళమో.

ప్రేమ కళ్ళల్లో ఉంటుంది. మనసులో ఉంటుంది. శరీరపు అణువణువునా ఉంటుంది. అసలు 'ప్రేమ' లేని చోటేదీ? ప్రేమ ఎక్కడుందో 'సౌందర్యం' అక్కడే ఉంటుంది. సౌందర్యం ఉన్నచోట 'ప్రేమ' లేకపోవచ్చు. కానీ 'ప్రేమ' ఉన్న చోట మాత్రం సౌందర్యం ఉండి తీరుతుంది. లేకపోతే తను చిటికెన వేలు కదిల్చినా, కనురెప్పలు ఎత్తినా, కనులు కిందకి దించుకున్నా, ఆఖరికి ఆమె కాలికొనగోటిని ముట్టుకున్నా నా కంత పరవశం ఎందుకు కలుగుతుందీ? అణువణువునా నాకు సౌందర్యమే కనిపించేది. అణువణువునా ప్రేమ ఉబుకుతున్నట్టే అనిపించేది.

ఒళ్ళు కుచించుకుపోయే వింటర్లో, శ్వాసల ఆవిర్లు చలిగాలుల్లో కలుస్తూ ఉండగా ఎన్ని మధురమైన మాటల రథాలు కదిలాయో! ఎన్ని కలల వర్షాలు కనుపాపల్లో కురిశాయో! ఎన్ని సుగంధ మాలికలు శ్వాసలద్వారా గుండెల్లో చేరి గుండెని గిలిగింతలు పెట్టాయో!

ఒక మెరుపు మరో మెరుపుతో ఐక్యమైనట్టుగా ఉండేది... మా పెదవులు కలిస్తే! సోనిపట్ వైపు నడిచేప్పుడు సీసపు చెట్ల నీడలు అద్భుతంగా ఉండేవి.

పక్క పక్కన నడుస్తూ వుంటే, నీడలు కూడా ఒకటై కవ్వించేవి. చెట్టు నీడకి చేరినప్పుడు మాత్రం నీడలు మాయమై శ్వాసలు వేడెక్కేవి. ప్రతిచెట్టూ ఓ జ్ఞాపకాల గ్రంథాలయమే. ఏకాంతంగా ఇద్దరం కలిసిన క్షణాలు నిజంగా యవ్వన కెరటాలే. అయితే ఏనాడూ 'చెలియలి కట్ట' దాటలేదు. ప్రేమలో పవిత్రత ఉండాలి.... అసలు ప్రేమని పవిత్రంగా భావించాలి. ప్రేమ అంటే కోరిక కాదు.... శారీరకమైన కామం కాదు. అది ఏ మాటలకీ ఏ భాషకీ లోబడదు. అంటే అనిర్వచనీయం. గాలి స్థంభించిపోతే "గుండె" గాలికోసం ఎంత ఉక్కిరి బిక్కిరి అవుతుందో ప్రేమకోసం మనసూ అంతే.

'నీ ప్రేమ అందకుంటే నా శ్వాస ఆడదంటా' అని ఓ పాట రాశా ఆరోజుల్లో..... ('నా గుండె ఆడదంటా' అనుకుంటా)

ఢిల్లీ వేసవి భరించలేనిది. అలాగే వింటర్ కూడా. చెప్పలేని వేడి, చెప్పలేని చలి. నేను గుర్గావ్ వెళ్ళాక శనాదివారాలు కూడా నమ్రత ఢిల్లీ వెళ్ళేది కాదు. ఆ రోజుల్లో వాళ్ళ నాన్నగారే గుర్గావ్ వచ్చేవారు. ఆమె ఓ రోజున 'ఫ్రెండ్'గా నన్ను వాళ్ళింట్లో పరిచయం చేసింది. వాళ్ళు ఎంతో సంతోషంగా ఆహ్వానించారు. అంతేకాదు శనాదివారాల్లో భోజనం (అంటే, పంజాబీఖానా) వాళ్ళింట్లోనే చెయ్యాలని బలవంతం చేసేవారు. నమ్రత తండ్రి శివనారాయణ్ మాంఛి పొడగరి. బాగా ఎరుపు. తల్లి మాయాదేవి. 'మాయా' అంటారు. నేను సరదాగా 'శివ్‌మాయా' అంటే విష్ణుమాయలాగా 'శివమాయ' అన్నాను. ఆయన పడీపడీ నవ్వి, 'మాయా తో జరూర్ మాయా హై.!' అన్నాడు.

మాయాజీ వంటల్లో ఎక్స్‌పర్ట్. అసలు సిసలు పంజాబీ ఆలూ పరోటా రుచి ఏమిటో అక్కడే చూశాను. ఆయనా బేంక్‌లోనే గనక ఎక్కువ చేరి బేంకింగ్ గురించే మాట్లాడేవాడు. నాకు ఆ విషయంలో నాలెడ్జి జీరో. అసలు నాకు బేంక్ అకౌంటే లేదు. నాకొచ్చే జీతమే తూ...తూ. దానిని బాజాభజంత్రీలు ఎందుకూ? (అంటే బేంక్ ఎకౌంట్లూ ఇన్వెస్టుమెంట్లూ ఎందుకని అర్థం) దేశీ 'ఘీ' మాత్రం తెగవాడే వాళ్ళు. నేను ప్యూర్ వెజ్ కనక ఎప్పుడూ వెజిటేరియన్ వంటకాలే చేసేదావిడ.

కొన్నివారాలు గడిచేసరికి ఆయనకీ అర్థమైందనుకుంటా. మా ట్రాక్ కాస్త భిన్నంగా ఉందని. ఓపెన్‌గా ఏమి అనలేదు గానీ, ఇన్‌డైరెక్ట్‌గా 'ప్రేమలో పడటం చాలా తేలిక, కానీ, దాన్ని నిభాయించగలగటం చాలా కష్టం' అన్నాడు. అవాళ సరదాగా ఇంట్లో జరిగిన

'సంగీత్' కార్యక్రమంలో 'ప్యార్‌కియాతో డర్ నా క్యా' అన్న పాటని నమ్రత పాడింది. ఆయన నవ్వేసి 'నేను అక్బర్‌ని కాదు. శివ్ నారాయణ్‌ని బేటీ' అన్నాడు. వాటే గ్రేట్ ఫాదర్. మాయాజీ ఎప్పుడూ సంతోషంగానే ఉంటుది. ఎప్పుడూ రేడియో 'ఆన్'లో ఉంచడం ఒక్కటే ఆవిడకున్న (దు)రలవాటు.'

జయపూర్ రోడ్‌లో మేం నడిచిన బాట, అంటే (రోడ్డు పక్కన ఉన్న పచ్చిక బాట) నలిగీ నలిగీ కాలిబాటలా మారింది. తిరిగి సోనా అడ్డా దగ్గరికి వచ్చినప్పుడు ప్రకాష్ రెస్టారెంట్ లో మాంచి 'టీ' తాగేవాళ్ళం. ఆ వేడి వేడి టీని మెల్లగా చప్పరిస్తూ నమ్రత మెల్లగా చెప్పే మాటలు వింటూంటే అద్భుతంగా ఉండేది. ఎండాకాలమైతే 'మిల్క్‌షేక్' తాగేవాళ్ళం. 'రూ అఫ్జా' వేసిన ఆ మిల్క్ షేక్ రుచీ సువాసన నిజంగా అద్భుతం.

వారానికి మూడుసార్లు ఢిల్లీ వెళ్ళాల్సి వచ్చేది. అప్పుడు తప్పకుండా స్వామిని కలిసేవాడ్ని. ఒక్క ఆఫీస్ అవర్స్‌లో తప్ప మిగతా సమయాల్లో స్వామి 'మూగస్వామి'లా మారిపోయాడు. మిగతా వాళ్ళతో అసలు మాట్లాడేవాడు కాదు. నాతో మాత్రం కొద్దోగొప్పో మాట్లాడేవాడు. ఓ శుక్రవారం నాడు బలవంతంగా అతన్ని గుర్గావ్ తీసుకొచ్చా. ఆ రాత్రి అతను అడక్కుండానే అతనికి మాత్రం 'రమ్' ఏర్పాటు చేశా. మూడు పెగ్గులు తాగాక చిన్నగా అన్నాడు, "నేనెందుకు బతకాలీ? అసలెందుకు ఉద్యోగం చెయ్యాలీ?" అని. ఎంత మౌనం గడ్డకట్టిందంటే, బహుశా కోటి శబ్దాలయినా ఛేదించలేవేమో ఆ మౌనాన్ని. నాకు తోచినంతా, నాకు తెలిసినంతా జీవితం గురించి చెప్పాను. చివరలో, "నువ్వు బ్రతకాలనేగా మీ అమ్మగారు తన సర్వస్వాన్ని పణంగా పెట్టి మిమ్మల్ని పెంచింది! మీ తమ్ముడు చనిపోయినా, నీకోసం తను బ్రతికే ఉంది కానీ మరణించే ప్రయత్నం చెయ్యలేదే ఇప్పుడు ఆవిడ లేదు. కానీ నువ్వు చనిపోతే ఆవిడ ఆత్మ శాంతిస్తుందా? అన్నా... ఎవరో ఒకర్ని, పోనీ ఓ దీనురాలినే పెళ్ళిచేసుకో...! ఓ ఆడదాని కంట కన్నీరు కారకుండా బతకనివ్వు! అప్పుడు మీ అమ్మగారి ఆత్మ నిజంగా శాంతిస్తుంది" అన్నాను. కళ్ళెత్తి నా వంక సూటిగా చూసి నిట్టూర్చాడు. ఆ శనివారం 'ఆఫ్' కావడంతో నాతోటే స్వామి ఉన్నాడు. మొదటిసారి నమ్రతని స్వామికి పరిచయం చేశాను. అతను చాలా సంతోషించాడని మాత్రం చెప్పగలను -

ప్రసాద్ గారిని ఆదివారం ఉదయం వారింటి దగ్గరే కలిశాను. ఇంగ్లీష్ పొలిటికల్ సైన్సు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషనూ, మిలటరీ సైన్స్ సబ్జక్టులుగా తీసుకోమని సజస్ట్ చేశారు. పంజాబ్ యూనివర్సిటీ అయితే బాగుంటుందని చెప్పారు. సరే అనుకున్నాను. బి.ఏ.కి పుస్తకాలు కొన్నాను.

నేను పి.యు.సి తో చదువు ఆపి బి.ఏ ఫస్టియర్ డిస్ కంటిన్యూ చేసి ఏర్‌ఫోర్స్‌లో ఎందుకు చేరానో చెప్పాలంటే మరో నవల అవుతుంది. బ్రీఫ్‌గా చెప్పాలంటే జనన మరణాల లీల.

శ్రీకాకుళంలో పి.యు.సి చదువుతుండగా పరీక్షల ముందు మానాన్నగారు వైజాగ్ కె.జి.హెచ్ లో పరమపదించారు. నాకు వచ్చిన స్కాలర్ షిప్ డబ్బు ఆయన భౌతిక కాయాన్ని వైజాగ్ నుంచి చింతలపూడి వరకూ టేక్సీలో తీసుకు వెళ్ళడానికి కొంత ఉపయోగపడింది. (రుణం అంటే ఇదేనా?)

తరువాత హైదరాబాద్‌లో ట్యూషన్లు చెప్పుకుంటూ, బి.ఏ చదువుదామని ఓ గొప్పలాయరు కావాలనే ప్రయత్నంలో ఉన్నాను. పది నిముషాల క్రితం మాట్లాడిన స్నేహితుడు లారీ కిందపడి మరణించడంతో 'అసలేమిటీ జీవితం?' అన్న ప్రశ్న గాఢంగా మనసుని కలవర పెట్టింది. కొద్ది రోజులకే పేపర్లో 'గన్నవరం దగ్గర పెళ్ళి పందిరి అంటుకుని నాలుగు వందల మంది మృతి' అన్న వార్తని చదివాక మనసు మూగబోయింది.

అప్పుడే 'విస్మృతయాత్రికుడు' 'యాత్రికుడు' అనే రెండు పుస్తకాలు చదివా. ఒకటి ప్రబోధ్ కుమార్ సన్యాల్ రాస్తే మరొకటి రాహుల్ సాంకృత్యాయన్ రాశారు. అప్పుడనిపించింది. దేశదిమ్మరిని కావాలని. ఇంతలోనే శంకర రెడ్డి అనే ఫ్రెండ్ ఏర్‌ఫోర్స్ సెలక్షన్‌కి వెడుతూ నన్ను తీసుకెళ్ళడం, నేను నెగ్గటం - అతను వెనక్కి రావడం జరిగింది. సెలక్ట్ అయిన ఆరో రోజునే ట్రైనింగ్‌కి పంపారు.

ఇంత బ్రీఫ్‌గా చెప్పాను కానీ, మనసుపొరల్లో ఆ రోజుల్లో రేగిన అలజడి అంతా ఇంతా కాదు. జననం మీదా మరణం మీదా మనిషి, జీవుల అస్తిత్వం మీద ప్రశ్నలే ప్రశ్నలు. జవాబులు వెదుక్కోవడానికి చేసిన ప్రయత్నమే 'వాళ్ళు' అనే నా రచన. (త్వరలో ఎమెస్కో వారు ప్రచురించబోతున్నారు.)

అదలా ఉంచితే, తెగిన దారాన్ని ముడి వెయ్యడమే నా బి.ఎ ప్రయత్నం అనిపించింది.

కొత్తపుస్తకాలు 'నమ్రత'కి చూపించాను. పకపకా నవ్వి, "నువ్వు చదివినన్ని నవలల ముందు, లిటరేచర్ ముందూ ఈ నాలుగు పుస్తకాలూ ఎంతటివీ?" అన్నది. అదీ... ఉత్సాహపరచడం అంటే.

"రాజ్.. సినిమా పోస్టర్ల మీద చిన్నప్పుడు కవుల పేర్ల పక్కన నీపేరూ చాక్‌పీసుతో రాశానని చెప్పేవాడివికదూ..., అలాగే ఈ చెట్లమీద నీ పేరు చెక్కుతా చూడు" అని ఓ చాకుతో 'రాజు. బి.ఎ' అనే ఇంగ్లీషు అక్షరాల్ని ఆ యూకలిప్టస్ చెట్లమీద చెక్కింది. అఫ్‌కోర్స్ నమ్రత బి.ఎ. అన్న తన పేరు కిందుగా.

"అదేంటి నీపేరుపైనా నా పేరు కిందానా?" అని అలిగా.

"అంతేగా మరీ.. నేను ఆల్‌రెడీ బి.య్యే. నువ్వుంకా చదవాలిగా 'బుద్ధూ'.. అదిగాక, పెళ్ళయినా నేను పైనే!" అని పకపకా నవ్వింది. ఆ 'ఒక్క'మాట చాలదూ పిచ్చెక్కడానికీ.

మహా తిక్కతో కౌగిలించుకున్నా. ముద్దుకి 'మూతి' వాచిపోయింది. గ్యాస్ స్టవ్ వెలిగించాలంటే 'లైటర్' కావాలి. మనసులోని చిన్న 'అల్లరితనం' చాలు, శరీరాలనే కుంపట్లని క్షణంలో కణకణా మండేట్టూ చెయ్యడానికి.

దేవుడా!. ఈ శరీరమంత గొప్ప సృష్టి లోకంలో మరొకటి ఉంటుందా! ఓహ్.. తుఫాన్లూ, చల్లగాలులూ, మంచూ, వరదలూ, భుగభుగ మండే మంటలు అన్నీ ప్రతి అణువులోనూ ఇమిడ్చావే..! నీకంటే గొప్ప సైంటిస్టు ఎవరూ?

'దో భిగా జమీన్' సినిమాలో ఒక పాట ఉంది. 'మౌసమ్ బీతాజాయ్' అని. 'రుతువు కదిలిపోతో'ందని ఆపడానికి అర్థం ఒకదాని వెంట ఒకటి రుతువులు కదులుతున్నాయి. ఇంకా చెప్పాలంటే ఒక రుతువు పక్షిలాగా రెక్కలు విప్పుకుని గగనం.. అంటే, 'కాలగగనం'లోకి ఎగిసిపోతే, మరో రుతువు రెక్కలల్లారుస్తూ పుడమిపై వాలుతోంది. 'ఢిల్లీ'ని తలుచుకుంటే నాకు గర్వం. అదొకప్పటి హస్తినాపురం అని. అంతేకాదు.. నా గత జన్మల నీడలు జాడలు అక్కడ ఉన్నాయేమో! లేకపోతే నా ముగ్గురు అన్నలూ నలుగురు అక్కలూ అందరూ ఆంధ్రాలోనే ఉంటే నేను మాత్రం పద్దెనిమిదేళ్ళకే ఢిల్లీలో ఎలా కాలుపెట్టగలిగానూ.. పాఠకుడా, నీకు 'రుణం' లేని చోటుకి నువ్వు ఎంత శ్రమించినా వెళ్ళలేవు. అలాగే నువ్వు వెళ్ళాల్సిన చోటుకి వద్దని ఎంత మొత్తుకున్నా కూడా వెళ్ళితీరాల్సిందే వాటినే అంటాం నేలరుణం, నీటి రుణం గాలిరుణం, నిప్పురుణం అని. ఇక ఆకాశమా!? అదిలేని చోటేదీ? ప్రయివేటుగా బి.ఎ మొదటి సంవత్సరం పరీక్షలు రాశాను. 'భాల్సా కాలేజ్'లో. ఖచ్చితంగా మంచి మార్కులతో పాస్ అవుతానని నాకు తెలుసు. ఒక్కసారి చదివితే నాకు గుర్తుంటుంది మరి.

ఒక చిన్నపార్టీ..., స్వామి, ప్రకాష్, వెస్లీ, కమలాక్ష, హైదరాబాదీ, పింటూ, గెస్టులు. ప్రసాద్‌గారు మెయిన్. మాయాజీ, శివనారాయణ్‌జీ, మా ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌ఛార్జ్ కపూర్‌గారూ అందరం కలిశాం. ఆ సమయంలోనే 'ఆనంద్'గా పేరుమార్చుకున్న

పింటూ, ఓ హర్యానా పిల్లని పెళ్ళిచేసుకోబోతున్నానని అనౌన్స్ చేశాడు. అందరం స్వాగతించాం. నమ్రత నావంక చిరునవ్వుతో చూడటం బహుశా అందరూ గమనించే ఉంటారు. (దుల్హన్ సే తుమ్హారా మిలన్ హోగా, తో మన్ ధోడీ ధీర్ ధరో...)

నా భుజం మీద గడ్డం ఆన్చి అన్నది.." ఆ రోజున నాకు ఏమి ఇస్తావూ?" అని. ఎంత మెల్లగా అంటే, ఆ మంద్రమైన స్వరం ఇప్పటికీ గుండెల్లో ప్రతిధ్వనించేంత. ఆ గుసగుసకి ఆమె నోటినుంచి వెలువడిన మాటల 'వెచ్చదనం' నా చెవులకి జన్మానికి సరిపడా గిలిగింతలు కలిగించేంత. మెల్లగా తల ఆమెవైపుకి తిప్పాను.

ఎన్ని కలలు కన్నా కనుపాపల దాహం తీరదేం?

ఎన్ని మధురపదార్థాలు తిన్నా నాలుక 'ఆకలి' తీరదేం?

ఎన్ని సువాసనల్ని ఆఘ్రాణించినా నాశిక తృప్తిపడదేం?

ఎన్నిసార్లు కౌగిలించినా తనువు ఇంకా తపిస్తూనే ఉంటుందే?

ఎన్నిసార్లు మధువులాంటి ముద్దుల్ని రుచి చూసినా ఈ పెదవులదాహం తీరదేం?

ప్రశ్నలు మనసులో ఉంటే - పెదవులు ముడివడి కాలాన్ని సవాలు చేస్తున్నాయి.

"ఆరోజున ఏమిస్తావూ?" అని అడిగింది నమ్రత..

"ఒక్కసారి రావూ.. చూడాలని ఉందిరా.." అంటూ అతిదీనంగా 'ఉమ' వ్రాసిన ఉత్తరం ఎక్కడెక్కడో తిరిగి ఆ పూటే నన్ను చేరింది. పెరేడ్ గ్రౌండ్‌లో ఓ చెట్టుని ఆనుకుని బిగ్గటిల్లి ఏడ్చాను. ఆ ఉత్తరం రాసి మూడునెలలయింది. ఆ రోజు ఈ బాల్‌పెన్నులు లేవు. ఇంకు పెన్నులే. కన్నీటి చుక్కలు పడి (ఉమవి), అక్కడక్కడా అక్షరాలు అతుక్కుపోయాయి. అసలిన్నాళ్ళూ ఉమని ఎలా మరిచానూ? (మరిచాననడమూ సత్యం కాదు. ఎప్పుడు ఉమ గుర్తొచ్చినా నమ్రతతో కంపేర్ చేసుకునేవాడ్ని.. ఎంత కఠినత్వం నాది..) మనసంతా కరిగి కన్నీళ్ళతోజారేవరకూ ఆగి, ఆ తరవాత మా ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాను, సెలవుకోసం.

"డిడ్‌యూ క్రై?" నా మొహం వంకే దీర్ఘంగా చూసి అన్నాడాయన. అవునన్నట్టుగా తలవూపాను.

"వై?" అన్నాడు.

ఏం చెప్పనూ? తలవంచుకున్నాను.

"How many days?" మెల్లగా అన్నాడు.

"నెల.. సారీ వన్‌మంత్" అన్నాను.

"ఓ.కె. అప్లై చెయ్యి.. వెంటనే ఇస్తా." అన్నారు. ఆయనా చిన్నవాడే బహుశా అందుకే వివరాలు పెద్దగా అడగలేదు. థేంక్స్ చెప్పి అర్జంటుగా అప్లికేషన్ ఫిలప్ చేసి నా సెక్షన్ ఇన్‌ఛార్జ్‌కి ఇచ్చాను.

"సారీ ఐ కాంట్ గివ్‌యూ లీవ్" అన్నాడు. అతనో తమిళియన్. వాళ్ళవాళ్ళని తప్ప మిగతా వాళ్ళని మనుషులుగా చూడడు. "మీరివ్వక్కర్లేదు. నేను ఆల్‌రెడీ ఫ్లైట్ లెఫ్టినెంట్ కపూర్ గారితో మాట్లాడాను. ఆయన గ్రాంట్ చేస్తానని చెప్పాకే అప్లికేషన్ ఫిలప్ చేసి మీకిచ్చాను." కూల్‌గా, అన్నాను.

"ఓహో..!" వ్యంగ్యంగా వంకరగా నవ్వి 'నాట్ గ్రాంటెడ్' అని రాసి సంతకం పెట్టి నావేపు విసిరాడు.

నేను మహా కూల్‌గా దాన్ని తీసుకుని బయటికి వెళ్ళబోతుండగా అన్నాడు. "వేర్ ఆర్యూ గోయింగ్?" అని.

"కమాండింగ్ ఆఫీసర్ దగ్గరికి!" అంతే కూల్‌గా అన్నా.

"వెయిట్!" అని తనే మరో ఫాం ఫిల్ చేసి, 'గ్రాంటెడ్' అని సంతకం పెట్టి నా చేతికిచ్చాడు. వీళ్ళు ఎంత స్వార్థపరులో అంత పిరికి గొడ్లు. ఆరోజుల్లో తమిళులు IAS, IP and IFS గా ఢిల్లీని ఏలారు. ప్రతిదానికీ ఏదో ఓ కొర్రీ పెట్టి వాళ్ళ గొప్ప చూపించుకునే ప్రయత్నం చేసేవాళ్ళు. వాళ్ళల్లో ఉన్న యూనిటీ దేశంలో ఏ రాష్ట్రంవాళ్ళకీ ఉండదు. అలాగని మంచివాళ్ళూ లేకపోలేదు. వారి గురించి తరవాత చెప్పుకుందాం.

ఏర్‌ఫోర్స్‌లో చేరాక మొట్టమొదటి శలవు. మరసటిరోజు జి.టికి రిజర్వేషన్ దొరికింది. మధ్యాహ్నమే బేంక్‌కి వెళ్ళి నమ్రతని కలిశాను. సెలవు గురించి చెప్పగానే, "వై.. ఏమయింది? మీ అమ్మగారు క్షేమమేనా?" అన్నది.

వీలున్నంత వివరంగా 'ఉమ' గురించి చెప్పాను.

అంతా కామ్‌గా విని, "తప్పకుండా వెళ్ళిరా.. కానీ గుర్తుంచుకో, ఆమెకి నా విషయం చెప్పొద్దు. అస్సలు చెప్పనని ప్రామిస్ చెయ్" అన్నది.

"ఎందుకు చెప్పకూడదూ?" ఆశ్చర్యంగా అడిగా.

"ఎందుకు చెప్పకూడదో బహుశా ప్రతి ఆడదానికీ అర్థమవుతుంది కానీ మగాళ్ళకి ఎంత చెప్పినా అర్థమవుతుందని నేను అనుకోను" అన్నది.

"నువ్వు చెప్పు.. నేను అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తా" అన్నాను.

"ప్రతి స్త్రీ మనసుపొరల్లోనూ 'నా' అనే ఒక వ్యక్తి ఉంటాడు. ఆ బంధం అన్ని బంధాలకీ అతీతం. భాషకి అందని బంధం అది. దానికి ఏ మాత్రం దెబ్బ తగిలినా ఆ స్త్రీ గుండె గాజుగ్లాసు భళ్ళున ముక్కలైనట్టు ముక్కలైపోతుంది. దేవుడా.. ఇంకా నన్నేదీ అడక్కు. ముందు ఉమని చూసిరా..!" గబగబా సీట్లోకి వెళ్ళిపోతూ అన్నది. నమ్రత ఇంతకంటే ఇంకేమీ మాట్లాడదలచుకోలేదని అర్థమైంది.

ఒకరకమైన సందిగ్ధతతోనే ఆ రాత్రి ఢిల్లీ చేరాను. స్వామిని కలిశాను. ఆ బులెట్‌లోనే ఉన్నాను. ఉమ విషయం మాత్రం చెప్పలేదు. ఏవేవో మిగతా విషయాలు మాట్లాడుకుని నిద్రపోయే ప్రయత్నంచేశా. నిద్రపడితే ఒట్టు. ఉమకి ఏమైందో నాకు తెలీదు. తను మా ఊరుదాటి వెళ్ళిపోయినప్పటి గాజుముక్క ఇంకా నా దగ్గరే పదిలంగా ఉండిపోయింది. తెల్లవార్లూ జ్ఞాపకాల నీడల్లోనే సంచరించాను. ఇక్కడో విషయం చెప్పితీరాలి.

పొద్దున్నే ఉత్తరం అందుకున్నప్పటి వ్యధ, దుఃఖమూ ఈపూట తెల్లవారాక లేదు.. తగ్గింది. అందుకే అన్నారు.. కాలం ఏ గాయాల్ని అయినా మాన్పగలదని.

ఇదే విషయాన్ని ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. నాకు అర్థమయింది ఒక్కటే, మనసునీ, శరీరాన్నీ భగవంతుడు ఎంత గొప్పగా, అద్భుతంగా తీర్చిదిద్దాడా అని. ఓ తుఫాను వచ్చినప్పుడు భీకరంగా మారిన సముద్రం, తుఫాను ఉధృతి తగ్గగానే క్షణాల్లో ఎలా శాంతపడుతుందో మనసూ అంతే.

విజయవాడలో దిగాను. ఉత్తరం మీద ఉన్న అడ్రస్ ప్రకారం ఉమ గుంటూర్లో ఉండాలి. మా అన్నగారింట్లో సూట్‌కేస్ పడేసి ఓ షోల్డర్ బ్యాగ్‌లో ఓ జతబట్టలు కుక్కి గుంటూరు బస్సెక్కాను. గుంటూరు వెళ్ళడం అదే మొదటిసారి. ఇప్పటి రోడ్లూ బస్సులతో పోలిస్తే అప్పటి బస్సులు తాబేళ్ళు. రోడ్లు అధ్వానం. కానీ అప్పటికి అవే గ్రేటు.

అరండల్ పేట ఫలానా నంబరు ఇల్లు. వాకిలి తలుపులు తీసే ఉన్నాయి. గుండెలో ఏదో బాధ. గుండె వేగంగా కొట్టుకుంటోంది. చెప్పలేని ఉద్వేగం.. ఉమని ఎలా చూడాల్సివస్తుందో..!?

తెరచిన తలుపుల మీద వేళ్ళలో కొట్టి శబ్దం చేశా. "వస్తున్నాను.. ఎవరూ..?" నీరసంగా వినిపించిన ఆ స్వరం ఉమదే నా ఒళ్ళు తెలియని ఉద్వేగంతో ఊగిపోతోంది.

నిముషం తరవాత కనిపించింది.. సన్నగా, నీరసంగా గాజుబొమ్మలా. పచ్చని ఆ పసిమిఛాయ ఏమయిందీ? మా తమ్మిలేరు వరదల్లో ఎగసి పడ్డట్టుగా ఎగసిపడే ఆ ఉత్సాహం ఏమయిపోయిందీ .. ఆ ఉమకీ ఈ గాజుబొమ్మకీ అసలు సంబంధమే కనిపించలా.. చిక్కిశల్యమయింది.

"ఉమా..ఉమ్మీ.." పిలుద్దామనుకున్నాగానీ గొంతు పెగల్లేదు. నన్ను గుర్తించిన ఆ కళ్ళల్లో లక్షమెరుపులు. గబగబా ముందుకొచ్చి నా చేతులు పట్టుకుంది. ఎప్పుడు లాక్కున్నానో తెలీదు. నాదగ్గరకు. నా గుండెమీదకు లాగి వత్తుకుంటూ చూశా ఉమ కళ్ళు మూసి ఉన్నాయి. స్పృహతప్పింది తనకి.

మళ్ళీ మళ్ళీ అదేపాట.. "దునియా బనానే వాలే.. క్యాతేరే మన్ మే సమాయీ.. కాహేకో దునియా బనాయీ..!"

లోకాన్ని అసలెందుకు సృష్టించావు సృష్టికర్తా?

లోకాన్ని సృష్టించావు.. మంచిదే! నవ్వడం నేర్పావు.. ఏడవడం నేర్పావు.. జీవితమనే బాటలో స్నేహితుల్ని కలిపావు.. ఆ స్నేహంతోబాటు లక్షస్వప్నాల్ని కూడా ఇచ్చావు.. మరి ఆ కలలనన్నీ కల్లలుగా ఎందుకు చేస్తావు?

పదిహేనురోజులు..! పదిహేను పగళ్ళు.. రాత్రులు. జీవితమనే వారధి కిందనించి 'కాలం' నదిలా ప్రవహిస్తూ కాలగర్భంలో ఎలా కలిసిపోయిందో!

"ఇప్పుడు ఫరవాలేదు. చాలా జాగ్రత్తగా మందులు వాడితే ఓ రెండు నెలల్లో పూర్తిగా కోలుకుంటుంది." తృప్తిగా రిపోర్టుల్ని పరిశీలించి అన్నది డాక్టర్ సవిత.

"థేంక్యూ మేడమ్" మనస్ఫూర్తిగా అన్నాను. ఉమ విప్పారిన కళ్ళతో నన్నే చూస్తోంది. రిక్షాలో నా భుజానికి తన తలని ఆనించి అలసటగా కళ్ళు మూసుకుంది. వివరాలు చెప్పాలంటే -

అరండల్ పేటలోని ఆ ఇల్లు వాళ్ళ నాన్నగారు కొన్నదే రెండు పోర్షన్లు అద్దెకిచ్చి ఓ పోర్షన్లో అంటే, ముందుగది - మధ్యగది - వంటగదుల్లో తను ఉంటున్నది. నేను ట్రైనింగ్‌లో ఉన్నప్పుడే వాళ్ళ నాన్నగారు పోయారట. ఆ విషయం నాకు తెలిస్తే ఎక్కడ పరిగెత్తుకొస్తానో అని నాకు తెలియనివ్వలేదట. వంటమనిషి ఓ రోజున ఉమ నగల్ని మూటగట్టుకుని చెక్కేసిందట. అదృష్టవశాత్తూ ఆయన ఇల్లు కొనడం జరిగింది. సొంత ఊళ్ళో ఉన్న మెట్టపొలాన్ని అమ్మేసి టైపింగ్ నేర్చుకుంటూ ఉండగా తెలిసింది... ఫలానా 'జబ్బు' అటాక్ అయిందని.

ఆ రోజుల్లో అద్దెమీద వచ్చేది ఎంతనీ? అదీగాక 'ఫలానా' జబ్బు అని తెలిస్తే జనాలు పారిపోతారు. అంత మూఢత్వం ఉండేది ఆనాడు. ఆరోగ్యం గురించీ, రోగం గురించీ ఏమాత్రం అవగాహన లేని రోజులు అవి. తనకి వచ్చింది 'ఫలానా' అని ఉమకీ తెలీదు. కానీ, ఇది ఆ జబ్బే అని అనుమానించి మనసులో కుమిలిపోయింది.

"నీ ఉత్తరం నాకు చేరడం మూడు నెలలు ఆలస్యం అయిందే అయినా ఫరవాలేదులే.. భగవంతుడు దయామయుడు. సరైన సమయానికి రాగలిగాను." ఉమ తల నిమురుతూ అన్నాను.

"నువ్వొస్తే నేను బ్రతుకుతానని అనుకునేదాన్ని. నువ్వొచ్చావు. ఖచ్చితంగా బతుకుతాన్రా.." నా మెడచుట్టూ చేతులు వేసి అన్నది. ఠక్కున నమ్రత జ్ఞాపకం వచ్చింది.

నాకే నవ్వొస్తోంది. ఒకరి దగ్గర ఉన్నప్పుడు మరొకరు ఎందుకు జ్ఞాపకం వస్తారూ? అసలు మనసు ఒకే సమయంలో ఇద్దరిని ప్రేమించగలదా? అందులోనూ ఒకరిమీద అనంతమైన అనురాగం. ఏ మచ్చాలేని స్వచ్ఛమైన గంగలాంటి ప్రేమ. మరొకర్ని తలుచుకుంటేనే శరీరం విరహంతో ఊగిపోతుంది. అణువణువూ ఆత్రంగా కౌగిలికోసం ఎదురుచూస్తుంది. పోనీ అది శరీరానికి మాత్రమే సంబంధించిన కోరికా అని తరచి తరచి ఆలోచిస్తే వచ్చే సమాధానం 'కోరిక' కానేకాదనీ, మనఃపూర్వకమైన ప్రేమే అనీ.

"నా ఒక్కడికే ఇలా అనిపిస్తోందా మిగతా అందరికీ కూడా ఇటువంటి అనుభవమే ఉందా?" అని కూడా తెగ ఆలోచించేవాడ్ని.

దానికి, అంటే ఆ ప్రశ్నకి సమాధానం ఈనాటివరకూ దొరకలేదు. కారణం ఎవరినడిగినా నిజం చెప్పకపోవడమే!

నేనొక్కడ్నే నిజం చెబుతున్నానని భుజాలు ఎగర వెయ్యడంలేదు. అన్ని నిజాలూ ఎవ్వరూ ఎవరితోటీ పంచుకోరు. పంచుకోవాల్సిన అవసరములేదు. కానీ ఇటువంటి ప్రశ్నలు ఉదయించినప్పుడు వాటికి సూటిగా సమాధానం చెప్పగలిగితే మనోవిశ్లేషణ చాలా చెయ్యొచ్చు. తద్వారా మనని మనం అర్థం చేసుకునే 'వీలు' ఎక్కువగా ఉంటుందని నా ఉద్దేశ్యం.

ఇరవయ్యో రోజున మా యూనిట్ నుంచి టెలిగ్రామ్. "స్టార్ట్ ఇమ్మీడియట్లీ అండ్ రిపోర్ట్ టూ యువర్ హెడ్ క్వార్టర్స్" అని.

బయలుదేరక తప్పదు. ఉమ మాత్రం చాలా ధైర్యంగా "హేపీగా వెళ్ళిరా. నాకు ఇప్పుడు అసలు బెంగేలేదు. నువ్వున్నావుగా మందులు జాగ్రత్తగా వాడతాను. నువ్వు మళ్ళీ సెలవులో వచ్చేటప్పటికి మునపటి ఉమలా, ఆరోగ్యంగా తయారవుతాను!" అని నాకే ధైర్యం చెప్పింది. పూరీలూ కూరా తినిపించడమే కాక చక్కగా కొన్ని పేక్ చేసి మరీ ఇచ్చింది.

'నా మనిషి అంటూ నాకు ఉన్నారు' అనే ఆలోచన మనిషికి ఎంత ధైర్యాన్నీ తృప్తినీ ఇస్తుందో ఉమ కళ్ళల్లో ఆనాడు క్లియర్‌గా చూశాను. నిజం చెబితే హాస్పటల్లో ఉన్న పదిహేను రోజుల్లోనే ఆమె ఆరోగ్యం చాలా పుంజుకున్నది.

అమ్మని కనీసం చూడకుండానే ట్రైనెక్కాల్సి వచ్చింది. అన్నయ్యవాళ్ళకి కూడా తెలిదు. ఆ ఇరవై రోజులూ ఎక్కడ ఉన్నానో. మా రూల్స్ ప్రకారం ఎడ్రస్ ఇచ్చిన చోటునుంచి ఎక్కడికి వెళ్ళినా హెడ్‌క్వార్టర్స్‌కి తెలియచెయ్యాలి. చాలామంది ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ నేను అలా కాకుండా ఇన్‌లాండ్ లెటర్‌ద్వారా గుంటూరు అడ్రెస్ ఇవ్వబట్టి గుంటూరుకి టెలిగ్రాం వచ్చింది.

అర్జంటుగా బయలుదేరటం వల్ల రిజర్వేషన్ దొరకలేదు. ఆల్‌మోస్ట్ విజయవాడనుంచి బలార్షా వరకూ నిలబడే ప్రయాణం చెయ్యాల్సివచ్చింది. అదీ జనరల్ కంపార్ట్‌మెంటులో. బలార్షాలో మిలటరీ కంపార్ట్‌మెంటుకి మారగానే కూర్చోడానికి చోటేకాక పడుకోవడానికీ చోటు దొరికింది. హాయిగా బెర్త్ మీద నడుము వాల్చాను. అప్పటినుంచీ ఆలోచనలు. నిజం చెబితే అప్పటివరకు నా జీవితంలో 'సమస్య' అనేది ఏదీ లేదు. తండ్రిపోయాక కొన్నాళ్ళు హైదరాబాద్‌లో ఉన్నాను. ఏదో ట్యూషన్లు చెప్పి నా పాకెట్‌మనీ నేను సంపాదించుకున్నా. అక్కడ మూడో అన్నయ్య, మూడో అక్క బావ ఉండేవారు. వెళ్ళిన ఆరునుంచి ఎనిమిది నెలలకే ఏర్‌ఫోర్స్‌లో చేరాను. ఆ క్షణం నుంచి నా బతుకు నాదే

ఓ పక్క చిననాటి స్నేహితురాలు ఉమ.. ఆ తరవాత ఢిల్లీలో 'కెన్ యూ లిఫ్ట్ మీ' అంటూ పరిచయమైన నమ్రత.

బాల్యంలో ఆలోచనలు ఉండవు. ఒకవేళ ఆలోచనలు వచ్చినా అవి వేగంగా వచ్చి కురిసి వెళ్ళిపోయే శ్రావణ మేఘాలే. యవ్వనంలో వచ్చే ఆలోచనలు వేరు. వాటి 'పరిధి' వేరు. అవీ మేఘాల్లాంటివే... వేసవిలో నీలినింగిలో తేలే వెండి మబ్బులు. చూసిన ప్రతి అందాన్నీ కోరుకునేది యవ్వనం. అది ఆకలిగొన్న భ్రమరం లాంటిది. ఎప్పుడు చూసినా రెక్కల్ని అత్యంత వేగంగా విదిలిస్తూ పూవుల మీద కన్నేసి ఉంచుతుంది.

కానీ నాకు వచ్చిన సమస్య సామాన్యమైనది కాదు. అది 'సామాన్యమైనది కాదు' అని కూడా నాకు అప్పుడు అనిపించలేదు. అనిపించింది ఒకటే, ఢిల్లీ చేరగానే గుర్గావ్‌కి పరిగెత్తాలనీ, జరిగిందంతా నమ్రతతో చెప్పాలనీ. అంతేగాదు. పదిహేను రోజులపాటు నేను హాస్పటల్‌లో ఉండగా ఉమ చెప్పిన మాటలన్నీ ఆలోచనలుగా నా మనసుని ముట్టడించాయి.

హాయిగా సాగుతున్న నౌక అకస్మాత్తుగా ఓ తుఫానుకి గురై తిరగబడితే ఉత్పన్న మయ్యే పరిస్థితినే ఉమ ఎదుర్కొంది. చుట్టూ నీరే.. అదీ ఉప్పునీరు. తండ్రి పెన్షను ప్లస్ ఇంటద్దె అనే ఓ చెక్కముక్క గనక ఆధారంగా దొరక్కపోతే ఉమ ఏనాడో సమస్యల సుడిలో మునిగిపోయి ఉండేది. అప్పటికీ నేను బాధపడతాననో, మరో ఆలోచనతోనో నాకేమీ తెలియనివ్వలేదు. 'ఫలానా' జబ్బు అని తెలిశాకే ఇక ఉండబట్టలేక నన్ను చూడాలని నా అడ్రస్ సంపాదించి నాకు ఉత్తరం రాసింది.

గట్టు తెగిన చెరువు నీరు ఎలా ప్రవాహమై బయటికి పోతుందో అలా ప్రవహించాయి ఉమ మాటలు..! ఆ హాస్పిటల్‌లో. అయితే తన బాధల్నో కష్టాల్నో పెద్దగా చెప్పకుండా జరిగిన సంఘటనల్ని మాత్రమే వివరించింది. అక్కడ కూడా నా మనసు బాధపడుతుందనే ఆలోచనే. భగవాన్.. ఉమలాంటి వ్యక్తి స్నేహం లభించడం ఎంతటి అమూల్యమైన వరం!

ఢిలీ చేరాను. యూనిట్‌లో అరైవల్ రిపోర్టిచ్చాను. వాతావరణం చాలా టెన్స్‌గా ఉన్నట్లనిపించింది. ఇరవైనాలుగ్గంటలూ ఎలర్ట్‌గా అవేలబుల్‌గా ఉండాలని ఆర్డర్స్. కొద్దికొద్దిగా అర్థమైంది.. యుద్ధానికి సన్నద్ధం కావాలని.

1971 ఇండో పాక్ వార్‌కి నాంది పడింది. నమ్రతని కలిసినా వివరించేంత సమయం కుదరలేదు. అందరికీ పరిస్థితి అర్థమవుతూనే ఉంది. 24 అవర్స్ ఆప్స్. (అంటే ఆపరేషనల్ ఎక్సర్‌సైజెస్)

వార్ డిక్లేర్డ్....

**ఆ విషయాలన్నీ ఎడిట్ చేస్తే.....**

చీకటి తొలిగింది. వేకువ వచ్చింది. కానీ ఏం జరిగిందీ? ఢిల్లీ నిండా చేతులూ కాళ్ళూ పోగొట్టుకున్న జైజవాన్‌ల 'స్టాల్స్'... ఎన్ని అవయవాల్ని పోగొట్టుకున్నా సైనికుడు తల ఎత్తుకునే జీవిస్తాడు! మరణాన్ని కూడా సగర్వంగానే ఆహ్వానిస్తాడు!!

నా ఎంట్రిమేట్స్ ఎందరో యుద్ధంలో ప్రాణాల్ని పోగొట్టుకున్నారు. ఎందరో స్నేహితుల భార్యలు తాళి బొట్టుని కోల్పోయి కన్నీటి సరస్సులయ్యారు. "నాన్నేడీ.. ఎప్పుడొస్తాడూ?" అని అడిగే బిడ్డలకి సమాధానం చెప్పలేక వీరపత్నులు మౌన వృక్షాలై నిలిచారు. ఎందరు తల్లితండ్రులు యువకులైన బిడ్డల్ని (సైనికుల్ని) పోగొట్టుకుని గుండెలు బాదుకుంటూ రోదించారో ఊహకందదు. దేశాధినేతలు 'సంధిపత్రాల'తో విందుచేసుకున్నారు సరే - ఆ దేశపు సైనికులూ, ఈ దేశపు సైనికులూ ఎందుకు మరణించినట్టూ? యుద్ధంవల్ల ఏం జరిగిందీ? యుద్ధాలవల్ల మానవజాతి ఏం సాధించిందీ? అసలు యుద్ధం మనుషుల మధ్యా, మనుషుల అహంకారాలమధ్యనా? సంధిపత్రాలు మనుషుల ప్రాణాల్ని వెనక్కి తీసుకురాగలవా - చెరిగిన బొట్టుకి శాంతి ప్రసాదించగలవా?

**హౌరా.. కొన్ని వందల సార్లు** ఆ పేరు చదివాను.. విన్నాను. 'శరత్‌సాహిత్యం' ఆనాడు తెలుగు ఇళ్ళల్లో సాహిత్యపు వెలుగుల్ని నింపింది. బంకించంద్ర, శరత్‌చంద్ర, మైకేల్ మధుసూదన్ దత్, మహా శ్వేతాదేవి, ప్రబోధ్ కుమార్ సన్యాల్, సురేంద్ర బెనర్జీ ఇవన్నీ సాహిత్యాభిలాషుల నోళ్ళల్లో నానిన పేర్లు. అయితే 'గురుదేవ్' రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి' కవి కాదల్చుకున్నవారికి భగవద్గీత. SSLC పూర్తయ్యేలోపులోనే శరత్ సాహిత్యం మొత్తం పిచ్చి పిచ్చిగా చదువుకుని ఉండటంతో కలకత్తా అంటే నాకో తియ్యని కల.... ఓ వ్యామోహం.

ట్రైను దిగగానే నవ్వుతూ ఓ అమ్మాయి లిల్లీ పూల గుచ్చాన్ని ఇచ్చి, "ఆఫ్.. రాజూ... మై... బబులీ ముఖర్జీ" అన్నది.

"యా... మై నేమీజ్ రాజూ.. కమింగ్ ఫ్రమ్ ఢిల్లీ.. యూ..ఆర్..?" అడిగాను. మొట్టమొదటిసారి అదే నేను కలకత్తా రావడం. మరి ఈమె ఎవరూ?

"ప్రశాంత్ ... మై బ్రదర్" అన్నది. అప్పుడు గుర్తుకొచ్చింది.

"ఓహ్.. థేంక్యూ.." ఆనందంగా పుష్పగుచ్ఛాన్ని అందుకున్నా. ప్రశాంత్ కుమార్ ముఖర్జీ నా కొలీగ్. నాకు కలకత్తా పోస్టింగ్ అయిన వెంటనే నాతో అన్నాడు.. "కలకత్తాలో దిగంగానే ఓ సర్‌ప్రైజ్ నీకోసం ఎదురు చూస్తుం"దని. ఆ సర్‌ప్రైజ్ ఇదన్నమాట.

చాలా మెల్లగా బయటికి వచ్చాము. నాకు అర్థం అయినంతవరకూ ఆమెకి బెంగాలీ తప్ప ఫ్లూయెంట్‌గా మరే భాషా రాదు. ఇంగ్లీష్ అర్థం చేసుకుంటుంది. మాట్లాడ్డం మాత్రం కొద్దిగానే. అక్కడక్కడా హిందీ పదాలు వాడటం తప్ప హిందీ కూడా రాదు.

చిత్రం ఏమంటే ఆమె గడగడా బెంగాలీలో మాట్లాడుతుంటే నాకు చాలావరకు అర్థం అవుతోంది. కారణం ఎయిర్ ఫోర్స్‌లో బెంగాలీ స్నేహితులు ఉండటం.

నా ఇంగ్లీషు ఆమెకి చాలావరకు అర్థం అవుతోంది. కనుక భాషకి సంబంధించిన సమస్య చాలావరకూ లేనట్టే.

ఆమె నాతో 'అన్నమాట ఏమిటంటే, "మీరు సాటర్‌డే వస్తారని మా అన్న ఉత్తరం రాశారు. మీ ఫోటో కూడా నాకు పంపాడు.. మిమ్మల్ని గుర్తుపట్టడానికి. మీరు సోమవారం పొద్దున 'కాంచరాపారా'లో రిపోర్ట్ చెయ్యాలనీ చెప్పాడు. కనుక ఇవ్వాళా రేపు పగలూ మా ఇంట్లో ఉండి, ఆదివారం సాయంత్రం 'కాంచరాపారా' వెళ్ళవచ్చు. షియాల్దా నించి కాంచరాపారాకి లోకల్ ట్రైను ఉన్నది గనక నేనే మిమ్మల్ని రేపుసాయంత్రం మీ యూనిట్ దగ్గర దింపుతాను." అని.

ఇంకేం కావాలీ? యాక్చువల్‌గా నేను బేరక్‌పూర్ IAF స్టేషన్‌లో మా ఫ్రెండ్స్‌తో ఉందామనుకున్నాను. కానీ ప్రశాంత్ అంత ప్రేమతో తన చెల్లెల్ని స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకోమని చెప్పాక, ఆమె ఆహ్వానాన్ని తృణీకరించలేకపోయాను.

స్టేషన్ బయటికి రాగానే మనుషులు లాగే (తొక్కేవికాదు) రిక్షా ఎక్కాము. నాకు కొంచెం సిగ్గు అనిపించినా తను చాలా ఫ్రీగా కూర్చుంది. ఫుట్‌పాత్ నిండా జనాలే.. ఆడా, మగా, పిల్లలూ... వంటలూ, స్నానాలూ అన్నీ ఫుట్‌పాత్ మీదే

"వాళ్ళందరూ రెఫ్యూజీలు.!" జాలిగా వాళ్ళని చూస్తూ అన్నది. "వాళ్ళల్లో కొందరు లక్షాధికారులట. యుద్ధం మొదలయ్యాక ప్రాణాలు నిలుపుకోవడం కోసం అటు బంగ్లాదేశ్ నించీ ఇటు పాకిస్తాన్ నించి వచ్చేశారు... చేతుల్లో పాపం పైసాలేదు.!" బబులీ కళ్ళల్లో నీళ్ళు.

కడుపులో దేవేసినట్టు అయింది. 'ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్'లో ఇండియా పాకిస్తాన్ విడిపోయినప్పుడు లాహోర్ నుంచి భటిండాకి శవాల్ని మోసుకొచ్చిన ట్రైన్స్ వర్ణన జ్ఞాపకం వచ్చింది. రామానంద సాగర్ చెప్పిన రిఫ్యూజీ కేంప్ అనుభవం గుర్తుకొచ్చింది. భారతీయులందరూ ప్రేమతో "భరిస్తున్న" 'రెఫ్యూజీ స్టాంప్' గుర్తుకొచ్చింది.

భగవంతుడా, ఈ రిఫ్యూజీలకి మోక్షం ఎప్పుడు? అసలు వాళ్ళు తిరిగి తమ మాతృభూమికి వెళ్ళే అవకాశం అసలు దొరుకుతుందా? ఒకవేళ దొరికినా, వీళ్ళ ఆస్థిపాస్తులు సురక్షితంగా ఉంటాయా? ఇంపాజిబుల్. అవి ఏనాడో పరహస్తగతమై పోయివుండాలి.

యుద్ధానికి కాలుదువ్విన నేతలకి ఈ విషయం తెలీదా? తెలిసీ మరి ఎందుకు తెగించారూ?

(ఆ తర్వాత నా కలకత్తా టెర్మ్‌లో ప్రతి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫామ్స్ నిండా ఈ రిఫ్యూజీలనే చూశా. రొట్టెముక్క కోసం ఒళ్ళమ్ముకున్న వాళ్ళు కోకొల్లలు. దేవుడా.. ఇదా మనిషి బ్రతుకంటే?)

వాళ్ళిల్లున్న ప్లేస్ నాకు గుర్తులేదు కానీ, వాళ్ళ ఇల్లు మాత్రం కళ్ళకి కట్టినట్టు ఇప్పటికీ గుర్తుంది. పురాతనమైన మిద్దె. పక్కనే ఓ బొంద. (బొంద అంటే ఫుల్‌గా నీళ్ళు నిండిన ఒక పేద్ద గొయ్యి. ఓ నూట యాభై అడుగుల చుట్టు కొలతా, ఓ పది అడుగుల లోతూ ఉన్నది) బొందనిండా తామరపువ్వులూ, దగ్గరికెళ్ళి చూస్తే ఈదులాడుతున్న చేపలు. పక్కవాళ్ళింట్లోను, ఆ పక్క ఇంట్లోనూ కూడా ఇలాంటి 'బొంద'లే ఉన్నాయి.

"ఎందుకూ?" అనడిగితే.. "స్నానానికీ వాటికీ కాదు, ఫ్రెష్ చేపలుంటాయిగా.!" అన్నది.

బెంగాలీ బ్రాహ్మలకి చేపలంటే ప్రాణం. ఫిష్ ఉన్నరోజున వాళ్ళకి పండగే. జలపుష్పాలంటారు.

"మా గ్రాండ్ మదర్. పేరు అలౌకిక. బి.ఎ" అని పరిచయం చేసింది బబులీ ఓ వృద్ధురాలిని. ఆమె భర్తృహీన అని తెలుస్తోంది.. అయినా, మంచి వర్చస్సు. వయసు 70కి పై మాటే.

"బి.ఎ.నా?" ఆశ్చర్యం అనిపించింది.

"అవును.." నవ్వింది బబులీ.

"బెంగాలీలో రచనలుకూడా చేస్తారు" అన్నది.

"నమస్తే" నమస్కరించాను .

"ముందు స్నానం చేస్తే తరువాత భోజనం వడ్డిస్తాను. ఆ తరువాత చక్కగా విశ్రాంతి తీసుకోవచ్చు.. మీ పేరు రాజు కదూ!" చక్కని హిందీలో అన్నదావిడ. నాకు భలే సంతోషం కలిగింది.

"అమ్మా.. మీరు నన్ను 'ఆప్' అనకండి. ప్రశాంత్, నేనూ స్నేహితులం... కలకత్తా అంటే నాకు చాలా ఇష్టం." మహదానందంగా అన్నాను.

"అచ్చా.. కలకత్తా అంటే ఎందుకు ఇష్టం?" నవ్విందామె.

"మా ఆంధ్రాలో ఏ ఊరు వాళ్ళని అడిగినా, శరత్ సాహిత్యం గురించీ, రవీంద్రుని గురించీ తెలీని వాళ్ళు ఉండరు.. బోలెడన్ని శరత్ నవలలే సినిమాలుగా మావాళ్ళు తీశారు.!" వరసగా శరత్ నవలల పేర్లూ, సినిమాల పేర్లు వల్లించాను. ఆవిడ మొహం మతాబులా వెలిగింది.

"నిజమా! మద్రాసీలకి మాగురించి తెలీదని అనుకుంటున్నానే!" ఆశ్చర్యంగా అన్నది. అప్పట్లో సౌత్ ఇండియన్స్‌ని మద్రాసీలు అనేవాళ్ళు.

(నార్త్‌లో అంతా అంతే. శ్రీ ఎన్.టి.రామారావుగారి పుణ్యమా అని, ఆయన ముఖ్యమంత్రి అయ్యాకే ఆంధ్రప్రదేశ్ అనే ఓ రాష్ట్రం ఉన్నదనీ, ఆ రాష్ట్ర భాష పేరు 'తెలుగు' అనీ మిగతా రాష్ట్రాలవారికి అవగతమైంది. తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఎవరెస్టంత ఎత్తున నిలబెట్టిన ఘనత నిస్సందేహంగా శ్రీ ఎన్.టి రామారావుగారిదే)

"అందరూ మమ్మల్ని మద్రాసీలు అంటారు కానీ, మేం తెలుగువాళ్ళం. అలాగే కన్నడిగులు వేరూ, మలయాళీలు వేరు. తమిళులు వేరు." అని కాస్త వివరించి, ఇక్కడి రాజారామమోహన రాయ్‌కీ, మన కందుకూరి వీరేశలింగం పంతులుగారికీ, ఆ ఇద్దరి సమాజసేవ గురించీ వివరించాను. అంతేగాక, నాకు తెలిసిన బెంగాలీ రచనల గురించి కూడా చెప్పాను. తెలియకుండానే సమయం ముప్పావు గంట గడిచింది. ఆవిడ సంతోషం చెప్పనలవికాదు. బెంగాలీలకి వాళ్ళ రచయితలన్నా, భాష అన్నా పంచప్రాణాలు. ఓ సౌతిండియన్ నోట్లోంచి, వాళ్ళ భాష గొప్పతనాన్ని గురించీ సాహిత్యాన్ని గురించీ వినడం ఆవిడకి ఇదే మొదటిసారి కావడంతో, ఆమె సంతోషానికి అంతులేదు.

నేను స్నానం చేసి వచ్చేలోగా చక్కగా పీట వేసి, ఓ అరటి ఆకు సిద్ధంగా ఉంచారు. ముందు వేడి వేడి బంగాళాదుంప కూర, శనగపచ్చడి, బెంగాలీ పద్ధతిలో చేసిన మామిడి ఊరగాయ వడ్డించి, వేడివేడి పూరీలు బాణలిలోంచి తీసి వడ్డించింది. ఆ తరువాత ఓ ప్లేట్ తెచ్చి ఆకు పక్కగా పెట్టి 'మొచ్చీ' అన్నది బబులీ. చూడగానే తెలిసింది అవి బెంగాలీ పద్ధతిలో వండిన 'జలపుష్పా'లని.

"నో...నో.. ఐ యాం ప్యూర్ వెజిటేరియన్" అన్నాను.

"ఇవి వెజిటేరియనేగా?" ఆశ్చర్యంగా అడిగింది మామ్మగారు.

"మీకు ఇవి శాకాహారమే. మాకు కాదు..!" నవ్వి వివరించాను.

పూరీ వడ్డిస్తూనే 'హల్వా'కూడా వడ్డించారు. రైస్ వచ్చి 'ఖిచిడీ'. తృప్తిగా తిన్నాక చిన్న మట్టిపిడతలో 'దొయ్' అని ఇచ్చారు. అంటే దహీ అన్నమాట. దాన్ని 'మిష్టీదొయ్' అని ఇచ్చారు. పంచదార వేసిన పాలను తోడుబెట్టిన పెరుగన్నమాట. 'యోగర్ట్'లాంటిది. మహా రుచిగా ఉంది. భుక్తాయాసంతో నేను విశ్రాంతిగా ఓ వాలు కుర్చీమీద కూర్చున్నా. పెద్దావిడ కొసరి కొసరి వడ్డించడంతో నాకు తెలీకుండానే, ఆ కుర్చీలోనే నిద్రపోయాను. లేచేసరికి నాలుగున్నర. బెంగాలీలు కూడా నార్త్ ఇండియన్స్‌లాగా 'టీ'కే ప్రాధాన్యత ఇస్తారు. ఏర్‌ఫోర్స్‌లోనూ 'టీ'నే కనక నేను టీకి అలవాటుపడిపోయాను. పెద్దావిడ యాలక్కాయలు వేసి చాలా రుచికరమైన టీ ఇచ్చారు. "అమ్మా, మీరింత చక్కగా హిందీ ఇంగ్లీషూ మాట్లాడతారుగదా మరి బబులీకి ఎందుకు నేర్పలేదూ?" టీ చప్పరిస్తూ అడిగాను.

ఆవిడ పకపకా నవ్వి, "బేటా.. అది చాలా అల్లరిది. చాలామంది బెంగాలీలకి హిందీ రాకపోవచ్చు.. కానీ కుముదినికి బ్రహ్మాండంగా హిందీవచ్చు. అది చదివింది ఇంగ్లీషు స్కూల్లోనే గనక ఇంగ్లీషూ బాగా వచ్చు. అది నిన్ను ఆటపట్టించి ఉండాలి" అన్నది.

"కుమిదిని అంటే?"

"బబులీ అనేది ముద్దుపేరు.. దాని అసలుపేరు కుముదిని." నవ్వింది.

నాకు చచ్చేంత నవ్వొచ్చింది. అర్థంకానట్టూ, కొంచెం అయినట్టూ భలే ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చింది. ఎవడైనా నమ్మితీరాల్సిందే ఆమాటే పెద్దావిడతో అన్నాను.

"ఏదీ ఇప్పుడేగా ఇంటర్‌లోకి వచ్చిందీ.. అందుకే పసితనం పోలేదు. మొన్నే పదహారు వచ్చింది.!" మురిపెంగా అన్నదావిడ. నాకు ఇరవై ఒకటి. బెంగాలీ స్త్రీల కళ్ళు చాలా ఎక్స్‌ప్రెసివ్‌గా ఉంటాయి, వాళ్ళూ మనలాగే రైస్ ఈటర్సే గనక వాళ్ళకీ మనకీ ఆహారపుటలవాట్లలో పెద్ద తేడా ఉండదు. తేడా అల్లా, మనం కారం ఎక్కువ తింటాం, వాళ్ళు తీపి ఎక్కువ తింటారు. ఇడ్లీ, వడ, దోసె, ఉప్మా మనం బ్రేక్‌ఫాస్ట్‌గా చేస్తే వాళ్ళు లూచీ, హల్వా, చనా, పోహా లాంటివి ఇష్టపడతారు.

"బబులీ చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో ప్రశాంత్‌నీ, బబ్లీనీ నేనే పెంచాను. వాళ్ళు తప్ప నాకూ ఈలోకంలో ఎవరూ లేరు..!" నిట్టూర్చి అన్నది ఆవిడ.

"మరి.. ప్రశాంత్ గ్రాండ్‌పా?" కావాలనే అడిగా; ఆ రోజుల్లో ఆవిడ బి.ఎ చదివితే ఆయన ఇంకెంత చదివారో తెలుసుకునే కుతూహలంతో.

"ఆయన గొప్ప లాయరు. వయసులో నాకంటే చాలాపెద్ద. కారణం ఆయన INAలో గొప్ప ఆఫీసర్‌గా చేరడమే. (ఇండియన్ నేషనల్ ఆర్మీ - అజాద్ హింద్ ఫౌజ్..) వరల్డ్ వార్‌లో పార్టిసిపేట్ చేశారు. వారిపేరు నకుల్ ముకర్జీ. వారి తమ్ముడు, అంటే నా మరిది కూడా INAలో కమాండరే. వారే నన్ను చదివించారు. బి.ఎ. పూర్తిచేసి తీరాలని చెప్పారు. అలా మాట తీసుకున్నారు. చాలా చిన్నవయసులోనే బిడ్డకి తల్లినయ్యా. కానీ.." సైలెంటైపోయిందావిడ. మౌనానికి 'లోతు' ఎక్కువ.

లక్షవాక్యాలు చెప్పలేని భావాల్ని ఒక్క నిట్టూర్పు చెప్పగలిగితే, లక్షనిట్టూర్పులకి సాధ్యం కాని భావాన్ని 'మౌనం' స్పష్టంగా పలికించగలదు. డెబ్బైయ్యేళ్ళ ఈ వృద్ధమూర్తి గుండెల్లో ఎన్ని జ్ఞాపకాలు ఆ క్షణాల్లో కదలాడాయో ఊహలకి కూడా అందదు. చాలా నిముషాలు నిశ్శబ్దంగానే గడిచాయి.

"అయితే స్వాతంత్ర్యపోరాటాన్ని మీరు కళ్ళారాచూసి ఉంటారుగా?" అన్నాను.. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"ఆ..'నవ్‌ఖలీ'లో గాంధీగార్ని ప్రత్యక్షంగా చూశాను. వారితో మాట్లాడాను. వారి ప్రసంగాన్ని బెంగాలీలోకి అనువదించే భాగ్యమూ కలిగింది. ఎంతమంది మహానుభావుల పేర్లు చెప్పనూ. వారందరూ ఎన్నెన్ని త్యాగాలు చేశారూ.. మా ఈ జమిందారీనే.. నా భర్త ఆస్తినే కాదు, ప్రాణాన్నీ దేశంకోసం త్యాగం చేశారు..!" కళ్ళు తుడుచుకుని మళ్ళీ మౌనంలో మునిగిందామె.

నేను లేచి ఆమె పాదాలకి సాష్టాంగనమస్కారం చేశాను. మా అమ్మగారూ తన ఏడువారాల నగల్నీ గాంధీగారి జోలిలో వేశారు. ఆ తల్లుల త్యాగనిరతికి సాటిలేదు. "అయ్యో..ఎందుకూ.." అంటూనే నా తలమీద చెయ్యిపెట్టి పదేపదే ఆశీర్వదించిందామె.

నిజంగా చెబుతున్నా.. ఆమెని కలవడం నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఆ వృద్ధమూర్తి ఆశీస్సులే ఈనాటికీ ఈదేశానికి రక్ష అని త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాను. దేశం పేరెత్తినప్పుడు చూడాలి ఆమె తన్మయత్వం. నాటి దేశభక్తుల్నీ స్వాతంత్ర సమరయోధుల్నీ స్మరిస్తూ, వారి గురించి ఆమె చక్కని హిందీలో వివరిస్తుంటే నా ఒళ్ళు గగుర్పొడిచింది. అంతేగాదు.. అప్పట్లో బెంగాల్‌ని అతలాకుతలం చేసిన 'ప్లేగ్' వ్యాధిగురించీ, స్వాతంత్ర్యానంతర పరిస్థితుల గురించీ వివరిస్తుంటే నేను మైమరచిపోయి విన్నాను. అంత చక్కగా, అంత స్పష్టంగా ఉన్నది ఆమె భాషణ.

"అమ్మా.. మీరు మాట్లాడుతుంటే ఓ గొప్ప లెక్చరర్ వింటున్నట్టు ఉంది.!" ఆనందంగా అన్నాను.

"నేను పద్దెనిమిదేళ్ళు శాంతినికేతన్‌లో ఉపాధ్యాయినిగా ఉన్నాను బాబూ." చిన్నగా నవ్విందామె. 'ఓ..గాడ్! అన్నీ ఉన్న విస్తరి అణిగిమణిగి ఉంటుంది.. ఏదీలేని విస్తరి ఎగిరెగిరిపడుతుంది' అని మా అమ్మ ఎప్పుడూ అంటూ ఉండేది. ఆ మాటలకి అర్థం ఆనాడు నాకు స్పష్టంగా బోధపడింది.

"ఇంత సేవ చేశారుగదా.. దేశం గుర్తించిందా?" కావాలనే అడిగాను.

"దేశం గుర్తిస్తుందని సేవ చెయ్యలేదుగా? దేశం కోసం ప్రాణాలివ్వడం ధర్మం. సర్వాన్నీ త్యజించడం బాధ్యత. అంతే. ఆ తరువాత ప్రభుత్వాధికారులు కొంతమంది వచ్చి 'వివరాలు ఇస్తే పెన్షన్‌కీ, తామ్రపత్రానికి రికమెండ్ చేస్తామ'ని అన్నారు మణిమాణిక్యాలనే నాడు ఇచ్చాము. తామ్రపత్రాలు మాకెందుకూ? జీవించడానికి, అంటే, మధ్య తరగతి మనుషులుగా జీవించడానికి మాకువున్నది సరిపోతుంది. అయినా, తృప్తికి మించిన సంపద లోకంలో ఏముంటుందీ?" నాకైతే నిజంగా గుళ్ళో అమ్మవారిని చూసినంత సంతోషం కలిగింది.

ఎంత గొప్పమాట. అదే మాటని ఎందరో ఎన్నోసార్లు చెప్పి ఉండొచ్చు. కానీ, అతి తక్కువమంది మాత్రమే ఆచరించి చెప్పగలరు. అటువంటి వాళ్ళు చెప్పినప్పుడే అది గుండెలకి హత్తుకుంటుంది.

అవ్వాళ బబులీ నన్ను దగ్గర్లో ఉన్న ఆలయానికి తీసుకెళ్ళింది. ఎర్రరంగు బోర్డరులో ఉన్న తెల్ల చీరలు కట్టుకుని ఉన్నారు ఆడవాళ్ళు. 'వారం దినాలపాటు ఈ గుళ్ళో ఉత్సవాలు జరుగుతై. ఆరోజుల్లో మా బెంగాలీ స్త్రీల ట్రెడిషనల్ డ్రెస్ ఇది.!" అన్నది వచ్చీరాని హిందీని కొంచెం ఇంగ్లీష్‌తో కలగలిపి.

"నువ్వు అల్లరిదొంగవని నాకు తెల్సిపోయింది బబులీ.. ఐమీన్ కుముదినీ.." నవ్వి అన్నాను.

"ఓహ్...గ్రాండ్‌మా చెప్పిందా.! ఓకె.. ఇంటికెళ్ళాక చెప్తా.!" బుంగమూతి పెట్టి అన్నది.

"మీ గ్రాండ్‌మా రియల్లీ గ్రేట్.. మీరిద్దరూ చాలా లక్కీ, ఆవిడ పర్యవేక్షణలో పెరగటం." సిన్సియర్‌గా అన్నాను.

"మా డేడీ చాలా లేట్‌గా పెళ్ళి చేసుకున్నారు. ఆయన గొప్ప ఫిలాసఫర్. పెళ్ళి అంటే ఇష్టంలేక సన్యాసం తీసుకుంటానని గొడవపెట్టేవారట. మా గ్రాండ్‌మా బ్రతిమాలీ బ్రతిమాలి చివరికి పెళ్ళిచేసింది.. ఓ కండీషన్ మీద. అదేమంటే ఓ వంశాంకురాన్నిచ్చి సన్యసించవచ్చని. మా అమ్మ చాలా అందగత్తె. చాలా మృదుస్వభావి. పెళ్ళయ్యాక మానాన్నకి మా అమ్మ ప్రాణం అయిపోయింది. నేను పుట్టిన రెండేళ్ళకి ఇద్దరూ ఒకేసారి యాక్సిడెంట్‌లో పోతే, గ్రాండ్‌మా మమ్మల్ని పెంచింది. యూ..నో.. ఐ లుక్ ఎగ్జాక్ట్లీ లైక్ మై మదర్!" అన్నది.

అప్పుడు చూశా బబులీని. అద్భుతమైన అందం. అందం అంటే కళ్ళకి మిరుమిట్లు గొలిపేదికాదు.. స్నేహమూ అనురాగమూ చిప్పిల్లే అందం ఆమెది.

స్పష్టంగా చిత్రకారుడు తీర్చిదిద్దినట్టున్న ఆ ముఖమూ, అవయవాలూ. నాకెందుకో నమ్రత ఆ క్షణంలో గుర్తొచ్చింది. నిజం చెబితే పొద్దుటినించీ స్వాతంత్రపోరాటం గురించీ మిగతా విషయాల్లోనూ మనసు మునిగిపోయింది.

నాకొకటి అర్థమైంది - మనసులో చాలా గదులున్నాయనీ.. ఏ గదిలోని భావాలు ఆ గదిలోనే (అరలు అనాలేమో) పదిలంగా ఉంటాయనీ. నాణానికి బొమ్మా బొరుసూ ఉన్నట్టు నమ్రతని తలుచుకోగానే ఉమా, ఉమని తలుచుకోగానే నమ్రతా ఇద్దరూ గుర్తుకొస్తారు.

ప్రశాంత్ ఇంట్లో ఆ రాత్రి ప్రశాంతంగా పడుకున్నా. కప్పల బెకబెకలు నా చిన్ననాటి రోజుల్ని గుర్తుకు తెచ్చాయి. కోడిగుడ్డు దీపం వెలుగులో ఎన్ని నవలలు చదివానో లెక్కలేదు. వర్షాకాలం వస్తే చాలు. రకరకాల కప్పల అరుపులు తెల్లవార్లూ వినబడుతూనే ఉండేవి. నిశ్చలంగా వెలిగే దీపం, దానిలోంచి వచ్చే సన్నని కిరసనాయిలు వాసనా, పుస్తకాలు వెదజల్లే ఓ చిత్రమైన పరిమళం.. చదువుతున్న కొద్దీ విశాలమయ్యే ఊహాలోకం... ఇవన్నీ పాతకాలం నాటి పట్టెమంచం మీద మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చాయి.

అవ్వాళ సాయంత్రం నాకోసం భోజనంలో ప్రత్యేకంగా బెంగాలీ స్వీటు 'సందేష్'ని చేశారు పెద్దామె. కొసరి కొసరి వడ్డించారు. సందేష్‌ని రుచిచూడడం అదే మొదటిసారి. అద్భుతంగా ఉన్నాయి. కాసేపు నేను చిన్నప్పుడు చదివిన 'మాయామయి' పదిభాగాల (పది నవలలు) సీరియల్ గురించి మాట్లాడితే ఆమె చాలా ఆనందించారు. ఆవిడా చదివారట. అలాగే విప్రదాస్, సుభద్ర, దేవదాస్, రాముని బుద్ధిమంతనం, శేషప్రశ్న వీటన్నిటి గురించీ భోజన సమయంలో రసవత్తరమైన చర్చ జరిగింది.

కళ్ళు మూతలు పడుతుండగా తటాల్న ఓ ప్రశ్న మనసులో మెరుపులా మెరిసింది... "నమ్రతని వదిలి ట్రైన్ ఎక్కినప్పుడు కళ్ళల్లోంచి కురిసిన వర్షం ఇప్పుడెందుకు లేదూ?" అని.

మరొకటీ స్పష్టమైంది.... అదేమిటంటే

"సాహిత్యపుబలం."

ఓ చక్కని పుస్తకమో, దానిగురించిన చర్చో, మనసుని అద్భుతంగా మళ్ళించగలవని... తెలియకుండానే 'మనసు'నిద్రలోకి జారుకుంది.

**ప్లానిటోరియం**

కొందరితో కొన్ని సంవత్సరాలు కలిసి ఉన్నా 'మనసు పరిచయం' జరగదు. కొందరితో క్షణాల్లోనే అతి గాఢమైన మనోపరిచయం ఏర్పడుతుంది. పెద్దామెతో నాకు అలానే అనిపించింది. ఏమో ఏ జన్మ సంబంధమో..., లేకపోతే వారింటిదగ్గర

నేనుండటమేమిటి? కొన్ని గంటల్లోనే కొన్ని దశాబ్దాల పాటు కలిసి ఉన్నంత అనురాగబంధం ఏర్పడటం ఏమిటి? నన్ను ఆమె రాజా అనో, బేటా అనో పిలుస్తుంటే నేను స్వచ్ఛంగా తెలుగులోనే 'పెద్దమ్మా' అని పిలిచి దానికి అర్థం కూడా చెప్పా.

తెల్లకి తెల్లవారు ఝామునే పెద్దమ్మ కూడా మా అమ్మలాగే బెంగాలిలో ఏవో కీర్తనలు పాడుకుంటూ ఇంటిపనులు చేసుకోవడం చూశా. హాల్లో బబులీ వెచ్చగా దుప్పటి కప్పుకుని నిద్రపోతూనే ఉంది. నాకేమో ఆ ఇల్లు చిరపరిచితంగానూ, ఎప్పట్నించో అక్కడ ఉంటున్నట్టుగానూ అనిపించింది.

టిఫిన్ చేసి తొమ్మిదింటికల్లా బబులీతో కలిసి బయలుదేరాను. ఓ వంద జేబులో ఉంచుకున్నా. (అది చాలా ఎక్కువ ఆ రోజుల్లో) 'ఎస్ప్లనేడ్' ఏరియాకి పోయాం. విక్టోరియా మెమోరియల్ చూశాం.. టాంగాలో సవారీ చేశాం. కావాలని ఓ పాన్‌షాప్‌లో మీఠాపాన్‌లు కొనుక్కుని తిన్నాం. అదెందుకంటే, బెంగాలీ నవలల్లో 'పాన్‌దాన్'ది చాలా ముఖ్యపాత్ర. ఎక్కడ చూసినా జనాలు.. షాపులు.. మురికి.. అన్నిటికీ మించి అతిపురాతన సంస్కృతి.

బెంగాలీలు లౌడ్ స్పీకర్లు. శ్రుతి ఎక్కువే. 'పెద్దమ్మ' చాలా మంద్రమైన శృతిలో మాట్లాడతారు. బబులీ నిజంగా బబ్లీగాల్. ఉత్సాహంతో ఉరికే జలపాతం. క్షణం మౌనంగా ఉండదు.

"ఇదిగో.. ఈ 'రామ్ రతన్' దుకాణం అరవై ఏళ్ళనాటిది. ఇక్కడి 'సింగాడా'లు మహా ఫేమస్." అన్నది. సింగాడా అంటే మన సమోసాలే.. అయితే చిన్నవిగా ఉంటాయి. లోపల ఆలూతోపాటు వేసిన పొడి ఏమిటో తెలీలేదు. దుకాణదారుడ్ని అడిగితే నవ్వాడు.. చెప్పలేదు. ట్రేడ్ సీక్రెట్ కదా. ఎక్కడ చూసినా 'మెస్'లు ఉన్నాయి. ఆ మెస్సుల్ని చూడగానే నాకు గుర్తొచ్చింది 'చరిత్రహీన్' నవల. మెస్సులన్నీ వెతికినా 'సావిత్రి' దొరుకుతుందా? ఒక్క శరత్ మనసులో తప్ప ఆ సావిత్రిని జన్మలో చూడగలుగుతామా!

పేంటూ షర్టులు ఎన్ని ఉన్నా, ఇంకా బెంగాలీ తరహా పంచకట్టుతో 'పాంప్' షూస్‌తో తిరిగే అసలు సిసలు బెంగాలీలు లెక్కకు మిక్కిలిగా కనిపిస్తూనే ఉన్నారు.

కాళీమందిరం కళ్ళారా చూశాను. అక్కడ పూజారి (పండా) నా బుర్రని కాళీ విగ్రహం కేసి తాకించాడు. డబ్బులు ఎక్కువ ఇవ్వకపోతే బుర్రబొప్పి కట్టేట్టు తగిలిస్తారుట.. ఆ మాట బబులీ ముందే చెప్పింది. ఆ పక్కనే ఉన్న ఓ శ్రేష్టమైన భోజనశాలలో భోజనం చేశాం. నాకు నచ్చింది 'పులుసు' పెరుగూ మాత్రమే.

మళ్ళీ తిరుగుడే తిరుగుడు. సాయంత్రం బిర్లా ప్లానిటోరియానికి వెళ్ళాం. మొట్టమొదటిసారి ప్లానిటోరియంని చూడటం. లైట్లు ఆఫ్ చేస్తూ ఎనౌన్సర్ చక్కని ఇంగ్లీషులో, "ఇదిగో.. ఇలా సాయంత్రం అవుతోంది.. వెలుగు సన్నగిల్లి ఆకాశం చీకటి దుప్పటిని కప్పుకుంటుంటే, దేవతలు నక్షత్ర దీపాల్ని వెలిగిస్తున్నారు... అదిగో.. అటువైపు మొదటి దీపం వెలిగింది.." ఇలా చక్కని వర్ణనలో మొదలెట్టాడు. చిమ్మచీకటి... చేతికి అందేట్టు ఉన్న నక్షత్రాలు.

అదో అద్భుతమైన అనుభవం.

"భయ్యా.. మనమూ నక్షత్రాల్లోకి వెళ్ళిపోదామా?" తమకంగా అన్నది బబులీ.

"ఊ.! కానీ, మళ్ళీ వెనక్కి రావాలిగా.!" నవ్వాను.

"అవును.. వెనక్కి వచ్చి వదినని వెదుకుదాం." నవ్వింది. అప్పుడు, ఆ నక్షత్రాల మధ్య తళుక్కుమంది నమ్రత మొహం.

"యాద్ మే తేరీ జాగ్ జాగ్ కె హమ్.. రాత్ భర్ కర్ వటే బదల్ తే హై"

(నీ జ్ఞాపకాలలో తెల్లవార్లూ మేల్కొని అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను ప్రియతమా) తెల్లవార్లూ కలలో ఇదే పాట.

ఆదివారం రాత్రి ఎనిమిదింటికి నన్ను 'కాంచరా పారా' స్టేషన్‌లో దించి అట్నుంచి వెళ్ళిపోయింది బబ్లీ. నేను ఓ రిక్షాలో ఏర్‌ఫోర్స్ స్టేషన్‌కి వెళ్ళి డ్యూటీ ఆఫీసర్‌కి నా పోస్టింగ్ ఆర్డర్ చూపించాను. ఆయన నాకు ఎకామిడేషన్ చూపబోతుండంగానే లోపలికొచ్చాడు ముజుందార్. ముజుందార్ నా ఎంట్రీమేట్. ఇద్దరం ఒకేసారి ట్రైనింగయ్యాం. ఇహ నా ఆనందం చెప్పనలవికాదు. హేపీగా నన్ను తను ఉండే 'బులెట్'కే తీసుకెళ్ళాడు మజుందార్. ఒకతను టూమంత్స్ యాన్యువల్ లీవులో వెళ్ళాడట. కనక ఆ బెడ్డీ, కప్‌బోర్డునీ నేను ఆక్రమించుకోవచ్చు. నా కిట్ బాక్స్ ఇంకా రాలేదు. దాన్ని లగేజ్‌లో బుక్ చేశాను గనక నో ప్రాబ్లం.

"భోజనం సంగతి ఏమిటీ.. బయటికి పోదామా? మెస్ క్లోజ్ చెయ్యకపోయినా సండే అధ్వానంగా ఉంటుంది" అన్నాడు.

"మా పెద్దమ్మ బోలెడు పూరీలూ కూరా ఇంకా ఊరగాయ పొట్లం కట్టి ఇచ్చింది!" అన్నాను. నిజంగా 'భారీ'గానే పెద్దమ్మ పాక్డ్ డిన్నర్ ఇచ్చింది.

"అయితే ఇంకేం.. ఒక్క నిముషం.!" అంటూ తన కప్ బోర్డ్ లోంచి 'రమ్' బాటిల్ బయటికి తీశాడు మజుందార్.

మిలటరీ వాళ్ళ ఇళ్ళకొస్తే కాఫీ, టీలు ఉండకపోవచ్చు. కాఫీ, టీలు కావాలంటే అవి తాగే సమయానికి రావాలి 'రమ్' మాత్రం ఇరవైనాలుగ్గంటలు సిద్ధంగా ఉంటుంది. అంటే స్టాక్‌లో ఉంటుందన్నమాట. అలాగని రౌండ్ ద క్లాక్ తాగుతారని పొరబాటున కూడా అనుకోవద్దు. కేవలం అవి వుండేది 'గెస్ట్'ల కోసమో, అకేషన్స్ కోసమో. బుధ, శనివారాలు 'బార్' డేస్. ఇష్టమైనవాళ్ళు ఆ రోజున డ్రింక్ తీసుకుంటారు.

ఈరోజు నిజంగా అకేషనే. ఎందుకంటే, కొత్తయూనిట్‌లోకి రాగానే నా ఎంట్రీమేట్ కనబడటం - అకామిడేషన్ కూడా ఎక్కడో ముక్కూ మొహం తెలీని వాళ్ళదగ్గర కాకుండా తెలిసిన వాడు ఉండే చోటే దొరకడం.

'రమ్'ని అతి జాగ్రత్తగా కొలిచి తలో 'పెగ్గు' గ్లాసుల్లో పోసి నీళ్ళు నింపాడు ముజుందార్. ఈ విషయంలో మాత్రం ఒక్క చుక్కైనా ఎక్కువ తక్కువలు కావడం మేం సహించం. బై ఛాన్స్ రెండో పెగ్గు దాటితే, కొలతల సంగతే గుర్తుండవనుకోండీ, అది వేరే విషయం.

**మనం సైనికులం.. దొంగలం కాదు.. దయచేసి దొంగిలించకండి.. ఇట్లు మీ సోదర సైనికుడు**

అని అందంగా ఓ స్లిప్ మీద రాసి కొత్త కప్‌బోర్డుకి అంటించాను.. మొదటి పెగ్గు సగంలోనే.

"అదేంటీ?" ఆశ్చర్యంగా అడిగాడు ముజుందార్. నా ఢిల్లీ అనుభవాన్ని చెప్పాను. "గుడ్. చాలా బాగుంది. కానీ నిజమైన దొంగకి ఇదో 'వెల్‌కమ్'లాంటిది!" పకపకా నవ్వి అన్నాడు ముజుందార్. పడుకునేసరికి పదకొండు..

కళ్ళు మూతలు పడుతుండగా నేను ప్లానిటోరియంలో నక్షత్రాల మధ్యన నక్షత్రాన్నై తిరుగుతున్నట్టూ, నమ్రతా ఉమా కూడా నాతోపాటు తారాలోకాన్ని చుట్టబెడుతున్నట్టూ అనిపించింది. ఎన్ని నక్షత్రాలో.. ఎన్ని రంగులో...

కనీసం పదికాయితాల్ని చింపిపోగులు పెట్టాను... ఉహూ... కుదరటంలేదు. ఎలా మొదలెట్టాలో కూడా అర్థంకాలేదు. ఏమని మొదలెట్టినా ఏదో కృత్రిమంగా ఉందేకానీ, సహజంగా హృదయాన్ని విప్పి చెబుతున్నట్టులేదు.

ఇంతకీ నా బాధ ఏమిటంటే ఉత్తరం వ్రాయడం. అమ్మకీ, ఉమకీ, మిగతా అందరికీ గబగబా ఉత్తరాలు రాసేశాను. ఎటొచ్చీ 'నమ్రత'కి రాసేటప్పుడే చిక్కొచ్చింది. ఎలా సంబోధించాలీ, ఏమని వ్రాయాలీ.. హిందీ బాగా మాట్లాడగలనుగానీ వ్రాయడంలో నేను జీరోనే. ఎన్ని తప్పులు దొర్లుతాయో దేవుడికే తెలియాలి ఇంగ్లీష్‌లో ఓ.కే. అయితే, తెలుగులో ఉన్నన్ని చక్కని పదాలు ఇంగ్లీషులో పది జన్మలు వెదికినా దొరకవు. ఇంగ్లీషుదంతా పుట్ - బట్ వ్యవహారం. తన్నుకుంటున్నా ఓపెనింగ్ దొరకలేదు. చివరికి

"నేస్తమా..

నాగురించి నేను తలుచుకుని ఎన్ని

రోజులు గడిచి పోయాయో ఏమో - కానీ.

నీ గురించి తలుచుకోని

క్షణమైనా లేదంటే నమ్మగలవా!

అద్దం ముందు నిలబడ్డా నా కళ్ళు

నన్ను చూడటం ఎప్పుడో మానేశాయి

నా గుండె చప్పుడు కూడా,

నాది కాదని స్పష్టంగా నాకు తెలుసు!

నిట్టూర్పులతో ఎలా కాలాన్ని కొలిచేదీ?

పోనీ వాటితోనే ఓ వారధి కట్టనా...

నీ -

(అంటూ కొన్నిపిచ్చి వాక్యాలు వ్రాశాను. (ఇది అప్పటిదే దీన్ని చాలా అర్థవంతంగా 'మలచ'వచ్చు. కానీ ఆ పని చెయ్యదలచుకోలేదు. పిచ్చో, వెర్రో ఆక్షణాల పరిమళం ఆ క్షణాలదే. ఒకవేళ మార్చినా అక్షరాల్ని మార్చగలనేమో గానీ 'ఆ క్షణాల్ని' మార్చలేనుగా!)

ఇంగ్లీషు వాడు చాలా తెలివైనవాడు. ప్రేమికుల మధ్య నడిచే సంభాషణకి 'Sweet Nothing' అని పేరుపెట్టాడు. వెయ్యి గంటలు మాట్లాడినా అందులో పనికొచ్చే విషయం ఒక్కటికూడా ఉండదు.. బట్.. దటీజ్ స్వీట్...

నమ్రత చాలా సింపుల్‌గా సూటిగా వ్రాసింది.

"సాలే.. నాకు కవిత్వాలు రావుగానీ - నువ్వు కనపడ్డ మరుక్షణం నిన్ను కొరుక్కు తినేసి నాలో కలిపేసుకుంటా. నీ పెదాల మీద నేను చేసిన సంతకాన్ని చెరగనివ్వకు, చెరిగిందో, చంపేస్తా..!" ఇలాగ. అమ్మయ్య.. ఆ ఉత్తరం చూశాక మనసు పావురమైపోయింది.

"భగవంతుడి అపారమైన కరుణవల్ల నువ్వు క్షేమంగా ఉన్నావు. అమ్మవారు నిన్ను సదాకాపాడుతుంది నేను నీ ఉత్తరం అందుకున్నాక ఎంత సంతోషించానంటే - మరోసారి మళ్ళీ పుట్టినంత. మళ్ళీ మర్రిచెట్టుని ఆనుకుని నీ ఒళ్ళో పడుకుని కబుర్లు చెబుతున్నంత ఆనందం కలిగిందిరా.. నా ఆరోగ్యం చక్కగా ఉంది.. కలకత్తా కాళీ అమ్మవారికి నా నమస్సుల్ని అర్పించు... ఎందుకంటే, నిన్ను ఇచ్చిందిగా..!"

చల్లని గంగలా ఉత్తరం వ్రాసింది ఉమ.

నాకోసం వెయ్యిదేముళ్ళని ప్రార్థిస్తున్నాననీ, చూడాలనుందనీ రాసింది అమ్మ. కలకత్తా వచ్చి పదమూడు రోజులైంది. శని ఆదివారాల్లో నాకు డ్యూటీ పడటం వల్ల కలకత్తా వెళ్ళలేకపోయాను. పెద్దమ్మ అడ్రస్‌కి ఒక కార్డు రాశాను. అలాగే ప్రశాంత్‌కి ధన్యవాదాలు చెబుతూ ఉత్తరం రాశాను.

ప్రతి యూనిట్‌లో కనీసం ఒకరిద్దరినా తెలుగువాళ్ళు తగులుతారు. కానీ ఇక్కడ తెలుగువాళ్ళు లేరు. మళయాళీలు ఎక్కువ. ఛాయిస్ పోస్టింగ్' మీదా, మ్యూచువల్ పోస్టింగ్ మీదా వచ్చిన బెంగాలీలూ ఎక్కువే. మిగతా రాష్ట్రాల వాళ్ళూ ఉన్నారు. ముజుందార్ ఉండటం వల్ల నా సమయం హాయిగా గడుస్తోంది. స్టడీస్ మీద కూడా మనసుని కాస్త కాన్సన్‌ట్రేట్ చెయ్యగలుగుతున్నాను. శెలవులో

వెళ్ళాలి. కానీ వచ్చింది మొన్నా మధ్యేకదా. అదీగాక యుద్ధానంతరం చాలామంది యాన్యువల్ లీవు మీద వెళ్ళటంతో నేను కాస్త ఆగాల్సి వచ్చింది.

'కాంచరా పారా' ఊరికి కొంచెం దూరంగా ఉంది మా యూనిట్. 'షియాల్దా' నించి 'క్రిషన్ నగర్' వెళ్ళే మార్గంలో ఆల్‌మోస్ట్ క్రిషన్ నగర్‌కి కొంచెం ఇవతల వొస్తుంది కాంచరా పారా. అది లోకల్ ట్రైన్ మార్గం.

బస్సులైతే చిన్నవి మాత్రమే నడుస్తాయి. కారణం వంతెన కిందనించి వెళ్ళేప్పుడు వంతెనల ఎత్తు తక్కువ గనక. ఆ వంతెనలన్నీ బ్రిటిష్ కాలం నాటివి.

ఆ శనివారం మధ్యాహ్నం కలకత్తా వెళ్ళాను. షియాల్దాకి తను వచ్చింది. కారణం నేను ముందుగానే లోకల్ లెటర్ వ్రాయడం. నాలో అప్పటికీ ఇప్పటికీ ఉన్న అతి పెద్దలోపం దారుల్ని గుర్తించలేకపోవడం. కొంతమంది ఒక్కసారి దారిని చూస్తే పదేళ్ళ తరువాత అయినా కాన్ఫిడెంట్‌గా తీసికెళ్ళగలరు. నావల్లకాదు. ఇంకో లోపం ఏమంటే నేను రాసిన పాటల పల్లవులు చెప్పమంటే నాకు తెల్ల మొహం పడుతుంది. కారణం మతిమరుపు.

అదే పాత పాటల్ని అడగండి.. వరసగా వందలకొద్దీ పాటల్ని పాడగలను. శ్రీ సీతారామశాస్త్రి (సిరివెన్నెల), శ్రీ రామలింగేశ్వరరావు (జొన్నవిత్తుల), శ్రీ రాజేశ్వర ప్రసాద్ (వెన్నెలకంటి) వీళ్ళ ధారణ అమోఘం. విపరీతమైన జ్ఞాపకశక్తి. అలాగే మ్యూజిక్ డైరెక్టర్స్‌లో మన విద్యాసాగర్ జ్ఞాపకశక్తి అద్భుతం.

మొత్తం రచయితల్ని తీసుకుంటే వరస్ట్ మెమొరీ నాదే (పాటలు, అదీ, నేను రాసిన పాటలవరకూ)

మళ్ళీ పెద్దమ్మ, ఆ రాత్రి చాలాసేపు స్వాతంత్ర పోరాటం గురించిన స్పష్టమైన నిజాలు, బెంగాల్‌లో కమ్యూనిజం వేళ్ళూడడానికి గల కారణాలు, ఇవన్నీ చర్చకి వచ్చాయి.

"ఒక స్త్రీ విద్యావంతురాలైతే, తరాలకి తరాలు విద్యాభిక్ష పొందుతాయి" అన్న వివేకానందుల వారి మాట ఎంత నిజం.

పెద్దామె మంద్రమైన శృతిలో సాగించిన ఉపన్యాసం ఆద్యంతం అద్భుతం. చాలా స్పష్టంగా, అనేకానేక ఋజువులతో, అవగాహనతో ఆమె చర్చసాగించారు.

దురదృష్టం ఏమంటే నేటిలాగా నాడు టేప్ రికార్డర్లూ, కెమేరాలు సామాన్యులకి అందుబాటులో లేకపోవడం.

నేడు అందుబాటులో ఉన్నాయిగానీ, యువతరం వాటిని దుర్వినియోగం చేస్తున్నాయి. నూటికి 90 వంతులు జరుగుతున్నది దుర్వినియోగమే.

ఈ గాడ్జెట్స్ ఆనాడు అందుబాటులో (ముఖ్యంగా నాకు) ఉంటే ఎందరి అద్భుతమైన ఉపన్యాసాల్నీ, మాటల్ని, గీతాల్నీ రికార్డు చేసి పొందుపరిచేవాడినో. ఆ బాధ ఈనాటికీ ఉంది.

"బేటా... రామకృష్ణ మఠానికి సైట్ సీయింగ్‌కి వెళ్ళొద్దు. అలాగే గంగాస్నానానికి కూడా. ముందు రామకృష్ణుల వారి లిటరేచరూ, వారి బోధనలూ బాగా చదివి అర్థం చేసుకో. అలానే 'గంగామాయి' పవిత్రతనీ, ఉదారతనీ మనఃపూర్తిగా విశ్వసించు. అప్పుడు మాత్రమే ఆ అపూర్వ అద్భుత క్షేత్రాలను దర్శించు" అన్నారామె.

ఎంత గొప్పమాట, లేక, బోధ చేశారో, దర్శించిన తరవాత కానీ నాకు అర్థంకాలేదు. కానీ ఆ దర్శనం చేసింది నెలన్నర తరవాత మాత్రమే. అదీ శ్రీరామకృష్ణ పరమహంస అమృతతుల్యమైన బోధనలు చదివాకే. కొద్దో గొప్పో అవి అర్థమై మనసులో నాటుకున్నాకే. ఆ విషయాలు మరోసారి వివరంగా చెబుతాను.

"యాద్ కియా దిల్ నే కహాఁహో తుమ్... ఝూమ్‌తీ బహార్ హై కహా హో తుమ్.. ప్యార్ సే పుకార్ లో జహా హో తుమ్.."

ఎంత గొప్ప పాట!!. హృదయాన్ని కదిలిస్తుంది.

(నా హృదయం నిన్ను కలవరిస్తోంది..

నువ్వెక్కడున్నావూ..

నువ్వెక్కడున్నా ప్రేమతో నన్ను పిలవవూ..

నీవెక్కడున్నా నీ స్వరాన్ని నాకు వినిపించవూ.!)

ఆ శనివారం రాత్రి వర్షం కురిసింది.

కలకత్తాలో నా తనువునీ మనసునీ తడిపిన తొలి వర్షం.

కూనిరాగాలు తీస్తూ ఆ వర్షంలో తడిశాను.

నమ్రత కోసం గుండె కలవరించింది.

'విరహం' ఇంత తియ్యగా ఉంటుందని ఆ వర్షమే తెలియచెప్పింది.. చినుకుల మాలల్ని మెడలో వేస్తూ.

ఏవీ ఆ కౌగిలింతలు..

ఏవీ వెచ్చని ఆ నిశ్వాసాలు..

ఏవీ ఆ పెదవుల మధురిమలు..

ఏవీ ఆ శిరోజాల పరిమళాలు..

ఏవీ ఆమె అణువణువునా పొంగి పొరలే వలపు జలపాతాలు..

ఏమైపోయాయి 'వర్షరాణీ'..?

ఏమైపోయాయి'నవధాన్యపాణీ'!

మనసుకి రెక్కలున్నాయి..

కానీ తనువుకి లేవే

జీవితం ప్లానిటోరియం అయితే -

హృదయాకాశంలో మినుకుమనే నక్షత్రాలేగా జ్ఞాపకాలు.

**"నీవు లేని జీవితం శూన్యమై పోయింది..**

ఆ శూన్యమే శబ్దమై మళ్ళీ నన్ను మేల్కొలిపింది..

ఏది నిజం.? ఏది అబద్ధం..?

ఓ క్షణం రాగమై రవళిస్తే -

మరో క్షణం మరణమై మూగవోయింది!" (పాదచారి కవితలు).

'పాదచారి' కలం పేరుతో కవితల్ని రాసుకునేవాడ్ని. ఆ కవితలు గొప్పవేం కావుగానీ, అప్పటి నా మనసుని వ్యక్తీకరించేవి. అందుకే వాటిని అలానే అందిస్తున్నాను. ఒక్కొక్క లైను రాయడానికి కనీసం అరగంట పట్టేది. అప్పటికీ ఏదో అసంతృప్తి. చిత్రం ఏమంటే, ఇంత కష్టపడి రాసిన రాసిన కవితల్నీ 'నమ్రత' క్షణంలో కొట్టిపారేసేది.

"ఆ పిచ్చిరాతలేమిట్రా? మామూలుగా రాయొచ్చుగా.! సింపుల్!! సరే.! నీ పిచ్చినీది. నా పిచ్చి ఏమిటంటే, - సాలే, మొదట్లో తెలియలేదు కానీ రోజులు గడుస్తున్న కొద్దీ అర్థమవుతోంది.. అదెంత కష్టమో. ఒరే, వచ్చెయ్‌రా.! ఈ ఉద్యోగాలూ, ఈ సంపాదనలూ ఇవన్నీ మన యవ్వనాన్ని చంపేస్తున్నాయి. యవ్వనం పోయాక ఎంత డబ్బున్నా ఏమి లాభం?" ఇలా ప్రాక్టికల్‌గా రాసేది. తన ఉత్తరం చదివాక నాకెంత పిచ్చెక్కేదంటే, అప్పటికప్పుడు అన్నీ వదిలి గుర్గావ్ పారిపోవాలనిపించేది.

కానీ కుదరదుగదా.! కొత్త యూనిట్‌లో రెండు వారాలు గడిచాయి. రోజుకో ఉత్తరం రాసేవాడ్ని గాని పోస్ట్ చేసేవాడ్నికాదు. కారణం ఏమంటే, ఇప్పుడు రాసిన ఉత్తరాన్ని అరగంట దాటాక చదివితే నాకే చికాకు పుట్టేది. మనసులోని భావాల్ని అక్షరాలు అతి కొద్దిగా మాత్రమే తెలియపరచగలవని ఆ రోజుల్లోనే అర్థమైంది. ఉత్తమ్ కుమార్ సినిమా ఒకటి (బెంగాలీది) చూశాను. అప్పట్లో ఆయన సూపర్ స్టార్. తిరుగులేని ఆర్టిస్టు. ఆయన దగ్గినా తుమ్మినా కూడా 'న్యూసే'. అలాగే 'సత్యజిత్ రే'గారి సినిమాలు చూశాను. నిజం చెబితే వాటిని ఎంజాయ్ చెయ్యలేకపోయాను. ఓ శ్రీ 420, ఓ జిస్ దేష్ మే గంగా బెహతీ హై ఇచ్చినంత ఆనందాన్ని భావోద్వేగాల్నీ సత్యజిత్ రే సినిమాలు చూసినప్పుడు పొందలేకపోయాను. ఇదేమాట 'పెద్దమ్మ'తో అంటే ఆవిడ పగలబడి నవ్వింది. "అలా ఎందుకు నవ్వుతారూ?" అని అడిగితే,

"రాజ్‌కపూర్ దృష్టి రాజ్ కపూర్ దీ - సత్యజిత్ రేగారి దృష్టి 'రే' గారిదీ, దృష్టిలో మార్పేగానీ సృష్టిలో మార్పు ఉండదు!" అని నవ్వారు. కరెక్టేగా. ఒక రాయిని ఒకడు దైవంగా భావిస్తే మరొకడు బరువుని తూచడానికి ఉపయోగిస్తాడు. మనసులో సత్వగుణం ఉన్నవాడికి సృష్టి మొత్తం సాత్వికంగానే కనిపిస్తుంది.

"అందరూ సత్యజిత్‌వి చాలా గొప్ప సినిమాలు అంటారుగా? ముఖ్యంగా ఆయన సినిమాల్లో 'నీడలు' కూడా అద్భుతమైన అర్థాల్ని ఆవిష్కరిస్తాయి అంటారుగా?" అమాయకంగా అడిగాను. కారణం ఏమంటే నాకు అప్పటికి సినిమాల్ని చూసి ఆనందించడం మాత్రమే తెలుసు. విశ్లేషించడమూ, విమర్శించడమూ రాదు.

"అబ్బాయీ.. ఇంకా వయసులో నువ్వు ఎదగాలి. అయినా విశ్లేషణలు విమర్శలూ కొందర్ని మాత్రమే తృప్తి పరచగలవు. అదో విచిత్రం..'ఎందుకూ? దేనికి?' అనే ప్రశ్నల్ని సంధించడంవల్ల చాలా విషయాలు తెలుస్తాయి. అయితే, ఆ తెలిసే విషయాలన్నీ నీకు ఆనందాన్నీ తృప్తినీ ఇవ్వగలవా అనేదే అసలైన ప్రశ్న. ప్రతీదాని 'లోతూ' కొలవాలని ప్రయత్నించడం జిజ్ఞాస కిందకి రాదు. మూర్ఖత్వం కిందకి వస్తుంది. దేన్ని శోధించాలో దాన్ని మాత్రమే శోధించడాన్ని 'విచక్షణ' అంటారు!" చిరునవ్వుతో అందావిడ.

బెంగాలీ నవలల నిండా 'చర్చ'లే ఎందుకుంటాయో అవ్వాళ నాకు అర్థమయింది. ఆవిడ చేసినది ఎంత చక్కని బోధ. ఆనాడు ఆవిడ చెప్పిన మాటలు జీవితంలో నాకెంతో ఉపయోగపడ్డాయి. చిమ్మచీకట్లు నిండిన బతుకు దారిలో ఆవిడ మాటలు ఎన్నోసార్లు దీపాల్లా దారిచూపాయి.

"రాజ్.. మాగ్రాండ్ మాతో కూర్చుంటే నువ్వూ క్షణాల్లో 'ఓల్డ్' అయిపోతావు. హాయిగా మళ్ళీ సిటీలో తిరుగుదాం పద." నా చేతుల్ని లాగుతూ అన్నది బబులీ.

"హూ ఈజ్ ఓల్డ్.. యూ స్టుపిడ్ గాళ్.!" చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ అన్నది పెద్దమ్మ. ఆ పరిహాసం తెలుస్తూనే ఉంది.

బయటికి వస్తుంటే 'ధబేల్' మన్న శబ్దం వినిపించింది. చూస్తే పక్కింటి పిల్ల ఎవరో ఆ బుల్లి దొరువులోకి దూకింది.

"ఆహా.. ఇవ్వాళ వాళ్ళింట్లో ఫిష్ కర్రీ" నవ్వి అన్నది బబ్లీ.

"నో.. జస్ట్ బాతింగ్" అన్నది ఆ పిల్ల బయటికొస్తూ. చుడీదార్ ఒంటికి అంటుకుపోయి ఉన్నది. నీళ్ళు కారుతూ. హైటూ స్ట్రక్చరూ చూస్తే అచ్చు నమ్రతలాగా ఉంది.

అవే పెదాలు.. రంగు మాత్రం నమ్రతది కాదు. ఈ పిల్లది చామనఛాయ.

"తన పేరు ఆమ్రపాలీదత్. వాళ్ళది 24 పరగణాలు. ఇక్కడే చదువుతోంది. ఇంగ్లీష్ లిటరేచరంటే ప్రాణం." అని నాతో చెప్పి,

"బయటకి పోదాం వస్తావా? ఇతను రాజూ.. బోలెడు ఇంగ్లీషు నవల్సు చదివాడు. .. ఐ జస్ట్ లవ్ టూ పాస్ మై టైం విత్ హిమ్." అని ఆ అమ్మాయితో అన్నది బబులీ.

"లాభం లేదు. ముకుల్ ఓ అరగంటలో వస్తాడు." నవ్వింది ఆమ్రపాలి.

"ఓకే దెన్. బై." అని ముందుకు నడిచింది బబులీ.

ఓ వందగజాలు నడిచాక, "ముకుల్ అంటే దాని మూడో బాయ్ ఫ్రెండ్ తిండిలేకపోయినా ఉండగలదుగానీ, బాయ్‌ఫ్రెండ్ లేకపోతే మాత్రం క్షణం కూడా ఉండలేదు" అని పకపకా నవ్వింది.

"మూడో బాయ్ ఫ్రెండా?" ఆశ్చర్యంగా అడిగాను.

"యా! ముకుల్ అందగాడు కాదుగానీ బాగా డబ్బున్నవాడు. దాన్ని మేము 'ఆమీ' అనే షార్ట్ నేమ్‌లో పిలుస్తాం. అది మాత్రం ఏం చేస్తుందీ? వాళ్ళ నాన్న ఓ ఎలిమెంటరీ స్కూల్ టీచరు. ఆయన పంపే డబ్బు ఏం సరిపోతుందీ?" నిట్టూర్చి అన్నది.

"బట్..ఇలా." మాట పూర్తి చెయ్యలేక పోయాను.

"ఆమీ'ని తప్పుపట్టకు. మాకు సరిపోయేంత ఆస్థి ఉందిగనక నేను పవిత్రంగానే ఉన్నాను. లేకపోతే? ఏమో.. నేనూ బాయ్ ఫ్రెండ్స్‌ని చిల్లర ఖర్చులకోసం మెయింటైన్ చేసేదాన్నేమో! లోకంలో ఎవ్వరూ పేదరికంలో మగ్గిపోవాలని అనుకోరు. ఎవరికి తోచిన విధంగా వారు, ఎవరికి వీలున్న పద్ధతుల్లో వారూ ఎదగాలనే అనుకుంటారుగా.! ఇక పవిత్రతా అపవిత్రతా సంగతా? అది వాళ్ళు వాళ్ళు నిర్ణయించుకోవాలేగానీ, తీర్పు చెప్పడానికి మనమెవరం?" సుదీర్ఘంగా నిట్టూర్పు విడిచి అన్నది బబ్లీ.

"బబ్లీ.. కెన్ ఐ హగ్ యు?" అడిగాను.

"యస్... ఇక్కడే. ఇప్పుడే!" నవ్వి అన్నది. కానీ నేను కౌగిలించుకోలేదు. అసలు నాకా కోరిక ఎందుకొచ్చిందంటే, అంత చిన్న వయసులో అంత చక్కని మాటలు మాట్లాడినందుకు. చెప్పలేనంత ఇష్టం పుట్టుకొచ్చింది. ఎంత మంచిదీ అమ్మాయి.

"చూశావా? హగ్ చేసుకుంటానని అన్నావే కానీ, హగ్ చేసుకోలేకపోయావు. నడిరోడ్డు మీద ఆడపిల్లని హగ్ చెయ్యాలంటే చాలా ధైర్యం కావాలి బాబూజీ.!" పకపకా నవ్వి అన్నది. ఇద్దరం ఓ టాంగా ఎక్కాము.

మళ్ళీ ఎస్‌ప్లనేడ్

"నీకో స్కార్ఫ్ కొనాలని ఉంది కొనిపెట్టనా?" అడిగింది బబ్లీ.

"డబ్బులెక్కడివీ?" నవ్వి అన్నాను.

"ప్రస్తుతానికి నీవే. పెద్దయ్యాక ఉద్యోగం చేసి తీర్చుకుంటావులే!" చనువుగా నా షర్ట్ జేబులోని పర్స్ తీసి అన్నది.

అవన్నీ ఇప్పుడు రాస్తుంటే ఓ పక్క నవ్వూ ఓ పక్క బాధా కలుగుతున్నాయి. ఆకాలంలో కుర్రకారుకి 'స్కార్ఫ్' వాడటం ఓ ఫేషన్. అలాగే 'నైట్‌డ్రెస్' వేసుకోవడం ఓ స్టైల్. మెడలో కెమేరా వేలాడుతుండగా తిరగటం యవ్వనానికి నిదర్శనం. కొత్త కొత్త వాచీలు కొనడం రకరకాల షూస్ మెయింటైన్ చెయ్యడం ఓ 'గుర్తింపు'ని ఇచ్చేవి.

"అబ్బ.. వాడికేంట్రా.. ఫేవర్ లూబా వాచ్ కొన్నాడు, ఆపైన దావూద్ షూసూ!! వెలిగిపోతున్నాడనుకో!" అంటూ మిగతావాళ్ళు అసూయపడేవాళ్ళు. ఓ పాతిక టైలూ, స్కార్ఫులూ ఉండేవి నా దగ్గర. చేతిలో ఇంగ్లీషు నవల ఉండి తీరాల్సిందే

ఇప్పటి నాగరికత వేరు. ఒక్క వస్తువు వచ్చి వంద వస్తువుల్ని చంపేస్తోంది. ఉదాహరణకి సెల్‌ఫోన్నే చూడండి. అదొచ్చాక 1.వాచీలు 2. కెమేరాలు 3. కేలిక్యులేటర్లు 4 ట్రాన్సిస్టర్లు, టేప్‌రికార్డర్లూ 5. స్టాప్ వాచ్‌లు 6. ఫోటో స్టూడియోలు 7. ఉత్తరాలూ టెలిగ్రాములు 8. ట్రెడిషనల్ టెలీఫోన్లు 9 జిరాక్సు మెషీన్లు 10 టైప్ మెషీన్లు... ఇంకా ఎన్నెన్ని అంతమైనాయి? అంతమవుతున్నాయి? 'పేజర్లు' ఇట్లా వచ్చి అట్లా మాయం అయ్యాయి.

ఇప్పుడు సెల్‌ఫోన్లే స్కానర్లుగా ఉపయోగపడుతున్నాయి. క్షణాల్లో ఫోటోలు తీసి ఎక్కడికైనా పంపొచ్చు. ఫేస్ టు ఫేస్ చూసుకుంటూ ఎవరితోనైనా మాట్లాడవచ్చు. కానీ –

ఆ రోజుల్లో ఒక ఉత్తరం వ్రాసి.. జవాబు కోసం ఎదురు చూడటంలోని మాధుర్యం నేటి తరం 'మిస్' అవుతోంది. అయినా ఫరవాలేదు. 'మిస్' అవుతున్నామనే విషయమే వాళ్ళకి తెలీదుగా.

❦❦❦

"మా కాలంలోని స్త్రీలకి ఇప్పటి (అంటే 1972) నాటి స్త్రీలకి ఉన్న భేదం తలచుకుంటేనే ఆశ్చర్యంగా ఉంది. మా తరంలో అతి చిన్న వయసులోనే పెళ్ళి చేసేవారు. వరుడికి డబ్బుంటే చాలు.. వయసుతో పనిలేదు. ఎంతమంది ఆడపిల్లలు 'కన్య'లుగానే విధవలయ్యారో లెక్కలేదు. మగవాడి ఎదుటపడటానికి వీల్లేదు. ఘూంఘట్ (మేలిముసుగు) ఉండి తీరాల్సిందే నాయనా.. అసలెన్ని ఘోరాలు జరిగేవో.!" నిట్టూర్చింది పెద్దమ్మ. ఊరంతా తిరిగి మధ్యాహ్నం బయటే భోంచేసి నేనూ బుబులీ సాయంత్రానికి ఇల్లు చేరాం. బబులీ సినిమా చూద్దాం అన్నది కానీ నేనే ఒప్పుకోలేదు. పెద్దమ్మతో మాట్లాడాలి. 'నాటి' బెంగాలీ పరిస్థితుల్ని తెలుసుకోవాలి. అప్పటికి గానీ శరత్ నవల్స్‌కీ మిగతా బెంగాలీ రచయితల రచనలకీ న్యాయం చేసినట్టుకాదు. ఇది నా నిశ్చితాభిప్రాయం. "ఒకొక్కప్పుడు ఏ ఆయుధమో పట్టుకుని వ్యవస్థ మీద తిరగబడాలని అనిపించేది. ముఖ్యంగా మన హిందువుల ఆచార వ్యవహారాలు స్త్రీని కట్టుబానిసగా మార్చేవి. కొన్ని కుటుంబాలలో స్త్రీలదే పెత్తనం. మగ దిక్కులేని ఆడదాని పాట్లు చెప్పనలవికాదు. అట్లాంటి ఆడదాన్ని ఆ కుటుంబంలోని మగవాళ్ళే ఓ 'భోగవస్తువు'గా పరిగణించేవాళ్ళు తాత వయసువాడూ, మనవడి వయసు వాడూకూడా ఆడదాని శరీరంతో ఆడుకున్నవాళ్ళే. అబ్బ.. ఎంత ఘోరం.. చీకటి మాటున ఎన్ని ఘోరాలూ!" సుదీర్ఘంగా నిట్టూర్చిందావిడ.

"బయటకి చెప్పేవాళ్ళు కాదా?" బాధగా అడిగాను. నాకూ కొంత తెలుసు.. కులీన కుటుంబాల్లోని 'విధవ'ల పరిస్థితి. గుండు గీయించి ఓ మూల ఉండమనేవారు. అయితే ఇంట్లో పనంతా ఆవిడే చెయ్యాలి. ఎవరికీ 'ఎదురు'రాకూడదు. ఎదురు మాట్లాడకూడదు. పొరబాటున పరాయివాడితో మాట్లాడితే, ఇంట్లోని 'సధవ'లే రంకులు కట్టేవాళ్ళు.. నిస్సిగ్గుగా.. నిర్భీతిగా.

"నా అదృష్టం ఏమంటే సంస్కారవంతుల ఇంటికి కోడలుగా రావడం. ఆనాటి ఆడవాళ్ళ పరిస్థితి వేరు. నేటి మహిళల పరిస్థితి వేరు. తల్చుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ రోజుల్లో టెన్నిస్ ఆడటం, సైకిల్ తొక్కడం, కారు నడపటం, సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం ఎలా చేశానా అని!" ఆవిడ మొహంలో చిన్న ఆనందం.. పెదాలపై చిన్న చిరునవ్వు. యవ్వనపు రోజుల్ని గుర్తుచేసుకున్నందువల్ల వచ్చిన ఉత్సాహం అది.

"వాట్ గ్రాండ్ మా.. గెస్ట్‌తో హడావిడిగా ఉన్నావా?" మెరుపులా లోపలికొచ్చింది ఆమ్రపాలి.

"హి ఈజ్ నాటె గెస్ట్.. నా మనవడే!" మురిపంగా నన్ను చూసి అన్నది పెద్దమ్మ. నాకు చెప్పలేని ఆనందం కలిగింది.

"మీరు మద్రాసీకదూ?" చనువుగా నాతో అన్నది ఆమీ.

"కాదు తెలుగువాణ్ణి. నాలుగు భాషలూ నాలుగు రాష్ట్రాలూ ఉన్నాయి సౌత్‌లో" అన్నాను.

"ఓహ్. సోనైస్ టూ మీట్‌యూ ఆమ్రపాలీజీ.. మీ పేరు నాకు చాలా పరిచయం. ఆమ్రపాలి నవల చదివాను. లిచ్ఛవీ పరిషత్తూ ఇవ్వన్నీ కంఠోపాఠాలే. నేను రాహుల్ సాంకృత్యాయన్ అభిమానిని!" అన్నాను.

"బహుత్ అచ్చా హై బేటా.. ఆయనో అద్భుత రచయిత. రెండు సార్లు వారిని చూసే భాగ్యం కలిగింది. వారి గంగా టూ ఓల్గా.... కాదు కాదు ఓల్గా టు గంగా.... జయ యౌధేయ ఓహ్.... చదువుతుంటేనే మరోలోకంలోకి వెళ్ళిపోతాం.!" ఆనందంగా అన్నది పెద్దమ్మ.

"ఆమ్రపాలి కథ నాకు తెలీదు..!" కళ్ళు చికిలించి అన్నది ఆమ్రపాలి.

స్నేహితులారా... సినిమాల్లోకి వచ్చాక ఎంతోమంది రచయితలు ప్రొడ్యూసర్లకీ డైరెక్టర్లకీ కథలు చెప్పడం విన్నా. ఓ మహారచయిత సదాశివబ్రహ్మంగార్ని 'కథాశివబ్రహ్మం' అనేవారట. ఎందుకంటే అంత అద్భుతంగా కథ చెప్పేవారట. మీరు తీసిన సినిమా కథ మీకే అద్భుతంగా చెప్పి 'కొత్తకథ' అనిపించేవారట. సరే, ఆ విషయాలు పక్కన పెడితే, పెద్ద'పెద్దమ్మ' చెప్పిన 'ఆమ్రపాలి' కథనాన్ని ఈనాటికీ మరిచిపోలేదు. కేవల 45 నిముషాల్లో కళ్ళకి కట్టించింది. అప్పటికి నేను కనీసం పదిసార్లు చదివి ఉంటాను పుస్తకాన్ని. కానీ పెద్దమ్మ చెప్పినప్పుడు కలిగిన ఆనందం చెప్పనలవికాదు.

"అయితే గ్రాండ్ మా. ఆమ్రపాలిని నగర వేశ్యని చేశారు. అదే తనంత తానే మగవాళ్ళని ఆట పట్టించి ఉంటే?" కోపంగా అన్నది ఆమ్రపాలి.

బబులీ ఆమీ గురించి అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి నాకు. పెదమ్మ ఏం జవాబు ఇస్తుందో అని కుతూహలంగా చూశా.

"నిజంగా అది పరిషత్తే అయితే, ఆమ్రపాలిని నగర వేశ్యని చేసినందుకు అక్కడి ఆడవాళ్ళని చెప్పుతో కొట్టాలి. అసలు ఆమ్రపాలి ఎందుకు ఒప్పుకుంది? ఓహ్.. ఆర్థిక, సామాజిక రక్షణ కోసం ఆడది మగవాడి మీద ఆధారపడితే జరిగేది ఇంతే. అప్పుడైనా, ఇప్పుడైనా. రివల్యూషన్ మొదలు కావాల్సింది ఆడదాని మనసులో. ఏ క్షణం ఆడది తిరగబడుతుందో - ఆ క్షణమే ఆడది బ్రతకడం మొదలైనట్టు!" స్పష్టంగా అన్నది. నేను చప్పట్లు చరిచి ఆమె పాదాల్ని స్పృశించా. ఆ క్షణంలో నాకు నిజమైన 'కాళీ దర్శనం' అయింది.

"మీరందరూ నన్ను మర్చిపోయారు. నేను అలిగాను.!" అన్నది బబులీ.

"అలకపోవాలంటే ఏం చెయ్యాలీ?" అడిగాను.

"చర్చలు మాని పాటలు పాడాలి..!"

"ఓకె అయితే హిందీతో పాటు మా తెలుగు పాటలు కూడా పాడుతా."

"సరే.. మీ కకర్ బకర్ భాష నేనూ వింటాను" సెటిలైంది ఆమ్రపాలి.

పొద్దువాలింది. సందె చీకట్లని చెరుపుతూ వెన్నెల పరుచుకుంటోంది. చల్లనిగాలి గుండెల్ని తాకి గిలిగింతలు పెట్టింది. కరెంటు లైటు వెయ్యకుండా బబులీ కొవ్వొత్తిని వెలిగించింది. నవ్‌రంగ్‌లో 'ఆధా హై చంద్రమా రాత్ ఆధీ.. రెహన జాయే తేరీ మేరీ బాత్ ఆధీ... ములాకాత్ ఆధీ.." పాట పాడాను. (తరువాత నేను సినిమాల్లోకి వచ్చాక ఆ సినిమాలో ఓ ట్యూన్‌నే స్ఫూర్తిగా తీసుకుని 'భద్రాచలం కొండా... సీతమ్మవారి దండా.... కావాలా నీ కండాదండా.. టప్ టప్ టపోరీ.. కన్యాకుమారీ... టప్ టప టపోరీ నా టక్కుట మారీ' అనే పాటని దగ్గరుండి మరీ బప్పీదా'తో ట్యూన్ చేయించాను).

లిరిక్ గుర్తులేదు కానీ, అద్భుతమైన, చాలా మధురమైన ఓ బెంగాలీ పాటని బబులీ పాడింది.

'ఓ బసంతీ పవన్ పాగల్.. న జారే నా జా రొకో కోయీ' అనే 'జిస్ దే దేష్ మే గంగా బెహోతీ హై'లోని పాటని ఆమ్రపాలి మృదుమధురంగా పాడింది. 'వైష్ణవ జనతో' పాటని ఆర్ద్రంగా అద్భుతంగా ఆ వయసులోనూ పాడారు పెద్దమ్మ. సంగీతాన్ని చిరుగాలి ఆలపిస్తోందా లేదా చిరుగాలికి మేము సంగీతం వినిపిస్తున్నామో తెలీనంత ఆహ్లాదంగా రేయిగడుస్తోంది.

"కలకాలం ఈ కాళరాత్రి నిలువదోయీ మేలుకో" అన్న తెలుగు పాటని నేను పాడాను. మిస్సమ్మలోని 'బృందావనమది అందరిదీ' కూడా పాడాను. అర్థం అడిగితే వివరించి చెప్పాను.

రాత్రి తొమ్మిదిన్నర - పదింటికి పూరీ, బంగాళదుంపల కూర, హల్వా, 'మిష్టిదొయ్'తో భోజనం ముగించాం.

వెన్నెల కిటికీలోంచి కనిపిస్తోంది. ఆమ్రపాలి వెళ్ళిపోతూ మళ్ళీ 'కరస్పర్శ' చేసింది. ఆమె ఉన్నంతసేపు అక్కడ న్రమతే ఉన్నదనుకుని పాటలు పాడాను. 'ఆజారే.. అబ్ మెరా దిల్ పుకారా.. రోరో కే గమ్ భీ హోరా' పాటతో సహా. (తెలుగు 'ప్రేమలేఖలు - (రాజ్ కపూర్ నర్గిస్) సినిమాలోని 'రారాదా ... మది నిన్నే పిలిచెగాదా... కన్నీట కరిగె బాధా కడలేనిదా ఈ వ్యధా.. రారాదా' పాట అది).

మేల్కొని ఉన్నా న్రమతే.. పక్కనే ఉన్నట్టూ.. నవ్వుతున్నట్టూ ... కౌగిలిస్తున్నట్టూ.... కవ్విస్తున్నట్టూ.. ఏవేవో ఊహలు.. నా ఒళ్ళంతా సెగలు పొగలు.

"నువ్వెవరినో ప్రేమించావు కదూ?" పక్కన ఉన్న మంచం మీద లేచి కూర్చుని గుసగుసగా అన్నది బబులీ.

"నిజం.! ఖచ్చితంగా నువ్వెవరినో ప్రేమించి ఉండాలి. ఎనీవే.. గుడ్‌నైట్ అండ్ స్వీట్ డ్రీమ్! " అని మళ్ళీ పడుకున్నది బబులీ.

"నీకెలా తెలుసూ?" అని అడుగుదామనుకున్నాను కానీ -

పెద్దమ్మకి నిద్రాభంగం అవుతుందని ఊరుకున్నాను.

చిన్నప్పుడు మా ఊర్లోనూ ఇదే వెన్నెల.

హైదరాబాదులో ఉన్నప్పుడూ ఇదే వెన్నెల.

అంతకు ముందు శ్రీకాకుళం కాలేజీలో చదివినప్పుడు ఇదే వెన్నెల.

ఏర్‌ఫోర్స్‌లో చేరి ట్రైనింగ్‌లో ఉన్నప్పుడూ ఇదే వెన్నెల.

ఇప్పుడు కలకత్తాలోనూ - అప్పుడు ఢిల్లీ - గుర్గావ్‌లలోనూ ఇదే వెన్నెల - కానీ -

మా ఊళ్ళో అమాయకంగా ఉమతో ఉన్నప్పటి వెన్నెలలోని చల్లదనం వేరు -

ఢిల్లీలో చలిచలి రాత్రుల్లో... వెన్నెల కురుస్తుండగా న్రమతని హత్తుకున్నప్పటి వెచ్చని వెన్నెల వేరు -

ఇప్పుడు.. ఒంటరిగా..(అవును.. అంతేగా) నాలో నేను జ్ఞాపకాల వీధుల్లో తిరుగాడుతుండగా, నన్ను వేధిస్తున్న వెన్నెల వేరు.

నవ్వొచ్చింది.

పెద్దమ్మ చెప్పినట్టు నా 'దృష్టి'లో మార్పేగానీ 'సృష్టిలో' ఏ మార్పూలేదు.

కలలేవో కళ్ళమీద వాలుతున్నాయి.. ఒదిగిపోతున్నాయి... నదులు సముద్రంలో ఒదిగినట్టు...

ఓ మెత్తని మత్తు తెర నా కళ్ళని కమ్మేసింది.

(ఆనాడు డైరీలో రాసుకున్న కవితలోని వాక్యాలనే 'ప్రేమదేశం' సినిమా పాటలో వాడాను.

'జ్ఞాపకం ఉందా! అఫ్‌కోర్స్ చిన్న మార్పులతో..! )

పll వెన్నెలా.. వెన్నెలా.. చల్లగా రావే
పూవుల తేనెనే తేవే..
కడలి ఒడిలో నదులు ఒదిగి నిదురపోయేవేళా..
కనులపైనా కలలే వాలీ.. సోలిపోయే వేళా..
వెన్నెలా.. వెన్నెలా... చల్లగా రావే...
పూవుల తేనెలే తేవే)

* వీలుంటే ఈ పాట విని మీ మాట చెబుతారు కదూ!

**తెల్లవారింది. పెద్దమ్మ** (అలౌకిక) పాటతోనే మేలుకున్నాను. బబులీ ఇంకా నిద్రపోతూనే ఉంది. నేను లేవడం చూసి పెద్దమ్మ చిరునవ్వు నవ్వింది.

"గుడ్ మార్నింగ్" అన్నాను. నవ్వి తలపంకించింది. నేను మంచం మీంచి లేచి బ్రష్ చేసుకుని కుర్చీలో కూర్చున్నాను. ఈలోగా పెద్దమ్మ 'టీ' సిద్ధం చేసింది. నాకో కప్పు ఇచ్చి, తనో కప్పు తీసుకుని, "రాత్రి బబులీ అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పలేదేం?" అన్నది నవ్వుతూ.

"మీరు విన్నారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"వినాలని వినలేదు. వినపడింది. ***ఒక వయసు వరకూ నిద్రకోసం ఎదురు చూడనక్కర్లేదు. దానంతట అదే వస్తుంది. ఒక వయసు దాటాక నిద్రాదేవిని ప్రార్థిస్తేకానీ కరుణించదు...*** అదీ ఎప్పటికో! అందుకే నిద్రపోయేవాళ్ళని పొరబాటున కూడా నిద్రలేపను!" అన్నది.

"సమాధానం చెప్పడానికి సిగ్గో, మరేదన్నా భావమో అడ్డొస్తే చెప్పొద్దు.!" మళ్ళీ నవ్వి అన్నది.

"బబులీ చిన్నపిల్ల.." దాటవేద్దామని అన్నాను.

పకపకా నవ్వింది పెద్దమ్మ. "బేటా.. ఈ దేశంలో స్త్రీలు పదేళ్ళకే జ్ఞానవంతులవుతారు. అదే మాకు వరమూ, శాపమూ కూడా. అదే ఇతర దేశాల్లోని స్త్రీల విషయం వేరు. వాళ్ళకి బాల్యం, యవ్వనం వృద్ధాప్యం అనీ విడివిడిగా ఉంటే ఇక్కడి స్త్రీలకి బాల్యంలోనే యవ్వనం, యవ్వనంలోనే వృద్ధాప్యం కలిసిపోయి ఉంటాయి. కుముదిని వయసులో చిన్నదే. కానీ అది అన్నిటినీ గ్రహించగలదు." నిట్టూర్చి అన్నది.

ఎంత గొప్ప సత్యం చెప్పిందీ! పెద్దమనిషికాగానే పెళ్ళి, ఆ వెంటనే పిల్లలు ముప్పై అయిదూ ముప్పై ఆరేళ్ళకల్లా మనవడో మనవరాలో. ఇక యవ్వనానికి చోటెక్కడా?

"అమ్మా.. మగవాళ్ళ విషయమూ అంతేగా. చదువు పూర్తవగానే ఉద్యోగం. ఉద్యోగం రాగనే పెళ్ళీ పిల్లలూ సంసారపు బరువు బాధ్యతలు. మాకు మాత్రం 'యవ్వనపు' వెల్లువ ఎక్కడిదీ" నేనూ నిట్టూర్చే అన్నాను. కారణం మా అన్నల జీవితాల్ని చూసి ఉండటమే.

"అదీ నిజమే నాయనా.. మీకైతే ఎదిరించే ధైర్యమన్నా ఉంది. లేకపోతే ఇల్లు వదిలి పెట్టన్నా పోగలరు. మేం ఆ పని చెయ్యలేముకదా. ఇల్లు వదిలితే ఆడదానికి రక్షణ ఏదీ.!" ఓ నిట్టూర్పు. తరువాత మౌనం.

పొద్దున్నే ఇంత సీరియస్ సంభాషణ ఇప్పటివరకూ మా మధ్య జరగలేదు.

"సరే పెద్దమ్మా.. ప్రేమించిన మాట నిజం.. అసలు ప్రేమంటే ఏమిటో కూడా నాకు నిజంగా అర్థంకావటం లేదు.!" అంటూ ఉమ గురించీ నమ్రత గురించీ చెప్పాను. కాలం తెలియకుండానే రెండుగంటలు ముందుకి సాగిపోయింది.

"బ్రేక్‌ఫాస్ట్‌కి బాగా లేటైంది కదూ.!?" లేచి నిలబడి అన్నది పెద్దమ్మ.

"ఓ పని చెయ్యనా? సూజీ (బొంబాయిరవ్వ) ఉంటే మా సౌత్ ఇండియన్ వంటకం 'ఉప్మా' నేను చేస్తాను. మీరు ఇవ్వాళ నా చేతి వంట రుచిచూద్దురుగాని.!" సరదాగా అడిగాను.

"అయితే కానివ్వు. నేనూ నేర్చుకుంటాను.!" ఉత్సాహంగా అన్నదావిడ. కరెక్టుగా ఇరవై నిముషాల్లో ఉప్మా తయారయింది. మా అమ్మ దగ్గర నేర్చుకున్న (చింతపండు పచ్చిమిర్చి అల్లం+బెల్లం కలిపి నూరి చేసే) చింతపండు పచ్చడి కూడా మరో అయిదు నిముషాల్లో తయారయింది.

ఉప్మా తయారీ జరుగుతుండగా బబులీ నిద్రలేవడం, మొహం కడుక్కురావడం జరిగిపోయాయి. చక్కని బాదం ఆకులతో బుల్లి బుల్లి విస్తళ్ళు తయారుచేసి నేనే స్వయంగా వడ్డించాను. పెద్దమ్మ స్నానం ఎప్పుడో అయిపోయింది. స్నానం చెయ్యనిది నేనూ బబులీనే. ఉప్మా వడ్డించాక స్నానం విషయం గుర్తొచ్చింది. "స్నానానికి సెలవివ్వండి.!" నవ్వి అన్నది పెదమ్మ.

చెప్పొద్దూ.. ఉప్మా అద్భుతంగా కుదిరింది. చెట్నీ కూడా.

"చాలాబాగుంది. నా వంటింటి సామ్రాజ్యంలోకి మరో వంటకం విచ్చేసిందన్నమాట.!" రుచిని ఆస్వాదిస్తూ అన్నది పెద్దమ్మ.

"నేనూ నేర్చుకుంటాను!" చెట్నీ ఘాటుకి కొంచెం వగరుస్తూ అన్నది బబులీ. బెంగాలీలు కారం చాలా తక్కువగా వాడతారు. స్వీట్స్ అంటే వాళ్ళకి ప్రాణం.

"అమ్మయ్య.. మళ్ళీ ఒంటిగంటదాకా ఆకలి భూతాన్ని అవతల పెట్టొచ్చు.!" నవ్వుతూ అన్నది బబులీ.

నా ప్రేమ విషయంలో పెద్దమ్మ అభిప్రాయం అడగాలని అనిపించినా బబులీ ముందు అడగలేకపోయాను.

మధ్యాహ్న భోజనం తరువాత బబులీ 'ఇప్పుడేవస్తా'నని బైటకెళ్ళింది. అప్పుడు అడిగాను. "పెద్దమ్మా.. మీ అభిప్రాయం ఏమిటి?" అని. మౌనంగా ఓ క్షణం నా మొహం వంక చూసి, "చెప్పలేను రాజూ.. నిజంగా చెప్పలేను. ఇద్దరూ మంచివాళ్ళే. ఇద్దరి ప్రేమా నిష్కల్మషమైనదే అసలు మనసు ఎందుకు ప్రేమిస్తుంది? అందరూ అంటారు.. మనసు ప్రేమించేది ఒక్కరినే అని. దానంత అసత్యం సృష్టిలో మరొకటి లేదు. ఒక్కరినే ఎందుకు ప్రేమిస్తుంది? ఒకే ఒక్క ఆకుతో ఉండే చెట్టు లోకంలో ఉందా? ఒకే ఒక్క పూట భోజనం చేస్తే జీవితాంతం ఆకలితీరుతుందా? ఏమో, ఈ వయసులో ఇలాంటి చర్చ చెయ్యడం నాకు శోభనివ్వదు. కానీ ఈ ప్రశ్నలు మాత్రం ఇప్పటివి కాదు. కొందరు మోహం వేరూ, ప్రేమ వేరూ అంటారు. ఇంకొందరు మోహం, ప్రేమ, కామం ఇవి అన్నీ ఒకటే అంటారు. ఎవరేమన్నా ఒక్కటి మాత్రం నిజం. గుండెగదుల్లో ఎన్నో ప్రతిమలుంటాయి. వేటి స్థానం వాటిదే వాటి గురించి చెప్పినా చెప్పకపోయినా అవి గుండెలో దాగి వుండటం మాత్రం నిజం.!" కళ్ళుమూసుకుంది ఆవిడ.

నిజం చెబితే ఆనాడు నాకసలు ఏమీ అర్థంకాలేదు. నాలాగే తను కూడా ఓ సందిగ్ధతలో ఉందని అనిపించింది.

"ప్రేమని కూడా కాపాడుకోవాలి. ఓ చిన్న మొక్కని ఎంతగా రక్షించుకోవాలో ప్రేమనీ అంత జాగ్రత్తగా రక్షించుకోవాలి. మొక్కకి ప్రతిరోజూ నీళ్ళు పోస్తూ ఎలా చూసుకుంటామో, ప్రేమని కూడా అలానే పెంచుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రేమ వాడిపోతుంది. మొక్కవాడినట్టు. నిర్లక్ష్యం ఎక్కువైతే నీళ్ళులేని మొక్క చచ్చిపోయినట్టు చచ్చిపోతుంది.!" చాలా బరువుగా నిట్టూర్చిందా వృద్ధమూర్తి.

★★★★★★★

ఇవాళ ఇదంతా రాస్తుంటే, ఆమె .. ఆ ఇల్లు.. నాకళ్ళముందున్నట్టే ఉంది. ఆవిడ మంద్రమైన స్వరం నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంది. ఎంత గొప్పగా 'సత్యాన్ని' విప్పి చెప్పింది.!! నా జీవితంలో ఎంతోమందిని చూశాను. వయసు పెరుగుతున్న కొద్దీ నిజాన్ని దాచేస్తూ నీతులకి బంగారపు తొడుగులు తొడిగా వారేకానీ, పెద్దమ్మలా స్పష్టంగా స్వచ్ఛంగా హృదయాన్ని ఆవిష్కరించిన వాళ్ళులేరు. నా ఇంకో బాధ ఏమంటే 'రొమాన్సు'ని అందరూ ఉత్సాహంగా చదువుతారు. కానీ, జీవితపు పాఠాల్ని హృదయంతో పాఠకులు చదువుతారా? ఏమో.. ఏమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాలనే నిర్ణయించుకున్నాను. ముఖ్యంగా పెద్దమ్మతో జరిగిన సంభాషణలోని ప్రతి పదమూ నాకు గుర్తుంది. ఏమాటనీ మర్చిపోలేదు. మరిచిపోయేంత వ్యర్థమైన సంభాషణ కాదది.

★★★★★★★★★★

మళ్ళీ ఆలూ పరోటాల పొట్లాలు పట్టుకుని షియాల్దాకి వచ్చాం నేనూ బబులీ. సాయంత్రపు నీరెండ బంగారంలా బబులీ మొహాన్ని వెలిగిస్తోంది. "రాజూదా, నీ ప్రేమకథ మొత్తం నేను విన్నాను తెలుసా?" కొంటెగా అన్నది బబులీ.

"ఎప్పుడూ?" ఆశ్చర్యంగా అన్నాను.

"నేనసలు నిద్రపోతేగా? గ్రాండ్‌మాకి నువ్వు ఉమ గురించీ, నమత గురించీ చెప్పడం దుప్పటి ముసుగెట్టుకుని వింటూనే వున్నా.!" పకపకా నవ్వింది.

"యూ..లిటిల్ థీఫ్! అలా వినడం తప్పుకదూ?" కావాలనే కోపంగా చూశా.

"చెప్పడం తప్పుకానప్పుడు వినడం తప్పెలా అవుతుందీ? అయినా నీ లవ్ ట్రాక్ బ్రహ్మాండంగా ఉంది. అబ్బాయ్.. ఇప్పుడు నేను జారిపడతాననుకో.. కెన్ యు లిఫ్ట్ మి?" పకపకా నవ్వింది బబులీ. ***యవ్వనం అంటే వరద వచ్చిన నదిలాంటిది. విచ్చీ విచ్చని మొగ్గలాంటిది. రాసీ రాయని కవితలాంటిది.*** ఇదిగో. ఈ బబులీ నవ్వుతున్న నవ్వులాంటిది.

గొగోయ్ చేతులు తబలామీద నాట్యం చేస్తున్నాయి.



రఫీ

భట్టాచార్య హార్మోనియం వాయిస్తున్నాడు.



లతాజీ

రాజేందర్ చౌహాన్ ఢోలక్‌తో తకధిములాడుతున్నాడు. బన్సల్ 'ఎహసాన్ తెరా .. హో.. గా.. ముఝుపర్..' (సినిమా పేరు జంగ్లీ - రచయిత హస్రత్ జైపురీ - సంగీతం - శంకర్ జైకిషన్ - గానం రఫీ&లతా) పాట పాడుతున్నాడు. ఆదివారపు 'మెహఫిల్ జరుగుతోంది.

"ఆవో ప్యారే.. ఆవో.. ఏక్ దర్దభరీ గీత్ గావో" నన్ను ఆహ్వానిస్తు అన్నాడు ముజుందార్. (రా స్నేహితుడా రా. ఓ దుఃఖభరితమైన పాటపాడు) అని అర్థం.

అప్పటికి జనాలు రెండో పెగ్గుల్లో ఉన్నారని అర్థమైంది. నవ్వి నేనూ కూర్చున్నా. తళతళలాడే గాజుగ్లాసులో అతి జాగ్రత్తగా ఓ పెగ్గుని పోసి, గ్లాసుని నీళ్ళతో పూర్తిగా నింపి నా ముందు పెట్టాడు మదన్ చావ్లా.

"ముందు కాస్త మందుతో వార్మప్ కానీ, ఆ తరువాత పాటలే పాటలు.. పీలో భాయ్.. అన్నట్టు నీకో విషయం తెలీదు కదూ. రేపు మన 'సెక్షన్'కి హాలీడే దాని బదులుగా ఎల్లుండి 24గంటలు ఎక్సర్‌సైజ్ ఉంటుంది" ఖుషీ కబురు వినిపించాడు ముజుందార్.

అప్పుడప్పుడూ అలాంటివి మామూలే. ఇక్కడ ఎక్సర్‌సైజ్ అంటే శారీరక వ్యాయామం కాదు. ఆపరేషన్స్ 24 గంటలూ నిరవధికంగా నడుస్తాయన్నమాట.

"ఓకె. అయితే నన్ను పాడనీ.." అంటూ తాజ్‌మహల్ సినిమాలోని 'జొవాదాహో.. కియా నిభానాపడేగా' పాట అందుకున్నాడు కొహ్లి. అతను మంచి సింగరు.


బీనారాయ్

ఎంత మంచి లిరిక్స్! రాసింది సాహిర్ లుధియాన్వీ. సంగీతం రోషన్. ఇప్పటి హృతిక్ రోషన్ తాత - రాజేష్ - రాకేష్ రోషన్ల తండ్రి. పాడింది రఫీ&లతా మంగేష్కర్. నటన ప్రదీప్ కుమార్, బీనారాయ్. అదో వెండితెర కార్యం.

ఇప్పటి పిచ్చి సినిమాల్ని చూస్తుంటే ఏడుపొస్తోంది. ఎంతసేపూ హీరోల గొప్పలూ వారివంశాల గొప్పలూ - సహజత్వం అన్నది ఎన్నడో చచ్చింది.

(28 ఏళ్ళగా ఈ చిత్రపరిశ్రమలో ఉంటూ నేనీమాట అనకూడదేమో. కానీ అది నిజం. సినిమా అంటే జీవితాల్ని ప్రతిబింబించేదీ, జీవితాల్ని ప్రభావితం చేసేదీ అనే సత్యం మృగ్యమై, సినిమా అంటే అయిదు పాటలూ, ఆరుఫైట్లూ, ఓ అయిటమ్ సాంగూ, అరగంట కంప్యూటర్ గ్రాఫిక్స్ అనే స్థాయికి దిగిపోయింది)

"ఇప్పుడు నీవంతు" అన్నాడు బన్సల్. ఏ పాటపాడాలి? 'ప్రొఫెసర్' సినిమాలోని 'ఆవాజ్ దే కే హమే తుమ్ బులావో.. మొహబ్బత్ మె ఇత్‌నా న హమ్‌కో సతావో' అనే పాట నాకు చాలా ఇష్టం. అఫ్‌కోర్స్ అప్పటికా సినిమా నేను చూడలేదు.

ఆ పాటే పాడాను. పిన్‌డ్రాప్ సైలెన్స్.

తెలుగుభాషలో ఉండే గొప్పదనం ఏమిటంటే, ఏ భాషలోని పాటనైనా, అసలు ఏ భాషనైనా మనం స్పష్టంగా, వారి 'యాస'తోనే పాడగలం, మాట్లాడగలం. అంత గొప్ప భాష మనది. దాన్ని మనపిల్లలకి మనమే దూరం చేస్తున్నందుకు మన చెప్పుతో మన మొహం పగలగొట్టుకోవాలి.

"అరే భాయ్ .. ఫిదా హోగయా.!" గబగబా గ్లాసు ఖాళీచేసి అన్నాడు భట్టాచార్య.

"గొప్ప నాది కాదు.. రాసిన హస్రత్ జైపురీది - ట్యూన్ కట్టిన శంకర్ జై కిషన్ దీ.. పాడిన రఫీదీ లతా మంగేష్కర్‌దీ" అన్నాను.

"అబ్.. నా పాట విను.." ఓ సిప్ తీసుకుని 'ఓ జబ్ యాద్ ఆయే.. బహుత్ యాద్ ఆయే' పాట ఎత్తుకున్నాడు గొగోయ్. గొగోయ్ అస్సామీవాడు. హిందీ పాటని ఇంత అద్భుతంగా పాడతాడని తెలీదు. అదీ తబలా వాయిస్తూ పాడాడు. ఎంత ఆర్తితో పాడాడంటే నా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. (సినిమా పేరు: పరసమణి. సంగీతం లక్ష్మీ కాంత్ ప్యారేలాల్ - రచన: ఇందీవర్.. పాడింది రఫీ..లతా)

అందరం మూడో పెగ్గు పూర్తిచేసేసరికి టైమ్ పదిన్నర. ఎవరి డిన్నర్ వాళ్ళు ముందరే ప్లేట్స్‌లో తెచ్చుకోవడం వల్ల ఇబ్బంది కాలేదు.

అదో అద్భుతమైన సాయంత్రం.

ఎన్నిపాటలో. సంగీతం ఎంతగొప్పదీ..! అందులోనూ సినీ సంగీతం. క్షణాల్లో మనసుకి హత్తుకుపోతుంది. ఎక్కడో విద్వాంసుల గళాల్లో మాత్రమే విహరించే సంగీతాన్ని, ఇంటింటికీ తెచ్చిందీ, ప్రతిమనిషినీ గాయకుడిగా (కనీసం కూనిరాగాలు తీసేవాడుగానైనా) మార్చిందీ సినీ సంగీతమేగా!

లోకులు అన్నమాచార్య కీర్తనలూ త్యాగరాజకీర్తనలూ పాడలేకపోవచ్చు. సినీ గీతాల్ని మాత్రం ఖచ్చితంగా పాడగలరు. పాడటం ముఖ్యంగానీ, శృతి తప్పితేనేం, ట్యూన్ మారితేనేం!

పక్కమీద పడుకున్నా నిద్రరావట్లేదు. కొంచెం మత్తుగా మాత్రం ఉంది. అంతే. ఎన్నో పాటల్ని మనసులోనే పాడుకున్నాను. నమ్రత ఉత్తరం గుర్తొచ్చింది.

"ఓ మనిషీ -

ఈ ఉద్యోగాలూ, ఈ జీతాలూ, ఈ బాధ్యతలు శృంఖలాలు ఎందుకూ? జీవితం ఆగదు సాలే. జీవితం ఆగదు.. యవ్వనం అసలే ఆగదు. క్షణంక్షణం యవ్వనం అడవికాచిన వెన్నెలౌతోంది. కౌగిళ్ళలో కరగాల్సిన కాలం నిట్టూర్పులతో గడుస్తోంది. వచ్చెయ్‌రా.. నా అణువణువునీ కొరుక్కుతినెయ్.." అంటూ రాసింది.

ఉత్తరంలోని మాటల్తో పాటు నా మొహాన్ని కప్పివేసే మెత్తని ఆమె శిరోజాలు, ఆకలితో నా పెదాల్ని పీల్చేసే ఆమె పెదాలూ, వంటి పరిమళం, ఆ వెచ్చదనం అన్నీ గుర్తొచ్చాయి.

"మోహం - ప్రేమ - కామం అనీ ఒకటేనంటారు ఇంకొందరు" అన్న పెద్దమ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఆమెని 'సశరీరంగా' కాక ఇంకెలా ప్రేమించనూ. (ఆమె అంటే 'నమ్రత') ఒక ఉప్పెనలా ఆలోచనలు ఎగిసిపడ్డాయి. లీవ్‌కి అప్లై చేస్తే?

కలకత్తా టూ ఢిల్లీ.. ఢిల్లీ టూ గుర్గావ్..

అక్కడనుంచి తనూ..నేనూ..నేనూ..తనూ..

ఘంటసాలగారి పాట గుర్తొచ్చింది..

**ప: హృదయమా .. సాగిపొమ్మా..**
**భావవేగాన సాగిపొమ్మా.. ||హృద||**
**చ: కొసరి వీచేను గడుసరి గాలీ**
**ఆదమరచేవు సుఖముల తేలీ**
**చాలు చాలించు సోమరి నడక**
**సాగిపోవాలి తడబడకా ||హృద||**
**చ: మురళి నూదేటి కోనారి కూనా**
**ముదము కురిసేను జగములోనా**
**ఆలమందలు ఇలు చేరబోయే**
**వేగమెత్తించు కడు జాలమాయే ||హృద||**

(ఈ పాట ట్యూన్ గుర్తుందా? కలిసినప్పుడు అడిగితే, పాడి వినిపిస్తా. నెట్‌లో ఉందో లేదో తెలీదు)

ఆ చల్లని రాత్రిలో వెన్నెల మెల్లగా, మెత్తగా కురుస్తుండగా నిద్రలేని రాత్రికి ఘంటసాలగారి పాట సాక్షిగా నేను సాక్షినయ్యాను.

**"మన్ రే.. తూ కా హే నాధీర్ ధరే..**
**ఓ.. నిర్ మోహీ.."** అంటూ రాత్రికి గీతాల్ని వినిపించాను.

ఉదయం పదినుంచి పదిన్నర వరకూ టీ బ్రేక్. ఎవరి సెక్షన్‌లో వాళ్ళే టీ కాచుకుంటారు. వారానికి ఒకరికా బాధ్యతని అప్పగిస్తారు. గత నాలుగురోజులుగా ఆ పని చేస్తున్నది గుర్‌దీప్ సింగ్. టీ తయారు చెయ్యాలంటే పంజాబీలే చెయ్యాలి. అయితే స్నాక్స్ విషయంలో మాత్రం అందరికీ తలనెప్పిగానే ఉంది. 'చనా' తప్ప మరో ఐటెమ్ చెయ్యడు. తెల్లార్లూ నానబెట్టిన బెంగాలీ చనాని కావల్సినంత వరకే నీళ్ళుపోసి, బాగా ఉడికిస్తూ, దాదాపు ఉడికాక అందులో చింతపండు పిసికిన నీళ్ళుపోసి, మరో మాంచి ఉడుకు వచ్చాక, పచ్చిమిర్చీ కొద్దిగా అల్లం ముక్కలు, ఉల్లిపాయముక్కలూ, టమోటా ముక్కలు, కొద్దిగా కారం, అన్నిటినీ 'పట్టి' ఉంచడానికి ఉప్పూ ప్లస్ కొంచెం బెల్లం, పసుపూ వేసి, అది చిక్కగా అయ్యాక కిందకి దింపి, ప్లేట్స్‌లో చక్కగా ఒడ్డించి మీద కొంచెం సన్నకారప్పూసా కొత్తిమీరా జల్లి, కొన్ని పచ్చి ఉల్లిపాయముక్కలు టమోటా ముక్కలూ కూడా వేసి, స్పూనుతో లాగిస్తుంటే - అద్భుతంగా ఉందని మీరు ఒప్పుకోక తప్పదు. అదీ గురుదీప్‌లాంటి పక్కా పంజాబీ చేసిందయితే ఎవరైనా 'ఓహో' అని లొట్టలువేస్తూ తినాల్సిందే

అయితే గతనాలుగు రోజుల్నించీ గురుదీప్ ఆ వంటకాన్నే చేస్తున్నాడు. కేంటిన్‌కి వెళ్ళి కావల్సింది తినొచ్చు. కానీ ఆ అరగంట సమయాన్నీ నడకతో ఎందుకూ వృధాచెయ్యడం? అదీగాక ఉదయం ఏడున్నర నుండి పదిగంటలవరకూ హెవీ వర్క్ ఉంటుంది.

"నువ్వు రేపుకూడా ఇదే చేస్తే.. నేను దాన్ని విసిరిపారేస్తా!" డిక్లేర్ చేశాడు ఉన్ని కృష్ణన్ నాయర్.

"వహీబనావుంగా.. క్యాకరే గారే? సాలే మలయాళీ; ఇడ్లీ బనావూక్యా? ధూ.. ఓ భీ ఖానాహై?" (అదే చేస్తాను. ఏం చేస్తావోయ్? ఒరే మలయాళీ.. ఇడ్లీ చెయ్యమంటావా? అదీ ఓ తిండేనా.. ధూ..) అన్నాడు గురుదీప్ చిద్విలాసంగా. 'ఉన్ని' పళ్ళుకొరుక్కున్నాడు గానీ ఏమీ మాట్లాడలేదు. కారణం గురుదీప్ భీకరాకారం. గురుదీప్ నాతో ఫ్రెండ్లీగానే ఉంటాడు గానీ, గొప్ప పరిచయం ఏమీలేదు. వాళ్ళుండేది వేరే బులెట్‌లో. ఇద్దరూ ఒకే బులెట్‌లో ఉంటున్నా గురుదీప్‌కీ ఉన్నికీ క్షణం పడదు.

అన్నట్టు ఇప్పుడైతే ఛాట్ మసాలాలూ, గరమ్ మసాలాలూ సాచెట్స్‌లానూ పేకెట్స్ లానూ దొరుకుతున్నాయిగానీ అప్పుడు దొరికేవికావు. అంతెందుకూ, నీళ్ళకి కూడా ఖాళీ అయిన రమ్ బాటిల్స్‌ని కడిగి అందులోనే నింపుకునేవాళ్ళం. సరే పింగాణీ మిలటరీ వాటర్ బాటిల్ ఉన్నా అది 'కంపు' కొట్టేది గనక పెద్దగా వాడేవాళ్ళంకాదు. ఇప్పుడంతా ప్లాస్టిక్ మయం. ఇంతకీ గుర్‌దీప్ సంగతీ, అతని టీ బ్రేక్ వంటకం సంగతీ ఎందుకు చెప్పానంటే, దాంతో అంటే ఆ కథతో అవసరం ఉంది గనక. గురుదీప్ సింగ్ సోఢీది గురుదాస్ పూర్. పెళ్ళయిందిగానీ భార్యని ఇంకా కాపురానికి తీసుకురాలేదు.

ఆ రోజున చిత్రంగా మా బులెట్‌కి వచ్చాడు. వస్తూ వస్తూ రెండు రమ్‌బాటిల్స్ తెచ్చాడు. "క్యాహై?" అని ముజుందార్ అడిగితే, 'ఇవ్వాళ నా బర్త్‌డే నా బులెట్‌లో అయితే ఆ ఉన్నిగాడ్ని కూడా ఇన్వైట్ చెయ్యాలి. అందుకే మనసెక్షన్ వాళ్ళు ఎక్కువగా ఉన్న మీ బులెట్‌కి వచ్చాను." అన్నాడు. అనడమేగాదు.. నన్నూ ముజుందార్ నీ గొగోయ్, భట్టాచార్య బన్సల్, చౌహాన్లని కూడా ఆహ్వానించాడు. మా లెక్క ఏమిటంటే ఆరు అంగుళాల ఎత్తుండే తళతళలాడే గాజుగ్లాసులో ఓ అంగుళం రమ్ పోసి, మిగతా అయిదంగుళాల మేరా నీళ్ళతో నింపుతాం. ఆ గ్లాసుని ఓ అరగంట పాటు కొద్ది కొద్దిగా చప్పరిస్తూ పూర్తిచేస్తాం.. ఇది సిస్టమ్.

పదినిముషాల్లో 'మెహఫిల్' రెడీ.

"జనమ్‌దిన్ ముబారక్ హో!" అందరం ఛీర్స్ చెప్పాం.

"అబే పంజాబీ సాలే.. ముఝె బులాయానై?" కోపంగా మా ముందుకి వచ్చాడు ఉన్నికృష్ణన్ నాయర్. గురుదీప్ ముఖం చిన్నబోయింది.

"ఠీక్ హై! కోయీ బాత్ నహీ!. పిలవకపోయినా వచ్చా! నీ రమ్ము నేను తాగాలంటే, మొదట నేను తెచ్చింది తీసుకో!" అంటూ ఓ ఫుల్ రమ్ బాటిలూ, పాపం కేరళ నుంచి తెచ్చుకున్న అరటికాయ చిప్సూ గురుదీప్ ముందు పెట్టాడు. గురుదీప్ గభాల్న లేచి, ఉన్నిగాడ్ని కావలించుకుని బొటబొటా కన్నీళ్ళు కార్చాడు.

అదీ! మిలటరీ అంటే! అదీ.. తిట్టుకున్నా కొట్టుకున్నా కలిసిపోవడం అంటే (స్నేహానికన్న మిన్న లోకాన లేదురా అనే పాట ప్రాణస్నేహితులు సినిమాలో నేను వ్రాయగలగడానికి ఇలాంటి Insipirations ఇన్స్పిరేషన్స్ ఎన్నో ఉన్నాయి.)

అంతేగాదు.. ఉన్నికృష్ణన్ నాయర్ వస్తూ వస్తూ ట్రాన్సిస్టర్ భుజాన వేసుకుని వచ్చాడు. అది ఢిల్లీలోని ఓ హాస్పటల్లో 'నర్స్'గా పనిచేస్తున్న తన సిస్టర్ బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చిందని చెప్పి 'ఆన్' చేశాడు. ఢిల్లీ స్టేషన్ ట్యూన్ అయింది.

"బేదర్దీ బాల్ మా తుఝ్‌కో మేరామన్ యాద్ కర్ తా హై..

బరస్ తా హై జో ఆంఖోం మే ఓ సావన్ యాద్ కర్ తా హై"

అనే పాట లతగారి గొంతులోంచి సుడులు తిరుగుతూ మా బులెట్‌ని ఆక్రమించింది. ఒక్కసారి గుండె కలుక్కుమంది.

"నాకళ్ళల్లోంచి కురిసే శ్రావణ మేఘధారలు నిన్ను గుర్తుకు తెచ్చు కుంటున్నాయి - దయలేని ఓ ప్రియతమా.. నా మనసు నిన్ను మరీ మరీ గుర్తుచేసుకుంటోంది. ఓ గాలి నా పైటని ఎగరేసినప్పుడు ఆ పైటని నువ్వే నీ చేతుల్లో పట్టుకున్నావేమో అనిపిస్తుంది.. నువ్వు నా పైట చెంగును ముద్దాడావు గుర్తుందా... ఆ పైట చెంగే (ఆ మేలిముసుగు) నిన్ను గుర్తు చేసుకుంటోంది. నిర్దయతో నిండిన ప్రియుడా... ఏ కలల సరోవరపు ఒడ్డున నడిచామో, ఆ బొట్టు కరిగిపోయింది. నా మనసు నిన్ను -" అంటూ సాగే ఆ పాట నాగుండెల్ని చీల్చుకుంటూ లోతుల్లోకి చొచ్చుకుపోయింది.

అందమైన గుండ్రని భుజాల నమ్రత నా కళ్ళముందుంది.

ఆమె వెచ్చని కౌగిలి కోసం నా గుండె రోదిస్తోంది.

ప్రపంచంలోని పరిమళాలన్నింటినీ గుది గూర్చినా, నా 'నమ్ము'ఒంటి పరిమళానికి సాటిరాగలదా? ఏవీ.. ఆ వెచ్చని గుసగుసలు.. ఏవీ ఆ శిరోజాల సువాసనలు.. ఏవీ. ఆ నవ్వుల గలగలలు.. ఏవీ మంద్రంగా పలికే ఆమె పలుకుల మధురిమలూ!

విరహంలో ఇంత వేదనుందా?

విరహంలో ఇంత తీపి ఉందా?

నిజంగా చెబుతున్నా.. 'మొనాఫిల్'లో నేను పాలుపంచుకోని రోజు నాటికీ, నేటికీ, అదొక్కటే..!



"మనుషులు చేసే తప్పు ఏమిటంటే ఈ మానవ శరీరాన్ని నిర్లక్ష్యం చెయ్యడం! ఏనాడో నా గురువు శ్రీశ్రీశ్రీ ప|| ప|| బోధానందపురి మహరాజ్ వారన్నమాట గుర్తుకొచ్చింది. నా గురుపరంపరలో మొదటి గురువు మా నాయనగారైతే, జీవితానికి అర్థమూ, విశేషార్థమూ, గూఢార్థమూ, పరమార్థమూ, చెప్పింది బోధానందపురి మహరాజ్ వారు. ఆయన పుట్టింది కేరళలోని 'కాలడి' గ్రామం - శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులవారూ పుట్టింది అక్కడే మా స్వామీజీ కూడా నంబూద్రి బ్రాహ్మణ కుటుంబంలోనే పుట్టారు. ఓ కాలేజీ నాటకంలో 'సన్యాసి' వేషం వెయ్యాల్సివచ్చింది. కాషాయం కట్టుకున్నారు ఆ వేషం కోసం. నాటకం పూర్తవగానే అటు నుంచి అటే కాశీకి వెళ్ళిపోయారట. ఒక్కడే కొడుకు. లక్షల ఆస్తులు. ఆ తల్లిదండ్రుల బాధ దేవుడికెరుక. కాశీనుంచి ఇంటికి ఓ ఉత్తరం మాత్రం రాశారంట... తను

సన్యసించాననీ ఇంటికి తిరిగిరాననీ. 14 సంవత్సరాలపాటు అనేకానేక గురువుల వద్ద జ్ఞానోపార్జన చేసి, నా ఎనిమిదో ఏట మా ఊరికి వచ్చారు. ఆ తరువాత మా ఊరిలోనే ఉండిపోయారు. జీవితంలో ఏనాడూ వ్యర్థంగా ఆయన ప్రసంగించలేదు. శుష్కవాదాల్ని సమర్థించలేదు.

"దమోర్ యూ లెర్న్ సైన్స్.. ద మోర్ యూ కెన్ అండర్‌స్టాండ్ ద ఆల్మైటీ" అనేవారు. నా అదృష్టం కొద్దీ నా ఎనిమిదో ఏటనించే వారి ఆదరణ లభించడం, వారి శిష్యరికం చేసే అవకాశం కలగటం, వారు చూపిన మార్గంలో నడవడం జరిగింది.

"ఎలా స్వామీజీ?" అడిగాను. నాకు పదహారేళ్ళు.. అప్పుడు.

"ఒక మురిక్కాలువ పక్కనుంచి వెడుతున్నావనుకో.. గుండెనిండా గాలి పీల్చుకోగలవా?" అడిగారు.

"ఊహూ..! వెంటనే ముక్కు మూసుకుంటాం!" చెప్పాను.

"కదూ.! అలాగే భీకరమైన శబ్దాలు వినిపిస్తే?"

"చెవులు మూసుకుంటాం!"

"గొంగళిపురుగు మీద పడితే?"

"ఠక్కున విదిల్చి పారేస్తాం"

"పరమచేదు పదార్థాన్ని నోటికి అందిస్తే..?"

"తక్షణం ఉమ్మేస్తాం.."

"చాలా అసహ్యమైనది కనిపిస్తే"

"వెంటనే కళ్ళుమూసుకుంటాం.." చెప్పాను.

"అదే చాలా అందమైనది కనిపిస్తే" నవ్వి అడిగారు.

"కళ్ళారా చూస్తాం. దాన్నే మళ్ళీ మళ్ళీ మనసులో చూసుకుంటాం."

"మాంచి పూలతోటలో నడిస్తే?"

"గుండెనిండా గాలి పీల్చుకుంటాం.. అర్థమైంది స్వామీజీ, అలాగే పువ్వులు మీద పడుతుంటే ఆనందిస్తూ నిలబడతాం, తీయని పదార్థమైతే ఆనందంగా తింటాం, చక్కని సంగీతం వినిపిస్తే చెవులారా వింటాం..!" అన్నాను.

"దీన్ని బట్టి ఏమి అర్థమైంది? భగవంతుడు ఈ శరీరాన్ని అద్భుతమైన సౌందర్యంతో సృష్టించాడు. చెవులు చక్కని శబ్దాలే కోరుకుంటాయిగానీ ఢమఢమల్ని కాదు. నోరు మధురమైన పదార్థాలనే కోరుకుంటుందిగానీ చేదునీ రొడ్డు పులుపునీ కాదు.. అలాగే కళ్ళ సౌందర్యమైన వాటినే చూడాలనుకుంటాయిగానీ అసహ్యమైన వాటినికాదు, ముక్కు సువాసననే కోరుకుంటుంది, మొత్తం శరీరంలోని అణువణువూ చక్కని వాటినే కోరుకుంటుందిగానీ మురికినీ దుమ్మునీ కాదు." ఒక్క క్షణం ఆగారు.

"సౌందర్యాన్ని మాత్రమే స్వీకరించే ఈ శరీరాన్ని తోలుతిత్తి అని దుర్గంధపూరితమనీ అనటం ఎంత తప్పు? భగవంతుడు ప్రాణరూపంలో నివశించే ఆలయం ఈ దేహాలయం. దీన్ని ఎంత శుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోవాలి!" మళ్ళీ అన్నారు.

"పెళ్ళిచేసుకున్న మాలాంటి వాళ్ళు మీలాగా పవిత్రంగా ఎలా ఉండగలం స్వామిజీ?" ఒకాయన అడిగాడు.

"సృష్టికార్యం తప్పని నేను అనలేదే అప్పుడూ పవిత్రంగానే ఉండాలి. శరీరమూ మనస్సూ కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి" అన్నారు.



అప్పటిమాట ఇప్పుడెందుకు రాస్తున్నానంటే, స్వామీజీ ఆ రోజు చేసిన బోధ చాలాగొప్పది. శరీరంలోని ప్రతి అణువూ సౌందర్యవంతమైనదే అమ్మవారిని 'సౌందర్యలహరి' అంటాము. అమ్మవారు మనలో లేదా? సృష్టి అంతటా ఆచరించి వున్న ఆ మహాశక్తి మన శరీరాల్లో మాత్రం ఎందుకుండదూ? ఉన్నది. దేముడికోసం వెదకటం అన్నంత పిచ్చిపని ఇంకొకటి లేనేలేదు. ఏ 'శక్తి' ప్రపంచంలోని సకలజీవుల్లోనూ శ్వాసరూపంలో, ప్రాణరూపంలో, మనోరూపంలో, బుద్ధిరూపంలో, అణువణువునా నిండివున్నదో - ఆ శక్తిని గుర్తిస్తేచాలు. అందుకే చెట్టూ పుట్టా రాయీ రప్పా సర్వము కూడా మనకి దైవస్వరుపాలే. హిందూమతం అన్నది ఏనాడూలేదు. ఉన్నది హిందూ ధర్మం మాత్రమే. ఇది మాత్రం సత్యం.

మళ్ళీ శనివారం మధ్యాహ్నం కలకత్తాకి వెళ్ళాను. ముందే కార్డు వ్రాయడంతో బబులీ షియాల్దాకి వచ్చింది.

"ఎప్పుడూ దారిచూపించాల్సిందేనా? అసలు గుర్తుపెట్టుకోవా?" నవ్వుతూనే అడిగింది.

"సరే.. ఇప్పుడు దారి సరిగ్గా చూపించు. గుర్తుపెట్టుకుంటా..!" అన్నాను.

"వద్దులే.. నువ్వు రూట్ మర్చిపోతేనే మంచిది. కాసేపన్నా గైడ్‌గా ఉండే ఛాన్సు మిస్సవదు.!" నవ్వింది బబులీ.. నా భుజం మీద చెయ్యివేసి.

"ఇంతకీ నీ గాళ్‌ఫ్రెండ్ ఏమైనా ఉత్తరాలు రాసిందా? " చిలిపిగా అడిగింది.

"ఆ! షియాల్దా స్టేషన్‌లో పికప్ చేసుకోవడానికి వచ్చిన అమ్మాయిని గట్టిగా తన్నమంది. అప్పటికి గానీ ఆ పిల్ల అల్లరి తగ్గదని మరీమరీ రాసింది!" నవ్వి అన్నాను.

"మరి తన్నవేం?" కళ్ళు చికిలించి అన్నది.

"ఆ అమ్మాయి నా మార్గదర్శాయే... ఎలా శిక్షించనూ..!"

"హ..హ.. బతికిపోయావుపో! ఈ బబులీగారిని కొడితే కలకత్తా కాళి పరిగెత్తుకుంటూరాదూ.! అన్నట్టు రాజాదా, ఆమ్రపాలి గతవారంగా నన్ను తినేస్తోంది.. నువ్వు ఎప్పుడు వస్తావా అని."

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాను.

"పాటలు వినాలిట. కానీ, ఆ మాట జస్ట్ కవర్ కోసం అంటోందని నాకనిపిస్తోంది. అసలు విషయం ఇంకేదైనా ఉండాలి." నవ్వింది బబులీ.

"ఇంకేమంటుంది? అయినా ఏదో కేజువల్‌గా తప్ప ఎదురు చూసేంత పరిచయం ఆమెతో నాకెక్కడుంది? నువ్వు కొంచెం ఎక్కువగా ఊహిస్తున్నావేమో?" అన్నాను.

నడుస్తున్నది కాస్తా ఠక్కున ఆగి మరీ పకపకా నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావూ?"

"అరే పాగల్.. నేను ఆడదాన్ని. ఆ మాత్రం మరో ఆడదాని మాటలకి అర్థం గ్రహించలేనని అనుకుంటున్నావా ఆమ్రపాలి చాలా లోతుమనిషి. కావాలని పదేపదే నీ గురించి నన్నే ఎందుకు అడిగిందో తెలుసా? అది నీకోసం ఎదురుచూస్తోందనీ మరీ మరీ నిన్ను అడిగిందనీ నీకు నేను చెప్పాలని!" మళ్ళీ పకపకా నవ్వి "అది బుర్రలేనిదేం కాదు." అన్నది.

"అయితే ఆ మాట నువ్వు నాతో చెప్పలేదని ఆమెతో చెప్పు!" అన్నాను.

"ఏమే బబులీ ఈయన ఎప్పుడొస్తాడని నిన్ను ఓ పాతికసార్లయినా అడిగాను కదూ? అని, నీ ముందరే నన్ను అడుగుతుంది. కావాలంటే చూడు." మళ్ళీ నవ్వింది.

"సరే.. ఆడదాని మాటలూ చేష్టలూ మరోదానికి తెలుస్తాయన్నావు కదా.. ఉమ గురించీ, నమ్రత గురించీ నీ అభిప్రాయం ఏమిటి?" ఆగి మరీ అడిగాను.

"నువ్వు మా గ్రాండ్ మాకి చెప్పిన కథ కొంచమే. వాళ్ళమీద నీకున్న అభిప్రాయాలు, వాళ్ళు నీకు ఎలాపరిచయమైనదీ, వాళ్ళ బిహేవియర్ ఇలాంటివే ఓ ట్రాన్స్‌లో రెండుగంటలు చెప్పావుగానీ అసలు విషయం మాత్రం చెప్పలేదు!" తను ఆగి నాకళ్ళల్లోకి చూస్తూ అన్నది.

"ఏం చెప్పలేదంటావ్?" ఆశ్చర్యంగా అడిగా.

"మీ మధ్య ఫిజికల్‌గా ఉన్న రిలేషన్ గురించి. నా దృష్టిలో అయితే నీకూ నమ్రతకీ మధ్య చాలా 'హాట్‌స్టఫ్' నడిచి ఉండాలి. ఉమ నీకు చాలాచాలా పవిత్రమైనది. షీ యీజ్ యువర్ సోల్‌మేట్. కానీ గుర్తుంచుకో, సోల్‌మేట్స్ గుళ్ళో దేవతల్లాంటివారు. ఎంతందమైన వారైనా మనసుని ఎక్సైట్ చెయ్యలేరు. నిన్ను భీకరంగా ఎక్సైట్ చెయ్యగలదీ, బహుశా చేసిందీ నమ్రత ఒక్కతే.!" చాలా చిన్నగా నవ్వి నడవడం మొదలెట్టింది బబులీ. నాకు పిచ్చెక్కింది. '18ఏళ్ళ అమ్మాయిలో ఇంత మెచ్యూరిటీనా? మైగాడ్! అసలా విశ్లేషణ ఎంత బ్రీఫ్‌గా, ఎంత సూటిగా ఉంది?' ఆశ్చర్యంతో నేను అక్కడే ఆగిపోయా.

ఓ క్షణం తరువాత తను వెనక్కి తిరిగి, "కెన్ యూ వాక్ విత్ మీ..!" అని పకపకా నవ్వింది.

యవ్వనం..! భగవంతుడా యవ్వనం ఎంత అద్భుతమైనదీ! ఎంత మధురమైనదీ.! ఎంత మృదువైనదీ.!

"కమ్.. హాయిగా ఇవాళంతా నడుద్దాం..!" వెనక్కొచ్చి నా చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నది బబులీ.

"దస్విదానియా..ఫిర్ మిలేంగే..!

**ఎందుకో వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించలేదు.** అసలు బబులీ ఇచ్చిన షాక్‌లోంచి నా మనసుకోలుకోలేదు. "ఎక్సైట్‌మెంట్ గురించి ఈ పిల్ల మాట్లాడటం ఏమిటి?"

"బబులీ, కాసేపు కూర్చుందామా?" అడిగాను. నవ్వింది.

"రాజూదా... నాతో మాట్లాడాలనుకుంటున్నావు కదూ? యూ వాంట్ టూ టాక్ టూ మీ.. ఈజిట్.? యస్.. యూ కెన్ టాక్ టూ మీ ఓపెన్లీ! చోటు కావాలంటే వెనక్కి స్టేషన్ దగ్గరికే పోదాం. స్టేషన్‌కి దగ్గర్లోనే నా ఫ్రెండ్ ఇల్లుంది. అక్కడ మాట్లాడుకోవచ్చు. "వెనక్కి తిరిగి స్టేషన్ వైపే నడుస్తూ అన్నది.

"వాళ్ళేమీ అనుకోరా?" అడిగాను.

"అనుకోరు.. ఎందుకంటే ఈ సమయంలో నా ఫ్రెండ్ నిర్మల ఒక్కతే ఇంట్లో ఉంటుంది. మిగతా వాళ్ళంతా ఎవరి పనుల మీద వాళ్ళు ఉంటారు. సరే ఇంతకీ ఏం మాట్లాడాలన్నావూ?" నా భుజం మీద చెయ్యివేసి అడిగింది.

"నమ్రత ఒక్కతే ఎక్సైట్ చెయ్యగలదని అన్నావుకదా.. ఆ ఎక్సైట్‌మెంట్ గురించి నీకేం తెలుసూ?" సూటిగా అడిగాను.

పకపకా నవ్వింది బబులూ. ఎంతంటే రోడ్డు మీది పాదచారులు ఆగి ఆశ్చర్యంగా వింతగా మావంక చూసేంతగా!

"సిల్లీ క్వశ్చన్. రాజ్.. నేను 'ఆడదానిలాగా కనపడటంలేదా? లేక నాలో యవ్వనోదయం కాలేదనుకున్నావా?" కళ్ళని 'కుదించి' నావంక అల్లరిగా చూస్తూ అన్నది బబులీ. మరోషాక్. నిజమే. ఆ అమ్మాయిని ఓ చిన్నపిల్లగానే ఇప్పటివరకు అనుకున్నానే గానీ పద్దెనిమిదేళ్ళ యవ్వనవతిగా చూడనూ లేదూ, గుర్తించనూలేదు.

"ఎందుకు అంత షాక్. ఓ మాట చెప్పనా? నీలో ఓ నిర్మలత్వం ఉంది. లేకపోతే.. ఇలా... ఎందుకులే. "చిన్నగా నవ్వింది.

"అంటే?" అడిగాను.

"ఇదీ ఓ విధంగా మంచిదే నిజం చెబితే నీలో ఉన్న ఆ నిర్మలత్వంలో మంచితనమే ఉమనీ, నమ్రతనీ కూడా ఇప్పటివరకూ పవిత్రంగా ఉంచిది. ఇంకోటి కూడావుంది. నీకు సాంప్రదాయమంటే ఉన్న గౌరవం కూడా వారి పవిత్రతను కాపాడి ఉండొచ్చు."

"అంటే?" కాస్త కాస్తా అర్థం అయీ అవని స్థితిలో అన్నాను.

"అంటే అనే ప్రశ్న ఎందుకూ? నిజం చెప్పు.. ఈ ప్రశ్న ఉమ గురించి కాదూ? గ్రాండ్ మాతో నువ్వు ఉమని గురించి మాట్లాడిన ప్రతిసారీ నీ గొంతులో ఓ అనంతమైన స్నేహమాధుర్యం వినిపించింది. అదే నమ్రత గురించి చెబుతూ చాలాసార్లు ఆగిపోయావు. అంటే చాలా చాలా 'ఎడిట్' చేశావు. కారణం మా గ్రాండ్ మా ఎదుట కౌగిలింతల గురించీ, ముద్దుల గురించీ మాట్లాడలేక. ఇంకో కారణం నీలో నీకే ఓ స్పష్టత లేక."

"ఎటువంటి స్పష్టతా?" అడిగా.. నా బుర్ర తిరిగిపోతోంది.

"ఆమెని ప్రేమించిన మాట వాస్తవం. ఆమె సమక్షాన్ని ప్రతిక్షణం నువ్వు కోరుకునే మాటవాస్తవం. కానీ ఆ తీవ్రమైన కోరిక 'పెళ్ళి' గురించినది కాదు. అసలు మీ ఇద్దరి పరిచయంలోనూ 'ప్రేమ' అనేది అత్యంత సహజంగా ఏర్పడింది. ఆ ప్రేమలోంచే శారీరికమైన తీవ్రాతితీవ్రమైన మోహం కూడా అతి సహజంగానే పుట్టి ఉండాలి. అందుకే. 'పెళ్ళి' గురించిన స్పష్టమైన ఆలోచనా అవగాహనా మీ ఇద్దరిలోనూ చోటుచేసుకోలేదు!" ఓ ఇంటిని సమీపించి, గేటు తీస్తూ అన్నది బబులీ. నామనసు 'బ్లాంక్' అయిపోయింది. ఓ అందమైన మేడ. చిన్న అందమైన గార్డెన్. ఓ చిన్న ఫౌంటెయిన్ అవతల పక్కన చేపల మడుగు. ఆ మడుగు ఒడ్డునే పూర్వకాలపు సిమెంటు బెంచీలున్నాయి, బేక్ రెస్ట్‌లతో సహా.

"నిర్మల నిద్దరోతూ ఉంటుంది. మనం హాయిగా ఆ బెంచీల మీద కూర్చుని మాట్లాడుకుందాం. మాటలు పూర్తయ్యాక నిర్మల నిద్రని చెడగొడదాం!" ఓ బెంచీమీద హాయిగా కూర్చుని వెనక్కి వాలింది బబులీ.

"చెప్పు.." అన్నాను.

"అదేంటీ? మాట్లాడాలనుకున్నది నువ్వు.!" విలాసంగా నవ్వి అన్నది.

"కుముదినీ, నిజంగా నేనే ఏదేదో మాట్లాడాలనుకున్నాను. కానీ నీ విశ్లేషణ వింటుంటే, నాలో నేనే స్పష్టంగా మాట్లాడుకుంటున్నట్టుగా అనిపిస్తోంది. అందుకే.. ప్లీజ్...నువ్వే మాట్లాడు!" ఎదురుగా ఉన్న బెంచీమీద కూర్చుంటూ రిక్వస్టు చేశాను. మొత్తం ఇంటిచుట్టూ ఎత్తైన కాంపౌండ్ వాల్ ఉంది. బబులీ లేచి, "నన్ను కుముదినీ అని నా పేరుతోనే పిలిచావంటే నన్ను ఆడదానిగా గుర్తించావని అర్థం. నిస్సంకోచంగా నాపక్కన కూర్చోకుండా ఎదటి బెంచీమీద, అంటే, కొంచెం దూరంగా కూర్చున్నావంటే, నాగురించి

కూడా నువ్వు 'కొ...న్ని' (హిందీలో కు.....ఛ్') జాగ్రత్తలు తీసుకుంటున్నావని అర్థం. సవ్యమైనదైనా కాకపోయినా నా విశ్లేషణని వినాలనుకుంటున్నావంటే నా 'పరిణితి'ని గుర్తించావని అర్థం.. చూడూ.. ఇప్పుడు నేను నీ పక్కనే నిన్ను ఆనుకునే నా చేయి నీ భుజం మీద వేసి గట్టిగా నొక్కి మరీ కూర్చుంటే, నన్నూ ఒక స్నేహితురాలిగానూ, ఆత్మీయురాలిగానూ స్వీకరించమని అర్థం." అంటూ నా భుజం మీద చెయ్యివేసి పక్కనే ఆనుకుని కూర్చుంది.

చాలాసేపు మౌనం రాజ్యం చేసింది. ఎండవాలిపోతోంది. ఇద్దరం అలానే కూర్చున్నాం. "ఓకె. ఇప్పుడు చెప్పు. మీ ఇద్దరి స్నేహమూ ఎంతవరకూ ఉంది?" లేచి పకపకా నవ్వి అన్నది బబులీ.

"నవ్వెందుకూ?" ఆశ్చర్యంగా అన్నాను.

"అది నిన్ను నేను 'తెలుసు'కున్నాననే ఆనందంతో వచ్చిన నవ్వు. బోయ్.. యూ ఆర్ రియల్లీ  గుడ్ ఉమ్మైనా, నమ్రత అయినా, వేరే ఎవరైనా నిన్ను చెడిపేదాకా నువ్వు చెడనే చెడవు.. ఐ యామ్ ష్యూర్ అబౌట్ ఇట్.. పద.. కొంచెం నిర్మల 'టీ' తాగుదాం!" చేత్తో నన్ను పైకి లేపుతూ అన్నది బబులీ. తలుపు తట్టింది. నిద్రకళ్ళతో తలుపుతీసింది నిర్మల. ఓ పాతికేళ్ళు ఉండొచ్చు. పెద్దకళ్ళు సామాన్యమైన ఎత్తు. కానీ.. ఆమె చూపు అద్భుతం. ఆ చూపు మన మీద పడితే ఓ రంగురంగుల అందమైన సీతాకోక చిలుక మనమీద వాలినట్టుంటుంది.

"ప్లీజ్ కమ్" పక్కకి జరిగి దారి ఇస్తూ చిరునవ్వుతో అన్నది నిర్మల. మైగాడ్. సితార్ మీటినట్లుందా స్వరం. నడకకూడా ఓ తెల్లని పావురం గాలిలో తేలుతున్నట్లుగా, మృదువుగా ఉంది. గలగలా నన్ను నిర్మలకి పరిచయం చేసింది బబులీ.. మేము కూర్చున్నాక.

"జస్ట్‌వన్ మినిట్.." అంటూ లోపలికి వెళ్ళింది నిర్మల. "నేను కూడా వన్ మినిటే" అని నవ్వుతూ ఆమెని అనుసరించింది బబులీ. చుట్టూ చూశా. రవీంద్రనాథ్, శరత్‌చంద్ర, సుభాష్ చంద్రబోస్‌ల ఫోటోలతో పాటు గాంధీగారి వర్ణచిత్రాలూ అమర్చబడి ఉన్నాయి గోడలమీద. అది ఇల్లు కాదు.. చక్కని పూర్వకాలపు హవేలీ. కుర్చీలూ, టేబుల్సూ కూడా 'దర్జా'నీ, సాంప్రదాయాన్నీ చాటుతున్నాయి.

రెండు నిముషాల్లో నిర్మలా, బబులీ వచ్చారు. వాళ్ళ వెనకే టీ, బిస్కెట్లూ, మిక్సర్ కప్పులు ఉన్న ట్రేతో ఒక ఆమె వచ్చింది. బహుశా వంట మనిషై ఉండొచ్చు. నిర్మల బాగా చదువుకున్నది. చక్కని ఇంగ్లీషు హిందీ భాషల్లో వారి ఇంటివారి గురించీ, బబులీతో తన స్నేహం గురించీ 'పెద్దమ్మ'కున్న విశిష్టమైన వ్యక్తిత్వం గురించీ చక్కగా మాట్లాడింది. నేను హాయిగా వింటూవున్నా. కొందరు మాట్లాడేటప్పుడు వారి స్వరాన్ని వినడమే కాక వారి హావభావాల్ని గమనించాలని అనిపిస్తుంది. నిర్మల హావభావాలు అద్భుతం. సెలయేటిలో అలలమాదిరి ఆమె ముఖంలో 'ఎక్స్‌ప్రెషన్స్' సున్నితంగా మారుతూ ఉండటం తలుచుకుంటే, నాకు ఈనాటికీ ఆశ్చర్యమే.

టీ అయ్యాక స్వహస్తాలతో 'పాన్' తయారు చేసి ఇచ్చింది. చాలా ఇష్టంగా అందుకున్నాను. అది పాన్ మీద ఉన్న ఇష్టంతోకాదు. ఆమె చాలా శ్రద్ధగా చాలా సున్నితంగా 'పాన్' తయారించిన విధానాన్ని ఇష్టపడటంవల్ల. ఓ అరగంట తరవాత సెలవు తీసుకుని బయటికి వచ్చాం.

(కొందర్ని మనం జీవితంలో ఒకేసారి కలుస్తాం.. నేను నిర్మలని కలిసినట్టు. ఎన్నేళ్ళయినా ఆ ఒక్కసారి కలిగిన పరిచయాన్నీ మరిచిపోలేము. మనసులో ఎప్పుడు వారిని తలుచుకున్నా ఆ పరిచయ సుగంధం అలానే సరికొత్త పరిమళాన్ని వెదజల్లుతూనే ఉంటుంది. ఇప్పటికీ చూస్తూనే ఉంటాను.. ఎవరి మొహంలోనైనా 'ఎక్స్‌ప్రెషన్స్' అలా అలలలాగా కదులుతాయా అని. అలానే, నవ్వినపుడు ఆమె పెదవిలాగా మృదువుగా ఒంపు తిరిగే పెదవి కనిపిస్తుందా అని.)

"గ్రాండ్‌మా ఇవ్వాళ నిర్మల నవ్వుతున్నా మాట్లాడుతున్నా ఎంత 'ఇది'గా చూశాడనుకున్నావ్? ఓ ట్రాన్స్‌లో ఉన్నట్టుగా చూశాడు. ఏదో అద్భుతాన్ని 'గమనించినట్టు' గమనించాడు" నామీద అల్లరిగా కంప్లైంటు చేసింది బబులీ.

"మనుషులు చేసే తప్పేమిటంటే అద్భుతమైన ఈ మానవదేహాన్ని నిర్లక్ష్యం చెయ్యడం. సౌందర్యం వ్యక్తమయ్యేది శరీరం ద్వారానే కదా? రంగు, బరువు, ఎత్తు, శరీరపు అవయవనిర్మాణం - ఇవన్నీ సౌందర్యానికి నిర్వచనాలు కావు. బాహ్యసౌందర్యాన్ని వెల్లడిస్తాయి అంతే. అసలు సౌందర్యం అంతఃసౌందర్యానిది. అంటే మనసుది. ఒకళ్ళు బయటికి అద్భుత సౌందర్యరాశులు కావొచ్చు. వాళ్ళ మనసు నికృష్టమైనదనుకో, వారి పక్కన ఉండగలమా? నిర్మలది నిజంగా అనిర్వచనీయమైన సౌందర్యం. అందులో ఓ దైవత్వం ఉంది. అందుకే బ్యూటీ ఈజ్ గాడ్ అన్నారు." అన్నది పెద్దమ్మ.

"మరి నాలో ఏ సౌందర్యములేదా?" చిన్న బోయిన మొహంతో అన్నది బబులీ.

"నువ్వా, వెన్నెల్లో పరుగులు తీసే గంగానదివి. నీ అందంచూడాలంటే మనసుకి వెయ్యికళ్ళుండాలి" ప్రేమగా బబులీని హత్తుకుని అన్నది పెదమ్మ.

"పెద్దమ్మా.. నిర్మలని వెర్రివాడిలా చూసినమాట నిజమే. ఓ అద్భుతమైన, అనిర్వచనీయమైన అందం ఆమె శరీరం లోపలనించి బయటికి ప్రసరిస్తున్నట్టు అనిపించింది. అదీ అనంతంగా.!" అన్నాను.

"సత్యమైన మాట అది. సౌందర్యం అనేది నిజంగా ప్రసరించేది లోపలనించి బయటికి. ఇంకో విషయం ఏమంటే, సంపూర్ణ సౌందర్యం ఏనాడూ కనబడదు. మనకంటికి కనిపించేది ఎప్పుడూ రేఖామాత్రమే. సంపూర్ణ సౌందర్యాన్ని చూడాలంటే ఆత్మపరిచయంకావాలి." అన్నది పెద్దమ్మ.

నాకు తటాల్న నిర్మల పలువరుసా, నవ్వేప్పుడు వొంపు తిరిగే పెదవీ గుర్తుకొచ్చాయి. ***ఎదుటి వారిని పూర్తిగా చూస్తున్నామని మనకి అనిపించినా, కళ్ళు చూసేది మాత్రం మనిషిలోని ఒక భాగాన్ని మాత్రమే.***

"మరొకటి ఏమంటే, సౌందర్యాన్ని గుర్తించాలన్నా, ఆరాధించాలన్నా ప్రేమ అనేది ముఖ్యంగా హృదయంలో ఉండాలి. అసూయో, కోపమో అలాంటివో ఉన్నప్పుడు సౌందర్యాన్ని ఏనాడూ గుర్తించలేము" అన్నది పెద్దమ్మ.

"అలా అయితే మనిషి ఒకర్నేకాదు.. చెప్పలేనంతమందిని, లేక, లెక్కలేనంతమందిని ప్రేమించాలి.!" నవ్వి అన్నది బబులీ.

"దీనివెనుక, ప్రస్తుతం మీకు చెప్పినా అర్థంకాని ఓ నిజం ఉంది." నిట్టూర్చి అన్నది పెద్దమ్మ.

"ఇప్పుడు కాకపోవచ్చు. ఎప్పుడో ఒకప్పుడు అర్థం అవుతుందిగా.. అప్పుడు నువ్వే గుర్తొస్తావు. చెప్పు పెద్దమ్మా!" అన్నాను.

"మనం చూసే సౌందర్యం అంతా 'మనని మనం వెదుక్కునే'క్రియలోని భాగమే!" ఎటో చూస్తూ అన్నది పెద్దమ్మ.

"అంటే?" చాలా ఆత్రంగా అడిగాను.

"నాయనా, ఏ జన్మలో ఎవరికి ఎవరు ఎవరమో ఎవరికి తెలుసూ? ఉదాహరణకి నువ్వు పుట్టి బుద్దెరిగిన ఇన్నాళ్ళకి నిర్మలని చూశావు. చూడగానే మంత్రించినట్టు నిశ్చేష్టుడివైనావు. ఎందుకూ? ఆమెలో నీకు కనిపించిన అందం ఏమిటో నాకు కనిపించకపోవచ్చు. కానీ ఏదో నిన్నూ నీ హృదయాన్నీ ఆమెను చూడాలనేట్టు చేశాయి. కేవలం అది వ్యక్తమైన సౌందర్యం మాత్రమేనా? ఓయీ ఓ బొమ్మని పగలగొట్టి విసిరెయ్యి. ఆ ముక్కలు ఎక్కడెక్కడో పడిపోతాయి. మళ్ళీ ఆ ముక్కలనన్నీ ఒకచోట చేర్చాలనుకో.. ఏం జరుగుతుంది? ఒక్కొక్క ముక్కనీ గుర్తిస్తావు. జాగ్రత్త చేస్తావు. **జీవితంలో జరిగేదీ అంతే. ఎక్కడెక్కడో ఎవరిదగ్గరో ముక్కలుగా పడివున్న నిన్ను నువ్వు వెదుక్కుని ఆ ముక్కల్ని తిరిగి సంపాయించే ప్రయత్నమే జీవితం.** ఇది నీకు ఇప్పుడు

అర్ధంకాదు. కాకుండా ఉండటమే మంచిది." మాటలు ముగించి ఏదోపని ఉన్నట్టు లోపలికి వెళ్ళింది పెదమ్మ. ఆమె కళ్ళు చెమ్మగిల్లడం మాత్రం చూశాను.

"కనీసం ఇరవైసార్లన్నా మీగురించి అడిగాను. బబులీ చెప్పలేదా ?" లోపలికి వస్తునే అడిగింది ఆమ్రపాలి.

"అదీ.." నసిగాను. చెప్పిందని చెప్పాలో చెప్పలేదని చెప్పాలో నాకు అర్ధంకాలేదు. లోపలికి వచ్చిన బబులీ పకపకానవ్వింది.

"ఈ మాట నువ్వే అడుగుతావని కూడా చెప్పాను. వచ్చాడని నీతో చెప్పేదాన్నే కానీ, తెలుసుగా మా గ్రాండ్‌మా చెప్పే మాటలంటే మనం అశ్రద్ధ చూపిస్తాం. ఇతనికి మాత్రం అవి అమృతగుళికలు."

"బట్ షీయీజ్ ఎగ్రేట్ విమెన్.. ఇంతకీ హౌ ఆర్ యూ...?" రిలాక్స్‌డ్‌గా కూర్చుని అన్నది ఆమ్రపాలి.

"ఎప్పుడొస్తాడని అన్నిసార్లు అడిగావుగా. వచ్చాక కుశలప్రశ్నలు తప్ప అసలు విషయం మాట్లాడవేం?" టీజ్ చేసింది బబులీ.

"ఓ.కె. నా విషయాలు ఏవో నేను అతనితో మాట్లాడాలనుకున్నాను. అయితే పర్సనల్‌గా మాట్లాడాలి." సూటిగా బబులీని చూస్తూ అన్నది ఆమ్రపాలి.

"ఏం? నేనూ నీ ఫ్రెండ్‌నేగా. నేనుండగా మాట్లాడకూడదా?" కొంచెం చిన్నబుచ్చుకుని అన్నది బబులీ.

"అలా ఏం లేదు బబులీ..! నీకైతే నీ గురించి ఆలోచించేవాళ్ళున్నారు. ఓ విధంగా చెప్పాలంటే నేను ఒంటరిదాన్ని. కొన్ని కొన్ని విషయాలు ఏ ఆడదైనా మగవాళ్ళతో మాత్రమే పంచుకోగలదు." బబులీ చెయ్యిపట్టుకుని అనునయంగా అన్నది ఆమ్రపాలి.

"నీ బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడుగా.. అతనితో నీ మనసు విప్పి మాట్లాడుకోవచ్చుగా?" అన్నది బబులీ. ఇద్దరి మాటలూ వింటున్న నాకు నవ్వొచ్చింది. కారణం బబులీలో ఉన్న 'చిన్న' పొజెసివ్‌నెస్.

"అతనా? అవును బాయ్‌ఫ్రెండ్ కానీ ఫ్రెండ్ కాదు. ఎనీవే.. టైం కుదరాలిగా. కుదిరినపుడు నువ్వూ ఉందు గానిలే." కొంచెం నిరుత్సాహం ధ్వనించింది ఆమ్రపాలి గొంతులో.

"ఓకె. అది బాగుంది. టైమ్ ఎనిమిదిన్నర. అదిగో పైన నక్షత్రాలు ఆకలితో విలవిలలాడుతున్నాయి. మడుగులో కప్పలు వర్షం కోసం బెకబెకలాడుతున్నాయి. ఎవర్నో తలుచుకుని రాజూదా కన్నులు మిలమిలలాడుతున్నాయి. పర్సనల్‌గా మాట్లాడదామనుకుని వస్తే ఈ బబులీ మధ్యలో సైంధవుడిలా అడ్డుపడిందని మా ఆమ్రపాలి ముక్కులు రుసరుసలాడుతున్నాయి.... పాపం బబులీ మాత్రం ఏం చేస్తుందీ... గ్రాండ్‌మా పెట్టింది నోరు మూసుకుని తినేసి పడుకోకా!" విచారంగా మొహం పెట్టి చిలిపిగా కళ్ళు చికిలించి అన్నది బబులీ.

"హూ.! పాపం బబులీ ఏం చేస్తుందీ?" బబులీని ఇమిటేట్ చేస్తూ అన్నది ఆమ్రపాలి. భోజనాలయ్యాక రాత్రి చాలాసేపు నిద్రపోలేకపోయాను.

***ఆదివారం:***

"గంగూలీగారింట్లో ఇవాళ 'టంబోలా' ఉంది. సరదాగా పోదామా? గత మూడు వారాలనుంచీ 'స్నోబాల్' ఎవరికీ రాలేదు. లక్ తిరిగితే అయిదువందలు. పోదాం గెలుచుకుందాం!" ఎనౌన్స్‌మెంట్ స్టయిల్లో అన్నది బబులీ.

నాకయితే వెళ్ళాలనిలేదు.

"పోయిరా! ఆటాపాటా ఉంటేనే యవ్వనం.!" టీ ఇస్తూ నవ్వింది పెద్దమ్మ. ఎర్‌ఫోర్స్‌లో కూడా ఆదివారాల్లో సరదాగా టంబోలా ఆడతాం.

జనాలు చాలామంది ఉన్నారు. అందరు బెంగాలీల్లాగే, గంగూలీగారు కూడా బంధుప్రియుడు. టీలూ, బిస్కెట్లూ, రసగుల్లాలూ, 'రసిక్ లాల్' వక్కపొడితో సహా ఏర్పాట్లు ఆర్భాటంగా ఉన్నాయి. మాతో ఆమ్రపాలి కూడా వొచ్చింది. నన్ను పరిచయం చేసింది బబులీ. గంగూలీగారు చాలా ఆనందపడ్డారు. చాలా ఏళ్ళక్రితం ఆయన మద్రాసులో ఒక వారమూ, వైజాగ్‌లో ఓ పదిహేనురోజులూ ఉన్నారట. ఆ రోజులు గుర్తుచేసుకుంటూ పదే పదే నా చేతుల్ని ఆప్యాయంగా పట్టుకున్నాడు.

మొదటి మూడు గేములూ ఒక్కలైను కూడా కంప్లీట్ కాలేదు. నాలుగో గేమ్‌లో మాత్రం వరసగా మూడు లైన్సు అంటే ఫుల్ హౌస్ నేనే గెల్చుకున్నా. స్నో బాల్ కూడా నాకే దక్కింది. మొత్తం 18 నంబర్లు తీశారు. అదో పెద్ద రికార్డే 15 అవుటాఫ్ 18. బబులీ ఉత్సాహం చెప్పనలవికాదు. ఆమ్రపాలి ఆనందమూ అంతే. అవాళ నాకు వచ్చింది ఐదువందల యాభై ఆరు రూపాయలు.

"పెద్దమ్మా.. వెళ్ళనన్నాను.. కానీ సరదాగా వెళ్ళరమ్మన్నావు. ఇదిగో, ఇంత డబ్బు గెలుచుకుని వచ్చాను. " అన్నాను.

"అదే మరి ప్రాప్తం అంటే.. నీకు రావాల్సినది నీకు దక్కితీరుతుంది. నీదికానిది ఎంత మొరపెట్టినా నీకు దక్కదు." నవ్వి అన్నది. ఈ సిద్ధాంతం భారతీయుల రక్తంలోనే ఉందనుకుంటాను.

"ప్రయత్నిస్తే సాధించలేనిది లేదంటారు. నీమాట ప్రకారం అయితే, వచ్చిన దానితో తృప్తిపడాలేగానీ, లేనిదానికోసం పోరాటం మానుకుంటారు జనాలు." కొంచెం హాస్యం ధ్వనించింది ఆమ్రపాలి స్వరంలో.

"ప్రయత్నం చెయ్యకూడదనో, రికామీగా కూర్చోవాలనో నేను అనలేదే ప్రయత్నం తప్పకుండా చెయ్యాల్సిందే సాధించడం కోసం సర్వాన్నీ ఒడ్డుకోవాల్సిందే అప్పటికీ దక్కకపోతే, 'ప్రాప్తంలేదు' అని మరో క్రియలో నిమగ్నం కావాలేగానీ 'దక్కలేదు' అనే నిరాశలో మునగకూడదు. భగవద్గీతలో 'కర్మణ్యేవాధికారస్తే' శ్లోకం చెప్పేది అదే" స్పష్టంగానూ మెల్లగానూ అన్నది పెద్దమ్మ.

మధ్యాహ్నంగా బజారుకి వెళ్ళి 120రూపాయల పెద్దవాళ్ళు కట్టుకునే చీర, బబులీకి 60 రూపాయలతో చుడీదార్ సెట్, ఆమ్రపాలికి 10రూపాయలతో పెర్‌ఫ్యూమ్ సెట్ కొన్నాను. పెద్దమ్మ కోప్పడిందికానీ, నేను తీసుకోమని బ్రతిమలాడాను. రెఫ్యూజీలకి సహాయకార్యక్రమాల నిమిత్తం లోకల్ కమిటీ వాళ్ళ ఫండ్ కలెక్షన్ కోసం వచ్చారు. 58 రూపాయలు, అంటే అర్ధనూట పదహార్లు రెఫ్యూజీ రిలీఫ్ ఫండ్‌కి  ఇచ్చాను.

"మరి నువ్వేం కొనుక్కోవా?" అన్నారు బబులీ, ఆమ్రపాలీ.

"ఏదీ కొనాల్సిన అవసరం లేదుగా.!" అన్నాను. అన్నట్టు ఆరోజుల్లో నా జీతం 120 రూపాయలు. ఇంటికి 80 రూపాయలు పంపి మిగతా నలభైలో హేపీగా ఉండేవాడిని. నాకింకా జ్ఞాపకం, ఉషా టేబుల్ ఫేన్ 65 రూపాయలు.. మా కేంటిన్లో డాల్డా 4 కేజీలు 12రూపాయలు. అన్నట్టు మా భోజనం వసతీ అన్నీ ఏర్‌ఫోర్స్ చూసుకునేది. లీవ్‌లో వెళ్ళినా రావడానికీ పోవడానికీ ఫ్రీ రైల్వే వారంట్ ఇచ్చేవారు.

ఆదివారమంతా హాయిగా గడిచింది. మళ్ళీ నేను వద్దన్నా నాకోసం పెద్దమ్మ పూరీ, బంగాళాదుంప కూరా వేడిగా కొంత హల్వా పేక్ చేశారు. ఇప్పుడు తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఎప్పటి బంధం అదీ! నన్ను వారింట్లో స్వంత మెంబర్‌లాగా చూసుకున్నారు. ఎక్కడి ఆంధ్రా ఎక్కడ బెంగాల్... నేను ఏర్‌ఫోర్స్‌లో చేరకపోతే వారందరూ పరిచయమయ్యేవారుకాదు.

ఆ రోజుల్లో అల్లుకుపోవడమేగానీ 'ఆలోచన' తక్కువ. జీవితం అంత సహజంగా అంత స్వచ్ఛంగా గడిచేది. ఈరోజు ఎవరైనా ఎవరింట్లోనయినా మనని అలా ఉంచుకోగలరా? అసలు మనం కూడా నిస్సందేహంగా ఉండగలమా? ఇప్పుడంతా భయం భయం.

ఎవరెవరో ఏమిటో అనే సందేహం. గాడి చిన్నప్పుడు "అయ్యో లాస్ట్ బస్సు తప్పిపోయింది.. ఇవాళ కాస్త తలదాచుకోవడానికి చోటిస్తారా" అని చాలామంది మా నాన్నగారిని అడిగేవారు.

"దానికేవుంది!" అనడమే కాకుండా, భోజనం పెట్టి కప్పుకోవడానికి దుప్పటీ, తలదిండూ, చాపా ఇచ్చి మా పేద్ద పేద్ద అరుగులమీద పడుకోమనేవారు. అరుగుపైన కూడా 'కప్పు' ఉండేది గనక వర్షం వచ్చినా అతిథులు తడిసిపోరన్నమాట.

నమ్మకం. అదీ ఆనాడు మనుషులమధ్య ఉన్నది. మరి ఇవాళ ఆలా చోటివ్వగలమా? ఎవడు దొంగో, ఎవరు టెర్రరిస్టో, ఎవడు కిడ్నాపరో ఎవరికి తెలుసూ?

'నీ నమ్మకమే నీ దైవం' అంటారు. మనిషికీ మనిషికీ మధ్యన 'నమ్మకం' అనే వారధి లేనప్పుడు లోకంలో మానవత్వం ఎలా నిలబడుతుందీ? బయలుదేరాల్సిన టైమప్పుడు, "బేటా, మా కుటుంబంలో నువ్వూ ఒకడివి అయిపోయావు. మళ్ళీ వచ్చేవారందాకా 'బిడ్డ' ఎక్కడో ఉద్యోగంలో ఉన్నాడని సరిపెట్టుకుంటా. ప్రశాంతో దూరంగా ఉన్నలోటు, నువ్వు దగ్గరవడంతో తీరుతోంది. " బుగ్గలు పుణికి అన్నది పెద్దమ్మ.

"అవును.. మళ్ళీ నువ్వొచ్చేదాకా నాకూ ఏమీ తోచడంలేదు ." చెయ్యిపట్టుకుని అన్నది బబులీ.

"ఓకె. నెక్స్ట్ శనివారం మాత్రం కనీసం గంట టైం నాకోసం కేటాయించాలి. రియల్లీ ఐ వాంట్ టు టాక్ టు యు" అన్నది ఆమ్రపాలి.

పియాల్ దా స్టేషన్ సమీపిస్తున్నప్పుడు నిర్మల వాళ్ళ ఇంటివైపు చూశాను. చాలామంది మనుషులున్నారు.

"నౌకర్లే పదిమంది ఉన్నారు. ఇహ మావగారూ, బావగార్లూ, మరుదులూ వాళ్ళ పిల్లలూ పెళ్ళాలూ అంతా ఆదివారం ఇక్కడే ఉంటారు. ఈ హవేలీ వెనకవైపున మరో పేద్ద హవేలీ ఉంది!" నన్నే గమనించిన బబులీ నా వీపు మీద చరిచి అన్నది. నేను నవ్వి ఊరుకున్నాను.

"నిజం చెప్పు.. నిర్మలని మళ్ళీ చూడాలని ఉందికదూ?" అన్నది.

"బబులీ.., కొందరి సౌందర్యం నిశ్చేష్టతకి గురిచేస్తే, కొందరి సౌందర్యం అనురాగాన్ని వెదజల్లుతుంది. పెద్దమ్మ అన్నట్టు నువ్వు నిజంగా వెన్నెల్లో ఉరకలు వేసే గంగవే! " బబులీ చేతిని నొక్కి అన్నాను.

"ఉత్తినే అంటున్నావు కదూ.?" కళ్ళల్లోకి చూసి అన్నది బబులీ.

"గాడ్ ప్రామీస్" నెత్తిమీద చెయ్యి పెట్టుకుని అన్నాను.

"అయితే థాంక్స్!" గట్టిగా నా చెయ్యి పట్టుకుని తన తలని నా భుజానికి తగిలించి తృప్తిగా అన్నది బబులీ.

లోకల్ ట్రైన్ సిద్ధంగా ఉంది.

"తొందరగా వచ్చెయ్.!" బబులీ గొంతు ట్రైన్ సౌండ్‌లో కూడా క్లియర్‌గా వినిపించింది.

**మనసుకి బాధ** కలిగితే కళ్ళెందుకు ఏడుస్తాయీ? గుండె ఎందుకంత వేగంగా కొట్టుకుంటుందీ? ఎంతో కోరుకున్నది నిజమై కళ్ళముందు నిలిస్తే ఒక్కోసారి 'ఎందుకు కోరుకున్నానూ?' అనే చికాకు ఎందుకొస్తుందీ? చిత్రమేమంటే జరిగింది అదే ప్రమోషన్ ట్రైనింగ్ మీద పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చాయి. నెలరోజులు టైమిచ్చారు. ఆ ట్రైనింగైతే జీతం పెరుగుతుంది. కానీ మనసులో ఏదో బాధ. కలకత్తాని విడిచిపోవాలని లేదు. కానీ విడవక తప్పదు.

నిన్ననే బబులీ నన్ను స్టేషన్ లో దింపి 'త్వరగా వచ్చెయ్' అన్నది. ఇవ్వాళ పొద్దున్నే పోస్టింగ్ ఆర్డర్స్ అందుకోవాల్సి వచ్చింది.

"ఏ నిముషం ఎక్కడుండాలో, ఎవరితో ఉండాలో, ఏం తినాలో, ఏం మాట్లాడాలో అన్నీ నిర్ణయింపబడే ఉంటాయి. ఆ విషయం మనకి తెలీకపోవడాన్నే 'మాయ' అంటారు!" అన్న పెద్దమ్మ మాటలు గుర్తొచ్చాయి.

"కంగ్రాట్స్... నువ్వు చాలా లక్కీ రాజా భాయ్.!" మనఃస్ఫూర్తిగా అన్నాడు మజుందార్. క్లియరెన్స్ మొదలుపెట్టాను. (అన్ని సెక్షన్లకీ వెళ్ళి వారి దగ్గర నుంచి సంతకాలు తీసుకోవాలి.. 'ట్రాన్సెక్షన్లేమి మిగులు' లేవని. ) రిలాక్స్ కావొచ్చు. ఆ శనివారం హాలీడే శుక్రవారం సాయంకాలమే కలకత్తా వెళ్ళాను.

విషయం చెప్పగానే పెద్దమ్మ సైలెంటైపోయింది. బబులీ తలవొంచి నేలచూపులు చూస్తూ కూర్చుంది. ఆమ్రపాలి మాత్రం నవ్వడానికో చిన్న ప్రయత్నం చేసి, "కలిసేది విడిపోవడానికీ, విడిపోయేది మళ్ళీ కలవడానికే అయితే ఆ కలవబోయేది ఎవరో ఎప్పుడో మాత్రం తెలిసింది పైవాడికే" అనే అర్థం వచ్చే 'గజల్' చదివింది. (ఓ అరగంట పాటు నృత్యం చేసిన నిశ్శబ్దం ఇప్పటికీ గుండెని పిండుతూనే ఉంది.)

"సరే బిడ్డా.. భగవంతుడి ఇచ్ఛ అదే అనుకుందాం. ఉద్యోగం అన్నాక ఊళ్ళు తిరక్క తప్పదుగదా. ఓ.కె. నిరాశలో మునిగే కంటే, మళ్ళీ నువ్వు త్వరలోనే ట్రైనింగ్ దిగ్విజయంగా పూర్తి చేసుకుని వస్తావనే ఆశతో ఉండటం బలాన్ని ఇస్తుంది. సరే.. చెప్పు... ఏం చెయ్యమంటావో, మా బెంగాలీ పల్లెటూరి వంటలు చెయ్యనా?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నది పెద్దమ్మ.

"నువ్వుండగలవు. నేనూ..?" గభాల్న లేచి పెద్దమ్మతో అని నా పక్కన కూర్చుని నన్ను కౌగిలించుకుంది బబులీ. కళ్ళల్లోంచి నీళ్ళుధారగా కారుతున్నాయి. దగ్గరికి తీసుకున్నాను. ఏడుస్తోంది.

పెద్దమ్మ చిన్నగా నిట్టూర్చి, "రాజా.. ఈ ఇంట్లో ఈ ముసలి ప్రాణం తప్ప, దాని మనసుకి దగ్గరైన వాళ్ళెవరూ లేరు. పిచ్చిపిల్ల. దానికి వాళ్ళ అన్న అంటే ఎంతో ఇష్టం. కానీ నీ దగ్గరున్నంత చనువు వాడి దగ్గరలేదు." అని వంటగదిలోకి వెళ్ళింది. బబులీ కళ్ళు తుడిచే ప్రయత్నం చేస్తే తను మరింత గట్టిగా గుండెల్లోకి దూరింది. ఆమ్రపాలి వంక చూశాను. చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో నిరుత్సాహమూ బాధ,

"నేనేదో నీకు చెబుదామనుకున్నాను. కానీ, ట్రాన్స్‌ఫర్ అయిందన్న నీ మాట విన్నాక ఏం చెప్పాలో కూడా మర్చిపోయాను." సిన్సియర్‌గా అన్నది ఆమ్రపాలి ఓ నిముషం తరవాత.

"బబులీ.. చలో.. ఇంకా ఇరవై ఆరోజులు టైముంది. అంతేకాదు, సంవత్సరానికి రెండు నెలలు యాన్యువల్ లీవూ, నెల కేజువల్ లీవూ ఉంటాయి. ఎప్పుడైనా వచ్చేస్తా. సరేనా? గెటప్.." వీపు నిమిరి చెప్పాను. మెల్లగా తల ఊపి కళ్ళు తుడుచుకుంటూ లేచింది. కళ్ళు బాగా ఎర్రబడ్డాయి. లోపలికి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది.

"ఈ దేశంలో స్త్రీలు పడుతున్న అవస్థలు బహుశా ఏ దేశంలోనూ పడరేమో!" అన్నది సుమిత్రా సాహా. సుమిత్ర వాళ్ళు పెద్దమ్మకి చుట్టాలు. వరసకి చెల్లెలి కూతురు. శనివారం పొద్దున్న చుట్టపు చూపుగా వాళ్ళొస్తే పరిచయం చేసింది పెద్దమ్మ. మధ్యాహ్నం భోజనాలయ్యాయి. నిన్నటి బాధ చాలావరకూ తగ్గింది. అందుకే అంటారు, కాలం మాన్పని గాయం ఉండదని.

"ముస్లిమ్ దేశాల్లో ఈ మాత్రం స్వాతంత్ర్యం కూడా లేదుగా.!" అన్నది ఆమ్రపాలి.

"లోకంలో ఎక్కడయినా స్త్రీని 'భోగ్యవస్తువు'గానే పరిగణిస్తున్నారు. మనదేశంలో ఉన్నన్ని అమ్మవారి ఆలయాలు ప్రపంచంలో ఎక్కడా ఉండవు. అలాగే ఇక్కడి స్త్రీల దౌర్భాగ్యం కూడా ఎక్కడా ఉండదు!" నిట్టూర్చింది పెద్దమ్మ. ఓక్షణం నిశ్శబ్దం రాజ్యమేలింది.

"పెద్దమ్మా... మా అమ్మ అంటూ ఉంటుంది.. ఆడదానికి విశ్రాంతి రెండుసార్లే జీవితంలో లభిస్తుందని. ఒకటి తల్లి కడుపులో ఉన్నప్పుడూ, రెండోది నేలతల్లి కడుపులోకి వెళ్ళినప్పుడు అని." అన్నాను.

"నిజం నాయనా.. నిజం. ఇదిగో ఈ బబులీ, ఆమ్రపాలీ, వీరి వయసు ఆడపిల్లలూ మాతోటి పోలిస్తే కోటిరెట్లు అదృష్టవంతులు. నీకో విషయం చెప్పనా రాజూ, మనుషుల్లోనూ దేవతలు ఉంటారు.. మా రాజారామ మోహన్‌రాయలా. 'సతి' అనే క్రూరాతి క్రూరమైన సంస్కృతికి మంగళం పాడించిన మహానుభావుడాయన." రెండు చేతులూ ఎత్తి దండం పెడుతూ అన్నది పెద్దమ్మ.

"మీరు 'సతి'ని చూశారా?" ఆశ్చర్యంగా అడిగా.

"ఆ! నా చిన్నతనంలో మా దూరపు బంధువు ఒకావిడ 'సతి' అయింది. అలా 'అయింది అనేకంటే, 'మార్చబడింది' అనడం సబబు! " ఓ సుదీర్ఘమైన నిట్టూర్పు. ఎన్ని జ్ఞాపకాల మరుగునుందో.. ఆ 'సతి' జ్ఞాపకం.

"ఎలా?" అడిగాను కుతూహలంగా.

"భర్త పోతే భార్య ఏడుస్తుది.. బాధతో. అదే దుర్మార్గుడైన భర్తపోతే? పరగణాల్లో ఉన్న ఆ దూరపు బంధువు నాకు వరుసకి పిన్ని అవుతుంది. నాకు మహా ఉంటే పన్నెండేళ్ళుంటాయి. తనకి ఇరవై ఆరు. ఆవిడ భర్త, అంటే నాకు బాబాయి వరస వాడు మహా ఛండాలుడు. వాడికి లేని అలవాటు లేదు. ఎవడో బుర్రపగలగొట్టి చంపేశాడుట. ఆ మాట బయటికి రాకుండా, చెట్టుమీద నించి కింద పడితే బుర్ర పగిలిందని మా చుట్టాలే సత్యాన్ని సమాధి చేశారు. సరే, ఆ మరణం సంగతి మా పిన్నికి తెలిసి పడీ పడీ నవ్విందిట. కారణం 'మొగుడు' అనే దరిద్రం తొలిగి పోయినందుకు." ఓ క్షణం ఆగింది పెద్దమ్మ.

"నిజమేగా.. మంచిమనిషైతే మొగుడ్ని దేవుళ్ళా చూడొచ్చు.. వాడు వెధవైతే చెప్పేదేముందీ?" అన్నది సుమిత్ర.

"ఆ నవ్వడం అత్తగారు చూసింది. ఎంత వెధవైనా కొడుకంటే తల్లులకి ప్రాణమేగా! అంతే. ఆ తరువాత జరిగిన కథ ఘోరాతిఘోరం!" సైలెంటైంది పెద్దమ్మ. "అప్పటికే నువ్వక్కడ ఉన్నావా గ్రాండ్ మా?" అడిగింది బబులీ.

"ఉన్నా.. అక్కడికి దగ్గర ఊళ్ళో అంటే ఓ ఇరవై మైళ్ళ దూరంలో ఓ పెళ్ళి ఇంట్లో ఉన్నాం. కబురందగానే వెళ్ళాము. నేను పిన్ని దగ్గరికెళ్ళాను. అప్పటికే ఆమెకి బలవంతంగా తాగించారు. 'వీళ్ళు నన్ను బతికుండగానే తగలేస్తారే అలొకికా... పైకి 'సతి' అంటారు. నేను చచ్చాక ఈ ఊరి జనం పూజలూ చేస్తారు.. ఒసే తల్లీ.. చచ్చినా పో కానీ, పెళ్ళిచేసుకోకు.!" అంటూ అరవడం మొదలు పెట్టింది. పిన్ని అత్తగారు మళ్ళీ వచ్చింది వాళ్ళాయనతో. నన్నూ మా వాళ్ళనీ పక్కింటికి పంపారు. గంట తరువాత చూస్తే ఇంత బొట్టు బెంగాలీ పట్టు చీరలో పూలతో ఉంది మా పిన్ని. తెగతాగించారేమో.. కళ్ళు కూడా తెరవలేని స్థితిలో ఉంది. దేవుడా.. ఆ స్థితిలోనే ఆమెని భర్త శవం మీద పడుకోబెట్టి 'చితి' అంటించారంట!" పెద్దమ్మ కళ్ళల్లోంచి నీళ్ళు.

నిర్ఘాంతపోయాను.

ఎంత దౌర్భాగ్యం. నా గొంతు మూగబోయింది.

"ఇన్నిన్ని ధర్మసూత్రాలూ ఇన్నిన్ని నీతివాక్యాలూ వల్లిస్తారే... ఆడదాన్ని 'మనిషి'గా గుర్తించని ఈ సమాజాన్ని ఏం చేస్తే బాగుపడుతుందీ? ఆడదానికి అడుగడుగునా అవమానమే. ఆడదానిమీద అందరికీ అనుమానమే. ఒక ఆడదానికి మరో ఆడది చేసే ద్రోహం లోకంలో ఏ మగాడూ చెయ్యలేడు. దేవుడా.. అసలు నువ్వంటూ ఉంటే ఇలాంటి దౌర్భాగ్యాన్ని చూస్తూకూడా ఎందుకు ఊరుకున్నావూ?"

ఆ వృద్ధురాలి వేదన కళ్ళల్లోంచి కన్నీరుగా ప్రవహిస్తోంది. చాలాసేపు అందరం మౌనంగానే ఉన్నాం.

"రాజూ. ఆ క్షణం నుంచీ నేను నిర్ణయించుకున్నది ఒక్కటే, చదవాలి.. ఇంకా ఇంకా చదవాలి. నేనూ బ్రహ్మసామాజికురాలనయ్యాను. నాకు తోచిన పద్ధతిలో 'సతి'ని అరికట్టాలనీ, బాల్యవివాహాల్ని నిషేధించాలనీ ప్రయత్నించాను. చిత్రం ఏమంటే కట్టుబాటుకి నేను తలవొంచక తప్పలేదు. అయితే నా అత్తారింటి వాళ్ళు గొప్పవాళ్ళు. స్త్రీని స్త్రీగా గౌరవించినవాళ్ళు. అందుకే చదువుకోగలిగాను. సరే... ఏవేవో నాకు తోచిన విధంగా చేశాను. అవన్నీ చెప్పుకోవడం స్వోత్కర్ష అవుతుంది. ఇప్పటికీ అప్పటికీ మార్పు ఉన్నదా సమాజంలో అంటే, ఉంది. కానీ ఆడదాని నుదుటి రాతమాత్రం మారలేదు. అప్పటి కష్టాలు ఒక రకమైనవైతే ఇప్పటి కష్టాలు వేరేరకంవి." గాఢంగా నిట్టూర్చి అన్నది పెద్దమ్మ.

"అవును.. ఓ పక్క ఉద్యోగం.. మరో పక్క సంసారం అవిగాక పిల్లల చదువులూ వీటన్నిటితో స్త్రీకి క్షణం తీరిక ఉండటంలేదు. నాటి భర్తల పైశాచికం ఒక రకమైతే నేటి భర్తల సాధింపులు మరో రకం. ఎంత చదువుకున్నా అత్తగార్లు కూడా అత్తగార్లలానే అధారిటీ చలాయిస్తున్నారుగానీ, ఆడదానిలా ఆదరించడంలేదు, అంతా.. ఇదిగో ఈ నుదుటి రాత.. అంతే!" నిట్టూర్చింది సుమిత్ర.

"అత్తా... నీది లవ్‌మేరేజి కదా.. నీకూ...?" ప్రశ్నని మధ్యలోనే ఆపింది బబులీ. "కుముదినీ.., ప్రేమవేరు. ప్రేమకి బాధ్యతలుండవు. అందుకే స్వీట్‌గా ఉంటుంది. పెళ్ళి అయిన మరుక్షణమే అర్థమౌతుంది - పెళ్ళితో బాధ్యతల బరువు మొదలవుతుందని. ఎప్పుడైతే బాధ్యతలు నెత్తినపడ్డాయో ఆ క్షణం నించే ఒకరిలోని లోపాలు మరొకరికి కనిపించడం మొదలవుతాయి. ఇంకేముందీ? ప్రేమాగీమా గాలికి కొట్టుకుపోయి మొగుడూ, పెళ్ళాల గొడవలు మొదలవుతాయి. 'మనం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం' అనే విషయం మనకే గుర్తుండదు!" నిర్వేదంగా నవ్వింది సుమిత్ర.

"మీవైపు కూడా ఇలానే ఉంటుందా?" నన్ను చూస్తూ అడిగింది సుమిత్ర. 'సతి'లాంటి ఘోరాలు మావైపు తక్కువేగానీ, బాల్యవివాహాలవల్ల చిన్నవయసులోనే, ముసలిభర్తల్ని పోగొట్టుకుని నానా కష్టాలుపడే బాలవిధవల పాట్లు మాత్రం చాలా చూశాను. ఒక కాలంనాడైతే పెద్దమనిషి కాకముందే పిల్లకి పెళ్ళి చేసి తీరాలనే దరిద్రపు సాంప్రదాయం ఉండేది. ఇక్కడ రాజారామ మోహనరాయ్‌లా అక్కడ వీరేశలింగం పంతులుగారు ఎంతో కృషి చేసి ఇంత మార్పు తేగలిగారు. విధవా వివాహాల్ని కూడా జరిపించారు. ఆయన సాంఘిక సంస్కర్తే కాదు గొప్ప రచయిత. అలాగే అచ్చ తెనుగు గ్రాంధికాన్ని పక్కన పెట్టిన మా గురజాడ అప్పారావుగారు కూడా 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' అనే అద్భుత రచనలో బాల్య వివాహాన్ని నిరసించారు." ఇలా చాలాసేపు మాట్లాడాను. నిజం చెబితే, గురజాడవారి గొప్పదనమూ, గిడుగువారి గొప్పదనమూ కూడా నాకు పూర్తిగా అవగాహన కాలేదు.... ఆ రోజుల్లో. బుక్కిష్ నాలెడ్జి కంటే తక్కువ.

అప్పుడొచ్చింది అసలు చర్చ.

"మా వంగ భూమిలో దొరికిన వజ్రం శరత్ చంద్ర. ఆయన రచనల్లోని స్త్రీ పాత్రలు బెంగాల్లో పుట్టిన ప్రతి స్త్రీకి ఎంతో ఉత్తేజాన్ని కలిగించాయి. ఆ రచనలు చదివిన ఎందరో స్త్రీలు తమ అస్తిత్వాన్ని తామే ప్రశ్నించుకుని, ఎదిగే ప్రయత్నం చేశారనడంలో అతిశయోక్తిలేదు.!" అన్నారు పెద్దమ్మ. 'చలం' సాహిత్యం గురించి కూడా నేను కొంత మాట్లాడాను.

నాకొక్కమాట అప్పుడు అర్థమైంది. ఏ రచన చేసినా, ఆ రచనలో స్త్రీ పాత్రల్ని ఉదాత్తంగా మలచాలనీ, తద్వారా స్త్రీలలో కొంత ఆలోచనను రేకెత్తించాలనీ. ఇప్పుడు మళ్ళీ శరత్ సాహిత్యాన్ని చదివితే మనకి అర్థమయ్యేది అదే ఓ సావిత్రి ఓ సవిత ఓ రాజ్యలక్ష్మి ఓ హిరణ్మయి ఓ "పశు", ఓ శుభద ఓ శివానీ అని పిలవబడే కమల ఎవరినైనా చూడండి, వారంతా ఓ అద్భుతమైన వ్యక్తిత్వమున్నవారే.

నాకు తెలిసి నా జీవితంలో నాకు మార్గదర్శకులైనా, నాకు స్ఫూర్తి కలిగించిన వారైనా, నన్ను 'నడిపించిన' వారైనా - స్త్రీలే, ఆఖరికి ఆధ్యాత్మిక విషయాల్లోనైనా నాకు దారిచూపింది స్త్రీలే. నిజమైన స్నేహపరిమళాన్ని పొందింది కూడా స్త్రీలనించే.

అలాగని నాకు ఫ్రెండ్స్ లేరనికాదు. ఏర్‌ఫోర్స్ వదిలి ఇన్నేళ్ళయినా, నా ఫ్రెండ్స్‌తో స్నేహం మాత్రం పదిలంగా ఈనాటికీ ఉంది.

బట్, అపురూపమైన వ్యక్తిత్వం గల స్త్రీ మూర్తుల సాన్నిహిత్యం నాకు లభించకపోతే, నా జీవితమంత అసంపూర్ణ జీవితం సృష్టిలో ఉండేదికాదు. ఇది మాత్రం గుండెమీద చెయ్యివేసుకుని, (అంటే హృదయపూర్వకంగా / ఆత్మసాక్షిగా) చెప్పగలను.

ఇక్కడే ఇంకో విషయమూ చెప్పాలి. దుర్మార్గత్వమూ క్రూరత్వమూ మనుషులందరిలోనూ ఉంటుంది. కానీ స్త్రీలు తమ కోపాన్నీ బాధనీ అణుచుకున్నంతగా పురుషులు అణుచుకోలేరు.

పురుషులకి శారీరకమైన బలం ఉండొచ్చు - కానీ - స్త్రీ మనోబలం ముందర పురుషుడి మనోబలం గడ్డిపోచే.

సున్నిత హృదయంతో స్త్రీలు ముందు కంగారు పడినా కలవళపడినా, పరిస్థితులను క్షణాల్లో జీర్ణించుకోగలరు. సమయానికి తగిన నిర్ణయాలను క్షణాల్లో తీసుకోగలిగిన శక్తీ వారికే ఎక్కువే.

సుమిత్రలో రెండు భావాలు కనిపించాయి. సంఘాన్ని లెక్కచెయ్యకుండా బ్రతకాలనే కోరిక స్పష్టంగా ఉంటే, 'జీవితంలో ఇంకేం మిగిలింద'నే నిర్వేదం ఒకటి - ఈ సంభాషణలు జరుగుతున్నంతసేపూ బబులీ నాకు చాలా దగ్గరగానో, లేక నన్ను ఆనుకునో కూర్చోవడం సుమిత్ర గమనించింది. ఆవిడకూ నలభై ఆరు నలభై ఏడేళ్ళ వయసుంది. ఉన్నట్టుండి -

"బబులీ, ఒక వ్యక్తిదగ్గర ఒకప్పుడు నువ్వు ఇతన్ని ఆనుకుని కూర్చున్నంత దగ్గరగా కూర్చోవాలని నాకు అనిపించింది. కానీ కూర్చోలేక పోయాను కారణం లోకులు. ఇప్పుడు ఎన్ననుకుని ఏం లాభం.. కాలం ముందుకేగానీ వెనక్కి నడవదుగా.!" అని నిట్టూర్చింది. నాకు షాక్.

బబులీ మాత్రం నవ్వి, "అత్తా, నీ చిన్నవయసులో అలా కూర్చోవడం 'తప్పు' కింద వచ్చేది. ఇప్పుడు అలా కాదు. మరొకటేమంటే, 'తప్పు' అని అనుకున్నప్పుడు నువ్వేకాదు, ఎవరూ కూర్చోలేరు. నేను కూర్చున్నానంటే కారణం, అలా కూర్చోవడం తప్పని నేను అనుకోకపోవడమే!" అన్నది. ఎంత పరిణితిగల సమాధానం.

అల్లం వేసిన చక్కని 'టీ'తో సాయంత్రపు సంభాషణ పూర్తయింది ఆమ్రపాలి మాతోనే ఉంది.... చాలా అన్యమనస్కంగా. కానీ, అన్నీ వింటూనే ఉంది. సడన్‌గా బబులీ నాతో అన్నది "భయ్యా, ఆమ్రపాలిని బయటికి తీసికెళ్ళు. అది నీతో ఏదో మాట్లాడాలని అన్నది కదా. ఇప్పుడైనా చెప్పుకోనీ.. లేకపోతే!" సైలెంటై నా భుజాన్ని గట్టిగా నొక్కింది. బబులీ వ్యక్తిత్వానికి నా కళ్ళు చెమర్చాయి.

"కాసేపు నడుద్దామా?" ఆమ్రపాలితో అన్నాను.

"ష్యూర్.. బబులీ.. రా!" అన్నది.

"నో.. గ్రాండ్ మాకి వంటలో సాయంచేస్తా నువ్వెళ్ళు" అన్నది బబులీ.

"ఓకె" అని నాతో బయటి కొచ్చింది ఆమ్రపాలి.

ఎక్కడో చదివిన జ్ఞాపకం. "ప్రతివ్యక్తి జీవితమూ ఓ పుస్తకమే. కొన్ని పుస్తకాలు ఎలా జీవించాలో మనకి నేర్పుతాయి. కొన్నిటిని చదివి మనమే నేర్చుకోవాలి - ఎలా జీవించకూడదో" అని నూటికి నూరుపాళ్ళు ఇది నిజం. కానీ క్షమించండి. ఆమ్రపాలి జీవితమనే పుస్తకాన్ని ఇప్పుడు విప్పి ఆ పేజీలు మీతో పంచుకునే శక్తినాకిప్పుడు లేదు. గతంలోకి వెళ్ళినప్పుడు కూడా 'సత్యం' తన స్వరూపాన్ని మార్చుకోదు. ఎందుకంటే కాలంతో 'ధర్మం' మారొచ్చు. సత్యం మాత్రం మారదు. కష్టాన్ని భరించడం చాలా తేలిక, సత్యాన్ని భరించడంతో పోలిస్తే. ఒకటి మాత్రం ఇప్పుడు చెప్పగలను.. ఆ రోజు రాత్రి అంతా కలత నిదురలోనే గడిచిందని, ఆ విషయాన్ని పెద్దమ్మా బబులీ ఇద్దరూ గమనించారనీ. ఎందుకంటే వాళ్ళూ నిద్రపట్టక నిట్టూర్పులు విడవడం నేనూ గమనించాను.

"జాయెతో జాయెకహా..... సమ్‌ఝెగా... కౌన్‌యహా...

దరద్ భరే.. దిల్ కీ దువాఁ" పొద్దున్న లేస్తూ మనసులో పాడుకున్న పాట ఇది.

"ఉన్ కా భీ గమ్ హై.. అప్‌నా భిగమ్ హై"

(తనకీ బాధ ఉంది.. నాలోనూ బాధ ఉంది హృదయాల్ని రక్షించే నమ్మకమే ఇప్పుడులేదు)

దుఃఖం నిండిన హృదయపు సొద ఎవరికి అర్థమవుతుంది?

అందరం ఉత్సాహాన్ని అప్పుతెచ్చుకున్నట్లు మాట్లాడుతున్నాం. ఆమ్రపాలీ వచ్చింది.. కడిగిన ముత్యంలాగా.

బెంగాలీలకి భాషాభిమానం చాలా ఎక్కువ. తమిళుల్లాగా, మళయాళీల్లాగా. కానీ బెంగాల్ గురించి ఏ మాత్రం తెలిసినవారినైనా బెంగాలీలు అక్కున చేర్చుకుంటారు.

బెంగాలీ శరత్ చంద్రుడు తెలుగు నేలపై పూర్ణచంద్రుడై వెలగలేదా! విశ్వకవి తెలుగు హృదయాల్లో చెరగని ముద్రవెయ్యలేదా!

చిత్రం ఏమంటే, తెలుగు భాషంత సంపూర్ణమైన భాష మరొకటిలేదు. ఇంత మధురమైన భాషా మరొకటి లేదు.

ఇంగ్లీషు ఫ్రెంచి లాటిన్ వగైరా భాషలకంటే ఇటాలియన్ నేర్చుకోవడం చాలా కష్టం. అందుకే తెలుగుని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నారేమో!

ఆ 'సంపూర్ణత్వం' వల్లనే తెలుగు సాహిత్యాన్ని ఏ భాషలోకి అనువదించినా అది అసమగ్రమే అవుతుందని నాకనిపిస్తుంది.

అడపాదడపా సాహిత్య చర్చా, ప్రజల ఆచారవ్యవహారాల మీద చిన్న చిన్న కామెంట్లో తప్ప పెద్ద సంభాషణ ఏమీ జరగలేదు.

ఎందుకో సడన్‌గా "దక్షిణేశ్వర్‌కి పోదామా?" అన్నది బబులీ. పెద్దమ్మతో సహా అందరం వెళ్ళాం.

మనసుతో దర్శించగలిగితే, అక్కడున్న ప్రశాంతత అద్భుతం. తెరలు తెరలుగా నీలివెన్నెల కురుస్తున్నంత ఆహ్లాదం కలిగింది. సంగీతమూ సాహిత్యమూ ఉద్భవించేది నిశ్చల నిశ్శబ్దంలోంచే అని నాకు ఆనాడు స్పష్టంగా అర్థమైంది.

అక్కడ కూర్చునే ఒక పాట రాశాను. "రామకృష్ణ హరే" అని భక్తులు లో గొంతుకతో అనుకోవడం విని దాన్నే 'మకుటం'గా పెట్టాను. ఓ పిల్లవాడి దగ్గర ఉన్న పుస్తకంలోనించి ఓ కాయితం చింపి నా దగ్గర ఎప్పుడూ ఉండే ఫౌంటెన్ పెన్‌తో వ్రాసిన పాట అది. (ఫౌంటెన్ పెన్‌ని జనాలు మర్చిపోయారనుకుంటాను. అప్పుడు ఉండే కలాలు అవే. బాల్ పెన్నులొస్తాయనే ఊహే లేని రోజులవి.)

ప: రామకృష్ణ హరే... రామకృష్ణ హరే
చూచితివయ్యా ఓ కృష్ణయ్యా
ఎంత చిత్రమీ జీవితమూ
పాపపుణ్యముల బాటలు మరిచీ
చేయవలయు హృది ఆలయమూ.. ||రామ||

చ: పుట్టుక చావులు సుఖదుఃఖములే
మానవ జీవిత సంగ్రహమూ - ప్రతి
మానవ జీవిత సంగ్రహము
మరణ, రోగ, భయ పీడితులకు శ్రీ
రామనామమే ఔషధమూ.. ||రామ||

చ: భక్తియు ముక్తియు ప్రభుసేవనయే
ప్రభుని నామమే అమృతమూ
చంచల బుద్ధికి శాంతి నొసగునది
రామకృష్ణ నామామృతమూ.. ||రామ||

పెద్దమ్మ ఈ పాటవిని ఎంత ఆనందించిందంటే చెప్పలేను. నాకు తోచిన ట్యూన్ కట్టుకుని పాడాను. బబులీ ఈ పాట బట్టీ పట్టింది. బెంగాలీ నోట నా 'తెలుగు' పాట విని నాడు ఎంత పులకరించిపోయానో.

రచయిత నవ్వాలనే కోరిక అంతర్గతంగా నా చిన్నప్పటినించీ ఉంది. కానీ కవితల వరకు ఏదో కెలికేవాణ్ణి. పాట వ్రాసుకోవడం ఇదే మొదలు. ఎన్ని వందలసార్లు ఈ పాట పాడానో. ఎందరు ఈ పాటని రాసుకుని పాడుకున్నారో.

అప్పుడప్పుడూ అనిపిస్తుంది.... మళ్ళీ వెనక్కి వెనక్కి వెళ్ళి ఆ దక్షిణేశ్వరంలో కూర్చోవాలనీ.. నాటి సన్నిహితులందరూ నా చుట్టూ ఉండాలనీ.. నేను నోరారా పాటలు పాడి వారికి వినిపిస్తూ, వారు పాడే పాటల్ని మళ్ళీ మళ్ళీ వినాలని.

కానీ కాలమా... ఎంత జాణవే నువ్వు!

ముందుకి తప్ప వెనక్కి నడవవుగా. పోనీలే. దేవుడు మాకు మనసునీ, మనసు నిండా జ్ఞాపకాల్నీ ఇచ్చాడు. అవి చాలులే.. నీ నడక నీదీ - మా కలలు మావీ -

**ఉలిక్కిపడి లేచాను.** రాత్రి పన్నెండు. అందరూ నిద్రపోతున్నారు బులెట్‌లో. వర్షపు సవ్వడి. తలుపు తీసుకుని బయటకి వచ్చాను. వర్షం పడుతోంది. జల్లులు జల్లులుగా. కలకత్తా నుంచి రాగానే ముజుందార్‌తో పాటు మా బార్‌కి వెళ్ళాను. మామూలు కంటే చాలా 'ఎక్కువ' తీసుకున్నాను. అయినా తటాల్న మెలుకువ వచ్చింది. మనిషిని పడుకున్నా - మనసు పడుకుంటేగా? కలలాంటి కలలో కూడా ఆమ్రపాలే. షియాల్దా నుంచి దూరంగా నడుస్తూ వెళ్ళాం. ఏకాంతంగా ఉండే రోడ్డు. ఓ చిన్న వంతెనుంది. దాని మీద కూర్చున్నాం.

"ఇక్కడికెవరూ రారు. అప్పుడపుడూ నేనే వస్తా. ఈ వంతెనమీద కూర్చుని ఏడవడానికి" నిర్వేదంగా అన్నది ఆమ్రపాలి.

"ఎందుకూ?" అడిగాను.

"కొందరిమీద ఎందుకు సంపూర్ణమైన విశ్వాసం కలుగుతుందో నేను చెప్పలేను. కానీ, నీమీద నాకు విశ్వాసం ఉంది. నమ్మకం ఉంది. రాజుదా.. ఎవరితో ఒకరితో చెప్పుకోవాలి. లేకపోతే, నేను ఆత్మహత్యకి పాల్పడతానేమో!" సైలైంటైంది ఆమ్రపాలి.

ఆమె చేతిమీద చెయ్యి వేశా. వ్యర్థమైన మాటలు మనసుని తెలియజెప్పలేవు - కానీ స్పర్శ చెప్పగలదు.

"నా వొంటిమీద నాకు అసహ్యంపుడుతోంది.. నీకు తెలుసా, ఎన్ని చేతులు పడ్డాయో?" కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతుండగా అన్నది.

ఆమె చేతిని నా రెండు చేతుల్లోకి తీసుకున్నాను.

"బయటివాళ్ళు కాదు.. మాతాత, నా ముగ్గురు మేనమామలు, వాళ్ళ పిల్లలు.." మళ్ళీ మూగబోయింది.

"అదేంటీ.. మీ నాన్నగారు ఎలిమెంటరీ స్కూల్ టీచర్ అని బబులీ చెప్పింది!?" ఆశ్చర్యంగా అన్నాను.

"నేను పుట్టిన మూడో నెలలోనే మా నాన్న పాముకాటుతో చనిపోయాడు. నిజంగా ఆయన టీచరే. మా అమ్మ తరపువారు

చాలా పేదవాళ్ళు. దాంతో నన్ను తీసుకుని మా అమ్మ మా తాతగారింటికి, అంటే మా నాన్నగారి నాన్న ఇంటికి వెళ్ళింది. నాకు అయిదారేళ్ళు వచ్చేదాకా ఏమీతెలీదు. ఆ తరువాత తెలిసింది.. మా అమ్మ కళ్ళు జలపాతాలని. నయాగరా అయినా ఇంకిపోతుందేమో, మా అమ్మ కన్నీరు మాత్రం ఇంకిపోదు.!" సైలెంటయింది అనేకంటే, దుఃఖంతో గొంతు విప్పలేక పోయిందనడం కరెక్టు.

కాకులు ఎగురుతున్నాయి... అరుస్తూ. చూస్తుండగానే ఓ పాము పాక్కుంటూపోయింది. త్రాచుపామే. (ఆమ్రపాలిని 'అమ్మూ' అంటారట స్నేహితులు.. ఇకనుంచీ ఆ పేరేవాడతాను) అమ్మూ కూడా చూసింది.

"మనిషి అంత క్రూరమైనవి కాదు.. ఆ జీవులు.. రాజ్, మా తాత స్వంత కొడుకు భార్యని నిర్దయగా నికృష్టంగా వాడుకున్నాడంటే నమ్మగలవా? మా అమ్మ నోరెత్తడానికి వీల్లేదు. దేవుడా.. మిగతా విషయాలు చెప్పి మా అమ్మ జీవితాన్ని నేనే ముక్కలు చెయ్యను. నరకం. ఆఖరికి మా పెదనాన్నా, బాబాయి కూడా - "గట్టిగా ఏడవడం మొదలెట్టింది. "ఇదా మన దేశం...? ఇదా మన సంస్కృతి..? ఓ దిక్కులేని ఆడదాన్ని వావీ వరసా చూడకుండా మృగాల్లాగా.. ఛీ.. మృగాలు కూడా ఇంత నీచంగా ప్రవర్తించవు. దేవుడా.. " రెండు చేతుల్తో మొహం కప్పుకుని ఏడుస్తోంది. నా మనసు భళ్ళున పగిలింది. అమ్మూని దగ్గర తీసుకున్నాను. నా షర్టు కన్నీళ్ళతో తడుస్తోంది.

"పదేళ్ళప్పుడు దెబ్బలాడి మా అమ్మతో బయటికొచ్చాను ఎక్కడికెళ్ళాలి? మా అమ్మ పుట్టింటికి వెళ్ళాం. మా అమ్మమ్మ ఆదరించింది. అతి పేదవాళ్ళు వాళ్ళు. మా అమ్మకి పెద్దగా చదువులేదు. ఓ స్కూల్లో పనిగత్తెగా చేరింది. ఇక్కడ ఇంకో నరకం మొదలైంది. చిన్నప్పుడు అంటే నాకు తెలీని వయసులో మా తాత (తండ్రి తండ్రి) నామీద చేతులు వేసి చెయ్యరాని పనులు చేస్తే, ఇక్కడ మా మేనమామలు నామీద వాళ్ళ విశ్వరూపం ప్రదర్శించడం ప్రారంభించారు. కామానికి పేదరికానికీ, కామానికి పరువు ప్రతిష్టకీ, కామానికీ ధనానికీ, కామానికీ జ్ఞానానికీ కూడా ఏ మాత్రం తేడా ఉండదనిపించింది. కుక్క వీధికుక్క అయినా జాతికుక్క అయినా పిచ్చికుక్క అయినా ఒకటే - కుక్క కుక్కే." ఏడుస్తూనే చెప్పింది. దగ్గరగా పొదువుకున్నాను.

"అంత హీనస్థితిలోనూ మా అమ్మ ఒక్కటే చెప్పింది. చదువు మానొద్దనీ. అదొక్కటే 'మన'ని రక్షిస్తుందనీ. అన్నీ సహించా. ఆ ఊరు నుంచి పై చదువులకోసం వేరే ఊరు పంపనన్నారు. ఇదే శరీరాన్ని 'ఎర'గా వేసి అందరికంటే చిన్నమామని ఒప్పించా. బయట పడ్డాను. నాలో ఓ పగ నాతోనే పెరుగుతూ వచ్చింది. మగాళ్ళమీద ద్వేషం. చాలామందిని బాయ్ ఫ్రెండ్స్‌గా చేసుకుని నా ఖర్చుల్ని, అంటే చదువుసాగడానికీ, నాకు కావల్సినవి నేక్‌గా సంపాయిస్తున్నా, కానీ, శరీరాన్ని మాత్రం తాకట్టు పెట్టలేదు. నాకు ఉన్నది ఒకే ఒక్క లక్ష్యం. మా అమ్మని సుఖపెట్టాలి. చెప్పలేని బాధతో ఎప్పుడూ తలవొంచుకునే నా తల్లిని నిజంగా సుఖపెట్టాలి. కనీసం కన్ను మూసేప్పుడయినా తృప్తిగా కన్నుమూసేట్టు చూసుకోవాలి. నేను -, నేను, చెయ్యగలుగుతానా?" బేలగా అన్నది అమ్ము.

ఎంతసేపు కూర్చున్నామో, ఎంతసేపు మాట్లాడుకున్నామో, అవన్నీ అప్రస్తుతం. ఒక్కటి మాత్రం నిజం, ఈ దేశపు స్త్రీల దౌర్భాగ్యం ఏమంటే, నోరుమూసుకుని అన్నీ భరించాల్సి ఉండటమే. సాటి ఆడది కూడా 'నిజం'గా ఆదరించదు. కళ్ళతో చూస్తూ చెవులతో వింటూ ఉన్నా సరే. 'పత్తిత్తులకి' దేశంలో కొదవలేదు.

"నువ్వు గెలుస్తావు అమ్మూ.. నువ్వనుకున్నది సాధిస్తావు" లాంటి వాక్యాల్ని చాలాసార్లు ఉచ్చరించాను. ***'ఓదార్పడం' అన్నది ఓ ట్రాష్ అర్థంలేని వాక్యాల్ని పేర్చి ఉపన్యాసంగా మార్చడం తప్ప ఆ 'ఓదార్పడం' అన్న ప్రక్రియ వల్ల ఏమీ ఒరగదు.***

గోడని బల్లికరుచుకున్నట్టు నన్ను కరుచుకునుంది ఆమ్రపాలి. పద్దెనిమిది పంధొమ్మిదేళ్ళ జీవితాన్ని పుస్తకంలా నా ముందు పరిచింది. ఆ పుస్తకంలోని పేజీలన్నీ వేదనాభరితమైనవే. ఒక్క చిరునవ్వూ అక్కడ కనపడలా.

"ఇదిగో.. నీ ఒంటిని లోకంలో ఏదీ మలినపరచలేదు. కుక్కలు గీరిన గీతలు కనిపించీ కనిపించనట్టు ఉన్నాయేమో! అవి కుక్కకాట్లే అనుకో - నా స్నేహితురాలా.. నువ్వు స్వచ్ఛమైన బంగారానివి.. ఏ మైలా నిన్ను అంటదు." అని కొన్ని వందలసార్లు తన చెవి దగ్గర గొణగటం నాకింకా గుర్తుంది.

శరీరాలమధ్య మోహమూ కామమే కాదు - స్వచ్ఛమైన ప్రేమా, జాలీ, సానుభూతీ, ధైర్యం, 'నేను నీకున్నాను' అనే భరోసా అన్నీ ప్రవహిస్తాయి. అది నాకు ఆనాడు తెలిసింది. ఆనాడే అనుభవమయ్యింది.

ఎప్పటికో... చాలా చాలా చాలా సేపటికి లేచాము. వర్షంలో తడిసిన గులాబీలా నా భుజం మీద తలాన్చింది అమ్మూ. ***కన్నీటికి మించిన వాన లోకంలో మరోటి ఉన్నదా!***

షియాల్దా స్టేషను వరకూ నన్ను పట్టుకునే నడిచింది. ఆ తరువాత అన్నది "థాంక్స్" అని. అంటూనే నా చేతుల్ని పట్టుకుని గట్టిగా నొక్కి తటాల్న వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

అక్కడే నిలబడి చాలా దూరమయ్యేదాకా ఆమెని చూశా. నడకలో కాన్ఫిడెన్స్ కనిపించింది. అడుగులు స్థిరంగా పడటం గ్రహించగలిగాను.

ఒకప్పుడు ఆమ్రపాలిని చూస్తే నమ్రత గుర్తుకొచ్చేది. ఇప్పుడు.. ఆమ్రపాలి ఆమ్రపాలిగానే కనిపించింది. స్థిరమైన వ్యక్తిత్వంతో.. కడిగిన ముత్యంలా!

(తరువాత చాలా ఏళ్ళకి ఆమెని ఓ మోస్ట్ సిన్సియర్ ఉన్నతోద్యోగిగా చూడటం జరిగింది. తనుకోరుకున్న శిఖరాన్ని చేరుకున్న గొప్ప స్నేహితురాలామె. అది మరోసారి)

"ఏదో చెయ్యాలనుకున్నాను
ఏదీ చెయ్యలేకపోతున్నాను.
ఏది చెయ్యాలన్నా..నువ్వే అడ్డొస్తున్నావు..
నీ మౌనంతో...నీ మాటలతో..
నీ చూపులతో.. నీ నిట్టూర్పులతో..
ఇంకేం చెయ్యనూ?"

కవితగాని కవితలాంటి ఉత్తరం వ్రాశాను నమ్రతకి.

"కలల కోసం కలవరిస్తా..
కలలోనైనా నువ్వు కనబడతావని,
హూ.. ఒక్కసారి కూడా రావుగానీ,
లేవగానే గుప్పున కొడుతుంది
నా ఒంట్లోంచి నీ వొంటి పరిమళం..
దొంగా.. నాకే తెలీకుండా
నువ్వెలా వచ్చావూ?" అని కూడా రాశాను.

నిజమే. నా తల నేను దువ్వుకుంటున్నా, నా జుట్టు ఆమె జుత్తులా మృదువుగా అనిపిస్తోంది. 'మెమరీ సెల్స్'లో పరిమళం

కూడా దాచబడుతుందా? స్పర్శ కూడానేమో!

డైవర్ట్ బ్రదర్.. డైవర్ట్..

***మనసుని డైవర్ట్ చేసుకోకపోతే లోకంలో 'మన'లేము.***

జ్ఞాపకాలు చినుకుల్లాంటివి

సన్నసన్నగా మొదలై మొత్తం తడిపేస్తాయి.

జ్ఞాపకాలు నిప్పుల్లాంటివి.

నివురుగప్పినట్టున్నా, నిలువునా దహించేస్తాయి.

జ్ఞాపకాలు చిరుగాలుల్లాంటివి.

ఆహ్లాదం కలిగిస్తూనే అమాంతం ఎత్తి ఎక్కడో పారేస్తాయి.

జ్ఞాపకాలు విత్తనాల్లాంటివి

చిన్న మొలక భూమిని చీల్చుకుని పైకొచ్చినట్టు, మనసుని

చీల్చుకుని పైకొచ్చి మహావృక్షాల్లా మారిపోతాయి.

బివేర్ ఆఫ్ మెమొరీస్.. నాట్ ఆఫ్ డాగ్స్" అని కూడా నా డైరీలో రాసుకున్నాను.

కాకి పిల్ల కాకికి ముద్దో కాదో తెలీదుకానీ, నేను రాసుకున్నది మాత్రం నాకు మహా ముద్దొచ్చింది. ఇంతేకాదు.. స్వీట్ నథింగ్స్ చాలా రాశాను. ఉత్తరం పోస్టు చేశాక ఆలోచించాను. తొమ్మిది అరఠావుల సుదీర్ఘ ఉత్తరం ఎందుకురాశానా? అని.

అర్థమైంది ఎందుకో.. డైవర్షన్ కోసం.

కలకత్తాని వొదిలిపోవాలి. నా దృష్టిలో కలకత్తా అంటే నగరం కాదు. కలకత్తా అంటే పెద్దమ్మ – కలకత్తా అంటే బబులీ, కలకత్తా అంటే నిర్మల, గంగూలీ, ముజుందార్, బబులీ పిన్ని ఇంకా ఇంకా ఇంకా 'ఆమ్రపాలి'!

బబులీ నేను వెనక్కి వచ్చాక చిత్రంగా ఓ మాట అన్నది.. "వెళ్ళేప్పుడు నువ్వూ ఆమ్రపాలీ ఇద్దరూ వెళ్ళారు. తిరిగొచ్చినప్పుడు నువ్వు ఒంటరిగా వచ్చావా?" అని.

"అదేం? వంటరిగానే వచ్చానుగా?" అన్నాను.

"ఉహూ.. నువ్వు దగ్గరికి రాగానే నాకు ఆమ్రపాలి చెమట వాసనొచ్చింది. కావలించుకున్నారుగదూ? నిజం చెప్పు?" అన్నది. కళ్ళల్లో కోపం.

"అవును. కౌగిలించుకున్నాను. ఓ పసిబిడ్డని గుండెకి హత్తుకున్నట్టు. బబులీ, ఆమ్రపాలికి అంతా మంచే జరగాలనీ, ఆమె జీవితంలో వెలుగు నిండాలనీ మనస్ఫూర్తిగా నేను కోరుకున్నా. నువ్వూ కోరుకో.!" అన్నాను. రెండు నిముషాలు నా కళ్ళల్లోకి చూసి మెల్లగా నవ్వింది. నా భుజం మీద చెయ్యివేసి అన్నది, "నిజంగా కోరుకుంటా రాజుదా" అని.

***మనసు మిడతలాంటిది. అది నిర్విరామంగా అక్కడ్నించి ఇక్కడికీ, ఇక్కడ్నించి ఎక్కడికో ఎగురుతూనే ఉంటుంది.***

"కోయీ లౌటాదే మెరే బీతే హు లేదిన్... బీతే హుయే దిన్

ఓ మెరే ప్యారే పల్‌ఛిన్..." పాట గుర్తొచ్చింది.

ఎవరివ్వగలరూ ఆ క్షణాల్ని మళ్ళీ.

ఎవరివ్వగలరూ ఆ నవ్వుల్నీ ఆ కన్నీళ్ళనీ మళ్ళీ మళ్ళీ.

ఒకవేళ ఎవరైనా ఇవ్వగలిగితే ఏం జరుగుతుందీ?

జీవితం అక్కడే ఆగిపోయింది నేస్తమా.. అక్కడే ఆగిపోయి విసుగెత్తుతుంది.

అందుకే., కాలం ఆగదు. కాలం నిలవదు. కాలం అంటే కనురెప్పల మధ్య ఒదిగిపోయే కల.. ఆ కలని అలానే ఉండనీ.

ఇదీ నేను అర్ధరాత్రి వానచినుకుల్ని చూస్తూ రాసుకున్న 'మాట'. ఆ వర్షం కురిసిన రాత్రికి నేను ఏకైక సాక్షినయ్యా! వరండాలో ఉన్న కుర్చీలో కూర్చునే, తెల్లవారాక నిదురపోయాను. ఎవరూ లేపలేదు, ఎట్లాగూ వెళ్ళిపోయేవాడ్నేగా.. టైమ్ పాటించకపోయినా పర్లేదు.

"మైతో చలా... జిధర్ చలే రస్తా.... ముఝే క్యా ఖబర్ హై కహా మేరి మంజిల్" పాట వినిపిస్తోంది కృష్ణన్ కుట్టి ట్రాన్సిస్టర్‌లో.

(దారి ఎటు వెడలుతుందో అటువైపు నడుస్తున్నాను.. నాకేం తెలుసూ నా గమ్యం ఏమిటో ఎక్కడుందో?)

నా జీవితమూ అలాగే ఉంది. ఎక్కడ్నించో కొన్నాళ్ళ క్రితం ఇక్కడికి వచ్చాను. కొన్నాళ్ళ తరవాత ఇక్కడినుంచి వెళ్ళిపోతాను.. అంతే!

***రాకకీ - పోకకీ మధ్యనున్నది అనుభవం***

***రాకకీ - పోకకీ మధ్య నున్నది జీవితం.***

కాలాన్ని కొలవడానికి గడియారాలున్నాయి. అనుభూతిని ఎలాగూ కొలవడం? మనసంతా ఎలా ఉందంటే ఒక్కక్షణం విశ్రాంతిలేదు. ఉమ, నమత, బబులీ, ఆమ్రపాలి, పెద్దమ్మ, ఒకే ఒక్కసారి చూసిన నిర్మలతో సహా క్షణం క్షణం జ్ఞాపకం వస్తూనే ఉన్నారు. వారి మాటలూ, హావభావాలూ ఆఖరికి 'అమ్మా' కన్నీళ్ళతో సహా అన్నీ గుండెల్లో తిష్ఠవేసుకుని కూర్చున్నాయి.

'వీరంతా ఎవరూ?' నా మనసులో ఓ ప్రశ్న. జవాబూ మనసే ఇచ్చింది -

నా 'జీవితం' అనే పుస్తకంలోని పేజీలు.. కొందరు కేవలం పేరాగ్రాఫులైతే కొందరు అధ్యాయాలు. వీరిలో ఎవరు లేకున్నా జీవితం అనే పుస్తకం పూర్తికాదు.

ఆలోచిస్తూనే అయిదురోజులు గడిచాయి.

"స్టుపిడ్ ప్రేమలేఖా నువ్వు రాసిందీ?" బోలెడు ప్రేమతో తిడుతూ రాసింది నమత. అదృష్టం.. వెంటనే జవాబు అందుకోవడం. చాలా తీవ్రంగా 'పై' పరీక్షలకి చదువుతున్నానని రాసింది. ఉత్తరాన్ని తడుముతుంటే అనిపించింది.. దేవుడు మనిషికి పక్షిలాగా రెక్కలు ఎందుకివ్వలేదా అని. (మళ్ళీ నవ్వొచ్చింది. ఈ కథని చేతులతో అయితే రాయగలిగాను కానీ, రెక్కలతో అయితే ఈ జన్మకి రాయలేనుగా)

పగలు ఎలాగోలా గడుస్తోంది.

రాత్రి మాత్రం సాగడంలేదు.

రాత్రిని నిట్టూర్పులతో నింపుతున్నా.

"ఏరాత్ ఏ చాందినీ ఫిర్ కహా ..

సున్ జా దిల్ కి దాస్తా.."

(జాల్‌లోని పాట ఎస్.డి.బర్మన్ - లిరిక్ సాహిర్ లుధియావీ)

పాటే నాకు తోడు.... పాటే నాకు నీడ...

పాటే నా ప్రేయసి... అర్ధరాత్రిలో - ఆశలకోనలో.

ఇంకొన్ని గంటల తరువాత 'షియాల్దా' ట్రైన్ ఎక్కొచ్చు. ***రేపటి మీద ఆశ అద్భుతం. 'ఆశ' ప్రమిదలో వెలిగే దీపమేకాదు..***

*వత్తీ నూనే ప్రమిదా కూడా.*

"ఎంతసేపయిందీ వచ్చి?" ఆశ్చర్యంగా బబులీని అడిగాను. కారణం ఏమంటే, వస్తున్నానని కార్డు రాయలేదు. క్రితం సారి ఇంటికి ఎలా వెళ్ళాలో బాగా గుర్తుపెట్టుకున్నాను. అంతేకాదు 'బులెట్'కి వెళ్ళగానే బండ గుర్తులతో సహా 'మేప్' కూడా గీసుకున్నా. ఒకవేళ అప్పుడూ గుర్తుపట్టలేకపోతే 'నిర్మల'గారి సహాయం అడుగుదామనుకున్నా.

"చాలాసేపయింది రాజూదా. నువ్వొస్తావని పిచ్చిగా అనిపించింది. అందుకే ఇక్కడే ఉన్నా" కళ్ళు మెరుస్తుండగా అన్నది బబులీ.

"ఒకవేళ నేను వచ్చి ఉండకపోతే?" కొంచెం కోపంగా అన్నా.

"ఇది అబద్ధం చెప్పదు!" గుండెమీద చెయ్యి వేసుకుని అన్నది.

ఇక చెప్పేదేముందీ?

"పెద్దమ్మ ఎలావుందీ?" అడిగాను.

"లోపల బాధపడుతున్నా పైకి ధైర్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఓమాట చెప్పనా, నీ అంత సన్నిహితంగా ఆమెతో ఎవరూ మెలగలేదు. అన్న మంచివాడే కానీ అన్నిటికీ చికాకుపడతాడు. సెంటిమెంటు అనేది వాడికి అంటదు. నువ్వొచ్చేదాకా నేనూ గ్రాండ్ మాతో 'స్టుపిడ్'గానే బిహేవ్ చేసేదాన్ని. ఆవిడ ఏది చెప్పినా చాదస్తం అనుకుని సరిగ్గా వినేదాన్నేకాదు. మీరిద్దరూ మాట్లాడుకునేటప్పుడే తెలిసింది.. ఆవిడ సమక్షం ఎంత విలువైనదో! నిజంగా రాజూదా.. ఐయామ్ థాంక్ ఫుల్ టూ యూ. లేకపోతే, జీవితంలో అనంతమైన దాన్ని పోగొట్టుకుని ఉండేదాన్ని." నా చేతిని తన చేతుల్లో బిగించి సిన్సియర్‌గారి అన్నది బబులీ.

ఆరోజంతా ఉత్సాహంగానే గడిచింది. కారణం 'క్షణాల్ని' 'క్షణాలు'గానే గుర్తించాలనే నిర్ణయం తీసుకోవడంవల్ల. ఆ మాట చెప్పింది పెద్దమ్మే.

"ఇప్పటి క్షణాన్ని 'గతపు' వాసనతోటో 'రేపటి' ఊహతోనో ఎందుకూ నింపడం? ఈ క్షణాన్ని ఈ క్షణంగానే ఉండనిద్దాం. దీని సౌరభం దీనిదే. ఈ క్షణాన్ని ఏ క్షణంతోటీ పోల్చవద్దు." అని నవ్వింది.

అప్పుడు ఆవిడ అన్నమాటల్ని డైరీలో రాసుకున్నా. ఆ నాలుగు మాటల్లోని అర్థం ఎంత విలువైనదో చెప్పడానికి వెయ్యి పేజీలు రాసినా సరిపోదు. ఆచరణలో పెట్టి చూస్తేగానీ ఆ 'విలువ' బోధపడదు.

హాయిగా పాటలు పాడుతూ, కొన్ని రచనల గురించీ సినిమాల గురించీ చర్చిస్తూ కాలం గడిపాము. ఆమ్రపాలి కూడా ఉత్సాహంగా పాలుపంచుకుంది. 'క్షణ సిద్ధాంతాన్ని' ఆరోజున కావాలనే నేను ఆమ్రపాలికి వివరించి చెబుతూ, "ఇదిగో.. ఈ పెద్దమ్మే నా గురువు" అన్నాను.

అవాళ 'సాత్ భాయీ - చంపా' అనే ఓ కథ కూడా విన్నా. అంటే ఏడుగురు అన్నదమ్ములూ - ఓ చెల్లెలి కథ అన్నమాట.

జాయినింగ్ టైమ్ ఉంటుంది గనక మధ్యలో జర్నీ బ్రేక్ చేసి మా అమ్మనీ, అన్నల్నీ అక్కల్నీ చూడాలనుకున్నాను. కలకత్తా టు చెన్నై గనక (అప్పుడు మద్రాసే) భీమడోలులో దిగితే బెస్ట్ అని నిర్ణయించుకున్నా. కారణం భీమడోలులో మా రెండో అన్నగారు అప్పుడు పనిచేసేవారు.

కలకత్తా నించి ఏమి తీసుకెళ్ళాలీ? ఎవరెవరికి ఏమేమి కొనాలీ? ఇవీ ప్రశ్నలు.

"స్వీట్స్" అన్నది బబులీ. బెంగాలీలకి స్వీట్స్ అన్నా చేపలు అన్నా ప్రాణం. నేను నవ్వి చెప్పాను, "మేమంతా మిర్చి ప్రియులం"

అని.

మరో వారం గడిచింది. సామానంటూ పెద్దగా ఏమీలేవు  సద్దుకోవడానికి. ఆ రోజుల్లో నాకో ప్రిన్సిపుల్ ఉండేది. నాలుగే నాలుగు జతల బట్టలు కొనుక్కునేవాడ్ని ఏడాదికి. అలాగే బనీన్లూ, లోదుస్తులూ కూడా. సంవత్సరం వాడి, వాటిని ఎవరికో ఒకరికి ఇచ్చేసి కొత్తవి కొనుక్కునేవాడ్ని. చాలా చాలా ఏళ్ళు ఈ పద్ధతే ఫాలో అయ్యాను. యూనిఫాం ఎలాగూ గవర్నమెంటు ఇచ్చేదే కదా!

"చిరిగి పోయే దుస్తులకీ అరిగిపోయే చెప్పులకీ అతిగా ఖర్చుపెట్టడం మూర్ఖత్వం" అని గట్టిగా నమ్మేవాడ్ని. ఇప్పుడూ అంతే. 'బ్రాండెడ్' అయిటమ్స్ అంటే చికాకు. 'స్టాండర్డ్' అయిటమ్స్‌ని ఇష్టపడతాను.

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో చాలా మూర్ఖత్వాలు (?) ఉండేవి. దావూద్ షూసూ, రేమండ్ సూటూ లాంటివి. 'రెప్యూజీ'ల అవస్థ చూశాక ఆ పిచ్చి వ్యామోహాలు గాలికి ఎగిరిపోయాయి.

ద..'డే' హాజ్ కమ్.

గుండె బరువెక్కింది. హౌరా స్టేషన్‌లో ఉన్నా. స్టేషన్‌కి వచ్చే ముందు పెద్దమ్మ పాదాలకి తల ఆన్చి ఆశీస్సులు తీసుకున్నా. ఆమ్రపాలి, బబులీ, ముజుందార్ మరి కొందరు యూనిట్ మేట్స్ సెండాఫ్‌కి వచ్చారు.

కళ్ళనిండా నీళ్ళతో ఆనాడు నేను వచ్చినప్పుడు ఎలా స్వాగతం చెప్పిందో, ఇప్పుడూ 'లిల్లీపూల'తోనే వీడ్కోలు పలికింది బబులీ. పువ్వులు నా చేతుల్లో పెట్టి నా చేతుల్ని తన చేతులతో కప్పింది. తెలుసు.. ***'స్పర్శ' ఎంతో గొప్పది. గుండెసవ్వడిలోని రహస్యాల్ని 'స్పర్శ' చెప్పగలదు.***

**సెండాఫ్ ఎంత బాధాకరమైనదీ!** నేనెవ్వరికీ సెండాఫ్ ఇచ్చే ప్రయత్నం చెయ్యను. అసలు రైల్వేస్టేషన్‌కో ఏర్‌పోర్ట్‌కో బస్‌స్టాండ్‌కో కూడా వెళ్ళను. ఎందుకంటే, వెళ్ళిపోయేవాళ్ళు వెళ్ళిపోయాక, ఒంటరిగా వెనక్కి తిరిగివచ్చే అనుభవాన్ని నేనెన్నడూ భరించలేను. గుండె పగిలిన బాధకలుగుతుంది. అలా వెనక్కి తిరిగిరాలేక నేనూ గభాల్న ట్రైన్ ఎక్కేసిన రోజులు ఎన్నెన్నో.

పెద్దమ్మ నోట్లోంచి మాటరాలేదు. చేతుల్లోంచి అక్షయంగా ఆశీస్సులు తప్ప. సరే.. ఆమ్రపాలీ బబులీ కూడా సైలెంటుగా వున్నారు, పగలబోయే అగ్నిపర్వతాల్లాగా. ఒక్కమాట మాట్లాడలేకపోయారు. మరి నేనూ? నాలో నేను గొణుగుతున్నట్టు ఉన్నాను. నా ఏర్‌ఫోర్స్ ఫ్రెండ్స్‌కి తెలిసుంటుంది. సన్నివేశం కొంచెం బాధాకరమైందని. అందుకే కొంచెం దూరం నించే టాటా చెప్పారు, మేం మాట్లాడుకోవడానికి వీలుగా. కానీ మాట్లాడుకున్నదెక్కడా?

ట్రైను బయల్దేరింది. వాళ్ళకి నేను, నాకూ వాళ్ళూ దూరమౌతున్నారు. నాకళ్ళల్లో నీళ్ళు... మసకమసగ్గా వాళ్ళు.

స్టేషన్ దాటి ట్రైన్ పరుగందుకున్నా నేను డోర్ దగ్గరే నిలబడి వున్నాను. చాలాసేపటి తరువాత నా సీట్లో కూర్చున్నా. లిల్లీపూల సువాసన కంపార్టుమెంటంతా పరుచుకుంది. ఆ గుత్తిని చేతుల్లోకి తీసుకుని పూలని కళ్ళకి ఆనించుకున్నాను. కన్నీటితో వేడెక్కిన రెప్పలకి ఆ పూలు చల్లగా, పెద్దమ్మ చూపుల్లాగా, బబులీ సన్నని చల్లని వేళ్ళలాగా తగిలాయి.

గుండె మీద పర్వతంలా ఓ మహామౌనం. దుఃఖం ఎక్కువైనప్పుడు ఏడుపురాదు. అలాగే అతిగా అలసినప్పుడు నిద్రరాదు. మరోటేమంటే మనసు రగిలేటప్పుడు మాటా రాదు. నా శరీరంలోని శక్తి అంతా ఏమైందో తెలీదు. నిస్త్రాణగా సీటుకి జారబడి కూర్చున్నా... కళ్ళుమూసుకుని.

"జీవితం అంటే ఏమిటీ?" యీ ప్రశ్న 22 ఏళ్ళ వయసులో రావాల్సిన ప్రశ్నకాదు. కానీ ప్రశ్నగా నా మదిలో వందలసార్లు వచ్చింది. కారణం యుద్ధమా? యుద్ధంలో మరణించిన స్నేహితులా? "జీవితం క్షణ భంగురం.. ఓ బుడగ.. ఎప్పుడు పగిలిపోతుందో తెలీని బుడగ" అన్నది కళ్ళారా చూడటమా? లేదూ.. మనసు లోతుల్లో ఏ జన్మలోనో పేరుకుపోయిన వైరాగ్యమా? తెలీదు నేస్తం.. నిజంగా తెలీదు.. ఓ కొటేషన్ చదివాను చిన్నప్పుడు -

మాట్లాడబోయే ముందు ------------- వినడం నేర్చుకో..

ఖర్చుపెట్టేముందు ---------- సంపాయించడం నేర్చుకో..

గెలవాలనుకునేముందు ------ ఓడిపోవడం నేర్చుకో..

తినాలి అనుకునేముుందు ----- పెట్టడం నేర్చుకో..

రాయలి అనుకునేముందు ----- చదవడం నేర్చుకో..

చావాలనుకునే ముందు (నేస్తమా) కనీసం చచ్చేముందు ---- బ్రతకడం నేర్చుకో !!

ఎవరూ నేర్పేదీ? తల్లితండ్రులు, సంఘమూ మనకి నేర్పేది పనికిమాలిన నీతులూ పాఠాలు. ఒక్కపాఠం హాయిగా బ్రతికేందుకు పనికొచ్చేది నేర్పారా? అశోకుడు చెట్లు నాటించెనూ - ఔరంగజేబు జుట్టుపన్ను విధించెనూ - ఫలానా పూజ చేసినచో స్వర్గము లభించునూ, ఫలానా పాపము చేసినచో ఫలానా నరకములో ఇన్నాళ్ళు మగ్గెదవూ అనే పరమ నికృష్ట ఊహలూ, పనికిరాని జ్ఞానాలూ మన నెత్తిన రుద్దడం తప్ప -

మనిషి మనిషిని ఎలా ప్రేమించాలో

మనిషి మనిషిగా ఎలా బ్రతకాలో

మనిషి ప్రకృతిలో మమేకమై ఎలా మసలాలో చెప్పినవాడు ఒక్కడున్నాడా?

ఏ మతాన్ని తీసుకోండి ఏ సమాజాన్ని తీసుకోండి - మనిషి చుట్టూ మనసుల చుట్టూ 'కంచె'లు కట్టిందేగానీ స్వేచ్ఛని - ఆహ్లాదకరమైన - అందరికీ ఆమోదకరమైన స్వేచ్ఛని ఒక్క మతమైనా ప్రసాదించిందా?

ఎవరూ ఎవర్నీ నమ్మని పరిస్థితులు. పోనీ నమ్మలేని పరిస్థితుల్ని సంఘం సృష్టిస్తోంది. అడుగుకో రూలు. అడుగుకో నీతి.

ఎందుకివన్నీ? మానవత్వం అంటే ఏమిటో నేర్పని మతాలసలు మనిషికెందుకూ?

ఇవన్నీ ఆ ట్రైన్‌లో పుట్టిన ప్రశ్నలుకావు. అప్పటినించీ ఇప్పటివరకు మనసుని వదలని ప్రశ్నలు. మిణుగురుపురుగుల్లాగా జవాబులు తడతాయి. కానీ మిణుగురుపురుగుల కాంతి దేనికి? కనీసం నక్షత్రాలు దారైనా చూపగలవు.

పిచ్చిపిచ్చి ఆలోచనలు. ఓ అనంతమైన వేదన. గుండెనిండా శూన్యం. ట్రైన్ చైన్ లాగేసి ట్రైన్ దిగి పరిగెత్తుకుంటూ వెనక్కి వెళ్ళిపోవాలనే పిచ్చికోరిక. ఎన్నో అనుకున్నా ఏమీ చెయ్యలేక పోయా. పావుగంట అరగంటై, అరగంట గంటై కాలం ట్రైన్లా పరిగెడుతోంది. హృదయం మాత్రం వెనక్కి వెడుతోంది.

ఇప్పుడక్కడి పరిస్థితి ఎలా వుంటుందీ? ఈపాటికి ఆమ్రపాలీ, బబులీ ఇంటికి వెళ్ళిపోయి వుంటారు. పెద్దమ్మ ఏం చేస్తూ వుంటుందీ? ఆమె ఎప్పుడు కూర్చునే వాలుకుర్చీలో మౌనంగా కళ్ళుమూసుకుని పడుకుని వుంటుంది. అంతే. బబులీ కూడా అంతే. బబులీకి ఎప్పుడూ కాళ్ళనించి తలదాకా ముసుగుతన్ని పడుకోవడం అలవాటు. దుప్పటి అనే కవచంలో దూరిపోయి నిశ్శబ్దంగా కన్నీళ్ళు కారుస్తూ వుంటుందేమో? మరి ఆమ్రపాలి? నాకు తెలుసు. రోడ్డు మీద గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోతూ వుంటుంది.. అలిసిపోయేదాకా.. ఆ వారధి... అదే తనకథ నాకు వినిపించిన ఆ ఏకాంతపు వారధి దాకా నడిచి నడిచి అలిసిపోయి....

ఎన్ని పిచ్చి ఆలోచనలూ? నేను వెళ్ళిపోతున్నందుకు వాళ్ళసలు ఎందుకు ఏడవాలీ? సరే.. మరి నేనెందుకేడుస్తున్నానూ? ఠక్కున లేచికూర్చున్నా. బుగ్గలమీద నీళ్ళు.. కన్నీళ్ళు..

(ఆ రోజులది ఎంత అదృష్టం.! యీనాడు ఏడుద్దామన్నా కన్నీళ్ళు రావే!)

ఒంటిగంట దాటింది. అంతకు ముందు ఏ ప్రయాణం చేసినా ఓ బుల్లిపుస్తకంలో ప్రతి స్టేషను పేరూ రాసుకునేవాడిని. ఇవాళ ఏ స్టేషను ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు పోయిందో కూడా తెలీదు. అసలెందుకూ తెలియడం? స్టేషన్లు అక్కడే వుంటాయి. మనుషులే.. వచ్చేదీ పోయేదీ.

"నీ జననం ఓ స్టేషను
నీ మరణం మరో స్టేషను
మధ్యన ఓ నేస్తం
ఎన్ని స్టేషన్లో...!
కొన్నిట్లో యీ జీవితమనే బండి
ఆగుతుంది.
బొగ్గో నీరో నింపుకుంటుంది
కాలిపోయిన బొగ్గు బూడిదని వదిలించుకుంటుంది.
మళ్ళీ ఉత్సాహంతో పయనం మొదలెడుతుంది.
కొన్ని స్టేషన్లలో ఆగనే ఆగదు-
అవి ఎంత ఆత్రంగా ఎదురుచూసినా సరే!
తొందరపడకు భాయీ.. నీ గమ్యం వొస్తోందనీ!
ఆ గమ్యం ఒక్కటే..!
మరో పయనంలేని మరణం!" (పాదాచారి)

ఆ రోజు రాత్రి పూట రాసుకున్న కవిత ఇది. అర్థవంతమైనదో కాదో, అమాయకంగా రాసుకున్న విషయం నిజం.

రెండున్నర అయింది. పెద్దమ్మ ప్రేమగా ఇచ్చిన 'పేక్' గుర్తుకొచ్చింది. పూరీలూ, బంగాళాదుంపకూర, బెంగలీ ఆచార్ (వూరగాయి), హల్వా ఇవన్నీ ఓ పోపులపెట్టెలాంటి పెట్టెలో చక్కని స్టీలు డబ్బాల్లో సర్దివున్నాయి. బాదం ఆకుల బొత్తి ఒకటి కట్టగా కట్టి వున్నది. రెండు చిన్న పేకెట్లలో స్వయంగా చేసిన స్వీట్లు. ఇంకో పెద్ద పేకెట్ నిండా దాల్ మిక్చర్. కళ్ళవెంట మళ్ళీ నీరు.

భగవాన్.. ఎంతగొప్పవాడవీ?

ఈ కన్నీటి భాషనిచ్చావు మనిషికి.

ఏడవడానికీ ఇదే

ఆనందానికీ ఇదే

పరవశంలోనూ ఇదే

పరితాపంలోనూ ఇదే

"నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయీ" అన్నారు ఆత్రేయ

"ఏ ఆశూ మేరే దిల్ కీ జుబాన్ హై..

మై హస్‌తా హూ హస్‌దే ఆశూః

మై రోతా హూ.. రోందే ఆశూ..

ఏ ఆశూ మేరే దిల్‌కి జుబాన్ హై.. " అన్నాడు మరో హిందుస్తానీ కవి.

"ఆశూ భరీ హై ఏ జీవన్‌కి రాహ్.. కోయీ ఉన్‌సే కేహ్‌దే

హమీ భూల్ జాయే.!" అన్నాడు మరో మహాకవి.

కన్నీటి మీద ఎన్ని పాటలు!

ఒక్కో పూరీ ముక్క తుంచి తింటున్నప్పుడల్లా గుండె ఒక్కో బొట్టు రక్తాన్ని కారుస్తోంది. నేనిక్కడ తింటున్నాను. మరివాళ్ళూ? ఠక్కున తినడం ఆపేశాను.

మళ్ళీ మరో ఆలోచన. "బిడ్డ తిన్నాడో లేదో!" అని పెద్దమ్మ ఆలోచించదూ? బబులీ తిన్నానో లేదో అని బాధపడదూ?

మౌనంగా మళ్ళీ తినడం మొదలుపెట్టాను.

బాగా చూడండి.. మనకోసం మరొకరు ఆలోచించాలనీ, మనకోసం ఇతర్లు బాధపడాలనీ, కన్నీరు కార్చాలనీ మనుషులకి ఎంత అంతర్గత తపనో! ఈ ఆలోచన వచ్చిన మరుక్షణం సిగ్గుపడి దేవుడ్ని ప్రార్థించా -

"దేవుడా.. తట్టుకునే శక్తి నాకివ్వు. వాళ్ళూ తట్టుకునే శక్తిని వాళ్ళకివ్వు. వారి కళ్ళల్లో నేను చూడాల్సింది నవ్వుల మెరుపులే గాని దుఃఖపు ఛాయలు కాదు" అని.

'కలా' - 'నిజమా' కాని విధంగా ప్రయాణం సాగింది.

తోటి ప్రయాణీకులు ఎందరో మాట్లాడించే ప్రయత్నం చేశారు గానీ, నేను పెద్దగా రెస్పాన్స్ ఇవ్వలేదు. కొన్నిసార్లు అంతే. ఎవరినీ భరించలేము., ఆఖరికి ప్రాణప్రదంగా కోరుకున్నవారిని కూడా.

పగలో రాత్రో కూడా తెలీనంత విషాదంలో వున్నాను. అదృష్టం ఏమంటే వాన రావడం. ఎంత పెద్దవాన అంటే, చినుకులు గులకరాళ్ళలా గ్లాస్‌డోర్స్‌ని తాకుతున్నాయి. మబ్బులు కమ్ముకుపోవడం వల్ల పగలు పగలుగా లేదు. ట్రైను శబ్దాన్ని ఛాలెంజ్ చేస్తూ వానహోరు. వాటిని సవాలు చేస్తూ రైలు చక్రాలు పట్టాలమీద చేసే సవ్వడి.

"సిగరెట్ పీహోగే?" ఎదుటి బెంచీ మీది హవల్దార్ అడిగాడు. అప్రయత్నంగా తీసుకున్నా. అతనో పూర్తి సిగరెట్టు పెట్టే ఇచ్చాడు. "నహీ.!" అన్నా. "కోయీ బాత్ నహీ.. మేరాపాస్ పూరా బండిల్ హై!" అన్నాడు పూర్తి బండిల్‌ని చూపించి.

సిగరెట్టు వెలిగించా. అప్పటివరకూ అప్పుడప్పుడూ సరదాగా తాగటం తప్ప అలవాటు లేదు.

ఆనాడు మాత్రం ఆ వర్షంలో - ఆ చలిలో, ఆ ఒంటరితనంలో సిగరెట్టు నాకు నేస్తమైంది.

మనసులో ఏవేవో పాటలు.. మేం కూర్చుని కలిసి పాడుకున్నవి. ఎన్నెన్నో మాటలు. మరిచిపోలేని చేతుల స్పర్శలు. కనుపాపలు దాచుకున్న చిరుచూపులూ, చిరునవ్వులూ. రాత్రి దొంగలా వచ్చి పగటిని మింగేసింది.

"చార్ ఆశూ కొయీ రోదియా.. ఫేర్‌కే మూ కొయీచల్ దియా"(2)

(నాలుగు చుక్కల కన్నీరు కార్చి ఎవరో మొహం తిప్పుకుని వెళ్ళిపోయారు. భూమి ఏడుస్తోంది.. ఆకాశం మాత్రం ఏమీ ఎరగనట్టు చూస్తూనే వుంది - ('ఏ మేరే దిల్ కహీ ఔర్ చల్' - సినిమా - 'దాగ్') పాడుతున్నా...

"ఔర్ లో  భయ్యా.!" ఇంకో పెగ్ జగ్గులో పోసి ఇచ్చి అన్నాడు సైడ్ బెర్త్‌లో వున్న సుబేదార్.

రాత్రి ఏడింటికి ఎదుటి బెర్త్ హవల్దార్ (అంటే సిగరెట్లు ఇచ్చినవాడు) రమ్ ఆఫర్ చేశాడు. తీసుకున్నాను. రాత్రిగడవాలంటే మనసు చల్లబడాలి.

మిలటరీ కంపార్ట్‌మెంట్ గనక అడిగేవాళ్ళెవ్వరూ వుండరు. ఆడవాళ్ళు (అంటే మిలటరీ వాళ్ళ భార్యలు పిల్లలు) వున్నా వాళ్ళూ సరదాగా తీసుకుంటారేగానీ 'నేరం'గా చూడరు. కారణం మేము ఏనాడూ శృతిమించి తాగము.

"రస్తావహీ.. యేముసాఫిర్ వహ్‌ఫీ

.. ఏక్ తారా న జానే

కహా చుప్ గయా" (పాట - రమయ్యా వస్తావయ్యా.. సినిమా 420 సంగీతం శంకర్ జైకిషన్: పాడింది ముఖేష్, లత, రఫీ)

వరసగా పాట తరువాత పాట..

గుండెలోతుల్లోంచి వస్తున్న విషాదగీతాలు..

మా 'జవాన్' భాయీలందరూ ఎంజాయ్ చేస్తున్నారు. సగానికి సగం కంపార్టుమెంటులో వుండేవాళ్ళు మా దగ్గరే గుమికూడారు. కొందరైతే మిలటరీ బాక్సుల మీద దరువు కూడా వేస్తున్నారు. అస్సామీలూ బెంగాలీలు మళయాళీలూ పంజాబీలూ - ప్రదేశం ఏదైతేనేం - అందరూ మిలటరీవాళ్ళు.. అందుకే ప్రతిక్షణాన్నీ ఆస్వాదిస్తున్నారు. నా మగ్గు మళ్ళీ మళ్ళీ నిండుతోంది.

"దేవర్ జీ.. ఏ ఆలూ పరాతా ఖావో" ఓ సిక్కు భాభీ ప్రేమగా సత్తుపళ్ళెంలో రెండు ఆలూపరోఠా, సబ్జీ పంజాబీ ఆచార్ పెట్టి ఇచ్చింది.

ఆ ప్లేటు తీసుకుని కళ్ళకి అద్దుకున్నా.

"భాభీ.. అందరూ నా పాట విని ఆనందిస్తుంటే నువ్వు నా ఆకలిని చూశావు.!" రెండు చేతులూ ఎత్తి దండం పెట్టి మెల్లగా చపాతీలు తినడం మొదలుపెట్టాను.

మనసులోనే పెద్దమ్మనీ, బబులీనీ అందర్నీ తలుచుకుంటూ పరోఠాలు తినేసి ప్లేటు కడిగి ఆమె చేతికిచ్చి మళ్ళీ నమస్కరించా.

పడుకున్నా..

రైలు వర్షానికీ గాలికీ ఉయ్యాలూగినట్టు ఊగుతోంది.

రగ్గు కప్పుకున్నా.. నా పక్కనే కూర్చున్నట్టు (ఎవరో) అనిపించింది.. ఎవరూ?

అలిసిపోయిన కళ్ళతో పెద్దమ్మ.

అది భ్రమ అని తెలుసు. 'కానీ ఆ కళ్ళు భ్రమకాదు.. మాతృత్వమూ, విజ్ఞానమూ, శాంతీ, ప్రేమా స్వచ్ఛతా నిండిన ఆ కళ్ళు ఎప్పటికీ భ్రమకావు. కళ్ళు మూసుకున్నాను.

నా వీపు మీద పెద్దమ్మ చిచ్చికొడుతున్నట్లు అనిపించింది.

**ప్రజల్లో కలవడంతో** కొంత కలవరం తగ్గింది.

"కష్టాలన్నీ గాయాలే.. కాలంతోటే మానాలే."

ఇప్పటికిప్పుడు నెత్తిమీదకి వొచ్చిపడ్డ కష్టం దుర్భరంగా ఉంటుంది. ఓ గంట తరవాత దాని తీవ్రత కొంచెం తగ్గుతుంది. ఓ రాత్రి కరిగి రోజు గడిచాక దుఃఖపు యొక్క గాఢత చాలా తగ్గుతుంది. కానీ మనిషి 'అది' అంటే, ఆ బాధ తగ్గిందని గుర్తించడానికి ఇష్టపడడు. ఇంకా తీవ్ర దుఃఖంలో వున్నట్టే తను నమ్మడమేగాక చేతలతో ఇతర్లనీ నమ్మిస్తాడు.. నమ్మించే ప్రయత్నం చేస్తాడు.

మా నాన్నగారు పోయారు. 'దుఃఖం' ఎంతో, అంతా ఒకేసారి నానెత్తి మీద పడింది. మరుసటి రోజున? ఆ మరుసటి రోజున?

మనిషి దుఃఖాన్నే కాదు... దుఃఖభ్రాంతిని కూడా ఇష్టపడతాడని జనాల్ని చూసీ చూసీ నాకు అవగతమైంది.

(పి.యస్: నా యీ స్టేట్‌మెంట్ కొందరి విషయంలో తప్పు కావొచ్చు వారికి క్షమార్పణలు)

నిజం చెబితే యీనాడు వున్నది నిన్నటి దుఃఖపు 'ఛాయ' మాత్రమే అని నాకు అర్థమైంది. అలాగని 'ఎడబాటు' కలిగించిన బాధ లేదా అంటే, వున్నది'. కానీ, నిన్నంత ఉధ్రుతంగా లేదు.

రాబోయేది భీమడోలు. సామాన్లు డోర్ వరకూ తీసికెళ్ళడానికి నా మిలటరీ ఫ్రెండ్స్ కూడా సహాయం చేశారు. వారికి నేను కృతజ్ఞతలు తెలిపాను. వారుకూడా "నిన్నంతా పాటలు వింటూ మీతో పాడుతూ బాగా ఎంజాయ్ చేశాం దేవుడు మీకు దీర్ఘాయుష్షునివ్వాలని" దీవించారు. అందర్లోకీ చిన్నవాడ్ని నేనే మరి.

భీమడోలులో దిగడం నాకు మొదటిసారి. ఆ వూళ్ళో మా రెండో అన్నగారు వున్నారు. పంచాయితీ సమితిలో ఇంజనీరు. మా అమ్మగారు కూడా ఆ వూళ్ళోనే ఉన్నట్టు అంతకు ముందే నాకు ఉత్తరం అందింది.

ఒక వారం ఉందామని అనుకున్నాను. అమ్మ అన్నయ్య వదిన పిల్లలు అందరితో కబుర్లు సాగుతూనే వున్నా మనసుపొరల్లో ఎక్కడో ఓ శూన్యం. కలకత్తాకీ ఢిల్లీకీ వుత్తరాలు రాశాను. ఉమకి, సర్‌ప్రైజ్ విజిట్ ఇద్దామనుకుని మనసుని బిగబట్టుకున్నాను.

కలకత్తా దాటాక మొదలైన వర్షం కంటిన్యూ అవుతూనే వుంది. బయటకు పోయినా పది నిముషాల్లో మళ్ళీ వర్షం.

కుటుంబ విషయాలు పెద్దగా ఏనాడూ పట్టించుకోలేదు. అందరికంటే చిన్నవాడ్ని కావడం ఓ కారణం అయితే, అతి చిన్నవయసులోనే ఇల్లొదిలి ఏర్‌ఫోర్స్‌లో చేరడం మరో కారణం. నాలుగు రోజుల తరువాత గుర్గావ్ నించి ఉత్తరం వచ్చింది.

"నువ్వు ప్రమోషనల్ ట్రైనింగ్‌కి వెడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. వీలుంటే (Short Service Comission -షార్ట్ సర్వీస్ కమీషన్)కి అప్లై చెయ్యమని డాడీ అన్నారు. " etc..etc..etc. నాకు నవ్వొచ్చింది. ఉత్తరంలో 'ఘాటు' తగ్గింది.

ప్రేమలో వుండే 'ఘాటు' పెళ్ళి అనేసరికి 'ఎకనమిక్స్' వైపు మళ్ళుతుందేమో! ssc అయితే కేడర్ పెరిగి ఆఫీసర్‌ని అవుతా.. దాంతో హోదాకి హోదా.. జీతానికి జీతం. కానీ, నేను IAFని వదిలి ఆర్మీలో చేరాలని అనుకోవడంలా. మంచో చెడో మొదట నాకు ఏది

'అన్నం' పెట్టిందో, దానిలోనే కంటిన్యూ కావాలని నా కోరిక. ఆ విషయాలేమీ జవాబులో నేను వ్రాయలేదుగానీ... 'ఘాటు' తగ్గినందుకు జోక్ చేశాను.

('ఘాటు' అంటే మొట్టమొదటిసారి యీ పదాన్ని 'ప్రేమ'కి అన్వయించి 'ఎంత ఘాటుప్రేమయో' అని పాట వ్రాసిన పింగళి నాగేంద్రరావుగారు గుర్తొస్తారు.

ఆయనా మెకానికల్ ఇంజనీరే (డిప్లొమా). రైల్వే షెడ్‌లో కొంతకాలం పనిచేశారు. సబర్మతి ఆశ్రమంలో గాంధీజీతో వున్నారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. గాంధీగారి మాట మీద ఫుల్‌టైమ్ కాంగ్రెస్ కార్యకర్తగా వుండటమేగాక - వివాహం చేసుకుంటే స్వాతంత్ర పోరాటానికి సంసారం అడ్డొస్తుందేమోనని పెళ్ళి చేసుకోవడమే మానేసిన దేశభక్తుడు. తెలుగు పాటకి వన్నెచిన్నెలద్దిన ఘనత పింగళిగారిదే. పింగళిగారు వుపయోగించినన్ని సరికొత్త తెలుగు పదాలు నేటివరకూ మరొకరు ప్రయోగించలేకపోయారన్నది సత్యదూరం కాదు. పదాలతో ఆటాడిన కవులున్నారుకానీ - పదాలని 'ప్రయోగించిన' వారు మాత్రం ఖచ్చితంగా పింగళిగారే)

ఆరో రోజున బబులీ ఉత్తరం రాసింది. ఆరు అరఠావులు. హృదయాన్ని అద్దంలా ఆ ఉత్తరంలో ప్రతిబింబింపజేసింది. పెద్దమ్మ దీవెనల్నీ, ఆమ్రపాలి శుభాకాంక్షల్నీ కూడా ఆ ఉత్తరంలోనే పొందుపరిచింది. చివరలో 'రాజూదా.. అసలు నువ్వెందుకు కలకత్తా వచ్చావు.. యీ శూన్యాన్ని ఎందుకు మిగిల్చావూ?" అని ముగించింది.

ఆ మాటల వెనక వున్న ప్రేమకీ, చెప్పలేని భావనకీ నా మనసు ద్రవించిపోయింది. అందరి విషయాలు అన్ని విషయాలూ రాసి చిట్టచివరగా రాసిన ఆ రెండు మాటలూ హృదయంలో చిక్కుబడిపోయాయి... ఇప్పటికీ.

వారం పాటు మాత్రం భీమడోలులో వున్నాను. ఆ తరువాత అమ్మకి చెప్పి అన్ననించి వీడ్కోలు తీసుకుని 'ఉమ' దగ్గరికి వెళ్ళాను. ఇక అటునించి అటే మద్రాస్ వెళ్ళాలని నా ప్రోగ్రాం.

"వచ్చావా?" ప్రేమ కురిసే చూపుల్తో ఎదురొచ్చింది ఉమ. బాగా చిక్కింది. అంతగా చిక్కుతుందని నేను ఊహల్లో కూడా అనుకోలేదు.

"ఏమయిందీ?" బాధని దాచుకుని అడిగాను.

"నథింగ్.! శరీరం కదూ..కొన్ని రోజులు బాగుంటుందీ కొన్ని రోజులు తిప్పలు పెడుతుందీ.!" తల నా గుండెకి ఆన్చి నవ్వుతూ అన్నది. అతి మెల్లగా తల నిమిరాను.

మంచం మీద కూర్చుంటే పక్కనే కూర్చుంది.

"ఏం జరిగిందీ?" అడిగాను.

"అన్నీ బాగానే వున్నాయిరా. ఏమీ వర్రీకాకు. అవునూ ఇంత సడన్‌గా ఎలా వచ్చావూ?" నవ్వుతూనే అన్నది.

"ఇంత సడన్‌గా వచ్చినందుకు నీకు సర్‌ప్రైజ్‌గా లేదా?" విస్మయంతో అడిగాను.

"నిజం చెబితే ఒక వారం రోజుల్నించీ మనసులో నీ ధ్యాసే. ఎక్కడో.. నాకు దగ్గర్లోనే వున్నావనే భావన. ఇప్పుడో ఇంకో గంటకో వచ్చేస్తావనే ఓ పిచ్చినమ్మకం. ఇవ్వాళయితే ఎంత నమ్మకం అంటే, నీకిష్టమయినవన్నీ వండేసి కూర్చున్నా" తల భుజానికి ఆనించి అన్నది.

మనసుకి ఎప్పుడూ 'కబురు' అందుతూనే వుంటుంది. అయితే మనం గమనించం. చెడు అయినా మంచి అయినా మనసు ముందే విషయాన్ని గ్రహిస్తుంది. అంతేగాదు చెబుతుంది కూడా! మనసు 'సొద'ని కనిపించని 'చెవులతో' వినేవారు ఎందరూ? "ఉమ్మా.. నిజంగా నేను వారం క్రితమే వచ్చాను. భీమడోలులో అమ్మ దగ్గర వున్నాను.!" అంటూ విషయాలు వివరించా.

నాలుగు రోజులు ఉమ దగ్గరే గడిచాయి. నాకైతే ఏదో మానస సరోవరం దగ్గర ఏమీ ఆలోచన లేని స్వచ్ఛమైన మనసుతో కూర్చున్నట్లుగా వుంది ఎంత చల్లగా అంటే.. ఆకాశమంత స్వచ్ఛంగా మళ్ళీ మళ్ళీ మా చిన్నతనాలు మా గుండెల్లో దోబూచులాడాయి. "మర్రిచెట్టు దగ్గర పెట్టిన ముద్దు గుర్తుందా?" కొంటెగా అన్నది. ఆ కొంటెదనపు చిరునవ్వులో ఓ అల్లరి హేల తప్ప మరేమీ కనిపించలేదు.

కాసేపు వాళ్ళ నాన్నగారి గురించి. ఎన్నో ఎన్నో! రాత్రిళ్ళు విద్యుద్దీపాలు కాకుండా నేతి ప్రమిదలు వెలిగించేది.

అదో అద్భుతం. సన్నని నేతివాసన. వెలుగుతున్న - అదీ నిశ్చలంగా వెలుగుతున్న జ్యోతుల కాంతి మనసుకి ఆహ్లాదం కలిగించేది. ఒక్కోసారి బలవంతంగా తానే ముద్దలు తినిపించేది. నాకు ఏమాత్రం డిస్టర్బెన్సు కలగనంత మెత్తగా నడిచేది. వండినది ప్రతిదీ చాలా శ్రద్ధగా చాలా ప్రేమతో పెట్టేది. దేముడా, అంతటి ప్రేమ ఎన్నడూ ఎరగను.

"తలంటి పోస్తా పదరా!" అన్నది. చిన్నప్పుడు తలంటి అంటే మహా చికాకు పెద్దయ్యాక సున్నిపిండి నలుగు పెట్టించుకుని స్నానం చెయ్యడం చాలా ఇష్టం. అమ్మ భీమడోలులో వుంది గనక కుదరలేదు.

కోమలమైన చేతుల్తో ఒళ్ళంతా కొబ్బరి నూనె పూసి బాగా మర్దించి ఆ తరవాత శనగపిండిని నీళ్ళతో కలిపి వళ్ళంతా పట్టించి కొంచెం ఆరాక నలుగు పెట్టింది.

తను అలిసిపోతుందేమో అని నాకు లోలోపల కంగారు. అర్ధనిమిలిత నేత్రాలతో చిన్నగా కబుర్లు చెబుతూ ఒళ్ళంతా నలుగుపెట్టి, కుంకుడు రసంతో తలంటి పోసింది. ఆ తరువాత దిష్టితీసి హారతిచ్చింది.

"ఇప్పుడున్నావురా బంగారంలా" నా తల రెండు చేతుల్తో వంచి ముద్దు పెట్టింది నుదుటిమీద.

కొత్త పంచ (తెల్లని తెలుపు.. మల్లుపంచె) ఇచ్చి కట్టుకోమన్నది. పంచకట్టు నాకు యీనాటికీ రాదు. లుంగీలా మడిచి కట్టుకున్నాను.

పిచ్చి నిద్దర పట్టింది. గంటో రెండు గంటలో అయ్యాక మెలుకువ వస్తే నా గుండె మీద తల ఆన్చి నిద్రపోతోంది. ఉఛ్వాస నిస్వాసాలు స్టడీగా ఉన్నాయి. మూసివున్న ఆ కళ్ళు ఎంతందంగా ఉన్నాయో కదలకుండా అలానే ఉమని చూస్తూ వున్నా.. కళ్ళ నిండుగా.. మనసు నిండుగా...

'కలకత్తా'ని వదిలి 'చెన్నై' (మద్రాస్)కి పయనమైనప్పటి 'వేదన' వేరు. భీమడోలులో అమ్మనీ అన్నయ్యనీ అందర్నీ వొదిలి ఉమ దగ్గరకు పయనమైనప్పటి 'బాధ' వేరు.

మూడుసార్లూ 'వదిలి' వెళ్ళడమే! కానీ 'బాధ' యొక్క గాఢత వేరు. దేనికీ మరో దానితో సంబంధంలేదు. దేని గాఢత దానిదే

"ఒరేయ్.. మళ్ళీ మనం చిన్నపిల్లలమైపోతే ఎంత బాగుంటుందిరా!" గుండె మీద గడ్డం ఆనించి అన్నది ఉమ. "ఊ" కళ్ళు మూసుకుంది.

తెల్లవార్లూ మాటలు.. మాటలు.. మాటలే,

పొద్దున్నే బయల్దేరాను. ఎప్పుడు లేచిందో, పూరీలూ, కూరా, నాకిష్టమని కొత్తగా వేసిన దోసావకాయా, నల్లకారప్పొడీ డబ్బాలతో సిద్ధంగా ఉంచింది.

భీమడోలులో నేను కొన్న గులాబి రంగు చీర జాకెట్ పీస్‌ని అప్పుడు తీసి ఇచ్చాను.

"చాలా చాలా బాగుందిరా.!" కళ్ళు మెరుస్తుండగా చీరని ముద్దు పెట్టుకుంది. అది జార్జెట్ చీర. (అప్పట్లో అది ఫేషన్).

ఓ మెత్తని కౌగిలి...పిల్లతెమ్మరలా..పూలదండలా

నిర్మలమైన సెలయేటి అలలా –

నుదుటి మీద ఓ చిరుముద్దు.. సన్నటి అల పాదానికి తగిలినట్టు... ఓ పారిజాతం నుదుటి మీద పడినట్టు –

మరో చిన్న కౌగిలి ... వెచ్చగా.. వొంటి పరిమళం తెలిసేట్టు.

"రెడీనా అయ్యగారూ?" రిక్షావాడి పిలుపు.

గట్టిగా తనని గుండెకు హత్తుకుని బయటకి నడిచా..

"తొందరగా వస్తావుకదూ.. మళ్ళీ నువ్వొచ్చేదాకా.." ఠక్కున మాట ఆపేసింది. బయలుదేరేపుడు సెంటిమెంట్‌తో కట్టెయ్యాలని ఏనాడూ ఆలోచించని సంస్కారి ఉమ.

పూజలేకాదు నామాన్ని స్మరించకపోయినా వరమిచ్చే దేవతలాంటిది ఉమ.

మళ్ళీ రిక్షాలో పెట్టిన పెట్టెని దింపేసి వెనక్కి వొచ్చెయ్యాలనిపించింది.

'To hell with the job..' గుండెలోనించి ఓ అరుపు...

వెనక్కి తిరిగాను.

"ఉమా.! వెళ్ళాలిరా..తప్పదు.!"

"మళ్ళీ వస్తావుగా?" అనునయంగా నవ్వి అన్నది ఉమ.

నా మనసులో ఏముందో తనకి తెలిసినట్టు నాకే తెలీదు.

గబగబా వచ్చి భుజంమీద తల ఆన్చి మెల్లగా, "నా మనసు నీతోనే ఉందిగా బెంగెందుకూ" అన్నది నా చెయ్యి పట్టి నడిపించింది. రిక్షా ఎక్కాను. మరో వీడ్కోలు.. మరో టాటా..

మరో పయనానికి ముందు మరో వీడ్కోలు..

"పాదచారీ.. పాదచారీ..

మరలి రాకోయ్.. వెడలిపోవోయ్.."

"ఎక్కడ ఉందో.. నీదను మజిలీ

బాటనించీ ఓ బాటకి బదిలీ"

**"నేటి ఉత్సాహానికి పునాది నిన్నటి నిరుత్సాహం**

నేటి గెలుపుకి పునాది నిన్నటి ఓటమి

నిన్నటి కన్నీరే నేటి చిరునవ్వుకి పునాది" అంటూ డైరీలో రాసుకున్నాను. తెల్లవారుఝాము నాలుగున్నర. రాత్రంతా నిద్రలేదు. ఓ పక్క ఆకాశం కురిపించే వర్షం మరో పక్క మనసు కురిసే జ్ఞాపకాల వర్షం. మనసుని కుదిపే వేదన ఓసారీ మద్రాసులో అడుగుపెడుతున్నానన్న ఉత్సాహం మరోసారి వర్షరాణి నృత్యంలా భంగిమలు మార్చుకుంటున్నాయి.

చెన్నై! (అప్పుడు మద్రాసే)కి నాకూ అసలేమిటీ యీ సంబంధం?

"పెద్దయ్యాక ఏం చేస్తావురా?" అని ఎవరడిగినా "మద్రాసు పోతా" అనేవాడ్ని. కొందరు హైస్కూలు ఫ్రెండ్సు నన్ను ఆ రోజుల్లోనే 'మద్రాసు పిచ్చోడు' అనేవాళ్ళు.

వినడానికి మీకు విచిత్రంగా ఉంటుందిగానీ, ఆరోజుల సంగతి కొంచెం చెప్పనివ్వండి. అంటే, అయిదున్నర దశాబ్దాల క్రిందటి విషయాలు.

మా ఊళ్ళో వైశ్యులు ఎక్కువ మంది. ఆ తరువాత కాపులు, కమ్మవారు ఇక మిగతా కులాలవారు. బ్రాహ్మల బజారొకటి ఉండేది. దాన్ని ఉపాధ్యాయులవారి వీధి అనేవారు. ఆ వీధిగాక మిగతా ఓ పదో పన్నెండో బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. కుండలు, చట్టిలు, పిడతలు, మట్టి మూకుళ్ళు, మట్టిపాత్రలూ కావాలంటే ద ఓన్లీ పాటరర్ సుబ్బారావు. అతను సారె (కుండలు చెయ్యడానికి ఉపయోగించే బేస్ చక్రం) తిప్పుతుంటే చూడటం మా పిల్లలకి మహదానందం కలిగించేది. అలాగే శివాలయం దగ్గర నాగాచారీ, అనంతాచారీ బొగ్గుల కొలిమిలో ఇనప బద్దెల్ని ఎర్రగా కాల్చి సుత్తితో కొడుతూ ఆ బద్దెల్ని కొడవళ్ళగానూ, పెణక్కత్తులుగానూ తీర్చిదిద్దుతుంటే చూడటం ఓ మహోత్సాహాన్నిచ్చేది. తోలుతిత్తి ఆడిస్తూ సుదర్శనాచారిగాడు (నా క్లాస్‌మేట్) సుత్తి దెబ్బలు కొడుతుంటే ఇనపముక్కలు (రజను) ఎర్రని పువ్వుల్లా ఎగిసిపడుతూ ఉండడం నయనానందకరంగా వుండేది. అట్లాగే కంసాలి బత్తుల దగ్గర, వడ్లాబత్తుల దగ్గరా నిలబడి నగల తయారీ, కలప కుర్చీలుగా బెంచీలుగా ద్వారబంధాలుగా తయారించబడటం చూస్తూ మేము మైమరచిపోయేవాళ్ళం.

ఎవరూ లేనప్పుడు సుదర్శనాచారిగాడ్ని ప్లీజ్ చేసి తోలుతిత్తి ఆడించడమో, సుబ్బారావుని పొగిడి సారె తిప్పడమో చేసిన రోజున ఏనుగెక్కినంత సంబరం. కులాల గురించి నిజంగా ఆనాడు మాకు పెద్ద అవగాహన లేదు. అందరూ అందర్నీ 'వరసలతోనే' పిలుచుకునేవాళ్ళం. నాగాచారిని బాబాయ్ అనీ, సుబ్బారావుని అన్నయ్యా అనీ చివరిదాకా నేను పిలుస్తూనే వున్నా. సెలవుల్లో వెళ్ళినప్పుడల్లా వాళ్ళని కలిస్తే నన్ను కావలించుకుని పొంగిపోయేవాళ్ళు.

వర్షాకాలంలో పిల్లలందరం 'కాటన్ దొరలమే'. అంటే కట్టడాలూ 'తూము'లు పెట్టడాలూ.. ఇవే మా పనులు. పెద్దవాళ్ళు చూసి, (ఎవరైనా సరే - మనవాళ్ళే కానక్కర్లా) మందలించేవాళ్ళు. అప్పటికీ వినకపోతే నాలుగు తగిలించేవాళ్ళు. అయినా మనం వింటేగా!

ఉమా, నేనూ, వేదగిరి భారతీ అందరం బ్రిడ్జీలు కట్టడంలో మొగలాయీలమే.

జలగల్ని వొంటిమీద ఎక్కించుకుని, అవి 'బ్లడ్' కొంచెం తాగాక, ఉప్పు అద్దితే గభాల్న పట్టు వొదిలేసేవి. అదో సరదా. ఎర్రగా ముఖ్‌మల్‌లా మెత్తగా మెరిసే 'ఆరుద్ర పురుగుల్ని పట్టుకుని, వాటి ముఖ్‌మల్' వీపులు నిమరడం మరో మజా.

తుంగ గడ్డిని కుదురుతో సహా పీకితే, కుదుట్లో నల్లని కాయలాంటిది వుంటుంది. దాన్ని గోళ్ళతో గీకి వాసన చూస్తే అద్భుతమైన సుగంధం.

అంతేకాదు తొలకరి వర్షమయ్యాక భూమి వెదజల్లే సువాసనకి సమమైన సువాసన సృష్టిలో ఉందా?

సారీ ఏదో చెప్పాలనుకుని ఎక్కడికో పోతున్నా. వైశ్యులు ఎక్కువ అన్నాను కదూ. వాళ్ళకి భక్తి ఎక్కువ. దాంతో 'తిరపతి'కి తీర్థయాత్ర చేసేవాళ్ళు. మా వూరికి 30 మైళ్ళదూరంలోనే 'ద్వారకాతిరుమల', అంటే 'చిన్న తిరుపతి' వున్నా, కొంతమంది పెద్ద తిరుపతికి పోయేవాళ్ళు (అంటే 'స్తోమత' వున్న వాళ్ళన్నమాట.) వాళ్ళు అలా తిరపతి ప్రయాణం అనగానే వూరి హడావుడి చెప్పక్కర్లేదు. "బాబ్బాబూ.. పదేళ్ళ క్రితం మొక్కుకున్నా.. మొక్కుతీర్చలేదు. చేతిలో నాకాడబ్బులేదు. ఇదిగో.. నీకు పుణ్యంవుంటుంది గానీ యీ ముడుపుని 'హుండీ'లో పడెయ్యవూ.!" అని బతిమలాడే బీదా బిక్కీ జనాలు ఓ పక్క -

"నాయనా.. కాటికి కాళ్ళు జాచుకుని వున్నాను... తిరపతికి నేనేం పోగలనూ? ఇదిగో.. ఈ రెండు రూపాయలూ హుండీలో వెయ్యి.. యీ రెండ్రూపాయలు ఖర్చు పెట్టుకో. ఇంతే నేను ఆ వెంకటేశ్వరుడికిచ్చేది" అని దండం పెట్టి దారి ఖర్చుకోసం పావలానో అర్దో ఇచ్చే వయసు మళ్ళినవాళ్ళు ఓ పక్కా -

"ఇదిగో బాబాయ్.. వచ్చేప్పుడూ నాకు కాశీదారం తేవాలి" అని కోరికల్ని వెళ్ళడించే పిల్లకాయిలం ఓపక్కా -

ఎంత హడావిడో.

వాళ్ళు వెళ్ళేప్పుడు మేళతాళాలతో బస్సెక్కించేవాళ్ళం. (ఒకటే బస్సు.. అదీ రామాయణకాలం నాటి బొగ్గు బస్సు) వాళ్ళువచ్చినప్పుడు ఊరి చివరే దిగేవాళ్ళు. అక్కడ్నించి ఇంటిదాకా మేళతాళాలూ, గోవింద నామాలూ.

ఆ తరవాత వాళ్ళు వెంకటేశ్వరస్వామికి దీపం పెట్టుకుని ఓ మంచి రోజున 'సమారాధన' పెట్టుకునేవాళ్ళు. పిల్లకాయిలకీ పెద్దలకీ కూడా పటిక బెల్లం, శనగపప్పు ప్రసాదం ప్లస్ గుర్తు కాశీదారం బహుమతిగా ఇచ్చేవాళ్ళు.

అట్లా తిరపతిదాకా వెళ్ళినవాళ్ళు అప్పుడప్పుడు మద్రాసుదాకా వెళ్ళి ఎన్.టి.ఆర్‌నో, ఏ.ఎన్.ఆర్‌నో, ఎస్.వి.ఆర్‌నో సూరేకాంతాన్నో, రేలంగోడినో, అంజిగాడినో (బాలకృష్ణ - కమేడియన్) దర్శనం చేసుకొచ్చారంటే అంతే సంగతులు. ఊరు వూరంతా చెవుల్ని దొప్పలుగా చేసుకుంటూ వినేది.

కొంతమంది ఎవర్నీ కలిసే అదృష్టానికి నోచుకోకపోయినా, అందర్నీ చూసొచ్చినట్టు తెగ కోతలు కోసేవాళ్ళు. మేం వెర్రిపీనుగుల్లా నమ్మేసేవాళ్ళం. మాకేం తెలుసూ అవి కోతలనీ?

మా 'సమయమంతుల'గాడైతే ఏకంగా 'సావిత్రి' ఇంట్లో ఏకంగా భోంచేశాననీ, రేలంగిగారు తనతోపాటు షూటింగ్‌కి తీసుకెళ్ళారనీ, అక్కడ యస్వీరంగారావుగారు గంటసేపు మాట్లాడారనీ తెగ కోతలు కోశాడు. మేం నోళ్ళు తెరుచుకుని అమితోత్సాహంగా వాడి కోతలు వినడమేకాక "ఒరేయ్ మన సమయమంతులగాడు ఎస్వీ.ఆర్‌తో మాట్లాడట్టరా" అని ఊరంతా ఫ్రీ పబ్లిసిటీ కూడా ఇచ్చి వాడ్ని హీరోని చేశాం.

అయితే ఓ నెల తరువాత వాడు చెప్పినవన్నీ పచ్చి అబద్దాలనీ అసలు వాళ్ళు మద్రాసే వెళ్ళలేదనీ బయటపడింది. అది వేరే విషయం.

(జోక్ ఏంటంటే, నేను సినీ రచయితనయ్యాక వాడే టి.నగర్‌లో మా యింటి కొచ్చి ఓ రోజు వుండి, మళ్ళీ చింతలపూడి వెళ్ళాక , 'ఒరేయ్.. మనోడ్ని చిరంజీవిగారూ, బాలక్రిష్ణా గంటకోసారి పలకరిస్తార్రా.. అసలాడు ఎంత బిజీ అంటే, నాకే జాలేసిందనుకో' అని నాకు ప్రీ పబ్లిసిటీ ఇచ్చాడు.)

ఎవరు మద్రాసు వెళ్ళొచ్చినా నా చెవులు మాత్రం 'సినిమా' కబుర్ల మీదే వుండేవి.

వాల్ పోస్టర్ల మీద కథ, మాటలు, పాటలు: శ్రీశ్రీ (వీరభక్త హనుమాన్ ఫేమ్) అనుంటే ఆ పక్కనే చాక్ పీస్‌తో నా పేరు రాసుకునేవాడ్ని. అలాగే నా ఆరో ఏటనించే ఆరుద్ర, ఆత్రేయ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సముద్రాల.. వీరందరి పక్కనా నా పేరూ ఉండేది. (రాసుకునేది నేనే అని వేరే చెప్పక్కర్లేదుగా!)

అప్పటినించే నాకు మద్రాసు పిచ్చి.

అలాంటిది ఇన్నేళ్ళకి మద్రాసులో అడుగుపెట్టబోతున్నాను అంటే ఎంత టెన్షన్‌తో కూడిన ఉత్సాహం వుంటుంది?

అయితే అంతకుముందు మద్రాసు చూళ్ళేదా అంటే చూశా. బెంగుళూర్‌లో IAF ట్రైనింగ్ అవగానే నాకు న్యూఢిల్లీ పోస్టింగ్ వచ్చింది. బెంగుళూర్‌లో రాత్రి బయల్దేరి ట్రైన్‌లో మద్రాసులో దిగాం. ఆ పగలంతా స్టేషన్‌లోనే ఉన్నాం. సాయంత్రం జి.టి.కి మద్రాస్ టు న్యూఢిల్లీ ప్రయాణం. పగలంతా ఖాళీనే గనక కాసేపు స్టేషన్ బయటికొచ్చి అటూ ఇటూ రోడ్డుమీద తిరిగాం. అంతే.

ఇప్పుడు అలాక్కాదు. సంవత్సరంపాటు ట్రైనింగ్. అంటే సాలిడ్ వన్ ఇయర్ స్టే అన్నమాట!

చెన్నై (సారీ..మద్రాస్)లో అయిదున్నరకి మెయిల్ ఆగింది. దిగాను. నాతోపాటు 'హరి' అని ఇంకో ఏర్‌ఫోర్స్ అతను కూడా దిగాడు. బయటికి రాగానే మా (IAF)వెహికల్ రెడీగా వుంది. కిట్ బాక్సూ, సూట్‌కేసూ ఎక్కించి మేమూ ఎక్కాము. ఏర్‌ఫోర్స్ స్టేషన్ తాంబరంలో కాసేపటి తరవాత దిగాము. మాకో బుల్లెట్ కేటాయించారు... మిగతా ట్రైనీలతో పాటు మళ్ళీ మంచం, కప్‌బోర్డు, పరుపూ, రగ్గులూ, బెడ్‌షీట్లూ (ETC) కొత్తవి ఇష్యూ చేశారు. టిఫిన్ తినేసి కప్‌బోర్డులో నీటుగా వస్తువులూ, బట్టలూ సర్దుకుని ట్రైనింగ్ సెంటర్ మెయిన్ ఆఫీస్‌లో రిపోర్టు చేశాం. ఆ రోజు రెస్టు తీసుకోమన్నారు.

బెడ్ మీద పడుకున్నాక అందరూ గుర్తుకొచ్చారు. గబగబా మా (IAF) స్టేషన్‌లోనే పోస్ట్ ఆఫీస్ ఎక్కడుందో బేచ్‌మేట్స్‌ని కనుక్కుని ఓ ఇరవై ఇన్‌లాండ్ కవర్సూ, ఓ ఇరవై ఇండియన్ కవర్సూ, ఓ ఇరవై కార్డులూ కొన్నాను. మొట్టమొదటి లెటరు రాసింది ఉమకి.

తరువాత పెద్దమ్మకి రాశాను. ఆ తరువాత అక్కలకీ అన్నలకీ కార్డులు రాశా. ఆ తరవాత 'నమ్రత'కి. ఎప్పుడూ లేనిది చాలా చాలాసేపు ఆలోచించాల్సివచ్చింది.. ఏమి వ్రాయాలా ఎంతని వ్రాయాలీ? బహుశా బబులీ మాటే కరెక్ట్. చాలా సహజంగా ప్రేమలో పడ్డాం. పెళ్ళి గురించిన ఆలోచనే లేదు ఇద్దరికీ. లత చెట్టుని అల్లుకున్నంత సహజంగా పెరిగింది మా అనుబంధం.

ఓ పక్క విపరీతమైన ప్రేమ, మరోపక్క నవయవ్వనపు మోహం, మరో పక్క జీవితంలో ఎదగడానికి (ఫైనాన్షియల్‌గా) చెయ్యాల్సిన ప్రయత్నాలు.. ఇవన్నీ ఒకేసారి మనసులో చొరబడితే, ఏం రాయాలో తెలియని సందిగ్ధంలో పడ్డాను. పోనీ ఏదన్నా కవితలూ గట్రా రాద్దామన్నా, ఓ తీవ్రమైన స్పందన కలిగితే గానీ వ్రాయలేని బలహీనత నాది. (ఇప్పటికీ వుంది).

నాలుగున్నర పేజీల (అరఠావులు... రెండు పక్కలా కూడా) ఉత్తరం వ్రాయడానికి రోజున్నరపట్టింది. అందులోనే (S.S.C) కి రాసే ఉద్దేశ్యం లేదని క్లియర్‌గా వ్రాశాను. ట్రైనింగ్ అయ్యాక డిగ్రీ పూర్తిచేస్తాననీ వ్రాశాను. ఇంకా బోలెడు స్వీట్ నథింగ్స్ కూడా. ఇంగ్లీషు సాహిత్యాన్ని బాగానే చదివాను గనక ఉత్తరాలు బాగానే రాసేవాడ్ని. 'భాష' ప్రాబ్లం ఉండేదికాదు. హిందీలో అయితే ఇంకా బాగుండేదేమో! కానీ హిందీ మాట్లాడటం తప్ప బాగా వ్రాయలేను.

నిజం చెబితే, మాతృభాషలో వున్నంత సౌలభ్యం సృష్టిలో ఏ భాషలోనూ వుండదు. కన్నతల్లీ - మాతృభాషా రెండు ఒకటే. వాటిని 'రీప్లేస్' చెయ్యలేము.

నాలుగున్నర పేజీలు రాసినా మనసుకెందుకో తృప్తికలగలేదు. కారణం తరవాత తరవాత అర్థమైంది. 'ఎదగటం' గురించిన ఆలోచన మనసుని 'గజిబిజి' చేస్తోందని. వచ్చింది (accept) చెయ్యడమేగానీ లేనిదాని కోసం అంగలార్చే స్వభావం కాదు నాది. బహుశా అని నా రక్తంలోనే వుందేమో!

మనసులోని 'ఆధ్యాత్మిక' పొరల్ని 'వాళ్ళు'లో రాశాను. ఎనిమిదో ఏటనించే బోధానందపురి మహరాజ్ వారి పరిచయమూ, ఆశ్రమంలో మహానుభావుల బోధ - ఆ తరువాత జీవితానికి ఓ స్పష్టమైన మార్గం చూపిన 'వాళ్ళు' ఇవన్నీ కూడా అనుకోకుండా జరిగినవని నేను అనుకోను. లాభనష్టాల చిఠాలు, సుఖఃదుఖాల లెక్కలూ వదిలి వెనకాల ఏముందో చూస్తే కనిపించేది ఒకే సత్యం. ఏది చేసినా ఏది చెయ్యకపోయినా జీవితం అనేది తన దారిన అదే సాగుతుందనే 'సత్యం'. ఆఫ్‌కోర్స్ అది తెలుసుకున్ననాడు జీవితం

సుఖవంతమౌతుంది. ఎందుకంటే ***బాధవల్లో, బాధపడటంవల్లో ఉపయోగం ఏముందీ, 'మజా' అంతా జీవించడంలో వుంది. జీవితాన్నించి పారిపోవడంలోనో, జీవితం గురించి భయపడటంలోనో లేదు.***

మా 'బులెట్' ముందు చాలా ఖాళీ స్థలం వుంది. నేను ఆరోజు సాయంత్రం ఓ వేపమొక్క దొరికితే ఆ ఖాళీ స్థలంలో ఓ పక్కగా, దేనికీ అడ్డురాకుండా నాటి నీళ్ళు పోశాను. మొక్కలు నిజమైన స్నేహితులు. అద్భుతమైన రెస్పాన్స్ ఇస్తాయి. అంతేగాదు.. అవి పెరుగుతున్నప్పుడు కలిగే ఆనందం అద్భుతం. ఆ మొక్కకి, 'అలౌకిక' అని పేరు పెట్టాను. ఆ తరువాత మరో చెట్టు (సారీ మొక్క) నాటి దానికి 'ఆమ్రపాలి' అని పేరు పెట్టాను. చిన్న రేకులమీద ఆ పేర్లు రాసి ఆ మొక్కల కుదుళ్ళలో పెట్టాను. ఆ పేర్లు ఎంత ఫేమస్ అయ్యాయో! ఆ తరువాత రెండో సంవత్సరం మరో ప్రమోషనల్ ట్రైనింగ్‌కి వెళ్ళినప్పుడు చూస్తే ఆరడుగులకి పైగా ఎత్తు ఎదిగాయి. ఓ సంవత్సరం క్రితం తాంబరం వెళ్ళినప్పుడు చూస్తే వృక్షాలై అద్భుతమైన నీడనిస్తున్నాయి. వాటిని కావలించుకున్నా. బహుశావాటికి నేను గుర్తుండేవుంటాను. మనుషుల్లాగా అవి 'మమత'ని మర్చిపోవుగా!

(చాలా రోజుల తరవాత ఓ ఆలోచన వచ్చింది. వాటికి అలౌకిక (పెద్దమ్మ పేరు), ఆమ్రపాలి అన్న పేర్లు పెట్టానుగానీ ఉమ పేరుగానీ నమత పేరుగానీ ఎందుకు పెట్టలేదని. కనీసం బబులీ పేరైనా పెట్టలేదు గదా. నామనసు చెప్పింది ఒకటే, పెద్దదైన పెద్దమ్మ కూడా రోజు రోజుకీ ఆ మొక్కలాగే ఆరోగ్యాన్ని పుంజుకోవాలనీ, ఆమ్రపాలి గర్వంగా ఎత్తుగా ఎదగాలనీ, నాటినప్పుడు అసంకల్పితంగా పేర్లు పెట్టినా, హృదయం లోలోపల, అంటే అంతరాంతరంగంలో వున్న భావన అదే!)

నేస్తమా.. యీలోకంలోకి నువ్వొచ్చినట్టు నీ గుర్తుగా ఒక మొక్కని నాటు. మరో మొక్కని కూడా నాటటం మర్చిపోకు.. అదీ నీ జ్ఞాపకచిహ్నంగా. ఎందుకంటే, ఎక్కడినించి వచ్చామో అన్వేషికి ఏదో రోజు వెళ్ళిపోకతప్పదుగా! నూర్జహాన్ ఓ కవిత వ్రాసింది. అది కవిత కాదు.. తను మనోభావం. "నా సమాధి దగ్గర మొక్కని నాటకండి.. ఎందుకంటే ఆ మొక్క పెద్ద చెట్టుగా మారినప్పుడు దాని కంట్లోంచి నీరు వొలుకుతుందిట. నేనాకన్నీటిని చూడలేను.. అందుకే నా సమాధి వద్ద మొక్కను నాటొద్దు!" అని. కానీ నేను నూర్జహాన్‌గారికి పూర్తిగా వ్యతిరేకం.

***"స్నేహితులారా.. నాకోసం.. నా జ్ఞాపకంగా మీరో మొక్కని నాటితే చాలు. ఇంకేమీ అడగను. ఎందుకంటే ఆ మొక్క పెరిగి చెట్టుగా, మానుగా రూపాంతరం చెందుతుంది. అప్పుడా చెట్టుమీద బోలెడన్ని పక్షులు వాలతాయి వాటి కిలకిలలో నాకు వినిపించేది సృష్టికర్త తన కాలపు వీణ మీద శృతించే సంగీతం. ఆ కిలకిలారావాల్లో మీ స్నేహం నన్ను పలకరిస్తుంది. మీ చిరునవ్వులు నాకు కనపడతాయి!"***

మళ్ళీ వారానికి రెండుసార్లు హెయిర్ కట్‌తో ట్రైనింగ్ మొదలయింది. నాకు రోజుకల్లా ఉమ ఉత్తరం వచ్చింది. రెండు పేజీలు. అంతా నా గురించే, నా ఆరోగ్యం గురించీ నా బాగోగుల గురించి జాగ్రత్తలే. ఓ అపురూపమైన అనురాగ రాగం మెత్తగా నా హృదయాన్ని స్పృశించింది.

అయిదో రోజున 'నమత' ఉత్తరం.. అచ్చు ఢిల్లీ ఎండలా! "క్యాబే.? (S.S.C) ని ఎందుకు అప్లై చెయ్యవు? ఎవడూ ఉన్నచోటే వుండకూడదు. ఎదగాలిరా పాగల్.." అంటూ తిడుతూ, ముద్దులిస్తూ మళ్ళీ తిడుతూ, మళ్ళీ బుజ్జగిస్తూ రెండుమ్ముప్పావు పేజీల వుత్తరం రాసింది. అమ్మయ్య.. బండి మళ్ళీ గాడిలో పడింది అనుకున్నాను.

అయిదో రోజే ఈవెనింగ్ పోస్టులో బబులీ ఉత్తరం. అందులోనే పెద్దమ్మ ఇంగ్లీషులో రాసిన మూడు పేరాగ్రాఫ్‌లు. ఆమ్రపాలి కూడా రెండు వాక్యాలు రాసింది. మూడున్నర పేజీలు.

కొన్నిచోట్ల కళ్ళు చెమర్చాయి. కొన్నిచోట్ల గుండె బరువెక్కింది. కొన్ని చోట్ల జ్ఞాపకాల మలయానిలం ఆహ్లాదపరిస్తే కొన్ని వాక్యాలు మనసుని మౌనంలో ముంచాయి.

ఆరో రోజుకల్లా అన్ని ఉత్తరాలకీ జవాబులు అందాయి. చెన్నై (మద్రాసు)కి వచ్చిన మొదటి వారం అలాగడిచింది. ఆదివారమంతా మళ్ళీ బూట్‌పాలిష్‌లతోనూ, యూనిఫాం వాషింగ్ అండ్ ప్రెస్సింగ్‌తోనూ గడిచింది. సాయంత్రం బజారుకి వెళ్ళాలనుకున్నాను. కానీ వెళ్ళలేదు. మా తాంబరం స్టేషన్‌లోనే (IAF) థియేటర్‌కి వెళ్ళాను. టిక్కెట్టు అర్ధరూపాయి. సినిమా పేరు 'శ్రీ 420'. నమ్రతతో కలిసి ఢిల్లీలో చూసిందే మరోసారి మళ్ళీ జ్ఞాపకాల బీరువా తలుపులు తీశాను. ఓపెనింగ్‌లోనే అద్భుతమైన పాట..

"మేరాజూతా హై జపానీ — నా బూట్లు జపాన్‌వి
ఏ పతలూన్ ఇంగ్లీస్తానీ — దుస్తులు ఇంగ్లీషువి
సర్ పే లాల్ టోపీ రూసీ — తలమీది ఎర్రటోపీ రష్యాది
ఫిర్ భీ దిల్ హై హిందుస్తానీ" — హృదయం మాత్రం హిందుస్తాన్‌దే"

అబ్బ.. మైమరిచిపోయా.. Long live RK, Long Live Sankar Jai Kishan, Long Live ముఖేష్, శైలేంద్ర, హజ్రత్ and all the Group.

(సినిమాని నెట్‌లో చూడండి స్నేహితులారా.. ప్రామిస్.. మిమ్మల్ని మీరు మర్చిపోతారు..!)

***ఫిర్‌మిలేంగే***

"**కర్‌వటే బదల్ తె** రహే సారీ రాత్ హమ్.. ఆప్‌కీ.. కసమ్.. ఆప్‌కీ... కసమ్"

(తెల్లవార్లూ అటునించి ఇటూ.. ఇటు నించి అటూ భంగిమలను మార్చుకుంటూనే వున్నాను (దొర్లుతూనే వున్నాను)... మీమీద ఆన.. మీమీద ఒట్టు)

"యాద్ మే తేరీ జాగ్.. జాగ్ కె హమ్.. రాత్ భర్ కర్ వటే బదల్‌తే హై"

(మీ జ్ఞాపకాలతో మేలుకొని తెల్లవార్లు నిదురపట్టక దొర్లుతూనే వున్నాను)

చిత్రం ఏమంటే తెల్లవార్లూ నిద్దరపట్టక యీ పాటల్నే పాడుకుంటూ, జ్ఞాపకాల వుయ్యాలలూగుతూ గడిపేశాను. పురివిప్పే యవ్వనం ఓపక్క, నిట్టూర్పుల నీడ వొదలని విరహం మరోపక్కా మనసునీ, శరీరాన్నీకూడా కాల్చేస్తున్నాయి. "ఏమైనా సరే.. ఓ వారం సెలవు తీసుకోవాలి. ఢిల్లీ వెళ్ళాలి. అటూ ఇటూ ఊగాడే మనసుకి స్వస్థత కలిగించాలి. మరో పదకొండు నెలలకి సరిపడా 'తియ్యని' జ్ఞాపకాల్ని మూటగట్టుకురావాలి." ఇదీ.. నా ఆలోచన. ఆ మాటే ఉత్తరంలో రాశాను నమ్రతకి.

"డోంట్ కమ్.. లెటర్ ఫాలోస్" అని టెలిగ్రాం వచ్చింది మూడోరోజుకి. ఆ రోజుల్లో ఇళ్ళలోనే 'ఫోన్'లు అరుదుగా వుండేవి. 'సెల్‌ఫోన్' అనేది నాడు కలలో కూడా లేని వస్తువు. అర్జంటు విషయాలు తెలపాలంటే ఏకైక మార్గం టెలిగ్రాం. కొన్ని దశాబ్దాలు ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో కబురందించింది టెలిగ్రాం. దేవుడా.. ఆ టెలిగ్రాంనే తంతి తపాలా శాఖవారు తొలిగించక తప్పలేదు. కారణం సెల్‌ఫోన్ అందరికీ అందుబాటులో వుండటమే.

మళ్ళీ నాకే నవ్వొచ్చింది. మనిషి లోకంలోకి తెచ్చే ప్రతి సరికొత్త వస్తువూ, అంతకు ముందు వుండే వస్తువులకి భస్మాసురహస్తం అవుతుంది.

ట్రాక్టర్ రావడంతో నాగళ్ళూ ఎడ్లూ పనికిరాకుండా పోయాయి. అంతేకాదు వందలాది కమ్మరి కొలుములు మూతబడ్డాయి. ప్లాస్టిక్ రాగానే ఇత్తడి బిందెలు కుండలు అన్నీ కనుమరుగయ్యాయి. జర్మన్ సిల్వర్ (సీవెండి / సీమ వెండి) వచ్చి ఇత్తడినీ కంచునీ మట్టిపాత్రలనీ చావుదెబ్బకొడితే, స్టీలు వచ్చి సీమ వెండిని టెంకిజెల్ల కొట్టింది. బాల్‌పెన్నులొచ్చి 'ఫౌంటెన్' పెన్నుల నడుము విరగ్గొట్టాయి. 'బాటా' కంపెనీ వచ్చి చర్మకారుల్ని చితగ్గొట్టింది. రెడీమేడ్ దుస్తులు ఎంతగా దేశాన్ని ఆక్రమించాయంటే, 'దర్జీలు' కొనప్రాణంతో ఉండేంతగా. మిల్లు వస్త్రాల్ని త్యజించమని నాడే గాంధీగారు ఎంత మొత్తుకున్నా, క్విట్ ఇండియా ఉద్యమంలో ఎంత ప్రబోధించినా, జరగాల్సిన డామేజీ జరిగిపోయింది. చేనేత పరిశ్రమ బిక్కుబిక్కుమంటూ వుంది. ఇక మద్యం సంగతి సరేసరి.. ఏరులు పారినట్లు పారుతూనే వుంది.

ఆ రోజుల్లో మా వూరి భూకామందు 'మందు'ని హైద్రాబాదునించో మద్రాసు నించో తెచ్చుకునేవారు. ఇప్పట్లాగా అప్పుడు విజయవాడ ఏలూరులాంటి నగరాల్లో కూడా బహిరంగ వైన్‌షాపులు వుండేవికాదు.

ఇప్పటి సంగతి వేరు. వైను షాపులేని వీధి ఏది? గుడిలేని వూళ్ళూ బడిలేనే లేని వూళ్ళూ ఎన్నైనా ఉండొచ్చు. బ్రాందీషాపు లేని వూరు మాత్రం వుండనే వుండదు.

ఇవన్నీ కథాగమనానికి అడ్డు తగిలే విషయాలే! కానీ, చెప్పక తప్పదు మరి. కారణం ఉత్తరం రావాలిగా. ఆ వుత్తరం వచ్చేంతవరకూ నా మనసులోని ఆరాటమూ ఆత్రతా ఓ విధమైన సందేహమూ సాయంత్రపు నీడలా నన్ను మింగేసిన నిరాశా ఇలా ఎన్ని విధాలుగా చిత్రవధ అనుభవించానో ఎలా తెలుస్తుంది?

ఇప్పుడైతేనా? ఓ సెల్‌ఫోన్ రింగిస్తే చాలు. ఉత్తరాలు మనసుల్ని దగ్గర చేసేవి. ఒక్కో వుత్తరాన్నీ కొన్ని వందలసార్లు చదువుకునేవాళ్ళం. ఎన్ని గంటలూ రోజులూ మాట్లాడినా సెల్‌ఫోన్‌లో మాట్లాడింది ఏమి గుర్తుంటుంది?

"ఎందుకలా వున్నావూ?" అడిగారు భువనేశ్వరమ్మగారు.

"ఏదో.. ఓ ఉత్తరం రావాల్సింది రాలేదు" తల కొంచెం దించుకుని అన్నాను. అప్పటివరకూ ఆమెకి నా విషయాలు పెద్దగా ఏమీ చెప్పలేదు.

***"ఓటమికి సిద్ధపడిన మనసే, గెలుపుని సంపూర్ణంగా ఆస్వాదించగలదు."*** నవ్వి అన్నారు. ఎందుకన్నారని నేను అడగలేదు. కానీ, ఆవిడ అన్నమాటలోని అర్థం అద్భుతం. బహుశా కూర్చున్నచోట కూర్చోకుండా అటూ ఇటూ తిరుగుతున్న నా చాంచల్యాన్ని అర్థం చేసుకుని ఉంటారనుకుంటాను.

చిత్రం ఏమంటే నా 'మొహం' దేన్నీ దాచుకోలేదు. ఆవిడా విషయం ఏమిటని నన్ను మళ్ళీ అడగలేదు. 'అనవసర కుతూహలం' లేకపోవడం అనేది నిజంగా జన్మసంస్కారానికి సంబంధించింది. నూటికి తొంభైమందికి కావల్సింది ఇతరుల విషయాలే! ఇతరుల విషయాల్లో తలదూర్చడం అనేది వారికి మహదానందకారణం.

వారం రోజులు గడిచినా ఉత్తరం రాలేదు. ఆలోచించీ ఆలోచించీ నా బుర్ర మొద్దుబారిపోయింది. ఎంతగా అంటే, ఆ వారంరోజుల్లో ఏ వొక్కరికీ జవాబు వ్రాయలేనంత.

కనీసం 'గుడ్‌మార్నింగ్' అని ఎవరన్నా 'విష్' చేసినా నేను కేవలం నవ్వేవాడ్నే తప్ప జవాబు చెప్పలేకపోయేవాడ్ని. అసలు జవాబు ఇవ్వాలనే అనిపించేదికాదు.

రోజు రోజుకీ నాలో అసహనం పెరగసాగింది. అసహనంలోంచి కోపం భయంకరంగా పెరగసాగింది. జస్ట్.. ఒక్క ఉత్తరం రాలేదన్న చిన్నవిషయానికి అంత కోపం ఎందుకురావాలి? ఎంతకోపమంటే, సరదాగా 'జోక్' చేసిన నా ఎం్రటీమేట్‌ని లాగి లెంప పగిలేట్టు కొట్టేటంత.

"కోరికవల్లనే కోపం పుట్టుకొస్తుంది. కోపమే కాదు.. కోరిక అనేది (కామం అనేది) తీరకపోతే క్రోధం, లోభం, మదం మాత్సర్యం అన్నిటికీ కారణమతుంది" అన్న 'స్వామీజీ' బోధ గుర్తుకొచ్చింది.

ఒక చిన్న 'జోక్'ని భరించలేనంతగా తయారయ్యానా అని ఆనాడు అనిపించలేదు. ఆనాడు అది సహజంగానే అనిపించింది. 'నా గోలలో నేనుంటే వీడెవడూ జోక్ చెయ్యడానికి?' అని మమ్మల్ని విడదీసే ప్రయత్నంలో వున్న వాళ్ళని ప్రశ్నించాను కూడా, నేను కొట్టిన లెంపకాయ జీవితాంతమూ వాడికి ఓ అవమానంగా గుర్తుండిపోతుందని నేను పొరబాటున కూడా భావించలేదు. నిజమేగా మరీ! నన్నెవరైనా కొడితే నేను మర్చిపోగలనా?

"ఏం జరిగిందీ?" భువనేశ్వరమ్మగారడిగారు. మొత్తం, అంటే వాడు జోక్ చెయ్యడం, నేను కొట్టడం గురించి చెప్పాను. చాలాసేపు ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

"నీలోని కోపానికి నువ్వు లొంగటం అంటే, నీలోన దాక్కున్న రాక్షసుడ్ని నువ్వు పెంచి పోషించడమే. అంతేగాదు.. ఓ చిన్న చిరునవ్వు నవ్వాల్సిన చోట ఓ మనిషి మనసుని నిట్టనిలువుగా చీల్చేశావు. ఆలోచించు..' నీలాంటి' వాడు చెయ్యదగ్గ పనేనా అదీ?" మెల్లగా అన్నారావిడ. 'నీలాంటి' అన్న పదం ఎందుకన్నారంటే, నన్ను ఓ పసివాడిలానే చూసేవారావిడ.

చాలాసేపు నేనూ మౌనంగానే వున్నాను. ఓ అరగంట తరువాత లేచి 'బులెట్'కి వెళ్ళాను.

'యూ హావ్ ఏ లెటర్.." చేతికందించాడు త్రినాథ్ సాహా. హేండ్‌రైటింగ్ చూడగానే తెలిసింది అది నమ్రతనించి అని. గబగబా చదివా. మొత్తం ఫేమిలీ అంతా నైనిటాల్ వాళ్ళ పిన్నికొడుకు నిశ్చితార్థం కోసం వెడుతున్నారట. తను ఢిల్లీలో (అంటే గుర్గావ్‌లో) ఉండదు గనక రావొద్దని టెలిగ్రాం ఇచ్చిందిట. "మా అన్న నిశ్చితార్థం బాగా జరిగింది. మనదెప్పుడోనని ఊహల్లో గడిపేశాను" అన్న వాక్యం నా ప్రాణాల్ని మళ్ళీ నా శరీరంలోకి తెచ్చింది.

నా మంచానికి పది మంచాలు అవతల పడుకుని వున్నాడు విజయ్ మల్‌హోత్రా. అతన్నే నేను చెంపదెబ్బ కొట్టింది. చాలా జోవియల్ పర్సనే. అతనంటే నాకూ గౌరవమే. కానీ, నా అసహనం నన్ను మూర్ఖుడ్ని చేసింది.

గబగబా అతని మంచం దగ్గరకి వెళ్ళాను.

"ఐ యామ్ సారీ విజయ్" అని అతని పాదాలు 'టచ్' చేశాను.

"అరే.." ఖంగారుగా లేచాడు.

"రియల్లీ సారీ.. చాలా తప్పుగా ప్రవర్తించాను.... నన్ను క్షమించు " మనఃస్ఫూర్తిగా అన్నాను.

"ఓ...దాన్ని గురించి మర్చిపో.. నువ్వేదో బేడ్‌మూడ్‌లో వున్నావని కూడా గుర్తించకుండా జోక్ చెయ్యడం నా తప్పే." నా చేతుల్ని తన పాదాల మీద నించి తీసేస్తూ అన్నాడు విజయ్ మల్‌హోత్రా.

ఆ తరువాత మేం బెస్ట్‌ఫ్రెండ్సమయ్యాయి. ఆ విషయం అలా పెడితే, నేనొక విషయాన్ని నేర్చుకున్నాను. ఎంత 'సాధన' చేసినా మనం కంట్రోల్ తప్పడానికి ఒక్క సెకన్ కూడా పట్టదని. అందుకే అన్నారనుకుంటా.. తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త అని (ఎల్లప్పుడూ మేల్కొనే వుండు, ఏమరుపాటు తగదు - అని)

పగలు తప్పు చేసినా, ఇతరుల్ని బాధ పెట్టినా, పడుకోబోయేముందే వారి దగ్గరకు వెళ్ళి తప్పుని ఒప్పుకోవడం, క్షమార్పణ చెప్పుకోవడంలో మనసు తేలిక పడటమేగాక 'అహం' అదుపులో ఉంటుంది. 'తప్పులు చెయ్యడం కూడా క్రమంగా తగ్గుతుంది. ఒప్పుకోడానికి ధైర్యం లేనప్పుడు తప్పే చెయ్యకూడదు. ఇతరుల్ని నువ్వు బాధపెడితే, ఆ బాధ ఇతరుల్నేకాదు నిన్నూ బాధపెడుతుందని గుర్తుంచుకో!' ఇదీ నేను నేర్చుకున్నది.

వెయ్యి మేఘాలు ఒక్క నిముషపు గాలికి ఎగిరిపోయినట్టు నమ్రత ఉత్తరం నాలోని అసహనాన్నీ, బాధనీ పటాపంచలు చేసింది. మరింత ఉత్సాహంగా జవాబు వ్రాశాను.

అంతేగాదు.. మల్హోత్రాని క్షమార్పణ అడగటం గురించికూడా భువనమ్మకి చెప్పాను. ఆవిడ నన్ను మెచ్చుకోవాలనే ఉబలాటం అంతర్గతంగా ఆనాడు నాలో వుందని నేను గుర్తించలేదు. ఇప్పుడు ఆలోచిస్తే తెలుస్తోంది. మనిషి చేసే ప్రతిపని వెనకా ఏదో ఓ రీజన్ (స్వార్థపరమైనదే) ఉంటుందని ఆ పనిని 'బుద్ధి'తో పరిశీలించినప్పుడే మనకి అర్థమవుతుంది. ఏమి చెయ్యాలో - ఏమి చెయ్యకూడదో.

<u>***నేను కలిసిన మొట్టమొదటి మహానుభావుడు:***</u> పాండీబజార్ 'రాజకుమారి' థియేటర్లో 'బంగారుపాప' సినిమా ఆడుతోంది. ఏర్‌ఫోర్స్ స్టేషన్ తాంబరంనించి నేనూ హరిబాబూ చూడ్డానికి వచ్చాం. అప్పటికే సినిమా స్టార్ట్ అయిపోవడం వల్ల తరువాతి షో చూద్దామనుకుని పాండీబజార్‌ని 'సర్వే' చెయ్యడం మొదలెట్టాం. హరిది మా వూరే. చిన్నప్పటినించీ నన్ను 'అన్నా' అని పిలవడమేకాదు, నా స్ఫూర్తితోనే ఏర్‌ఫోర్స్‌లో చేరినవాడు. ఓ రౌండు కొట్టి మళ్ళీ థియేటర్ దగ్గరికొచ్చాం. ప్లాట్‌ఫాం పక్కన కార్లో ఓ పెద్దాయన కూర్చుని ఉన్నారు. చూడగానే గుర్తుకొచ్చారు ఆయన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారని. పండంటి మనిషి. పాదాలకి నమస్కారం చేశాను. మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాము. వారు తమ ఇంటి అడ్రస్ ఇచ్చి ఖాళీ వున్నప్పుడు రమ్మని చెప్పారు. (అప్పటికే వారికి 'వాయిస్' పోయింది. కాగితాల మీద 'రాస్తూ' సంభాషించేవారు.) నెంబరు తొమ్మిది జగదాంబాళ్ స్ట్రీట్, టి.నగర్. ఆ తరువాత ఎన్నిసార్లువారింటికి వెళ్ళానో! మా ఏర్‌ఫోర్స్ 'రూపాయన్ థియేటర్లో' ఓ ఉగాదినాడు వారికి సన్మానం చెయ్యడం జరిగింది. వారిగురించి స్టేజీమీద మాట్లాడే అదృష్టం నాకు దక్కింది.

అత్యంత మధురమైన జ్ఞాపకాలలో అది ఒకటి. 'మధురం' ఎందుకంటే మల్లీశ్వరి పాటలన్నీ గుక్కతిప్పుకోకుండా పాడేవాడిని. ఆ పాటలంటే ఇప్పటికీ నాకు ప్రాణమే.

"నువ్వేం కాదలుచుకున్నావూ? అదే. మిలటరీ నించి బయటికొచ్చాక!" అని రాశారు కృష్ణశాస్త్రిగారు.

"సన్యాసిని అవుదామనుకుంటున్నానండీ.. కాషాయం కట్టుకుని, ఇవాళ ఉన్నవూళ్ళో రేపు వుండకుండా తిరుగుతా. అయితే ప్రజలకి వ్యర్థప్రసంగాలివ్వాలని లేదు.." అన్నాను. చాలా మాట్లాడాలి అనుకున్నానుగానీ, ఆయన చిరునవ్వు చూశాక మాటలు రాలేదు. తెల్లని వెన్నెల్లాంటి ఉంగరాల జుట్టూ. తెల్లని లాల్చీ పంచె, పండంటి రూపం.

ఇప్పుడు తలుచుకుంటే విచిత్రంగా వుంది. నేను గీతరచయితని కావడం యాదృశ్చికం కాదు. చిన్నప్పటి నించీ నాతోపాటు పెరిగిన కోరికే అది. కానీ, ఆయన ఎదురుగా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా 'సన్యాసం తీసుకోవాలని ఉంది' అని ఎలా చెప్పానూ?

అది నా అంతరాంతరాల్లోని మాట. ఏదీ 'అంటని' నా అసలు సిసలు తత్వం. ఆనందం, విషాదం, సుఖం, దుఃఖం, గర్వం, అవమానం, మమకారం, అహంకారం అన్నీ 'తత్‌క్షణాల్లో' ప్రతిఫలిస్తాయేగానీ మనసుకి అంటుకోవు. ఇది నిజంగా వరమో శాపమో నాకు తెలీదు. ఇప్పటి సంగతి వేరు. మరి అప్పుడు?

మనసులో అనుకున్న పని వెంటనే చేసేవాడ్ని. ఆలోచించడమనే ప్రసక్తేలేదు. అందరూ ఆలోచించి మాట్లాడేవాళ్ళు. నన్నూ అలాగే మాట్లాడమని ఎందరో చెప్పారు.. సలహాలూ ఇచ్చారు. అది మాత్రం వచ్చేదికాదు. ఠక్కున మనసులో మాట యధాతథంగా వచ్చేది.

అంతెందుకూ, 'ప్రేమదేశం' డైరెక్టర్ 'కదిర్' నాతో ఓపెన్‌గా అన్నారు.. "భువన్.. మీ మొహం చాలా సున్నితం. మీ మనసులోని భావాన్ని తక్షణమే ప్రతిఫలిస్తుంది. ఆ విషయంలో మీరు జాగ్రత్త పడాలి! నేను ఫలానా విధంగా పాట వ్రాయమనడం మీకెందుకో నచ్చలేదని మీ మొహం చెబుతోంది" అన్నారు.

ఆయన అన్నది నిజమే. నేనూ శ్రీరామకృష్ణగారూ వారి ఆఫీసులోనే కూర్చున్నాం. సినిమా పేరు 'లవ్ వైరస్'. విజువల్ చాలా గ్రాండ్‌గా ఉంది. తమిళ లిరిక్ ఎంత బాగున్నా 'షాట్.. టు షాట్' కి మాచ్ కావడంలేదు. (తెలుగులో రాసినప్పుడు) పోనీ, అలాగే రాసేసి ఊరుకుందామంటే నా మనసు ఒప్పుకోలేదు. అలా రాస్తే అది ట్రాన్స్‌లేషన్ అవుతుందిగానీ 'రచన' కాదు. చివరికి ఇద్దరం కాంప్రమైజ్ అయ్యామనుకోండీ.. అది వేరే కథ. 'కోపం' అస్సలు కంట్రోల్‌లో వుండేదికాదు. ఎదట ఎవరున్నా 'నోరు' లెక్కచేసేదికాదు. నా క్షణికావేశం చాలామందిని బాధపెట్టేది. గుడ్డిలో మెల్ల ఏమంటే నా తప్పుకి నేనే రియలైజ్ అయ్యేవాడిని. ఆ మరుక్షణం క్షమార్పణలు చెప్పేవాడిని.

జరగాల్సిన డామేజీ జరిగాక క్షమార్పణలవల్ల ఏం ఉపయోగం వుంటుందీ? అయినా నన్ను క్షమించేవాళ్ళు. బహుశా అది అమ్మవారి దయవల్ల అయివుండొచ్చు.

"అబ్బాయ్ 1. నువ్వు ఎస్.ఎస్.సిని నెగ్లెక్ట్ చెయ్యకు.(నిర్లక్ష్యం చెయ్యకు) ఎందుకంటే పదవి, హోదా వచ్చే అవకాశం వున్నప్పుడు మోకాలు అడ్డుపెట్టకూడదు. నంబర్ 2. 'తృప్తి' అనేది ప్రగతి మార్గానికి గండి కొడుతుంది. యీ వయసులో వుండాల్సింది దాహం. తృప్తికాదు. 3. నిన్నటి నీ వైఫల్యం రేపటి నీ సాధానికి మెట్టుగా మారాలి అంటే, వర్తమానాన్ని నువ్వు అవిశ్రాంతంగా ఉపయోగించుకోవాలి.. ఇవి మా నాన్నగారు నీకు ప్రత్యేకంగా చెప్పమన్న మూడు విషయాలు అంటూ మరుసటి ఉత్తరంలో రాసింది నమ్రత. నాకు చచ్చేంత నవ్వొచ్చింది.

అసలు ప్రగతి అంటే ఏమిటీ? లాభనష్టాల చిఠానా? ఓరి మూర్ఖమానవుడా.. మనం వేసే ప్రతి అడుగూ మృత్యువు వైపుకే. సర్వం ఇక్కడే వదిలిపోవాలి. అమూల్యమైన జీవితాన్ని రంగురాళ్ళ కోసమో జీతపు రాళ్ళకోసమో వ్యర్థం ఎందుకు చెయ్యాలి?

ఈలోకంలో నువ్వు కేవలం ఒక అతిథివి. కన్నతల్లికంటే గొప్పదైన యీ ప్రకృతిని ప్రేమించు.. నా మనసేమో ఇలా ఆలోచించేది. ఓ కదిలే మబ్బుని చూసినా, మట్టిని చీల్చుకుని అప్పుడే తలెత్తిన ఓ పసిరికని చూసినా, రెక్కలల్లార్చుతూ ఓ కొమ్మ మీంచి మరో కొమ్మమీదకి ఎగిరే పక్షిని చూసినా -

చల్లగా తనువుని స్పృశించే వానచినుకుని చూసినా, చెట్టునీడలో హాయిగా అర్ధనిమీలిత నేత్రాలతో 'నెమరు' వేసే ఆవుల్నీ పశువుల్నీ చూసినా, చిరుగాలికి తలలూపే పూవుల్ని చూసినా బిడ్డ ఒళ్ళంతా నాకుతూ పరవశించిపోయే గోమాతల్ని చూసినా, అంతెందుకూ పువ్వుల మీదా పచ్చని మొక్కల మీదా వాలే సీతాకోక చిలుకల్ని చూసినా నా మనసు ఆనందంతో పొంగిపోతూ వుంటుంది. ఇప్పటికీ రోడ్డుమీద వెళ్ళే ఆవు గంగడోలు నిమురుతూ అవి మోరలెత్తితే మై మరిచిపోతా. దూడలకి అరటి పళ్ళు తినిపిస్తుంటే ఆనందం.

కుక్కపిల్లలకి బిస్కెట్లు వేసి అవి తింటుంటే చూడటం పరమానందం.

నాయనా.. సృష్టిలో ఆనందం లేనిది ఎక్కడా? అందంలేని జీవైనా వస్తువైనా యీ లోకంలో అసలున్నదా?

ఒక్కసారి నీ నీడని చూసుకో.. ఎంత బాగుంటుందో. పక్షుల కిలకిలారావాలు విను.. ఎంతగా ప్రాణం లేచి వొస్తుందో!

సరే.. మళ్ళీ రామాయణంలో పిడకలవేట మానితే, నేను రాసిన ఉత్తరానికి నమ్రతకి పిచ్చి కోపం వచ్చింది.

'You are Simply Mad' అన్న ఏక వాక్యంతో ఉత్తరం ముగిచింది.

'To Be Mad is not very bad or sad' అని మళ్ళీ 'పిచ్చి' ఇంగ్లీషులో నేనూ ఏక వాక్య లేఖ రాశాను.

"నుమ్హే పరమ మూర్ఖుడివి" (హిందీ ఏక వాక్యలేఖ) నమ్రత

"ధన్యవాదాలు! నువ్వు గనకనే నన్ను సరిగ్గా అర్థం చేసుకోగలిగావు" (నేను)

"నువ్వెదురుకుండా వుంటే నేనేం చేస్తానో భగవాన్, - నాకే తెలీదు" (నమ్రత)

"Good God.. నేనేం చెయ్యాలో ఏం చేస్తానో నాకు స్పష్టంగా తెలుసు)" (నేను)

"Keep Your Mouth SHUT" (నమ్రత)

"నువ్వు అవకాశం ఇస్తే ఇద్దరం ఆ పనే సుఖంగా చేద్దాం" (నేను)

'స్వీట్ నథింగ్స్' అని వీటినే అంటారనుకుంటాను. (దే ఆర్ స్వీట్.. బట్ దే రీజ్ నథింగ్ యూజ్ ఫుల్ ఇన్ దెమ్)

వారానికోసారి టి.నగర్ వెళ్ళేవాడిని. తాంబరం నించి మాంబళంలో దిగి నడుచుకుంటూ పాండీబజార్లో తిరిగేవాడిని. అప్పుడే శివజ్ఞానం స్ట్రీట్‌లో చూశా.. 'సంధ్య'గారిల్లు. అంటే జయలలిత (CM)గారి మాతృమూర్తిగారి ఇల్లు. ఆమె గొప్పనటి. నర్తనశాలలో విరాటరాజు భార్యగా నటించారు. గుర్తుండే వుంటారు కదా! ఆరుద్రగారి ఇంటిముందూ నడిచేవాణ్ణి. చారీ స్ట్రీట్‌లోకి మళ్ళీ అక్కడ్నించి కోడంబాకం బ్రిడ్జిమీదుగా కోడంబాకంలో తిరిగేవాడ్ని.

చిత్రం ఏమంటే, సినిమాల్లోకి వచ్చినప్పుడు, ఆరుద్రగారి ఇంటి వెనక వున్న 'మలర్ కొడి మేన్షన్'లో రెండేళ్ళు ఉన్నా. ఆ తరువాత 'శివజ్ఞానం' స్ట్రీట్‌లో సంధ్యగారి ఇంటి పక్క ఇంట్లో వున్నా. ఆ తరువాత చారీ స్ట్రీట్‌లో చాలా యేళ్ళుండి ఆ తరువాత 'వలసరవాకం' (ప్రస్తుతం ఉండే చోటు)కి ఇల్లు కట్టుకుని వచ్చాను. మద్రాసులో ఇల్లు కడతానని జన్మలో ఊహించనుకూడా వూహించలేదు. ఇప్పటికీ నాకు ఆశ్చర్యమే. అందుకే అనుకుంటాను, "యీ ఇంటికి నేను కస్టోడియన్ని మాత్రమే.. యజమానిని కాను" అని.

'శరీరమనే 'ఇల్లే' అశాశ్వతం కదా!

టీ నగర్‌లో తిరుగుతూ ఓనాడు ఉస్మాన్ రోడ్డులో షావుకారు జానకిగారిని చూశాను. ఆవిడ చారీ స్ట్రీట్ మొదట్లో వున్న హార్డ్‌వేర్ షాప్‌లో ఓ రేకు బక్కెట్‌ని (నూతులకు వాడేది) బేరం చేస్తున్నారు. బేరం 38 రూపాయల 50 పైసలకి కుదిరింది.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను. "మేడమ్.. నా పేరు రాజు.. నేను ఏర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నా." అని (తెలుగులోనే)

ఆవిడ చాలా అనునయంగానూ ఆప్యాయంగానూనవ్వి, కుశలప్రశ్నలూ అవీ వేసి, "తరువాత ఏం చేస్తారూ?" అని ఆదరంగా అడిగారు. నేను మహోత్సాహంగా, "సినిమాల్లోకి రావాలని నాకోరిక మేడమ్" అన్నాను.

"అంటే ఎలా?" చిత్రంగా నావంక చూసి అన్నారు.

"బహుశా రచయితగా. నేను కవిత్వం రాస్తాను" అన్నా.. గొప్పగా.

"ఏదీ వినిపించండి ఒకటి" కార్లో కూర్చునే ఓపిగ్గా అడిగారు.

"కూయబోకే కోయిలా.. కూసి కూసీ అలసిపోకే" అనే ఓ పాట రోడ్డుమీద నిలబడే పాడి వినిపించా.

"భేష్. పైకొస్తారు. తప్పకుండా ఫీల్డుకి రండి" అని నంబరు కూడా ఇచ్చారు. ఎంతటి ఆశీస్సు అదీ!

మళ్ళీ 'గుండె' గడియారం (వెనక్కీ ముందుకీ, కుడికీ ఎడమకీ)

ఆడుతోంది... లోలకాన్ని లయగా కదుపుతూ.. జీవితాన్ని కుదుపుతూ.

యవ్వనావేశంతో కూడిన ఉత్తరాలు న్రమతతో -

చల్లని కెరటాల్లాంటి లేఖలు ఉమతో -

మమతని కురిపించే కమ్మలు అమ్మతో -

స్నేహం వర్షించే లెటర్స్ బబులీతో ఆ్రమపాలితో సాగుతూనే వున్నాయి.

"ఆకాశపు పందిరిలో

ఉయ్యాలలూగుతూ.." ఊహలు పరుగుతీస్తూనే వున్నాయి.

"మళ్ళీ మనం వున్న పళంగా మనవూరి మ్రరి నీడలో నాటిలాగా ఆటపాటల్తో గడిపితే ఎంత బాగుంటుందిరా! నేను తలంటుకున్నాను. నువ్వు నా జుత్తుని వాసన చూస్తూ 'భలేవుందే' అనేవాడివి. నా శిరోజాల్ని నిమిరేవాడివి. ఎంత అమాయకత్వం.! ఎందుకోరా.. నా శరీరమే నాకో చెరసాలలాగా వుందిరా!" అని రాసింది ఉమ.... ఓ రోజున.

అవాక్కయ్యాను. ఏ నాడూ ఎప్పుడూ తన బాధని చెప్పుకోని మనిషి ఇలా ఎందుకు రాసింది? బుర్రనిండా ఆలోచనలు. క్లాసులో వున్నానన్న మాటేగానీ ఒక్క ముక్క బుర్రకి ఎక్కలేదు.

అప్పటికప్పుడు రైలో బస్సో లారీనో ఏదో ఒకటి పట్టుకుని వెళ్ళి తనని చూడాలనిపించింది.

కానీ ఎలా? ట్రైనింగ్‌లో ఉండేప్పుడు శెలవలు ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా అవి శనాదివారాల్లో మాత్రమే ఇస్తారు. అయిదురోజులు ఆగితేగానీ శనివారం రాదు. ఏం చెయ్యను భగవంతుడా? లోపల్లోపలే బాధ సుడులు తిరగసాగింది.

"దునియా బనానేవాలే

క్యాతేరే మన్‌మే సమాయీ

కాహేకో దునియా బనాయీ.. తూనే

కాహేకో దునియా బనాయీ? "

**మరుసటి రోజుకే మరో వుత్తరం** వచ్చింది.. ఉమ దగ్గర్నించి.

"సారీరా.. ఏదో బెంగలో అలా రాశానుగానీ, అంత అనారోగ్యమేమీలేదు. ఏ వ్యాపకము లేకపోతే మనసు 'విచారం' వైపుకి సాగిపోతుందేమో! అసలు యీ మనసనేది విచారాల్నీ దుఃఖాల్నీ మాత్రమే ఎందుకు గాఢంగా గుర్తుంచుకుంటుందీ? మధురమైన క్షణాల్ని మాత్రమే మళ్ళీ మళ్ళీ ఎందుకు తలుచుకోదూ? మొన్నంతా కూర్చున్నా, నుంచున్నా గతమే జ్ఞాపకం వొచ్చింది. అమ్మ నాకు నీడగా మాత్రమే తెలుసు. నాన్న? నేనంటే చాలా ప్రేమ. కానీ, కొన్ని 'బలహీనతలు' ప్రేమని కూడా జయిస్తాయిరా! ప్రేమకన్నా బలహీనతే బలమైనదని నాన్న విషయంలో రుజువైంది. ఓ పక్క చదువు, మరో పక్క వొంటరితనం..వీటి మధ్యలో నన్ను సేదదీర్చింది నీ స్నేహం ఒక్కటే. అప్పటి సంగతులు తలుచుకుంటే ఇప్పుడెంత నవ్వు వొస్తోందో. అసలు నాకు సిగ్గనేది లేదు కదూ! ఐనా, అదే బాగుంది. ఇష్టం వొచ్చినప్పుడు నిన్ను ముద్దుపెట్టుకునేదాన్ని, నిన్ను బెదిరించి మరి కావలించుకునేదాన్ని. ఎంత అమాయకమైన రోజులూ. నువ్వంటే నాకు పిచ్చిప్రేమ. ఆ ప్రేమ ఎటువంటిదీ? ఎన్ని రోజులు ఆలోచించినా నాకు జవాబు దొరకలేదు. ఆ ప్రేమ కేవలం శరీరానికి సంబంధించిందా అని కూడా ఆలోచించాను. నిన్ను చూస్తే నాలోని నన్ను - నాకు తెలియని నాలోని నన్ను, నేను వెతుక్కుంటున్నట్టూ, నాలోని నన్ను చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఏమో, ఏ జన్మలోనో నాలోని ఓ భాగం నీలో ఉండిపోయిందేమో. నేను నిన్ను ప్రేమిస్తున్నానా అని

ప్రశ్నించుకుంటే వచ్చే జవాబు ఏమిటో తెలుసా? నేను ప్రేమిస్తున్నది నీలోని నన్నే కానీ నిన్నుకాదని. పిచ్చిపిచ్చిగా ఉంది కదూ? స్పష్టమైన సమాధానం దొరికినప్పుడే అది అక్షరాల్లో ఇముడుతుంది. అనుభవానికి మాత్రమే తెలిసినవి ఏనాడూ అక్షరాలకి లొంగవుగా!

ఎన్నో మాట్లాడాలని వుందిరా. మళ్ళీ చిన్న వాళ్ళమైపోయి మర్రిచెట్టునీడలో ఒదిగిపోదామా? మళ్ళీ చెరువులో దిగి కలవపూలు కోసి ఆ మాలల్ని మెడలో వేసుకుందామా? ఏమిటోరా.. నాకు రెక్కలు వుంటే బాగుంటుందనిపిస్తోంది. నిన్ను తలుచుకుంటే మళ్ళీ చిన్నతనం నా చుట్టూ పచ్చికలా పరుచుకున్నట్టు అనిపిస్తోంది. సరేలే.. నువ్వు మాత్రం తొందర పడి పరిగెత్తుకురాకు. నీ ట్రైనింగ్ ముఖ్యం. చూడూ..నీ పక్కనే నేనుంటా.. అది గుర్తుంచుకో..." మరో నాలుగు పేరాలున్నాయి.. అవీ ఇలాంటివే. అంతా చదివాక నా మనసు మౌనమైంది. నాకు తెలుసు. ఒంటరితనం 'ఉమ'ని పిలిచేస్తోందని. ఆ ఊళ్లో అమ్మా ఒంటరిదే పోనీ ఉమని అమ్మతో వుంచితే? ఊహూ.. అదీ అంత సులువుకాదు. బాధ్యత మోసీమోసీ అమ్మ అలిసిపోయింది. అదేకాదు. ఉమకీ ఒకరకమైన బాధ్యతే అవుతుంది.

"ఇవాళ నా బర్త్‌డే, చిన్న పార్టీ." మెల్లగా అన్నాడు జి.కె.నాయర్. అంటే, గోపాలకృష్ణన్ నాయర్. ట్రైనింగ్ సెంటర్లో మాకు 'Bardays' ఉండవు. కానీ మావాడో బాటిల్ 'సీ పైరేట్ రమ్ ' సంపాయించాడు. నేనూ, జి.కె, రెడ్డి, బన్సల్ కూర్చున్నాము. రెండో పెగ్ తరవాత యధావిధిగా గానాబజానా షురూ అయింది. వెన్నెలరాత్రి.. బోలెడంత విశాలమైన పెరేడ్ గ్రౌండు. చిక్కని పచ్చిక మీద తెల్ల దుప్పట్లు పరుచుకుని కూర్చున్నాం. తినడానికి మిక్చరూ, పచ్చిమిరపకాయ బజ్జీలు జీడిపప్పులూ వంటి మహత్తరమైన తినుబండారాలు వున్నాయి.

బన్సల్ గాడు మొదటిపాట మొదలెట్టాడు. 'దాగ్' సినిమాలోది పాడింది తలత్ మొహమూద్.

"యే మేరే దిల్ కహీ ఔర్‌చల్..

గమ్‌కి దునియాసే దిల్‌భర్‌గయా..

ఢూంఢ్ లే అబ్ కో యీ ఘర్ నయా" అని.

(ఓ నా హృదయమా.. మరెక్కడికైనా తరలిపో.. వ్యధతో నా గుండె నిండిపోయింది

మరో కొత్త ఇంటిని వెదుకు.." అని అర్థం)

మరో ఇల్లు అంటే మరో శరీరమని కూడా అర్థం వుంది.

ఆ అర్థంతో మొత్తం పాటని మలుచుకుంటే, యీ పాటని మించిన 'జీవతత్వం' మరెక్కడా దొరకదు. పడుతూ లేస్తూ లలితాపవార్ బిడ్డకోసం పరుగులెడుతుంటే ప్రేక్షకుల కళ్ళు వర్షిస్తూనే వుంటాయి.

ఓ అద్భుతమైన నటి లలితాపవార్. మన సూర్యకాంతంగారిలా ఎంత గయ్యాళితనాన్ని ప్రదర్శించగలదో, కరుణరసాన్ని కూడా అంతే అద్భుతంగాను పండించగలదు. ఒక్క కంటి చూపుతో నట విశ్వరూపాన్ని చూపగల నటి ఆమె. హీరో దిలీప్ కుమార్ సరేసరి.

ఆనాడు ఉమ ఉత్తరాన్ని చదివాక నేనున్న స్థితికి యీపాట మరింత మౌనాన్ని మింగించింది.

ఆ పాటలో లాగానే, ఆకాశంలా నిర్వికారంగా నేను ఉన్నాననిపించింది.. ఒకరి జీవితం ఒంటరితనంతో కాలిపోతున్నా.., మౌనంతో రగిలిపోతున్నా.

రెడ్డిది హైదరాబాద్‌కి చుట్టుపక్కల వున్న ఓ పల్లెటూరు. పాటలు సుమారుగా పాడగలడు. "డోంట్ కేర్.. లోకంతో నాకింక పని ఏముందీ.. నేను పుట్టానూ" అంటూ ఆత్రేయగారి పాట అందుకున్నాడు. "వాహ్‌వా" అంటూ మెచ్చుకున్నాం. అవలీలగా మూడో పెగ్గులో అడుగుపెట్టి. అసలు కథ అప్పుడు ప్రారంభమైంది.

"కరళే (హృదయమా) నా కథ విను. వనితని నేను ప్రేమించా.. " అంటూ తన లవ్ స్టోరీని చెప్పడం మొదలెట్టాడు జి.కె. మూడో పెగ్గులో ఏ మళయాళీ అయినా చేసే పని అదే అది మాకు, అంటే ఐ.ఏ.ఎఫ్ లో వాళ్ళకి, బాగా తెలుసు. ఆ కథ బాటిల్ పూర్తై సదరు ప్రేమ బాధితుడు కింద పడేవరకూ ఆగదు. అందుకే మొదట్లోనే ఆ కథని డైవర్ట్ చెయ్యాలి.

"ఒరే బన్సల్.. మన జి.కె సూపర్‌గా పాడతాడు తెలుసా?" అని అన్నాను. అలా ఎందుకన్నానో వాళ్ళకీ తెలుసు.

"జి.కె.. యూ మస్ట్ సింగ్ యార్" బలవంత పెట్టాడు బన్సల్. వెన్నెల ముద్దలు ముద్దలుగా కురుస్తోంది. పెరేడ్ గ్రౌండంతా చల్లదనంతో నిండిపోయింది. చెట్లకింద పరుచుకున్న వెన్నెలనీడలు గాలికి అద్భుతంగా కదులుతున్నాయి.

"మానసమైనెవరుం.." అన్న 'చెమ్మీన్'లో పాట ఎత్తుకున్నాడు జి.కె. ఆ సినిమా డైరెక్టర్ రామూ కరియత్. సంగీతం సలీల్ చౌదరి. పాడింది మన్నాడే (మన్నాడే భార్య మళయాళీ అని తరవాత తెలిసింది). ఓ బెంగాలీ (పూర్తిపేరు కృష్ణ చంద్రడే) అంత అద్భుతంగా మళయాళం పాట పాడటం ఆ రోజుల్లో అందరూ చెప్పుకున్న విచిత్రం. సలీల్ చౌదరీ బెంగాలీనే. ఓ అద్భుతమైన సంగీత దర్శకుడు.

"కడలిలె ఓళవుం.. కరళి లె మోహవుం

అడజ్ఞువిల్లో మనే అడజ్ఞు విల్ల" అన్న లైను విని నాకు పిచ్చెక్కింది.

"కడలిలోని అలలు.. హృదయంలోని మోహాలూ

ఎంత అణచినా అణగవు" అని అర్థం.

నిజమేగా. అణిస్తే అణిగితే ప్రేమ ఎలా అవుతుంది. అణిస్తే అణిగితే మోహమెలా అవుతుంది? జి.కెగాడి గొంతులో ఓ విషాదం వుంది. ఆ విషాదం ఆ రాత్రి నన్ను నిలువునా ముంచేసింది.

వారాలు గడిచిపోతున్నాయి. ట్రైనింగ్ ముమ్మరంగా సాగుతోంది. శాంతారామారావుగారి 'ది స్నేక్స్&లేడర్స్ (వైకుంఠపాళి) ' చదివా. 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' నవల చదివితే పిచ్చెక్కింది. రెండుసార్లు వరసగా చదివాను ఆ తరువాత 'కేక్స్ &ఏల్'(Cakes & Ale) నవల. మళ్లీ తెలుగులో 'జయయోధేయ' 'ఆమ్రపాలి' చదివాను. పాండీ బజార్లో విశ్వనాథ సత్యన్నారాయణగారి పురాణవైర గ్రంథమాలలోని అన్ని పుస్తకాలూ సెట్‌గా కనిపించాయని తక్షణం కొనేశాను. ఓహ్.. 'భగవంతునిపై పగ', 'నాస్తికధూమం' ఒక్కొక్కటీ వివరించేది. అల్బర్ట్ ఐన్‌స్టయిన్ అన్న, 'ఇమాజినేషన్ యీజ్ గ్రేటర్ దాన్ నాలెడ్జ్' అన్నమాట ముమ్మాటికీ నిజం.

నమ్రత రాసే ఉత్తరాల 'సైజు' తగ్గింది. కారణం ఉద్యోగంలో బిజీకావొచ్చు. ఒక్కటి మాత్రం ఒప్పుకు తీరాలి. ప్రేమకూడా 'మొక్క'లాంటిదే ఏ రోజు కారోజు నీరుపోస్తేనే ఎదుగుతుంది. తను అక్కడా.. నేను ఇక్కడా.. గతపు జ్ఞాపకాలు తప్ప వర్తమానపు అనుభవాలేమున్నాయి?

పెద్దమ్మకి శ్వాసకోశ సంబంధమైన అనారోగ్యమని బబులీ రాసింది. బబులీ లాగానే బబులీ ఉత్తరాలు కూడా రోజు రోజుకీ చక్కని వ్యక్తిత్వాన్ని వెదజల్లుతున్నాయి. స్పష్టంగా, సూటిగా మనసుని అక్షరాల్లో ఇమడ్చగలగుతోంది. అంతర్లీనమైన బంధం ఏదో ఆ అక్షరాల్లో తొణికిసలాడుతూవుంటుంది.

ఎన్నోసార్లు అదేమిటో కూలంకషంగా విశ్లేషించాలి అనుకున్నా 'మనసు' ధైర్యం చెయ్యలేకపోయింది.

పెద్దమ్మ అన్నమాట మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చేది 'నీ గతపు ముక్కల్ని ఏరుకోవడం' అని జీవితానికి ఆవిడ ఇచ్చిన నిర్వచనం ఎంత గొప్పది!

ఆమెపాలి 'ట్యూషన్'లు చెప్తూ బాగా 'సంపాయిస్తున్నా' అని వ్రాసింది. నాకెంతో సంతోషమనిపించి వెంటనే నాలుగు పేజీల ఉత్తరం రాశాను.

ఆ రోజుల్లో పేజీలకి పేజీలు ఉత్తరాలు రాసేవాడ్ని. అని ఇప్పుడు ఎవరిదగ్గరన్నా ఉన్నాయేమో చూడాలి, అప్పటి మనీస్థితి ఇంకా స్పష్టంగా తెలుస్తుంది.. అవి దొరికితే!

రోజులు గడుస్తున్నాయి. అన్నిరోజులూ ఒకేలా గడుస్తున్నాయి అనిపిస్తుంది గానీ లోతుగా చూస్తే అది నిజంకాదు. ***గడిచిన నిముషానికీ గడుస్తున్న నిముషానికీ కూడా ఊహకి అందనంత తేడా వుంది. ఎన్ని ఆలోచనలు ఆ రెండు నిముషాల మధ్య ప్రవహిస్తాయో మిమ్మల్ని మీరే శోధించుకుని చూడండి. ఆ రెండు నిముషాల మధ్య - ఎన్ని పుట్టుకలు, ఎన్ని చావులూ, ఎన్ని కోట్ల ఆకులు నేలరాలాయో, ఎన్ని కోట్ల చివుళ్ళు గర్వంగా కళ్ళు విప్పాయో, ఎన్ని లక్షల కోట్ల ఉచ్వాసనిశ్వాసాలు 'ప్రాణనృత్యం' చేశాయో, ఎంత డబ్బు చేతులు మారిందో , ఎన్ని ఆశలు కూలిపోయాయో మరెన్ని ఆశలు నింగికెగశాయో ఒక్కసారి ఊహించండి. మతిపోతుంది.***

మనం కాలాన్ని కేవలం 'గడియారపు' ముళ్ళతో మాత్రమే కొలుస్తాం గానీ, అనుభవాల సారంతో కొలవం. ఎందుకో సడన్‌గా నమ్రత జ్ఞాపకమొచ్చింది.

2 + రెండు పెదాల కలయిక... అద్భుతం

2 + రెండు పెదాలు విడిపోతే... దుర్భరం.

ఈ అద్భుతానికీ దుర్భరానికీ మధ్యనున్నదాన్ని ఏమందాం? తలుచుకోగానే గుండె తీయగా మూలిగింది.

ఢిల్లీలోని చల్లని రాత్రులూ చల్లనిగాలులూ వెచ్చని ఊహలూ, వెచ్చనిశ్వాసలూ అన్నీ మనసుని మళ్ళీ వూపేశాయి. కోర్కెతో విచ్చుకునే ఆ పెదాల వొంపూ, శిరోజాల సువాసనా, ఆ కౌగిళ్ళ వెచ్చదనం.. ఓహ్ ప్రేమ ఎంత మధురం..

"దుల్హన్ సేతూమ్హారా మిలన్ హోగా..ఓ

మన్ ధోడీ ధీర్ ధరో" (అనోఖి రాత్) పాట గుర్తొచ్చింది.

ఇద్దరు వ్యక్తులు.. ఓ ఆడా.. మగా ఓ గదిలో ఏకాంతంగా కలుసుకుంటే?

అసలు పరిచయమే లేని వాళ్ళ మధ్య పెళ్ళి జరిగితే? ఆ కలయిక ఎలా వుంటుంది? ఓ ప్రశ్న తళుక్కుమంది. మళ్ళీ నవ్వొచ్చింది. మేమిద్దరం పరిచయంలేనివాళ్ళం కాదుగా..

ఓ మనసా.. కాసేపు ఆగు.

ముట్టుకోవాలని

తొందరపడకు -

ముందు తీయని మాటలు సాగనీ..

మా పరిచయాన్ని మేము మళ్ళీ

నెమరు వేసుకోనీ!

కెన్ యూ లిఫ్ట్‌మీ అంటుంది తను.

నేను చేయందిస్తా. మెల్లగా పైకిలాగుతా.

మెల్లగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఇంకా మెల్లగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఇంకా పైకి లాగుతా. తను పూర్తిగా నిలిచాక తనని హత్తుకుంటూ మైమరచిపోతా.

" ఓ మనసా.. కాసేపు ఆగు -
ఆమె శ్వాసల శబ్దం వినాలి.
ఆమె నిశ్వాసాల వెచ్చదనం నా గుండెని తడమాలి.
ఆమె హృదయపు సవ్వడిని
నా హృదయం ప్రతిధ్వనించాలి.
అప్పుడు.... కొంచెం కొంచెంగా.."
(ఇదీ ఆనాడు రాసుకున్న కవితగాని కవిత)
ఇవన్నీ రాయనక్కర్లేదు. కానీ, అవి 'నా' క్షణాలు.
సంపూర్ణంగా నా మనసుతో, మనసులో,
'జీవించిన' క్షణాలు. అందుకే రాస్తున్నా.
మరోసారి మళ్ళీ నాలో నేనే జీవిస్తున్నా.

రోడ్డుమీద ఓ శవయాత్ర జరుగుతోంది. కొందరు తెగ, తాగి డప్పు మోతకి అనుగుణంగా నృత్యం చేస్తున్నారు. కొందరు భోరున ఏడుస్తున్నారు. తక్కున ఏడుపు ఆపి, సారా తాగి మళ్ళీ ఏడుపు మొదలెడుతున్నారు. (వీళ్ళని డబ్బులిచ్చి రప్పించడం ఇక్కడి ఆచారం. నార్త్‌లో 'రుడాలీ' సిస్టమ్‌లాగా తమిళనాడులోనూ యీ పద్ధతి ఉన్నది)

పువ్వులూ చిల్లరడబ్బులూ కలిపి శవం మీదకి విసురుతున్నారు. రోడు మీద పడ్డ డబ్బుల కోసం రోడ్ల మీదే బతికే అడుక్కునేవాళ్ళూ అనాథ పిల్లలూ కుమ్ములాడుకుంటున్నారు. శవం ముందూ వెనకా నడిచే బంధువులంతా ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఆ విషయాల్లో సినిమావీ, రాజకీయనాయకులవీ కూడా వున్నై.

యాంత్రికం. అంతా యాంత్రికమే. చచ్చిన వాడికి అంత్యక్రియలు చెయ్యాలి. బస్.. అంతే ఆ పోయిన వాడి కలలూ కన్నీళ్ళూ ఏవీ మిగలవు. అసలు పేరే వుండదు.

"ఏవండీ.. బాడీని ఇంటికి తెచ్చారా, హాస్పిటల్లోనే వుంచారా?" అనడుగుతారు స్నేహితులూ బంధువులూ. ***'శ్వాస'తో పరిమళించే 'శివం' ఆ శ్వాస రాక, శ్వాస ఆగి 'శవం'గా మారినపుడు, పెట్టిన, పెట్టుకున్న పేర్లూ పదవులూ కూడా గాల్లో కలిసి పోతాయిగదా! ఎంత విచిత్రమైనదీ జీవితం!***

రోడ్డంతా పువ్వులు. కాళ్ళకిందా కార్లకిందా నలుగుతూ. రోడ్డు నాశనమవుతోంది. ఎన్ని కోట్ల జీవులు లోకం నించి నిష్క్రమించడంలేదూ? నిశ్శబ్దంగా వెళ్ళిపోతాయి అవి. వీడ్కోలు చెప్పవు.

ఒక్క మనిషికి మాత్రమే ఎందుకీ అట్టహాసం? అప్పు చేసైనా 'కర్మలు' చెయ్యాల్సిందే! అవసరమా? చచ్చాక ఎండలో తలమాడకుండా గొడుగూ, కాళ్ళు మాడకుండా చెప్పులూ, వైతరిణిని దాటడానికి ఆవూ (ఆవు తోకని పట్టుకుని దాటాలిట) ఇలా బోలెడు దానాలుట. భూదానం, గోదానం, సువర్ణదానం ఎన్నో బతికున్న మనిషికి గుప్పెడన్నం పెట్టని పీనాసులు కూడా 'ఏదో' విధంగా దానాల పర్వం నడిపిస్తారు.

ఇంతకి శవం ఎవరిదీ? ఎవరో ఓ బాగా బతికిన మనిషిదే లేకపోతే, ఏడిచేవాళ్ళూ నృత్యకారులూ ఇంతమంది కిరాయివాళ్ళు రారుగా.

ఓకే మేన్.. నీ కథయిపోయింది. తల్లి కడుపునించి యీ లోకానికి వచ్చావు. నేల తల్లి కడుపులోకి వెళ్ళిపోతున్నావు. Womb to Womb... ట్రాన్స్‌ఫర్డ్. ఫర్ ద సీన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్

"తెల్లార్లూ భగవద్గీత పెట్టారోయ్! ఫలానా భజనసంఘాలవాళ్ళు భలేపాడారనుకో" వెంటనడిచేవాడు ఒకడన్నాడు.

"బ్రతికుండగా ఏనాడూ చదవని/వినని భగవద్గీతని చచ్చాక ఏవి వింటాడూ?" నవ్వాడింకో ఆయన.

"కమ్యూనిస్టాయే.!" మరొకడన్నాడు.

"కమ్యూనిస్టైనా కాంగ్రెసైనా చావు కామనేగా" అన్నాడు వేరొకడు.

అవును.. ఆహార, నిద్రా, భయ, మైథునాలే కాదు, మృత్యువు కూడా/లేక/ మరణించడం కూడా సర్వజీవలక్షణమే.

Atom can neither be created nor be destroyed.

ఆత్మను సృజించనూ లేమూ .. నశింపజేయనూలేము. డాల్టన్ ఎటామిక్ థియరీకీ ఆత్మకీ 'లంకె' భలే కుదిరింది కదూ.!

ఈ శవం మోసుకుపోబడుతోంది. నేస్తమా మరి నడిచే శవాల్ని ఎప్పుడైనా గమనించావా?

'ఏక్‌బార్ ఫిర్' సినిమాని మా ఏర్‌ఫోర్స్ థియేటర్లో చూశాం. సినిమా అయ్యాక మూడున్నరగంటల సేపు డిస్కషన్. దీప్తీనావల్, సురేష్ ఓబెరాయ్, వినోద్‌పాండే ఆర్టిస్టులు. గొప్ప సినీ హీరో అయిన భర్తని వద్దనుకుని రోడ్డు పక్కన కూర్చుని బొమ్మలు గీసి బ్రతుకు సాగించే ఓ చిత్రకారుడ్ని చేరుతుంది హీరోయిన్.. అదీ హనీమూన్ ట్రిప్‌లోనే. సినిమా తీసింది లండన్‌లోనే.

ఆమె చేసింది తప్పా, రైటా అన్నదే మా చర్చకి ఆధారం. అందరం ఆమె చేసిన పనికే సపోర్టుగా నిలిచాము.

ఎందుకు చెబుతున్నానంటే, ఆరోజుల్లో అలాంటి సినిమా తియ్యడానికి చాలా 'గట్స్' ఉండాలి.

ఇవాల్టి సంగతి వేరు. మహిళలు తమ హక్కుల్ని కాపాడుకునే ప్రయత్నంలో విజయాన్ని సాధిస్తున్నారు. అన్ని రంగాలలోనూ తమ 'ఉనికి'ని స్పష్టంగా చాటుతున్నారు.

అయితే నాడున్న సామాజిక భద్రత నేడు మహిళకి లేదు. విచ్చలవిడిగా పారుతున్న మద్యం, పరమ నీచంగా ఇంటర్నెట్‌లో వస్తున్న వెబ్ సైట్లూ యువతని 'సంస్కారానికి దూరం చేస్తున్నాయి. 'థాట్ కల్చర్' మారుతోంది.

'ఏర్‌ఫోర్స్ వదిలేశాక ఏం చేద్దాం?' అనే డిస్కషన్ వచ్చింది. అందరూ తలో మాటా చెప్పారు. వారివారి ఆశల్ని ఆ మాటలు ప్రతిబింబించాయి.

"అన్నా.. నువ్వు?" అడిగాడు కృష్ణారెడ్డి.

"మద్రాస్‌కి వెడతా.. ఆ తరవాత సంగతి అక్కడికి వెళ్ళాక ఆలోచిస్తా" అన్నాను. సినిమాల్లోకి వెళ్ళాలని నా ఆలోచన. అయితే 'ఎలా' అనేదానికి నాకే స్పష్టత లేదు. గీత రచయితగా అని మాత్రం కలలో కూడా వూహించలేదు.

"మరి పెళ్ళి సంగతీ?" అడిగాడు సత్యా. గుండె కలుక్కుమంది. చిన్న నవ్వు మాత్రం నవ్వగలిగా. అంతే. మనసెందుకో మౌనంలో మునిగింది.

ఒంటరిగా నక్షత్రాల్ని చూస్తూ వెల్లకిలా పడుకున్నా. కోటాను కోట్ల నక్షత్రాలు. వాటికి మాటలొస్తే ఎంత బాగుండునూ! సృష్టి రహస్యాల్ని విప్పి చెబుతాయికదా. మరుసటి రోజు హాలీడే కనక తెల్లార్లూ మెలుకువగా గడిపినా ఫరవాలేదు.

"ఆవాజ్ దేకే హ మే తుమ్ బులావో..

మహబ్బత్ మే ఇత్‌నా.. నహమ్ కో సతావో.." పాట వొస్తోంది రేడియోలో. ఆ రేడియో కొత్తగా కొనుక్కున్నది. ట్రాన్సిస్టర్. వెల నాలుగువందల రూపాయలు. నా జీవితంలో నేను కొనుక్కున్న అత్యంత ఖరీదైన 'ఐటెమ్' అదే పాటలు వినాలనే ఆశ ఇన్నాళ్ళకు తీరింది. 'న్యూస్' వినడం నాకు ఏనాడూ అలవాటు లేదు. 'న్యూస్'ని చదవడానికే ఇష్టపడతా. పొద్దున్నే పేపర్ చదవాల్సిందే

మహమ్మద్ రఫీగారి గొంతు అద్భుతంగా ఉంది. బంగారం నగలుగా మారినట్లు పదాలు రఫీగారి గొంతులో తీవెసాగి సంగీత లతలవుతాయి. ఆ లతలకి లతామంగేష్కర్ తోడైతే మనుషుల మనసులే (శ్రోతల మనసులే) 'గీతాకోక చిలుకల'వుతాయి. (అయ్యో..క్షమించాలి, యీ 'గీతాకోక చిలుక' అన్న పదం వేటూరిగారి సృష్టి. అలాగే దర్శకుడు వంశీ 'శిలామురళి' అన్న అద్భుతమైన పదాన్ని సృష్టించారు)

నాలో ఎక్కడో చిన్న సందేహం. ఎందుకో తెలీదు. అసలు నేనూ నమ్రతా కలుస్తామా కలవగలమా అని. 'ఛీ.. ఎందుకిలాంటి సందేహం?' అని నాకు నేనే నచ్చచెప్పుకున్నాను. ఎంత అనుకున్నా, జరిగిందంతా ఓ కలలా అనిపిస్తోంది.

గబగబా రూమ్‌లోకి పోయి తను వ్రాసిన ఉత్తరాలన్నీ చదువుతూ కూర్చున్నా. ఒక్కో ఉత్తరానికీ ప్రాణం లేచి వొస్తోంది. అన్ని ఉత్తరాలూ పూర్తయ్యేసరికి తెల్లవారు ఝాము నాలుగ్గంటలయింది. యాష్‌ట్రే సిగరెట్టు పీకలతో నిండిపోయింది.

నైట్‌డ్రెస్ తీసేసి పేంటూ షర్టూ వేసుకుని 'వాకింగ్'కి బయలుదేరాను. గాలి నిద్రిస్తోంది. చెట్లు నిద్రిస్తున్నాయి. పక్షులూ పాములూ సర్వం నిద్రాదేవి ఒడిలో సేదతీరుతున్నాయి. నడుస్తూ పాట పాడుకున్నాను..

"చల్ అకేలా.. చల్ అకేలా.. చల్ అకేలా...

తేరా మే లాపీఛే ఝూటా రాహీ॰చల్ అకేలా.."

ఆరున్నరకి 'మెస్'కి వెళ్ళి మగ్గునిండా టీ తెచ్చుకున్నాను.

"కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే" అని ధోభీఘాట్ దగ్గరున్న గుళ్ళోంచి సుప్రభాతం వినిపిస్తోంది. కళ్ళమీదకి నిద్రాదేవి వాలింది.

"ఓ బసంతీ.. పవన్‌పాగల్.. నాజారే నాజా.. రోకో కోయీ"

పాట వస్తోంది రేడియోలో. పాలరాతి కొండల మీద తీసిన పాట - వెళ్ళిపోతున్న ప్రియుడ్ని ఆపడానికి పాడేపాట.

"గుర్తుకు తెచ్చుకో ప్రియతమా.. నువ్వేగా చెప్పిందీ.. యీ లోకంలో జీవించాల్సింది ప్రేమకోసమేననీ, ప్రేమేగా లోకాన్ని నడుపుతున్నదీ. ప్రేమ ఓడితే ఆ ఓటమి నీదికాదా?" అని కూడా ప్రశ్నిస్తుంది. ప్రేమ.. ప్రేమ.. ప్రేమ..

అంతా రామమయం.. జగమంతా రామమయంలాగా

అంతా ప్రేమమయం.. జగమంతా ప్రేమమయం.

చూడాలని తపన. మాట్లాడాలని తపన.

కౌగిలి కోసం యాతన.. క్రీగంటి చూపుకై నిరీక్షణ.

అసలు ఏముందీ? ఎత్తుపల్లాల కొద్ది తేడా తప్ప స్త్రీ పురుషుల్లో ఏముందీ? ఐనా, ఏదో వుంది. లేకపోతే ఒకరి కోసం ఒకరు ఇంతగా ఎందుకు వెంపర్లాడతారూ.

ఓ మోహమా - నువ్వెంత మాయగత్తెవీ!

నాలోనూ తనలోనూ వున్నది రక్తమాంసాలే.

ఇక్కడ నా గుండె ఎలా కొట్టుకుంటుందో అక్కడ ఆమె గుండె అలానే కొట్టుకుంటోంది.

ఆకలీ నిద్రా కూడా ఇద్దరికీ ఒకటే.

కలలూ కన్నీళ్ళు కూడా ఇద్దరికీ వస్తాయి.

అయినా - మనసు ఆమెకోసమే క్షణం క్షణం కొట్టుకుంటోంది. ఎందుకూ?

ఆమె కోసం మాత్రమేనా?

లోపల్లోపలే మరో ప్రశ్న.

అంత తీక్షణంగా కాకపోయినా ఉమ గురించి కూడా.

ఒకరు చిన్నప్పటి నేస్తం

మరొకరు సుడిగాలిలా జీవితంలోకి దూసుకొచ్చినవారు

ఒకరి ప్రేమలో ఆప్యాయత -

మరొకరి ప్రేమలో ఆవేశం -

రెంటిలోనూ వున్నది ప్రేమే... ప్రేమకి ఎన్ని పార్శ్వాలూ?

ఫకాల్న నవ్వొచ్చింది. "పరిక్షలేమీ లేవు. లేక, అదో ఇదో ఏదో తేల్చుకోవలసిన క్షణమూ ఇదికాదు." అన్నది మనసు.

"కానీ ఎప్పుడో ఒకప్పుడు ఆ క్షణం ఎదురొస్తే ఏం చేస్తావూ?" అడిగింది అదే మనసు. ఇప్పుడు ఆ స్థితిని తలుచుకుంటే ఒక 'వేరే' వ్యక్తిని చూస్తూ వున్నట్లుంటుంది. "అది నేనేనా?" అనే ఆలోచనా వస్తుంది. మనలోనే మనకి తెలీని కోణాలు ఎన్నో వున్నాయనుకుంటాను. మనలోనే మనకి తెలీని వ్యక్తే మరొకడు వున్నాడనుకుంటా!

పెళ్ళికాని వాళ్ళమంతా 'బులెట్స్'లో వుంటే పెళ్ళయిన వారు లివింగ్ ఔట్‌గా, అద్దె ఇళ్ళల్లో వుండొచ్చు. ట్రైనింగ్ సెంటర్లోనూ ఆ సదుపాయం వుంది. ఈస్ట్, వెస్ట్ తాంబరంనిండా చిన్న చిన్న క్వార్టర్సు (అంటే అద్దెకి దొరికే ఇళ్ళు) చాలా వున్నాయి.

సిద్దప్ప పుట్టినరోజు నాడు నేనూ కొంతమంది ఫ్రెండ్సూ అతన్ని గ్రీట్ చెయ్యడానికి వాళ్ళింటికి వెళ్ళాం. అతనూ మా ఎంట్రీమేటే. పెళ్ళయిందిగానీ ఇంకా పిల్లలు లేరు.

ఓ మంచి 'గిఫ్టు' కొని తీసుకెళ్ళాం. అతను అద్దెకుంటున్న యిల్లు మద్రాసులో సెటిలైన ఓ తెలుగువాళ్ళది.

బిసిబిలాబాత్, అరిసెలో ఇలాంటివేవో చాలా చేసింది సిద్దప్ప భార్య. ఆ అమ్మాయికి కన్నడం తప్ప మరే భాష రాదు. అయితే నేం, మేము ఏ భాషలో మాట్లాడినా కొద్దో గొప్పో అర్థం చేసుకున్నట్టుగానే మొహం పెట్టేది. అందరం కలిసి 'బీచ్'కి పోయాం.

ట్రైనింగ్‌కి వచ్చి నెలలు గడిచినా బీచ్‌కి వెళ్ళడం అదే మొదటిసారి. అనంత జలరాశిని చూస్తూ మైమరచిపోయా. అంతకుందు సముద్రాన్ని చూడలేదని కాదు. శ్రీకాకుళంలో పి.యు.సి చదివేటప్పుడు సముద్రతీరానికి చాలాసార్లు వెళ్ళాను. నేను చూస్తూ వుండగానే బి.యే చదువుతున్న రత్నాల ప్రభాకర్ నీటిలో మునిగిపోయాడు. రత్నాల కోటయ్యగారి పిల్లాడతను. చాలా మంచివాడు. పార్థివ శరీరం కూడా దొరకనేలేదు. ఓ మంచి మనిషి ప్రాణాల్ని హరించిందని సముద్రం మీద కోపం వుండేది. ఆ కోపం పోవడానికి చాలా ఏళ్ళు పట్టింది. మద్రాసులోనే మళ్ళీ సముద్రాన్ని కొద్దో గొప్పో ప్రేమించడం మొదలెట్టాను.

ఒకదాని వెనకాల ఒకటి అలలు వస్తూనే వుంటాయి. భూమిని మింగేంత రౌద్రంగా వొచ్చి, ఒడ్డును తాకగానే సిగ్గుతో తలొంచుకుని మరలి వెళ్ళిపోతాయి. సముద్రాన్నీ అలలనీ విడదీయగలమా?

సముద్రం పరమాత్మ అయితే అలలు ఆత్మలు.

సముద్రంలో పుట్టిన అల సముద్రంలోనే కలిసినట్టుగా జీవులు కూడా పరమాత్మలోంచి ఉద్భవించి పరమాత్మలోనే లీనమవుతారు. రూపాలూ, నామాలూ అప్పటికప్పుడు పుట్టుకొచ్చిన అలలలాంటివి. అల సముద్రంలోకి మరలిపోగానే దాని అస్థిత్వం పోగొట్టుకున్నట్టు, శ్వాస ఆగిన మరుక్షణమే రూపనామాలు కూడా అస్థిత్వం పోగొట్టుకుంటింది.

ఏవేవో ఆలోచనలు మనసు నిండా.

"క్యా భాయ్.. ఏమిటీ ఆలోచనా?" అడిగాడు సిద్దప్ప.

"ఇప్పుడీ రూపంలో ఉన్నాం. యీ పాత్రని పోషిస్తున్నాం.. యీ నాటకం ముగిశాక ఏ పాత్రని పోషించాలో!" నాలో నేను అనుకున్నట్టుగా అన్నాను.

"డోంట్ ఫర్ గెట్ యార్.. ఇవాళ సిద్దప్ప పుట్టినరోజు. వేదాంత చర్చ అవసరమా?" అన్నాడు రెడ్డి. నిజమేగా?

చిత్రం ఏమంటే నా ప్రతిపుట్టినరోజున నా మనసులోకి వచ్చేది యీ ఆలోచనే.

"ఈ శరీరం నాదికాదు. నా అసలు సిసలు స్వరూపం ఏమిటో నాకు తెలీదు. అది తెలుసుకోవడానికే యీ శరీరాల్ని మార్చుకుంటూ పయనం సాగిస్తున్నాను" అనిపిస్తుంది. జీవితం అంతా ఓ కలగానో భ్రాంతిలానో అనిపిస్తుంది.

ఈ అనంత జలరాశిలో ఎన్నివేల కోట్ల జీవరాసులున్నాయో? వాటికి భూమ్మీది మనుషుల గురించీ జంతుజలాల గురించీ ఏమీ తెలీదు. వాటి గురించీ మనకీ గొప్పగా ఏమీ తెలీదు. సముద్రగర్భం ఎన్ని రహస్యాల్ని తనతో దాచుకుందో!

'ఎర్నెస్ట్ హెమింగ్వే' వ్రాసిన 'ద ఓల్డ్‌మాన్ అండ్ ద సీ' నవల జ్ఞాపకం వొచ్చింది. అందులోని రెండు వాక్యాలకే నోబెల్ బహుమతి వొచ్చింది.

"Time can destroy a man – but can not defeat him" అని.

("విధి మానవుడ్ని సర్వనాశనం చెయ్యగలదు. కానీ ఓడించలేదు") అని అర్థం.

ఈ లైన్ నే తరవాత ఎన్నో సంవత్సరాలకి 'దొంగకోళ్ళు' సినిమాలో రాశాను.

*"విధి ఎంత వంచించి కవ్వించినా*<br>*ఎన్ని కష్టాల సుడి రేపి శోధించినా*<br>*ధైర్యాన్ని కోల్పోని ఏ మనిషినీ*<br>*విధి ఓడించలేదమ్మ ఏనాటికీ" అని.*

ఈ పాట పల్లవి, "ఏమని వివరించనూ, మా బాధ ఎవరికి వినిపించనూ" అని మొదలవుతుంది. సాలూరి వాసూరావుగారు సంగీత దర్శకుడు. పాడింది వాణీజయరామ్. ఆమె అప్పటికే 'బోలీరే పపీహరా' పాటతో పిచ్చ ఫేమస్ అయ్యారు. ఆవిడ నాతో అప్పుడు తెలుగులోనే మాట్లాడారు.

ఆ తరువాత ఎన్నో రియాలిటీ షోల్లో మేమిద్దరం జడ్జీలుగా పాల్గొనడం జరిగింది.

"తుమ్‌నే పుకారా ఔర్ హమ్ చలే ఆయే.. జాన్ హతేలీ పర్ ఆయారే" పాట వినవొస్తోంది రేడియోలో. రఫీ గొంతులో అమృతం వూరుతుందా? 'రాజ్‌కుమార్' సినిమా, మా ఏర్‌ఫోర్స్ థియేటర్లో చూశాము. ఒక్కో పాటా ఒక్కో అమృత గుళిక. సినిమాలో కథని పక్కన పెడితే, షమ్మీకపూర్ సాధనల పాటల పిక్చరైజేషనే సినిమాని అంతెత్తున నిలబెట్టింది.

ఆ రాత్రంతా కలలే. నమ్రత చేతులు జాచి పిలిస్తున్నట్టూ నేను పరిగెడుతూ ఆమె వైపుకి వెళ్తున్నట్టూ, ఊహలు ఎంత బాగుంటాయి. ఊహలు ఎంత ఆనందాన్నిస్తాయి.

ఇక్కడొక విషయం చెప్పక తప్పదు. "తుమ్ నే కి సీకి జాన్ కో జాతే హుయే దేఖాహై. ఓ దేఖో ముఝ్‌సే రూఠ్‌కర్ మేరీ జాన్ జారహీహై" అనే పాట వుంది 'రాజకుమార్' సినిమాలో. పాడింది రఫీసాబ్. పాట పూర్తయేంతవరకూ 'కిమ్మన' కుండా నటించింది సాధన శివ్‌దసాని. షో పూర్తికాగానే మళ్ళీ టిక్కెట్టు కొని తరువాతి షో చూశాం. ఆ పాట అయిపోగానే బయటికి వచ్చాం. ఇంతకీ మళ్ళీ చూడటానికి కారణం ఏమంటే - కోపానికీ అలకకీ మధ్య వున్న తేడా సాధన స్పష్టంగా నటించి చూపడం. అలకలో అంత 'మజా' వుందని తెలిస్తే, ఎన్నిసార్లు 'అలిగి'నా బలే బుజ్జగించవచ్చనిపించింది.

పాట మీనింగ్ కూడా అద్భుతం.. (మీరెప్పుడైనా ఎవరి ప్రాణమైనా శరీరాన్ని విడిచివెళ్ళిపోవడం చూశారా... అదిగో అటు చూడండి నా ప్రాణం నా మీద అలిగి వెళ్ళిపోతోంది..)

ఓ సన్నటి సౌందర్య 'రేఖ' మనసుని ఎంత మత్తులో ముంచగలదూ! తెల్లార్లూ కలలే.

యవ్వనమా.. నీ దెంత లెక్కలేనితనమే! లోకాన్ని మరిచి ఊహల వుయ్యాలలూగుతావు. 'గతపు' పరిమళంతో వర్తమానాన్ని ముంచేస్తావు. ఎంత మాయలాడివే నువ్వూ!!

మనసులోనే మళ్ళీ మళ్ళీ అనుకున్నాను. అనుకుంటూ నడుస్తున్నాను. నడుస్తూ కూనిరాగాలు తీస్తున్నాను.

"రాజన్నా.. ఎప్పుడూ హిందీపాటల వెనకే పరిగెడతావుగానీ తెలుగు పాటలంటే నీకు ఇష్టంవుండదా?" నాతో బాటే నడుస్తున్న రాధాకృష్ణ అడిగాడు.

"ఎందుకు ఇష్టంలేదూ? కొన్ని వందలపాటలు వచ్చు. హిందీ తెలియనంతకాలం ఆ పాటల్లోని 'మజా' అర్థం కాలేదు. ఇప్పుడు హిందీ అర్థమవుతోంది గనక ఆ పాటల్లోని సాహిత్యాన్ని ఆస్వాదిస్తున్నా. ట్యూన్‌లోకి సుతిమెత్తగా వొదిగిపోయే హిందీని చూసి మైమరచిపోతున్నా." అన్నాను.

"నీ కిష్టమైన పాట ఏమిటో ఠక్కున చెప్పు." అన్నాడు.

"దిల్ అప్ నా ఔర్ ప్రీత్ పరాయీ.. కిస్‌నే హై యే రీత్ బనాయీ.. ఆంధీ మే ఇక్ దీప్ జలాయా.. ఔర్ పానీమే ఆగ్ లగాయీ.. దిల్ అప్‌నా.." అనే పాట పాడి వినిపించాను.

"అర్థం ఏమిటీ?" అడిగాడు.

"హృదయం మనది.. కానీ అది ప్రేమించేది వేరొకర్ని.

ఎవరీ 'రీతి'ని ప్రవేశ పెట్టింది? ఆ ప్రేమ కూడా ఎటువంటిదీ? తుఫానులో దీపాల్ని వెలిగిస్తుంది..

నీటిలో నిప్పుని సృష్టిస్తుంది.. ఓహ్.. హృదయం నాదే.

కానీ అది ప్రేమిచేది వేరొకర్ని" అంటూ స్వేచ్ఛానువాదం చేశా.

ప్రియమైన పాఠకుడా.. హిందీ పాటలు పాడుతూ, వాటి అర్థాలు రాస్తూ పేజీలు నింపుతున్నానని అనుకోవద్దు.

జీవితంలో 'ప్రేమ'ని కాక నేను ప్రేమించింది పుస్తకాల్నీ సంగీతాన్నీ. ఏ భాషలో వున్నా, 'పాట'ని ప్రాణం అనుకునేవాడ్ని. ఇప్పుడు రాస్తున్న ప్రతి అక్షరమూ నా డైరీల్లో నాడు నేను రాసుకున్నవే.

అప్పటి నా మనఃస్థితికి అద్దం పట్టేవి నాటి మాటలూ పాటలే. అవే అవే చాలాసార్లు రిపీట్ అయ్యాయి; అయ్యేవి.

ఓ పాట అనంతమైన ఉత్సాహాన్ని నింపితే

మరోపాట అంతులేని ఆవేదనని కలగజేసేది.

అవన్నీ విని, రాసుకుని పాడుకోవడమేగానీ, నేటిలా సీడీలూ, టేప్ రికార్డర్లూ సెల్‌ఫోన్ రికార్డింగులూ లేవుగా!

జీవితమనే ఎడారిలో ప్రేమలనే ఒయాసిస్సులూ - పాటలనే చిరుగాలులూ లేకపోతే జీవించడం ఎంత దుర్భరం!

*"కలకాలం యీ కాళరాత్రి*
*నిలువదోయీ మేలుకో*
*ఉదయకాంతీ.. మదికి శాంతి*
*అంతేనురా బాటసారీ.. మేలుకో.. మేలుకో||*
*చీకటి వెనకే వెలుగు.. వెలుగు వెంటే చీకటి*
*"చీకటి వెలుగుల రంగేళీ.*
*జీవితమే ఒక దీపావళీ"*

కాదు కాదు. పాములూ నిచ్చెనలూ పక్కపక్కనే వుండే వైకుంఠపాళీ.

'ప్రేమ' అనే పరమ పదానికి చేరేదెప్పుడూ?

"రాజ్.. అనుకోకుండా గ్రాండ్‌మాకి జ్వరం వొచ్చింది. పదిరోజులు పూర్తిగా స్పృహలో లేదు. నిన్ననే కళ్ళు తెరిచింది. ఓపిక రాగానే తను మాట్లాడిన మొదటి మాట నీ గురించే. నీ దగ్గర్నించి ఉత్తరం వచ్చిందా అని అడిగింది. వచ్చిందని అబద్ధం చెప్పాను. నువ్వు నీ ట్రైనింగ్‌లో బిజీ అని నాకు తెలుసు. నేనూ స్టడీస్‌లో బిజీ అయిపోయాను. నువ్వు ఉత్తరం ఎందుకు వ్రాయలేదని నేను అడగను. ఎందుకంటే అదే తప్పు నేనూ చేశానుగా. గ్రాండ్‌మా ప్రశ్న నన్ను నిశ్చేష్టురాలిని చేసింది. నేను పుట్టిన దగ్గర్నించీ తన దగ్గరే పెరిగాను. నువ్వో? జస్ట్ ఓ మలయమారుతంలా వచ్చిన అతిధివి. వచ్చావు. తియ్యని జ్ఞాపకాలు కొన్ని మాకిచ్చి, కొన్ని నువు మూట గట్టుకుని వెళ్ళిపోయావు. కానీ ఆ కొన్నాళ్ళ పరిచయమూ ఎంత గాఢమైన ముద్ర మా మనసుల్లో వేసిందంటే, హాస్పటల్లో స్పృహలేని గ్రాండ్ మాకి తోడుగా వున్న నేను కనీసం గంటకోసారైనా నిన్ను, తలుచుకునేంత. స్పృహరాగానే రాజు ఉత్తరం రాశాడా అని గ్రాండ్ మా నన్ను అడిగేంత.

ఇంకేం చెప్పనూ! దాదా, ఏ పరిచయానికి ఏ పేరు పెట్టాలో తెలిసింది ఎవరికీ? అసలు ఎవరినించి ఏది కావాలనుకుంటామో అదైనా మనసుకి స్పష్టంగా తెలుస్తుందా? ఎంత విచిత్రం.. 'మన మనసుల్ని మనమే' తరచి చూసుకోలేనంత భయం ఎందుకంటా? ఎన్నో వ్రాయాలని వుంది. కానీ ఏదో వ్రాయలేకపోతున్నాను. ఉన్నదున్నట్టు నీతో చెప్పుకోవాలి అనిపిస్తుంది. కానీ మళ్ళీ నాకే నవ్వొస్తుంది. ఎందుకంటే, అసలు సమస్య అనేది ఏమిటీ? నాకే అర్ధం కానిది నీకేం చెప్పనూ?

ఈ అర్ధం అయీ కాకపోవడమే జీవితమా? 'అమ్మా'లో చాలా మార్పు వచ్చింది. షి యీజ్ టూ ప్రాక్టికల్ నౌ. అంతకు ముందు దేనిమీదా శ్రద్ధ పెట్టేదికాదు. ఇప్పుడు ఏ పనిచేసినా చాలా శ్రద్ధగా చేస్తోంది. ట్యూషన్లు కూడా బాగా పెరిగాయి. నన్ను సహాయం అడిగింది. బహుశా నేను కూడా గ్రాండ్ మాకి తగ్గాక అమ్మాతో జాయిన్ అవుతాను. సంపాదనకోసం ప్రత్యేకంగా కాకపోయినా సమయం సద్వినియోగం చెయ్యొచ్చని. నీ ప్రేమనంతా అక్షరాల్లో ఇమిడ్చి గ్రాండ్‌మాకి వుత్తరం రాస్తావు కదూ.! అదే ఆమెకి చక్కని టానిక్" అంటూ బబులీ ఉత్తరం రాసింది. మిగతా విషయాలు కూడా కొన్ని రాసింది... అంటే, నమత గురించీ ఉమ గురించీ. 'నిర్మల' ప్రెగ్నెంట్ అయిందట.

సుదీర్ఘమైన ఉత్తరం రాశాను. శ్రీశ్రీ ఎంత గొప్పపాట రాశారూ.. "నిన్ను నిన్నుగా ప్రేమించుటకూ, నీ కోసమే కన్నీరు నించుటకు .. నేనున్నానని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ" అని.

నిన్ను నిన్నుగా అంటే? నువ్వు కూలీవైతే కూలీగానే, కోటీశ్వరుడవైతే కోటీశ్వరుడుగనే, బిచ్చగాడివైతే బిచ్చగాడిగానే ... as you are … What you are.. అని అలాంటి వాళ్ళు దొరకడం ఎంత అదృష్టం.

ఆ విషయంలో నేను మహా అదృష్టవంతుడ్ని. నన్ను నన్నుగానే చూశారు. నన్ను నన్నుగానే గౌరవించారు ప్రేమించారు. ఇంతకంటే జీవితానికి ఇంకేం కావాలి!

నేను ఉత్తరం రాస్తున్నంత సేపూ నేను పెద్దమ్మ ముందు కూర్చున్నట్లే అనిపించింది. ఆ వృద్ధమూర్తి ఆప్యాయత నిండిన చూపులు నా మనసుని స్పృశిస్తున్నట్లే అనిపించింది.

కుంపటి ముందర కూర్చుని ప్రేమగా పూరీలు వేడివేడిగా తయారుచేసి నా పళ్ళెంలో వేస్తున్నట్లే అనిపించింది.

ఒకదాని వెనక ఒకటి ఋతువులు వచ్చి వెళ్ళిపోతూనే వుంటాయి. ప్రకృతి కూడా ఋతుధర్మాన్ని అనుసరించి తననుతను మార్చుకుంటూనే వుంటుంది. "మోసమ్ బీతా జాయ్.!"

కళ్ళల్లో కలల్ని నింపుతూ, నింపిన కలల్నే మళ్ళీ కరిగిస్తూ కాలం సాగిపోతూనే వుంటుంది.

"లాఖోంతారే.. ఆస్మాన్ మే.. ఏక్ మగర్ ఢూంఢే న మిలా.." (లక్షల కొద్దీ నక్షత్రాలున్నాయి ఆకాశంలో. ఒక్కటి మాత్రం ఎంత వెదికినా దొరకలేదు) మనస్సనే ఆకాశంలో ఎన్నో జ్ఞాపకాలతారలూ.

అందరూ నిద్దరపోతున్నారు. అమావాస్య కావడంతో ఆకాశం నిండా నక్షత్రాలే. నేను బయటికొచ్చి, పెరేడ్ గ్రౌండ్ అంచున వున్న గడ్డిమీద వెల్లకిలా పడుకుని నక్షత్రాల్ని చూస్తున్నాను. ఎంత అద్భుతంగా వున్నాయో.

ఎవరూ లేని ఏకాంతం ఎంత మధురం. మళ్ళీ అదే ఎంత దుర్భరం. గుసగుసలు కోసం చెవులు తపిస్తాయి. చిరునవ్వుల్ని చూడ్డం కోసం కళ్ళు రెప్పలు వెయ్యనంటాయి. తోడుకోసం పెదవులు అర్రులు జాస్తాయి. నిశ్వాసాల వెచ్చదనం కోసం ముఖమూ మెడా తపిస్తూ వుంటాయి. ఇహ కౌగిలింతల కోసమా.. అణువణువూ విరహంతో రగులుతూనే వుంటుంది. ఓ యవ్వనమా... నువ్వెంత కిల్లాడివీ!

ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు. సడన్‌గా లేచాను. గులకరాళ్ళంత వడగళ్ళు టపటపా రాల్తున్నాయి. హోరున గాలీ వర్షం. బులెట్ వైపుకి పరిగెత్తాను. భీభత్సంగా వడగళ్ళ వాన కురిసింది.

బులెట్ రేకుల మీద పడుతున్న వడగళ్ళు భయంకరమైన శబ్దం చేస్తున్నాయి. టైమ్ చూస్తే రాత్రి తెల్లవారుఝామున 03.30. చాలా మంది నిద్ర లేచి మళ్ళీ పడుకున్నారు. తెల్లారితే ఆదివారం...హోలీడే

నేను కుర్చీ ఒకటి వరండాలో వేసుకుని కూర్చున్నాను. ఇలాంటి వర్షపు రాత్రే కలకత్తాలో గడిపాను. ఇలాంటి వర్షపు రాత్రినే ఢిల్లీలోనూ గడిపాను. ఇవాళ ఇక్కడ మద్రాసులో గడుపుతున్నాను.

రివ్వున వీస్తున్నగాలి... హోరుగా మారింది. జల్లులు ఈడ్చి యీడ్చి కొడుతున్నాయి. వడగళ్ళు అదో రకపు రిథిమ్ అనుసరిస్తూ తెల్లతెల్లని వడగళ్ళు.

లోకమంతా నిద్రిస్తున్న వేళ నా కళ్ళు పత్తికాయల్ల విచ్చుకునే వున్నాయి. మనసు పొరల్లోంచి అస్పష్టమైన సంగీతం ఏదో మనసుకుండే చెవులకి వినిపిస్తూనే వుంది.

నా వొళ్ళు జల్లులకి తడుస్తోంది. అయినా లేవాలి అనిపించలేదు.

వర్షపు నీరు కాలువలు గట్టింది - గభాల్నలోపలికి వెళ్ళి నోట్‌బుక్‌లోని పేపర్లు చించి కాయితం పడవలు చేశాను. ఒక్కో పడవ మీదా ఒక్కో పేరు రాశాను. రాజు.. ఉమ.. నమ్రత... బబులీ, ఆమ్రపాలి.. అలౌకిక.. భువనేశ్వరి.. చంద్రావతి ఇలా.....

ఒక్కో పడవనీ నీళ్ళల్లో వదిలాను. ఒక్కసారిగా వర్షం రెచ్చిపోయింది. బులెట్‌పై నుండే రేకులు కొన్ని ఎగిరి పోవటంతో జనాలు కంగారుగా నిద్దర లేచారు. గందరగోళం అలుముకుంది.

రెండు రోజులకి పైగా అంటే యాభై నాలుగు గంటలపాటు వర్షం కురుస్తూనే వుంది. వర్షరాణి విశృంఖలంగా నర్తిస్తూనే వుంది.

**కొన్ని వందల గుడిసెలు** కూలిపోయాయి. కొన్నివేలమంది నిరాశ్రయులయ్యారు. తమిళనాడు కొన్ని దశాబ్దాలు చూడని వర్షమది. ఎక్కడ చూసినా చింకిబట్టల్తో పిల్లలే, ఆకలితో అడుక్కుంటూ.

కలకత్తాలో చూశా అలా రెఫ్యూజీలని ప్లాట్‌ఫారాల్ని ఆక్రమించుకుని దోమల్తో యీగల్తో కుక్కల్తో సహజీవనం చేస్తూ బతికినవాళ్ళని. ఒక్క రొట్టెకోసం వొళ్ళమ్ముకున్నవాళ్ళని. భగవంతుడా.. ఏమిటయ్యా నీ సృష్టి!?

విందుభోజనాలయ్యాక విస్తళ్ళని చెత్తకుప్పల్లో పారేస్తే కుక్కలతోపాటు పిల్లలూ పెద్దవాళ్ళూ కూడా పోటీపడేవాళ్ళు, మిగిలింది ఆబగా తినడానికి. ఆకలి, మనుషులకి ఆకలి. మనసులకి ఆకలి. చూపులకి ఆకలి. చేతులకి ఆకలి. అణువణువునా ఆకలే.!! ఆకలి లేనిదెక్కడా?

దేవుడున్నాడా? వుంటే యీ వ్యత్యాసం ఎందుకూ? పక్కవాడు ఆకలితో చచ్చిపోతున్నా 'ఉన్నవాడు' పట్టెడు మెతుకులు ఎందుకు పెట్టడూ? దేవుళ్ళకోసం, వారి పాలాభిషేకాల కోసం, తేనె చక్కెర నెయ్యి పెరుగు అభిషేకాలకోసం, ప్రసాలకోసం వందలూ వేలు ఖర్చుపెట్టే మహాభక్తులు ఆకలో రామచంద్రా అని ఏడిచేవాడికి గుప్పెడు మరమరాలైనా పెట్టలేరా? చిరిగిన చివికిన బట్టల్తో మానం కప్పుకోలేక సిగ్గుపడుతూ ఏడ్చే పిల్లలకి అరగజం గుడ్డ ముక్క కొనివ్వలేరా? మరి యీ మహానుభావులే గుళ్ళకీ గోపురాలకీ 'పట్టు' బట్టలు మహావినయంగా సమర్పిస్తారేం? గుండె మండిపోయింది.

మేమందరం ఓ రెండొందల బ్రెడ్ పేకెట్లూ బిస్కెట్ పేకెట్లూ కొని పంచాము. మా ఆర్థికస్థితి అంతే. మనిషికి పాతిక రూపాయలంటే మా రెండు నెలల జేబు ఖర్చుని వెచ్చించినట్లే. అదేదో గొప్ప విషయంగా చెప్పటంలేదు. మేము అయిదుగురం, మా సీనియర్స్ మరో పదిమంది మరో రెండొందల బ్రెడ్ పేకెట్లు పంచారు. అలా మొత్తం మా ఏర్‌ఫోర్సు వాళ్ళు జేబుల్లోంచి తీసి పంచింది ఓ రెండువేల బ్రెడ్ పేకెట్లూ, ఓ ఆరొందల కిలోల బియ్యం, ఓ ఆరొందల కిలోల కూరగాయలూ వుంటాయి.

ఎక్కడ చూసినా దోమలూ యీగలూ. నాలుగు రోజుల భీకర వర్షాలకి ఎక్కడ పడితే అక్కడ నీళ్ళు. చచ్చిపోయిన కుక్కలు ఇతర చిన్న చిన్న జంతువులు. రాజకీయ నాయకులు తమతమ భజంత్రీలతో వచ్చి వెళ్ళారు. సామాన్యుడి బతుకు మాత్రం ఏమాత్రం మారలేదు. ఏమారిపోయిన వాళ్ళుగదా!

చిత్రం ఏమంటే, కరెంటు లేకపోయినా సినిమాహాళ్ళు మాత్రం జనరేటర్ కరెంటుతో రోజుకి ఆరుషోస్ చొప్పున హౌస్‌ఫుల్‌గా నడిచాయి. అదే ఆశ్చర్యంగా అన్నాను.

"కొంపకూలిన వాళ్ళు ఏం చేస్తారూ? ఎక్కడికి పోతారూ? అందుకే సినిమాహాళ్ళల్లో తలదాచుకుని వుంటారు" అన్నది భువనేశ్వరమ్మగారు. అప్పుడు నిర్ణయించుకున్నాను. బుర్రని ఎల్లప్పుడూ పాజిటివ్ థాట్ వైపే మరల్చాలని. ఆ పాఠం ఇప్పటికీ స్మరిస్తూనే వుంటాను. ఆచరిస్తూనే వున్నాను.

సమ్మోహిత్ ఛటర్జీ అన్యమస్కంగా వుంటున్నాడు. అతనిది కలకత్తా దగ్గిర ఓ గ్రామం. నాకంటే కొద్దిగా సీనియర్ అయినా, ప్రమోషనల్ ట్రైనింగ్‌లో ఇప్పుడు నా ఎంట్రీమేట్. మనిషి కొంచెం నలుపైనా విలక్షణమైన ఆకర్షణ వుంది. మిగతా బెంగాలీల్లాగే అతనూ కొంచెం మొండి మనిషే ఏ చిన్నతేడా వొచ్చినా 'చర్చ' మొదలెడతాడు. ఓ జోక్ వుంది.

ఓ బెంగాలీ, ఓ తెలుగువాడు, ఓ తమిళవాడూ 'రేపొద్దున్న ఎన్నింటికి లేచి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాలీ' అనే విషయం మీద చర్చించుకుటున్నారట. బెంగాలీ చర్చిస్తూనే వున్నాడు, చర్చిస్తూనే వున్నాడు. తెలుగువాడు అర్ధరాత్రిదాకా బెంగాలివాడితో చర్చించి విసుగుపుట్టి పడుకున్నాడు.

పొద్దున్నే లేచి చూసేసరికి తమిళవాడు ఆల్‌రెడీ రైల్వేస్టేషన్‌కి వెళ్ళి తీసుకురావాల్సిన వాళ్ళని తీసుకొచ్చేశాడుట. మిగతా ఇద్దరి సంగతా? బెంగాలీవాడు స్టేషన్‌కి వెళ్ళే విషయమై మధ్యాహ్నందాకా ఇతరులతో చర్చిస్తునే వున్నాడు. తెలుగువాడా విషయమే మర్చిపోయి హాయిగా నిద్దరపోతున్నాడుట.

అయ్యా.. ఇది పూర్తిగా నిజంకాకపోయినా, చాలావరకు నిజమే. బెంగాలీవాళ్ళు చర్చలతోనే కాలం వెళ్ళబుచ్చుతారు. తెలుగువాళ్ళకి బద్ధకం ఎక్కువ. తమిళవాడు అవకాశాల్ని అందిపుచ్చుకోవడంలో అందరికన్నా ముందుంటాడు.

విషయానికొస్తే, సమ్మోహిత్‌ని అడిగాను... ఎందుకలా పరధ్యానంగా వుంటున్నావని. అతను చాలాసేపు అడిగించుకున్నాక, సుదీర్ఘంగా ఓ మైలు పొడుగుండే బెంగాలి నిట్టూర్పు ఒకటి వదిలి, "ఐ థింక్ యై యామ్ ఇన్ లవ్" అన్నాడు.

"ఎవరితో?" ఆశ్చర్యంగా అడిగాను.

"వరదరాజన్ కూతురితో." అన్నాడు తలొంచుకుని. వరదరాజన్ మాకు TCO. అంటే ట్రైనింగ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్. నాకు చిన్న షాకు. వరదరాజన్ నూటికి నూరుపాళ్ళూ తమిళ చెట్టియార్. మహా స్ట్రిక్టు. ఆ అమ్మాయిని చాలాసార్లు నేనూ చూశాను. వరదరాజన్ ఛస్తే వప్పుకోడు. ఆ విషయంలో డౌటే అక్కర్లేదు. ఆయనకి చచ్చేంత యీగో.

"ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందా?" అడిగాను.

"ఐడోంట్ నో.. కానీ చక్కగా నవ్వుతుంది. బాగా మాట్లాడుతుంది కూడా." అన్నాడు.

"అసలు మీకు ఎలా పరిచయమైంది?"

"నీకు తెలుసుగా నేను ఐరన్ రాడ్లూ, ఐరన్ జాలీ, సిమెంటూ, గడ్డీ ఇవన్నీ వుపయోగించి శిల్పాలు చెయ్యగలనని. వరదరాజన్‌గారు ఓ వారం రోజులు వరసగా నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళి నాచేత అమ్మవారి బొమ్మ ఒకటి చేయించాడు.. ఆరడుగులది. అప్పుడే నాకు 'మలర్'కి పరిచయం. చాలా ఇంట్రెస్టు చూపించింది. ఆ తరువాత నించీ ఆల్‌మోస్ట్ డైలీ వాళ్ళింటికెళ్ళి ఆమెకి యీ విద్య నేర్పుతున్నా!" అన్నాడు.

ఏమి అనాలో ఏం చెప్పాలో నాకు తెలీలేదు. ఆ క్వార్టర్లీలో సమ్మోహిత్ "బేక్ ఫేస్' అయ్యాడు. అంటే ఫెయిలై మా తరువాత ఎంట్రీలోకి పంపబడ్డాడు. అంటే, తనకన్నా అతి జూనియర్లతో చదువుకోవాలన్నమాట. 'బేక్ ఫేస్' కావడమంటే నిజంగా పరువుపోవడమే.

"నీకున్నంత జ్ఞాపకశక్తి మాకెవరికీ లేదు. ఎందుకు ఫెయిలయ్యావూ?" అడిగాను.

"పాసైతే తొందరగా ట్రైనింగ్ పూర్తయిపోతుంది. ఫెయిలయితే మరో మూడునెలలు నా ట్రైనింగ్‌ని పొడిగించుకోవచ్చు. అంతేకాదు.. 'మలర్'ని.." అని ఆగాడు. ప్రేమా! ఎంత జాణవేనువ్వా!

నేనేం చెప్పనూ? 'బేక్ ఫేస్' లాంటి అవమానకరమైన విషయానికి కూడా సిద్ధపడ్డాడంటే అతనెంత డీప్‌గా ప్రేమిస్తూ వుండాలీ! సడన్‌గా ఓ విషయం గుర్తుకొచ్చింది... అదేమిటంటే కొన్నాళ్ళ క్రితం ముప్పైరోజుల్లో తమిళం పుస్తకం అతని చేతుల్లో చూశాను. అంతేగాదు..పొంగల్ వడలాంటి తమిళ తిండి తినడం కూడా చూశా. దీన్ని బట్టి అర్థమయింది ఏమంటే, ప్రేమకోసం మనిషి తన జాతినీ భాషనీ ఆహారపుటలవాట్లనీ కూడా మార్చుకుంటాడనీ, అలా మార్చుకోవడానికి ఏమాత్రం ఇబ్బంది పడడనీ!

నాకు నవ్వొచ్చింది. ఎందుకంటే, నమ్రత విషయంలో నేనేమి మారానూ? నాకు తెలిసినంతవరకూ వాళ్ళు ముట్టుకోవడానికి భయపడే 'ఆవకాయ'ని ఆమెకి అలవాటు చేశా. ఆవిడకే కాదు నమ్రత కుటుంబానికే ఆంధ్రా పచ్చళ్ళు అలవాటు చేశాను. భాష మాత్రం ఇద్దరం కొద్దిగా ఇచ్చిపుచ్చుకున్నాం.

నమ్రతని తల్చుకోగానే మళ్ళీ ఢిల్లీ మనసులో తిరుగాడసాగింది. ఆరుపేజీల సుదీర్ఘ లేఖ వ్రాశాను. (ఇప్పుడా ఉత్తరాలు ఉన్నాయో లేవో కూడా నాకు తెలీదు) ఇప్పట్లాగా అప్పుడు ఓ కంప్యూటర్ నాకు ఉండి వుంటే అవన్నీ సేఫ్‌గా వుండేవి కదా అనిపిస్తుంది. అంతేగాదు, అవన్నీ సేఫ్‌గా లేకపోవడమే మంచిదని కూడా అనిపిస్తుంది. కొన్ని వందలసార్లు చదువుకున్నా ఉత్తరాలు 'తాజా'గానే అనిపిస్తాయి. అందుకే అక్షరాలు 'అక్షరం' అనుకుంటా!

'నూపుర్' కార్యక్రమం అయ్యేదాకా వివిధ్ భారతిని వింటూనే వుండేవాణ్ని. వారానికి రెండుమూడుసార్లయినా టి.నగర్‌కి వెళ్ళేవాణ్ని. ఎందుకో త్యాగరాయ నగర్ నన్ను తనవైపు లాక్కునేది. బహుశా 'సినిమా' నన్ను ఆకర్షించేది అనుకుంటా. అదివరకు చెప్పినట్లుగా, ఆ రోజుల్లో ఏ ఏ వీధుల్లో తిరిగానో 'సినిమా'లోకి వచ్చాక అదే వీధుల్లో నివాసం వున్నా.. అద్దె ఇళ్ళల్లో. పాండీ బజార్లో తిరుగుతుంటే, అవన్నీ అత్యంత పరిచయం వున్నట్టు అనిపించేది. చెట్లనీడల్లో తిరుగాడుతూ వుండేవాణ్ని.... ఒంటరిగానే!

పానగల్ పార్కులో చెప్పేవారు.. ఇది ఘంటసాలగారు కూర్చునే బెంచీ అనీ, ఇది మల్లాదివారు సభ తీరే చోటనీ! నేనూ అక్కడే కూర్చునేవాణ్ని గాని ఆ మహానుభావులు వచ్చేవరకూ ఎదురు చూసే 'ఛాన్సు' ఉండేదికాదు. కారణం రాత్రి 7గంటలలోపునే మేము 'స్టేషన్'లో ఉండితీరాలి.

'పాకీజా' సినిమా మా ఏర్‌ఫోర్స్ థియేటర్లో కొచ్చింది. మళ్ళీ మళ్ళీ చూశాను. అది సినిమానా? కాదు.. ఓ సజీవ చిత్రం. ఆ రోజుల్లో నాకు తెలీదు.. కమల్ అమ్రోహి - మీనాకుమారీ భార్యాభర్తలనీ - వాళ్ళిద్దరి మధ్యా గొడవలవల్లే ఆ సినిమా పన్నెండేళ్ళకి పైచిలుకు ఆగిపోయిందనీ. అశోక్ కుమార్ హీరోగా మొదలైన సినిమా, రాజ్‌కుమార్‌ని హీరో చేసింది.

సినిమా చూశాక బయటికొస్తే, మరోలోకంలోకి వచ్చినట్లనిపించింది. 'చల్‌తే చల్‌తే... ముఝేకోయీ మిల్‌గయా థా' 'ఠాడే రహియో ఓ బాకీయార్ రే' ఒక్కోపాటా ఒక్కో ఆణిముత్యం. ఇన్ బేక్ గ్రౌండ్‌లో వచ్చే పాటలకి లెక్కలేదు.

గులాబీరంగులో వుండే (సిమెంటు) నీటికొలను. దాన్నిండా చల్లని నీరు. మెల్లమెల్లగా 'మీనాకుమారి' ఓ కవితల పుస్తకంతో వొస్తుంది. చాలా ఒద్దికగా గట్టున కూర్చుని, మెల్లగా వెనక్కివాలి జుత్తుని విదిలిస్తుంది. ఆ జుత్తు ఆ చల్లని నీళ్ళమీద పరుచుకుని వుంటుంది. ఇప్పుడు పుస్తకం ఓపెన్ చేసి కవితలు చదువుతూ వుంటుంది.

అంటే, ఆ చల్లని నీటి యొక్క చల్లదనాన్ని శిరోజాలు మెదడుకి అందిస్తూ వుండగా కవిత చదువుతూ ఉండడం ఎంత రొమాంటిక్ థాట్! పిచ్చెక్కింది.

డబ్బు ఎందరి దగ్గరైనా ఉండొచ్చు. ఎందరైనా అంతులేకుండా సంపాదించవచ్చు.

కానీ, అనుభవించడం ఎంతమందికి తెలుసూ? ధనాన్ని 'అనుభవించడం' ఓ గొప్పకళ, జీవితాన్ని సౌందర్యవంతంగా మలుచుకోవడం, ప్రతిక్షణాన్నీ హృదయంతో అనుభవించగలగడం ఓ వరం.

కోటీశ్వరులు చాలామందికి ఆ 'వరం' దక్కకపోవడం నా కళ్ళారా నేను చూశా. చూస్తున్నాను.

పుస్తకాలు కొంటారు. మనసుతో చదివి ఆనందించేవారు ఎంతమందీ? డ్రాయింగ్ రూం డిస్కషన్స్ గురించి అయితే చెప్పక్కర్లేదు. పుస్తకాల 'పేర్లు' తెలిస్తే చాలు.. మేధావిగానే పరిగణింపబడవచ్చు. ఇదంతా ఎందుకంటే - ఓ చిన్న 'షాట్' కోసం ఓ గులాబ్ మెహలూ, గులాబీ కొలనూ, కొలను మీద తామరాకులా పరుచుకున్న జుత్తూ, ఆ జుత్తు పీల్చుకునే నీటిచల్లదనం, ఆ చల్లదనాన్ని ఓ పక్క అనుభవిస్తూ చదువుకునే ఓ కవిత.

జీవితమే ఓ 'అందమైన కవిత'లా అనిపించదూ? ఇక్కడ మ్యూజికల్ ఫౌంటేన్.. అక్కడ దూరంగా కూతవేస్తూ వెళ్ళిపోయే రైలుబండీ.. అప్పటిదాకా నర్తిస్తూ రైలు కూతవిని ఠక్కున ఆగిపోయే పాదాలూ.. వాహ్.. 'పాకీజా' సినిమా కాదు -, ఓ సుదీర్ఘమైన, సుందరమైన కవిత.

❦❦❦

సమ్మోహిత్ చాలా చిక్కిపోయాడు. "ఏమిటీ?" అడిగాను. అతని 'ప్రేమ' గురించి నాకు చెప్పిన తరవాత నెలన్నర గడిచింది. 'ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించిందిట. కానీ పెళ్ళి విషయం ఎత్తవొద్దన్నది. ఎత్తితే వరదరాజన్ చంపేస్తాడుట. ఏమిటి భయ్యా ఇదీ? వేరే వేరే భాషల వాళ్ళు ప్రేమించుకోకూడదా? అయినా మాకు లింక్ భాష ఇంగ్లీషు వున్నదిగా! కట్నాలూ అవీ నేను అడగలేదుగా. డిఫరెన్స్ ఒక్కటే.. ఆయన ఆఫీసరు నేను ఏర్‌మెన్‌ని. అంతేగా. పోనీ, నేనూ బియ్యే చదివి 'కమీషన్'కి అప్లై చేస్తా. అప్పుడైనా ఇవ్వరా? అనడిగితే, మా జాతివేరూ మీ జాతి వేరూ అంటుంది. ఇద్దరం హిందువులమేగదా?" ఫ్రస్ట్రేషన్‌తో అన్నాడు సమ్మోహిత్.

బెంగాలీలతో చిక్కేమిటంటే వాళ్ళు చాలా సెన్సిటివ్. ప్రేమలో 'సెన్సిటివ్' కాని వాళ్ళెవరూ?

అతని కళ్ళకింద నల్లని చారలు. చాలా నీరసించాడు. బహుశా తిండి మానేస్తూ వుండివుండొచ్చు.

ఏం చెప్పనూ? "ఆమెకి ఇష్టం లేనప్పుడు వదిలెయ్. యీ అమ్మాయి కాకపోతే మరొకరు!" వాతావరణాన్ని తేలికపరచడానికి అన్నాను.

"హూ.! వాట్ ద హెల్ యూ నో అబౌట్ లవ్?" చీత్కరించి వెళ్ళిపోయాడు. సైలెంటుగా నిలబడ్డాను. అతని ప్రశ్న నన్ను నిశ్చేష్టుణ్ని చేసింది. నాకు ప్రేమ గురించి తెలీదా. అంతేగాదు.. నేను అన్నదీ??

"యీ అమ్మాయి కాకపోతే మరొకతి" అని. అదే నా విషయంలో జరిగితే 'నమత కాకపోతే మరో వినత' అని హాయిగా తిరగ్గలనా? జీవితంలో అత్యంత దగ్గరగా వచ్చిన మనసుని విస్మరించి పాఠాలు చదువుతూ పదవులకి ఎగబాకగలనా? నా చెప్పుతో నేనే నా చెంపని పగలగొట్టుకోవాలని ఉంది.. ఎదటివాడికి ఎంత సులభంగానూ అర్జంటుగానూ సలహాలిస్తామూ! అదే మన దగ్గరికొస్తే?

నిజం చెప్తున్నా.. ఆ రాత్రే కాదు.. మరో రెండు రాత్రులు కూడా నేను నిద్రపోతే ఒట్టు. సపోజ్ నమత నాకు దక్కకపోతే? అనే వూహే దుర్భరమై నన్ను నిద్రకి దూరం చేసింది.

❦❦❦

"చలో దిల్ దార్ చలో.. చాంద్ కే పార్ చలో.. హమే తయ్యార్ చలో" పాట వొస్తోంది రేడియోలో. పాట వింటూనే రెడ్డి లేచి తన కప్‌బోర్డ్‌లోంచి ఓ చిన్న పుస్తకం తీసి నా చేతికిచ్చాడు, "ఇది నిన్న పాండీబజార్లో దొరికింది. నీకోసం కొనుక్కొచ్చాను." అని. పుస్తకం

పేరు చూశా 'మీనాకుమారీ కీ అమర్ కహానీ', అంటే మీనాకుమారి జీవిత చరిత్ర అన్నమాట. కథ మొత్తం చదివాక పిచ్చెక్కింది. ఎంత ఇన్‌సెక్యూర్డ్ లైఫూ!

నాకో పంజాబీ ప్రార్థన గుర్తొచ్చింది "ఓ దయామయా నీ కోసం ఎన్ని చోట్ల వెతికానో. నీ తియ్యని పలుకుల జాడ వినిపిస్తుందని ఎన్ని గొంతులు విన్నానో. నీ చూపుల్లోని కరుణ ఇసుమంతైనా కనిపించదా అని ఎన్ని కళ్ళ లోతులు కొలిచానో. నీ ప్రేమ పూర్వక స్పర్శ ఎలా వుంటుందో అణువంతైనా తెలుసుకోగలుగుతానని ఎందర్ని నిండుగుండెలతో కౌగిలించుకున్నానో ఉహూ! నాకు దొరికింది అసత్యం ఒక్కటే. అన్నీ అసత్యమైనవే... అనుకరణలు మాత్రమే.. ఎందరు జీవితంలో కొచ్చినా ఒంటరిగానే మిగిలిపోయాను కరుణించవూ.. నీ తోడుని నాకు ప్రసాదించవూ!" అని.

పాపం ఆ మెహజబీన్ (మీనాకుమారి) కూడా అలానే ఒంటరిగా మిగిలిపోయింది. ఆఖరికి శాంతిని వెదుక్కుంటూ అనంతంలోకి సాగిపోయింది.

కానీ అందర్నీ క్షమించింది. ఆఖరికి తన సర్వనాశనానికి కారణమైన భర్తని కూడా క్షమించడమే కాదు. ఆగిపోయిన సినిమాని పూర్తి చేసే అవకాశమిచ్చింది. తను మత్తు ఒడిలోకి జారిపోతూ!

ఆ తరువాత ఆ పుస్తకాన్ని ఎన్నిసార్లు చదివానో. చిత్రమేమంటే, మీనాకుమారి స్మృత్యర్థంగా 'సాక్షి' దినపత్రిక వారు ఓ కాలమ్ వ్రాయమంటే, ఆ రోజుల్లో చదువుకున్న మీనా కుమారి జీవితాన్నే మళ్ళీ గుర్తుకు తెచ్చుకుని వ్రాశాను. ఇవన్నీ అనుకోని సంఘటనలే. లేకపోతే ఏర్‌ఫోర్స్‌లో చేరే దాకా హిందీ రానివాణ్ణి, ముఖేష్ గురించీ, సాహిర్ లుధియాణ్వీ గురించీ, మొహమ్మద్ రఫీ సాబ్ గురించీ నౌషాద్ గారి గురించీ, కిషోర్‌దా గురించీ సలీల్ చౌదరి గురించీ పత్రికల్లో వ్యాసాలు వ్రాయడం ఏమిటీ?

'సితార'లో 14 వారాలు 'ఉత్తర - దక్షిణాలు' అనే శీర్షికతో ఉత్తర దక్షిణ దేశాల సినీగీతాల్ని కంపేర్ చేస్తూ వ్రాశాను. "సితార అందుకోగానే మీ ఉత్తరదక్షిణాల్నే చూస్తాను భువనచంద్రగారూ" అని ఓ రోజున ఎస్.పి.బిగారు ఫోన్ చేసి చెప్పారు. ఆ తరువాత హాసంలో కొన్ని వ్యాసాలు రాశాను. మళ్ళీ వ్రాయాలనే కోరికవుంది. అదెప్పుడు జరుగుతుందో మరి!!

అవ్వాళ శనివారం.. ఏర్‌ఫోర్స్ థియేటర్లో 'ది ఫిఫ్త్ హార్స్‌మెన్' సినిమా చూసి బులెట్‌కి వచ్చేసరికి పక్కమీద నమ్రత ఉత్తరం ఉంది. ఆనందంగా లెటర్ చించాను. ఒకే ఒక్కలైన్ వుంది. 'రాజ్, నాన్నకి పెరాలిసిస్ వచ్చింది.' అని. షాక్ తిన్నాను. ఏం చెయ్యాలీ? గబగబా మా అడ్జుటెంట్‌గారింటికి వెళ్ళాను. ఆయన నాకు ఢిల్లీలో వుండగా తెలిసిన ఆఫీసరు. సెలవు గురించి అడిగాను. 'నో. మదర్ సీరియస్‌గా ఉంటే తప్ప సెలవు ఇవ్వడం ఇంపాజిబుల్. కావాలంటే 'మదర్ సీరియస్' అని మీ వూరినించి ఏ ఫ్రెండ్‌ద్వారా నైనా టెలిగ్రాం తెప్పించుకో. గ్రాంట్ చేయిస్తా" అన్నారు.

నేను ఫ్రెండ్‌కి ఉత్తరం రాసి వాడు నాకు టెలిగ్రాం ఇవ్వాలంటే కనీసం మూడు రోజులు పడుతుంది. "సార్..ఇంకోదారి లేదా?" దీనంగా అడిగాను.

"నో!" అన్నారాయన. ఏం చెయ్యాలీ?

**డిల్లీలో దిగి కమలా బస్** పట్టుకున్నా. హర్యానా రోడ్ వేస్ బస్. రోతక్ (రోహ తక్)లో ఎక్కడికెళ్ళాలీ?

సింగిల్‌లైన్ ఉత్తరంలో వేరే ఏ ఇన్ఫర్మేనూ లేదు. లక్కీగా ఉత్తరం రాసేప్పుడు కుడివైపున పైన ఊరూ, తేదీ వేసే చోట రోహొతక్ అని వ్రాసింది. బహుశా అది వాళ్ళ నాన్నగారి వూరో అమ్మగారి వూరో లేక ఎవరైనా చుట్టాల వూరో అయివుండొచ్చు. అక్కడికెళ్ళి వెదకడం ఎలా? బస్ గుర్గావ్‌ని సమీపిస్తుండగా బేగ్ పట్టుకుని గుర్గావ్‌లో దిగేశా. ముందు వాళ్ళ బేంకుకి వెడితే ఖచ్చితంగా ఆమె ఎక్కడుందో తెలుస్తుంది. లీవ్ అప్లికేషన్‌లో ఉంటుందిగా!

మా ఏర్‌ఫోర్స్ స్టేషన్‌కి పోవచ్చు. కానీ వెళ్ళలేదు. కొద్దిమంది సివిలియన్స్ తప్ప ఎవరు గుర్తుపడతారూ!

బేంక్ మేనేజర్ మంచివాడు. నా ఘోష ఓపిగ్గా విన్నాడు. "మా ఎంప్లాయీస్ వేర్ అబవుట్స్ చెప్పకూడదు గానీ, మీకు రాసిన ఉత్తరంలో నమ్రత సంతకాన్ని 'టేలీ' చేసి చూశాను గనక, ఆవిడ అడ్రస్ చెబుతా. ముందీ టీ తాగండి." టీ తెప్పించి అన్నాడు. చేసేదేముందీ. అసహనంగానే కప్ అందుకున్నాను.

"మీకో విషయం తెలుసా? స్ట్రోక్ వచ్చిన గంటలో పేషెంట్‌ని డాక్టర్ దగ్గరికి చేర్చగలిగితే పేషెంట్ పక్షవాతం నించి 100% కోల్కోగలడు. కనీసం రెండుగంటల్లోపు డాక్టర్, దగ్గరికి చేరిస్తే ఒక ఆరునెలలు, పది నెలలలోగా పేషెంటు మామూలుగా నడవగలడు. మూడు గంటలలోపులో చేరిస్తే ట్రీట్‌మెంట్ రెండు మూడేళ్ళు పడుతుంది. ఆ పైన అనుకోండీ... అంతా దైవాధీనం!" తనకి తెలిసిన విషయాల్ని నెమ్మదిగా వివరంగా టీ చప్పరిస్తూ చెప్పాడాయన.

"ఇదంతా నాకెందుకు చెబుతున్నారూ?" అసహనం అణచుకునే ప్రయత్నం చేస్తూ అన్నాను. ఎదటివాళ్ళు చెప్పేది ఎంత గొప్ప/ మంచి/ జ్ఞానవంతమైన విషయమైనా, మనం వినే మూడ్‌లో లేనప్పుడు విసుగు రాకమానదుగా. "ఐ అండర్‌స్టాండ్" చిరునవ్వు నవ్వి అన్నాడు. ఆ క్షణాల్లో ఆయన బేంకు మేనేజర్లా కనపడలేదు. చావు కబురు చల్లగా చెప్పబోయే డాక్టర్‌లా కనిపించాడు.

"యూ.నో.. యూ ఆర్ సో ఫేమస్ హియర్. ఒకరోజు డిపాజిట్ చేసి, మరుసటి రోజు విత్‌డ్రా చేసి, మళ్ళీ డిపాజిట్, విత్‌డ్రా చేసిన నీ కథ యీ బ్రాంచిలో సర్క్యులేట్ అవుతూనే వుంది. అన్నట్టు నమ్రతతో పాటు చేరిన మిస్ బల్‌రాజ్ కౌర్ ఇంకా ఇక్కడే పనిచేస్తోంది." అనునయంగా నవ్వాడాయన. "అంటే..." ప్రశ్నించబోయి ఆగాను. వీళ్ళకి మా ప్రేమ గురించి తెలుసా?

"ఎస్. మీ విషయం కొంత నాకూ తెలుసు. దురదృష్టకరమైన విషయం ఏమంటే, నమ్రత నాన్నగార్ని డాక్టర్ దగ్గరికి చేర్చేసరికే ఆరుగంటల సమయం దాటింది. గోల్డెన్, సిల్వర్, కాపర్ అవర్స్ పూర్తయి ఐరన్ అవర్లో చేర్చారన్నమాట."

"అదేం?" షాక్‌తో అడిగాను. గుర్గావ్ నిండా బోలెడంతమంది డాక్టర్లు. వాళ్ళ నాన్న పనిచేసే ఢిల్లీలో హాస్పటల్స్‌కి డాక్టర్లకి కొదవేలేదుగా.

"స్ట్రోక్ రాత్రిపూట అంటే అర్ధరాత్రి దాటాక వచ్చిందిట. అందుకే లేటు. అయినా వర్రీకావద్దు. మా అంకుల్ ఒకాయన అమెరికా రిటర్న్డ్ డాక్టర్. ప్రస్తుతం ఆయన మా అంకుల్ పర్యవేక్షణలోనే ఉన్నారు!

"మీ అంకుల్ ఎక్కడుంటారూ?" యీసారి మాత్రం అసహనాన్ని ఆపుకోలేకపోయాను.

"కూల్ డౌన్ బోయ్.. కూల్ డౌన్! మీ జనరేషన్‌కి అన్నీ తొందరే. పేషెన్స్ అనేది వుండదు. ఎనీవే, మా అంకుల్ వుండేది....ఈవూళ్ళోనే!" అని వాక్యం పూర్తిచేశాడు.

"గాడ్!" నిట్టూర్చాను. అయితే నమ్రత ఇంటి దగ్గరే వుండి వుండాలి. నేను లేచాను.

"కూర్చో.. కూర్చో.. నమ్రత నీకు తెలిసిన ఇంట్లో ఉండట్లేదు. ఫాదర్‌ని మూవ్ చెయ్యటానికి వీలుగా 'సబ్జీమండీ' దగ్గర ఓ ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మారింది. మా అంకుల్ వుండేదీ అక్కడికి దగ్గర్లోనే. మీకీ వూరు కొత్త కాదు గనక అడ్రస్ ఇదిగో" అని అడ్రస్ ఓ స్లిప్ మీద రాసి ఇచ్చాడు. థాంక్స్ చెప్పి బయటపడ్డాను. సబ్జీమండీ చేరేలోగా (రిక్షాలో) ఓసారి జరిగిందంతా సింహావలోకనం

చేసుకున్నా. మా అడ్డు టెంట్‌ని బామాలి అయిదురోజులకి లీవ్ గ్రాంట్ చేయించుకునేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. రిజర్వేషన్ లేదు. కూర్చోడానికి చోటు కూడా లేదు. టాయిలెట్స్ మధ్యలో చోటు చూసుకుని నిలబడాల్సి వచ్చింది. ఏడెనిమిది గంటలు నిల్చున్నాక ఓ ప్రయాణీకుడు దయదల్చి ఆయన ఆక్యుపై చేసిన బెర్త్ దగ్గర చోటు (కాళ్ళదగ్గరిది) ఇస్తే కూర్చుని ఢిల్లీ రాగలిగా. ఏదో తెలీని బాధ. తెలీని అలజడి. మనసునిండా గందరగోళం. ఏం చెయ్యను? అమ్మొడొచ్చినవి ఏదో తిన్నాను. ఏదో టీలాంటి పదార్థాన్ని తాగాను. మొత్తానికి ఢిల్లీ చేరాను. (విజయవాడ వచ్చినప్పుడు కిందకి దిగెయ్యాలని మనసు పీకినా బలవంతంగా అణుచుకున్నా)

తలుపు తెరిచే వుంది. మొదట వాళ్ళమ్మగారు చూశారు నన్ను. ఆవిడ సగానికి సగమైపోయింది. మంచం మీద ఆయన. ఆయనేనా? మూతి ఒక పక్కకి వంకర తిరిగివుంది. కళ్ళల్లో నీళ్ళు.. నన్ను చూడగానే. చెయ్యిపట్టుకుని కూర్చుండిపోయాను.

బయటినించి నమ్రత ఏవో సామాన్లతో వచ్చింది. నన్ను చూసి అక్కడే నిలబడిపోయింది. మొహంలోనే తను పడుతున్న శ్రమా వొంటరితనమూ తెలిసిపోతోంది. గబగబా దగ్గరికి వెళ్ళాను. కానీ దగ్గరికి తీసుకునే ధైర్యం చెయ్యలేకపోయాను. తనూ అంతే, ఆబగా నావంక చూస్తూ నిలబడింది. తనని చూసుకుంటూ అలానే వుండిపోయాను. క్షణాలు 'యుగా'లవడం ఎలాగో ఆక్షణాల్లోనే అర్థమైంది. 'దుల్హన్ సే తుమ్హారా మిలన్ హోగా' పాట మళ్ళీ గుర్తుకొచ్చింది. ఎలా ఎప్పుడు తను నా చేయి అందుకుందో, లేక నేను తన చెయ్యి అందుకున్నానో తెలీదు. చేతులు మాత్రం కలిశాయి. కొన్నివేల మాటలు చెప్పలేని 'అర్థాలని' చేతులు చెప్పుకున్నాయి.

తనేదో తెచ్చిపెట్టింది. నేనేదో తిన్నాను. ఏదీ గుర్తులేదు. మాట్లాడాలని వుంది. కానీ మాట్లాడలేకపోతున్నాను.

కొండంత విరహం గుండెల్లో వుండొచ్చు.. కానీ.....!!!

"నావల్ల కాక నీకు లెటర్ రాశాను." అన్నది. మేము అదివరకు మేము నడిచే దారిలో నడుస్తున్నాం. ఓ గంట క్రితం బయటికి వచ్చాం. చాలాసేపు ఓ చెట్టు మొదట్లో కూర్చున్నాం. కౌగిలింత కాని కౌగిలింత ఆ కౌగిలింతలో యవ్వనపు వాడీ విరహపు వేడీ లేవు. ఓ అనునయం, ఓ అభిమానం, పురివిప్పుతున్న మౌనం వున్నాయి. ఎవరు ఎవర్ని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నామో ఇద్దరికీ తెలియలేదు. ఒకటి నిజం, తండ్రి కొచ్చిన జబ్బు ఆమె మాటల్నేకాదు.. మనసునీ మింగేసింది. నవనవలాడుతూ గర్వంగా ఎదుగుతున్న ఓ మొక్క నిట్టనిలువునా వాడి, తలను వాల్చింది.

"అంతా బాగానే వుంటుంది డోంట్ వర్రీ.." లాంటి మాటలు మాట్లాడాలని నేను ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ, మాట్లాడలేకపోయాను. "నువ్వొచ్చావు.! అవును.. నువ్వొచ్చావు!" అన్నది. కొన్నివేల మాటల్ని కుదించి కుదించి తయారు చేసిన వాక్యంలా వినిపించింది నాకు. ఆ మాటకి లిటరల్ మీనింగ్ కంటే, అంతరార్థమే ఎక్కువుంది.

మళ్ళీ అదే 'చాయ్' దుకాణంలో టీ తాగుతున్నాం. గడచిన రోజుల గాఢపు మమతలు మళ్ళీ మనో ఆకాశంలో మబ్బుల్లా కమ్ముకున్నాయి. చాయ్‌వాలా మమ్మల్నిద్దర్నీ చూసి ఎంత సంతోషించాడంటే, డబ్బులు వద్దనడమే కాకుండా, తను కొత్తగా 'జైపూర్' నించి తెచ్చిన టీ సెట్'ని మాకు బహూకరించాడు. 'బంధానికీ' భాషకీ సంబంధమే లేదు అనిపించింది. అసలు అతను మమ్మల్ని గుర్తుంచుకోవలసిన అవసరం ఏముందీ?

మళ్ళీ అదే చెట్టుకింద కూర్చున్నాం. చీకట్లు పడుతున్నాయి. తను మెల్లగా నావైపు తిరిగి నా తొడల మీద కూర్చుంది అతి సహజంగా లలితంగా అల్లుకుంది. పెదాలు కలుపబోయి ఆగాను. చూస్తే తన కళ్ళల్లోంచి బొటబొటా కన్నీరు కారుతోంది. గువ్వని అదుముకున్నట్టూ తనని నా గుండెకి అదుముకున్నాను.

ఏదో కంటికి కనపడని, మనసుకి వినపడని ప్రవాహం ప్రవహించింది. దాని అనుభూతి అనంతం. ఆ క్షణంలో ఏ కోరికా లేదు... ఏ ఆలోచనా రాలేదు. అసలు 'నేను' అన్నభావనేలేదు. అదేమిటో ఇప్పటికీ నేను చెప్పలేను.

ట్రైన్‌లో కూర్చున్నాను. ట్రైను ముందుకి వెళ్తున్న కొద్దీ తను వెనక్కి వెనక్కి వెడుతున్న భావన.

ఢిల్లీ దాటిన పావుగంట తరవాత స్పృహ వచ్చింది. అప్పుడు కూర్చున్నాను. నమ్రత వాళ్ళ మేనేజర్ శ్రీ నరోత్తమ్ భాటియా, ఎలా చేయించాడో గానీ నాకు రిజర్వేషన్ మాత్రం చేయించాడు. నాకు ఇష్టమని ఆలూపరోటా, ఆచార్ (పచ్చిమిర్చి+కేరెట్ ప్లస్ కాలీఫ్లవర్ నిమ్మ ముక్కలతో చేసిన నార్త్ ఇండియన్ వూరగాయలు) ఇంకేవో సబ్జీలు నిండిన కేరేజీ భద్రంగా నా బేగ్‌లో పెట్టింది నమ్రత. రానూ పోనూ తీసేస్తే నేనున్నది రెండున్నర రోజులు. ఈ రెండున్నర రోజుల జీవితాన్నీ ఏనాటికీ అక్షరాల్లో పెట్టలేను. కారణం మాటలు అతి తక్కువ. మనసుల మాటలు లెక్కలేనన్ని. ఒక విధంగా చూస్తే మాట్లాడటమంత వ్యర్థమైనపని లోకంలో మరొకటి లేదు. మాటలు ఇచ్చే 'అనుభవం' కేవలం .00001% మాత్రమే.

"బస్తీ బస్తీ పర్ బత్ పర్ బత్ గాతాజాయే బంజార
లేకర్ అప్ నా ఇక్ తారా" అని ఓ ప్రయాణీకుడు కూనిరాగం రాగం తీస్తున్నాడు.

(నగరాలూ పర్వతాలని గమిస్తూ ఓ బాటసారి, ఏక్‌తారా మీటుకుంటూ గానంతో సాగిపోతున్నాడు)

ఛండాలంగా ట్రాన్స్‌లేట్ చేశానని ఆనాడు నాకు తెలీదు.

యీనాడు తెలిసినా దాన్నే మీ ముందు వుంచుతున్నాను.

**"ఆ క్షణాల్ని అలానే వుండనీ నేస్తమా..**
**రెక్కలు విప్పుకున్న పావురంలా నువ్వు**
**పంజరంలోని చిలకలా నేను..**
**కన్నీటి చుక్క సముద్రమైతే**
**కల 'జాబిలి' ఎందుకు కాకూడదూ?**
**పోన్లే! ఎగురుతూ నువ్వూ**
**ఏడుస్తూ నేనూ ----**
**దాటి పోదాం.. యీ విషాద పర్వతాలని.**
**ఏరుకుందాం రాలే కలల బిందువుల్ని"**

**"పాదచారి"**

కలవడం ఎంత మధురం.. విడిపోవడం ఎంత విషాదం. ఎగిరెగిరి ఉవ్వెత్తున లేచిన అల, ఒడ్డును తాకి తలొంచుకుని నిశ్శబ్దంగా నిష్క్రమించినట్టు ఢిల్లీ నొదిలి నేను మద్రాసు పోతున్నాను. సూది మొనంత ఆలోచన కృష్ణబిలంలా మారి సమస్తాన్నీ తనలోకి లాగేసుకున్నట్టు ఓ మౌనం మనసుని కబళించేస్తోంది.

కళ్ళు మూసుకుని కిటికీమీద తల వాల్చాను.

'పాడవేలరాధికా...ప్రణయ సుధా గీతికా'.. వీణపాట వినిపిస్తోంది.

ట్రాన్సిస్టర్లు కొత్తగా జనానికి అందుబాటు కొచ్చిన రోజులు. ఇది ట్రాన్సిస్టర్ కాదు. టేప్‌రికార్డర్ 'ఫూల్' టైపుది.

'గోపాలుడు నిను వలచీ నీ పాటను మది తలచి

ఏమూలనో పొంచి పొంచి వినుచున్నాడని ఎంచీ'

ఎంత మధురమైన భాష మనదీ!

ఎదురుగా వున్న వాళ్ళు తెలుగువాళ్ళే. భార్యాభర్త. నడివయసువాళ్ళు. "గానా అచ్చా లగ్ తా హై.. భాషా క్యా హై" అడిగాడో నార్తిండియన్ "తెలుగు" చెప్పిందావిడ.

"ఓహ్.. మద్రాసియా" తలపంకించాడతను.

"నై.. తెలుగూ భాషా" మరోసారి అన్నది.

"వహీతో మై బోలా.. మద్రాసీ హై" అన్నాడతను.

ఆవిడ నవ్వేసి వూరుకుంది. అప్పటికి సౌత్ ఇండియన్స్ అందరూ నార్త్ వాళ్ళ దృష్టిలో మద్రాసీలే. కనీసం 'తెలుగు' అంటే ఫలానా అని చెప్పాలని కూడా నాకు అనిపించలేదు. నేనున్న స్థితి అది. అంతకు ముందైతే మద్రాసు లేక మద్రాసీ అనంగానే నాలుగు భాషల గురించీ వివరించి చెప్పేవాడిని.

"భోంచేద్దామా?" ఆయనతో ఆవిడ అన్నది. చూపుల్తో అనంతమైన ప్రేమ. "ఊ!" అన్నాడాయన. ఆయన కళ్ళల్లోనూ అంతే. పులిహోర డబ్బా తీసి, పక్కనున్న బేగ్‌లోంచి పచ్చని ఆకులు తీసి వాటిని ప్లేట్లల్లో పెట్టి, ఆ ప్లేట్లలో పొందిగ్గా గరిటతో పులిహోర వడ్డించి ఇచ్చింది. మరో చిన్న స్టీలు డబ్బాలోంచి టమోటా చక్రాలు ఉల్లిపాయ చక్రాలు కూడా వొడ్డించింది. పులిహోర రంగు అద్భుతం. వాసన కంపార్ట్‌మెంటంతా అలుముకుంది. మరో చిన్న డబ్బాలోంచి ఎర్రనిపండు మిరపకాయల పచ్చడి కూడా వొడ్డించింది.

ఎక్కడో, ఏ లోకంలో కూరుకుపోయివున్న నేను ఆవిడ వొడ్డిస్తున్న పద్ధతికి యీ లోకంలోకి వచ్చాను.

"అద్భుతంగా వుంది.. అబ్బ ఎన్నాళ్ళయిందో"

అపురూపంగా స్పూన్‌తో తింటూ అన్నాడాయన.

"అవును.. కలెక్టుగా చెబితే ఇరవై ఆరేళ్ళు" అన్నదామె.

"నీకో చిత్రం తెలుసా? పులిహోరంటే ఆవిడకి అసహ్యం" నవ్వాడతను.

"అదేం?" ఆవిడా నవ్వింది.

"నాకు ఇష్టం గనక" పకపకా నవ్వాడు "అంతేగాదు.. నాకు ఇష్టమైనవన్నీ ఆమెకి అయిష్టం కలిగించేవే! నాకు ఇష్టం లేనివి మాత్రం ఆమెకి మహా ఇష్టం."

"గాడ్!" ఆశ్చర్యంగా అన్నది.

"అవును! అయినా.. ఏం చేస్తాం.. జీవితంగదూ.!" నిర్లిప్తంగా నవ్వాడు. అప్పుడు అర్థమైంది.. వీళ్ళిద్దరూ భార్యాభర్తలు కారనీ ఒకప్పటి ప్రేమికులనీ. ప్రేమికులని ఘంటాపథంగా ఎలా చెప్పగలుగుతున్నానంటే, వారి చూపులే వారిని పట్టి ఇచ్చాయి. 'అసలు వీళ్ళు ఇలా తమవాళ్ళకి తెలీకుండా పయనించడం కరెక్టేనా?" అంటూ మనసు గొణిగింది గానీ, ఆ విషయాన్ని, అంటే ఆ ఆలోచనని అక్కడే సమాధి చేశాను.

"వాళ్ళ మనసుల్లో ఇన్నేళ్ళూ ఎన్ని కోట్లసార్లు ఒకరినొకరు తల్చుకున్నారో.! ఎన్ని కోట్లు నిట్టూర్పులు విడిచావో!.. ఎన్ని వేల కోట్లసార్లు వారి మధ్య గడిచిన ఆనందక్షణాలనీ, విషాదపు సంఘటలనీ 'రీవైండ్' చేసి చూసుకున్నారో! కలవక కలవక ఇరవై ఆరేళ్ళ తరవాత కలిస్తే ఎందుకూ వారిని శోధించడం? అదీ అర్థం లేని ప్రశ్నలతో!" అని నాకు నేనే సమాధానపరుచుకున్నాను.

"కొంచెం మా ఫుడ్‌ని పంచుకుంటారా?" నవ్వుతూ నన్ను అడిగిందామె. నిండైన మొహం.. స్నేహపూరితమైన నవ్వు.

"I have" అని నా కేరేజీ బయటికి తీశాను. నేను తెలుగువాడ్నని వాళ్ళకి తెలియనివ్వదలుచుకోలేదు. అలా తెలిస్తే వాళ్ళు 'ఫ్రీ'గా మాట్లాడుకోవటానికి ఇబ్బంది పడతారు. వాళ్ళతో సంభాషణ పెంచుకోవాలని అసలే అనుకోలేదు. కారణం, వాళ్ళ ప్రతిక్షణము వాళ్ళే అనుభవించాలని. నేనెందుకు మధ్యలో దూరి వారి సమయాన్ని అపహరించాలి?

"నా ఫుడ్ మీరూ కొంచెం షేర్ చెయ్యండి" ఇంగ్లీషులో అంటూ, నా దగ్గరవున్న ఆలూపరోటా, భెండీ మసాలా, ఆచార్‌ని వాళ్ళ ప్లేట్లలో వడ్డించి, నా దగ్గరున్న పేపర్ ప్లేట్లో నేను వొడ్డించుకున్నాను. ఆవిడ కొంచెం పులిహోర, పండుమిరప చెట్నీ సలాడ్, నా ప్లేట్లో వొడ్డించింది. పులిహోర నిజంగా అద్భుతంగా వుంది. నమ్రత వాళ్ళ అమ్మగారు చేసిన 'ఆచార్' (వూరగాయ) అద్భుతం. వూరిన పచ్చిమిర్చి కొరుక్కుతింటే పుల్లగా, కారంగా, తియ్యగా, ఓ అద్భుతమైన రుచితో ఆకల్ని పెంచింది.

"ఇట్స్ సో నైస్" వాళ్ళిద్దరూ పరోటాల రుచినీ, భెండీ, ఆచార్ రుచినీ చాలా మెచ్చుకున్నారు.

భోజనమయ్యాక వాళ్ళిద్దరూ తెలుగులో స్వేచ్ఛగా మాట్లాడుకోవడం మొదలెట్టారు. నేను కూడా నా బెర్తుమీద నిద్రవొస్తోందని చెప్పి పడుకున్నాను... నిండుగా పలుచని దుప్పటి కప్పుకుని.

నేను బయలుదేరే ముందు రాత్రి సడన్‌గా నమ్రత నా గదిలోకి (అంటే నేను పడుకున్న గదిలోకి) వచ్చింది. అవతలి గదిలో ఆమె తల్లిదండ్రులున్నారు. మరోసారి ఒక్కమాట కూడా మాట్లాడకుండా కౌగిలించుకుంది. అసంకల్పితంగా నా చేతులు ఆమెని చుట్టేశాయి. నా మొహాన్ని ఆమె జుత్తుకేసి రుద్దుకున్నా. ఆమె గట్టిగా చుట్టుకుపోయింది. ఒక ఆర్తి.. శతాబ్దాలనాటి ఆర్తి - శరీరాలతో సంబంధం లేకుండా మనసుల్ని పెనవేసింది. ఎంతసేపు వున్నామో నిజంగా తెలీదు. రెండు గుండె చప్పుళ్ళు లేవు.. ఒకటే సవ్వడి. ఎప్పుడో .. తటాల్న నిలబడి, "ఆత్మార్పణ లేని ప్రేమ అసంపూర్ణం కదూ.! రాజ్.. మన మధ్య వున్న యీ బట్టలు నిజంగా ఇనుపగేట్లలాగా వున్నాయి..! వీటిని చీల్చుకుని నీలో కలిసిపోవాలని వుంది.. కానీ.." అంటూ నన్ను గుండెకేసి హత్తుకుంది ఆమె కళ్ళల్లోంచి అతి వెచ్చని కన్నీరు నా తలమీద చినుకుల్లా రాలడం నాకు తెలుసు. తెలీకుండా వొచ్చి తెలీకుండా వెళ్ళిపోయే కలలాగా నా తలని దిండు మీద వాల్చుకునేట్టు చేసి నిశ్శబ్దంగా తను వెళ్ళిపోయింది.

ట్రైను ఉయ్యాలూగుతూ పోతోంది. ఓ చిత్రమైన లయ. మళ్ళీ నమ్రత తనువు పరిమళం నన్ను అలుముకున్నది. ఓ కలలా.. మళ్ళీ మనసులో ఓ గీతం మెదిలింది.

"దుల్హన్ సే తుమ్హారా మిలన్ హోగా.. యే మన్ థోడీ ధీర్ ధరో" అని...

ఆమె వరంగల్లో దిగింది. అతను సర్వస్వాన్నీ పోగొట్టుకున్నవాడిలాగా కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గరే నిలబడ్డాడు.

ఇప్పుడేం జరుగుతుందీ? ఇంటికి వెళ్ళాక మళ్ళీ జరిగిన యీ కొత్త ప్రయాణంలోని మధురిమలను జీవితాంతం నెమరువేసుకుంటూ, నిట్టూరుస్తూ బ్రతుకుతారా? లేక మళ్ళీ జీవన స్రవంతిలోకి జారిపోతారా? ఇదీ నా ప్రశ్న. జవాబు నా మనసులోనే సిద్ధంగా వుండివుండొచ్చు. కానీ నేను ఆ 'జవాబు'ని వినడానికి కాదుగదా ఊహించడానికి కూడా సిద్ధంగాలేను.

ప్రియపాఠకులారా.. మీరూ జీవితంలో ఎవర్నో ఒకర్ని ప్రేమించే వుంటారు. ఆ ప్రేమగాఢతలో కొట్టుకుపోతూ పెళ్ళిచేసుకుందామనీ అనుకుని వుంటారు. ఇంకాస్త ముందు కెళ్ళటం జరిగితే 'లోకాన్నంతట్నీ ఎదిరించైనా పెళ్ళిచేసుకు తీరదాం?' అని పరస్పర ప్రమాణాలూ చేసుకుని వుంటారు. ఆ పెళ్ళి జరగక, జీవితంలో మళ్ళీ మీ ప్రేమ పొందిన వార్ని ఏ ట్రైన్‌లోనో, బస్సులోనో, ఫ్లైట్‌లోనో కలిసి ఇలా ప్రయాణం చేసే అవకాశం దొరికితే ఏం చేస్తారూ? ఏ నిర్ణయాన్ని తీసుకుంటారూ?

విజయవాడలో అతను దిగాడు. చిత్రం ఏమంటే, వరంగల్లో ఆమె దిగినప్పుడున్నంత బాధా వేదనా విచారమూ అతని మొహంలో లేవు. గబగబా దిగి గబగబా నడుచుకుంటూ పోతున్నాడు. నేనూ వెనకనే దిగా.. టిఫిన్ పొట్లాలు కొనుక్కుందామని.

బహుశా ఆ వ్యక్తి ఇంటికి చేరేసరికి 'ఆమె' విషయాన్ని ఆల్‌మోస్ట్ మరిచిపోతాడేమో అనిపించింది.

"ఖచ్చితంగా మరిచిపోడు. ఆమె కూడా అంతే! బాబూ, జీవితం ఎంత పెద్దదో అంత చిన్నది. ఎంత చిన్నదో అంత పెద్దది కూడా! ఒక వయసులో మనసుని 'కంపార్ట్‌మెంట్స్'గా మార్చడం తెలీదు. ఎవరైనా చెప్పినా కూడా కంపార్ట్‌మెంటల్‌గా మార్చడం సాధ్యంకాదు. కానీ, వయసు పెరిగిన కొద్దీ మనిషిలోని 'గుప్తత' పెరుగుతుంది. ఏ కంపార్ట్‌మెంట్ అదేనన్నట్టు దేనికది 'విడిగా' వుంచడమూ, 'విడి'గా దాచడమూ అలవాటైపోతుంది. అతనిలోని ప్రేమికుడూ, ఆమెలోని ప్రేమికురాలూ ఎప్పటికీ చచ్చిపోరు. హృదయంలోని వారివారికి ఏర్పర్చబడ్డ గదుల్లో స్పష్టంగా, సజీవంగా వుంటారు. ఒకరోజు వారిద్దరూ కలిసి చేసిన ప్రయాణం, కొన్నేళ్ళపాటు వారికి ప్రాణవాయువై బ్రతికిస్తుంది. ఒకమాట చెప్పనా? ప్రేమించిన వారు ఎదురుగా వుండనక్కరలేదు. వారెక్కడున్నా 'నన్ను ప్రేమిస్తూనే వుంటారు' అన్న భావమూ, నమ్మకమూ చాలు.., మనిషిని బ్రతికించడానికి" సూటిగా స్పష్టంగా చెప్పారు భువనేశ్వరమ్మగారు.. ఎందుకంటే, ట్రైన్ విషయమంతా ఆవిడకి చెప్పాను గనక.

"మరి అతను గబగబా అసలేమీ జరగనట్టు ఎలా వెళ్ళిపోగలిగాడు?" అమాయకంగానే అన్నా.

"అది అమాయకత్వం కాకపోతే మరేమిటి?" పకపకా నవ్విందావిడ.

"నువ్వు ఢిల్లీ వెళ్ళేముందు నాతో చెప్పే వెళ్ళావు. ఉత్సాహం నీతో ఉరకలేసిందని నాకు తెలుసు... ఎందుకో నువ్వు చెప్పకపోయినా అక్కడెవర్ని కలిశావో ఏం జరిగిందో నాకేమీ తెలీదు. కానీ ఒకటి చెప్పు. నీలోపల ఏదో కంటికి కనిపించని శూన్యం నాకు కనిపిస్తోంది. అంత శూన్యాన్ని నింపుకుని గబగబా ఇక్కడికి ఎందుకొచ్చావూ? ఓ గంటో రెండు గంటలో నిట్టూరుస్తూ స్టేషన్‌లోనే ఉండొచ్చుగా?"

నేను సైలెంటయ్యాను. నిజమేగా! 'ఆమె'ని విడిచి 'అతడు' ఒంటరిగా పయనించాల్సి వచ్చినప్పుడు అతనెంత దుఃఖపడ్డాడో, ఢిల్లీలో నమతని విడిచివచ్చేప్పుడు అంతకన్నా ఎక్కువే దుఃఖపడ్డాను. విజయవాడలో అతను తన దుఃఖాన్ని తనే సంబాళించుకుని ఎలా గబగబా నడిచిపోయాడో, నేనూ అదే చేశాను. తేడా ఏముందీ?

"నిన్నటి దుఃఖపు గాఢత నేటికి వుండదు. అలాగే నేటి దుఃఖపు గాఢత రేపటికుండదు. పిచ్చివాడా, ఆ మాట కేవలం దుఃఖానికి మాత్రమే కాదు, సుఖానికీ వర్తిస్తుంది. నిన్న నీకు సుఖమిచ్చిన సంఘటన నేడు దుఃఖాన్ని మిగల్చవచ్చు. జీవితంలో ఏదీ శాశ్వతంకాదు. సుఖము దుఃఖమూ, ప్రేమా, ద్వేషమూ, ఆరాధనా, అనారోగ్యమూ, అసహ్యమూ ఏదీ శాశ్వతంకాదు. అన్నీ కాసేపు వుండి ఆ తరువాత తరలి వెళ్ళిపోయే మబ్బులే. "దీర్ఘంగా నిశ్వసించి అన్నారావిడ.

"ప్రేమకూడా అలాంటిదేనా?" కొంచెం తీవ్రంగా అడిగాను.

"నిజంగా చెబితే అలాంటిదే మనుషులు దూరంగా వుంటే, ప్రేమ పచ్చిగానే వుంటుంది. అదే మనుషులు కలిసివుంటే, ఆ ప్రేమ ఎండిపోవడానికి ఎంతోకాలం పట్టదు. ప్రేమ వివాహాలు విఫలమై విడాకులకి దారి తీసేది ఇందుకే!"

"మీరన్నది నూటికి పదిపాళ్ళు కూడా జరగదు." మొండిగా అన్నా.

"నూటికి ఒకపాటు నిలిచినా, పెళ్ళయ్యాక, ప్రేమ బతికినట్టే" చిన్నగా అనునయంగా నవ్వారు.

"ఎందువల్ల?" కాసేపు మౌనంగా వుండి అడిగాను.

"ప్రేమకి బరువులు బాధ్యతలూ వుండవు కులం, మతం సోషల్ స్టేటస్‌లాంటి అడ్డుగోడలు అసలే వుండవు. ఎవరింట్లో వాళ్ళుంటారు గనక ఎవరూ ఎవర్నీ పోషించనక్కర్లా. అదే పెళ్ళి విషయంలో లేదు. పెళ్ళితో హక్కులొస్తాయి. ప్రేమలో లేని బాధ్యత పెళ్ళయ్యాక వుండి తీరుతుంది. ఎక్కడ 'హక్కు' వుంటుందో అక్కడ 'అహం' వుండి తీరుతుంది. ఎక్కడ 'బాధ్యత' వుందో అక్కడ 'డ్యూటీ' కూడా వుండితీరుతుంది. బాధ్యత లేకుండా 'హక్కు'ని ఉపయోగించుకోవాలనుకోవడం పతనానికి నాంది. ప్రేమ 'వాడి'పోవడం ప్రారంభమయ్యేది సరిగ్గా అక్కడే!" సింపుల్, బట్, అద్భుతమైన వివరణ ఇచ్చారు భువనేశ్వరమ్మగారు.

ఎన్నో అడగాలనిపించినా అడగలేదు. ఎందుకంటే, ముందు ఆవిడ చెప్పింది నేను పూర్తిగా అర్థం చేసుకోవాలిగా!

అసలు ప్రేమంటే ఏమిటీ? ఇన్నేళ్ళపాటు ఒంటరిగా ఉత్సాహంగా బతికినా నేను 'నమ్మో' నా జీవితంలో ప్రవేశించగానే ఎందుకు మారిపోయా? మొన్నటి వరకూ నా సంతోషం నా దుఃఖం నావే; మరి ఇప్పుడూ? ఆ రెండూ నమత సుఖదుఃఖాలమీద ఆధారపడి వున్నాయి. ఇది ఔనన్నా కాదన్నా, ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా పచ్చి నిజం.

లేదూ, నా మనసూ దాని సుఖ,దుఃఖాలూ కేవలం నా కంట్రోల్లోనే వున్నాయని నన్ను నేను నమ్మించుకోవడం పరమ మూర్ఖత్వం అవుతుంది. "నిజాన్ని ఒప్పుకో" అని హెచ్చరించింది మనసు.

"అంటే అసలు ప్రేమా, ప్రేమించడం, ప్రేమించబడటం - ఇవన్నీ ఎందుకూ పనికిరావనీ పనికిమాలినవనీ అంటారా?" అడిగాను రెండు రోజుల తర్వాత.

"నేను చదువుకున్నదాన్ని కాదు. రెండోది, నేను మాట్లాడే మాటల్లో 'గొప్ప అర్థం వుందని నువ్వనుకోవాలని' అంతకన్నా మాట్లాడటంలేదు. ప్రేమ చెడ్డదీ పనికిమాలినదీ ఎందుకవుతుంది? ప్రేమకన్నా గొప్పది ఏదీలేదు. తనని తాను ఏ షరతులూ లేకుండా, ఏమీ ఆశించకుండా అర్పించుకోవడమే ప్రేమ. ప్రేమించటం వల్ల సర్వనాశనం అయిపోయినా, దాన్ని గురించి ఆనందంగానే ఆలోచించేవారు, ఆ కష్టాన్నో, నష్టాన్నో నిశ్చలంగా, నిర్మలంగా, నిజాయితీగా స్వీకరించేవారే ప్రేమించడానికో, ప్రేమింపబడటానికో అర్హులు. లేనప్పుడు ప్రేమకూడా, "నేను నీకు ఇది ఇచ్చాను, మరి నువ్వు నాకేమిచ్చావు?" అనే వాదనతోటే జీవితాన్ని దుర్భరం చేస్తుంది" అన్నారు.

ముమ్మాటికీ నిజమని ఇప్పుడు నాకు తెలుసు. అప్పుడు ఆ వేడిలో ఆ దుడుకుతనంలో నాకు తెలీదు గనక "అలాగా!" అని ఆ అద్భుతమైన చర్చని సాగకుండా ఆపేశాను. యవ్వనం మాట వినదు...విననీయదు.

పెళ్ళే కాని ఉమకి ఆపరేషనా? సైలెంటై పోయాను. నమ్మి తీరాల్సిందే కారణం, ఉత్తరం రాసింది ఉమే.

"గుంటూర్లోనే నా అనారోగ్యానికి అసలు కారణం కనుక్కున్నారు. నేను ఆల్‌రెడీ సిద్ధంగా వున్నాను. నువ్వేమీ కంగారుపడి పరిగెత్తుకు రావద్దు. ఇక్కడ మనుషులు ఉన్నారు. వాళ్ళు జాగ్రత్తగానే చూసుకుంటారు. ఎందుకంటే, వాళ్ళు అడిగినదానికంటే ఎక్కువే 'ఇవ్వ'డానికి ఒప్పుకున్నా గనక. నువ్వసలు వర్రీ కావొద్దురా. నేను బ్రహ్మాండమైన ధైర్యంగా వున్నాను. నీ ట్రైనింగ్ పూర్తయి వచ్చేసరికి

నూటికి నూరు శాతం ఆరోగ్యంగా ఉండటమే కాదు... స్టేషనుకొచ్చి, నేనే రిసీవ్ చేసుకుంటాను.'' అని ఓ మూడు పేజీల వుత్తరం రాసింది. అంతా నాకు ధైర్యం చెబుతూనే.! తొందరపడి రావద్దని వొట్టు పెట్టుకుంటూనే!

చేసేదేమీ లేదు. సెలవు దొరికినా తన దగ్గర వుండి పూర్తిగా కోలుకునేదాకా ఉండటం ఇంపాసిబుల్. మిలటరీలో అడుగు పెట్టాక, నేను పెట్టిన సంతకానికి నేనే విలువ ఇవ్వకపోతే?

ఒకదాని వెంట ఒకటి. ఏం చెయ్యాలి? ఏం చెయ్యడం? ఒక్కసారి వింటే అదివరకు కంఠోపాఠంగా వచ్చేది. ఇప్పుడు పదిసార్లు చదివినా మనసుకి పూర్తిగా ఎక్కడంలేదు.

''జీవితంలో ప్రేమ చాలా ముఖ్యమైనదే గానీ, ప్రేమే జీవితం కాదు.'' విచారంగా అన్నారు భువనేశ్వరమ్మగారు.

''ప్రేమే జీవితం కాదు.. కాకూడదు.'' మళ్ళీ అన్నారు.

''ఏం?'' ఆశ్చర్యంగా అడిగాను.

''వినలేదా? పద్దెనిమిదేళ్ళ అబ్బాయీ పదహారేళ్ళ అమ్మాయీ ట్రైను కింద పడి చనిపోయారు. శరీరాలు ముక్కలైనాయి. అయినా అబ్బాయి పేంటు జేబులో ఉత్తరం దొరికింది. పెద్దవాళ్ళు పెళ్ళికి వొప్పుకోలేదు గనక ఆత్మహత్య చేసుకుంటున్నామని. ఛీ! ప్రేమంటే అసలేమిటో తెలీకుండా ప్రేమలో పడటం, అర్ధంతరంగా జీవితాన్ని ముగించడం. ఎంత ఘోరం. ఇంతా ఆత్మహత్య చేసుకుని వాళ్ళు ఏం సాధించారూ, తల్లిదండ్రులకి తీరని దుఃఖం మిగల్చడం తప్ప!'' చాలా బాధతో అన్నారావిడ.

నా చుట్టూ జరుగుతున్నది పట్టించుకోవడం మానేసి చాలా రోజులయింది. కారణం 'నమ్రత' నించి ఒక్క వుత్తరం కూడా రాకపోవడం... ప్రతిరోజూ నేను ఉత్తరం వ్రాస్తున్నా. అఫ్‌కోర్స్.. 'కోలుకుంటూ వున్నాను' అని ఉమ వ్రాయడం వల్ల ఒకవైపు శాంతి లభించిందనుకోండి.

''నిన్న జరిగినదాన్ని గురించి యీవేళ ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం ఎంత తప్పో, రేపటి జీవితానికి భయపడి యీనాడే ఏదేదో చేసేసుకోవడం కూడా అంతే తప్పు. అసలు 'పడిపోని' వాడికి 'లేచి మళ్ళీ నిలబడటం' ఎలా తెలుస్తుందీ?

ప్రతి ఓటమీ మనిషిలో పట్టుదల పెంచాలి. అలా కావాలంటే మనిషి ఎప్పుడూ ఆశావాదాన్నే సాధన చెయ్యాలిగానీ, నిరాశవైపు మళ్ళకూడదు. ఏముందీ. మొన్న పోతే ఇవాల్టికి మూడోరోజు. భూమీ ఆకాశం రాత్రీపగలూ అన్నీ యధాతధంగా తమ పని చేసుకుంటూనే పోతున్నాయిగానీ, ఏదీ ఆగలేదుగా?'' ఆవిడ బాధలో, 'అయ్యో' అనే కోపం కూడా వుంది. నిజమేగా మరీ.

''పిరికివాళ్ళు.'' అన్నాను. ఒక్కసారి సూటిగా నా వంక చూసి, ''కావొచ్చు. కానీ కొన్ని లక్షలమంది పిరికివాళ్ళు వున్నారే, వాళ్ళందరూ బ్రతకడంలేదా? లోకంలో ప్రేమని నిలుపుకోవడం ఒక్కటే ధైర్యానికి రుజువుకాదు. పరిస్థితులు ఏవైనా, ఎటువంటివైనా ఎదుర్కొని నిలబడగలగటమే నిజమైన ధైర్యానికి అర్థం'' అన్నారు. నిజం ఎంత మంచిమాట! ఎంత గొప్పమాట! 'ప్రేమ' అంటే బ్రతికేదీ బ్రతికించేదీ అంతేగానీ చచ్చేదీ  మరొకర్ని తనతోపాటు చంపేదీకాదు.

ప్రేమ గురించిన బుల్లిబుల్లిమాటలో, చర్చలో అప్పుడప్పుడూ జరుగుతూనే వున్నాయి. పట్టుదలతో నా మనసునంతా కూడగట్టుకుని పరిక్షలకి ప్రిపేర్ అవుతున్నాను. ఉత్తరం రాలేదన్న ఊహనే మనసులోకి రానీకుండా జాగ్రత్తపడుతున్నాను.

''రేపు మేమిద్దరం సుఖంగా ఉండటానికి 'పెట్టుబడే' నేడు పడుతున్న కష్టం'' అని నాకు నేను సర్దిచెప్పుకున్నా. ''ఆనందమూ ఉత్సాహమూ బయటి నించి లోపల పెట్టేవికావు. గుండె లోపల్నించి తీసి ఇతరులకు పంచేవీ మానసీ ఊయలూగించేవీ'' అని ఓనాడు 'బోరీబాబా' చెప్పిన మాటలు గుర్తొచ్చి, దానికి తగ్గట్టు నన్ను నేను మలుచుకున్నాను. (''వాళ్ళు'' నవలలో ఉంది 'బోరీబాబా' బోధ+కథ) ఎమెస్కో వారు పబ్లిష్ చేశారు.

పరీక్షలు జరుగుతున్నాయి. అద్భుతంగా పూర్తిచేశాను. ఇక రిజల్ట్స్ రావాలి. అవి చెప్పాక ఏర్‌ఫోర్స్ రికార్డ్ ఆఫీసు నించి పోస్టింగ్స్ వస్తాయి. ఎక్కడికి వేస్తే అక్కడికి డబ్బా,డవాల్ సర్దుకుని పోవాలి. వెళ్ళేముందు పాసింగ్ అవుట్ పెరేడ్ వుంటుంది. ముందునించే వీడ్కోళ్ళు ప్రారంభమయ్యాయి. అదో విచారకరమైన ఘట్టం. సంవత్సరం పాటు కలిసి వున్నవాళ్ళం, ఎవరిదారిన వాళ్ళు పోవాలి. జీవితం అంటే అంతేగా .. కలవడం - విడిపోవడం.

'ఇక్ పల్ హై మిల్ నా.. ఇక్‌పల్ బిఛడ్ నా

దునియా హై దోదిన్ కా మేలా'

(ఓ క్షణం కలవడం.. మరో క్షణం విడిపోవడం..

లోకం అంటే ఓ రెండు రోజులపాటు సాగే తిరునాళ్ళ లాంటిది)

నమ్రతనించి ఉత్తరం రాలేదు. ఉమ పూర్తిగా కోలుకున్నానని రాసింది. కొద్దిరోజుల్లో మద్రాసుని వొదిలి వెళ్ళక తప్పదు. కలకత్తాలోని నా జీవితాన్ని కొద్దోగొప్పో విపులంగా రాశాను. మద్రాసు జీవితాన్ని అతికొద్దిగా మాత్రమే మీ ముందు ఉంచాను. ఎందుకంటే జీవితపు మిగతా భాగంలో, అంటే ఇప్పటిదాకా నేను ఉన్నది మద్రాసులోనేగా. 'మరో మనసు పొరలో' వివరంగా చెప్పితీరాలని నాకు తెలుసు. అందుకే బ్రీఫ్ చేస్తున్నా.

"రాజ్.. ఆప్‌కా లెటర్" అరిచాడు మల్‌హోత్రా.

పరిగెత్తుకుంటూ వెళ్ళి అందుకున్నా. నమ్రత రాసిన ఉత్తరం అది.

"రాజ్.. ఏం రాయాలో తెలీక ఇన్ని రోజులూ ఉగ్గబట్టుకుని ఆగాను. ఏదోనాడు వ్రాయక తప్పదు. అందుకే ఇప్పుడు రాస్తున్నా. నా ప్రియాతిప్రియమైన నా ప్రాణమా - చదివి బాధపడకు. ఎన్నిసార్లు నా గుండె ముక్కలు చేసుకుని రాస్తున్నానో! అసలు మనిద్దరం కలిసిన క్షణం గుర్తుందా? అప్పటినించీ యీ క్షణం దాకా మానసికంగా నీతోనే వున్నాను. నాలోనే నువ్వూ వున్నావని నాకు తెలుసు. నేస్తమా, నన్ను క్షమించు.. నేను మొండిదాన్నీ, నీకంటే మానసికంగా బలవంతురాల్నీ. పంజాబీదాన్నికదూ!

అందుకే నా కత్తితో నేనే పొడుచుకుని ఆ వేదననే సుఖమనుకుంటూ నీకు ఉత్తరం రాస్తున్నా. నా పిచ్చోడా, నేను ఏమౌతున్నానని అడక్కు. నాన్న పరిస్థితి తెలీదు. పదిరోజులు బాగుంటే పదిరోజులు ఎండిపోతున్నారు. ఉద్యోగం మాత్రమే కాసేపు నాకు విశ్రాంతినిస్తోంది. ఇక అమ్మని చూశావుగా. వాళ్ళిద్దరూ కేవలం భార్యాభర్తలు కారు. ఒకరినొకరు మనసారా, తనువారా ఎదనిండుగా ప్రేమించుకున్న ప్రేమికులు. అమ్మా నాన్నని చూసి తట్టుకోలేకపోతుంటే, నాన్న నిస్సహాయంగా అమ్మ గురించి బాధపడుతున్నాడు.

ఈ సమయంలో అమ్మనీ నాన్ననీ వాళ్ళమానాన వాళ్ళని ఎలా వదలనూ? అలానే నీ వాళ్ళనీ నీ ఉద్యోగాన్నీ వదిలేసి శాశ్వతంగా నాకోసం ఢిల్లీ వచ్చెయ్యమని నిన్ను ఎలా అడగనూ? ఒకప్పుడు కులమూ భాషా ఏవీ మన ప్రేమకి అడ్డురాలేదు. ఇప్పుడూ రావు. కానీ, నేను నీ దగ్గరకో, నువ్వు నాదగ్గరకో శాశ్వతంగా వస్తేకానీ యీ సమస్య పరిష్కారం కాదు. అదెంతవరకూ సమంజసం. నీ తల్లినీ తీసుకురమ్మనవచ్చు. కానీ తెలీని ప్రాంతంలో, తెలీని భాష వాళ్ళతో యీ వయస్సులో ఆమె ఇమడగలదా? అంటే, మిగతా బిడ్డల్ని త్యజించి రమ్మనడం ఏమి న్యాయం.!?

నా అంతిమ నిర్ణయం ఏమిటీ అని గదూ? నిన్నే నిర్ణయం తీసుకోమంటే యీ జన్మకి నువ్వు నిర్ణయం తీసుకోలేవు. ఎందుకంటే నాకు తెలిసి నువ్వు బాధపడగాలవేగానీ బాధపెట్టలేవు. నిర్ణయం 'ఇదీ' అని నేను నోటితోటో, అక్షరీకరించో చెప్పలేను. అడక్కు. కానీ

ఒక్కటి మాత్రం నిజం. మనం ఇద్దరం గడిపిన క్షణాలన్నీ నీలోనూ నాలోనూ ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి. నా ప్రాణమా.. ఇంక సెలవు.. గుడ్‌బై..''

పన్నెండు పేజీల ఉత్తరంలోని సారాంశం ఇదీ. ఇంకా చాలా వుంది. చాలా స్పష్టంగా ఉంది. సూటిగా ఉంది. నాకు తెలుసు.. కంటికి కనపడని రక్తం ఎంత వొలికిపోయిందో. నాకు అర్థమైంది ఒకటే - నా ప్రేమ ఓ 'జ్ఞాపకం'గా మారబోతోందని. ఒక్కసారిగా నిస్సత్తువ నన్ను ఆవరించింది. కళ్ళనించి ధారగా అశ్రువులు. కానీ నిజంగా తెలుసు.. తన కళ్ళల్లో సముద్రాలే ఇంకిపోయి వుంటాయని.

ఆ తరువాత సంగతి ఏం చెప్పనూ? పిచ్చిపిచ్చిగా తిరిగానని చెప్పనా? ఎన్నిమైళ్ళు నడిచేవాణ్ణో.. నడిచి నడిచి అలిసిపోవాలని. మనసుని మూగబోయేలా చెయ్యాలని. ఎన్ని రాత్రులు నక్షత్రాలకి తోడుగా మేలుకుని వున్నానో. ఎన్ని వుత్తరాలు రాసి ఎన్ని కాయితాలో నా గుండెని పరిచానో. ఎన్నికోట్లసార్లు వూళ్ళో ఆమె గుండెల్లో దూరి నన్ను నేను మరిచిపోయే ప్రయత్నం చేశానో.

అవన్నీ ఇప్పుడు తలుచుకున్నా సజీవంగానే వున్నాయి. ఓ మనసా.. నువ్వెంత గొప్పదానివీ.. ప్రతి క్షణాన్నీ నీ ఒడిలో సజీవంగానే దాచుకుంటావుగా!

ఎన్నిసార్లు ఆ క్షణాల్ని తిరిగి తిరిగి తిరగేసినా, అదే గాఢతనీ అదే అనుభూతినీ ప్రసాదిస్తావుగా.!!

స్నేహం ప్రేమగా మారింది అప్పుడు.

ప్రేమని స్నేహంగా మలుచుకునే ప్రయత్నం చేశాను ఇప్పుడు. (అంటే అప్పుడన్నమాట)

ప్రేమ పెళ్ళిగా మారితే మాములు జీవితంగా పరిణమిస్తుంది. ప్రేమ ప్రేమగానే మిగిలితే జీవితాంతం అది పరిమళిస్తుంది. పరిమళిస్తూనే ఉంటుంది.

''చల్ అకేలా..చల్ అకేలా. చల్ అకేలా..

తేరా మేలా పీఛే ఝూటా రాహీ౹ చల్ అకేలా..''

ఒక పయనం ముగిసేది మరో పయనం మొదలవడానికే.

**ఆపగళ్ళు** రాత్రులుగా మారితే, రాత్రులు పగళ్ళయ్యాయి.

గుండెల్లో నిరంతరం వడగళ్ళ వానే.

'నవ్వు' నా పెదాల్ని వంచించి దూరంగా తొలిగిపోయింది.

''జీనా యహా.. మర్‌నా యహా..

ఇస్ కే శివా జానాకహా'' పాట ఎక్కడో మనసుపొరల్లో మెదుల్తూ నన్ను వూరడించే ప్రయత్నం చేస్తోంది.

అవును. పుట్టడం. బ్రతకడం.. చావడం.. అంతా ఇక్కడే

''ఏ మేరే గీత్.. జీవన్ సంగీత్. కల్ భీ కొయీ

దొహరాయెగా.. జగ్ కో హసానే బహు రూపియా

రూప్ బదల్ కఫిర్ ఆయేగా.. స్వర్గ్ యహీ.. నరక్ యహా..

ఇస్‌కే శివా.. జానా కహా'' గొంతులో విషాద సముద్రాల్ని ప్రవహింపజేస్తూ (?) ముఖేష్ ఆలపిస్తున్నాడు.

(ఇది నా గీతం.. జీవితమనే సంగీతం.. ఎవరో మరొకరు మళ్ళీ యీ గీతాన్నే పాడతారు. లోకాన్ని ఆహ్లాదపరచడమేగా జీవితమనే నాటకంలో నటిస్తున్న నటుల యొక్క పనీ, మళ్ళీ వస్తారు.. మరో రూపుతో.. మళ్ళీ మిమ్మల్ని ఆహ్లాదపరచడానికి. బతుకూ ఇక్కడే, చావూ ఇక్కడే. స్వర్గమూ ఇక్కడే నరకమూ ఇక్కడే. వెళ్ళడానికి మరో చోటేదీ?)

**ఓ మనసా.. నమ్రత కేవలం జ్ఞాపకాల్నే నాకు బహూకరించి తను మెల్లగా నడిచి వెళ్ళిపోయింది.**

**ఒక నీడ మరో నీడతో కలిసినట్టు నా జ్ఞాపకాలు ఆమె జ్ఞాపకాలలో కలిసిపోయాయి.**

ఒక్క చుక్క కూడా కళ్ళలోంచి బుగ్గమీదకి జారదేం? కళ్ళు 'చెమర్చడం' మరిచిపోయాయా? మనసు పాషాణమై కన్నీరుగా రూపాంతరం చెందనన్నదా! (ఎన్ని పిచ్చి ఆలోచనలూ?)

ఎన్ని వుత్తరాలు రోజుకి రాస్తున్నానో నాకే తెలీదు.

అయితే ఏ వుత్తరాన్నీ 'పోస్ట్' చేసే ధైర్యంలేదు.

నా "మాటా" నా "చేతా" - తనకి ధైర్యాన్నివ్వాలిగానీ, తన మనసుని ముక్కలు చెయ్యకూడదు. నాది కేవలం దుఃఖం. మరి తనకి? ఒక పక్క తండ్రి, మరో పక్క నిస్సహాయురాలైన తల్లి. మరోపక్క చెయ్యక తప్పని ఉద్యోగం. వాటెవర్... నా తరఫునించి మాత్రం ఏ మాత్రం తనకి బాధ కలగకూడదు.

"'గుడ్‌బై' అనే పదం పెళ్ళి దృష్టిలో వాడి వుండొచ్చు.. స్నేహానికి కాదుగా?" ఆశగా నా మనసు నిమషానికోసారి నన్ను నిలదీసేది.

"ఆ మాట వ్రాయడానికి ఎన్ని ముక్కలయిందో తను." అని నా మనసుకి నేనే నచ్చచెప్పుకునేవాడ్ని.

ప్రశ్న అడిగేదీ మనసే.. జవాబు చెప్పుకునేదీ మనసే. ఓ మనసా.. నువ్వెంత జాణవే!

మరోసారి విన్నవించుకుంటాను. మనిషికి భగవంతుడు ప్రసాదించిన వరాలు నాలుగు. 1.ఆశ. అది లేకపోతే ఎవరూ రేపటికోసం బ్రతకరు. 2.మరపు. ఎంత ఘోరమైన దుఃఖాన్ని అయినా మనసు 'మరుపు' అరలో దాచేస్తుంది. ఇవాళున్న దుఃఖం తాలుకు గాఢత రేపు ఉండదు. కాలంతోటి కష్టాలనే గాయాలూ మాసిపోతాయి. 3.నిద్ర: న్యాయంగా వరసలో చెబితే ఇది రెండోది. ఒకసారి ఒక డెడ్ బాడీ దగ్గర (స్నేహితుడి తండ్రి) ఉన్నాం. ఆయన నాకూ ఎంతో పరిచయం వున్నవారు. పన్నెండూ పన్నెండున్నర అయ్యాక తెలీకుండానే అందరు నిద్రలోకి జారుకున్నాం. లేచాక చూస్తే ఎదురుగా శవం. తల దగ్గర దీపం ఆరిపోయే స్టేజ్‌లో ఉంది. ఇది చాలా నికృష్టమైన పనే. కానీ నిద్రాదేవి అంత దయగల దేవత సృష్టిలో ఇంకెవరూ? దుఃఖితుల్నీ, పరాజయం పొందిన వారినీ, కోటీశ్వరుడ్నీ, కూలీనీ కూడా సమంగా తన వొళ్ళోకి తీసుకుని సేదదీర్చి లాలించే కల్పవల్లి నిద్రాదేవి.

ఎన్ని వేల కోట్లు ఇచ్చినా కళ్ళు తెరుచుకుని ఎవరుండగలరూ? అందుకే 'నిద్ర' అనేది భగవంతుడు వరం.

4వ వరం మృత్యువు. అన్ని సుఖాలకీ, అన్ని కష్టాలకీ అసలీ లోకానికే వీడ్కోలు చెప్పి, మరో "కొత్త చొక్కా" లాంటి శరీరాన్ని తొడుక్కోవాలంటే, కావాల్సింది మృత్యుదేవత కరుణే.

ఏదేదో చెబుతూ ఎక్కడెక్కడికో లాక్కుపోతున్నాననా? కాదు. మనసు ముక్కలయ్యాక నిజంగా ఏమి ఆలోచించానో నాకే తెలీలేదు. నేను నేను కాను.

హిందిలో ఓ పాట వుంది. "ఏ దర్ద్ ఐసా హై సెహనా హై ముష్కిల్. దునియావాలోంసే కె హనా హై ముష్కిల్" అని.

(ఈ బాధ ఎంతటిదీ అంటే, దీన్ని భరించడం అతికష్టం. దుర్భరం. పోనీ ఎవరికన్నా చెప్పుకుని మనసుని తేలిక పరుచుకుందామనుకున్నా కష్టమే.) ఎందుకంటే, ప్రేమలోని బాధ తెలిసేది ప్రేమించిన వాడికి మాత్రమే.

ఒకరోజున భువనేశ్వరమ్మగారన్నారు. "నువ్వెందుకు కృంగిపోతున్నావని నేను అడగను. కానీ, యీ బాధ అనే నిద్రలోంచి లేచినప్పుడు (మేలుకొన్నప్పుడు) మాత్రం ఇదంతా ఓ నాటకంలా అనిపిస్తుది" అని. నేను ఆ మాట విన్నప్పుడు సైలెంటై పోయా. నిజం చెబితే కోపం కూడా వచ్చింది. ఒకరి బాధ మరొకరికి 'నాటకం'లా ఎలా అనిపిస్తుందా అని. స్నేహితుడా, ఇప్పుడు నిజంగా తరిచి చూసుకుంటే ఆ మాట ముమ్మాటికీ నిజం. 'నరుని బతుకే నటన' అలాంటప్పుడు ప్రతిక్షణమూ గడిచేది జీవితమనే స్టేజి మీదేగా.

చాలా 'వివరణ' ఇవ్వాలని వుంది. కానీ వొద్దు. ఎందుకంటే, 'ఆ' క్షణాలు మంచివో పిచ్చివో, ఏమైనా అవి నావి. ఆ నవ్వులూ నావే.. ఆ కన్నీళ్ళూ నావే.

పోస్టింగ్ వచ్చింది. రాజస్తాన్ ఎడారిలోకి. నవ్వొచ్చింది. నా మనసే ఓ ఎడారిలా మారినప్పుడు ఈ ఎడారి నన్నేం చేయగలదూ? ఎందుకో చాలా ఆనందంగా కూడా అనిపించింది. అందరికీ దూరంగా.. అన్నిటికీ దూరంగా వెళ్ళే అవకాశం లభించినందుకు. చెన్నైలో అందరికీ వీడ్కోలు చెప్పాను. అది ఎలాగో మరోసారి చెప్పుకుందాం.

'పురానా దిల్లీ' రైల్వే స్టేషన్‌లో ట్రైన్ ఆగింది. చలికాలం కావడంలో అంతా పొగమంచే. అక్కడే నేను ట్రైన్ మారాలి. నా సూట్‌కేస్‌తో కిందకి దిగాను. నిశ్వాసాలు ఆవిరిగా బయటికొస్తున్నాయి. చలి చాలా ఎక్కువగా ఉంది. నేను వెళ్ళే ట్రైన్ రావడానికి మరో ఆరుగంటలు పడుతుంది. సూట్‌కేస్ క్లోక్ రూమ్‌లో పడేసి బయటికి వచ్చాను.

నడుస్తూ నడుస్తూ 'పరంతావాలా గల్లీ' చేరాను. కళ్ళనిండా నీళ్ళు. చాందినీ చౌక్. ఇకా ముందుకు నడిచా. ఎర్రకోట కనిపిస్తోంది. జుమ్మా మసీద్ దగ్గర ఆగాను.

అక్కడే పుస్తకాలు పరిచివున్నాయి.

అక్కడే కదూ. "Can You Lift Me" అని నమ్రత అన్నదీ! అక్కడే నిలబడ్డాను. అదిగో.. ఆ పక్కనే వుంది.. మేమిద్దరం టీ తాగిన చిన్ని హోటల్. వెళ్ళి అదే కుర్చీలో కూర్చున్నాను. అప్పుడు తను నా ఎదురుగా వుంది. ఇప్పుడా కుర్చీ ఖాళీ.

'టీ' తెచ్చి పెట్టాడు కుర్రాడు. తాగుతూ తాగుతూ చాలాసేపు అక్కడే వున్నా. ఎన్ని టీలు తాగినా 'చలిపులి' గర్జిస్తూనే వుంది.

ఓ 'ఫటప్‌టీ'వాడు అరిచాడు. 'రేస్‌కోర్స్.. రేస్‌కోర్స్' అని. అక్కడి కెడితే అక్కడినించి ఎలాగొలా విజయ్ చౌక్ (రిపబ్లిక్ పెరేడ్ జరిగేచోటు.. ఇండియాగేట్) చేరుకోవొచ్చు. మేమిద్దరం కలిసే చెట్టునీడకి చేరొచ్చు. 'బురుజు' కాఫీ (ESPRESSO) తాగొచ్చు. జీవితాన్ని రీవైండ్ చేసుకుని మళ్ళీ జీవించవచ్చు.

"ఇక్కడ్నించి డైరెక్టుగా గుర్గావ్; పోతే నమ్రతని డైరెక్టుగానే కలవొచ్చుగా?" నా మనసు సూటిగా అడిగింది. మధ్యాహ్నం ట్రైను కాకపోతే, రాత్రి ట్రైన్లో నేను 'S' నగరం చేరవొచ్చు. అదీ గాక మరో రెండ్రోజుల జాయినింగ్ టైం కూడా ఉంది.

ఉత్సాహం కాని ఉత్సాహంతో లేచాను. 'ఫటప్‌టీ'దగ్గరికి వెళ్ళేలోగానే అది జనాన్ని ఎక్కించుకుని వెళ్ళిపోయింది. (ఢిల్లీలో 'ఫటప్‌టీ'లని ఎక్కువగా సర్దార్జీలు నడిపేవాళ్ళు, కనీసం పదిమంది ఎక్కొచ్చు. అవి ఇప్పటి 'షేర్ ఆటో'ల్లాంటివి). నిట్టూరుస్తూ మళ్ళీ హోటల్ కొచ్చి, అదివరకు కూర్చున్న కుర్చీలోనే కూర్చున్నాను.

'చట్‌పటీ'లో ఎక్కాల్సిన పనిలేదు. బస్ ఎక్కితే దానికంటే వేగంగానూ చవగ్గానూ నన్ను ఇండియాగేట్ తీసుకెళ్ళగలదు. కానీ ఉపయోగం? తవ్విన జ్ఞాపకాల్నే మళ్ళీ మళ్ళీ తవ్వుకుంటూ కూర్చున్నాను. అక్కడికి వెళ్ళినా చేసే పని అదేగదా! రెండు చేతుల మధ్యా తలని ఇరికించుకుని కళ్ళుమూసుకున్నాను. నమ్రత అణువణువూ నా కళ్ళల్లో కదుల్తోంది. ఆమె పలికిన ప్రతిపదమూ నా చెవుల్లో వినిపిస్తూనే ఉంది. మనసు ఎగసి ఎగసి పడుతోంది.

లేదు.... యీ జ్ఞాపకాలనించి పారిపోవాలి! తల విదిలిచుకుని నాలో నేనే అనుకున్నాను.

"రాజ్!" నమ్రత గొంతు వినిపించిది.

ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

ఎదురుగుండా తనే. నమ్రతే.. చిన్న చిరునవ్వుతో.

గభాల్న లేచి కౌగిలించుకున్నాను. నా కళ్ళల్లోంచి బొటబొటా నీళ్ళు కారుతున్నాయి. ఎంత ఆర్తితో హత్తుకుపోయానంటే, దేవుడా, ఆ ఒక్క క్షణం చాలు.. వెయ్యేళ్ళు బ్రతకడానికీ, వెయ్యిసార్లు చనిపోవడానికీ.

గుండెలనిండా ఆమె వొంటినించి వచ్చే పరిమళాన్ని పీల్చుకుంటున్నాను. అవును.. నిజంగా నమ్రతే.. నా కౌగిట్లో.

ఆమె పెదాలు నా మెడని తాకాయి.. లాలనగా. "వచ్చావు కదూ.. నిజంగా వొచ్చావు కదూ.!" ఇంకా గట్టిగా హత్తుకుని అన్నాను.

"ఊ" ఉత్తరం రాశావుగా.. 'S'కి ట్రాన్స్‌ఫర్ అయిందనీ ఫలానా రోజున ట్రైన్ మారాలనీ! ఇందాకట్నించీ నిన్ను చూస్తూనే వున్నా రాజ్! కంటితో చూసి వెళ్ళిపోదామనుకున్నా.. కానీ -" ఆమె కన్నీళ్ళు నా చొక్కాని తడుపుతున్నై.

ఆ కలయిక కేవలం కొంతసేపటివరకే పరిమితం అని నా గుండెకి తెలుస్తూనే ఉంది. ఆమె 'ఇచ్చిన' కౌగిలిలోని వెచ్చదనం ఇంకా నా దుస్తుల్ని మనసునీ వొదిలిపోలేదు.

నేస్తమా.. తరవాత ఏం జరిగిందో అడగవద్దు. ప్రేమ స్నేహంగా మారి, కాలంతోబాటు పయనించిందనడానికి ఆ 'పురానా దిల్లీ' రైల్వేస్టేషనే సాక్షి.

ఇప్పటికీ, ఏ ట్రైన్ ఎక్కినా నాకు గుర్తొచ్చేది ఆనాటి 'క్షణమే'. కన్నీళ్ళతో ప్లాట్‌ఫాం మీద నిలబడి 'వీడ్కోలు' పలుకుతూ తను.... వేగం అందుకుంటున్న ట్రైన్ కంపార్టుమెంట్ ఎంట్రన్స్‌లో నిలబడి కళ్ళుకూడా తుడుచుకోకుండా చేయి వూపుతున్న నేను...

"జీవితం ఓ ప్రయాణం..తోడుగా సాగనీ..

గుండెలో ప్రేమగీతం... నిండుగా మ్రోగనీ!"

## ఉపసంహారం.

*ప్రియమైన పాఠకులకి నమస్కారం.*

*మొదట మీ అందరికీ నా కృతజ్ఞతలు. రాబోయే కొత్తసంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ, మీ అందరికీ మరోసారి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

*'మనసుపొరల్లో' అక్షరబద్ధం కావడానికి కర్త, కర్మ, క్రియ శ్రీ కిరణ్‌ప్రభగారు. ఇది మూడు సంవత్సరాల పాటు, అంటే 36 నెలలపాటు నడవడానికి కారణం వారూ, చదివిన మీరూ!*

పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా ఎందరో సోదరీమణులు నాకు ఎంతో ఉత్సాహాన్నీ స్ఫూర్తినీ తమ స్పందనలద్వారా ఇచ్చారు. ఇక రమణిగారు (బలభద్రపాత్రుని రమణి..బాలాజీ), రేణుక చలిమిడగారూ, లలితమ్మ, మంథా భానుమతిగారు, మన్నెం శారదగారూ, మా సాహితీ ప్రచురణలు (ఎమెస్కో) లక్ష్మిగారు, నా పాటలమీద రిసెర్చ్ చేస్తున్న గుమ్మడి రామలక్ష్మిగారూ, మొదటినించీ అద్భుతమైన స్ఫూర్తినిచ్చిన రమణ సహజగారూ, అందరికీ మనఃపూర్వక కృతజ్ఞతలు. ఇంకా ఎంతోమంది శ్రేయోభిలాషులూ మిత్రులూ, అందరూ నాకు పరోక్షంగా, ప్రత్యక్షంగా తమ విలువైన అభిప్రాయాలను అందించి నన్ను ప్రోత్సహించినందుకు ధన్యవాదాలు. వనజ తాతినేనిగారు ఓ చక్కని రివ్యూనే వ్రాశారు.

ఆ కోణం నించి నేలమీదకు కురిసిన వాన చినుకులు, ఆవిరై మళ్ళీ మబ్బురూపంలో ఆకాశాన్ని చేరుతాయి. కానీ, కళ్ళలోంచి బుగ్గమీదకు జారిన కన్నీరు తిరిగి కళ్ళను చేరలేదు. కాలమూ అంతే, యవ్వనమూ అంతే. అప్పటి గాఢతవేరు.. అప్పటి వేగం వేరు.

ఇప్పుడు మిగిలినవి, మిగిలేవీ వాటి నీడలే! ఈ 'మనసుపొరల్లో' అనే రచన అసంపూర్ణమైనదే! సంపూర్ణం కావాలంటే ఇందులోని ప్రతిపాత్రనీ మళ్ళీ మళ్ళీ కలిసి, వారి అనుభవాలనీ జీవితాలనీ నాలో ఆవహింప జేసుకున్నప్పుడే అసంపూర్ణం - సంపూర్ణమవుతుంది.

కనీసం ముఖ్యపాత్రలనైనా ఒక ఒడ్డుకు చేర్చాలి. కానీ, అది సాధ్యం కాదు. ఎందుకంటే ఇది రచయిత ఇష్టం ప్రకారం సాగే 'నవల' కాదు.. కథాకాదు.

బహుశా అసంపూర్ణంగా మిగిలిపోవడమే దీనిలోని సౌందర్యం కావొచ్చు.

మరోసారి 'మరో మనసుపొర' విచ్చుకుంటేగానీ, జీవితం అక్షరబద్ధంకాదు.

అందుకే, మరో పయనంలో గమ్యాన్ని చేరుతామనే ఆశతో మీనించి ప్రస్తుతానికి సెలవు తీసుకుంటున్నా. దయచేసి మీ అభిప్రాయాల్ని తెలియజేస్తారు గదూ... అవే, నా 'దిశ' నీ 'దశ' నీ నిర్ణయిస్తాయని నిర్ద్వందంగా తెలియజేసుకుంటున్నా.

వచ్చేనెల మళ్ళీ మీ ముందుకొస్తా, మా 'మూడోసీత' కథతో.

ఒక అల్లరిపిల్ల 62 సంవత్సరాలపాటు సాగించిన, సాగిస్తున్న జీవన చిత్రమే కథ. (కథకాని కథ).

అప్పటి జీవితాల్నీ, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల్నీ యధాతథంగా మీ ముందుంచే ప్రయత్నమే యీ రచన. ఆదరిస్తారు కదూ..

నమస్సులతో

మీ,

భువనచంద్ర